# INDIAN ARCH. WITH REFERENCE TO ANDHRA (DAHIS34)

# (BA - HISTORY)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1.1.

# పురావస్తు శాస్త్రం - నిర్వచనం - విషయ పరిధి

## 1.1.0 లక్ష్యం :

పురావస్తు శాస్త్ర నిర్వచనం, స్వభావం పరిధి గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయ సూచిక :


1.1.1 పరిచయము

1.1.2 పురావస్తు శాస్త్రము - నిర్వచనము

1.1.3 పురావస్తు శాస్త్రము - పరిధి

1.1.3.1. ప్రాక్ చారిత్రక పురావస్తు శాస్త్రము

1.1.3.2. చారిత్రక పురావస్తు శాస్త్రము

1.1.3.2.1. శాసనములు

1.1.3.2.2. నాణెములు

1.1.3.2.3. కట్టడాలు

1.1.4. పురావస్తు - లక్ష్యము

1.1.5. పురావస్తు శాస్త్రము - స్వభావము

1.1.6. సారాంశము


## 1.1.1 పరిచయము :

జీవ పరిణామ క్రమంలో జరిగిన సుదీర్ఘ ప్రయాణంలో జంతు ప్రపంచంలో చిట్ట చివరి దశ మానవుడు. సకల సామాజిక క్రమాలకు మానవుడే ఆది కేంద్రము. మానవులకి సృజనాత్మక సామర్థ్యం వున్నది. దానితో వాళ్ళు తమని ఆవరించి వున్న పరిస్థితుల్ని నిరంతరం ప్రతిఫలింప చేస్తుంటారు. మెరుగు పరుస్తుంటారు. ఉదా : ఒక పక్షి ప్రాచీన కాలంలో గూడును ఎలా నిర్మించుకున్నదో ఈనాటికి అలాగే గూడును కట్టుకుంటున్నది. దాని ఆకారంలో, నిర్మాణంలో ఏ విధమైన మార్పు లేదు. కాని ప్రాచీన మానవుడు చెట్టు తొర్రల్లో, కొండగుహలలో నివసిస్తే నేటి మానవుడు బహుళ అంతస్థుల భవంతుల్లో నివసిస్తున్నాడు. మానవుల సృజనాత్మకత, సామర్థ్యం, ప్రేరణ వల్ల ఇది సాధ్యమైనది.

మానవుడు జీవించటానికి అవసరమైన పనిముట్లను స్వయంగా రూపొందించుకోవాలి. అదే జంతువుల్లో అయితే తమని తాము రక్షించుకోవటానికి దాని శరీరంలోని కొన్ని అవయవాలు అమర్చబడివున్నాయి. ఉదా : సింహానికి పంజాలు, ఎద్దులకు కొమ్ములు, తాబేలుకు చిప్ప మొదలగునవి. మానవుడు పనిముట్లను ఉపయోగించటమే కాకుండా, వాటిని తయారు చేయటం నేర్చుకోవాలి. కోడి పిల్లకు ఈకలు, రెక్కలు, గోళ్ళు, ముక్కు దాని ప్రమేయం లేకుండానే వచ్చేస్తాయి. వాటిని ఉపయోగించటం మాత్రమే అది నేర్చుకోవాలి. కాని మానవ సంతతికి చెందిన శిశువు అలాంటి సరంజామాతో పుట్టడు తనకు కావలసిన పనిముట్లను ఎంతో కష్టపడి సంపాదించుకోవాలి. మానవుడు వాతావరణాన్ని బట్టి కూడా తన పద్ధతులను మార్చుకొని జీవించగలడు. ఉదా : కుందేలు మంచుకొండల్లో శీతాకాలాన్ని

హాయిగా గడుపుతుంది. అదే కుందేలు వెచ్చని లోయల్లో తిరగడం అసాధ్యం. అదే మానవుడైతే చలి ఎక్కువగా వున్నప్పుడు జంతు చర్మాన్ని కప్పుకొని, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పలుచని వస్త్రాన్ని కప్పుకొని జీవించగలడు.

## 1.1.2 పురావస్తు శాస్త్రము - నిర్వచనము :

పురావస్తు శాస్త్రాన్ని ఆంగ్లంలో ఆర్కియాలజీ అని వ్యవహరిస్తారు. 'ఆర్కియాలజీ' అనే పదం ఆర్కియాస్, లాగోస్ అనే గ్రీకు పదాల నుండి పుట్టినది. ఆర్కియాస్ అనగా 'ప్రాచీన' లేక 'పురాతన అని, లాగోస్ అనగా 'జ్ఞానము' అని అర్థము. అనగా ఆ పదానికి 'గతానికి చెందిన శాస్త్రము' అని అర్థము. ఈ రకమైన శాస్త్రము అభివృద్ధి చెందిన దగ్గరి నుండి నేటి దాకా పొందిన అనేక పరిణామాల దృష్ట్యా కాలానుగుణ్యంగా అనేకులు రకరకాల నిర్వచనాలను సూచించారు.

గ్లిన్ ఐసాక్ ప్రకారం - "వేర్వేరు మానవుల మధ్య ; మానవులకు, ప్రకృతికి మధ్య సంబంధాల అభివృద్ధిని వివరించే స్థితిలో పురావస్తు శాస్త్ర పరిశీలనలు ఎంతో పరిగణనీయమైనవి."

"పురావస్తు శాస్త్రజ్ఞులు త్రవ్వి తీస్తున్నది వస్తువులను కాదు మానవులను" అని ప్రఖ్యాత పురావస్తు శాస్త్రజ్ఞుడు సర్. మార్టిమర్ వీలర్ (Sir Martinar Wheeler) చక్కగా చెప్పారు.

గ్రాహం క్లార్క్ వ్యాఖ్యానిస్తూ "గతించిన సమాజాలకూ, మిగిలిన, మిగిలి ఉన్న గుర్తుల ఆధారంగా గతించిన కాలాన్ని పునర్నిర్మించే ప్రయత్నం గానూ, పద్ధతిగానూ ఉండే పురావస్తు శాస్త్రం ప్రత్యేక పాఠ్యాంశంగా పరిగణించవలసిన అవసరం లేదు" అంటారు.

వాల్టర్ టేలర్ - "పురావస్తు శాస్త్రజ్ఞుడు ఒక సాంకేతిక వేత్త మినహా ఏమీ కాదు" అంటారు.

"ప్రాచీన మానవుడు వదిలిపెట్టిన వస్తు సముదాయాన్ని సమూలంగా పరిశీలించి వ్యాఖ్యానం చేసే శాస్త్రాన్ని పురావస్తు శాస్త్రం అంటారు" - పి. కృష్ణమూర్తి

డోరతీగారడ్ - "మానవుని పరికరాలన్నీ అతడు జీవించే ప్రపంచానికి అతని ప్రతిస్పందనలే, అంతేకాదు ఆ ప్రపంచంపై విజయానికి వాడిన ఆయుధాలు. ఆ విజయాన్ని వ్యాఖ్యానించటానికి ఆధారమే పురావస్తు శాస్త్రము" అని అన్నారు.

గతంలో మానవుడి ఛాయలను, గతకాలపు స్మృతులను బట్టి బయటకు తెచ్చి వాటిలో వున్న సామరస్యం, ఐక్యతను వాఖ్యాన సహితంగా చెప్పే శాస్త్రం పురావస్తు శాస్త్రము" - కాశీభట్ల సత్యమూర్తి.

## 1.1.3 పురావస్తు శాస్త్రము - పరిధి :

పురావస్తుశాస్త్ర పరిధిని స్వభావాత్మకంగా పరిశీలించినట్లయితే ప్రాక్ చారిత్రక పురావుస్తు శాస్త్రము, చారిత్రక పురావస్తు శాస్త్రము అనే రెండు శాఖలను గమనించవచ్చు.

**1.1.3.1. ప్రాక్ చారిత్రక పురావస్తు శాస్త్రము :** ప్రాక్ చారిత్రక పురావస్తు శాస్త్రము ప్రధానంగా శిలాయుగానికి మాత్రమే చెందినది. దానిలో ప్రాచీన శిలాయుగం, సూక్ష్మ శిలాయుగం (లేదా) మధ్య శిలాయుగం, నవీన శిలాయుగం అనే మూడు దశలున్నాయి. ప్రాచీన శిలాయుగంలో ప్రథమ, మధ్యమ, అంతిమ అనే మూడు ఉప దశలున్నాయి. నవీన శిలాయుగంలో తొలి వ్యవసాయం, పశుపోషణ వంటి స్వయం పోషక విధానాలను మానవుడు పెంపుదల చేసుకొన్నాడు. ఈ విధానాన్నే వి.జి. చైల్డ్ "మానవుడు తనను తాను చేసుకొనుట" (Man Makes himself) అని వ్యాఖ్యానించాడు. శిలా యుగం తరువాత అభివృద్ధి చెందిన లోహ యుగం ఒక విధంగా ప్రాక్ చారిత్రక, చారిత్రక దశలకు సంధి యుగంగా పెంపొందింది. ఈ కాలాన్నే ఎక్కువ మంది పురావస్తు శాస్త్రజ్ఞులు "చరిత్ర సంధియుగం" అని కూడా అంటారు.

**1.1.3.2. చారిత్రక పురావస్తు శాస్త్రము :** చారిత్రక పురావస్తు శాస్త్రంలో ఆధారాల స్వరూప స్వభావాలన్నీ ఎంతో విప్లవాత్మకమైన పరిణామాన్ని పొందాయి. భాష, లిపి అభివృద్ధి, వర్తకం, వ్యవసాయం నాగరీకరణ, రాజ్య వ్యవస్థ, సామాజిక మత వ్యవస్థలు అనే వివిధ

అంశాలన్నీ ఆధారాల మీద ప్రభావాన్ని చూపాయి. శాసనాలు, నాణేలు, కట్టడాలు మొదలైనవి చారిత్రక పురావస్తు శాస్త్రములో ఎంతో విలువైన ఆధారాలు.

**1.1.3.2.1. శాసనాలు :** ప్రభువులు తాము సాధించిన ఘన కార్యాలు ప్రజలకు తెలియచేసేందుకు గాను శాసనాలను జారీ చేసేవారు. సాధారణంగా ఈ రాజ శాసనాలను శాశ్వతంగా ఉండటానికి రాళ్ళ మీద చెక్కించడం జరిగేది. శాసనాలను రాళ్ళ మీదే కాకుండా లోహాల మీద ఇటుక దంతము మొదలైన వాటి మీద కూడా చెక్కబడినాయి. భారతదేశ ప్రాచీన చరిత్రకు చారిత్రక రచనలు ఎక్కువగా లభ్యం కాక పోవడం వల్ల శాసనాలే ఆధారాలైనాయి. మన దేశంలో దేవాలయాలలో వున్న వేలకొద్దీ శిలాశాసనాలు ప్రాంతీయ చరిత్ర రచనకు ప్రధానాధారాలైనాయి. ఈ శాసనాలలో ధర్మ శాసనాలు, విజయశాసనాలు (ఉదా : సముద్రగుప్తుని, అలహాబాదు స్తంభ శాసనము, శ్రీ కృష్ణ దేవరాయ శాసనాలు) సంస్మరణాత్మక శాసనాలు (ఉదా : శాతవాహన రాణి నాగనిక నానాఘాట్ శాసనము, గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనము) ద్వారా చరిత్ర నిర్మించవచ్చు.

**1.1.3.2.2. నాణాలు :** గత చరిత్రను ముందు కాలానికి తెలియచెప్పె దూతలుగా నాణాలు పనికి వస్తాయి. మన దేశంలో వివిధ ప్రదేశాలలో త్రవ్వకాలలో వేల కొలది నాణాలు రాశులు రాశులుగా లభ్యమయ్యాయి. ఈ నాణాల వాడుకలో వైవిధ్యం కనిపించకపోయినా, వాటిని విడుదల చేసే లక్ష్యంలో వైవిధ్యం కనిపిస్తుంది. ఈ నాణాలు రకరకాలైన గుర్తులను చూపిస్తాయి. ఉదాహరణకు శాతవాహనుల నాణాలలో కనిపించే ఉజ్జయిని చిహ్నం వారి సార్వభౌమత్వ వ్యాప్తికి, అధికార ప్రాబల్యానికి గుర్తుగా పండితులు అభిప్రాయపడుతున్నారు. అలాగే సముద్రగుప్తుడి వీణ ధరించిన నాణాలు సముద్రగుప్తుని రూప సౌష్ఠవాలు గురించి ఒక ఊహ ఇవ్వడమే కాక అతడు వైణికుడని కూడా తెలియచేస్తున్నాయి.

**1.1.3.2.3. కట్టడాలు :** చారిత్రక యుగంలో ముఖ్యంగా మనం పరిశీలించేవి ఆనాటి కట్టడాలు. వీటిని మూడు విధాలుగా విభజించవచ్చు. అవి మత సంబంధమైనవి, రక్షణసంబంధమైనవి, పౌర జీవనానికి సంబంధించినవి. ఇదే వాటికి సంబంధించిన ప్రయోజనాత్మక వర్గీకరణం. బౌద్ధమతానికి చెందిన స్థూపాలు, చైత్య గృహాలు, విహారాలు, జైన మతానికి చెందిన బసతులు, హిందూ మతానికి చెందిన నగర, వేసర, ద్రావిడ శైలులకు చెందిన దేవాలయాలు, రంగ మండపం, నట మండపం వంటివన్నీ మత వ్యవస్థలోనే వివిధ ప్రయోజనాలకు ఉద్దిష్టమైన వేర్వేరు కట్టడాలుగా కనిపిస్తాయి. కోటలు రక్షణ సంబంధమైనవి. ఇళ్ళు గోదాములు మొదలైనవి పౌర జీవనానికి సంబంధించినవి. చారిత్రక యుగంలో ప్రాచీన, మధ్య యుగాలలోనే ఈ కట్టడాలు ప్రాశస్త్యం ఎక్కువ. ఆధునిక యుగంలో చరిత్ర రచనకు గల ఆధారాల స్వరూపం మారడంతో ఈ కట్టడాల ప్రాముఖ్యత పరిగణింపదగ్గదిగా లేదు.

## 1.1.4. లక్ష్యం :

వాట్సన్ పండితుడు పురావస్తు శాస్త్ర లక్ష్యమును సంక్షిప్తపరచి ఈ క్రింది విధంగా వివరించారు.

1. వస్తు సేకరణ చేసే వారికి, వస్తు ప్రదర్శనశాలలకు తగిన వస్తువులను సరఫరా చేయడం
2. కళా వాస్తు చరిత్రల విశ్లేషణలో ఆధారాలను ఏర్పరచడం
3. రాత ప్రతులు దొరకని సందర్భాలలో వివిధ సంఘటనల శ్రేణులను, కాలమానాలను అందచేయడం
4. సమగ్రమైన చారిత్రక విశ్లేషణలకు అనువైన వైవిధ్యాత్మకమైన ఆదర్శాత్మకమైన ఆధారాలను అందచేయడం.
5. సాంస్కృతిక పరిణామంలోని వివిధ అనుమానాల నివృత్తికోసం విడిగా ఆధారాలను అందచేయడం, చరిత్రను అవగాహన చేసుకోవడానికి కావలసిన సాధారణ లక్ష్యాలను సూత్రాలను అందించడం.

పై అంశాలే కాక పురావస్తు శాస్త్ర లక్ష్యంగా మానవుని ఉనికిలోని భౌతిక, సాంస్కృతిక సాజాత్యతలను, వైవిధ్యాలను గమనించి, వివరించి విశ్లేషించడం అనే చెప్పవచ్చు.

## 1.1.5. స్వభావము :

వేరు వేరు స్థావరాలను త్రవ్వి, వానిలోని సాంస్కృతికాధారాలను వ్యాఖ్యానించడం పురావస్తు శాస్త్ర ప్రధాన పరిశోధనా స్వభావం. ఇది మాత్రమే కాక ప్రాంతీయ పరిశోధనలు మరొక ముఖ్యమైన అంశం. వేరు వేరు స్థావరాలను గుర్తించి, వాటిని వివరించడం ప్రాంతీయ పరిశోధనలలో లక్ష్యాలు. సాంస్కృతిక చరిత్రగా తీర్చిదిద్దడం మరొక స్వభావము. మన నిత్య జీవితంలో పసివాని మనస్సు ఏ రకమైన ప్రభావం లేకుండా వుంటుందో, తొలి మానవుని మనస్సు కూడా అదే రకంగా వుండి వుంటుంది. భౌతిక పరిణామంలో మానవుడు మానవుడిగా మారి తన చుట్టూ గల లోతైన మూగ ప్రకృతిని సంగమించేటప్పుడే అతడు అనేకమైన అనుభవాలు చవి చూశాడు. ఈ అనుభవ పరంపర అతణ్ణి విడనాడలేదు. ఆ అనుభవమే ఆధారంగా మానవుడు తరువాత కాలాన్ని ఒక ప్రగతిగా తీర్చిదిద్దుకోగలిగాడు. పురావస్తు శాస్త్రం దృష్ట్యా మానవుని చేష్టలు, వానికి కారణభూతమైన పరిస్థితులు కాలగతిలో మానవ శాస్త్రంలోని సంఘటనలుగా మిగిలిపోగా, కేవలం మానవునిచే ఉపయోగింపబడి, కోరికలను సాధించుకోవడానికి వీలు కలిగించిన వస్తువులే గతం నుండి వారసత్వం. మానవుని చేష్టలకు వలెనే వాని ఉపకరణాలు కూడా అనుభవ పరంపరను, దానిలో ఉండే ఐక్యతనం సూచిస్తాయి. ఆ విధంగా వస్తువుల చేత చూపబడిన స్వభావం లోని విశేషాన్నే 'సంస్కృతి' అంటారు. పురావస్తు శాస్త్రంలో పరిశోధనకు 'సంస్కృతి' కేంద్రప్రాయమై దాని స్వభావాన్ని నిర్ణయిస్తుంది.

## 1.1.6. సారాంశము :

పురావస్తు శాస్త్రము యొక్క పరిచయము, నిర్వచనము మరియు పరిధిలోని అంశాలు అయిన ప్రాక్ చారిత్రక పురావస్తు శాస్త్రము, చారిత్రక పురావస్తు శాస్త్రములోని శాసనాలు, నాణ్యాలు, కట్టడాల వివరణ పురావస్తు లక్ష్యం స్వభావ స్వరూప విశ్లేషణ.

పాఠం - 1.2 & 1.3.

# పురావస్తు శాస్త్రమునకు ఇతర శాస్త్రములతో గల సంబంధం
# పురావస్తు శాస్త్రం వల్ల ప్రయోజనాలు

## 1.2.0 లక్ష్యం :

పురావస్తు శాస్త్రమునకు ఇతర శాస్త్రములకు గల సంబంధము తెలియజేయటమే ఈ పాఠము యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :


1.2. పురావస్తు శాస్త్రమునకు ఇతర శాస్త్రములతో గల సంబంధం

1.2.1 పరిచయము

1.2.2 పురావస్తు శాస్త్రము - చరిత్ర

1.2.3 పురావస్తు శాస్త్రము - మానవ శాస్త్రము

1.2.4. పురావస్తు శాస్త్రము - భూ విజ్ఞాన శాస్త్రము

1.2.5. పురావస్తు శాస్త్రము - వృక్ష శాస్త్రము

1.2.6. పురావస్తు శాస్త్రము - జంతు శాస్త్రము

1.2.7. పురావస్తు శాస్త్రము - రసాయన శాస్త్రము

1.2.8. ముగింపు

1.3. పురావస్తు శాస్త్ర ప్రయోజనములు

1.3.1. పరిచయము

1.3.2. పురావస్తు శాస్త్రము చరిత్ర పూర్వయుగానికి ముఖ్య ఆధారము

1.3.3. చరిత్రను పునర్నిర్మించడానికి ఆధారము

1.3.4. సామాన్య ప్రజలను గురించి తెలియచేస్తుంది.

1.3.5. వాఙ్మయ ఆధారములను ధృవీకరించవచ్చు

1.3.6. భారతీయతకు ఆధారము

1.3.7. సారాంశము

1.3.8. నమూనా ప్రశ్నలు

1.3.9. చదువదగిన గ్రంధాలు


## 1.2.1 పరిచయం :

విశ్వం అనంతమైనది. ఇట్టి అనంతమైన విశ్వంలో వున్న అనేక గోళాలలో భూ గోళం ఒకటి. ఈ భూగోళంలో జీవరాశి పుట్టి కొన్ని కోట్ల సంవత్సరాలైనది. జీవ పరిణామ క్రమములోమానవుడు జన్మించి ఎన్ని లక్షల సంవత్సరాలైనదో ఇతమిద్ధంగా చెప్పటం కష్టం. ఆదిమ

మానవుడు అనాగరికుడుగా, అటవిక జీవిగా నివసించాడు. నాటి అటవిక మానవుడు నాగరిక మానవుడైనది ఆరేడువేల సంవత్సరముల నాడే. విశ్వచరిత్రతో పోల్చినపుడు ఆరేడువేల సంవత్సరములు మహా సముద్రములో నీటి బిందువు మాత్రమే. ఇటువంటి మానవుని సంస్కృతిత్వం తెలుసుకొనటానికిజరిగే పరిశీలనను, విశ్లేషణను పురావస్తు శాస్త్రజ్ఞుడు ఒంటరిగా కొనసాగించలేడు. అతడు పురావస్తు శాస్త్ర రూపకల్పనలో అనేక ఇతర శాస్త్రజ్ఞుల సహాయ సహకారములను కాలానుగుణ్యంగా పొందుతాడు.

## 1.2.2 పురావస్తు శాస్త్రము - చరిత్ర :

చరిత్రకు పునాది పురావస్తు శాస్త్రము "పురావస్తు శాస్త్రము చరిత్రకు అస్తి పంజరము వంటిది. దానిని రక్త మాంసాలతో పూరించి జీవకళనిచ్చునది సాహిత్యము" అని అల్లాడి వైదేహి చరిత్ర నిర్మాణంలో పురావస్తు శాస్త్రానికి గల ప్రాముఖ్యతను తెల్పిరి.

పురావస్తు శాస్త్రానికి చరిత్రకు సన్నిహిత సంబంధమున్నది. ఇవి రెండూ మానవుడు అవతరించినప్పటి నుండి మానవ సమాజంలో వచ్చిన మార్పులను తెలియజేస్తాయి. అయితే పురావస్తు శాస్త్రజ్ఞుడు చరిత్రకారుడు అవలంభించేపద్ధతులు మాత్రం వేరుగా వుంటాయి. చరిత్ర పరిశోధకుడు తాను చెప్పదలచిన అంశమును ముందుగా నిర్ణయించుకొని వాటి ఆధారాల కోసం గ్రంధాలయాలలో వున్న గ్రంధములను ఆధారంగా తన పరిశోధన కొనసాగిస్తాడు. పురావస్తు శాస్త్రజ్ఞుడు దీనికి భిన్నంగా మొదట అన్వేషణ జరిపి త్రవ్వకముల ద్వారా ప్రాచీన వస్తు సముదాయాన్ని సేకరిస్తాడు. లభ్యమైన ఆధారములను బట్టి చరిత్రకు పనికి వచ్చేనూతన విషయములను తెలియపరుస్తాడు. చరిత్ర పూర్వయుగానికి, చారిత్రక సంధియుగానికి పురావస్తు శాస్త్రజ్ఞుడు అందించే సమాచారమే చరిత్రకు ముఖ్య ఆధారము. హరప్పా మొహెంజదారోలలో బయల్పడ్డ పట్టణ నాగరికత, ఆ తరువాత జరిపిన త్రవ్వకాల వల్ల సింధూ నాగరికత సంస్కృతిని చరిత్రకు అందించింది పురావస్తు శాస్త్రజ్ఞుడే. చారిత్రక యుగానికి చెందిన అనేక మంది రాజులు, రాజ వంశాలు కేవలం పురావస్తు ఆధారాలైన శాసనాలు,నాణేలు వల్ల వెలుగులోకి వచ్చారు. సముద్రగుప్తుని అలహాబాదు స్తంభ శాసనము ద్వారా అతడు ఎంత గొప్ప చక్రవర్తి తెలియుచున్నది. అలాగే మాస్కే శాసన వలన 'అశోక' అనే పేరు వెలుగులోకి వచ్చింది. సముద్రగుప్తుని అనంతరం గుప్త సింహాసనాన్ని అధిష్టించిన వాడు రామగుప్తుడు అని లభ్యమైన నాణేల వల్ల తెలియుచున్నది. క్రీ॥పూ॥ 2వ శతాబ్దం నుండి క్రీ॥పూ॥ 3వ శతాబ్దం వరకూ వున్న మధ్యకాలంలో మన దేశాన్ని పాలించిన గ్రీకు, సీథియన్, పార్థియన్, కుషాణు వంశపాలకుల పరిపాలనా చరిత్రలకూ, మాళవ, యౌధేయ అర్జునాయనాది గణతంత్ర రాజ్యాల చరిత్రలు తెలుసుకొనటానికి మత సాంప్రదాయాలు, ఆర్థిక పటుత్వం తదితర అంశాలు గ్రహించటానికి చరిత్రకారునికి నాణేలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. వివిధ లోహాలలో, వివిధ రకాల నాణేల మీద ముద్రితమైన చిహ్నాలు, బొమ్మలు, అఖ్యలు (Legends) భారతదేశ చరిత్ర పునర్నిర్మాణంలో చరిత్రకారునికి ఎంతగానో సహాయపడుతున్నాయి. హిందూపురంలో బయల్పడిన శాతవాహనుల కోట వల్ల ఆంధ్ర శాతవాహన సామ్రాజ్య సరిహద్దులు మార్చవలసిన అవసరం ఏర్పడింది. కావున పురావస్తు శాస్త్రము చరిత్ర అనేవి రెండూ ఒకే నాణేనికి వున్న బొమ్మ - బొరుసు లాంటివి.

## 1.2.3 పురావస్తు శాస్త్రము - మానవ శాస్త్రము

మానవ శాస్త్రము (Anthropology) మానవుని అతడు నిర్మించిన సంస్కృతిని తెలియచేస్తుంది. నిరక్షరాస్యులైన ప్రజల నుండి గ్రహించిన మానవ జాతి. సంస్కృతుల ఆవిర్భావము, పరిణతి లక్షణముల వివరాలను విశదీకరిస్తుంది. మానవ శాస్త్రంలో భౌతిక మానవ శాస్త్రం, సాంస్కృతిక మానవ శాస్త్రం అనే రెండు ప్రధాన భాగాలున్నాయి. భౌతిక మానవ శాస్త్రం వివిధ జాతులు, వాటిపుట్టుపూర్వోత్తరాలు వాటి పరిణామం, వాటి స్వరూప స్వభావాన్ని గురించి వివరిస్తుంది. సాంస్కృతిక మానవ శాస్త్రం వివిధ సంస్కృతులను వాటి పరిణామాన్ని, మానవునికి సంస్కృతికి గల పరస్పర సంబంధాన్ని తెలియచేస్తుంది. పురావస్తు శాస్త్రం యొక్క ముఖ్య ధ్యేయం కూడా అంతరించిపోయిన సంస్కృతులను అధ్యయనం చేయటమే. కావున పురావస్తు శాస్త్రానికి మానవ శాస్త్రానికి చాలా దగ్గర సంబంధం వున్నది.

## 1.2.4. పురావస్తుశాస్త్రము - భూ విజ్ఞాన శాస్త్రము :

భూమి ఉపరితలం, పొరలు, వాటి సంబంధాలు, మార్పులు మొదలైన వాటిని అధ్యయనానికి సంబంధించిన శాస్త్రము భూ విజ్ఞాన శాస్త్రం (Geology) ప్రాక్ చరిత్ర తొలి దశలైన 'హిమానీయుగాలు' (Glacial Ages) భూ విజ్ఞాన సంబంధమైనవే. భూ విజ్ఞాన సంబంధమైన వార్వ్ విశ్లేషణ (Varve analysis) పద్ధతి ద్వారా పురావస్తు శాస్త్రజ్ఞుడు భూమిలో లభించిన వస్తువులకు కాల నిర్ణయం చేస్తాడు. స్వీడన్‌కు చెందిన "బారన్ గెరాడ్ డిగీర్ (Baron Gerrod De Geer) ఈ పద్ధతిని రూపొందించాడు. భూ విజ్ఞానం నుండి వర్ణశ్రేణి పద్ధతి, స్తర శాస్త్రం ద్వారా పురావస్తు శాస్త్రజ్ఞుడు సాపేక్ష కాల నిర్ణయాన్ని చేస్తుంటాడు. భూమిలోని వేరు వేరు భాగాలోన్ల గతంలో తిరుగాడిన మానవుని గుర్తులకై వెతకాలి కాలగతిలో ఈ గుర్తులన్నీ భూమ్యంతర్భాగమందలి, ఉపరితలమందలి పరిస్థితులకు అనేక సహజమైన మార్పులను పొందివుంటాయి. ఈ మార్పులన్నీ భూ విజ్ఞాన పరిశోధకుడు వెలుగులోకి తీసుకువస్తాడు.

## 1.2.5. పురావస్తు శాస్త్రము - వృక్ష శాస్త్రము :

పురావస్తుశాస్త్రజ్ఞుడు ఉత్ఖాతన (Excavation) సమయంలో వృక్ష శాస్త్రవేత్త సహాయ సహకారములను తీసుకుంటాడు. ఉత్ఖాతన సమయంలో మట్టిలో లభించిన పుప్పొడిలాంటి వృక్ష సంబంధమైన ధాతువులను వృక్ష శాస్త్రవేత్త సూక్ష్మదర్శినితో పరిశీలించి, అవి ఏ కాలానికి సంబంధించిన వృక్షాలో తెలియచేస్తాడు. వృక్ష శాస్త్రజ్ఞుడు వృక్షశిలాజాల ఆధారంగా సాపేక్ష కాల నిర్ణయం చేస్తాడు. వృక్ష శాస్త్రం రూపొందించిన మరో కాల నిర్ణయ పద్ధతి వృక్ష వలయ విశ్లేషన ఈ పద్ధతి ప్రకారం ఒక నివాస కాల మానాన్ని నిర్ణయించవచ్చు. వృక్షం పెరుగుదలను కాండచక్రాలు సూచిస్తాయి. ఋతుపవనాలకు అనువుగా ఈ కాండచక్రాలు సంవత్సరానికి ఒకటి చొప్పున నిర్మితమవుతాయి. ఒక చెట్టు కాండచక్రాలను గణిస్తే ఆ చెట్టు వయస్సు తెలుస్తుంది. ఈ సూత్రం ఆధారంగా 1901లో డగ్లాస్ (Douglass) వృక్ష వలయ పద్ధతిని రూపొందించాడు. వృక్ష శాస్త్రజ్ఞుడు ఉత్ఖాతంలో లభించిన విత్తనముల ద్వారా ప్రాచీన కాలంలో ఏఏ రకాల పంటలు పండించేవారో తెలుసుకుంటాడు. ఉత్తరప్రదేశ్‌లో అలహాబాద్ వద్ద 'కొలీనా' పరిసర ప్రాంతాలలో జరిగిన త్రవ్వకాలలో క్రీ॥పూ॥ 6500 సంవత్సరం నాటి ధాన్యపు శిలాజాలు లభించినాయి. దీనిని బట్టి భారతదేశంలో ప్రాచీనకాలం నుండి వరిని పండించే వారిని తెలియుచున్నది.

## 1.2.6. పురావస్తు శాస్త్రము - జంతుశాస్త్రము :

పురావస్తు శాస్త్రజ్ఞుడు త్రవ్వకాలు జరుపుతున్నప్పుడు జంతు సంబంధమైన అనేక శిలాజాలు బయటపడుతుంటాయి. వాటిని జంతు శాస్త్రజ్ఞుడు ప్రయోగశాలలో పరీక్షించి అవిఏ జంతు సంబంధమైనవో తెలియపరుస్తాడు. ఈ శిలాజాలతో పాటు శిలాయుగపు పనిముట్లు లభిస్తుంటాయి. వీటిని బట్టి ఆ శిలాయుగ సంస్కృతి ఏ కాలానికి సంబంధించినదో తెలుసుకోవచ్చు. జంతువుల ఎముకలు మొదలైన ధాతువులను జంతు శాస్త్రవేత్త పరిశీలించి అవి క్రూరజంతువులో, పెంపుడు జంతువులో తెలియచేస్తాడు. సింధూ నాగరికతా త్రవ్వకాలలో బయటపడిన జంతు కళేబరాలను బట్టి సింధూ ప్రజలకు క్రూరజంతువులు, మచ్చిక జంతువులు, పెంపుడు జంతువులు తెలియునని తెలియుచున్నది.

## 1.2.7. పురావస్తు శాస్త్రము - రసాయన శాస్త్రము :

పురావస్తు శాస్త్రజ్ఞుడు శతాబ్దాల తరబడి భూగర్భంలో వున్నటువంటి వస్తువులను త్రవ్వి ఒక్కసారిగా బయటకు తీయుట వలన అతి త్వరగా చెడిపోయే ప్రమాదం వున్నది. ముందుగా వీటికి ప్రథమ చికిత్స చేసి ప్రయోగశాలలో భద్రపరచటానికి రసాయనాలు వాడటం అవసరం. ఎముక, కర్రి వస్తువులను గట్టి పరచటానికి వినైల్ అసిటేట్ (Vinyl acilate) ను వాడతారు. థైమోల్ (Thymol) అనే రసాయన పదార్థంతో వాటిని క్రిమి కీటకాల నుండి రక్షిస్తాడు. ఇనుప వస్తువులను ఎలక్ట్రోలిటిక్ (Electrolitio) పద్ధతి ద్వారా హానికర ద్రవ్యాల నుండి వేరు చేసి వాటికి పారఫీన్ మైనపు పూత పూస్తారు. రాగి నాణేలను టార్ఛారిక్ ఆమ్లం కాస్టిక్‌సోడాల ద్రావణంలో శుభ్రపరుస్తారు. రాతి శిల్పాలు త్వరగా చెడిపోకుండా B-72 రసాయనంతో శుభ్రపరుస్తారు. పురాతన వర్ణ చిత్రాలు చెడిపోకుండా వుండటానికి వాటిని గ్యాస్

ఛాంబర్స్ (Gas Chamber) లో 24 గంటలపాటు వుంచుతారు. దానికి మిథైల్ బ్రోమైడ్ గ్యాస్‌ను ఉపయోగిస్తారు. ఈ వాయువు రంగు పొరల్లోకి పోయి సూక్ష్మ క్రిములను సంహరిస్తుంది. అవి ఎక్కువ కాలం మన్నటానికి అవకాశం వున్నది. ఈ విధంగా పురావస్తుశాస్త్రజ్ఞుడు రసాయన శాస్త్రజ్ఞుని యొక్క సహాయసహకారాలు పొందుతాడు.

## 1.2.8. సారాంశము :

పురావస్తు శాస్త్రజ్ఞునికి పైన చెప్పిన శాస్త్రజ్ఞులతో పాటు అనేక ఇతర శాస్త్రాలతో సబంధం కలిగి వుంటాడు. క్షేత్ర పరిశోధనలో అనుసరించే పటాలు, భూగోళ శాస్త్ర తోడ్పాటును తీసుకుంటాడు. అలాగే ఉపరితల ఛాయా చిత్రాలు, వస్తు పరిశోధనలను సేకరణలను క్షేత్ర పరిశోధనలను ఛాయా చిత్ర శాస్త్రాన్ని ఉపయోగించుకుంటాడు. అట్లే వాతావరణ శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, పురాబీజ శాస్త్రం వంటి శాస్త్రాల తోడ్పాటును కూడా తీసుకుంటాడు. మానవ పరిణామాలలో, జీవన విధానాలలో, సాహితీ విజ్ఞానం కళాత్మకతల పాత్ర ముడిపడివున్నది. సాహిత్య అంశములను అవగాహన చేసుకొనటానికి వ్యాకరణం, ఛందస్సు, సౌందర్య మీమాంస, భూషాశాస్త్రం వంటివి కూడా ఎంతగానో తోడ్పడతాయి. ప్రాచీన శాసనాలను అవగాహన చేసుకోవటంలో పురాలిపి శాస్త్రం (Palaeography) ఎంతగానో తోడ్పడుతుంది.

## 1.3. పురావస్తు శాస్త్రం వల్ల ప్రయోజనాలు :

## 1.3.1. పరిచయము :

భారతదేశంలో సర్. విలియం జోన్స్ ఆధ్వర్యంలో క్రీ॥శ॥ 1774లో కలకత్తాలో 'బెంగాల్ ఏసియాటిక్ సొసైటీ'' అనే పరిశోధనా సంస్థ స్థాపించబడినది. ఈ సొసైటీ అనేక పురాతనమైన శాసనాలను సేకరించినది. 1838లో జేమ్స్ ప్రిన్సెస్ శాసనాలలోని బ్రాహ్మీలిపి చదివి చరిత్ర పరిశీలనారంగంలో నూతన రకాన్ని ప్రారంభించినాడు. 1863లో అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ భారత ప్రభుత్వ పురావస్తు పర్యవేక్షకుడిగా నియమింపబడ్డాడు. పురావస్తు పరిశోధనా రంగంలో ఆయన చేసిన కృషి అపారమైనది. 1904లో కర్జన్ ప్రభువు పురావస్తు పరిరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ చట్టం ద్వారా చారిత్రక, పురావస్తు ప్రాముఖ్యత గల కట్టడాలు, స్థలాలు పరిరక్షింపబడటమే కాక భూగర్భంలో నిక్షిప్తమై యున్న పురావస్తు సంపదను వెలికితీసి పరిశోధనలు గావించేందుకు గానూ భారత పురావస్తు పరిశోధన శాఖ నెలకొల్పబడినది. ఈ శాఖ మొదటి డైరక్టర్ జనరల్‌సర్‌జాన్ మార్షల్ పరిశోధనల ఫలితంగా సింధూ నాగరికత వంటి స్థావరములను కనుగొని పురావస్తు శాఖకు ఎనలేని ప్రాముఖ్యతను తీసుకొచ్చారు.

## 1.3.2. పురావస్తుశాస్త్రము చరిత్ర పూర్వయుగానికి ముఖ్య ఆధారము :

చరిత్ర పూర్వయుగానికి ముఖ్య ఆధారం పురావస్తు శాస్త్రమే. ప్రాచీన మానవుడు వదలి పెట్టి వెళ్ళిన పనిముట్లు, మణ్మయ పాత్రలు, ఆయుధాలు, నిర్మాణ శిధిలాలు, శిల్పాలు, చిత్ర లేఖనం మొదలైనవి చరిత్ర పునర్నిర్మించటానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. వీటిని వెలుగులోనికి తీసుకువచ్చినది పురావస్తు శాస్త్రవేత్త. నాటి రాతి పనిముట్లను బట్టి ఆదిమ మానవుని సాంకేతిక నైపుణ్యాన్ని తెలుసుకొనవచ్చు. పురాతత్వవేత్త జరిపిన సుదీర్ఘ పరిశోధనల ఫలితంగా చరిత్ర పూర్వయుగాన్ని శిలాయుగం, లోహయుగం అని విభజించటం జరిగింది. శిలాయుగంలో ప్రాచీన శిలాయుగం, మధ్య శిలాయుగం, నవీన శిలాయుగం అనే అంతర్దశలు వున్నాయి. ప్రాచీన శిలాయుగాన్నే తిరిగి పూర్వ ప్రాచీన శిలాయుగం, మధ్య ప్రాచీన శిలాయుగం, ఉత్తర ప్రాచీన శిలాయుగంగా విభజించడం జరిగింది.

## 1.3.3. చరిత్రను పునర్నిర్మించటానికి ఆధారము :

క్రీ॥శ॥ 1922 వరకూ ఆర్యుల రాకతోనే భారతదేశపు చరిత్ర ప్రారంభమైనదని భావించేవారు. సర్‌జాన్ మార్షల్ నాయకత్వంలో హరప్పా, మొహంజదారో వంటి పట్టణాలు కనుగొనడంతో క్రీ॥పూ॥ 3000 సంవత్సరాల నాడే మన దేశంలో ఒక విశిష్టమైన నాగరికత వెలసిల్లినట్లు పురావస్తు శాస్త్రజ్ఞులు ఋజువు చేసారు. దీనితో భారతదేశ చరిత్రను పునర్నిర్మించవలసిన ఆవశ్యకత ఏర్పడినది.

## 1.3.4. సామాన్య ప్రజలను గురించి తెలియచేస్తుంది :

మానవజాతి శాస్త్రపరమైన పోలిక, అనుక్రమ శ్రేణినమూనాలు, పరిసర విశ్లేషణాత్మక నమూనాలు మొదలైన పురావస్తు శాస్త్ర విధానాలు చరిత్రలో అతి సామాన్యంగా కన్పించే యుద్ధాలు, విప్లవాలు, అధికార వినిమయాలు వంటి అంశాలలో నిక్షిప్తమైయున్న మానవ అనుభూతులు, అనుభవాలు పరంపరను కాలానికి, ప్రదేశానికి మధ్యగల వివిధ సంబంధాలను రూపకల్పన చేసి విశ్లేషించడంలో ఎంతో ఉపయోగపడతాయి. అనడం నిర్వివాదాంశము. ముఖ్యంగా ఎక్కువ మంది ఎక్కువగా ఆదరిస్తున్న 'సామాజిక ఆర్థిక విశ్లేషణ' వంటి మార్క్సిస్టు విధానాలతో కూడుకున్న వ్యాఖ్యన ధోరణులకు తగిన తోడ్పాటు పురావస్తు శాస్త్రం అందిస్తుంది. అందువల్లనే ఈ ధోరణులలో పరిశోధన చేసి డి.డి. కౌశాంబి, ఆర్.ఎస్. శర్మ వంటివారు చరిత్రకారునికి పురావస్తు శాస్త్రం అత్యావశ్యకమైనదని పేర్కొన్నారు.

## 1.3.5. వాఙ్మయ ఆధారములను ధృవీకరించవచ్చు :

పురాతన అవశేషాలను ఆధారంగా చేసుకొని సాహిత్య మాలాధారములను ధృవీకరించవచ్చు లేదా వ్యతిరేకించవచ్చు. గంగానదీ మైదానంలో ఆర్యులు స్థిరపడి జీవించిన ప్రదేశాల్లో దొరికిన అవశేషాలను బట్టి ఆర్యులు ముఖ్య వృత్తి వ్యవసాయమని, వారు నిరాడంబర జీవులని తెలియుచున్నది. వైదిక గ్రంధాల్లో కనిపించే వైభవ చిత్రణ, సాహితీ అతిశయోక్తి అనిపిస్తుంది. గ్రంథరూపమైన ఆధారాలను పురావస్తు శాస్త్ర పరిశోధన ధృవీకరించిన సందర్భాలు అనేకం వున్నాయి. మహాభారతంలో వరదల వల్ల పెద్ద ఎత్తున నష్టాలు జరిగినట్లు ఒక కథ వున్నది. ఈ కథనాన్ని హస్తినాపూర్ త్రవ్వకాలు ధృవీకరించాయి. కౌశాంబికి రాజధాని మార్పిడి, హస్తినాపూర్ వరదలు ఒకే కాలంలో జరిగినట్లు ఈ అవశేషాలు సూచిస్తున్నాయి. మౌర్య యుగానికి సంబంధించిన గ్రంధ రూపమైన ఆధారాలతో పురావస్తు శాస్త్ర ఏకీభవించిన సందర్భాలున్నాయి.

## 1.3.6. భారతీయతకు ఆధారము :

ప్రాచీన భారతీయ సంస్కృతికి ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గౌరవ స్థానం వున్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అత్యద్భుత ప్రగతి సాధించిన దేశాలుకూడా ప్రాచీన భారతీయ సంస్కృతి పట్ల మక్కువ చూపుతూ అందులో అన్ని కాలాలకు వర్తించే విలువలు వున్నట్లు భావిస్తున్నాయి. పాశ్చాత్య నాగరికతలు పుట్టటానికి కొన్ని వేల సంవత్సరాలకు పూర్వమే భారతదేశ సంస్కృతి అశ్చర్యాన్ని కలిగించే విషయాలను ఏ విధంగా సృష్టించగలిగిందా అని ఆయా దేశాలలోని పండితులు సంభ్రమాశ్చర్యాలను పొందుతున్నారు. ప్రాచీన భారతీయ సంస్కృతిలోని వాస్తు, శిల్ప, చిత్ర కళలు భారతీయ పురావస్తుశాస్త్రంలోని భాగాలు, పాశ్చాత్య దేశాల్లోని కళాభిమానులు భారతదేశ పురాతన కళా సంపద కోసం ఆత్రులు చాస్తున్నారు. భారతదేశంలో నేడు దాదాపు ప్రతీ చారిత్రక ప్రాముఖ్యత కలిగిన స్థలానికి అవశేషానికి భారతీయ పురావస్తు శాస్త్రం వివరణ, వ్యాఖ్యానం ఇస్తుంది. ఈ విధంగా పురావస్తు శాస్త్రం భారతీయుతకు ఆధారమైనది.

## 1.3.7. సారాంశము :

పురావస్తుశాస్త్రం కేవలం గతంలోని అవశేషాలలో ప్రతిబింబించిన మానవుల తీరుతెన్నులను అంచనా వేసే శాస్త్రంగా కాక, ప్రస్తుతపు సమాజంలో గల గిరిజనులు మెదలయిన వారి జీవన విధానాల ప్రకృతిని, మూలాన్ని అంచనా వేసి ప్రస్తుతం నుండి గతానికి ఎడతెగని సంబంధాన్ని ఏర్పరచే శాస్త్రంగా పరిణమించింది. నేటి సమాజంలోని ద్వంద్వ ప్రకృతులను పరిహరించి మానవ సాంస్కృతిక వ్యవస్థలోని వేర్వేరు సంస్కృతుల మధ్య సంబంధాల ద్వారా పరిణమించిన సాపేక్ష సాంస్కృతిక ధోరణులను విశ్వజనీన దృక్పథంతో వ్యాఖ్యానించటానికి పురావస్తు శాస్త్రం తోడ్పడుతుంది.

## 1.3.8. నమూనా ప్రశ్నలు :

1) పురావస్తు శాస్త్రాన్ని నిర్వచించి దాని స్వభావాన్ని, పరిధిని వివరింపుము.

2) పురావస్తు శాస్త్రానికి, చరిత్రకు, ప్రకృతి శాస్త్రాలకు గల సంబంధము వివరింపుము.

3) పురావస్తు శాస్త్రా ప్రయోజనాలను వివరింపుము.

## 1.3.9. చదువదగిన గ్రంథాలు :


1. H.D. Sankalia - Indian Archaeology Today

2. S.K. Dikshit - Introduction to Archaeology


- కె.బి.వి.వి. ప్రసాద్

పాఠం - 2.1.

# అన్వేషణ - ఉత్ఖాతనం - కాల నిర్ణయ పద్ధతులు

## 2.1.0 లక్ష్యం :

అన్వేషణ అంటే ఏమిటి ? చారిత్ర స్థలాలను ఏ పద్ధతుల ద్వారా కనుగొంటారు, ఉత్ఖాతనం అంటే ఏమిటి ? త్రవ్వకాలు ఎలా చెయ్యాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి ? కాల నిర్ణయ పద్ధతులు ఎన్ని ఉన్నాయి. చారిత్రక వస్తువుల కాల నిర్ణయాన్ని ఏ విధంగా చేయాలి అనే విషయాలను తెలుసుకోవటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## విషయసూచిక :


2.1.1. ఉపోద్ఘాతము

2.1.2. అన్వేషణ - నిర్వచనము

2.1.3. చరిత్ర పూర్వయుగ స్థావరాల అన్వేషణ

2.1.4. చారిత్రక ప్రదేశాల అన్వేషణ

2.1.5. యాథృచ్ఛికంగా బయల్పడిన చారిత్రక స్థలాలు

2.1.6. స్థానిక ప్రజల సమాచారం

2.1.7. విదేశీ రచనలు

2.1.8. పాటి దిబ్బలు

2.1.9. మట్టి పాత్రలు

2.1.10. నాణ్యాలు

2.1.11. శాసనాలు

2.1.12. సమాధులు

2.1.13. ఇటుకలు

2.1.14. శిల్పాలు - స్తంభాలు - మండపాలు

2.1.15. విమానాల నుండి ఫోటో తీసే పద్ధతి

2.1.16. మొగ్గర్ యంత్ర సహాయంతో అన్వేషణ

2.1.17. సారాంశము


## 2.1 ఉపోద్ఘాతము :

ప్రాచీన కాలపు వస్తు సముదాయము పురావస్తు శాస్త్ర పరిశోధనకు ముఖ్యమైన ఆధారాలు. పురాతన వస్తు సేకరణ పురావస్తు శాస్త్రవేత్తల పరిశోధనలో ముఖ్యాంశము. పురావస్తు శాస్త్రవేత్తలకు పురావస్తు శాస్త్ర గ్రంధ పరిచయమే కాక క్షేత్ర పరిశోధనా పరిజ్ఞానం కూడా అవసరం. క్షేత్ర పరిశోధన (Field servey) ముఖ్య ఉద్దేశం ప్రాచీన వస్తువులను సేకరించటం, అటువంటి వస్తువులు లభించే ప్రదేశాలను

కనుగొనడం, కనుగొన్న వాటిని శాస్త్రీయ పద్ధతులలో విశ్లేషించడం. ఈ లక్ష్య సాధనలో పురావస్తు శాస్త్రవేత్తలు చారిత్రక స్థలాల కోసం అన్వేషణలు చేస్తారు. అటువంటి ప్రదేశాలను కనుగొన్నప్పుడు అవసరమని తోచిన చోట ఉత్ఖాతనం జరుపుతారు.

## 2.1.2. నిర్వచనం :

పురాతన వస్తువులు లభించే స్థలాల ఉనికిని కనుగొనడానికి చేసే ప్రయత్నాలను అన్వేషణ అని అంటారు. ఈ అన్వేషణ ముఖ్యోద్దేశాలు ప్రాచీన వస్తు సేకరణతో పాటు, సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం, ఇతర ఆధారాల మూలంగా తెలిసిన అంశాలను ధృవీకరించటం, లభించిన ప్రాచీన వస్తువుల చారిత్రకతను నిర్ణయించటం మొదలగునవి. అన్వేషణ అనేది ఒక క్రమ పద్ధతిలో చేయవలసిన కార్యక్రమం అయినప్పటికి, అన్ని సందర్భాలలోను తప్పనిసరిగా అనుసరించాల్సిన నిర్దుష్టమైన పద్ధతులు అంటూ ఏమీ లేవు. అన్వేషణలో పురావస్తు శాస్త్రవేత్తలు ఆయా సందర్భాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అవసరమైన ప్రణాళికను రూపొందించుకోవాలి.

అన్వేషణలో పురావస్తు శాస్త్రవేత్తలు తెలుసుకోవాల్సిన అంశాలు రెండున్నాయి. అవి ఒకటి, అన్వేషణా విషయము; రెండు, సాధన సామాగ్రుల అంచనా. అన్వేషణా విషయాన్ని బట్టి కార్యక్రమంలో అవలంబించవలసిన పద్ధతులు మారుతూ ఉంటాయి. ఉదాహరణకు చరిత్ర పూర్వయుగ స్థలాలను అన్వేషించే పద్ధతులు, చారిత్ర స్థలాల అన్వేషణకు అనుసరించే పద్ధతులు వేరుగా ఉంటాయి. తమ వద్ద ఉన్న సాధన సామాగ్రులను ఉపయోగించి ఉత్తమ ఫలితాలను సాధించాలనే లక్ష్యం పురావస్తు శాస్త్రవేత్తలకు ఉండాలి. నిధుల కొరత ఉన్నప్పుడు అన్వేషనా పద్ధతులను దానికి తగిన విధంగా రూపొందించుకోవాలి.

## 2.1.3. చరిత్ర పూర్వయుగ స్థావరాల అన్వేషణ :

చరిత్ర పూర్వయుగ స్థావరాలను అన్వేషించుటకు భూతల పటాల (Surface maps) సహాయం అవసరం. చరిత్ర పూర్వయుగ స్థావరాలు సాధారణంగా నదులు, వాగులు, సెలయేర్లు, సరస్సులు, నీటి బుగ్గల వద్ద, ఆదిమ మానవులు పనిముట్లు తయారు చేసుకోవటానికి అవసరమైన శిలలు లభించే ప్రదేశాలలోను చరిత్ర పూర్వయుగ స్థావరాలు సాధారణంగా కనిపిస్తాయి. ఇటువంటి స్థావరాలు 1అం=1కి.మి, 1అం = 6కి.మీ. కొలతలున్న భూతల పటాల సమాయంతో గుర్తించి ఆ ప్రాంతాలలో అన్వేషణ జరిపినపుడు చరిత్ర పూర్వయుగ స్థావరాలను కనుగొనవచ్చును. భూతల పటాలలో ఆయా ప్రదేశాలకు వెళ్ళే దారులు, భూతల స్వరూపం (వ్యవసాయ భూములు, బంజరు భూములు, అటవీ ప్రదేశాలు) ఎత్తు పల్లాలను తెలిపే నిమోన్నత రేఖలు (contour line) నదులు, వాగులు, జనావాసాలు, మొదలుగు ఎన్నో వివరాలు ఉన్నందువలన, ఈ పటాల సహాయంతో అన్వేషణలు జరిపి చరిత్ర పూర్వయుగ స్థావరాలను కనుగొనవచ్చును.

## 2.1.4. చారిత్రక ప్రదేశాల అన్వేషణ :

చారిత్రక ప్రదేశాల అన్వేషణ కొంతవరకు సులభమని చెప్పవచ్చును. సామాన్య ప్రజలు కూడా ఇటువంటి నివేశన స్థలాలను తేలికగా గుర్తించవచ్చును. ఈ చారిత్రక స్థలాలు సాధారణంగా పాటి దిబ్బల రూపంలో ఉంటాయి. చాలా కాలం ఒకే స్థలంలో ప్రజలు నివసించి, అనేక పర్యాయాలు గృహాలను నిర్మించుకుంటూ ఉంటున్నందువలన ఇటువంటి దిబ్బలు ఏర్పడతాయి. భూతల పటాలు చారిత్రక ప్రదేశాల అన్వేషణలో కూడా ఉపయోగపడతాయి.

చారిత్రక స్థలాలను అన్వేషించుటకు సాంప్రదాయ, ఆధునిక పద్ధతులు మార్గాలు ఎన్నో ఉన్నాయి వాటిలో ముఖ్యమైన మార్గాలు.

## 2.1.5. యాధృచ్ఛికంగా బయల్పడిన చారిత్రక స్థలాలు :

పురావస్తు శాస్త్రవేత్తలు ఏదైనా చారిత్రక ప్రదేశాలను గాని, దేవాలయాలను గాని కోటలను గాని సందర్శించినపుడు ఆ పరిసర ప్రాంతాలలో పురావస్తు అవశేషాలున్న ప్రదేశాల కొరకు అన్వేషిస్తాడు. ఇటువంటి ప్రయత్నాలలో అనుకోకుండా కొన్ని చారిత్రక స్థలాలు బయల్పడుతుంటాయి. ఉదాహరణకు భారత పురావస్తు శాఖకు చెందిన రంగస్వామి సరస్వతి అనే శాసన పరిశోధనాధికారి నాగార్జున

కొండలో శిలా శాసనాల ప్రతులను తీసుకోవడానికి వెళ్ళినపుడు చుట్టు ప్రక్కల ప్రాంతాలు పరిశీలించినపుడు అక్కడున్న బౌద్ధ అవశేషాలను కనుగొన్నాడు. కొన్ని సందర్భాలలో చారిత్రక స్థలాలలో జరుగుతున్న కార్యక్రమాలు ఆ ప్రదేశ ప్రాచీనత, ప్రాముఖ్యతలు వెల్లడవుతుంటాయి. 1856లో కరాచీ-లాహోర్ పట్టణాల మధ్య రైలు మార్గ నిర్మాణం జరుగుతున్న సందర్భంలో సింధు నాగరికతా అవశేషాలు బయల్పడ్డాయి. ఒక్కొక్కసారి గృహావసరాలకు ఉపయోగించుటకు చారిత్రక స్థలాలలోని ఇటుకలను, రాళ్ళను స్థానికులు త్రవ్వి ఉపయోగిస్తుంటారు. అటువంటి సందర్భాలలో కూడా చారిత్రక ప్రాముఖ్యత కలిగిన అవశేషాలు వెలుగులోకి వస్తుంటాయి. రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు అమరావతిలో తాను నిర్మించే భవనానికి అక్కడ ఉన్న బౌద్ధ స్తూప శిలాఫలకాలను తవ్వి ఉపయోగించటంతో అమరావతీ స్తూపం బయల్పడింది.

## 2.1.6. స్థానిక ప్రజల సమాచారం :

గ్రామస్తుల నుండి వారి గ్రామాల పరిసరాలలో లభించే పురావస్తు అవశేషాలను గురించిన సమాచారం ఆధారంగా పురావస్తు శాస్త్రవేత్తలు అన్వేషణలు జరిపి చారిత్రక స్థలాలను గుర్తించవచ్చును. ప్రకాశం జిల్లాలోని చందవరం గ్రామంలోని బౌద్ధ స్తూపం ఈ విధంగానే బయల్పడింది.

## 2.1.7. విదేశీ రచనలు :

భారతదేశాన్ని సందర్శించిన విదేశీ యాత్రికులు తమ పర్యటనల అనుభవాలను గ్రంధస్తం చేశారు. ముఖ్యంగా పాహియాన్, హుయాన్‌త్సాంగ్‌లు భారతదేశంలోని అనేక ప్రదేశాలను తమ రచనల్లో వర్ణించారు. అయితే వారు వివరించిన పట్టణాలు, ప్రదేశాలు కొన్ని కాలక్రమంలో నశించినందున అవి ప్రస్తుతం కనిపించవు. అయినా వారి రచనలను ఆధారంగా చేసుకొని అన్వేషించినపుడు ఆ ప్రదేశాలను గుర్తించవచ్చును.

## 2.1.8. పాటి దిబ్బలు (Mounds) :

భూకంపాలు, వరదలు, అనావృష్టి మొదలగు ప్రతికూల ప్రకృతి భీభత్సాల కారణంగా కాని, అంటువ్యాధుల కారణంగాను, అగ్ని ప్రమాదాలు, శత్రువుల దాడులు మొదలగు కారణాల వలన కాని ప్రజలు తాము నివసిస్తున్న ప్రదేశాన్ని వదలి ఇతర ప్రాంతాలకు వెళతారు. కొన్ని సంవత్సరాల తరువాత వారి ఇళ్ళు భూమిలో కలిసిపోయి దిబ్బలుగా ఏర్పడతాయి. ఈ దిబ్బలు బూడిద రంగులో ఉంటాయి. అక్కడ పూర్వము ప్రజలు నివసించారనటానికి గుర్తుగా ఆ పాటి దిబ్బలపై కుండపెంకులు, గాజులు, పూసలు, నాణేలు, ఇటుకలు మొదలైనవి కనిపిస్తాయి. ఈ దిబ్బలను త్రవ్వినపుడు ప్రాచీన కాలం నాటి పట్టణాలు, గ్రామాల అవశేషాలు బయల్పడతాయి. ఇటువంటి దిబ్బలు కొన్నింటిని లంజల దిబ్బలు, బోగందాని మెట్టలు, పాండవుల మెట్టలు, దీపాల దిన్నె మొదలగు పేర్లతో ఆంధ్రదేశంలో వ్యవహారంలో ఉన్నాయి. ఇవన్నీ బౌద్ధ స్తూప విహారాలకు సంబంధించిన ప్రదేశాలే.

## 2.1.9. మట్టి పాత్రలు :

కొన్ని ప్రదేశాలలో విరిగిపోయిన కుండ పెంకులు కనిపిస్తాయి. ఈ కుండ పెంకుల రంగు, పెంకులపై నున్న చిత్రాలంకరణ, రంగుల మిశ్రమం, మొదలగు అంశాలు అవి దొరికిన స్థల ప్రాచీనతను తెలుపుతాయి. ఉపరితలంపై లభించిన మట్టి పాత్రలను రసాయనిక పరీక్షల ద్వారా వాటి కాలాన్ని తెలుసుకోవచ్చును. ఈ మట్టి పాత్రలు లభించిన ప్రదేశాలలో త్రవ్వకాలు జరిపితే ప్రాచన కాలపు గ్రామమో, పట్టణమో బయల్పడుతుంది.

## 2.1.10. నాణాలు :

చారిత్రక స్థలాల అన్వేషణకు నాణాలు ముఖ్యమైన ఆధారాలు. ఈ నాణేలు చారిత్రక స్థలాలలో లభించినపుడు వాటి ఆధారంగా ఆస్థల ప్రాముఖ్యతను తెలుసుకోవచ్చును. ఉదాహరణకు కోటి లింగాల గ్రామంలో దొరికిన శాతవాహన నాణేల వలన అక్కడ జరిపిన

త్రవ్వకాలలో శాతవాహనుల కాలము నాటి పట్టణము బయల్పడింది. ఈ త్రవ్వకాల వలన శాతవాహనులకు పూర్వమున్న గోభద, సిరకమవాయ, సిరి విజయ సమగోప మొదలగు రాజుల నాణేలు బయల్పడినవి.

### 2.1.11. శాసనాలు :

శాసనాలలో లభించే ఆధారాలను బట్టి చారిత్రక ప్రదేశాలను గుర్తించవచ్చును. ప్రాచీన కాలంలో రాజులు తాము దానమిచ్చిన భూమి లేదా గ్రామం సరిహద్దులను తామ్ర శాసనాలలోను, శిలా శాసనాలలోను వివరంగా వ్రాయించేవారు. శాసనాలలో పేర్కొన్న సరిహద్దుల వివరాలను పరిశీలించినపుడు మనకు కొన్ని చారిత్రక స్థలాల ఉనికి తెలుస్తుంది. ఉదాహరణకు ఇంద్రవర్మ జారీ చేసి టెక్కలి తామ్ర శాసనంలో కనిపించే తురిగన్న గ్రామానికి దక్షిణాన సరిహద్దుగా చెప్పిన "పురుషచ్ఛాయాయపాషాణ పంక్తి : ", మూడవ వజ్రహస్తుని బొడ్డపాడు తామ్ర శాసనంలో సరిహద్దుగా చెప్పబడిన "మండలాకార పాషాణ సహిత గర్త" అనేవి బృహశ్చిలాయుగ సమాధులు. అంతే కాకుండా సర్పాలయము, పున్నీశ్వరమ్మ నగరువు, మొదలగు ఆలయాలు, పాటి దిబ్బలు, లంజియవాడ పేరుతో ఉన్న బౌద్ధ క్షేత్రము మొదలగునవి తామ్ర శాసనాలలో గ్రామాల సరిహద్దులుగా చెప్పబడినవి. ఈ శాసనాలలో వర్ణించిన ప్రకారం ఆ ప్రదేశాలలో అన్వేషణలు జరిపినపుడు ప్రాచీన చారిత్రక స్థలాలను గుర్తించవచ్చును.

### 2.1.12. సమాధులు :

కొన్ని గ్రామాలలో రాక్షసి గుళ్ళు, పాండవుల గుళ్ళు అనే పేర్లతో ఉన్న వృత్తాకార శిలలు కన్పిస్తుంటాయి. ఇటువంటి ప్రదేశాలు ఇనుపయుగం లేదా తొలి చారిత్రక దశలోని ప్రజల సమాధులు. ఈ సమాధులలో అనేక రకాలు ఉంటాయి. ఈ సమాధుల ఆధారంగా చారిత్రక స్థలాలను, వాటి ప్రాముఖ్యతను గుర్తించవచ్చును.

### 2.1.13. ఇటుకలు :

ప్రాచీన కాలంలో వాడిన ఇటుకలకు ఆధునిక కాలంలో మనం వాడుతున్న ఇటుకలకు పరిమాణంలో ఎంతో తేడా ఉన్నది. ప్రాచీన కాలంలో 18" × 14" × 6" కొలతలున్న పెద్ద పరిమాణం కల ఇటుకలను ఉపయోగించేవారు. అందువలన ఇటువంటి కొలతలు కలిగిన ఇటుకలు కనిపించే ప్రదేశాలు చారిత్రక స్థలాలని సులభంగా నిర్ణయించవచ్చును.

### 2.1.14. శిల్పాలు, స్తంభాలు, మండపాలు :

కొన్ని ప్రదేశాలలో విరిగిన శిల్పాలు, పాడయిపోయిన మండపాలు, స్తంభాలు కన్పిస్తుంటాయి. ఇసుకలోనో భూమిలోనో కప్పబడి కొంత భాగం కనిపిస్తుంటాయి. వీటి ఆధారంగా అక్కడ దేవాలయం లేదా బౌద్ధ కట్టడాలో ఆ ప్రాంతంలో ఉంటుందని భావించవచ్చును.

### 2.1.15. విమానాల నుండి ఫోటోలు తీసే పద్ధతి (Aerial Photography) :

చారిత్రక స్థలాలను అన్వేషించుటకు ఇటీవల విమానాల నుండి ఫోటోలను తీసే పద్ధతిని పురావస్తు శాస్త్రవేత్తలు అనుసరిస్తున్నారు. దీనినే ఏరియల్ సర్వే అని కూడా అంటారు. ఈ పద్ధతి ద్వారా తీసే ఫోటోలలో ఆకార విశేషాలు ఎత్తు నుండి గమనిస్తే స్పష్టంగా కనిపిస్తాయి. ఈ ఫోటోలలో చారిత్రక స్థలాల ఉనికి, స్వరూపాలు, వర్ణ బేధంతో కనిపిస్తాయి. స్థలాలలో ఉన్న ఎత్తు పల్లాలు కలుగజేసే నీడల వలన, నిక్షిప్తమై ఉన్న గోడలు, వేదిక వంటి కట్టడాలు, కందకాలు మొదలగునవి సూర్యరశ్మిని పరావర్తనం చేయడంలో జరిగే వ్యత్యాసాల వలన ఈ వర్ణ భేదాలు ఏర్పడతాయి. మట్టి దిబ్బలపై పెరిగే గడ్డి మొక్కల రంగులలోను, వాటి పెరుగుదలలోను ఉండే వ్యత్యాసాలను బట్టి కూడా వర్ణ భేదాలు ఏర్పడతాయి. విమానాల నుండి తీసిన ఫోటోల సహాయంతో అనేక చారిత్రక ప్రదేశాలను గుర్తించటానికి, వాటి స్వభావ స్వరూపాలను నిర్ణయించటానికి వీలవుతుంది.

## 2.1.16. మెగ్గరు యంత్ర సహాయంతో అన్వేషణ :

కొన్ని మట్టి దిబ్బలలో చారిత్రక నిక్షేపాలు ఉన్నది లేనిది మెగ్గరు యంత్రాన్ని ఉపయోగించి తెలుసుకొనవచ్చును. అటువంటి ప్రదేశాలలో మట్టి విద్యుత్ప్రవాహాలకు కలిగించే ప్రతిఘటనలో కల వ్యత్యాసాల ఆధారంగా ఆ దిబ్బలలో నిక్షిప్తమై ఉన్న కట్టడాల స్వరూపాలను నిర్ణయించవచ్చును. విద్యుత్ప్రవాహాలకు కలిగే ప్రతిఘటనలను కొలవడానికి మెగ్గరు యంత్రాన్ని ఉపయోగిస్తారు.

## 2.1.17. సారాంశము :

సాంప్రదాయక పద్ధతుల ద్వారాకాని, విమానాల నుండి తీసిన ఫోటోల ఆధారంగా కాని ఒక చారిత్రక స్థలాన్ని కనుగొన్న తరువాత పురావస్తు శాస్త్రవేత్తలు ఆ స్థల ప్రాచీనతను, ప్రాముఖ్యతను నిర్ణయించుటకు ప్రయత్నించాలి. ఇటువంటి నిర్ణయాలు ఎక్కువగా ఆ స్థలాలలో త్రవ్వకాలు జరిపినప్పుడు బయల్పడే అవశేషాల ఆధారంగా చేయవలసినవే అయినప్పటికి ఉపరితలంపై లభించే వస్తువులను సేకరించి పరిక్షించి కూడా కొన్ని అంశాలను అవగాహన చేసుకొనవచ్చును. అందువలన చారిత్రక స్థలాలను అన్వేషించే సందర్భములో ఆయా ప్రదేశాలలో లభించే వస్తువులను సేకరించి నిశితంగా పరిశీలించడం ఎంతో అవసరము. అంతే కాకుండా ఏయే వస్తువులు ఆ చారిత్రక స్థలాల ఉపరితలంపై ఎక్కడ ఎక్కువగా లభిస్తున్నాయో గమనించాల్సిన అంశమే. మట్టి దిబ్బల మీద కొన్ని చోట్ల వాన నీటి ప్రవాహం వలన చిన్న కాలువలు ఏర్పడతాయి. ఆ కాలువల ప్రక్కలను పరిశీలిస్తే అక్కడ నిక్షిప్తమైన వివిధ కాలాలకు చెందిన అవశేషాలు కనిపిస్తాయి. వాటిని ఆధారంగా ఆ చారిత్రక స్థలాలలో ఎక్కడ త్రవ్వకాలు జరిపితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందో నిర్ణయించి త్రవ్వకాలను పురావస్తు శాస్త్రవేత్తలు చేపట్టవలసి ఉంటుంది.

పాఠం - 2

# 2.2. ఉత్ఖాతనము
# 2.3. కాల నిర్ణయ పద్ధతులు

**2.2.0 లక్ష్యం :**

పురావస్తు శాస్త్రవేత్తలు అన్వేషించిన చారిత్రక స్థలాలలో ఎలాంటి ఉత్ఖాతనలు జరపాలో తెలియచేయడము, అన్వేషణ, త్రవ్వకాల్లో బయల్పడిన చారిత్రక అవశేషాలను కాల నిర్ణయం చేయుటకు ఎలాంటి పద్ధతులు అవలంభిస్తారో తెలియజేయటము ఈ పాఠము యొక్క ముఖ్య లక్ష్యం.

**విషయ సూచిక :**


2.2. ఉత్ఖాతనము - ఉపోద్ఘాతము
2.2.1. పరిఖ
2.2.2. ఉత్ఖాతనములో పురావస్తు శాస్త్రవేత్తలు అనుసరించవలసిన జాగ్రత్తలు
2.2.3. ఉత్ఖాతన పద్ధతులు
2.2.4. అల్ప ప్రమాణ ఉత్ఖాతనలు
2.2.5. అధిక ప్రమాణ ఉత్ఖాతనాలు
2.2.6. కట్టడాలను గుర్తించే పద్ధతులు
2.2.7. కోటలు ఉన్న స్థలాలలో ఉత్ఖాతనాలు
2.2.8. బృహశ్ఛిలాయుగ సమాధుల ఉత్ఖాతన
2.2.9. త్రవ్వకాలల్లో బయల్పడిన వస్తువుల సంరక్షణ
2.2.10. ఫోటోలు, చిత్రాలు
2.2.11. నివేదిక
2.3. కాల నిర్ణయ పద్ధతులు - ఉపోద్ఘాతము
2.3.1. సాపేక్షక కాల నిర్ణయ పద్ధతి
2.3.1.1. స్థలాల అధ్యయనము
2.3.1.2. సంఘీకరణ
2.3.1.3. క్రమానుగత కాల నిర్ణయ పద్ధతి
2.3.1.4. వర్గీకరణ
2.3.2. నిరుపేక్షక కాల నిర్ణయ పద్ధతి
2.3.2.1. కార్బన్ 14 పద్ధతి
2.3.2.2. పురావస్తు, ఆకర్షణ పద్ధతి

2.3.2.3. దెర్మోలు మినిసెన్స్
2.3.2.4. వృక్ష వలయ పద్ధతి
2.3.2.5. వార్వ్ పద్ధతి
2.3.2.6. అబ్సిడియన్ కాల నిర్ణయ పద్ధతి
2.3.3. సారాంశము
2.3.4. నమూనా ప్రశ్నలు

## 2.2. ఉపోద్ఘాతము :

పురావస్తు శాస్త్రవేత్త అన్వేషణలు చేసి కనుగొన్న చారిత్రక స్థలాలలో ఆ స్థల ప్రాముఖ్యతను, ప్రాచీనతను తెలుసుకొనుటకు ఉత్ఖాతనం జరుపుతాడు. ఒక ప్రాచీన స్థావరం వద్ద నివాసమున్న ఒక సమాజము లేదా విభిన్న సమాజాల సంస్కృతులను తెలుసుకోవడానికి పురావస్తు శాస్త్రవేత్తలు జరిపే త్రవ్వకపు పనులను ఉత్ఖాతనం అంటారు. ఉత్ఖాతనము ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకొన్న కార్యక్రమము. ఇది ఇప్పటి పురపాలక సంఘము లేదా పబ్లిక్ వర్క్స్ డిపార్టమెంటువారు కొళాయిలు వేయటానికి, కాలువలు, రోడ్లు నిర్మించటానికి జరిపే త్రవ్వకాల వంటిది కాదు. ఉత్ఖాతనం కొన్ని శాస్త్రీయ పద్ధతులను అనుసరించి జరుగవలసిన కార్యక్రమము. ఒక స్థలంలో ఉత్ఖాతనము జరుపడానికి గల అవసరాన్ని ఆ స్థల ఉపరితలంపై లభించే వస్తు సముదాయాన్ని బట్టి నిర్ణయిస్తారు. అందువలన అన్వేషణను అనుసరించి ఉత్ఖాతనముంటుంది.

### 2.2.1. పరిఖ (Trench) :

ఉత్ఖాతనము చేయవలసిన ప్రదేశంలో పరిఖలు (Trenches) వేసి త్రవ్వకాలను చేపడతారు. పరిఖల పరిమాణము సందర్భోచితముగా మారుతూ ఉంటుంది. సాధారణంగా 20×20 అడుగుల పరిఖలను ఏర్పాటు చేస్తారు. ప్రతి పరిఖలో మట్టిని తవ్వడానికి, తవ్విన చోట పురావస్తు అవశేషాలను వెదకటానికి, తవ్వగా వచ్చిన మట్టిని పారబోయటానికి, పారబోసిన మట్టిలో పూసలు, ధాన్యపు గింజలు, నాణేలు, కుండపెంకులు మొదలగు వాటిని వెదుకుటకు జల్లెడ పట్టడానికి అవసరమయ్యే పని వారిని నియమిస్తారు. ఈ పని వారు ఒక పర్యవేక్షకుని (Supervisor) అజమాయిషీలో పని చేస్తారు. పర్యవేక్షకునికి పురావస్తు శాస్త్ర విజ్ఞానం కలిగి ఉండాలి.

## 2.2.2 ఉత్ఖాతనంలో పురావస్తు శాస్త్రవేత్తలు అనుసరించవలసిన జాగ్రత్తలు :

పురావస్తు శాస్త్రవేత్తలు, పర్యవేక్షకులు తవ్వకాలు జరుపునపుడు ప్రతి విషయంలోను, ప్రతి దశలోను ఎంతో అప్రమత్తతో వ్యవహరించాల్సి ఉంటుంది. పర్యవేక్షకుడు తన పరిఖలో జరిగే తవ్వకపు పనిని అప్రమత్తతతో గమనిస్తూ పనిని కొనసాగించాలి. ఇతడి విధులలో ముఖ్యమైనది తన పరిఖ చుట్టూ ఉండే నాలుగు గోడల (Baulks) లోపలి వైపు ఎప్పటికప్పుడు గుర్తించాలి. మట్టి రంగులోను, గుణంలోను ఉండే తేడాలను అనుసరించి అంతవరకు తన దగ్గరుండే కత్తితో అడ్డుగా గీతలు గీసి స్తరాలను గుర్తించాల్సి ఉంటుంది. పరిఖలోని స్తరాలను పై భాగమునుండి క్రిందికి లెక్కిస్తూ ఆయా సంఖ్యలను వ్రాసిన అంక పత్రాలను (Labels) పొరలపై అతికించాలి. ఈ స్తరాలు సాపేక్ష కాల నిర్ణయానికి ఉపయోగపడతాయి. ఒక ప్రదేశంలో నివసించిన సమాజ సంస్కృతిలో వచ్చిన మార్పులు స్తర విధానం వలన తెలుస్తుంది. స్తరాలను గుర్తించకుండా చేసే త్రవ్వకాలు శాస్త్రీయమైన పద్ధతిలో జరుగనట్లే.

పర్యవేక్షకులు తమ పరిఖలలో స్తరాలను గుర్తించటమే కాక, తవ్వకాలలో లభించిన వస్తువులు, బయల్పడిన కట్టడాలు ఏయే స్తరాలకు చెందినవో నిర్ణయించి తమ వద్దనున్న పుస్తకంలో వ్రాసి ఉంచాలి. తవ్వకాలలో బయల్పడిన వస్తువులకు, కట్టడాలకు, పరిఖల పార్శ్వతలాలపై ఉండే స్తర విన్యాసాలకు ఆకృతి చిత్రాలను కొలతలకు అనుగుణంగా గీయవలసి ఉంటుంది. ఈ విధంగా పర్యవేక్షకులు వ్రాసినవి ఉత్ఖాతనం తరువాత వెలువడే నివేదిక (Report) కు చాలా వరకు ఆధారంగా ఉంటాయి.

## 2.2.3. ఉత్ఖాతనా పద్ధతులు :

ఉత్ఖాతనా పద్ధతులను ప్రధానముగా రెండు రకాలుగా విభజించవచ్చును. అవి. 1. అల్ప ప్రమాణ ఉత్ఖాతనాలు (Small scale Excavations or verticle Excavations), 2. అధిక ప్రమాణ ఉత్ఖాతనాలు (Large scale Excavations or Horizontal Excavations)

## 2.2.4. అల్ప ప్రమాణ ఉత్ఖాతనాలు (Small scale Excavations or Vertical Excavations) :

సాధారణంగా అల్ప ప్రమాణ ఉత్ఖాతనాలు తక్కువ పరిఖలకు మాత్రమే పరిమితమై ఉంటాయి. ఈ పరిఖలను నివేశన స్థలాల మధ్య భాగములో ఏర్పాటు చేస్తారు. అల్ప ప్రమాణంలో జరిపే త్రవ్వకాల వలన ఆయా స్థావరాలలో నివసించిన సమాజం కాల క్రమణికలను మాత్రమే తెలుసుకొనవచ్చును.

## 2.2.5. అధిక ప్రమాణ ఉత్ఖాతనాలు (Large Scale Excavations or horizontal Excavations) :

అధిక ప్రమాణ ఉత్ఖాతనాలు ఒక ప్రదేశంలో నివసించిన సమాజ సంస్కృతి పరిణామాలను విపులంగా తెలుసుకొనుటకు ఉపయోగపడతాయి. ఈ పద్ధతిలో నివేశన స్థలంలో అధిక భాగంలో ఉత్ఖాతనం జరుపుతారు. అల్ప ప్రమాణ ఉత్ఖాతనాలు, అధిక ప్రమాణ ఉత్ఖాతనాలు రెండూ భిన్నరీతులు గాక ఒకే కార్యక్రమంలో జరిగే రెండు దశలు. అధిక ప్రమాణ ఉత్ఖాతనాలు ఆయా ప్రదేశాలలో జరిగిన అల్ప ప్రమాణ ఉత్ఖాతనాలను అనుసరించి ఉంటాయి. అధిక ప్రమాణ ఉత్ఖాతనంలో పరిఖలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తారు కనుక వాటి స్థితిని తెలియజేసేందుకు ఆ పరిఖలకు పేరు, సంఖ్యలను గుర్తించవలెను.

త్రవ్వకాలకు ఎన్నుకొన్న స్థల స్వభావాన్ని బట్టి ఉత్ఖాతనా విధానాలు మారుతుంటాయి. ఉదాహరణకు పెద్ద కట్టడాలున్న స్థలాలను తవ్వడంలో అనుసరించే పద్ధతులు, తీసుకునే జాగ్రత్తలు అవి లేని స్థలాలలో అనుసరించే వాటి కన్నా భిన్నంగా ఉంటాయి. కట్టడాలు లేని ప్రదేశాలలో స్తర విధానం పాటిస్తూ, ఏయే స్తరాలలో ఏయే వస్తువులు బయల్పడ్డాయో, వాటి క్రమం ఎటువంటిదో మొదలగు అంశాలను గమనించాలి. కట్టడాలు బయల్పడే స్థలాలలో కూడా స్తర విధానం గమనిస్తూ కట్టడాల ఆకారము, ప్రయోజనములను పరీక్షించడం చేయాల్సి ఉంటుంది. కట్టడాల ఆకారాన్ని బట్టి, వాటి దగ్గర లభించే వస్తువులను బట్టి ఆ కట్టడాల ప్రయోజనాలను నిర్ణయించవచ్చును.

## 2.2.6. కట్టడాలను గుర్తించే పద్ధతులు :

కట్టడాలను వాటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలను బట్టి తవ్వి బయల్పరచే పద్ధతులు మారుతుంటాయి. రాతితోను, కాల్చిన ఇటుకలతోను నిర్మించిన కట్టడాలను సులభంగా గుర్తించి వాటి బయల్పరచడం చాలా వరకు సులభంగానే చేయవచ్చును. అయితే మట్టితో కాని, పచ్చి ఇటుకలతో గాని కట్టిన వాటిని గుర్తించటం కష్టం. అటువంటి నిర్మాణాలను మట్టిలో కనిపించే వర్ణ భేదాలను బట్టి వాటి ఆకారాలను గుర్తించవలసి ఉంటుంది. హరప్పాలో ఒక శవపేటికను ఈ విధంగానే గుర్తించారు. ఇళ్ళు నిర్మాణానికి గుంజలు పాతడానికి తీసిన గోతులను బట్టి ఇళ్ళు ఆకారాలను నిర్ణయించవచ్చును. కొయ్య గుంజలు ప్రమాదవశాత్తు తగలబడితే వాటి నిదర్శనాలు చిరకాలం భూమిలో అలాగే ఉంటాయి. ఇలా తగలబడిన చిన్న ఇట్లు ఒకటి మధ్యప్రదేశ్‌లోని నవదతోలిలో జరిగిన త్రవ్వకాలలో బయల్పడింది.

## 2.2.7. కోటలున్న స్థలాలలో ఉత్ఖాతనాలు :

కందకము, ప్రాకారము ఉన్న కోటలుగల ప్రదేశాలలో ఉత్కాతనాలు అనురించాల్సిన పద్ధతులు వేరుగా ఉంటాయి. ఇటువంటి సందర్భాలలో ప్రాకారం వద్ద, ప్రాకార ద్వారాల వద్ద, కోట మధ్య భాగాన పరిఖలు ఏర్పాటు చేసి తవ్వకాలు జరిపి, లభించిన అవశేషాలను సక్రమంగా సమన్వయము చేసినపుడు సంపూర్ణ స్థల వాఖ్యలు తయారుచేయవచ్చును. ఇటువంటి స్థలాలు గుంటూరుజిల్లా ధరణికోట, విశాఖపట్టణం జిల్లాలో వడ్డాది, శ్రీకాకుళం జిల్లాలోని దంతవరపు కోట మొదలగు చోట్ల ఉన్నాయి.

## 2.2.8. బృహచ్ఛిలాయుగ సమాధుల ఉత్ఖాతనం :

బృహాశ్ఛిలాయుగ సమాధులున్న స్థలాల్లో జరిపే ఉత్ఖాతనంలో కొన్ని ప్రత్యేక పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది. మరణించినవారికి ఖననం, దహనం అనే రెండు రకాల మృత సంస్కారాలు చేస్తారు. పూర్వ కాలంలో దహన క్రియ జరిగిన ప్రదేశాలను గుర్తించటం కష్టము. ఒకవేళ గుర్తించినా అక్కడ తవ్వకాలు జరిపినా బయల్పడే అంశాలు కూడా స్వల్పమే.

బృహాశ్ఛిలాయుగంలో ఖనన విధానము అనేక రకాలుగా ఉండేది. వాటిలో గొయ్యి తీసి అందులో శవాన్ని గాని, ఎముకలనుగా పూడ్చడం సాధారణమైన పద్ధతి. మరొక పద్ధతిలో గోతులలో రాతి పలకలను శవపేటిక వలె నిర్మించి అందులో శవాన్ని లేదా శవం తాలుకు అస్థికలుంచడం, కొన్ని సమాధులలో మట్టితో చేసిన శవపేటికల (Sarcophagus) లో శవాన్ని ఉంచేవారు. మరికొన్ని సమాధులలో చనిపోయిన వారి ఎముకలుంచి పెద్ద మట్టి కుండలు / బానలుంటాయి. కొన్ని సమాధులను ఒకరికన్నా ఎక్కువ మందిని ఖననం చేయడానికి ఉపయోగిస్తారు. ఇటువంటి సమాధులు కుటుంబ సమాధులు. బృహాశ్ఛిలాయుగంలో సమాధులలో శవంతోపాటు ఆభరణాలు, కుండలు, పనిముట్లు మొదలగు అనేక వస్తువులుంచి ఖననం చేసేవారు. ఈ సమాధుల వద్ద జరిగే తవ్వకాలు వాటికి సంబంధించిన అన్ని అంశాలు బయల్పడే రీతిలో ఉండాలి. ఇటువంటి స్థలాల్లో ఉత్ఖాతనము వృత్త పాద పద్ధతి (Quadrant Method) లో జరిపినట్లయితే అన్ని అంశాలు విశదమవుతాయి. ఈ పద్ధతిలో సమాధి ఉపరితలాన్ని నాలుగు సమభాగాలుగా పరిఖలు ఏర్పాటు చేసి అందులో రెండేసి ఎదురు భాగాలను ఒకసారి చొప్పున తవ్వుతారు.

## 2.2.9. త్రవ్వకాలలో బయల్పడిన వస్తు సంరక్షణ :

త్రవ్వకాలు జరిగినపుడు అనేక శతాబ్దాలుగా భూమిలో నిక్షిప్తమైన వస్తువులు ఒక్కసారిగా బయటకు రావటం వలన అవి క్షీణించి వాటి స్వరూప స్వభావాలను కోల్పోయే ప్రమాదం ఉన్నది. అందువలన అవి ఎక్కువ కాలం ఉండాలంటే వాటికి కొంత ప్రథమ చికిత్స అవసరం. ఎముకలు, కొయ్య వస్తువులు, మొదలగు వాటిని గట్టి పరచుటకు వినైల్ ఎసిటేట్ (Vinyl acetate), ద్రావణాన్ని ఉపయోగిస్తారు. థైమోల్ (Thymol) అనే రసాయనాన్ని ఉపయోగించి క్రిమికీటకాల నుండి వాటిని రక్షిస్తారు.

లోహాలలో త్వరగా ఇనుము తుప్పు పడుతుంది. ఎలక్ట్రోలిటిక్ (Electrolytic) పద్ధతిలో ఇనుప వస్తువులను హానికర ద్రవ్యాల నుండి వేరు చేసిన తరువాత వాటికి పారాఫిన్ మైనపు (Peraffin Wax) పూత పూస్తారు. రాగి నాణేలను, వస్తువులను టార్టారికామ్లము (Tartaric acid) కాస్టిక్ సోడా (Caustic soda) లతో తయారు చేసిన ద్రావణంలో ఉంచి శుభ్ర పరుస్తారు.

బంగారు వస్తువులను మంచి నీటితో కడిగి శుభ్రపరుస్తారు. అవసరమైతే కామోయిన్ చర్మంతో రుద్దవచ్చును.

కుండపెంకులు ఎక్కువ సంఖ్యలో త్రవ్వకాలలో లభిస్తాయి. వీటిని నీటితో ఎప్పటికప్పుడు కడిగి కుంచెలతో రుద్ది శుభ్రపరుస్తారు. అయితే కుంచెలతో రుద్దేటప్పుడు పెంకులపైనున్న వర్ణచిత్రాలు చిరిగిపోకుండా జాగ్రత్త వహించాలి.

## 2.2.10. ఫోటోలు - చిత్రాలు :

ఉత్ఖాతనంలో లభించిన ఫలితాలను సప్రమాణంగా ఇతరులకు తెలియచేయడం కూడా ఉత్ఖాతకుల కార్యక్రమంలో ఒక ముఖ్యాంశమే. వీరు చూపే ప్రమాణాలు రెండు రకాలుగా ఉంటాయి. అవి 1. కొలతలకు అనుగుణంగా గీసిన చిత్రాలు 2. ఫోటోలు. అందువల్ల ఉత్ఖాతనం జరిపేటప్పుడు చిత్రకారులు, ఫోటోగ్రాఫర్లు ఉండటం త్రవ్వకాల కార్యక్రమంలో ఎంతో అవసరం. ఉత్ఖాతకునికి కూడా ఈ విద్యలలో కొంత ప్రవేశం ఉండటం అవసరం. పరిఖా పర్యవేక్షకులు స్తర విన్యాసాలను,కట్టడాల ఆకారాలను, కొలతలను అనుగుణంగా బొమ్మలను గీసి ఉంచాలి. ఉత్ఖాతన సందర్భములో తీసే ఫోటోలు వాస్తవికతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. ప్రతి ఫోటోలోను పురాతన వస్తువు నిజ పరిమాణాన్ని ఊహించుటకు వీలుగా ఒక కొలత బద్ధ ఉండాలి. ఒక్కొక్కసారి అవసరాన్ని బట్టి మనుష్యులనే కొలతబద్ధలుగా వినియోగిస్తారు. అటువంటి సమయాలలో వస్తు ప్రాధాన్యానికి ఎటువంటి లోపము జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలి.

## 2.2.11. నివేదిక :

ఉత్ఖాతకము పూర్తి అయిన తరువాత తాము కనుగొన్న విషయాలను ఒక నివేదిక రూపంలో ప్రకటించే బాధ్యత కూడా ఉత్ఖాతకుల మీద ఉన్నది. నివేదికను సరళశైలిలో, ఒక క్రమ పద్ధతిని అనుసరించి రచించవలెను. ఈ నివేదికలో స్థల వర్ణనము, ఆ స్థలములో ఉత్ఖాతన జరుపడానికి కారణము, త్రవ్వకము జరిగిన తీరు, వెలువడిన విషయ సారాంశము, లభ్యమయిన వస్తు వివరణ (Description of finds) మొదలగు విషయాలను వివరించవలెను. నివేదిక ప్రచురణ ఆలస్యమైతే అందులో ప్రజల ఆసక్తి తగ్గడమే కాక ఉత్ఖాతకులే అనేక విషయాలను మరచిపోయే ప్రమాదమున్నది. నివేదిక ప్రచురించకపోయినట్లయితే ఆ ఉత్ఖాతనము వలన ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాక, ఒక ప్రాచీన స్థలాన్ని నాశనం చేసినట్లు కూడా అవుతుంది.

## కాల నిర్ణయ పద్ధతులు :

## 2.3. ఉపోద్ఘాతము :

అన్వేషణలోను, త్రవ్వకాలలోను లభ్యమైన పురావస్తు అవశేషాలను పరిశీలించి పురావస్తు శాస్త్రవేత్త నివేదికలను తయారు చేస్తాడు. ఈ నివేదికలను రూపొందించేటప్పుడు పురావస్తు అవశేషాలకు కాల నిర్ణయం చేయవలసి ఉంటుంది. అన్వేషణలో త్రవ్వకాలలో లభించిన వస్తువులు ఏకాలానికి చెందినవో నిర్ణయించుటకు కొన్ని వేల నిర్ణయ పద్ధతులున్నాయి. యీ కాల నిర్ణయ పద్ధతులను రెండు రకాలుగా విభజించవచ్చును. అవి.

1. సాపేక్ష కాల నిర్ణయ పద్ధతి (Relative dating Method)
2. నిరపేక్ష కాల నిర్ణయ పద్ధతి (Absolute dating Method)

యీ రెండు కాల నిర్ణయ పద్ధతులలో నిరపేక్ష కాల నిర్ణయ పద్ధతి శాస్త్రీయ పద్ధతి. దీనిని క్రోనోమెట్రిక్ కాల నిర్ణయ పద్ధతి (Chronometric dating method) అని కూడా వ్యవహరిస్తారు.

## 2.3.1. సాపేక్ష కాల నిర్ణయ పద్ధతి :

గతంలో జరిగిన త్రవ్వకాలలో లభించిన వస్తువులకు కాల నిర్ణయం చేసి ఉన్నట్లయితే ప్రస్తుతం త్రవ్వకాలలో లభించిన వస్తువులు అదే సంస్కృతికి చెందిన వస్తువులైనట్లయితే వాటితో పోల్చి చూసి కాల నిర్ణయం చేయవచ్చును. ఇటువంటి కాల నిర్ణయ పద్ధతిని 'సాపేక్ష కాల నిర్ణయ పద్ధతి' అంటారు. కాని ఈ పద్ధతి అన్ని సమయాలలో పనికిరాదు.

**2.3.1.1.** స్తరాల అధ్యయనం (Stratigraphy) : ఈ పద్ధతి మట్టి పొరలకు సంబంధించినది. ఒక ప్రాచీన పట్టణము లేదా గ్రామమున్న ప్రదేశములో త్రవ్వకాలు జరిపినపుడు మట్టి పొరలు ఒకదానిపై ఒకటి పేర్చినట్లు కనిపిస్తాయి. ఈ పొరలనే స్తరాలు (Layers/ Strata) అని అంటారు. ఈ పొరలలో అడుగున వున్న పొర ప్రాచీనమైనది దానిపైన ఉన్న పొర క్రింది పొర తరువాత కాలానికి చెందినది. అంటే పైన ఉన్న మట్టి పొరకంటె క్రింది వున్న మట్టి పొర ప్రాచీనమైనది. ఈ స్తరాలలో లభించే వస్తువులను అవి లభ్యమైన పొరలను బట్టి సాపేక్ష కాల నిర్ణయం చేయవచ్చును. కాని కొన్ని సమయాలలో ప్రకృతి వైపరీత్య కారణంగాను లేదా మానవులు పూర్వము అక్కడ తవ్వినందువలనకాని ఈ సరాలలో మార్పులు వచ్చి ఉండవచ్చును. పురావస్తు శాస్త్రవేత్త స్తరాల అధ్యయనంలో జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

**2.3.1.2.** సంఘీకరణ (Association) : ఒక ప్రాచీన ప్రదేశంలో జరిగిన త్రవ్వకాలలో అనేక రకాల పురావస్తు సముదాయం లభించడం వల్ల అవి ఒకే కాలానికి చెందినవని కాల నిర్ణయం చేయడానికి వీలవుతుంది. ఈ విధముగా వస్తు సముదాయానికి కాల నిర్ణయం చేయడాన్ని సంఘీకరణ అంటారు. ఉదాహరణకు, ఒక స్తరంలో కొన్ని వస్తువులు లభించాయి. వాటిలో ఒక నాణెము కూడా ఉన్నది. ఈ

స్తరంలో లభించినవన్నీ ఒకే కాలానికి చెందినవి. లభించిన నాణెమును పరిశీలించి కాల నిర్ణయం చెయ్యడం సులభం. నాణెము ఏ కాలానికి చెందినదో ఆ పొరలో లభించిన వస్తువులు కూడా అదే కాలానికి చెందినవని నిర్ణయించవచ్చును.

**2.3.1.3. క్రమానుగత కాల నిర్ణయ పద్ధతి** (Cross Dating) : ఒక సంస్కృతి కాలాన్ని ఇది వరకే నిర్ణయించి ఉంటారు. తెలిసిన సంస్కృతి కాలాన్ని బట్టి తెలియని సంస్కృతి కాలాన్ని నిర్ణయించే పద్ధతిని 'క్రమానుగత కాల నిర్ణయం' అంటారు. హరప్పాలో జరిగిన త్రవ్వకాలలో ఐదవ స్తరంలో సుమేరియా నాగరికతకు చెందిన ముద్రిక లభించింది. సుమేరియా నాగరికతకు చెందిన ఆ ముద్రికకు అంతకుముందే కాల నిర్ణయం జరిగింది. అందువలన హరప్పాలో ఆ ముద్రిక లభించి స్తరం ఏ కాలానికి చెందినదో సులభంగా నిర్ణయించవచ్చును.

**2.3.1.4. వర్గీకరణ** (Typology) : ఈ పద్ధతిలో త్రవ్వకాలలో లభించిన వస్తువులను ఆ వస్తువుల తయారీలో నైపుణ్యం, ఆకారాలను బట్టి వర్గీకరిస్తారు. ఆ వస్తువుల ఆకారాన్ని బట్టి కాల నిర్ణయం చేయవచ్చును. ఉదాహరణకు త్రవ్వకాలలో లభించిన ఆయుధాలు, ఆభరణాలు, మట్టి పాత్రలు, మొదలగునవి లభించినపుడు ఈ వస్తువులు ఏ పదార్థంలో తయారు చేయబడినవి, వాటి ఆకారం, పనిలో నైపుణ్యం మొదలగు అంశాలను అధ్యయనం చేసి ఆ వస్తువుల కాలాన్ని నిర్ణయించవచ్చును. వస్తువుల తయారీలో నైపుణ్యము కాలక్రమేణా అభివృద్ధి చెందుతుంది. అందువలన ప్రాచీన కాలానికి చెందిన వస్తువులు మొరటుగాను నవీన కాలానికి చెందిన వస్తువులు నాణ్యంగాను ఉంటాయి. వర్గీకరణ పద్ధతిలో సాపేక్ష కాల నిర్ణయం మాత్రమే చేయగలం.

## 2.3.2. నిరపేక్ష కాల నిర్ణయ పద్ధతి :

నిరపేక్ష కాల నిర్ణయ పద్ధతి శాస్త్రీయ పద్ధతిగా అంగీకరించబడింది. ఈ పద్ధతిలో 19 రకాల కాల నిర్ణయ పద్ధతులున్నాయి. వాటిలో ముఖ్యమైనవి 1. కార్బన్ 14 పద్ధతి, 2. పురావస్తు ఆకర్షణ పద్ధతి (Archaeo-Magnetism), 3. థర్మోలు మినిసెన్స్ (Thermoluminescence), 4. వృక్ష వలయ పద్ధతి (Dendro Chronology or Tree ring analysis), 5. వార్వ్ పద్ధతి (Varve analysis), 6. అబ్సీడియన్ డేటింగ్ (Obsidian dating).

**2.3.2.1. కార్బన్ 14 పద్ధతి** (Radio Carbon method or Carbon 14 method) : కార్బన్ 14 కాల నిర్ణయ పద్ధతిని అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన W.F. లబ్బీ అనే శాస్త్రజ్ఞుడు 1947లో కనిపెట్టాడు. కాస్మిక్ రేడియేషన్ వల్ల ఉత్పత్తి అయిన న్యూట్రాన్లు వాతావరణంలో ప్రవేశించి నైట్రోజన్ ఐసోటోప్ $N^{14}$ తో ప్రతిచర్య పొందుతాయి. ఫలితంగా $C^{14}$ అనే కార్బన్ హెవీ ఐసోటోప్ ఉత్పత్తి అవుతుంది. $C^{14}$ రేడియో ధార్మిక పదార్థము. కార్బన్ 14 వాతావరణంలోని ఆక్సిజన్‌తో కలసి కార్బన్ డయాక్సైడ్‌గా మారుతుంది. ఈ కార్బన్ డయాక్సైడ్ చెట్లకు ప్రధాన ఆహారం. ఈ కార్బన్ డయాక్సైడ్‌లో కర్బన్ 14 ధాతువు కూడా ఉంటుంది. జంతువులు కొన్ని చెట్లను ఆహారంగా ఉపయోగించి జీవిస్తున్నాయి. కాబట్టి జంతువులలో కూడా కార్బన్ 14 ధాతువు ఉంటుంది. జంతువు కాని చెట్టుకాని మరణించిన తరువాత కార్బన్ 14 ధాతువును స్వీకరించవు. అంతేకాక అవి మరణించిన తరువాత కార్బన్ 14 రేడియో ధార్మికము కనుక దాని క్షీణత మొదలవుతుంది. ఆ జీవులు మరణించినప్పటి నుండి 5730 సంవత్సరాలకు వాటిలోని కార్బన్ 14లోని సగ భాగం క్షీణిస్తుంది. ఈ 5730 సంవత్సరాలను కార్బన్ 14 అర్థ జీవితకాలమంటారు. వృక్షం లేదా జంతు అవశేషాలు త్రవ్వకాలలో లభించినపుడు వాటిలో మిగిలి ఉన్న కార్బన్ 14 ఎంత శాతం ఉన్నది నిర్ణయిస్తే ఆ జీవి ఎప్పుడు మరణించిందో తెలుస్తుంది.

కార్బన్ 14 పద్ధతి ద్వారా కాలాన్ని నిర్ణయించడానికి పురావస్తు అవశేషాలను ఎన్నుకొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు అవసరం. త్రవ్వకాల ద్వారా ఎంచుకున్న వస్తువులలో నూతన కాలపు కార్బన్ 14 ప్రవేశించడానికి వీలులేని వాటిని ఎన్నుకోవలెను. భూమిలోపలనున్న పురావస్తువుల పై భాగం నుండి నీటి ద్వారా కిందికి దిగిన హ్యూమిక్ ఆమ్లాలు ప్రాచీన వస్తువులలో నూతన కార్బన్ 14ను ప్రవేశపెట్టగలవు. అంతేకాకుండా ప్రాచీన చారిత్రక ప్రదేశాల ఉపరితలంలో పెరుగుతున్న చెట్ల వేళ్ళు భూమి లోపలికి చొచ్చుకొని పోయి స్తరాలలో నిక్షిప్తమై ఉన్న పురావస్తు అవశేషాలలో నూతన కార్బన్ 14ను ప్రవేశపెట్టగలవు. త్రవ్వకాల ద్వారా వెలికి తీసిన అవశేషాలను ఆ తరువాత వాటిలో నూతన కార్బన్ 14 చేరకుండా చూడటానికి ఆ వస్తువులను పోలిథీన్ సంచులలో భద్రపరచవలెను. నూతన కార్బల్ ఒక పురాతన వస్తువులో ప్రవేశిస్తే ఆ

వస్తువుకు నూతన కాలాన్ని నిర్ణయించే ప్రమాదమున్నది. అందువలన పురావస్తు శాస్త్రవేత్తలు పురావస్తువులకు ముందు రసాయనిక చర్యల ద్వారా వాటిలోని మలినాలను తొలగించిన తరువాత ఆ వస్తువులకు కాలాన్ని నిర్ణయించేందుకు ఎన్నుకొంటారు.

కార్బన్ **14** కాలయ నిర్ణయ పద్ధతిలో త్రవ్వకాలలో దొరికిన బొగ్గు, కొయ్య, పీట్ (Peat), ఎముక, గుల్ల మొదలగు వస్తువుల కాల నిర్ణయం చేయవచ్చును. దాదాపు **70000** సంవత్సరాల నాటి వస్తువులపైకూడా ఈ పద్ధతిని ప్రయోగించి కాల నిర్ణయం చేయవచ్చును. ఈ కాల నిర్ణయ పద్ధతిలో త్రవ్వకాలలో లభించిన కొయ్య మొదలగు వాటిని ప్రయోగశాలలో ఉష్ణీకరింపబడి కార్బన్‌గా మార్చుతారు. వేడి చేసినపుడు ఆ వస్తువులలో నుండి కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి అవుతుంది. ఈ కార్బన్ డయాక్సైడ్‌లో కార్బన్ **14** ధాతువులుంటాయి. గైగర్-ముల్లర్ కార్బన్ **14** ధాతువులను వేరుపరచి అవి ఎంత శాతం ఉన్నది లెక్కిస్తుంది. బ్రతికి ఉన్న చెట్టులో కార్బన్ **14** ఎంత నిష్పత్తిలో ఉన్నది శాస్త్రవేత్తలకు తెలుసు. ప్రాచీన వస్తువులోని కార్బన్ **14** ఎంత నిష్పత్తిలో ఉన్నది లెక్కించి ఆ వస్తువు ఏకాలానికి చెందినదో నిర్ణయిస్తారు. ఉదాహరణకు త్రవ్వకాలలో లభించిన కొయ్యముక్కలో కార్బన్ **14** ధాతువులు సగభాగం ఉన్నట్లయితే ఆ కొయ్య **5730** సంవత్సరాల నాటిది. లిబ్బీ ఈ కాల నిర్ణయంలో **30** సంవత్సరాలు తేడా ఉండవచ్చునని అన్నాడు.

**2.3.2.2. పురావస్తు ఆకర్షణ పద్ధతి** (Archaeo - Magnetism) **:** రేడియో కార్బన్ **14** పద్ధతి త్రవ్వకాలలో లభించే శిలా, మృణ్మయ వస్తువుల కాల నిర్ణయానికి ఉపయోగపడదు. అందువలన త్రవ్వకాలలో లభించిన రాతి, మట్టితో చేసిన వస్తువుల కాలాన్ని నిర్ణయించటానికి పురావస్తు ఆకర్షణ పద్ధతి (Archaeo - Magnetism) ని ఉపయోగిస్తారు. రాతి, మట్టి వస్తువులలో ఇనుప ధాతువులుంటాయి. ఈ ఇనుపదాతువులకు ఆకర్షణ శక్తి ఉంటుంది. ప్రయోగశాలలో ఈ వస్తువులను $500^0$ నుండి $600^0$ వరకు వేడి చేసినపుడు ఆకర్షణ శక్తి గల ఇనుపధాతువులు విసర్జించబడతాయి. ప్రయోగశాలలో ఈ ఆకర్షణ శక్తి స్వరూపాన్ని పరీక్షించడానికి వీలవుతుంది. భూమి ఆకర్షణ శక్తి స్వరూపంలోని తేడాలను గ్రాఫ్ రూపంలో గీచి రెండింటి మధ్య తేడాలను గమనించి ఆ వస్తువులకు కాల నిర్ణయం చేయవచ్చును.

**2.3.2.3. థర్మోలు మినిసెన్స్** (Thermoluminiscence) **:** త్రవ్వకాలలో లభించిన పాత్రలు, శిలలు కాల నిర్ణయానికి ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ వస్తువులు వాటిలో ఉన్న రేడియో ధార్మిక శక్తిని కాల క్రమేణా కోల్పోతాయి. ఈ రేడియో ధార్మికము శక్తిని కొలవడానికి సాధ్యమవుతుంది. ఈ వస్తువులను వేడి చేసినపుడు థోరియమ్, యురేనియమ్ మొదలగు రేడియో ధార్మిక ధాతువులుగా విడిపోయి కొంత కాంతిని సృష్టిస్తాయి. ఈ కాంతి సాంద్రత వస్తువులలోని రేడియో ధార్మిక శక్తిపై ఆధారపడి ఉంటుంది. ప్రయోగశాలలో ఈ వస్తువులను $750^0C$ వద్ద వేడి చేసినపుడు ఉత్పత్తి అయ్యే కాంతిని ఫోటో మల్టిప్లయర్ (Photo Multiplier) అనే సాధనంతో కొలవవచ్చును. ఈ పద్ధతిని **1953**లో ఫారింగ్‌టన్ డేనియల్స్ అనే విస్కాన్సిన్ విశ్వవిద్యాలయ శాస్త్రజ్ఞుడు కనుగొన్నాడు. **1960** సంవత్సరంలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన G. కెనెడి ఈ పద్ధతిపై విస్తృతంగా పరిశోధించాడు. మృణ్మయ పాత్రల కాల నిర్ణయానికి ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది.

**2.3.2.4. వృక్ష వలయ పద్ధతి** (Dendro Chronology/Tree Ring Analysis) **: 1929**లో A.E. డగ్లాస్ అనే శాస్త్రవేత్త పురాతన వృక్షాల కాలాన్ని నిర్నయించుటకు వృక్ష వలయ పద్ధతిని కనుగొన్నాడు. చెట్టు పెరుగుతున్న సమయంలో వాటి కాండం చుట్టు ఒక్కొక్క పొరను ఏర్పరచుకొంటూ పెరుగుతాయి. చెట్టు కాండాన్ని అడ్డుకోత కోసి చూసినపుడు కాండం మధ్యనుంచి చివరి వరకు చక్రాల వలె పొరలు ఒకదాని తరువాత ఇంకొకటి ఏర్పడి ఉంటాయి. వీటిని కాండ చక్రాలు / వృక్ష వలయాలు (Tree rings) అంటారు. ఈ పొరలు సంవత్సరానికి ఒకటి చొప్పున ఏర్పడతాయి. వాతావరణాన్ని బట్టి ఈ పొరలు మందంగాను లేదా పల్చగాను ఏర్పడతాయి. ఈ పొరలలోని కణాలు (Wood Cells) వసంత ఋతువులో ఏర్పడినవి పెద్దవిగాను, శరదృతువులో ఏర్పడినవి చిన్నవిగాను ఉంటాయి. అంటే ఒక సంవత్సరంలో తయారైన పొర పెద్ద కణాల నిర్మాణంలో మొదలై చిన్న కణాలతో ముగుస్తుంది. వృక్ష కాండ పొరలను లెక్కించినప్పుడు ఆ చెట్టు వయస్సు తెలుస్తుంది. త్రవ్వకాలలో లభించిన కొయ్య, దూలాలకు ఈ పద్ధతి ద్వారా కాల నిర్ణయం చేయవచ్చును. కోనిఫర్ (Conifer) వృక్షాలకు సంబంధించిన దుంగలకు కాల నిర్ణయం చేయటానికి ఈ పద్ధతి చాలా అనువైనది. ఈ పద్ధతిలో **2000** సంవత్సరాల వరకే కాల నిర్ణయాన్ని చేయవచ్చును.

**2.3.2.5. వార్వ్ పద్ధతి** (Varve dating) : మంచు పర్వతాల ప్రాంతాలలోని మంచు కరిగి నీరై పరిసర ప్రాంతాలలోని సరస్సులలోకి ప్రవహించినపుడు ఆ నీటిలో పాటు కొట్టుకొని వచ్చిన ఇసుక/మట్టి రేణువులు (Silt) సరస్సుల అడుగుభాగానికి చేరుకొని పొరలుగా ఏర్పడుతుంది. మంచుకరగడం ఆగిపోయినపుడు ఇసుక/మట్టి రేణువులు (Silt) పేరుకోవడం ఆగిపోయి మరల మంచు కరిగినపుడు సరస్సుల్లో పాత పొరపై కొత్త సిల్ట్ పొర ఏర్పడుతుంది. ఇటువంటి పొరలు మొదటి సారిగా స్వీడన్‌లో గమనించడం జరిగింది. వీటిని వార్వ్స్ అని అంటారు. బారన్ గెరాడ్ డిగీర్ 1878లో మొదటిసారిగా ఈ పదాన్ని ఉపయోగించాడు. ఒక వార్వ్‌లో రెండు రకాల అవక్షేపాలుంటాయి. వీలో వార్వ్ అడుగుభాగానికి చేరినవి పెద్ద పరమాణువులు, పైభాగానికి చేరినవి చిన్న పరమాణువులు, పెద్ద పరమాణువులు వేసవి కాలాన్ని చిన్న పరమాణువులు చలి కాలాన్ని సూచిస్తాయి. వేసవిలో మంచు ఎక్కువగా కరగడం వల్ల నీటి ప్రవాహం ఎక్కువై పెద్ద పరమాణువులు త్వరగా సరస్సుల క్రింది భాగానికి చేరుకుంటాయి. చలి కాలంలో మంచు కరగడం ఆగిపోవటంతో నీటి ప్రవాహం ఆగిపోతుంది. అప్పుడు సరస్సునీటిలోని చిన్న పరమాణువులు మెల్లమెల్లగా అడుగుకు చేరి అంతకు ముందు వేసవిలో ఏర్పడిన పెద్ద పరమాణువుల పొరపై ఒక పొరగా నిలుస్తాయి. ఈ రెండు పొరలు కలసి ఏర్పడిన జతను వార్వ్స్ అంటారు. ఒక వార్వ ఒక సంవత్సరకాలాన్ని సూచిస్తుంది. నదులు, సరస్సు ప్రాంతాలలో త్రవ్వకాలలో లభించిన వస్తువులకు ఈ పద్ధతిలో కాల నిర్ణయం చేయవచ్చును. వార్వ్ పద్ధతి ఎక్కువగా స్కాండినేవియా దేశాలలో ఉపయోగిస్తున్నారు. ఈ పద్ధతిలో 17000 సంవత్సరాల నాటి వస్తువులకు కాల నిర్ణయం చేయవచ్చును.

**2.3.2.6. అబ్సిడియన్ కాల నిర్ణయ పద్ధతి** (Obsidian dating) : అగ్ని పర్వతాల నుండి వెలువడిన లావా అతి త్వరగా చల్లారినపుడు అబ్సిడియన్ శిలగా మారుతుంది. ఇది గాజు వలె, ఉండి బూడిద రంగులోను లేదా నలుపు రంగులోను ఉంటుంది. అబ్సిడియన్‌ను రాతి పనిముట్ల తయారీకి, పూసలు, మొదలగు వాటిని తయారుచేసుకోనుటకు ప్రాచీన కాలపు మానవుడు ఉపయోగించాడు. ఇటువంటి వస్తువులు ఎక్కువగా ఐరోపా, మధ్య అమెరికా దేశాలలోను, టర్కీలోను లభించాయి. అబ్సిడియన్‌ను వేడి చేసినపుడు అది కొన్ని భౌతిక మార్పులకు గురౌతుంది. నీరు ఈ పదార్థంలో ప్రవేశించి పొరవలె ఏర్పడుతుంది. వేడిని బట్టి పొరల రూపాలు మారుతాయి. అబ్సిడియన్‌పై ఏర్పడే ఈ పొరలను బట్టి కాల నిర్ణయం చేయవచ్చును.

పురావస్తు శాస్త్రవేత్త అన్వేషణలో, త్రవ్వకాలలో లభించిన వస్తువులకు సాపేక్ష, నిరపేక్ష పద్ధతుల ద్వారా కాల నిర్ణయం చేసి ఆ వస్తు సముదాయాన్ని విషయ వ్యాఖ్యానం చేస్తాడు.

## 2.4. సారాంశము :

ప్రాచీన స్థలాల్లో పురావస్తు శాస్త్రవేత్తలు ఆ స్థల ప్రాముఖ్యతను ప్రాచీనతను బయటకు తీయుటకు అవసరాన్ని బట్టి ఉత్ఖాతనలోని పద్ధతులు అయిన పరిఖ అల్ప ప్రామాణ ఉత్ఖాతనాలు చేస్తారు. అలాగే ఉత్ఖాతనల ద్వారా బయల్పడిన అవశేషాల సంరక్షణా బాధ్యత తీసుకొంటూ అలా లభ్యమైన పురావస్తు అవశేషాలను కాల నిర్ణయం చేయుటకు అవసరాన్ని బట్టి సాపేక్షక కాల నిర్ణయ పద్ధతి నిరపేక్షక కాల నిర్ణయ పద్ధతులను ఉపయోగిస్తారు.

## 2.5. నమూనా ప్రశ్నలు :

1. అన్వేషణ అనగానేమి వివరింపుము ?
2. ఉత్ఖాతనము అనగానేమి మరియు ఉత్ఖాతన పద్ధతులను వివరింపుము ?
3. పురాతత్వ వస్తువుల యొక్క కాల నిర్ణయము చేయు వివిధ పద్ధతులు తెలుపుము ?

**- కె. శ్రీనివాసులు**

పాఠం - 3

# చరిత్ర పూర్వయుగము

## 3.0. లక్ష్యం :

చరిత్ర పూర్వయుగం అంటే ఏమిటి ? చరిత్ర పూర్వయుగంలో ఎన్ని దశలున్నాయి. ఆహార సేకరణ దశ నుండి ఆహారోత్పత్తి దశకు ఎలా చేరుకున్నాయో మొదలగు అంశాలను వివరించుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :


3.1. ఉపోద్ఘాతము

3.2. ప్రాచీన శిలాయుగము

3.2.1. పూర్వ ప్రాచీన శిలాయుగము

3.2.2. ఆంధ్రప్రదేశ్‌లో పూర్వ ప్రాచీన శిలాయుగపు స్థావరాలు

3.2.3. మధ్య ప్రాచీన శిలాయుగము

3.2.4. పనిముట్లు

3.2.5. మధ్య ప్రాచీన శిలాయుగ స్థావరాలు

3.2.6. ఉత్తర ప్రాచీన శిలాయుగ స్థావరాలు

3.2.7. పనిముట్లు

3.2.8. భారతదేశములో ఉత్తర ప్రాచీన శిలాయుగాలు

3.2.9. కాలము

3.3. మధ్య శిలాయుగము

3.3.1. పనిముట్లు

3.3.2. సూక్ష్మ శిలాయుగ స్థావరాలు

3.3.3. చరిత్ర పూర్వయుగ వర్ణచిత్రాలు

3.3.4. కాలము

3.3.5. ప్రజా జీవన శైలి

3.4. నవీన శిలాయుగము

3.4.1. నవీన శిలాయుగ లక్షణాలు

3.4.2. నవీన శిలాయుగ పనిముట్లు

3.4.3. నవీన శిలాయుగపు సంస్కృతులు

3.4.3.1. ఉత్తర భారత నవీన శిలాయుగ సంస్కృతి

3.4.3.2. తూర్పు భారతీయ నవీన శిలాయుగ సంస్కృతి

3.4.3.3. దక్షిణ భారత నవీన శిలాయుగము

3.4.4. బూడిద కుప్పలు

3.5. సారాంశము

## 3.1. ఉపోద్ఘాతము :

ఐదు లక్షల సంవత్సరాల క్రితం భారతదేశంలో మానవుడతరించాడు. అప్పటి నుండి నేటి వరకు గల చరిత్రను చరిత్ర పూర్వయుగమని, చారిత్రక యుగమని చరిత్రకారులు విభజిస్తున్నారు. మానవునికి చదవడం, వ్రాయడం తెలిసిన కాలం నుండి నేటి వరకు ఉన్న కాలాన్ని చారిత్రక యుగమని, మానవునికి లిపి తెలియని కాలాన్ని చరిత్ర పూర్వయుగమని అంటారు. చరిత్ర పూర్వయుగాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చును. అవి. 1. శిలాయుగము, 2. లోహయుగము.

శిలాయుగాన్ని తిరిగి 3 భాగాలుగా విభజించారు.

1) ప్రాచీన శిలాయుగం (Palaeolithic Age),

2) సూక్ష్మ శిలాయుగం లేదా మధ్య శిలాయుగం (Mesolithic Age),

3) నవీన శిలాయుగం (Neolithic Age)

## 3.2. ప్రాచీన శిలాయుగం లేదా పాత రాతియుగం (Palaeolithic Culture) :

భారతదేశంలో మొదటిసారిగా చెన్నై సమీపంలోని పల్లవరంలో 1863లో రాబర్ట్ బ్రూస్ ఫుట్ ప్రాచీన శిలాయుగానికి చెందిన రాతి గొడ్డలిని కనుగొన్నాడు. మన దేశములో లభ్యమయిన పాత రాతియుగ పనిముట్లకు దక్షిణాఫ్రికాలలో లభించిన పనిముట్లకు పోలికలున్నాయి. భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో పాత రాతియుగము నాటి పనిముట్లు లభించాయి. వీటి వలన ప్రాచీన శిలాయుగ మానవుడు అరణ్యాలలోను, నదీలోయలలోను సంచరించినట్లు తెలుస్తున్నది. ఈయుగంలో మానవుడు పశుప్రాయుడు. వేట, ఆహారసేకరణ మాత్రమే తెలుసు.

ప్రాచీన శిలాయుగాన్ని తిరిగి మూడు అంతర్దశలుగా విభజించారు. అవి :

1) పూర్వ ప్రాచీన శిలాయుగము (Lower Palaeolithic Culture)

2) మధ్య ప్రాచీన శిలాయుగము (Middle Palaeolithic Culture)

3) ఉత్తర ప్రాచీన శిలాయుగము (Upper Palaeolithic Culture)

ఈ శిలాయుగ విభజన పనిముట్లు తయారు చేసుకోవటానికి ఉపయోగించిన శిలలు, పనిముట్ల ఆకృతులు, మానవుడు ఆహారము సంపాదించిన విధానము మొదలగు అంశాలను అనుసరించి జరిగింది.

**3.2.1. పూర్వ ప్రాచీన శిలాయుగము (Lower Palaeolithic Culture) :** పూర్వ ప్రాచీన శిలాయుగానికి చెందిన మానవులు తమ పనిముట్లను 1. దాగలి పద్ధతి (Anvil Technique), 2. రాతి సుత్తి పద్ధతి (Stone Hammer Technique), 3. స్థూపాకార సుత్తి పద్ధతి (Cylinder Hammer Technique) మొదలగు పద్ధతుల ద్వారా తయారు చేసుకున్నారు. ఈ యుగానికి చెందిన పనిముట్లలో గులకరాతి పనిముట్లు (Pebble tools), చేతి గొడ్డళ్ళు (Hand axes), గండ్రగొడ్డళ్ళు (Cleavers), చక్రాలు (Discoids), పలుగులు (Picks), చోపర్స్ (Choppers), చోపింగ్ పనిముట్లు (Chopping tools), అనేక రకాల గోకుడు రాళ్ళు (Scrapers), బహుభుజ ప్రతీకలు (Polyhedrons) ఉన్నాయి. ఈ పనిముట్ల తయారీకి మానవుడు కఠిన శిలలైన క్వార్ట్ జైట్ (Quartzite), క్వార్ట్జ (Quarts), చెర్ట్ (Chert) చాల్సిడొని (Chalcedony), శిలాజమైన కొయ్య (Fossil wood) మొదలగు ముడిపదార్థాలను ఉపయోగించాడు.

**ఎ. సోయానియన్ సంస్కృతి :** భారతదేశంలో ప్రాచీన శిలాయుగంలో రెండు ప్రత్యేక సంప్రదాయాలున్నాయి. అవి. 1. సోయానియన్, 2. అషులియన్ సోయానియన్ (సోహోనియన్) సంస్కృతి ఉప హిమాలయ ప్రాంతానికి పరిమితము. అషులియన్ సంస్కృతి భారత ద్వీప కల్పం అంతటా విభిన్న పర్యావరణ వ్యవస్థలలో వ్యాపించి ఉంది. సోయానియన్ సంస్కృతి ఉప హియాలయ మండలంలో సివాలిక్

కొండలలో కేంద్రీకృతం అయింది. ఈ సంస్కృతి జల ప్రవాహంలో అరిగిపోయిన గుండ్రని రాతి పనిముట్ల (Pebble tools) పరిశ్రమకు చెందింది. వీటిలో ముఖ్యమైన పనిముట్లు చోపర్లు (Choppers), చోపింగ్ పనిముట్లు (Chopping tools), అషులియన్ సంస్కృతిలో ముఖ్యమైన పనిముట్లు భారత ద్వీప కల్పంలో లభిస్తున్న చేతిగొడ్డళ్ళు, గండ్రగొడ్డళ్ళు. ఉప హిమాలయ మండలంలో 1970 తరువాత అషులిమన్ సంస్కృతికి చెందిన చేతిగొడ్డళ్ళు సివాలిక్ ముందు వరస శ్రేణుల వద్ద కనిపించాయి.

**అషులియన్ సంస్కృతి :** అషులియన్ సంస్కృతికి చెందిన పూర్వ ప్రాచీన శిలాయుగ స్థావరాలు భారతదేశమంతటా లభిస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి తమిళనాడులోని కొర్టాలయార్ లోయలోని అత్తిరాంపాకం, వడమధురై, కర్నాటకలోని మలప్రభ, ఘట ప్రభ, హంగ్సీ లోయలు, గోదావరి లోయలో గంగవాడి ప్రాంతం, గుజరాత్‌లోని సబర్మతిలోయ, రాజస్థాన్‌లో బనాస్, గంభీరి, చంబల్ లోయ, ధార్ ఎడారి సమీపంలోని దిద్వానా, మధ్యప్రదేశ్‌లోని నర్మదా లోయలో హోషంగాబాద్, నర్సింగపూర్, మహేశ్వర్, ఉత్తరప్రదేశ్‌లో గంగానది లోయలో మీర్జాపూర్ జిల్లా, బీహార్‌లో సింగ్ భుమ్ జిల్లా, పశ్చిమబెంగాల్ కాశీనది లోయలోను, ఒరిస్సా రాష్ట్రంలోని మయూర్ భంజ్, సంబాల్ పూర్ జిల్లాలు మొదలగునవి.

**3.2.2. ఆంధ్రప్రదేశ్‌లో పూర్వ ప్రాచీన శిలాయుగ స్థావరాలు :** ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర పూర్వయుగ పరిశోధన ప్రారంభించినవాడు రాబర్ట్ బ్రూస్ ఫూట్. ఆ తరువాత కామియేడ్, బర్నిట్, మాన్లి, జాయినర్, కృష్ణస్వామి, సౌందరరాజన్, H.D. సంకాలియా, బి. సుబ్బారావు మొదలగువారు విస్తృతంగా పరిశోధనలు జరిపారు. తిరుపతిలోయ, రాళ్ళ కాలువ, బొగ్గేరు, వెంకట గిరి, రాళ్ళవాగు, గుండ్లకమ్మ, సాగిలేరు, పెన్నాలోయ, గుంజనా లోయ, తుంగభద్ర, భవనాశి, కృష్ణాలోయ, గంభీరం లోయలో సూక్ష్మస్థాయి అధ్యయనం వలన ఎన్నో ప్రాచీన శిలాయుగ స్థావరాలు వెలుగులోకి వచ్చాయి. పూర్వ ప్రాచీన శిలాయుగంలో లభించిన చేతిగొడ్డళ్ళను బట్టి వాటిని మూడు సముదాయాలుగా విభజించవచ్చును. మొదటి సముదాయానికి చెందిన పనిముట్లు దాగలి పద్ధతిలో తయారు చేయబడినవి. రెండవ సముదాయములో రాతి సుత్తి పద్ధతి ప్రకారం తయారయిన పనిముట్లున్నాయి. మూడవ సముదాయంలో స్తూపాకార సుత్తి పద్ధతిలో తయారయిన పనిముట్లున్నాయి.

**3.2.3. మధ్య ప్రాచీన శిలాయుగం :** పూర్వ ప్రాచీన శిలాయుగపు తరువాత దశ మధ్య ప్రాచీన శిలాయుగం. ఈ శిలాయుగంలో క్వార్ట్ జైట్ వంటి శిలలతోపాటు సులభంగా పగిలే చెర్ట్, జాస్పర్, చాల్సిడోని, మొదలగు శిలలను కూడా పనిముట్ల తయారీలో మానవుడు ఉపయోగించాడు. మధ్య ప్రాచీన శిలాయుగంలో పనిముట్లను పెచ్చులతో తయారు చేసుకొన్నారు. అందువలన ఈ సంస్కృతిని పెచ్చుల సంస్కృతి అని కూడా అంటారు. ఈ యుగ పనిముట్లు పరిమాణంలో పూర్వ ప్రాచీన శిలాయుగ రాతి పనిముట్ల కంటే చాలా చిన్నవిగా ఉంటాయి.

**3.2.4. పనిముట్లు :** మధ్య ప్రాచీన శిలాయుగ పెచ్చుల పనిముట్లను క్లాక్టోనియన్, లెవలోషియన్ పద్ధతులలో తయారు చేసుకున్నారు. ఈ పెచ్చుల పనిముట్లలో గోకుడు రాళ్ళు, మొనలు, చిద్రకాలు లేదా బరమాలు, చేదకాలు ముఖ్యమైనవి.

**(ఎ). గోకుడు రాళ్ళు :** ఈ పనిముట్లు జంతువుల నుండి చర్మాన్ని వేరుచేసి శుభ్రపరచడానికి, చెట్టు బెరడును ఊడదీయడానికి, కొయ్యల చివరలను గీకి మొనవలె చేయటానికి ఉపయోగించి ఉంటారు. ఈ పనిముట్ల అంచుల వద్ద చిన్న చిన్న పెచ్చులు తీసి పదును గల కోత అంచు వచ్చేటట్లు తయారుచేస్తారు. ఈ విధంగా పదునుగల కోత అంచులను బట్టి గోకుడు రాళ్ళను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును. అవి 1. పక్క అంచు గోకుడురాయి (Side Scraper), 2. కొన అంచు గోకుడు రాయి (End Scraper), 3.వృత్తాకారపు గోకుడు రాయి (Round Scraper).

**(బి). మొనలు** (Points) **:** మొనలు మధ్య ప్రాచీన శిలాయుగ పనిముట్లలో ముఖ్యమైనవి. ఈ మొనలను అనేక రకాలైన పెచ్చులతో చేశారు. లెవాలోషియన్ పెచ్చులు, సాధారణ పెచ్చులతోగాని, క్లాక్టోనియన్ పెచ్చులతోగాని చేసేవారు. ఈ పెచ్చులు కూడా త్రిభుజాకారము, ఆకు ఆకారము మొదలయిన ఆకారాలతో ఉంటాయి. ఈ మొనలను కర్రలకు కట్టిగాని, అంటించికాని ఉపయోగించేవారు. వీటిని బరిసె మొనలుగా గాని, ఆకారంలో చిన్నవిగా ఉన్నవి బాణపు మొనలుగాను వాడి ఉండవచ్చును. కాబట్టి నాటి మానవుడు వేటపై ఆధారపడి ఆహారాన్ని సంపాదించుకున్నట్లు తెలుస్తుంది. ఈ మొనలలో సాధారణ మొనలు, తోక ఉన్న మొనలు అనే రెండు రకాలున్నాయి.

**(సి). ఛిద్రకాలు :** ఇవి మొనల వర్గానికి చెందినవైనప్పటికి వీటిని చేసే విధానము, ఉపయోగము భిన్నంగా ఉంటుంది. వీటి కొన అంచులు స్క్రూ వలె ఉపయోగించుటకు వీలుగా పెచ్చులు తీస్తారు. ఈ పనిముట్టును కర్రలకు, ఎముకలకు రంధ్రాలు వేయటానికి ఉపయోగించి ఉంటారని భావించవచ్చును.

**(డి). ఛేదకాలు :** ఈ పనిముట్లు పూర్వ ప్రాచీన శిలాయుగం నుండి ఉపయోగింపబడుతూ ఉన్నాయి. అయితే మధ్య ప్రాచీన శిలాయుగ ఛేదకాలు చాలా చిన్నవి. వీటిని చీల్చడానికి, చెక్కడానికి ఉపయోగించారు.

**3.2.5. మధ్య ప్రాచీన శిలాయుగ స్థావరాలు :** భారతదేశంలో మొదటిసారిగా మధ్య ప్రాచీన శిలాయుగ పనిముట్లను సంకాలియా మహారాష్ట్రలోని ప్రవరా నది ఒడ్డునున్న నెవాసా వద్ద కనుగొన్నాడు. నెవాసా వద్ద అట్టడుగున ఉన్న గులకరాతి పొర నుండి పూర్వ ప్రాచీన శిలాయుగపు చేతిగొడ్డళ్ళ పరిశ్రమ లభించింది. దానిపై నున్న రెండవ గులకరాతి పొర నుంచి సంకాలియా పెచ్చుల పనిముట్లు కనుగొన్నాడు. ఈ ఆధారం వలన పెచ్చుల పనిముట్లు చేతిగొడ్డళ్ళ పరిశ్రమ తరువాతి కాలానికి చెందినదిగా తెలుస్తున్నది. ఈ పనిముట్లలో గోకుడు రాళ్ళు, మొనలు, కొన్ని బ్లేడుల వలె ఉన్న పెచ్చులు ఉన్నాయి. ఈ పనిముట్లు చేతిగొడ్డళ్ళ పరిశ్రమకు ఉండి, ఆ పనిముట్లు చెర్ట్, జాస్పర్ మొదలగు రాళ్ళ పెచ్చులపై చేయబడి పరిమాణంలో చిన్నవిగా ఉన్నాయి. ఈ కారణాల వలన ఈ పెచ్చుల పరిశ్రమ మధ్య ప్రాచీన శిలాయుగానికి చెందినదని నిర్ణయించారు. మొదటి నెవాసా వద్ద లభించినందున కొందరు ఈ సంస్కృతిని ‘ నెవాసియన్ సంస్కృతి’గా వ్యవహరించారు.

మహారాష్ట్రలో గోదావరి, ప్రవరా నదుల లోయల్లోని బేల్ పంధారి, సురేగాన్, కాలేగాన్, నండూరు, మధ్మేశ్వర్ మొదలగు ప్రదేశాలలో రెండవ గులకరాతి పొర నుండి మధ్య ప్రాచీన శిలాయుగపు పరిశ్రమలు లభించాయి. ఈ ప్రదేశాలలో గోకుడురాళ్ళు, ఛిద్రకాలు, గోకుడురాయి - బోరర్ (Suraper Cum Borer)లు మొదలగు పనిముట్లు లభించగా వాటిలో గోకుడు రాళ్ళు ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనల వల్ల తెలుస్తుంది.

కర్ణాటక రాష్ట్రంలో తమిన్హల్, ఆలమిత్తి, బాగాల్ కోట, కోవళ్ళి, అంగవాడి మొదలగు చోట్ల పెచ్చుల పరిశ్రమలు కనిపించాయి. వీటిలో ఎక్కువగా నియతాకృతులు లేని పెచ్చులు, మూలాలతో పాటు మొనలు, గోకుడు రాళ్ళు, ఛిద్రకాలు మొదలయిన పనిముట్లు లభించాయి.

తమిళనాడులో అత్తిరాంపాకం, వడమధురై, గుడియాం మొదలగునవి ముఖ్యమైన మధ్య ప్రాచీన శిలాయుగ స్థావరాలు.

ఒరిస్సా రాష్ట్రంలో మయూర్ భంజ్, కిమోన్ ఝూర్, సుందర్ ఘడ్, జిల్లాలలో లభించిన పెచ్చుల పరిశ్రమలో గోకుడురాళ్ళు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ బ్యూరిన్లు కూడా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలలో కూడా మధ్య ప్రాచీన శిలాయుగ స్థావరాలు లభించాయి.

ఆంధ్రప్రదేశ్లో కర్నూలు, కడప, చిత్తూరు, గుంటూరు, నల్గొండ, మహబూబ్నగర్, ఆదిలాబాద్ జిల్లాలలో మధ్య ప్రాచీన శిలాయుగ పనిముట్లు రెండవ గులకరాతి పొర నుండి, బయలు ప్రదేశాలలోను, కొండ గుట్టల దగ్గర దొరుకుతున్నాయి. ఆంధ్రప్రదేశ్లో మొదటిసారి కమ్మియాడ్, బర్కిట్లు పెచ్చుల పరిశ్రమను గిద్దలూరు వద్ద గుర్తించారు. గుంటూరు జిల్లాలో నాగార్జున కొండ, మద్దూరు, నాగార్జున నగర్, తుమ్మలపల్లి, డోకిపర్రు, ఆదిలాబాద్ జిల్లాలో జముల్దార్, కేసలపూర్ ప్రకాశం జిల్లాలో సగిలేరు, గుండ్లకమ్మ, పాలేరు లోయలు, చిత్తూరు జిల్లాలో రేణిగుంట మొదలగునవి మధ్య ప్రాచీన శిలాయుగ స్థావరాలున్న ముఖ్యమైన ప్రదేశాలు.

**3.2.6. ఉత్తర ప్రాచీన శిలాయుగము :** ఉత్తర ప్రాచీన శిలాయుగంలో మానవుడు సాంస్కృతిక పురోభివృద్ధిని తెలిపే పనిముట్లు ఉపయోగించాడు. వీటిలో ముఖ్యమైనవి బ్లేడ్లు - బ్యూరిన్లు. ఆనాటి మానవుడు పనిముట్లను తయారు చేయడానికి శిలలనే కాక ఎముకలు, కొమ్ములు, దంతాలను కూడా ఉపయోగించాడు. నాటి మానవుడు తన నైపుణ్యాన్ని పనిముట్లు తయారు చేయడంలోనే కాక చిత్ర లేఖనంలోను, శిల్పాలలను చెక్కడంలోను ప్రదర్శించాడు. ఐరోపా ఖండంలో గుహలలో ఉత్తర ప్రాచీన శిలాయుగానికి చెందిన వర్ణ

చిత్రాలు, రాతితో ఎముకతో తయారైన శిల్పాలు బయల్పడ్డాయి. చనిపోయిన వారిని సమాధి చేసే వారిని, శరీరాన్ని చర్మంతో కప్పుకునేవారని తెలుస్తున్నది.

**3.2.7. పనిముట్లు :** ఉత్తర ప్రాచీన శిలాయుగ మానవుడు ఎక్కువగా బ్లేడ్లను, బ్లేడ్లతో తయారయిన పనిముట్లను ఉపయోగించాడు. ప్రతి బ్లేడు ఒక పెచ్చే (Every Blade is a flake) కాని అన్ని పెచ్చులు బ్లేడులు కావు (All the flakes are not blades). ఎందుకనగా సమాంతరమైన పక్క అంచులుండి వెడల్పు కంటే పొడవు రెట్టింపుగా లేదా ఎక్కువగా ఉన్న రాతి పెచ్చులను బ్లేడులని అంటారు. సన్నని అడ్డకోత (Thin Cross section) ఉండటం కూడా బ్లేడుకున్న ముఖ్య లక్షణం. బ్లేడు పక్క అంచులు సన్నగా పదునుగా ఉంటాయి. బ్లేడులను తయారు చేయుటకు మొదట గులకరాతికి చుట్టూ ఉండే పెచ్చులను ఊడదీస్తారు. దీనినే డ్రెస్సింగ్ అంటారు. బ్లేడులను మూలం నుండి తీయడానికి ఒకటికాని అంతకంటే ఎక్కువగాని చిన్న పెచ్చులు తీసి క్షతతలాలను తయారుచేస్తారు. క్షత తలంపై మొనదేలిన గట్ట కర్రనుగాని, ఎముకను గాని పంచ్‌గా ఉపయోగించి ఒక సుత్తితో పంచ్‌పై దెబ్బ వేస్తారు. అప్పుడు రెండు వైపులా సమాంతర అంచులు సన్నని అడ్డుకోతతో ఉన్న బ్లేడు ఊడి వస్తుంది. ఈ పద్ధతి ప్రకారం తయారు చేసిన బ్లేడులకు పదునైన పక్క అంచులు ఉన్నందువలన వాటిలో కొన్నింటిని అలాగే ఉపయోగించి ఉంటారని పరిశోధనల వల్ల తెలుస్తున్నది. కొన్ని బ్లేడులను వివిధ పద్ధతులలో దిద్ది చాకులు, చిరుకత్తులు, మొనలు, త్రిభుజాలు, చతుర్భుజాలు, చిద్రకాలు, గోకుడు రాళ్ళు, మొదలగు పనిముట్లను తయారు చేస్తారు. ఇటువంటి పనిముట్లు జంతువుల మాంసాన్ని కోయటానికి అనుకూలంగా ఉంటాయి.

బ్యూరిన్‌లు అనేవి బ్లేడుల తరువాత ముఖ్యమైన పనిముట్లు. వీటిని ఉలి అంచు మొనలు అనవచ్చును. ఈ పనిముట్లను బ్లేడ్‌లతోను, మూలాలతోను, బొడిపెలతోను, పెచ్చులతోను చేసేవారు. బ్యూరిన్‌లను ఎముకల మీద గాని, మెత్తని రాళ్ళమీద గాని, గృహల గోడల మీద గీయుటకు (Engraving) గాని, ఎముకలకు, కర్రలకు గాడి (Slit) చేయుటకు గాని ఉపయోగించేవారు.

**3.2.8. భారతదేశములో ఉత్తర ప్రాచీన శిలాయుగ స్థావరాలు :** ఉత్తర ప్రాచీన శిలాయుగ సంస్కృతి భారతదేశంలో లేదని ఐరోపా, పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికా ఖండాలలో మాత్రమే విలసిల్లిందనే అభిప్రాయం గతంలో ఉండేది. కాని రాబర్ట్ బ్రూస్ ఫూట్ కర్నూలు జిల్లాలో బేతంచర్ల దగ్గర బిల్ల సర్గము గుహలలో జరిపిన త్రవ్వకాలలో ఎముకల పరిశ్రమ బయల్పడినట్లు, ఆ పరిశ్రమ ఐరోపా ఖండంలో ఉత్తర ప్రాచీన శిలాయుగానికి చెందిన మాగ్డలీనియన్ సంస్కృతిని పోలి ఉన్నట్లు తెలిపాడు. M.L.K. మూర్తి, తిమ్మారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో జరిపిన పరిశోధనల వలన బ్లేడ్ - బ్యూరిన్ పరిశ్రమ బయల్పడినవి. ఈ ప్రాంతాలలో లభించిన పనిముట్లు అంతకు ముందు భారతదేశంలో లభ్యమైన వాని కంటే సాంకేతికంగా పరిణతి చెంది ఐరోపా, పశ్చిమ ఆసియా దేశాలలో లభించిన ఔరిగ్నాషియన్, మాగ్డలీనియన్ దశలకు చెందిన పనిముట్లను పోలి ఉన్నాయి. రేణిగుంట, ఎర్రగొండపాలెం దగ్గర దొరికిన పరిశ్రమలో బ్లేడులు, బ్యూరిన్‌లు, పక్కలు మొద్దు పరచిన చిరుకత్తులు, బాణపు మొనలు, అర్ధ చంద్రా కృతులు, త్రిభుజాలు, చతుర్భుజాలు, పదును చేసిన అంచులున్న బ్లేడులు, పెచ్చులతో చేసిన గోకుడు రాళ్ళు మొదలగునవి ఉన్నాయి. ఈ పనిముట్ల తయారీకి క్వార్ట్‌జైట్ రాతిని ఉపయోగించారు.

ఉత్తర ప్రాచీన శిలాయుగానికి చెందిన సంపూర్ణ సాంకేతిక వికాసాలను తెలిపే ఆధారాల కోసం అన్వేషిస్తున్న మూర్తి, తిమ్మారెడ్డిలు బేతంచర్ల పరిసర ప్రాంతాలలోని బిల్ల సర్గము, ముచ్చట్ల చింతమానుగయి, కొట్టాల పొలి మేరగయి, పెద్ద పావురాళ్ళగయి, బద్దిగవులలో త్రవ్వకాలు జరిపారు. త్రవ్వకాలలో రాతి పరిశ్రమకు చెందిన పనిముట్లతోపాటు, ఈ తవ్వకాలలో లభించిన రాతి పనిముట్లు, కార్ట్‌జైట్, చెర్ట్, జాస్పర్, చాల్సిడొని, అగేట్ మొదలయిన శిలలతో చేసినవి ఉన్నాయి. రాతి పనిముట్లతో పాటు ఎముకలతో చేసిన పనిముట్లు కూడా అధిక సంఖ్యలో లభించాయి. ఎముకలను నిలువుగా చీల్చి ఆ ముక్కలతో చేసిన గోకుడు పనిముట్లు, బరమాలు (Perforators) ఉలి అంచు మొనలు (Chisel edged tools), సూది మొనలను పోలిన సన్నని మొనలు, గరిటెలను పోలిన పరికరాలు, ఈటెలకు వాడే రెక్కలు (Barbs for harpoons) మొదలగునవి లభించాయి.

బేతంచర్ల గుహలలో లభించిన రాతి, ఎముక పనిముట్లలో బాణపు మొనలు, ఈటెలను జంతువులను వేటాడడానికి ఉపయోగించేవారు. గోకుడు పనిముట్లు, బ్లేడులు జంతువుల శరీరం నుండి చర్మాన్ని వేరు చేయుటకు, కొన్ని ఎముకల మొనలు ముఖ్యంగా బరిమాలు, ఉలి అంచు మొనలు, సూది మొనలు మొదలైనవి వాటిలో మానవుడు చర్మంతో దుస్తులు తయారు చేసుకోవటానికి ఉపయోగించి ఉండవచ్చును.

ఈ గుహలలో జరిగిన తవ్వకాలలో లభించిన జంతు అవశేషాలలో దుప్పి, కణితి, అడవిపంది, కారెనుము, మొదలగునవి ఉన్నాయి. ఈ అవశేషాలను పరిశీలించిన జంతు శిలాజాల నిపుణుడు కె.యన్. ప్రసాద్ ఈ జంతువులలో కొన్ని ప్లైస్టోసీన్ కాలానికి చెందినట్లు భావించాడు.

ప్రాచీన శిలాయుగ స్థావరాలు మహారాష్ట్రలోని ప్రవర నదీ తీరంలోను, కర్నాటకలోని షోరాపూర్ దో ఆబ్, బీహార్‌లోని సింగ్‌భుమ్ జిల్లాలోను, ఆంధ్రలో కడపజిల్లా వేముల, గుంటూరు జిల్లా నాగార్జున కొండలో, మధ్యప్రదేశ్‌లోని భీంబత్కాలోను కనుగొనబడినవి.

ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్వేషణల వలన గుంజన, పాలేరు, మున్నేరు గోదావరీ, ఏలేరు నదీ లోయల్లోను, నల్లమల పీఠభూమిలో శ్రీశైలం వద్దను విస్తారమైన ఉత్తర ప్రాచీన శిలాయుగ ఆవాసాలున్నట్లు తెలుస్తున్నది.

**3.2.9. కాలం :** ప్రాచీన శిలాయుగం మొదటి దశ అయిన పూర్వ ప్రాచీన శిలాయుగానికి చెందిన అషులియన్ సంస్కృతి మూడు లక్షల నుండి రెండు లక్షల సంవత్సరాల మధ్య కాలానికి చెందినది. రాజస్థాన్‌లోని దిద్వానా, మధ్యప్రదేశ్‌లోని సోన్ లోయ, గుజరాత్‌లోని హీరాన్ లోయలలోని అషులియన్ సంస్కృతులు కూడా ఈ కాలానికి చెందినవే. రెండవ దశ అయిన ప్రాచీన మధ్య శిలాయుగం రాజస్థాన్‌లో దిద్వానాలో మధ్య ప్రాచీన శిలాయుగ స్థావరంలో లభించిన థెర్మోలు మినిసెన్స్ కాల నిర్ణయ పద్ధతి ప్రకారం లక్ష సంవత్సరాల నాటిదని నిర్ణయించారు. సోన్ లోయలోని మధ్య ప్రాచీన శిలాయుగం 40,000 - 50,000 సంవత్సరాల నాటిదని క్లార్క్, విలియం ప్రకటించాడు. మొత్తం మీద భారతదేశంలో మధ్య ప్రాచీన శిలాయుగం 1,25,000 బి.పి. నుండి 40,000 బి.పి. వరకు కొనసాగిందని నిర్ణయిస్తున్నారు. చివరి దశ అయిన ఉత్తర ప్రాచీన శిలాయుగం క్రీ.పూ. 23460 నుండి క్రీ.పూ. 8090 సంవత్సరాల నాటిదని పోస్సెల్, రిస్ మాన్‌ల అభిప్రాయం.

## 3.3. మధ్య శిలాయుగం లేదా సూక్ష్మ శిలాయుగం :

ప్రాచీన శిలాయుగం నుండి నవీన శిలాయుగానికి పరిణామాన్ని సూచించే దశ మధ్య శిలాయుగం. ఈ రెండు శిలాయుగానికి మధ్యనున్నందున మధ్య శిలాయుగమని పేరు వచ్చింది. మధ్య శిలాయుగంలోని పనిముట్లు చాలా అల్ప పరిమాణం కలిగినటువంటివి. ఈ పనిముట్లలో అత్యంత పొడవైనది 2.5 సెంటీ మీటర్లుంటుంది. సూక్ష్మ పరిమాణము గల పనిముట్లను ఉపయోగించినందువలన ఈ యుగానికి సూక్ష్మ శిలాయుగమనే పేరు కూడా వచ్చింది. పనిముట్ల తయారీకి క్వార్ట్‌జ్, చెర్ట్, చాల్సిడోనీ, బాస్పర్, అగేట్, క్రిష్టల్, ఓపల్ మొదలగు రాళ్ళను ఉపయోగించాడు.

**3.3.1. పనిముట్లు :** మధ్య శిలాయుగ మానవుడు బ్లేడ్లు, బ్లేడ్ లెట్‌ను తనకు అవసరమైన పనిముట్లుగా మలచుకొన్నాడు. బ్లేడ్లు, బ్యాక్‌డ్ మొనలు, వాలుగా మొద్దు పరచిన బ్లేడ్లు, అర్ధ చంద్రాకృతులు, త్రిభుజాలు, చతురస్రాలు, పెచ్చులపై చేసిన గోకుడు రాళ్ళు, సాధారణ మొనలు మొదలగునవి సూక్ష్మ శిలాయుగ పనిముట్లలో ముఖ్యమైనవి. ఈ పనిముట్లు చాలా చిన్నవైనందున వీటి కర్రకుగాని, ఎముకకుగా అమర్చి కత్తులుగా, కొడవళ్ళు ఉపయోగించేవారు.

భారతదేశంలో సూక్ష్మ శిలాయుగ పనిముట్లను 1880లో A.C.L. కార్లైల్ కనుగొన్నాడు. ఇతడు బందకైటూరు శ్రేణి నుండి, ఉత్తర ప్రదేశ్‌లోని మిర్జాపూర్ జిల్లాల నుండి, మధ్యప్రదేశ్‌లోని రేవా, బుందేల్ ఖండ్, బాఘేల్ ఖండ్ ప్రాంతాలలో సూక్ష్మ శిలాయుగ పనిముట్లను సేకరించాడు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ శిలాయుగ పనిముట్లను కనుగొన్న ఘనత రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్‌కు చెందుతుంది.

**3.3.2. సూక్ష్మ శిలాయుగ స్థావరాలు :** భారతదేశంలో సూక్ష్మ శిలాయుగ ప్రదేశాలలో గుజరాత్‌లోని లాంగ్‌నాజ్, మధ్యప్రదేశ్‌లోని పచ్‌మర్హి, ఆదంఘర్, పశ్చిమ బెంగాల్‌లోని బీర్భాన్‌పూర్, తమిళనాడులోని టెరి, రాజస్థాన్‌లోని బాగోర్, మహారాష్ట్రలోని బొంబాయి, ఆంధ్రప్రదేశ్‌లోని గిద్దలూరు, నాగార్జున కొండ, గోదావరిలోయ మొదలగునవి ప్రధానమైనవి. :

**(ఎ). లాంగనాజ్ :** గుజరాత్ రాష్ట్రంలో సూక్ష్మ శిలాయుగ స్థావరాలన్నింటిలో లాంగనాజ్ ముఖ్యమైనది. ఇక్కడ సంకాలియా, ఐరావతి కార్వేలు త్రవ్వకాలు జరిపారు. సూక్ష్మ శిలాయుగ పరికరాలు భూమిలో అయిదు అడుగుల లోతు వరకు లభించాయి. ఈ ప్రాంతంలో నాలుగు స్తరాలున్నట్లు త్రవ్వకాల వలన తెలిసింది. అట్టడుగు ఇసుక పొర, దాని మీద మట్టి పొర, మట్టి పొరపై ఇసుక పొరలు ఉన్నాయి. ఇసుక పొరపై ఇప్పటి మట్టి పొర కప్పబడి ఉన్నది. లాంగనాజ్‌లో మూడు రకాల సంస్కృతులున్నట్లు తెలుస్తున్నది. అవి : 1. మానవుల, జంతు అవశేషాలతో లభ్యమయి సూక్ష్మ శిలాయుగ సంస్కృతి, 2. కుండ పెంకులతో పాటు దొరికి మధ్య శిలాయుగ సంస్కృతి, 3. ఇనుప పరికరాలతో లభ్యమయిన మధ్య శిలాయుగ సంస్కృతి.

లాంగ్‌నాజ్ త్రవ్వకాలలో రాతి పరికాలు, జంతు శిలాజాలు, ఆనాటి సమాధులు, నాటి మానవుడు వాడిన కుండ పెంకులు లభించాయి. రాతి పరికరాలలో బ్లేడ్‌లు ముఖ్యమైనవి. రెండు సమాంతర భుజాల బ్లేడులు, చిరుపిడికత్తులు, త్రిభుజాకారాలు, గోకుడురాళ్ళు పెచ్చులు, ఇతర పెచ్చులు కూడా ఉన్నాయి. సమాధులలో దొరికిన మానవ అవశేషాలు మెడిటరేనియన్, వెడ్డాయిడ్ జాతులకు చెందినవి.

**(బి). బాగోర్ :** రాజస్థాన్‌లోని ముఖ్యమైన మధ్య శిలాయుగ ప్రదేశము బాగోర్. ఇక్కడ వి.యన్. మిశ్రా త్రవ్వకాలు చేశాడు. బాగోర్‌లో 2×3 మీటర్ల వైశాల్యములో త్రవ్వకాలు జరుపగా సుమారు 1.50 మీటర్ల లోతు వరకు సూక్ష్మ శిలా పరికరాలు లభించాయి. త్రవ్వకాలలో లభించిన రాతి పరికరాలలో నాలుగు శాతం మాత్రమే పనిముట్లు మిగిలిన 96 శాతం పెచ్చులు, మూలాలు, మొదలగునవి. పనిముట్లలో చిరుకత్తులు, బ్లేడ్‌లు, గోకుడు రాళ్ళు, త్రిభుజాలు, చతుర్భుజాలు, అర్థచంద్రాకృతి పనిముట్లు ఉన్నాయి. ఈ సూక్ష్మ శిలా పరికరాలతో పాటు కుండ పెంకులు లభించడం ముఖ్యమైన విషయం. బాగోర్ సంస్కృతి క్రీ.పూ. 5000 సంవత్సరాల నాటిదని కార్బన్ 14 కాల నిర్ణయ పద్ధతి ప్రకారం తెలుస్తున్నది.

**(సి). పచ్‌మర్హి :** మధ్యప్రదేశ్‌లోని పచమర్హి వద్ద అలహాబాదు విశ్వవిద్యాలయ పురావస్తు విభాగం జరిపిన త్రవ్వకాలలో అనేక సమాధులు బయల్పడ్డాయి. కార్బన్ 14 పద్ధతి ప్రకారం ఈ సమాధిలోని కొన్ని ఎముకలు సుమారు క్రీ.పూ. 1710 సంవత్సరాల కాలం నాటివని నిర్ణయించారు. ఇక్కడి సూక్ష్మ శిలా పరికరాలు కాలానుగుణంగా అనేక రకాల మార్పులు చెందినట్లు తెలుస్తున్నది. పై స్తరాలలోని కుండ పెంకులు మధ్య శిలాయుగ చివరి దశకు చెందినవి.

**(డి). ఆదంఘర్ గుహలు :** నర్మదా లోయలోని ఆదంఘర్ కొండ గుహలలో ఆర్.వి. జోషి జరిపిన త్రవ్వకాల వలన అతి ముఖ్యమైన ప్రదేశము వెలుగులోకి వచ్చింది. ఇక్కడ మధ్య శిలాయుగము, మధ్య ప్రాచీన శిలాయుగము, ఉత్తర ప్రాచీన శిలాయుగం తరువాత ఉద్భవించదనటానికి కొంత వరకు నిదర్శనాలు కనిపిస్తున్నాయి. త్రవ్వకాలలో మొనలు, బ్లేడ్‌లు, అర్ధచంద్రాకృతిలో ఉన్న పనిముట్లు, త్రిభుజాలు, సమాంతర చతుర్భుజాలు, గోకుడురాళ్ళు, బోరర్‌లు, బ్యూరిన్‌లలోపాటు కుండపెంకులు కూడా లభించాయి. ఇక్కడ లభించిన జంతువుల అవశేషాలను బట్టి పెంపుడు కుక్కలు, మూపురం ఉన్న ఎద్దు, నీటి దున్నపోతు, మేక, పెంపుడు గొర్రె, పంది మొదలగు జంతువులను నాటి మానవుడు ఆహారంగా తీసుకొని ఉంటాడని తెలుస్తున్నది. ఈ జంతువులే కాక సాంబర్, బారసింగా, చుక్కల లేడి, కుందేలు, మొదలగు అడవి జంతువుల అవశేషాలు కూడా లభ్యమైనవి. ఈ జంతువులను నాటి మానవుడు వేటాడి వాటి మాంసాన్ని కూడా ఆహారంగా తీసుకొని ఉంటాడని తెలుస్తున్నది.

**(ఇ). టెరి :** చెన్నై నగరానికి దక్షిణంగా ఉన్న కొన్ని ఇసుక తిన్నెలను తమిళభాషలో టెరి అని పిలుస్తారు. ఈ ఇసుక తిన్నెలపై లభించిన సూక్ష్మ శిలా పరికరాలను టెరి పరిశ్రమలు (Terri Industries) అని పిలుస్తారు. ఈ ఇసుక తిన్నెలు సముద్ర మట్టానికి 50 లేదా 20 అడుగుల ఎత్తులో ఉన్నాయి. ఇటువంటి ఇసుక తిన్నెలు మిగ్నానపురం, కుట్టంపూలి, కుల్లటూర్, సావ్యార్‌పురం మొదలగు గ్రామాల పరిసర ప్రాంతాలలో ఉన్నాయి. టెరి పరిశ్రమలో లభించిన సూక్ష్మ శిలాపరికరాలను ఎక్కువగా చెర్ట్, సిసిలీకరణం చెందిన కర్ర (Silicified

wood) క్వార్ట్జ్ మొదలగు ముడి పదార్థాలతో చేశారు. ఈ పరిశ్రమకు చెందిన పనిముట్లలో ప్రెషర్ పెచ్చులు (Pressure flakes), ద్విముఖమొనలు ముఖ్యమైనవి. భారతదేశంలో ఎక్కడా ఇటువంటి సూచికలు దొరకలేదు. శ్రీలంకలో మాత్రమే ఇటువంటి సూచికలు లభిస్తున్నాయి. ఈ పనిముట్లే కాక బ్లేడ్‌లు, చిరుపిడికత్తులు, వాలుగా మొద్దు బారిన కత్తులు, వివిధ రకాల గోకుడు రాళ్ళు, చక్రాలు, సాధారణ సూచికలు (Simple points) అర్ధ చంద్రాకృతులు, టాన్స్ వర్క్స్ బాణపు మొనలు త్రిభుజాలు, చేదకాలు, మూలాలు పెచ్చులు ఉన్నాయి. వీటిలో అర్థ చంద్రాకృతి పనిముట్లు ఎక్కువ సంఖ్యలో దొరికాయి. జాయినర్ టెరి పరిశ్రమను రెండు వర్గాలుగా విభజించి వర్గాలు విభిన్న కాలాలకు చెందినవని మొదటి వర్గము కాలము క్రీ.పూ. 4000 సంవత్సరాలకు చెందిందని అభిప్రాయపడినాడు.

**(యఫ్). ముంబాయి :** ముంబాయి వద్ద ఖండిల్లి ప్రాంతంలో టోడ్ జరిపిన పరిశోధనలో సూక్ష్మ శిలాయుగ పరికరాలు లభ్యమైనవి. వీటిలో అర్ధచంద్రాకృతి పరికరాలు, త్రిభుజాలు, చతుర్భుజాలు, చిరుకత్తులు, బ్యూరిన్‌లు, గోకుడు రాళ్ళు, గుండ్రని రాళ్ళు మొదలగునవి ఉన్నాయి.

**(జి). బీర్భాన్ పూర్ :** పశ్చిమబెంగాల్‌లోని దామోదర్‌లోయలో బీర్భాన్‌పూర్ గ్రామం వద్ద బి.బి. లాల్ త్రవ్వకాలు జరిపి సూక్ష్మ శిలా పరికరాలను కనుగొన్నాడు. దామోదర్ నదీ వేదికలలో ఒకదానిపై సుమారు ఒక చదరపు మైలు విస్తీర్ణంలో సూక్ష్మ శిలా పరికరాలు కనిపించాయి. బీర్భాన్ పూర్ వద్ద దొరికిన పరిశ్రమలో బ్లేడ్‌లు, అర్ధచంద్రాకృతి పరికరాలు, చతుర్భుజాలు, త్రిభుజాలు, మొనలు, ఛిద్రకాలు, బ్యూరిన్‌లు, గోకుడు రాళ్ళు, మూలాలు, పెచ్చులు ఉన్నాయి. ఈ పరికరాలన్నీ క్వార్ట్జ్, చెర్ట్, చాల్సిడొని, క్వార్ట్జైట్, మొదలగు శిలలతో తయారు చేశారు.

**(హెచ్). ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య శిలాయుగ పరిశ్రమలు గుంటూరు, కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, గోదావరి మొదలగు జిల్లాలో కనిపిస్తున్నాయి. ఈ పరిశ్రమలు కొన్ని పెద్ద నదులకు దూరంగా, కొండ గుట్టల మీద, గుహలలో, నదీ వేదికల మీద, కొండ వాగుల వద్ద ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని ముచ్చట్ల చింతమానుగవి, విశాఖపట్టణం జిల్లాలోని బొర్రా గుహలు, వంశగిరి గుహలలో మధ్య శిలాయుగ పనిముట్లు లభించాయి. ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ శిలా పరికరాల తయారీకి క్వార్ట్జ్‌ను ఉపయోగించారు. అయితే అనంతపురం, తూర్పు కర్నూలు, పశ్చిమ గోదావరి ప్రాంతాలలో క్వార్ట్జ్‌తోపాటు చెర్ట్, చాల్సిడొని, జాస్పర్, అగేట్, క్రిష్టల్, ఓపల్ మొదలగు శిలల్ని కూడా ఉపయోగించారు. నాగార్జున కొండలో లభించిన సూక్ష్మ శిలాయుగ పరికరాలలో ఆల్మండ్ ఆకృతి మొనలు, పిడికత్తులు, మొరటుగా ఉన్న అర్ధ చంద్రాకృతులు, గీకుడు రాళ్ళు, బరమాలు, బ్యూరిన్లు మొదలగునవి ముఖ్యమైనవి. కర్నూలు జిల్లాలోని కేతవరం వద్ద గల శిలాశ్రయాల (Rock Shelters) వద్ద సూక్ష్మ శిలా పరికరాలు లభించాయి.

**3.3.3. చరిత్ర పూర్వయుగ వర్ణ చిత్రాలు (Rock Art) :** మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో మధ్య శిలాయుగ సంస్కృతిని తెలిపే ఆధారాలు గుహలలోను, శిలాశ్రయాలు (Rock Shelters) లోను బయల్పడినవి. పచ్‌మర్హి ప్రాంతంలోని గుహల గోడల మీద ఎరుపు, నారింజ, ధూమ్ర వర్ణము (Purple) మొదలగు రంగులతో ఎన్నో చిత్రాలను ఆకర్షణీయంగా మధ్య శిలాయుగ మానవులు చిత్రించారు. నాటి వేట విధానము, వేటాడే జంతువులు వివిధ పరికరాలు మొదలైనవి నాటి సామాజిక విశేషాలను తెలియజేస్తున్నాయి. ఇక్కడి చిత్రాలలో జింక, ఆంటిలోప్, అడవి పంది, ఖడ్గమృగం, ఏనుగు, అడవి దున్న, మూపురం ఎద్దులు, కోతులు ఎక్కువగా కనబడుతున్నవి.

ఆంధ్రప్రదేశ్‌లో ఆదోని, బూదగలి, చింతకుంట, దప్పల్లె, దూపాడుగట్టు, కేతవరం, పాండవుల గట్టు, దొంగల గట్టు మొదలగు ప్రదేశాలలో మధ్య శిలాయుగ చిత్రాలున్నవి. ఈ స్థలాలన్నిటితో కలిపి దాదాపు 200 చిత్రాలున్నాయి. వీటిలో ఎక్కువ భాగం అడవి జంతువుల చిత్రాలను ప్రముఖంగా చిత్రించారు. జింక, తాబేలు, చెవుల పిల్లి, నక్క, హైయనా, కుక్క వంటి జంతువుల చిత్రాలున్నాయి. మానవ చిత్రాలు, ముసుగున్న మానవాకృతులు, రేఖా గణిత నమూనాలు, చేతి ముద్రలు కూడా చిత్రతమైనవి. ఈ చిత్రాలన్నీ సున్నపురాయి, ఇసుకరాయి, గ్రానేట్ రాయి విస్తరించి ఉన్న ప్రాంతాలలో ఉన్నవి.

**3.3.4. కాలం :** ముచ్చట్ల చింతమానుగవి కుండపెంకుల నుండి అందిన థిర్మోలు మినిసెన్స్ కాలం క్రీ.పూ. 1800 తప్ప ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన మధ్య శిలాయుగ ప్రదేశాల కాలం గురించిన (14 వివరాలు లభించడం లేదు. బాగోర్, భీంబేక్తా, ఆదంఘర్ - సరాయి - నహర్ రాయి మొదలగు ప్రదేశాలు రేడియో కార్బన్ కాల నిర్ణయం ప్రకారం క్రీ.పూ. 8500 నుండి క్రీ.పూ. 2000 దాకా కొనసాగినట్లు నిర్ణయించబడింది.

**3.3.5. ప్రజా జీవన శైలి :** మధ్య శిలాయుగ ప్రజలు ఎత్తైయిన ప్రదేశాలలో నివసిస్తు జంతువులను, చేపలను వేటాడటం ద్వారా ఆహారాన్ని సంపాదించుకున్నారు. త్రవ్వకాలలో లభించిన ఎముకలను బట్టి పశువులతో బాటు, ఖడ్గ మృగం, దుప్పి, పంది, ముంగిస, మొదలగు జంతువుల ఆహారానికి ఉపయోగించినట్లు తెలుస్తున్నది. ఈ యుగంలో మానవుడు జంతువులను మచ్చిక చెయ్యడం ప్రారంభించాడు. ఈ యుగం చివరి దశలో చేతితో కుండలు తయారు చెయ్యడం మొదలుపెట్టాడు. గవ్వలతోను, పూసలతోను ఆభరణాలను తయారు చేసుకున్నారు. మత విశ్వాసాలు ఏర్పడ్డాయి. చనిపోయిన వారిని వారి వస్తువులతో సహా పాతి పెట్టే ఆచారం ఏర్పడింది. ఈ ఆచారాన్ని బట్టి వారికి మరణానంతర జీవితంలో విశ్వాసం కలిగినట్లు కలిగినట్లు భావించవచ్చు.

## 3.4. నవీన శిలాయుగం :

నవీన శిలాయుగముతో మానవ సంస్కృతీ చరిత్రలో ఒక మహోజ్వల దశ ప్రారంభమయ్యింది. అనేక వేల సంవత్సరాలుగా సంచార జీవితం గడుపుతూ ఆహార సేకరణ స్థితి నుండి స్వయముగా ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు మానవుడు చేరుకున్నాడు. నదులు సరస్సుల తీరాలలో స్థిర నివాసము ఏర్పరచుకొని వ్యవసాయాన్ని ప్రారంభించాడు. వేట, చేపలు పట్టడం, కాయలు, దుంపలు, వన ధాన్య సేకరణ మొదలగు విధానాల నుండి వ్యవసాయము, పశుపోషణ, స్థిర నివాసము మొదలగు విధానాలకు మానవుడు మారిన ఈ దశ ఆర్థిక విధానములో గొప్ప మార్పును సూచిస్తునది. మానవ నాగరికతాభివృద్ధికి దారి తీసిన ఈ ఆర్థిక - సాంఘిక పరివర్తనకు ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త నవీన శిలాయుగ విప్లవము (Neolithic Revolution) అని పేరు పెట్టాడు. నవీన శిలాయుగ మానవుడు పనిముట్లను పదునుగా, నునుపుగా, నాగరికముగా చేసుకొన్నందు వలన ఈ యుగానికి నవీన శిలాయుగమని పేరు వచ్చింది.

**3.4.1. నవీన శిలాయుగ లక్షణాలు :** నవీన శిలాయుగానికి చెందిన ముఖ్య లక్షణాలు 1. గ్రామాలు నిర్మించుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవటం, 2. జంతువులను మచ్చిక చేయడం, 3. ధాన్యపు మొక్కలను పెంచడం, 4. నునుపు చేసిన రాతి పనిముట్ల తయారు చేయడం, 5. కుండలను చేయటం, అయితే సూక్ష్మ లేదా మధ్య శిలాయుగము నుండి మానవుడు నవీన శిలాయుగానికి మారుతున్న ప్రారంభ దశలోని సమాజాలలో ఈ లక్షణాలన్నీ కనిపించవు. ఆహార సేకరణ దశను విడిచిపెట్టి ఆహారోత్పత్తి పద్ధతులను అవలంబించి వివిధ దశల ద్వారా నవీన శిలాయుగ సంపూర్ణ లక్షణాలకు చేరుకోవడానికి మానవుడికి దాదాపు 3000 సంవత్సరాలు పట్టింది.

నవీన శిలాయుగ ప్రారంభ దశ పశ్చిమ ఆసియా ప్రాంతంలో కనిపిస్తుంది. పశ్చిమ ఆసియా ప్రాంతంలోని నవీన శిలాయుగాన్ని మూడు రకాలుగా విభజించవచ్చును. అవి. 1. కుమ్మరి పని తెలియని నవీన శిలాయుగము, 2. కుమ్మరి పని తెలిసిన శిలాయుగము, నవీన శిలాయుగం ప్రారంభ దశను సూచించే పాలస్తీనా, జోర్డాన్ ప్రాంతాలలోని నటూఫియన్ సంస్కృతి, ఇరాన్‌లోని జాగ్రాస్ పర్వత శ్రేణులలోని కరిమ్ షాహిద్ సంస్కృతులు క్రీ.పూ. 9000 నుండి 7000 సంవత్సరాల కాలానికి చెందినవి. కుమ్మరి పని తెలియని నవీన శిలాయుగానికి చెందిన జెరికో సంస్కృతి క్రీ.పూ. 7000 సంవత్సరాలు, జార్మో సంస్కృతి క్రీ.పూ. 6750 సంవత్సరాల కాలానికి చెందినవి. క్రీ.పూ. 6000 సంవత్సరాల నుండి కుమ్మరి పని తెలిసిన నవీన శిలాయుగ సంస్కృతులు అనటాలియాలోని సాటన హుయాక్, పాలస్తీనా, సిరియా, లెబనాన్ ప్రాంతాలలో కనిపిస్తున్నాయి.

**3.4.2. పనిముట్లు :** నవీన శిలాయుగంలోని నునుపు పనిముట్లను బసాల్డ్, డోలరైట్, ట్రాడ్, గ్రానైట్ నైసిన్ మొదలగు శిలలతో తయారు చేసుకొన్నారు. ఈ పనిముట్ల తయారీలో మూడు లేదా నాలుగు దశలున్నాయి. మొదటి దశలో పనిముట్టు చేయదల్చుకొన్న రాతిని రాతి సుత్తిలో కొట్టి రాతికి రెండు వైపులా పెచ్చులు తీస్తారు. రెండవ దశలో మొనదేలిన ఆయుధం లేదా గుండ్రని రాతిలో పనిముట్టును పెచ్చుల మచ్చలను చదును చేస్తారు. ఈ విధంగా చేసిన పనిముట్లును మరొక రాతిపై ఇసుక, నీరు పోసి బాగా రుద్ది

నునుపు, పదునుగా చేస్తారు. కొంత మంది పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయంలో పదును పెట్టడం మూడవ దశగాను, నునుపు చేయడం నాల్గవ దశగాను భావిస్తారు. ఈ విధంగా తయారయిన పనిముట్లలో ముఖ్యమైనవి నునుపైన గొడ్డళ్ళు (Polished akes), బాడిసెలు (Adzes) ఉలులు (Chisels), షోల్డర్డ్ పనిముట్లు (Shouldered tools), మధ్య రంధ్రమున్న పరికరాలు (Mace head), ఇవి కాకుండా నూరుడు రాళ్ళు (Mullers), వడిశెలరాళ్ళు (String balls), కలువాలు (Saddle Vuerns), మొదలగునవి కూడా ఆనాటి మానవుడు ఉపయోగించాడు. అల్ప పరిమాణ పనిముట్లను కూడా నవీన శిలాయుగ మానవుడు ఉపయోగించాడు.

నవీన శిలాయుగ రాతి గొడ్డలి త్రిభుజాకారంతో పిడి భాగము గుండ్రముగా గాని, చతురస్రాకారంగాని, మొనవలె ఉండి రెండవ వైపు కోత అంచు ఉంటుంది. పిడి భాగాన్ని కర్రకు అమర్చి చెట్లు నరకటానికి ఉపయోగించేవారు. బాడిసెలను కర్ర మొదలుగు వాటిని చెక్కడానికి ఉపయోగించేవారు. మధ్య రంధ్రమున్న రాతి పనిముట్టుకు త్రవ్వకపు కర్రలకు బరువు కోసం ఉపయోగించి ఉంటారు.

**3.4.3. నవీన శిలాయుగ సంస్కృతులు :** భారతదేశంలో మొట్టమొదటి నవీన శిలాయుగ రాతి గొడ్డలిని 1842లో మీడోస్ టేలర్ కర్ణాటకలోని లింగసుగూర్ (Ling Sugor) వద్ద కనుగొన్నాడు. రాబర్ట్ బ్రూస్ ఫూట్‌కు 1887లో గుంటూరు జిల్లా వడ్డమాను వద్ద బాడిసె (Adze) దొరికింది. ఆ తరువాత ఫూట్ ఎన్నో నవీన శిలాయుగ స్థావరాలను కనిపెట్టాడు. ఇప్పటి వరకు జరిగిన పురావస్తు పరిశోధనల వలన భారతదేశంలో ఎన్నో నవీన శిలాయుగ ఆవాసాలు బయల్పడ్డాయి.

ఈ పరిశోధనల ఫలితంగా లభ్యమయిన నవీన శిలాయుగ స్థావరాలలో కనిపించే ప్రాంతీయ ప్రత్యేకతల ఆధారంగా భారతదేశంలోని నవీన శిలాయుగ సంస్కృతిని మూడు రకాలుగా పురావస్తు శాస్త్రజ్ఞులు విభజించారు. అవి : (ఎ). ఉత్తర భారత నవీన శిలాయుగం (Northern Neolithic Culture), (బి). తూర్పు భారతీయ నవీన శిలాయుగం (Eastern Indian Neolithic Culture), (సి). దక్షిణ భారత శిలాయుగ సంస్కృతి (Southern Neolithic Culture).

**3.4.3.1. ఉత్తర భారతీయ నవీన శిలాయుగ సంస్కృతి :** ఉత్తర భారతీయ నవీన శిలాయుగ సంస్కృతికి చెందిన ముఖ్యమైన స్థావరము కాశ్మీర్‌లోని బూర్జహాం (Burzahom). శ్రీనగర్‌కు నైరుతి దిశలో 10 కి.మీ. దూరంలో జీలం నదీ ప్రాంతంలో బూర్జహాం ఉన్నది. ఇక్కడ మొదట యేల్ - కేంబ్రిడ్జి యూనివర్శిటి బృందం, తరువాత 1959 భారత పురావస్తు శాఖ త్రవ్వకాలు జరిపారు. ఈ త్రవ్వకాల వలన బూర్జహంలో నవీన శిలాయుగ సంస్కృతికి చెందిన మూడు దశలున్నట్లు తెలిసింది. రేడియో కార్బన్ 14 కాల గణన ప్రకారం మొదటి దశ క్రీ.పూ. 2920 సంవత్సరాలకు చెందినదిగా నిర్ణయించారు. ఈ దశలో ప్రజలు చలి నుండి రక్షణకుగాను భూమిలో గుంటలను తవ్వి వాటిని ఇళ్ళుగా ఉపయోగించారు. వృత్తాకారములో ఉన్న పై భాగము వెడల్పు తక్కువగా ఉండి లోపలికి వెళ్ళే కొద్ది వెడల్పు ఎక్కువగా ఉంటుంది. గుంటలపై భాగములో వాసాల ఆధారంగా పై కప్పును ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్ళు కనిపించాయి. ఇంటి నేలను గోడలను మట్టితో అలికిన గుర్తులున్నాయి. ఇటువంటి గుంట ఇండ్లలో పెద్ద ఇంటి కొలతలు ఈ విధంగా ఉన్నాయి. 3.96 మీటర్ల లోతుతోను, పై భాగంలో ప్రవేశ ద్వారం 2.74 మీటర్ల వ్యాసార్ధంతో, అడుగు భాగం 4.57 మీటర్ల వ్యాసార్ధం తోను ఉన్నది. ఇంటి వాకిలి వద్ద పొయ్యిలు ఏర్పాటు చేసుకొన్నారు.

త్రవ్వకాలలో ముతక బూడిద లేదా నలుపురంగు మట్టి పాత్రలు (Coarse, Grey, buff or black burnished ware) త్రవ్వకాలలో లభించాయి. ఈ పాత్రలు అడుగు భాగం చాప గుర్తులు (Mat impressions) ఉన్నందు వలన వీటిని చేతితో తయారు చేసినట్లు తెలుస్తున్నది. రాతి గొడ్డళ్ళు మధ్యలో రంధ్రమున్న రాతి పనిముట్లు, ఒకవైపు రెండు రంధ్రాలున్న దీర్ఘ చతురస్రాకారపు కత్తులు, హార్పూన్లు, ఎముకలతో చేసిన మొనలు, సూదులు కూడా ఇక్కడ లభించాయి. వీటిలో ఒకవైపు రెండు రంధ్రాలున్న దీర్ఘ చతురస్రాకారపు కత్తులు (Pierced rectangular chopper or Knives) భారతదేశంలో ఇతర ప్రాంతాలలో ఎక్కడా లభించలేదు. ఈ దశలో వ్యవసాయం చేసిన ఆధారాలు కనిపించలేదు.

రెండవ దశలో ఇండ్లను మట్టితో, బంక మట్టి, రాళ్ళలోను నిర్మించుకొని గోడలను బంక మట్టితో అలికారు. మొదటి దశకు చెందిన రాతి, ఎముక పనిముట్లు ఈ దశలో కూడా కొనసాగినవి. ఈ దశ క్రీ.పూ. 1700 సంవత్సరాల వరకు కొనసాగినట్లు రేడియో కార్బన్ కాల

నిర్ణయం ప్రకారం తెలుస్తున్నది. ఈ దశకు చెందిన చివరి స్తరములో రాగి బాణపు మొన ఒకటి లభించింది. ఈ దశకు చెందిన ఎన్నో సమాధులు బయల్పడ్డాయి. శవాలను ఇళ్ళలోనే అండాకారపు గోతులలో కూర్చున్న భంగిమలలోనే సమాధి చేసేవారు. కొన్ని శవాలకు ఎర్రరంగు పూసిన గుర్తులున్నాయి. పెంపుడు కుక్కలను వాటి యజమానులతో ఖననం చేసేవారు. కుక్కలకే కాక, తోడేలు, ఐబెక్స్ (Ibex) వంటి జంతువులకు కూడా సమాధులను ఏర్పాటు చేశారు.

మూడవ దశలో పెద్ద పెద్ద బండరాళ్ళను గుండ్రని ఆకారములో అమర్చి సమాధులను నిర్మించారు. అయితే వీరు ఈ దశలో ఇనుప పనిముట్లు వాడిన దాఖలాలు కనిపించవు. ఈ దశలో ముతక ఎరుపు రంగు మట్టి పాత్రలను ఉపయోగించారు. ఈ దశకు చెందిన నవీన శిలాయుగ స్థావరాలు ఘలిగై (Galigai), లియోబ్నర్ (Leobanr), అలిగ్రామ (Aligrama)లలో బయల్పడ్డాయి. ఇక్కడ గోధుమ, వరి, మొదలగు ధాన్యాలు, ద్రాక్ష గింజ త్రవ్వకాలలో లభించాయి. ఇక్కడ ఇతర పనిముట్లతో బాటు జేడ్ పూసలు లభించాయి.

బూర్జహం సంస్కృతికి చెందిన ఒక వైపు రెండు రంధ్రాలున్న దీర్ఘ చతురస్రాకారపు కత్తులు, జేడ్‌తో తయారు చేసిన పూసలు, నేలలో ఇళ్ళను నిర్మించటం, కుక్కలకు సమాధులు నిర్మించటం మొదలగు లక్షణాలు ఉత్తర చైనా నవీన శిలాయుగ సంస్కృతిలో కన్పిస్తున్నాయి. అందువలన బూర్జహాం నవీన శిలాయుగంలో చైనాకు సాంస్కృతిక, వ్యాపార సంబంధాలున్నట్లు తెలుస్తున్నది.

**3.4.3.2. తూర్పు భారతీయ నవీన శిలాయుగ సంస్కృతి :** తూర్పు భారతీయ నవీన శిలాయుగ సంస్కృతి అవశేషాలు బీహార్, అస్సాం, ఒరిస్సా, బెంగాల్ రాష్ట్రాలలో లభించాయి. బీహార్‌లోని చిరాంద్ అనే గ్రామములో క్రీ.పూ. 2000 సంవత్సరాలకు చెందిన నవీన శిలాయుగ స్థావరం బయల్పడింది. ఇక్కడ వెదురు, మట్టితో నిర్మించిన పూరిపాకల ఆనవాళ్ళు కనిపించాయి. నునుపు రాతి గొడ్డళ్ళు, ఎముకలతో, దుప్పి కొమ్ములతో తయారు చేసిన పనిముట్లు, రాతి బ్లేడులు, మొదలగు పనిముట్లు త్రవ్వకాలలో లభించాయి. కుండలను చేతితో తయారు చేసుకున్నట్లు ఇక్కడ దొరికిన చాప అచ్చులున్న బూడిద రంగు, ఎరుపు రంగుతో మెరుగుపెట్టిన పాత్రల వలన తెలుస్తున్నది. వరి పండించటంతోపాటు చేపల వేట కూడా వీరు చేపట్టినట్లు ఇక్కడ లభించిన వరి పొట్టు, చేపల ఎముకలు ఋజువు చేస్తున్నాయి.

అస్సాంలోని నీఫా, కచార, గారో, నాగా కొండ ప్రాంతాలలో లభించిన నునుపురాతి గొడ్డళ్ళు దక్షిణ చైనా, ఆగ్నేయ ఆసియా దేశాలలోని నవీన శిలాయుగ రాతి గొడ్డళ్ళలను పోలి ఉన్నాయి. గౌహతి సమీపంలోని సరుతరు (Sarutaru) వద్ద గల నవీన శిలాయుగ స్థావరాన్ని తవ్వకాలలో కనుగొన్నారు. ఈ త్రవ్వకాలలో త్రిభుజాకారంలో ఉన్న రాతి గొడ్డళ్ళు, షోల్డర్డ్ పనిముట్లు, ముతకబుట్ట అచ్చులున్న మట్టి పాత్రలు లభించాయి.

ఒరిస్సాలోని దవొజిళి హేడింగ్, కుబాయి మొదలగు చోట్ల నవీన శిలాయుగ స్థావరాలు ఉన్నాయి. కుబాయి వద్ద జరిగిన త్రవ్వకాలలో శిలాయుగ పనిముట్లు స్తరాను క్రమానుసారంగా లభించాయి. స్తరంలో సూక్ష్మ శిలాయుగ రాతి పరిశ్రమ, దానిపై స్తరంలో నవీన శిలాయుగ నునుపు రాతి గొడ్డళ్ళు, ముతక ఎరుపు రంగు మట్టి పాత్రలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని అజయలోయ, పాండు రాజార్ దిబి వద్ద జరిగిన త్రవ్వకాలలో తామ్ర శిలాయుగ అవశేషాలతో పాటు నునుపురాతి గొడ్డళ్ళు కూడా లభించాయి.

**3.4.3.3. దక్షిణ భారతీయ నవీన శిలాయుగం :** దక్షిణ భారతీయ నవీన శిలాయుగ స్థావరాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ - తమిళ రాష్ట్రాలలో ఎక్కువగా ఉన్నాయి. త్రవ్వకాలు జరిగిన ముఖ్యమైన నవీన శిలాయుగ ప్రదేశాలు - కర్ణాటక రాష్ట్రంలోని సంగనకల్లు, టెక్కలికోట, పిక్లిహాలు, టి. నర్సిపూర్, కుపగల్, హెమ్మిగె, బ్రహ్మగిరి, హల్లూరు, మస్కి, మొదలగునవి. ఆంధ్రప్రదేశ్‌లో ఉట్నూరు, కేసరపల్లి, పాలవాయి, నాగార్జున కొండ, గండ్లూరు, పాలకొండ, పూసలపాడు, పాతపాడు, రామాపురం, వీరాపురం, జామి మొదలగునవి. తమిళనాడులోని పాయంపల్లి, మొ॥ దక్షిణ భారతీయ శిలాయుగ తొలి దశలో లోహం వాడుకలో లేదు. తరువాతి దశల్లో లోహం పనిముట్లు వాడుకలోకి వచ్చాయి. బహుశా మహారాష్ట్ర, మధ్య భారతదేశ ప్రాంతాలలోని తామ్ర శిలాయుగ సంస్కృతులతో ఏర్పడిన సాంస్కృతిక, వ్యాపార సంబంధాల వలన ఈ పరిణామం జరిగి ఉండవచ్చును.

దక్షిణ భారతీయ నవీన శిలాయుగ సంస్కృతిలో మూడు దశలున్నట్లు అల్చిన్ దంపతులు నిర్ధారించారు.

**(1). మొదటి దశ :** మొదటి దశలో ప్రజలు తమ ఆవాసాలను సమతల గ్రానైట్ కొండలపైన, పర్వత పాద పీఠ ప్రాంతాలలో చదరపు వేదికలు తయారు చేసుకొని నిర్మించుకొన్నారు. ఆంధ్రలోని ధోగరాయి, కదంబపూర్, అనంతపూర్, కర్ణాటకలోని బళ్ళారి, రాయచూర్ జిల్లాలోని గ్రానైట్ రాతి గుట్టలు నవీన శిలాయుగ రాతి పనిముట్లు తయారీ కేంద్రాలుగా ఉన్నట్లు అక్కడ లభించిన నునుపు రాతి గొడ్డళ్ళు, అసంపూర్తిగా ఉన్న పనిముట్ల వలన తెలుస్తున్నది. ఈ రాతి గొడ్డళ్ళను డోలరైట్, బసాల్ట్ మొదలయిన శిలతో తయారు చేసుకున్నారు. త్రిభుజాకార గొడ్డళ్ళు, బాడిసలు (Adzes) కలువాలు, పోత్రాలు, చెర్ట్‌తో చేసిన అనేక రకాల బ్లేడ్ పనిముట్లు, మధ్య రంధ్రమున్న పరికరాలు మొదలగు పనిముట్లను ఉపయోగించారు. చేతితో తయారు చేసిన మట్టి పాత్రలను వాడేవారు. ఈ మట్టి పాత్రలలో బూడిద రంగు లేదా లేత గోధుమ రంగు, నలుపు లేదా ఎరుపు రంగు పామిన పాత్రలు, వంగరంగు పాత్రలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పాత్రలకు అమ్రి కాలీ బంగన్ మొదలగు ప్రదేశాలలో లభించిన పూర్వ హరప్పా మట్టి పాత్రలకు పోలికలు కనిపిస్తాయి.

వ్యవసాయం, పశుపోషణలపై ఆనాటి ఆర్థిక వ్యవస్థ ఆధారపడింది. పిక్లిహాల్‌లో దొరికిన మూపురం ఉన్న ఎద్దు మట్టి బొమ్మలు, కుపగల్, మస్కి, పిక్లిహాల్‌లలో దొరికిన పశువుల రాతి బొమ్మలు, పశువుల చిత్రాలు, మొదలగునవి ఆనాటి ఆర్థిక వ్యవస్థలో పశువుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. ఈ తొలి దశలో లోహాల వాడకం లేనందున ఈ దశను ప్రాథమిక నవీన శిలాయుగమని చెప్పవచ్చును. కార్బన్ 14 పద్ధతి ప్రకారం దక్షిణ భారతీయ శిలాయుగ తొలిదశ క్రీ.పూ. 2500 నుండి క్రీ.పూ. 1800 వరకు కొనసాగినట్లు నిర్ణయించారు.

**2. రెండవ దశ :** రెండవ దశలో పర్వతాల వద్ద చదును చేసిన ప్రాంతాలలోను, గ్రానైట్ కొండలలోను జనావాసాలు కొనసాగినవి. అయితే రెండు దశలలో గృహ నిర్మాణంలో అభివృద్ధి కనిపిస్తుంది. వృత్తాకార తడికెల గుడిసెలున్నట్లు ఆధారాలు లభించాయి. ఈ గుడిసెలను కొయ్య చట్రాల మీద నిర్మించారు. నేలను బంక మట్టితో అలికేవారు. నునుపు రాతి గొడళ్ళ పరిశ్రమ, రాతి బ్లేడ్ పరిశ్రమలు రెండవ దశలోను కొనసాగినవి. మట్టి పాత్రలలో కొన్ని కొత్త మార్పులు వచ్చాయి. చిల్లులున్న పాత్రలు (Perforated Vessels) ఉపయోగించారు. ఈ పాత్రల వెలుపలి వైపు ముతకగా గరుకుగా ఉన్నది. ఇటువంటి కుండలకు బెలూచిస్తాన్‌లో లభించిన పూర్వ హరప్పా సంస్కృతికి చెందిన మట్టి పాత్రలకు పోలికలు బాగా కనిపిస్తున్నాయి. తొలిసారిగా ఈ దశలో ఒక కొమ్ము పాత్ర (Spoulted Vessel) పాతపాడులో దొరికింది. రాగి, కంచు వస్తువులు వాడుకలోకి వచ్చాయి. ఈ దశ చివరి కాలంలో ఈ వస్తువులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. టెక్కలి కోటలో రెండు బంగారు ఆభరణాల లభించాయి. ఈ రెండవ దశ క్రీ.పూ. 1800 నుండి క్రీ.పూ. 1500 వరకు కొనసాగింది.

**3. మూడవ దశ :** మూడవ దశలో రాగి, కంచు వస్తువుల ఉపయోగం మరింత ఎక్కువయ్యింది. నునుపురాతి గొడ్డళ్ళు, రాతి బ్లేడ్ పనిముట్లు పరిశ్రమ కొనసాగింది. కుమ్మరి సారె మీద పాత్రలు తయారు చేసే నైపుణ్యం ఈ దశలోనే ప్రారంభమైంది. మట్టి పాత్రలలో కొత్తగా బూడిద రంగుని లేత పసుపు రంగు పాత్రలు వచ్చాయి. ఈ పాత్రలకు మహారాష్ట్రలోని తామ్ర శిలాయుగం నాటి జోర్వే పాత్రలకు దగ్గరి పోలికలున్నాయి. హల్లూర్‌లో మచ్చిక చేసి గుర్రం ఎముక లభించింది. అంతే కాకుండా ఈ ప్రాంతంలోని కొన్ని కొండరాళ్ళపై చిత్రించిన గుర్రాల, రౌతుల బొమ్మలు సాంస్కృతిక మార్పులు తెలియజేస్తున్నాయి. కల్లూరులో కంచు లేదా రాగి కత్తులు లభించాయి. ఇటువంటి కత్తులు ఇరాన్‌లో దొరికిన కత్తులకు పోలికలు ఉన్నాయి. అంతే కాకుండా వస్తు సంస్కృతిలోను, ఖనన ఆచారాలలోను పోలికలున్నందు వలన ఈ కాలంలో ఇరాన్ నుండి జనం వచ్చారని అల్చిన్ అభిప్రాయపడినాడు. ఈ మూడవ దశ క్రీ.పూ. 1400 సంవత్సరాల నుండి క్రీ.పూ. 1050 వరకు కొనసాగినట్లు నిర్ణయించారు. మరణించినవారికి మృత సంస్కారాలు జరిపినట్లు త్రవ్వకాలలో బయల్పడిన సమాధుల వలన తెలుస్తున్నది పిల్లలను కుండలలో పెద్ద సమాధి చేసేవారు. నవీన శిలాయుగ స్థలాలలో జరిగిన త్రవ్వకాలలో ఎద్దు, ఆవు, గేదె, గొర్రె, మేక, పంది, కుక్క, మొదలగు మచ్చిక చేసిన జంతువుల అవశేషాలు బయల్పడ్డాయి.

దక్షిణ భారతీయ నవీన శిలాయుగ ఆవాసాలు వర్షాధార, నీటి పారుదల ద్వారా వ్యవసాయానికి అనువైన ప్రదేశాలలో ఏర్పడ్డాయి. త్రవ్వకాలలో లభించిన ధాన్యపు గింజల వలనే నవీన శిలాయుగ ప్రజలు జొన్నలు, ఉలవలు, బార్లీ, మినుములు, వరి, పెసలు మొదలగు పంటలు పండించేవారని తెలుస్తుంది.

**3.4.4. బూడిద కుప్పలు :** ఉట్నూరు, కుప్‌గల్, కోడేకల్, పాలవాయి మొదలగు చోట్ల బూడిద కుప్పలు (Ash Mounds) కనిపిస్తున్నాయి. ఇటువంటి బూడిద కుప్పల్లో కొన్ని అడవి జంతువుల దొడ్లు లేదా పశువుల్ని మందగా వుంచిన కొట్టాలు. ప్రస్తుత రాయలసీమ ప్రాంత గ్రామాలలో పశువుల్ని యింటి ఆవరణల్లో కాక అటవీ పశు క్షేత్రాల్లో వుంచుతారు. ఆ అలవాటు నవ్య శిలాయుగ ఆవుల కొష్టాల్లో ఆవు పేడ గుట్టలు వున్నాయి. యీ గుట్టలు యేదో కర్మకాండలా దహనం చెయ్యడం వలన ఏర్పడినవే యీ బూడిద కుప్పలు. ఇప్పటి వరకు దాదాపు 70 బూడిద కుప్పలున్న నవీన శిలాయుగ స్థావరాలను కనుగొన్నారు.

## 3.5. సారాంశము :

ప్రాచీన మానవునికి సంబంధించిన చరిత్ర పూర్వ యుగంలోని శిలాయుగమునకు సంబంధించిన ప్రాచీన శిలాయుగము సూక్ష్మ శిలాయుగము మరియు నవీన శిలాయుగమునకు గల ప్రాచీన మానవుడు యొక్క ప్రవృత్తి ఆహార అన్వేషణ స్థాయి నుంచి ఆహారోత్పత్తి వరకు గల వివిధ దశలు తెలియజేయబడినాయి.

**పాఠం - 3.5. & 3.6.**

# 1. తామ్ర శిలాయుగము, 2. బృహచ్ఛిలాయుగము.

**3.5.0. లక్ష్యం :**

ప్రాచీన చరిత్రలోని తామ్ర శిలాయుగము, బృహశ్చిలాయుగము గురించి వివరించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**

**3.5.** తామ్ర శిలాయుగము

- **3.5.1.** తామ్ర నిక్షేప సంస్కృతి
- **3.5.2.** ఆహార సంస్కృతి
- **3.5.3.** మాళ్వా సంస్కృతి
- **3.5.4.** కాయిథా సంస్కృతి
- **3.5.5.** దక్కన్ తామ్ర యుగ సంస్కృతి

**3.6.** బృహచ్ఛిలాయుగము

- **3.6.1.** బృహశ్చిలాయుగ సమాధుల్లో రకాలు
- **3.6.2.** వస్తు - సంస్కృతి
- **3.6.3.** మత పరిస్థితులు
- **3.6.5.** కాలము

**3.7.** సారాంశము

**3.8.** నమూనా ప్రశ్నలు

**3.9.** చదువదగిన గ్రంథాలు

## 3.5. తామ్ర శిలాయుగం (Chalcolithic Age) :

మానవుడు రాగి లోహాన్ని పనిముట్లు తయారీకి ఉపయోగించుటతో మానవ నాగరికతలో ముఖ్యమైన మార్పు వచ్చింది. మానవుడు లోహాన్ని ఉపయోగించినప్పటికి రాతి పనిముట్లను విడిచిపెట్టక వాటిని కూడా పనిముట్ల తయారీకి ఉపయోగించినందువలన ఈ యుగాన్ని తామ్ర శిలాయుగం (Chalcolithic Age) అని పిలుస్తారు. రాగి తరువాత మానవుడు బంగారు, కంచు లోహాలను ఉపయోగించాడు. తామ్ర శిలాయుగానికి చెందినదే హరప్పా సంస్కృతి. ఈ యుగానికి చెందిన స్థావరాలు బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో బయల్పడినవి. రాజస్థాన్, బెలూచిస్థాన్, సింధు రాష్ట్రాలలో హరప్పా సంస్కృతి కంటే పూర్వ కాలము నాటి తామ్ర శిలాయుగ ఆవాసాలను త్రవ్వకాలలో కనుగొన్నారు. కాలీ బంగన్‌లో హరప్పా సంస్కృతి ప్రారంభ దశకు చెందిన ఇటుకలతో నిర్మించిన గృహాలు, బొమ్మల లిపిలో వ్రాసి ఉన్న ముద్రికాలు లభించాయి. ఇక గంగా మైదాన ప్రాంతంలో లభించిన గొడ్డళ్ళు, కత్తులు, చాకులు, పంట్ర కోలలు (Harpoons) మొదలగు రాగి పనిముట్లు హరప్పా సంస్కృతి తరువాతి దశకు చెందినవి. మధ్య భారతదేశములోను, దక్కన్‌లోను బయల్పడిన తామ్ర శిలాయుగ స్థావరాలు సింధు నాగరికత తరువాత కాలానికి చెందినవి. ఆహార్, నర్మ, నవదతోలి, ప్రకాష్, బెహారా, కాయధా, నెవాస

మొదలగు చోట్ల తామ్ర శిలాయుగ స్థావరాలున్నాయి. ఈ ప్రదేశాలలో లభించిన సంస్కృతులలో ప్రాంతీయ ప్రత్యేకతలు, భేదాలు ఉన్నందువలన ఆయా సంస్కృతుల ప్రధాన కేంద్రాల పేరుగా వాటిని పురవాస్తు శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి తామ్ర నిక్షేప సంస్కృతి (గంగా యమునా మైదానం), ఆహార సంస్కృతి (రాజస్థాన్), మాళ్వా సంస్కృతి (మధ్య ప్రదేశ్), కాయధ సంస్కృతి, దక్కన్ తామ్ర శిలాయుగ సంస్కృతి అయితే అల్చిన్ ఈ తామ్ర శిలాయుగాన్ని పశ్చిమ, గంగా యమునా అంతర్వేది, తూర్పు, దక్కన్ సంస్కృతులుగా వర్గీకరించాడు. ఈ సంస్కృతులు క్రీ.పూ. 1000 సం॥ నాటికి క్షీణించాయి.

**3.5.1. తామ్ర - నిక్షేప సంస్కృతి** (Copper Hoard Culture) **:** గంగా - యమునా మైదాన ప్రాంతంలో సింధు నాగరికత తరువాత కాలం నుండి ఇనుప యుగం PGW సంస్కృతి ప్రారంభమయ్యేంత వరకు వ్యాప్తిలో ఉన్న సంస్కృతి తామ్ర నిక్షేప సంస్కృతి (Copper hoard Culture) అని అంటారు. ఈ సంస్కృతి అవశేషాలు కేవలం గంగా మైదానంలోనే కాక చోటా నాగపూర్, మధ్య ప్రదేశ్, దక్కన్, ప్రాంతాలలో కూడా లభించాయి. ఈ సంస్కృతికి చెందిన రాగి పనిముట్లు, ఆయుధాలలో ముఖ్యమైనవి 1. చతురస్రంగా వెడల్పుగా సాగిన అంచులున్న గొడ్డళ్ళు, 2. కుంభాకారపు అంచుతో రెండవ వైపు భుజమున్న గొడ్డళ్ళు, 3. పొడుగాటి కాడ వలె ఉండి ఒక వైపు సాగగొట్టబడిన అంచున్న బార్ సెల్ట్‌లు (Bar Celts), 4. రింగులు, 5. పంట్రకోలలు (Harpons), 6. బాకులు, 7. పిడిగల కత్తులు, 8. మానవాకృతిలో ఉన్న వస్తువులు.

తామ్ర నిక్షేప సంస్కృతి ప్రజలు మందంగా ఉన్న ఎరుపు రంగు మట్టి పాత్రలను ఉపయోగించారు. ఈ పాత్రలను ఓకర్ రంగు పాత్రలు (Ochre Coloured Pottery) అంటారు. ఇటువంటి పాత్రలు హస్తినాపూర్, షహరాన్ పూర్ మొదలగు ప్రదేశాలలో ఎక్కువగా లభించాయి. తామ్ర శిలాయుగ సంస్కృతులు పంజాబ్, రాజస్థాన్ ప్రాంతాల నుండి తూర్పు దిశగా గంగా-యమునా ప్రాంతానికి వ్యాప్తి చెందినట్లు ఇటీవల జరిగిన పరిశోధనల ద్వారా తెలుస్తున్నది. సాపేక్ష కాల నిర్ణయం ప్రకారం ఈ తామ్ర నిక్షేప సంస్కృతి క్రీ.పూ. 1500 సంవత్సరాల నాటిదని చెప్పవచ్చును.

**3.5.2. ఆహార్ సంస్కృతి :** రాజస్థాన్‌లోని ఉదయపూర్ సమీపాన వున్న ఆహార్ ఈ సంస్కృతికి ప్రధాన కేంద్రమైనందున ఆహార్ పేరు మీదుగా దీనిని ఆహార్ సంస్కృతి అని పిలిచారు. బాణాస్, చంబల్ నదీ లోయల ప్రాంతాలలో, రాజస్థాన్‌లోని ఉదయపూర్, చితోడ్‌గడ్, ఖిల్వారా జిల్లాలోను ఈ సంస్కృతికి చెందిన స్థలాలున్నాయి. ఆహార్ వద్ద, జరిగిన త్రవ్వకాల వలన ఈ సంస్కృతిలో మూడు దశలున్నట్లు తెలుస్తునది. మొదటి దశ క్రీ.పూ. 2580 నుండి క్రీ.పూ. 2170 సంవత్సరాల వరకు, రెండవ దశ క్రీ.పూ. 2080 సంవత్సరాల నాటిదని, మూడవ దశ క్రీ.పూ. 1500 సంవత్సరాల వరకు కొనసాగిందని రేడియో కార్బన్ కాల నిర్ణయ పద్ధతి వలన తెలుస్తున్నది.

ఆహార్ సంస్కృతిలో రాగి గొడ్డళ్ళు, రాగితో చేసిన వస్తువులు అధిక సంఖ్యలో ఉపయోగించారు. ఇక్కడ రాతి గొడ్డళ్ళు గాని, రాతి బ్లేడ్‌లు వంటి రాతి పనిముట్లు ఏమీ లభించలేదు. ముడి రాగిని కరిగించి రాగి పనిముట్లు, వస్తువులు తయారు చేసుకున్న ఆధారాలు దొరికేయి. నగిషీ చేసిన నలుపు, ఎరుపు లేదా మీగడ రంగు మట్టి పాత్రలు ఎక్కువగా వాడారు. కలువాలు పాత్రలు, మూపురం ఉన్న ఎద్దు టెర్రకోటా బొమ్మలు, లభించాయి. గాడిదలు, ఎద్దులు, గేదె, మేక, గొర్రె మొదలగు పెంపుడు జంతువుల ఎముకలు త్రవ్వకాలలో దొరికాయి. రాగి గాజులు, రాగి ఉంగరాలు, టెర్రకోటా పూసలు ఉపయోగించేవారు. జింకలను ఎక్కువగా వేటాడేవారని తెలుస్తున్నది. వరి, సజ్జ, మొదలగు పంటలు పండించేవారు. ఇళ్ళ దీర్ఘ చతురస్రాకారంగా నిర్మించారు. త్రవ్వకాలలో బయల్పడిన ఒక ఇంటి కొలతలు 10×8 మీటర్లతో ఉన్నవి. ఇళ్ళను రాళ్ళలోను, బంకమట్టితో, పచ్చి ఇటుకలతోను నిర్మించుకున్నారు.

ఉదయపూర్‌కు ఈశాన్య దిశలో 80 కి.మీ. దూరంలో ఉన్న గిలుండ్ అనే ప్రదేశంలో ఆహార్ సంస్కృతి అవశేషాలు బయల్పడ్డాయి. ఇక్కడ ఇళ్ళను పచ్చి ఇటుకలలో ఎత్తైన వేదిక మీద నిర్మించుకున్నారు. ఆహార్‌లో లభించినటువంటి మట్టి పాత్రలు ఇక్కడ కూడా లభించాయి. మూపురం ఉన్న ఎద్దు టెర్రకోట బొమ్మలు ఎక్కువగా దొరికాయి. రాగి గొడ్డళ్ళతో పాటు ఇక్కడ రాతి బ్లేడ్‌లు కూడా దొరికినవి. ఈ సంస్కృతి క్రీ.పూ. 1800-1200 సంవత్సరాల కాలానికి చెందినది.

**3.5.3. మాళ్వా సంస్కృతి :** ఆరావళీ పర్వతాలకు, బాణాస్ నదికి తూర్పున మధ్యప్రదేశ్‌లో సారవంతమైన మళ్వా పీఠభూమి ప్రాంతము ఉన్నది. ఈ పీఠభూమి ఉత్తర భాగంలో చంబల్ నది దక్షిణ ప్రాంతంలో నర్మదానది ప్రవహిస్తున్నాయి. నర్మదా నదీ తీరంలో ఉన్న మహేశ్వర, నవద తౌలి, చంబల్ నదీ తీరంలోని నగ్దా అనే గ్రామాలు మళ్వా సంస్కృతికి ముఖ్య కేంద్రాలు. నవద తౌలిలో జరిగిన త్రవ్వకాల వలన అక్కడ నాలుగు దశలలో ఈ సంస్కృతి అభివృద్ధి చెందినట్లు తెలుస్తున్నది. ఈ సంస్కృతి క్రీ.పూ. 2020 నుండి క్రీ. పూ. 1660 వరకు కొనసాగింది. ఈ సంస్కృతి మొదటి దశలో రాగి గొడ్డళ్ళు, పనిముట్లతో పాటు రాతి బ్లేడ్ పనిముట్లను కూడా ఉపయోగించారు. పశువులు, గొర్రెలు, మేకలు, పందులు మొదలగు జంతువులను మచ్చిక చేసి పెంచారు. జింకలను వేటాడేవారు. చేతిలో తయారయిన మట్టి పాత్రలను ఉపయోగించారు. ఈ పాత్రలలో నగిషీ చేసిన నలుపు-ఎరుపు రంగు మట్టి పాత్రలు, ఎరుపు రంగు పామిన నలుపు రంగు చిత్రించిన పాత్రలు, మీగడ రంగు పామిన నలుపు రంగు చిత్రించిన పాత్రలు, బూడిద పాత్రలు ఉన్నాయి. వీటిలో ఎరుపు రంగు పామిన నలుపు రంగు చిత్రించిన పాత్రలు మాళ్వా ప్రాంతంలో సర్వ సాధారణంగా లభిస్తున్నందున వీటి మళ్వా మట్టి పాత్రలు (Malwa Ware) అంటారు.

నవదతౌలి రెండవ దశంలో అక్కడక్కడ ఆ గ్రామం తగులబడిన ఆనవాళ్ళు కనిపించాయి. ఈ దశలో వరిని పండించేవారు. నగిషీ చేసిన నలుపు - ఎరుపు రంగు మట్టి పాత్రలు ఉపయోగించలేదు. మూడవ దశ ప్రారంభంలో ఈ గ్రామంలో అధిక భాగం తగులబడిన ఆధారాలతోపాటు పశ్చిమ ప్రాంతం నుండి ప్రజలు వలస వచ్చారనడానికి సూచనలు కనిపిస్తున్నాయి. ఈ దశలో అంతకు ముందు ఉపయోగించని Spouted Vessels వాడుకలోకి వచ్చాయి. చక్రంతో తయారు చేసిన నల్ల రంగు చిత్రించిన ఎర్రరంగు మట్టి పాత్రలు (Red Ware with black paint) ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఇటువంటి మట్టి పాత్రలను జోర్వే పాత్రలు అని అంటారు. రాగితో చేసి చేపల గాలాలను ఉపయోగించారు. గోధుమ, వరి, నూనె గింజలు, పెసలు, మొదలగు ధాన్యాలను పండించేవారు.

మాళ్వా సంస్కృతిలో గుండ్రని, చతురస్రాకారంలో ఇళ్ళను నిర్మించుకున్నారు. ఈ ఇళ్ళను వెదురు బొంగులు, బంకమట్టితో నిర్మించారు. ఇంటి లోపల బంక మట్టితో, ఆవు పేడతో నేలను అలికేవారు. కొన్ని ఇళ్ళలో సున్నంతో అలికినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. చతురస్రాకారపు ఇళ్ళు పెద్దవిగాను వృత్తాకారపు ఇండ్లు చిన్నవిగాను ఉన్నాయి. 12 మీటర్ల పొడవు 6 మీటర్ల వెడల్పుగల ఇల్లు త్రవ్వకాలలో బయల్పడింది. వృత్తాకారపు ఇళ్ళు 2.75 మీటర్ల వ్యాసార్థంలో ఉన్నాయి. ఈ ఇళ్ళను ధాన్యము, ఇతర వస్తువులను ఉంచేందుకు ఉపయోగించారు.

నవదతోలికి 300 కి.మీ. దూరంలో చేత్వానది ఒడ్డునున్న ఎరాన్ వద్ద, జబల్‌పూర్ సమీపంలో ఉన్న త్రిపురిలలో కూడా మాళ్వా సంస్కృతి అవశేషాలు కనిపించాయి. ఇక్కడ క్రీ.పూ. 1700 నుండి 1170 వరకు ఈ సంస్కృతి కొనసాగింది.

**3.5.4. కాయథా సంస్కృతి :** మధ్యప్రదేశ్‌లో ఉజ్జయినికి తూర్పున 25 కి.మీ. దూరంలో కాయథా వద్ద V.S. వాకంకర్, Z.A. అన్సారీ, M.K. ధవళీకర్‌లు జరిపిన త్రవ్వకాల వలన తామ్ర శిలాయుగానికి చెందిన కాయథా సంస్కృతి వెలుగులోకి వచ్చింది. కాయధా గ్రామం ఛోటి కాలిసింధ్ అనే చిన్న నది ఒడ్డున ఉన్నది. ఇక్కడ జరిగిన త్రవ్వకాల వలన కాయథా సంస్కృతిలో నాలుగు దశలున్నట్లు తెలుస్తున్నది. మొదటి దశ క్రీ.పూ. 2400-2120 సంవత్సరాల కాలానికి చెందింది. రెండవదశ క్రీ.పూ. 2100-1800 సంవత్సరాలకు, మూడవ దశ క్రీ.పూ. 1800-1500 సంవత్సరాలకు చెందినది.

కాయథా ప్రజలు పెండెపోసి కట్టిన ఇళ్ళలో నివసించేవారు. గోధుమ మొదలగు ఆహార ధాన్యాలను పండించారు. జంతువులను మచ్చిక చేశారు. తాబేళ్ళను కూడా ఆహారంగా స్వీకరించినట్లు తెలుస్తున్నది. వీరు రాగితో చేసిన గొడ్డళ్ళు, ఉలులు, గాజులు, ఉపయోగించారు. చాల్సిడోని రాతి బ్లేడ్‌ల పరిశ్రమ కొనసాగింది. స్టియటైట్‌తో చేసిన చిన్న పూసలు అధిక సంఖ్యలో లభించాయి. ఈ సంస్కృతికి చెందిన మట్టి పాత్రలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును. అవి. 1. గట్టిగా నాజూగా ఉన్న ముదురు గోధుమ రంగు మట్టి పాత్రలు (Sturdy Fine Pottery with thick dark brown slip) ఈ పాత్రలపై ఊదా రంగుతో చిత్ర లేఖనం కనిపిస్తుంది. ఇటువంటి పాత్రలను కాయథా మట్టి పాత్రలు (Kayatha Ware) అంటారు. 2. ఎరుపు రంగు పూసిన బఫ్ రంగు పాత్రలు (Red Painted buff ware), 3. ఎరుపు రంగు ముతక పాత్రలు (Coarse red ware), ఈ పాత్రలు గాట్లతో నగిషీ చేయబడి ఉంటాయి. అందువలన ఈ పాత్రలను కాయథా

ఇన్ సైజుడ్ వేర్ (Kayatha Incised ware), అని కూడా అంటారు. కాయధాలోని రెండవ దశలో టెర్రకోట ఎద్దు బొమ్మలు ఎక్కువగా కనిపించాయి. వీటిని మత సంబంధమైన వస్తువులుగా ఉపయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు.

**3.5.5. దక్కన్ తామ్ర శిలాయుగ సంస్కృతి :** తామ్ర శిలాయుగ సంస్కృతికి చెందిన ప్రదేశాలలో ఎక్కువగా త్రవ్వకాలు జరిగిన ప్రదేశాలు దక్కన్‌లో ఉన్నాయి. ఇటువంటి ప్రదేశాలలో ముఖ్యంగా పేర్కొనదగినవి జోర్వే, ప్రకాష్, బాహల్, నెవాసా, దైమాబాద్, చాందోలి, సోనేగామ్, ఇనాంగామ్ మొదలగునవి. తామ్ర శిలాయుగ ప్రారంభ దశకు చెందిన అవశేషాలు దైమాబాద్, ప్రకాష్‌లలో లభించాయి. ఈ దశలో మొదటిసారి రాగి పనిముట్లను ఉపయోగించారు. మూడవ దశకు చెందిన దక్కన్ ప్రాంత తామ్ర శిలాయుగ సంస్కృతిని జోర్వే సంస్కృతి అంటారు. ఈ కాలంలో ప్రజలు బొంగులతో పెండెపోసి ఇళ్ళను నిర్మించుకున్నారు. దీర్ఘ చతురస్రాకారపు గొడ్డళ్ళు, ఉలి, బాకు, చేపలు పట్టే గాలాలు మొదలగు పనిముట్లను రాగితో చేసుకున్నారు. రాతి బ్లేడ్‌లను కూడా ఉపయోగించారు. ముతక బూడిద రంగు మట్టి పాత్రలు, చిత్రాలంకృతమైన ఎరుపు రంగు జోర్వే పాత్రలు ఎక్కువగా వాడుకలో ఉన్నవి. త్రవ్వకాలలో లభ్యమైన మట్టి పాత్రలలో వెడల్పైన కంబాలు (Dough plates) గుండ్రని పాత్రలు, కొమ్ము పాత్రలు (Channel spouted vessels) జంతువుల ఆకారంలో ఉన్న పాత్రలు (Theomorphic Vessels) పాత్రల మూతలు (lids) మొదలగునవి ముఖ్యమైనవి. ధాన్యాన్ని నిలువ చేసేందుకు నాలుగు అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పుగల కుండలను కూడా తయారు చేసుకున్నారు.

నెవాసా, చాందోలిలో లభించిన నూలు, సిల్కు ధారాల పోగుల వలన వీరికి నేత పరిశ్రమ తెలుసని వెల్లడయ్యింది. వీరు రాగితోనే కాక అగేట్, ఎమ్ జోనైట్, కార్నీలియన్, మొదలగు విలువైన రాళ్ళతో పూసలు తయారు చేసుకొనేవారు. వివిధ రకాలైన ఆహార ధాన్యాలను పండించేవారు. పశువులు, గొర్రెలు, మేకలను మచ్చిక చేసి పెంచేవారు. వీరు పశువులు, గొర్రె, పంది, మొదలగు జంతువుల మాంసాలను తినేవారని నెవాసాలో లభ్యమయిన ఎముకల వలన తెలుస్తున్నది. మృతులలో పిల్లలను పెద్ద పెద్ద కుండలలో ఇళ్ళలోనే పాతిపెట్టేవారు. నెవాసా, చాందోలి, సొన్‌గామ్ మొదలగు ప్రదేశాలలో క్రీ.పూ. 1375-1050 సంవత్సరాల మధ్యకాలంలో ఈ దశ కొనసాగిందని రేడియో కార్బన్ పద్ధతి ద్వారా తెలుస్తున్నది.

**3.5.6. ఆంధ్రప్రదేశ్‌లో తామ్ర శిలాయుగం :** దక్షిణ భారతదేశంలో తామ్ర శిలాయుగ సంస్కృతి ఉండేది కాదని నవీన శిలాయుగం నుండి నేరుగా ఇనుపయుగాని మానవ నాగరికత పరిణామం చెందినదే భావము ఒకప్పుడుండేది. కాని బ్రహ్మగిరి, పుదుచ్చేరి మొదలగు చోట్ల లభించిన రాగి, కంచు పనిముట్లు దక్షిణ భారతదేశానికి తామ్ర శిలాయుగ సంస్కృతిలో ఉన్న పరిచయాన్ని తెలియజేసినవి. కృష్ణా జిల్లాలోని కేసరపల్లి గ్రామంలో లభించిన తామ్ర శిలాయుగానికి చెందిన రాగి పనిముట్లు, కర్నూలు జిల్లా పాతపాడు మొదలగు గ్రామాలలోని చిత్రాలంకృత మట్టి పాత్రలు మొదలగు అంశాలు దక్షిణ భారతతీయులకు మధ్య భారత, మహారాష్ట్ర తామ్ర శిలాయుగ ప్రజలతో సంబంధాలున్నాయని నిరూపిస్తున్నవి.

ప్రకాశం జిల్లాలోని పూసలపాడు, నరవ గ్రామాలలోను, కర్నూరు జిల్లాలోని రామాపురం, మొదలగు ప్రాంతాలలో జరిగిన త్రవ్వకాలలో తామ్ర శిలాయుగానికి చెంది అనేక మట్టి పాత్రల శకలాలు, గుండ్రని తెల్లపూసలు లభించాయి. తామ్ర శిలాయుగంలో ఆంధ్ర కర్ణాటక ప్రాంతాలకు ఒకే కేంద్రం నుండి ఈ సంస్కృతి వ్యాపించి ఉండవచ్చును.

## 3.6. బృహచ్ఛిలాయుగం :

దక్షిణ భారతదేశంలో క్రీ.పూ. 1000 సంవత్సరాల ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థలలో ఎన్నో ప్రముఖమైన మార్పులు వచ్చాయి. ఈ సమయంలోనే నీటి పారుదల, వ్యవసాయం, సమాధుల నిర్మాణం, ఇనుము తయారీలో సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి, విపణి ఆర్థిక వ్యవస్థలు వచ్చాయి. ఇనుము సాంకేతిక పరిజ్ఞానము పెరగడం సంస్కృతిపై గాఢమైన ప్రభావాన్ని చూపింది. అడవులు నరకడానికి గొడ్డళ్ళు, పొలాలు దున్నడానికి నాగటి కర్రులు, ఇళ్ళ నిర్మాణానికి వడ్రంగం పనిముట్లు, రక్షణకీ, దాడి చెయ్యడానికి ఆయుధాలు ఇలా ఎన్నో ఇనుప వస్తువులు తయారయ్యాయి. ఈ పరిమాణామాలు తొలి చారిత్రక దశ ఆవిర్భావానికి దారి తీశాయి.

భారతదేశంలో ఇనుప యుగాన్ని బృహచ్ఛిలాయుగం అని అంటున్నారు. దక్షిణ భారతదేశంలో బృహచ్ఛిలాయుగ సంస్కృతి నవీన శిలాయుగ, తామ్ర శిలాయుగ సంస్కృతులను అనుసరించి వచ్చాయి. సాధారణంగా బృహచ్ఛిలాయుగ సమాధులున్న ప్రాంతం గ్రానైట్ పరిధిలో ఉన్నది. గ్రానైట్ లేని చోట స్థానికంగా లభించే శిలలను సమాధులను నిర్మించారు. దక్షిణ భారతదేశంలో అనేక ప్రాంతాలలో వ్యాపించి ఉన్న బృహచ్ఛిలాయుగ నిర్మాణాలు కొన్ని వేలదాకా ఉంటాయి.

బృహచ్ఛిలాయుగ సమాధులను రాక్షసుల నివాసాలుగా భావించి ప్రజలు వాటి 'రాక్షస గుళ్ళు' అని పేరు పెట్టారు. రాయలసీమలో వీటిని 'పాండవ గుళ్ళు' అని అంటారు. కొన్ని ప్రాంతాల్లో యీ సమాధులలో వీరులను ఖననం చేశారనే విశ్వాసంతో ఆ ప్రదేశాలలో పేర్లకు ముందు 'వీర' పదాన్ని చేర్చారు. అటువంటి గ్రామాలే వీర్లపాడు, వీరాపురం, వీరలదిన్నె మొదలైయినవి.

1832లో బాబింగ్టన్ బృహచ్ఛిలా నిర్మాణాల్ని వివరిస్తూ ఒక పరిశోధనా పత్రాన్ని ప్రకటించాడు. బృహచ్ఛిలా స్థలానికి సంబంధించిన మొట్ట మొదటి తవ్వకం తమిళనాడులోని ఆదిచ్చనల్లూర్‌లో జరిగింది. 19వ శతాబ్దంలో జాగర్ అనే అతడు యీ త్రవ్వకాలను మొదలుపెట్టారు. 1879 ప్రాంతంలో రివెట్ కార్నెక్ మహారాష్ట్రలోని జునాపానిలో త్రవ్వకాలు నిర్వహించాడు. శాస్త్రీయ పద్ధతులలో వీలర్ 1948 బ్రహ్మగిరిలో బృహచ్ఛిలాయుగ సమాధుల తవ్వకాలను చేపట్టాడు.

**3.6.1. బృహత్ సమాధులలో రకాలు (లేక) రాక్షస గుళ్ళలో రకాలు :** బృహత్ శిలాయుగ సమాధులలో రకాలు వున్నాయి. వాటిలో ముఖ్యమైనవి.

**1. పెద్ద బాన పాత్ర ఉన్న సమాధులు** (Large Urns) **:** మట్టితో చేసిన పెద్ద పాత్రలో 8 మృతుని అస్తికలుంచి చిన్న గోతిలో పూడ్చి పెడతారు. సమాధికి గుర్తుగా పెద్ద పెద్ద రాతి గుండ్లను సమాధి చుట్టూ వృత్తాకారంలో అమర్చుతారు. కొన్ని సమాధులు ఇటువంటి వృత్తాకారంగా అమర్చిన రాళ్ళు లేకుండా ఉన్నాయి.

**2. మట్టితో చేసిన శవ పేటికలు** (Legged Urns / Legged Pottery Sarcophgi) **:** శవాన్ని లేదా అస్తికలను గాని మట్టితో తయారు చేసిన శవపేటికలో ఉంచి సమాధి చేసే పద్ధతి ఇది. ఈ శవ పేటికలు వివిధ ఆకారాలలో ఉన్నవి. కొన్ని శవపేటికలు గొర్రె ఆకారంలోను, ఏనుగు ఆకారంలోను తయారు చేసినవి త్రవ్వకాలలో లభించాయి. ఇటువంటి శవపేటికలు కాళ్ళు కూడా అమర్చేవారు. కాళ్ళు లేని శవపేటికలు కూడా ఉన్నాయి.

**3. పిట్ సర్కిల్ సమాధులు** (Pit Circle Graves) **:** ఇటువంటి సమాధులు బ్రహ్మగిరిలో ఎక్కువగా కనిపిస్తాయి. సమాధికోసం తవ్విన పెద్ద గుంటలో శవాన్ని ఉంచి, పక్షులు జంతువులు ఆ శవాన్ని తిన్న తరువాత ఎముకలను, ఇతర వస్తువులను ఉంచి పూడ్చి పెడతారు. సమాధికి గుర్తుగా వృత్తాకారంలో రాళ్ళను అమర్చుతారు.

**4. సిస్ట్ సమాధులు** (Cist burials) **:** పెద్ద రాతి పలకలతో శవపేటికను తయారుచేసి అందులో శవాన్ని లేదా అస్తికలు ఉంచుతారు. ఈ శవ పేటికకు ఒక వైపునున్న పలకకు పెద్ద రంధ్రం ఉంటుంది. ఈ శిలా శవపేటికలను భూమిలో పూర్తిగాని, కొంత భాగం వరకు పూడ్చడం, లేదా నేలపైనే ఉంచడం ఇలా మూడు రకాలుగా వీటిని ఖననం చేస్తారు. కొన్ని సిస్ట్ సమాధులు అనేక గదులుగా ఏర్పాటు చేసినవి కూడా ఉన్నాయి. మట్టి పాత్రలను, ఇతర వస్తువులను శవ పేటిక లోపల (లేదా) శవపేటిక వెలుపల గూడా ఉంచేవారు. సిస్ట్ సమాధిపైన ఒకటి లేదా రెండు రాళ్ళ వరుసలను వృత్తాకారములో అమర్చేవారు.

**5. రాతిలో తొలచిన సమాధులు** (Rock cut chambers) **:** మలబారు ప్రాంతంలోని లాటిరైట్ రాతిని తొలిచి సమాధులను ఏర్పరచారు. కేరళలోని చప్పరంబులోను, పరంబంకలిలోను ఇటువంటి సమాధులున్నా, ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలో జొన్నవాడలో ఇటువంటి సమాధులున్నాయి.

**6. స్మారక శిలలు** (Stone Alignments) **:** బహుత్ శిలాయుగ సమాధులలో స్మారక శిలలు సమాధులు చతురస్రాకారపు వరసలలో లేదా (Diagonal) వరుసలలో స్మారక శిలలను నిలబెట్టినటువంటివి కనిపిస్తున్నాయి. నిలువుగా పాతి ఉన్న ఈ స్మారక శిలలు సాధారణంగా

1.5. మీటర్ల నుండి 2.4. మీటర్ల ఎత్తు వరకు ఉంటాయి. ఆరు మీటర్ల ఎత్తున్న స్మారక శిల కూడా స్మారక శిలలు వందల కొద్దీ వరుసగా ఉన్నటువంటి బృహత్ శిలాయుగ సమాధులు కర్నాటకలోని గుల్బర్గా జిల్లాలో ఉన్నాయి. ఇటువంటి స్మారక శిల సమాధులు హైదరాబాదుకు దక్షిణంగా ఉన్న ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నాయి.

**3.6.2. వస్తు సంస్కృతి :** ఇప్పటి వరకు, ఎన్నో బృహత్ శిలాయుగ సమాధులను, ఆవాస స్థలాలలో త్రవ్వకాలు జరిపారు. ఈ త్రవ్వకాలలో బృహత్ శిలాయుగము నాటి వస్తు సముదాయము బయల్పడినవి. వాటిలో మట్టి పాత్రలు, ఇనుప వస్తువులు, రాగి, బంగారు వస్తువులు, పూసలు ఉన్నాయి.

**1) మట్టి పాత్రలు :** నలుపు-ఎరుపు రంగు మట్టి పాత్రలు, నల్లని నునుపు చేసి ఎరుపు రంగు మట్టి పాత్రలు, ఎరుపు రంగు ముతక పాత్రలు సమాధులలో లభించాయి. ఇవి అనేక పరిమాణాలలో ఉన్నాయి. పళ్ళేలు, దబరాలు, జాడీలు, మూకుడ్లు, లోతు గిన్నెలు, పాన పాత్రలు, నాలుగు కోళ్ళ కూజాలు, తులిప్ పువ్వు ఆకారపు కుండీలు మొదలగు మట్టి పాత్రలు వీటిలో ముఖ్యమైనవి.

**2) సార్కో ఫాగస్‌లు :** శవాన్ని గాని, అస్తికలుగాని మట్టి తయారు చేసిన సార్కొపాగస్‌లో ఉంచి ఖననం చేసేవారు. సార్కోపాగస్‌లు కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాలలోని అనేక స్థానాల్లో దొరికాయి. ఈ సార్క పాగస్‌లు జంతు రూపంలో తయారు చేసినవి కూడా ఉన్నాయి. కడప జిల్లా శంఖవరంలో దొరికిన పొటేలు ఆకారంలో వున్న సార్కో ఫాగస్, నల్గొండ జిల్లా ఏలేశ్వరంలో దొరికిన ఏనుగు ఆకారంలో ఉన్న సార్కోఫాగస్‌లు ఇందుకు ఉదాహరణలు. మహబూబ్‌నగర్ జిల్లాలో బయల్పడిన మూడు సార్కో ఫాగస్‌లలో ఒకటి గొడ్డలి ఆకారంలో ఉంది. దీర్ఘ చతురస్రాకారంలో గజ పృష్టాకారంలో ఉన్న సార్కోఫాగస్‌లు కూడా లభించాయి.

**3) ఇనుప, రాగి, బంగారు వస్తువులు :** బృహత్ శిలాయుగ అవశేషాలలో ఇనుప వస్తువులు అధిక సంఖ్యలో ఉన్నాయి. వీటిలో ఇళ్ళలో వాడుకునేవి, వ్యవసాయానికి ఉపయోగించేవి ఉన్నాయి. కొన్ని ఆయుధాలుగా ఉపయోగపడేవి ఉన్నాయి. ఆయుధాలలో చాకులు, బాకులు కొన్ని రాగి పిడితో వున్నవి, యీటెలు, బరిసెలు, గండ్ర గొడ్డళ్ళు, బాణం కొనలు, కత్తులు, ముఖ్యమైనవి గృహ అవసరాలకు వ్యవసాయానికి ఉపయోగపడే పనిముట్లలో చదును గొడ్డళ్ళు, చిన్న గొడ్డళ్ళు, ఉలులు, పికాసులు, దీపాలు, చాకులు, కొడవళ్ళు, పారలు, రికాబులు, కళ్ళేలు, మేకులు, కాడ గరిటెలు మొదలగునవి ముఖ్యమైనవి.

రాగి, కంచు వస్తువులు చాలా తక్కువ సంఖ్యలో లభించాయి. ఇవి ఎక్కువగా పొన్నుల రూపంలో ఉన్నాయి. మౌలాలీలో రాగి గంట లభించింది. అక్కడే 79% రాగితో చేసిన లోహపు పాత్ర లభించింది. మరో సమాధి 21% తగరంతో చేసిన వస్తువు లభించింది.

బంగారపు వస్తువులు రాగి కంటే అరుదుగా లభించాయి. కదంబాపురంలోని ఒక సమాధిలో బంగారపు చుట్ల కర్ణాభరణాలు రెండు దొరికినవి. నాగార్జున కొండలో చుట్ల కంఠా భరణాలు రెండు, 53 గొట్టంపూలు, 18 వెండి స్పేసర్లు దొరికాయి. జానంపేటలోని ఒక సమాధిలో ఒక బంగారు కర్ణాభరణం లభించింది.

**4) పూసలు :** ఆవాస స్థలాలలోను, సమాధుల త్రవ్వకాలలో అనేక రకాల పూసలు బయల్పడ్డాయి. బంగారు, వెండి, రాగి, విలువైన రాళ్ళతోను ఈ పూసలను తయారు చేశారు. రాతి పూసలలో కార్నీలియన్, జాస్పర్, అగేట్, ఒనిక్స్, ఇంద్రనీలమణి లాపిస్ లాజులి, అమెథిస్ట్ మొదలగునవి ఉన్నాయి. గాజు, ఎర్రమన్ను రాళ్ళు, ఎముకలు, మొదలగు వాటితో చేసిన పూసలు కూడా లభించాయి. రాయగిరి సమాధుల్లో 108 పూసలు బయల్పడ్డాయి. వీటిలో 73 ఇంద్ర నీలమణివి, మౌలాలిలో వలయాకారపు బంగారు పూసలు దొరికాయి.

**3.6.3. ఆర్థిక వ్యవస్థ :** త్రవ్వకాలలో లభించిన ఆధారాలు బృహత్ శిలాయుగంలో వ్యవసాయము, పశుపోషణలు ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ పాత్ర వహించినట్లు తెలియజేస్తున్నాయి. లభ్యమయిన పశువుల ఎముకలు నాటి ప్రజలు వదిలేసిన ఆహార వ్యర్థాలను సూచిస్తున్నాయి. ఈ ఎముకలు గొర్రె, మేక, దున్న, పంది, గుర్రం, కోడి, కుక్క, చేప మొదలగు వాటికి చెందినవి. వీరాపురం లభించిన ఎముకలలో ఎద్దులు, ఆవులవి 71.32% కాగా గొర్రె, మేకలవి 17.32% శాతం ఉన్నాయి. రామాపురంలో ఎద్దులు, ఆవులు, దున్నలు కలిపి 70.75%, గొర్రె మేక 15 నుండి 18% వరకు ఉన్నాయి. దీనిని బట్టి ఆనాటి ఆర్థిక వ్యవస్థలో పశువుల పాత్ర గణనీయంగా ఉందని చెప్పవచ్చును.

జొన్నలు, బార్లీ, ఉలవలు, మినుములు, బఠాణీ, వరి మొదలగు ధాన్యపు గింజలు వీరాపురం త్రవ్వకాలలో బయల్పడ్డాయి. ఇవన్నీ బృహత్ శిలాయుగంలో పండించిన పంటలే. తిరుగలిరాళ్ళు, కల్వాలు మొదలగునవి ఆనాటి ప్రజలు కాయగింజల్ని, ధాన్యాన్ని పిండి పట్టినట్లు తెలుస్తుంది. ఆవాసాలలో శ్మశానాలలో కనిపించిన కొడవళ్ళు, గొడ్డళ్ళు, నాగలి కొర్రులు, పారలు నాటి ప్రజలు క్షేత్ర వ్యవసాయంలో వారు సాధించిన సాంకేతిక జ్ఞాన పురోగతిని నిదర్శనాలుగా కనిపిస్తున్నాయి.

బృహత్ శిలాయుగ మానవుడి ఆహార అవసరాలకు అడవి జంతువులు, పక్షులు, జలచరాలు వుపయోగపడ్డాయని తెలుస్తున్నది. పిఠపురం, రామాపురం, జామ మొదలగు స్థలాల్లో బ్లాక్‌బక్, సంచార్, మచ్చల జింక, కుందేలు, ముళ్ళపంది, పక్షులు, తాబేళ్ళు, నత్త గుల్లలు అవశేషాలు తవ్వకాలలో బయల్పడ్డాయి. ఈ ప్రదేశాలలోనే ఎముకుల కొనలు, ఇనుప బాణం ములుకులు, బల్లెం మొనలు, శూలాలు, ఈటెలు, బరిసెలు దొరకడం బృహత్ శిలాయుగ ఆర్థిక వ్యవస్థల్లో వేట తోడ్పాటు కూడా ఉందని చెప్పవచ్చును.

**3.6.4. మత పరిస్థితులు :** బృహత్ శిలాయుగ మానవులకు మత విశ్వాసాలున్నాయి. సమాధులలో శవాలతోపాటు ఇనుప పనిముట్లు, జంతువుల ప్రతిమలు, మట్టి పాత్రలు మొదలగు వస్తు సామాగ్రిని ఉంచడం వారికి మరణానంతరం జీవితంపైగల విశ్వాసాన్ని తెలియజేస్తున్నది. తమిళనాడులోని కొన్ని రాక్షస గుళ్లలో త్రిశూలాలు లభించాయి. భారతదేశంలో త్రిశూలాలు శైవారాధనకు సంకేతాలు. విభిన్న రకాల రాక్షసి గుళ్ళను సమాధులుగా నిర్మించినందున నాటి ప్రజలు విభిన్న ఆచారాలను అనుసరించినట్లు చెప్పవచ్చును.

**3.6.5. కాలము :** రాకాసి గుళ్ళలోని శల్యావశేషాలను పరిశీలిస్తే మూడు రకాల మృత సంస్కారాల దశలున్నట్లు తెలుస్తున్నది. అవి. 1. మృత దేహాన్ని యథాతథంగా గుంత సమాధిలో పూడ్చి పెట్టడం. ఇటువంటి సమాధులలో ఒక్క శవాన్ని మాత్రమే భూస్థాపితం చేస్తారు. అస్థిపంజరపు శల్యాలు అన్నీ కలిసే ఉంటాయి. 2. భూగర్భ శవాన్ని రాంబందులు, ఇతర జంతువులు తిన్న తరువాత అస్థిపంజర అవశేషాల్ని కుటుంబ సమాధులలో పూడ్చి పెట్టడం. 3. మృతులను దహనం చేసి అస్తికలను లేదా చితా భస్మాన్ని కుటుంబ భూగర్భ గృహలలో ఉంచడం. మృతులను సమాధి చేసే విధానాన్ని బట్టి గుంత సమాధులు మిగిలినవాటి కంటే ప్రాచీనమైననవని చెప్పవచ్చును. వీటి తరువాత కాలం నాటివి రాతి శవపేటికల సమాధులు, గవాక్షం ఉన్న శవపేటికల సమాధులు.

బ్రహ్మగిరి త్రవ్వకాల ఆధారాంగా బృహత్ శిలాయుగ సంస్కృతికి కాల నిర్ణయాన్ని సూచించిన మొదటి వ్యక్తి వీలర్. ఈ సంస్కృతి క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 50 వరకు కొనసాగిందని ప్రకటించాడు. బ్రహ్మగిరిక సంబంధించి మాత్రమే అయినట్లయితే ఈ కాల నిర్ణయాన్ని అంగీకరించవచ్చును. నాగపూర్ ప్రాంతంలోని తకాల్ ఘాట్ ఆవాస - శ్మశాన స్థలాలు రేడియో కార్బన్ కాల నిర్ణయం ప్రకారం క్రీ.పూ. 8000 సంవత్సరాల నాటివిగా తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని రాకాసి గుళ్ళలో కొన్నిటి రేడియో కార్బన్ కాల నిర్ణయం ప్రకారం ఈ సంస్కృతి క్రీ.పూ. 2000 నుండి తొలి చారిత్రక దశ క్రీ.శ. 300 వరకు ఉన్నట్లు చెప్పవచ్చును.

## 3.7. సారాంశము :

మానవ నాగరికతలో తామ్ర శిలాయుగములో రాతి పనిముట్లతో పాటు లోహ పనిముట్లను కూడా ఉపయోగించినాడు. క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటికి దక్షిణ భారతదేశములో సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వ్యవస్థలలో ఎన్నో మార్పులు వచ్చినాయి. ఇనుము యొక్క సాంకేతిక పరిజ్ఞానము పెరగటము ప్రారంభం అయినది. ఈ ఇనుప యుగాన్ని బృహచ్ఛిలాయుగంగా విశదీకరించబడినది.

## 3.8. నమూనా ప్రశ్నలు :

1. ప్రాచీన శిలాయుగపు లక్షణాలు వివరింపుము.
2. మధ్య శిలాయుగము (లేదా) సూక్ష్మరాతి శిలాయుగపు లక్షణాలు వివరింపుము.

3. నవీన శిలాయుగపు లక్షణాలు వివరింపుము.

4. కాంస్య యుగము లక్షణాలు వివరింపుము.

5. బృహశ్శిలాయుగము (లేదా) రాకాసి గుళ్ళు లక్షణాలు వివరింపుము.

## 3.9. చదువదగిన గ్రంథాలు :


1. H.D. Sankalia - *Prehistory & Protohistory of India and Pakistan,* Bombay 1963.
2. M.L.K. మూర్తి (సం) ఆంధ్రప్రదేశ్ చరిత్ర - సంస్కృతి (ప్రాక్ పురాయుగం - క్రీ.పూ. 500 వరకు), A.P. హిస్టరీ కాంగ్రెస్ 2003
3. M.L.K. మూర్తి & కె. తిమ్మారెడ్డి - ప్రాక్చరిత్ర, తెలుగు అకాడమి, హైదరాబాద్
4. పి. కృష్ణమూర్తి & యస్. శ్రీపతి నాయుడు - పురావస్తు శాస్త్రము, ప్రాధమిక సూత్రాలు
5. Zevner. F.F. - *Dating the Past*, London 1958
6. Bridget & R. Allchin - *The Rise of Civilization in India and Pakistan,* New Delhi, 1982.
7. D.P. Agrawal and M.G. Yadav - *Dating the Human Past,* Pune - 1995.


**- కె. శ్రీనివాసులు**

**పాఠం - 4.1.**

# సింధూ లోయ నాగరికత

## 4.1.0. లక్ష్యం :

సింధూ లోయ నాగరికతలోని ముఖ్య లక్షణాలను తెలియచేయటమే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## విషయసూచిక :


4.1.1. పరిచయము

4.1.2. పేరు వ్యాప్తి

4.1.3. కాలం

4.1.4. నిర్మాతలెవరు ?

4.1.5. నగర నిర్మాణం

4.1.5.1. దుర్గ నిర్మాణం

4.1.5.2. రాజకీయ పరిస్థితులు

4.1.5.3. భవనాలు

4.1.5.3.1. నివాస గృహాలు

4.1.5.3.2. పౌర నిర్మాణాలు

4.1.5.3.3. మురుగు నీటి కాలువల సౌకర్యం

4.1.6. సాంఘిక పరిస్థితులు

4.1.6.1. ఆహారం

4.1.6.2. మచ్చిక చేయబడిన జంతువులు

4.1.6.3. దుస్తులు

4.1.6.4. శిరోజాలంకరణ

4.1.6.5. ఆభరణాలు

4.1.6.6. సౌందర్య పోషణ

4.1.6.7. ఆయుధాలు

4.1.6.8. గృహ పరికరాలు

4.1.6.9. వినోదాలు

4.1.7. ఆర్థిక పరిస్థితులు

4.1.7.1. తూనికలు, కొలతలు

**4.1.8.** సాంఘీక వ్యవస్థ

**4.1.9.** శిల్ప, చిత్రకళలు

**4.1.9.1.** కాంస్య విగ్రహాలు

**4.1.9.2.** శిలా విగ్రహాలు

**4.1.9.3.** మట్టి బొమ్మలు

**4.1.9.4.** సింధూ ముద్రికలు

**4.1.9.5.** చిత్ర లేఖనాలు

**4.1.10.** లిపి

**4.1.11.** మత పరిస్థితులు

**4.1.11.1.** మృత సంస్కారాలు

**4.1.12.** అంతరించడానికి గల కారణాలు

**4.1.13.** సారాంశము

**4.1.14.** నమూనా ప్రశ్నలు

**4.1.15.** చదువదగిన గ్రంధాలు

## 4.1.1. పరిచయము :

ఆర్యుల రాకతోనే మన దేశ చరిత్ర ప్రారంభమైనదనే విశ్వాసం చరిత్రకారుల్లో ఒకప్పుడు ఉండేది. కాని 1922లో మొహంజాదారో, హరప్పా విశేషాలు వెలుగులోకి రావడంతో ఆ నమ్మకం సడలింది. ఆర్యులకు పూర్వమే అంటే క్రీ.పూ. 3000 సంవత్సరాల క్రిందటనే మన దేశంలో ఒక ప్రాచీనమైన నాగరికత విలసిల్లినట్లు మొహంజాదారో, హరప్పా శిధిలాలు రుజువు చేశాయి. అదే సింధు నాగరికత.

1922లో అప్పటి భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ అయిన సర్ జాన్ మార్షల్ అధ్వర్యంలో ఆర్.డి. బెనర్జీ మొహంజాదారోలో (సింధూ రాష్ట్రంలోని లార్ఖానా జిల్లాలో కలదు) దయారాం సాహిణి - హరప్పాలో (పశ్చిమ పంజాబ్ రాష్ట్రంలో మాంట్ గోమరి జిల్లాలో కలదు) త్రవ్వకాలు జరిపిరి. (మొహంజాదారో అనగా సింధీ భాషలో "మృతుల దిబ్బ" అని అర్థం) మొహంజాదారో కన్నా హరప్పా పెద్ద నగరం. ఈ రెండూ నగరాల మధ్యనున్న దూరం 500 కి.మీ. ఇవి రెండూ ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నాయి.

మొహంజాదారో, హరప్పా త్రవ్వకాలలో బయల్పడిన ఆధారాల వల్ల మన సంస్కృతి అతి ప్రాచీనమైనదని తేలింది. కనుక మన దేశం కూడా ప్రాచీన నాగరికతల దేశాలలో ఒకటిగా పరిగణించబడింది. ఈ నాగరికత వెలుగులోకి రావడం మూలంగా ప్రాచీన నదీ లోయ నాగరికతలు ఉన్న సుమేరియా అక్కాడే, బాబిలోనియా, ఈజిప్టు దేశాలతో పాటు భారతదేశానికి కూడా గుర్తింపు రావటంతో దీనిని "ప్రాచీన భారతీయ నాగరికత" గా పేర్కొన్నారు. అందువల్లనే జవహర్‌లాల్ నెహ్రూ" ఈ త్రవ్వకాలు ప్రాచీన భారతదేశ చరిత్రలోని భావాలను తల్లక్రిందులు చేశాయి" అని పేర్కొనినాడు.

## 4.1.2. పేరు - వ్యాప్తి :

మొహంజాదారో, హరప్పాలు సింధూ మైదానంలో ఉన్నందున దీనికి మొదట "సింధూ నాగరికత" అని మార్షల్ పేరు పెట్టినాడు. ఈ నాగరికతా అవశేషాలను మొదటి సారిగా హరప్పాలో కనుగొనినందున దీనిని ఆ పేరు మీదుగా "హరప్పా నాగరికత లేదా హరప్పా సంస్కృతి" అని పేరిడిరి. గత 80 సంవత్సరాలుగా జరుగుతున్న పరిశోధనల ఫలితంగా ఈ నాగరికత సింధూ లోయకు మాత్రమే

పరిమితంకాదని ఉత్తరప్రదేశ్‌లోని రూపార్ నుంచి అరేబియా సముద్ర తీరాన ఉన్న సుట్కాజండర్ వరకు, తూర్పున యమునా నదీ ప్రాంతంలోని యుకిలినా దాకా, దక్షిణాన గుజరాత్‌లోని లోథాల్, రంగపూర్‌ల వరకు ఉన్న సువిశాల ప్రదేశమంతా విస్తరించినట్లు తెలుస్తున్నది. యిటీవల వెలుగులోకి వచ్చిన స్థావరాలను బట్టి ఉత్తరాన జమ్మూ, కాశ్మీర్ నుండి దక్షిణాన తపతీ నది వరకు ఈ నాగరికత వ్యాపించినట్లు తెలియుచున్నది. మొత్తం మీద ఈ నాగరికత సుమారు 84,000 చదరపు మైళ్ళు విస్తీర్ణాన్ని ఆక్రమించి ఉండవచ్చునని భావించుట జరుగుతుంది.

ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం సుమారు 1400 సింధూ స్థావరాలు బయల్పడినాయి. వీటిలో 917 భారత దేశంలో, 480 పాకిస్తాన్‌లో మిగతావి ఆఫ్గనిస్తాన్‌లో ఉన్నాయి. సింధూ స్థావరాలలో సుమారు 175 దాకా సరస్వతీ లోయలో బయల్పడ్డాయి. (గక్కార్ నది) 86 ప్రాంతాలు సింధూ ప్రాంతంలో బయల్పడ్డాయి. సరస్వతీ లోయలో బయల్పడ్డ స్థావరాలలో ముఖ్యమైనవి కాలి భంగన్. అచ్చట హరప్పా, మొహంజాదారోలలో బయల్పడిన అవశేషాలన్నీ లభించాయి. అందువల్ల పూనాలో దక్కన్ కళాశాలలో పురావస్తు శాఖ డైరెక్టర్‌గా ఉన్న వారిలో వి.యన్. మిశ్రా ఈ సంస్కృతికి "సరస్వతీ నాగరికత" అని పేరు పెట్టినాడు. అయితే మొగల్, బిస్ట్ అనే పండితులు మిశ్రా వాదనతో ఏకీభవించుటలేదు. వీరిద్దరి అభిప్రాయం ప్రకారం ఈ సంస్కృతికి ప్రధాన కేంద్రం సింధూ ప్రాంతమే. ఈ నాగరికత సువిశాల భూభాగంలో విస్తరించినందువల్ల దీనికి కె.యన్. దీక్షిత్ అనే పండితుడు "మూల భారతీయ నాగరికత" అని నామకరణం చేశాడు. ప్రపంచంలో అత్యంత పెద్ద నాగరికత సింధూ లోయ నాగరికతే కావటం విశేషం.

యిప్పటి వరకు బయల్పడిన సింధూ స్థావరాలలో ముఖ్యమైనవి, హరప్పా, మొహంజాదారో, కాలీభంగన్, లోథాల్, రూపార్, రంగపూర్, అమ్రి, చన్హూదరో మొదలైనవి.

## 4.1.3. కాలం :

మొహంజాదారో త్రవ్వకాలలో 7 అంతస్తులలో కట్టడాలు బయల్పడినాయి. యిందులో ఒక్కొక్క అంతస్తుకు 500 సంవత్సరాల కాలాన్ని కేటాయించి సర్ జాన్ మార్షల్ సింధూ నాగరికత క్రీ.పూ. 3250-2750 మధ్య కాలంలో ఉండి ఉండవచ్చునని పేర్కొనినాడు. క్రీ.పూ. 2500-1500 మధ్య కాలంలో ఈ నాగరికత ఉండి ఉండవచ్చునని యం. వీలర్ పేర్కొనినాడు. "కర్బనం - 14 పద్ధతి" అనే శాస్త్రీయ కాల నిర్ణయ పద్ధతి ప్రకారం ఈ నాగరికత క్రీ.పూ. 2300లో ప్రారంభమై క్రీ.పూ. 1750లో అంతరించిందని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పిరి. ఈ నాగరికత తామ్ర శిలాయుగానికి చెందినది.

## 4.1.4. నిర్మాతలెవరు :

సింధూ నాగరికతా నిర్మాతలు ఎవరు అనే విషయంలో చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. ఈ నాగరికతా నిర్మాతలు ఆర్యులని కొందరు, ద్రావిడులని కొందు వ్యాఖ్యానించిరి. ఈ నాగరికతకు చెందిన ప్రజలు బెలూచిస్తాన్ నుంచి సింధూ ప్రాంతానికి వలస వచ్చి ఉంటారని దీక్షిత్, నీలకంఠ శాస్త్రి లాంటి చరిత్రకారుల అభిప్రాయం. వీరు మెసపుటోమియాకు చెందిన సుమేరియన్లు అని గార్డెన్ చైల్డ్, వీడల్ అనే పండితుల అభిప్రాయం. సింధూ నాగరికతా నిర్మాతలు ఆర్యులని లా, వెంకటేశ్వర్, పుసాల్కర్ అనే చరిత్రకారుల అభిప్రాయం.

లభించిన అనేక ఆధారాలను బట్టి సింధూ నాగరికత దేశీయమైనదేనని ముఖ్యంగా ద్రావిడ నాగరికత అని ఆర్.డి. బెనర్జీ, సర్ జాన్ మార్షల్, ఆర్.సి. మజుందార్ మొదలైనవారు పేర్కొన్నారు. సింధూ నాగరికతా త్రవ్వకాలలో నీగ్రిటో ఆస్ట్రలాయిడ్, మెడిటరేనియన్, ఆల్ఫనాయిడ్ జాతులకు చెందిన మానవ అవశేషాలు బయల్పడినాయి. వీటిలో అధిక భాగం మెడిటరేనియన్లవి. అనగా ముఖ్యంగా ద్రావిడ జాతికి చెందినవి. అందుచేత సింధూ నాగరికతా నిర్మాతలు ఆర్యేతరులని ప్రధానంగా స్థానికులైన ద్రావిడులని మజుందార్ అభిప్రాయం.

## 4.1.5. నగర నిర్మాణం :

సింధూ లోయలో, సరస్వతీ లోయలో బయల్పడిన ప్రాచీన శిధిలాలను పరిశీలిస్తే ఆనాడు పట్టణాలు, పల్లెలు ఉన్నట్లు స్పష్టమగుచున్నది. మొహంజాదారో, హరప్పా, కాలీభంగన్ లోథాల్, డైమాబాద్ మొదలగున్నవి నాటి ముఖ్య పట్టణాలు. ఈ పట్టణాల నిర్మాణంలో నిర్దిష్టమైన వాస్తు పద్ధతులను అనుసరించిరి.

**4.1.5.1. దుర్గ నిర్మాణాం :** మొహంజాదారో, హరప్పాలలో దుర్గ ప్రాకారాలు బయటపడటం వల్ల ఆనాటికే దుర్గ నిర్మాణం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నగరాల్లో రెండు ప్రధాన భాగాలు కన్పిస్తాయి. మెరక ప్రాంతంలో కోట, పల్లపు ప్రాంతంలో పౌర నివాస గృహాలు ఉండేవి. ఇక్కడ దుర్గాలు అష్ట ముఖ దుర్గాలు. కోట గోడలను పచ్చి యిటుకలతో కట్టి, పైన బాగా కాలిన ఇటుకలతో తాపడం చేశారు. పునాదుల వద్ద గోడ మందం 13 మీటర్ల నుండి పైకి పోనూ పోనూ తగ్గుతూ వుంటుంది. ప్రాకారాన్నంటుకొని లోతైన కందకం ఉండేది. ప్రభుత్వ భవనాలు, ఇతర ముఖ్య కట్టడాలు, కోటలోని ఎత్తైన వేదికపైన నిర్మించారు.

**4.1.5.2. రాజకీయ పరిస్థితులు :** ఒక పద్ధతి ప్రకారం నిర్మించబడిన గృహాలు, దుర్గం మురుగు నీటి పారుదల ఏర్పాట్లను బట్టి నాడు రాజకీయ వ్యవస్థ ఉండేదని తెలియ వస్తున్నది. స్టూవర్ట్ ఫిగట్ మాటలలో "సర్వ నిరంకుశాధికారాలు కల్గిన, మత ప్రవక్తలచే పరిపాలించబడే రాజ్య వ్యవస్థ ఉండి ఉండవచ్చు." ఇంకా ఈ పండితుడు వాయువ్య భారతంలో పేరు తెలియని మహా సామ్రాజ్యానికి ముఖ్య పట్టణాలు మొహంజాదారో, హరప్పాలు" అని అంటారు.

సరస్వతీ లోయలో కునాల్ వద్ద రెండు కిరీటాలు మరియు ఆభరణాలు లభించాయి. దీనిని బట్టి ఆనాడు రాచరిక వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తున్నది.

సింధూ నాగరికతా నగరాలు ప్రణాళికాబద్ధంగా నిర్మించబడ్డాయి. ప్రధాన వీధులు ఉత్తర, దక్షిణాలుగా, ఉప వీధులు తూర్పు, పడమరలుగా బారులు తీరి నగరాన్ని విభజిస్తున్నట్లు కన్పిస్తాయి. ఈ నగరాల్లోని వీధులు చాలా వెడల్పుగా ఉండి బాటసారులు, బండ్లు ఒకేసారి పోవడానికి వీలుగా ఉన్నాయి. ప్రతి వీధికి బావులు, దీపపు స్తంభాలు, అక్కడక్కడా చెత్త కుండీలు ఉండేవి.

**4.1.5.3. భవనాలు :** మొహంజాదారో, రూపార్ లోథాల్‌లలో బయల్పడిన శిధిలాలలను బట్టి నాటి భవనాలను రెండు రకాలుగా విభజించవచ్చును. అవి. 1. నివాస గృహాలు, 2. పౌర నిర్మాణాలు.

**4.1.5.3.1.** నివాస గృహాలు : విశాలమైన వీధులకిరువైపులా నివాస గృహాలు, దుకాణాలు నిర్మించబడ్డాయి. సింధూనది వరదల భయం వల్ల ఇళ్ళను మట్టి వేదికలపై నిర్మించారు. సంపన్నుల ఇళ్ళు, 5, 6 గదులలో విశాలంగా ఉండగా సామాన్యుల ఇళ్ళు చాలా చిన్నవిగా ఉండేవి. గృహ నిర్మానమంతా ఒకే పద్ధతిలో జరిగింది. కాల్చిన ఇటుక, సున్నం కలపతో ఇళ్ళు కట్టారు. కిటికీలు చాలా తక్కువ. ఉన్నవి కూడా గోడల్లో చాలా ఎత్తుగా అమర్చారు. పై అంతస్తు నుంచి నీటి పారుదల కోసం, గోడల్లో నిలువుగా గొట్టాలు పెట్టారు.

నాటి భవనాలలో విశాలమైన వరండా, వంటగది, స్నానాల గది, అలంకరణ గది, పడక గది, పాయిఖానా, దొడ్డి, మురుగు నీరు పోయేందుకు వీలుగా గొట్టాలు ఉండేవి. వీటిలో సంపన్నులు నివశించారు. ప్రతి ఇంట్లో మంచి నీళ్ళ బావి ఉన్నది.

హరప్పాలో కూలీల ఇళ్ళ వరసలు బయల్పడ్డాయి. ఈ ఇళ్ళలో రెండే గదులు ఉన్నాయి. వెనుక గది మరీ చిన్నది, ముందు గదిలో స్నానం చేయడం కోసం ఇటుక వేదిక, నీటి గొట్టాలు ఏర్పాటు చేయబడ్డాయి. కూలీల ఇళ్ళన్నింటికి కలిపి ఒకే బావి ఉండేది. లోథాల్‌లో తక్కువ కొలతలున్న గదుల వరస బయల్పడింది. ఇవి దుకాణాలై ఉండవచ్చని భావిస్తున్నారు. లోథాల్ నాటి ప్రసిద్ధిగాంచిన నౌకాశ్రయం. కుంటసీ ఆనాటి మరో నౌకాశ్రయం.

**4.1.5.3.2.** పౌర నిర్మాణాలు : మొహంజాదారోలో బయల్పడిన నిర్మాణాలలో అతి క్లిష్టమైనది స్నాన వాటిక. దీని పొడవు 39 అడుగులు, వెడల్పు 23 అడుగులు, లోతు 8 అడుగులు. ఈ కొలనులోనికి దిగటానికి ఉత్తర, దక్షిణ దిశలలో మెట్లున్నాయి. కొలనులోనికి

నీరు రావటానికి, పోవటానికి మార్గాలున్నాయి. కొలను చుట్టూ వరండా దాని వెనుక గదులున్నాయి. ఈ గదులలో ఒక గదిలో పైకి పోవటానికి మెట్లు, మరొక గదిలో బావి ఉన్నది. ఈ స్నానవాటిక నీటి ద్వారా జబ్బులు నయం చేసే వారని మార్షల్ అభిప్రాయం. వేడి నీటిని పంపేందుకు కూడా తగిన ఏర్పాట్లు కలవు. ఇది ఆనాటి "వాస్తు శాస్త్ర నైపుణ్యంలోని విచిత్రం" అని సర్ జాన్ మార్షల్ అభిప్రాయం.

స్నాన వాటిక సమీపంలో ధాన్యాగారం - చాలా గదులలో బయల్పడింది. దీనికి సమీపంలో పెద్ద స్తంభాల మండపం బయల్పడింది. హరప్పాలో బయల్పడిన ధాన్యాగారం కూడా చాలా విశిష్టమైన నిర్మాణం.

మొహంజాదారో, హరప్పాలలో బయల్పడిన పెద్ద పెద్ద భవనాలు ప్రభుత్వ కార్యాలయాలుగానో, ప్రార్థనా మందిరాలు గానో, సత్రాలుగానో ఉపయోగించి ఉంటారు.

ధోలవీర త్రవ్వకాలలో పెద్ద నీటి చెరువుతో పాటు కోట బయల్పడింది. తలుపుల రాతితో నిర్మించబడ్డాయి.

**4.1.5.3.3. మురుగు నీటి కాలువల సౌకర్యం :** సింధూ నగరాలలో వీధి వీధికి మధ్య భూగర్భంలో ఇటుకలతో కట్టిన మురుగు నీటి కాలువలున్నాయి. ఇళ్లలో నుంచి మురుగు నీరు మట్టి గొట్టాల ద్వారా ఈ కాలువలోకి ప్రవహించేది. కాలువను శుభ్రం చేయడానికి అక్కడక్కడా మనిషి దూరే రంధ్రాలు ఉండేవి. ఈ కాలువలన్నీ చేరి నగరానికి బయట కలిసేవి. ఇటువంటి మురుగు నీటి పారుదల సౌకర్యాలు ప్రాచీన ప్రపంచంలో మరెక్కడా కానరావని పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం. గార్డెన్ చైల్డ్ అభిప్రాయంలో ప్లాను ప్రకారం చక్కగా తీర్చిదిద్దబడిన విశాలమైన వీధులూ, పరిశుభ్రంగా ఉంచేందుకు వీలైన మురుగు నీటి కాలువలూ మొదలైనవి సమర్థతతో అమలు చేయబడ్డ మున్సిపల్ పాలనా ఉనికిని ధృవపరుస్తున్నాయి. రాజవీధుల్ని, సందుగొందుల్నీ, సూటిగా నిర్మాణం చేయటానికి అవసరమైన టౌన్ ప్లానింగ్‌ను ఖచ్చితంగా అమలు జరిపే శక్తి నాటి, పరిపాలనా సంఘాలకు ఉన్నట్లు కన్పిస్తుంది. సింధూ వరదల వల్ల నగరాలు దెబ్బ తిన్నప్పుడు పునర్ నిర్మాణం సాగించడానికి అవసరమైన అధికారం సైతం ఈ సంఘాలకున్నట్లు విదితమౌతుంది". అని పేర్కొనెను.

## 4.1.6. సాంఘిక పరిస్థితులు :

సింధూ ప్రజలు పట్టణాలలోనే గాక గ్రామాలలో కూడా నివశించేవారు. గ్రామాలు కేవలం మట్టితో నిర్మితాలైనందువల్ల నామ రూపాలు లేకుండా పోయాయి. అయితే సింధూ నదికి - కిర్తార్‌పర్వతాలకి మధ్యగల ప్రాంతంలో నాటి గ్రామాల పునాదులు కన్పిస్తాయి. ఈ పల్లెల్లో వ్యవసాయం భారీ యెత్తున సాగేది. గోధుమలు, బార్లీ, వరి పండించెడివారు. కాలీభంగన్‌లో వ్యవసాయ క్షేత్రం బయల్పడింది.

**4.1.6.1. ఆహారం :** శాకాహారం, మాంసాహారం రెండూ తీసుకొనేవారు. గోధుమలు, యవలు, పాలు, ఖర్జూరపండ్లు, గొర్రె, కోడి, సీమపంది, ఎద్దు మాంసం, చేపలు, గుడ్లు వీరు ఆహారంగా తీసుకొన్నారు.

**4.1.6.2. మచ్చిక చేయబడిన జంతువులు :** ఎద్దులు, బర్రెలు, గొర్రెలు, పంది, కుక్క, ఒంటె, ఆవు యిత్యాది జంతువులను వీరు మచ్చిక చేసి పెంచారు. ఎనుబోతు, ఖడ్గ మృగం, పెద్దపులి, వానరం, శునకం, పిల్లి, ఎలుగుబంటి, గాడిద, డేగ, ముంగిస, ఉడుత, చిలుక, నెమలి, కోడి వగైరాలు మట్టితో చేసిన పిల్లల ఆట వస్తువులపై మనకు కన్పిస్తాయి. గుర్రం వీరికి తెలుసా ? లేదా ? అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. మాకే అనే పండితుడు మాత్రం "సింధూ ప్రజలకు గుర్రం తెలుసునని" అంటాడు.

**4.1.6.3. దుస్తులు :** నూలుతోను, ఉన్నితోను తయారు చేసిన దుస్తులను ధరించేవారు. త్రవ్వకాలలో లభించిన ప్రతిమల వలన వీరి వస్త్రధారణ తెలియ వస్తున్నది. స్త్రీ, పురుషుల వస్త్ర వేషధారణ దాదాపు ఒకే రకంగా ఉండేది. పురుషులు - ధోవతి, ఉత్తరీయం ; స్త్రీలు - రెండురకాల వస్త్రాలు అంటే పై వస్త్రం, క్రింది వస్త్రం ధరించేవారు. ఈ ప్రదేశాలలో లభించిన సూదుల వల్ల వీరికి కుట్టడం కూడా తెలుసునని చెప్పవచ్చును.

**4.1.6.4. శిరోజాలంకరణ :** సింధూ ప్రజలు అలంకార ప్రియులు. శిరోజాలంకరణలో స్త్రీ, పురుషుల తీరు భిన్నంగా ఉన్నట్లు తెలియ వస్తున్నది. కొందరు పురుషులు జుట్టు, మీసం తీసివేసి గడ్డం మాత్రమే పెంచేవారు. మరికొందరు జుట్టు పొడుగ్గా పెంచి వాటిని

ముడివేసుకొనేవారు. సామాన్యంగా స్త్రీలు - జడలు, ముడులు వేసుకొనేవారు. ఉన్నత వర్గాల స్త్రీలు విసనకర్ర ఆకారంలో తమ శిరోజాలంకరణ చేసుకొనేవారు.

**4.1.6.5. ఆభరణాలు :** స్త్రీ, పురుషులు తమ తాహతుకు తగినట్లు బంగారం, వెండి, రాగి దంతంతో చేసిన ఆభరణాలను ధరించేవారు. కంఠాభరణాలు, ఉంగరాలు, చెవి పోగులు, మురుగులు, కడియాలు, స్త్రీ, పురుషులు ధరించేవారు. వీటితో పాటు స్త్రీలు దుద్దులు, ముక్కు పుడకలు, వడ్డాణం, అందియలు ప్రత్యేకంగా ఉపయోగించేవారు. బంగారు, వెండి, రాగితో తయారైన తలపట్టాలను పురుషులు ధరించేవారు.

**4.1.6.6. సౌందర్య పోషణ :** సౌందర్య పోషణ కోసం సింధూ స్త్రీలు, తీసుకున్న శ్రద్ధ, త్రవ్వకాలలో లభించిన ముస్తాబు బరిణెల వల్ల విశదమగుచున్నది. ఈ బరిణెలు - దంతం, లోహం, రాయి, మట్టితో తయారు చేయబడ్డాయి. మొహంజాదారో స్త్రీలు-కాటుక, పై పూతలతో అందంగా ముస్తాబయ్యేవారు. స్త్రీలు పెదవులకు రంగు వేసుకొనే పరికరాలు చన్హూదారోలో దొరికాయి. అలంకరణకవసరమైన మేజాలు,కంచు అద్దాలు, దంతపు దువ్వెనలు లభించాయి. కనుకనే అర్.సి.మజుందార్ అలంకార ప్రియత్వంలో సింధూ ప్రాంత స్త్రీలు నేటి సోదరీమణులకు ఏ మాత్రం తీసిపోరని" అన్నాడు.

**4.1.6.7. ఆయుధాలు :** యుద్ధాలలో, వేటలలో ఉపయోగపడే కత్తులు, ఈటెలు, బాకులు, గండ్రగొడ్డళ్ళు మొదలైనవి దొరికాయి. ఇవి రాగి, కంచుతో తయారు చేయబడ్డాయి. రాతి గదలు, విల్లంబులూ వీరు వాడినట్లు కనిపిస్తున్నది. కత్తి, శిరస్త్రాణాలు, కవచం వాడినట్లుగా ఆధారాలు లేవు.

**4.1.6.8. గృహ పరికరాలు :** సింధూ నగరాలలో లభించిన గృహ సామాగ్రిలో ప్రముఖంగా కన్పించేవి కుమ్మరి సారెపై చేయబడ్డ అనేక రకాల పాత్రలు, రాయి, దంతం, లోహాలతో తయారయిన రకరకాల పాత్రల్ని కూడా వీరు వాడేవారు. అతిధుల కోసం ప్రత్యేకించిన గదుల్లో కుర్చీలు, మంచాలు, చిన్న బల్లలు ఉండేవి. దారుశయ్యలు, రెల్లు చాపలు, రాగి లేక మట్టి దీపపు సమ్మెలు వీరు ఉపయోగించేవారు. సింధూ శిథిలాల్లో రాగి సూదులు, రాగి కంచుతో చేసిన గొడ్డలి, రంపం, కొడవలి, చేపల గాలాలు లభించాయి. ఇనుప సామాగ్రి ఎక్కడా బయల్పడలేదు.

**4.1.6.9. వినోదాలు :** సంగీతం, నాట్యం, వేట, పాచికలాట, చదరంగం, ఎద్దుల పోట్లాట, కోడి పందాలు, పక్షుల పెంపకం వీరి ముఖ్య వినోదాలు. వేట కుక్కల్ని వేటలో ఉపయోగించినట్లు ఆధారాలున్నాయి. డోలు, మృదంగం, సంగీత వాయిద్యాలలో ముఖ్యమైనవి బంతులు, గిలకలు, స్త్రీ పురుషుల బొమ్మలు, వివిధ భంగిమలలో కదిలించే మృగాల బొమ్మలు పిల్లల ఆట వస్తువులు.

## 4.1.7. ఆర్థిక పరిస్థితులు :

సింధూ ప్రజలు వ్యవసాయంలోనే కాక వర్తక, వాణిజ్యాలలో కూడా ఆరితేరినవారు. వీరికి ఆఫ్ఘనిస్తాన్, బెలూచిస్తాన్, పరిష్యా, మధ్య ఆసియా, మెసపుటోమియా, ఈజిప్టు మొదలైన దేశాలతో వ్యాపార సంబంధాలుండేవి. సముద్ర మార్గం ద్వారా వ్యాపారం జరిగేది. లోథాల్ వీరి ముఖ్య రేవు పట్టణం. వీరు ఎగుమతి చేసినవి - నూలు వస్త్రాలు, కుండలు, దంతపు దువ్వెనలు, ధాన్యం. దిగుమతులలో ముఖ్యమైనవి - అలంకార సామాగ్రి, రాగి, తగరం. వీరి ప్రయాణ సాధనాలు, ఎద్దుల బండి, పడవ. వస్త్రాలు తయారీ వీరి ముఖ్య పరిశ్రమ, సంఘంలో చేతి వృత్తుల వారు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, బేలుదారీ వారు కలరు.

**4.1.7.1. తూనికలు, కొలతలు :** వీరు కొనుగోలు చేయడంలో తూకపు పద్ధతులైన త్రాసులు, తూనికపు రాళ్ళు ఉపయోగించారు. కొలతలు, దశాంశ పద్ధతిలోఉండేవి. వీరి కొలతబద్ద ప్రమాణం సుమారు 13 అంగుళాలు.

## 4.1.8. సాంఘిక వ్యవస్థ :

వీరి సాంఘిక వ్యవస్థ ఎలాంటిదో పెద్దగా తెలియుటలేదు. నాటి సమాజంలో ప్రభు వర్గం పూజారులు, వర్తకులు, చేతివృత్తుల వారు, కూలీలు ఉండేవారు. ఆనాడు వర్ణ వ్యవస్త లేదు.

## 4.1.9. శిల్ప, చిత్ర కళలు :

సింధూ సంస్కృతి నాటి నివాస గృహాలపైన, పుర మందిరాలపైన ఏ విధమైన అలంకరణ కన్పించదు. కాని ఈ నాగరికతకు చెందిన కంచు, శిలా, మట్టి పాత్రలు బయల్పడ్డాయి. యివన్నీ సింధూ ప్రజల శిల్పకళా దృష్టికి, చిత్ర కళా నైపుణ్యానికి నిదర్శనాలు. సింధూ నాగరికతలో బయల్పడిన విగ్రహాలే భారతీయ శిల్పకళకు నాంది అనవచ్చు.

**4.1.9.1. కాంస్య విగ్రహాలు :** మొహంజాదారోలో లభ్యమైన నగ్నంగా ఉన్న నాట్యకత్తె కాంస్య ప్రతిమ వీరి లోహ శిల్ప కళకు మచ్చు తునక. ఈ ప్రతిమ విత్తు 4 1/2 అడుగులాలు. ఈ ప్రతిమకు కుడి చేయి నడుం మీద ఉన్నది. ఎడమ చేయి కొద్దిగా వంచి ఉన్న మోకాలిపై ఆనించి ఉన్నది. ఎడమ మోచేతి దాకా గాజులున్నాయి. మెడలో ఒకే ఒక కంఠ హారం ధరించింది. తల కొద్దిగా పైకెత్తబడి గిరజాల జుట్టుతో నిండి ఉంది. వెనుక వైపు వెంట్రుకల ముడిపెట్టి ఉన్నది. నేత్రాలు పెద్దవిగా ఉండి, కిందికి వాలినట్లు చెక్కినారు. దీనికి కాళ్ళు, మణికట్టు కనబడుటలేదు. కాంస్య విగ్రహాలలో మరొకటి నాట్య భంగిమలో నిలిచిన పురుషుని విగ్రహం ఈ విగ్రహంలో పురుషునికి కాళ్ళ భాగం విరిగిపోయింది. కంచుతో తయారైన గేదె, పొట్టేలు బొమ్మలు లభ్యమైనాయి.

**4.1.9.2. శిలా విగ్రహాలు :** సింధూ నాగరికతా కాలం నాటి శిలా విగ్రహాలకు చక్కని ఉదాహరణ యోగ ముద్రలో ఉన్న ఒక పురుషుని విగ్రహం. ఇది కూడా మొహంజాదారోలో లభించింది. ఈ విగ్రహం తల చక్కగా దువ్వబడింది. ఇతడు నున్నగా ఉన్న నిండైన గడ్డం కలిగి మీసం తీసి వేసి, త్రికోణాకారం గుర్తుగల పుష్ప లిఖిత ఉత్తరీయాన్ని ధరించి ఉన్నాడు. తలచుట్టూ గ్రీకు రాజులు ధరించినట్లు ఒక వెడల్పయిన రేకును ధరించి ఉన్నాడు. లావైన పెదవులు, పెద్ద ముక్కు, అర్ధనిమీలత నేత్రాలతో గంభీర ముఖ కవళికలు కల్గి ఉన్నాడు. ఈ అలంకరణ సుమేరియన్ మత గురువుల శిల్పాలలో కన్పిస్తుంది. ఇతడు ఖచ్చితంగా మత గురువు అయి ఉంటాడు.

హరప్పాలో ఎర్ర ఇసుకు రాయితోను, సున్నపు రాయితోను తయారయిన రెండు మనుషుల మొండేలు లభించాయి. వీటిని బట్టి విగ్రహ అవయవాలను విడివిడిగా తయారుచేసి వీటిని బిగించి విగ్రహంగా తయారు చేసే పద్ధతి కూడా ఈ కాలపు శిల్పులకు తెలుసు. వీటిలో ఒక మొండెం నాట్య భంగిమలో ఉంది.

**4.1.9.3. మట్టి బొమ్మలు :** మట్టితో చేసిన జంతువుల బొమ్మలు, మనుష్యుల బొమ్మలు అనేకం సింధూ లోయ త్రవ్వకాలలో బయల్పడ్డాయి. కొన్ని జంతువుల బొమ్మలు సహజత్వం ఉట్టి పడుతూ చూడ ముచ్చటగా ఉంటాయి. వాటిలో ముఖ్యమైనవి - పెద్ద పులి, ఖడ్గ మృగం, ఎనుబోతు, వానరం, పిల్లి, శునకం, ఎలుగుబంటు, గాడిద, డేగ, ముంగిస, ఉడత, చిలుక, నెమలి, కోడి ఉన్నాయి. ఇవన్నియు పిల్లల ఆటవస్తువులై ఉండవచ్చు. మట్టితో చేసిన స్త్రీ బొమ్మలు నగలతో అలంకరించబడి వున్నాయి. వీటిలో ఒక బొమ్మ విసనకర్ర లాంటి కిరీటంతో అలంకరించబడి ఉన్నది. ఇక్కడ లభించిన మట్టి బొమ్మలకు సుమేరియాలో దొరికిన మట్టి బొమ్మలకు పోలికలున్నాయి.

**4.1.9.4. సింధూ ముద్రికలు :** సింధూ శిథిలాలలో 2000 పైగా ముద్రికలు దొరికాయి. ఇవి మట్టితోను, స్టియటైట్ అనే మెత్తని రాతితో చేయబడినాయి. గుండ్రంగాను, చదరంగాను, దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న ముద్రికలు ఒక వైపున జంతువులుగాని, చెట్లుగాని, మనుషుల బొమ్మలు కాని ఎంతో నైపుణ్యంతో ముద్రించబడినాయి. మామూలు చిత్రాలే కాకుండా ఒక రకమైన చిత్ర రూప కలిపి కూడా వీటిపై ఉన్నది. సుమారు 400 చిహ్నాలు ఈ లిపిలో వాడినట్లు తెలుస్తున్నది. ఈ వ్రాతలో ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరించారు. మొదటి పంక్తి ఎడమ నుంచి కుడికి, రెండో పంక్తి కుడి నుంచి ఎడమకు ఉన్నది.

వీటిపై చెక్కిన జంతువుల ఆకారాలు నైపుణ్యం కలిగి ఉన్నాయి. ముద్రికల మీద చెక్కిన జంతువులలో ఎక్కువగా మూపురాలున్న వృషభం (ఎద్దు) కన్పిస్తున్నది. వృషభం మత విషయకరంగా సింధూ ప్రజల ఆరాధ్య జంతువై వుండవచ్చు. మిగిలిన జంతువులలో పెద్ద పులి, ఖడ్గ మృగం, కుందేలు మొదలైన చిత్రాలు చెక్కబడినాయి. కొన్ని ముద్రికలపై స్వస్తిక్ చిహ్నం కూడా కలదు. అందువల్ల వారికి సూర్యారాధన కూడా తెలుసు. ఈ ముద్రికల మీద ఉన్న శిల్ప నైపుణ్యం వీరి జంతు ప్రేమ, వాస్తవిక కళా దృష్టిని చూపిస్తున్నవి. ఒక ముద్రికపై "పశుపతి" చిత్రం కలదు. ఇది యోగి భంగిమలో కూర్చున్న మూడు ముఖాలుగల మూర్తి. ఇతడు పద్మాసీనుడై కూర్చుని ఉండగా ఇతని చుట్టూ పెద్ద పులి, ఏనుగు, దున్న పోతు, ఖడ్గ మృగం ఉన్నాయి. ఆసనం క్రింద లేడి ఉన్నది. ఈ మూర్తికి రెండు కొమ్ములున్న కిరీటం, కంఠాభరణం, కంకణాలు ఉన్నాయి. ఇతడు నగ్నంగా ఉన్నాడు. సర్‌జాన్ మార్షల్ ఈ చిత్రంలోని ప్రతిమకు "పశుపతి" అని పేరు పెట్టినాడు. శివుని ఇక్కడ పశుపతిగాను, మహాయోగిగాను చూపినారు.

**4.1.9.5. చిత్ర లేఖనాలు :** మట్టి పాత్రలపై కన్పించే చిత్ర లేఖనాలలో జంతువులు, పక్షులు, సర్పాలు, చేపలు, లతలు, వృక్షాలు మొదలైనవి అద్భుతంగా చోటు చేసుకొన్నాయి. సర్ జాన్ మార్షల్ అభిప్రాయంలో "వీరి చెక్కడపు పనిలోను, చిత్ర కళా రచనలోను లాలిత్యం, గాంభీర్యం కన్పిస్తాయి" అని పేర్కొనెను.

## 4.1.10. లిపి :

సింధూ ముద్రికలపైన, కుండలు, తాగే కప్పులు, మట్టి గాజులు, బంగారు, నగలు, దంతపు పెన్సిళ్ళు మొదలైన వాటిపైన 1, 2 పంక్తులలో లేఖనాలు ఉన్నాయి. ఈ లేఖనాలలో కొన్ని చేప, పక్షి, మనిషి మొదలైన చిన్న చిన్న బొమ్మల ఆకారాలలో ఉన్నాయి. అందువల్ల దీనిని "బొమ్మల లిపి" అన్నారు. ఈ లిపిని కుడి నుండి ఎడమకు వ్రాసే వారు. ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలను బట్టి ఈ లిపిలో దాదాపు 400 చిహ్నాలు వాడినట్లు తెలుస్తున్నది. ఈ లిపికి సుమేరియా, ఈజిప్టు, క్రీటు, చైనా లిపులకు పోలిక ఉంది. ఈ లిపిని అర్థం చేసుకోవటానికి ప్రపంచమంతటా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఈ ప్రయత్నాలు ఇంత వరకు సఫలీకృతం కాలేదు. దీని నుంచే అశోకుని బ్రాహ్మీ లిపి ఉద్భవించిందని ప్రొ॥ లాంగ్టన్ వంటివారి అభిప్రాయం. " ఈ లిపి - భాష వేద సంస్కృతమని" ఎస్.ఆర్. రావు అభిప్రాయం. " ఈ లిపి - భాష మూల ద్రావిడమని" పాదర్ హీరాస్ అభిప్రాయం. సోవియట్ పండితులు కంప్యూటర్ సహాయంతో ఈ లిపిని పరిశోధించి "ఈ లిపి ద్రావిడ భాషకు చెందినదని" అభిప్రాయపడిరి. ఏది ఏమైనా ఈ లిపిని పూర్తిగా చదువగల్గిననాడు సింధూ ప్రజల గురించి అనేక విషయాలు తెలియగలవు.

## 4.1.11. మత పరిస్థితులు :

సింధూ శిధిలాల్లో లభించిన ముద్రికలు, ప్రతిమలు వారి మతాన్ని గురించి తెలియజేస్తున్నాయి. త్రవ్వకాలలో దేవాలయాలు బయల్పడలేదు. వీరిలో రకరకాల విశ్వాసాలు, ఆచారాలు ఉన్నట్లు తెలుస్తున్నది. కనుకనే యం. వీలర్ పండితుడు "వీరి మతం అనేక నమ్మకాలతో కూడబెట్టిన మిశ్రమం" అని వ్యాఖ్యానించినాడు. వీరు స్త్రీ, పురుష దేవతలను వృక్షాలను, జంతువులను పూజించారు. ప్రధానంగా స్త్రీ దేవతను (దేవి) ఆరాధించినట్లు తెలుస్తున్నది. మట్టితో చేసిన స్త్రీ దేవత ప్రతిమలు అనేకం లభించాయి. వీటిలో ఒక ప్రతిమలో దేవి విసనకర్ర లాంటి కిరీటం, పొట్టిలంగా, వివిధ ఆభరణాలు ధరించి నిలబడి ఉంది. విగ్రహానికి ధూప దీపాల మసిసోకి ఉంది. ఇది "అమ్మ తల్లి" గాని "ప్రకృతి రూపం" గాని అయి ఉంటుంది. ప్రాచీన నాగరికతా స్థావరాలన్నింటిలో ఇలాంటి విగ్రహాలు కన్పించడం వల్ల ఈమెను అన్ని చోట్లా ఆరాధించినట్లు తెలుస్తున్నది. ఈ సాంప్రదాయమే హిందూ మతంలో శక్తి పూజగా, గ్రామ దేవత ఆరాధనగా నిలిచిపోయింది.

"జాతర" సమయాలలో "దేవిని" ధూప దీపాలతో ఆరాధించి, జంతుబలి, నరబలి యిచ్చే వారనడానికి సాక్ష్యంగా కొన్ని ముద్రికలు దొరికాయి. అశ్వత్థ వృక్షం (రావి చెట్టు) కొమ్మల మధ్య శక్తిని నిలిపి, ఆమెకు భక్తుడు బలి యివ్వడానికి మేకను తెస్తున్నప్పుడు, ఆ దృశ్యాన్ని చూస్తున్న వారిని చిత్రించిన ఒక ముద్రిక హరప్పాలో దొరికింది.

పురుష దేవతలలో ఒక ముద్రికపై మూడు ముఖాలతో పద్మాసీనుడైన మూర్తి ఉన్నది. ఆసనం క్రింద లేడి ఉంది. మూర్తికి రెండు కొమ్ములున్న కిరీటం, కంఠాభరణం, కంకణాలు ఉన్నాయి. ఇతని చుట్టూ ఏనుగు, పెద్ద పులి, దున్నపోతు, ఖడ్గమృగం ఉన్నాయి. ఈ మూర్తి "పశుపతి శివుడేనని'' సర్‌జాన్ మార్షల్ అభిప్రాయం. సింధూ ప్రజల దైవ గణంలో ముఖ్య దేవతలుగా ఆరాధింపబడిన "దేవి'' (అమ్మ తల్లి) "పశుపతి'' అనంతర కాలంలో పార్వతి - పరమేశ్వరులుగా మారి ఉంటారు. శివలింగాన్ని పోలిన రాళ్ళు హరప్పాలో అనేకం లభించాయి. లింగారాధన ప్రాచీన కాలంలో అనేక దేశాలలో అమలులో ఉంది. కొన్ని ముద్రికలపై స్వస్తిక్ చిహ్నం ఉన్నందువల్ల నాడు సూర్యారాధన కూడా ఉందని భావించవచ్చు.

హరప్పా త్రవ్వకాల్లో పెద్ద సంఖ్యలో రక్షరేకులు లభించాయి. దయ్యాలు, దుష్ట శక్తులూ తమకు అపకారం చేస్తాయన్న నమ్మకం వారికి ఉండవచ్చు. వాటికి పరిహారంగా వారు రక్షరేకులనూ, తాయెత్తులను ఉపయోగించి ఉండవచ్చు.

**4.1.11.1. మృత సంస్కారాలు :** మొహంజాదారోలో బయల్పడ్డ సమాధులను బట్టి ఈ కాలంలో 3 రకాల మృత సంస్కారాలను అవలంభించినట్లు తెలుస్తున్నది. అవి. 1. గృహ సామాగ్రి, కానుకలతో పూడ్చి పెట్టడం, 2. మృత దేహాన్ని అడవి జంతువులు, పక్షులు తినగా మిగిలిన అస్థికలను పాతి పెట్టడం, 3. మూత ఉన్న పేటికలో శవాన్ని పెట్టి, వస్తువులు కానుకలు ఉంచి ఇంటి దగ్గర కాని, ఆవరణలో కాని పూడ్చి పెట్టేవారు.

చనిపోయిన వారిని సమాధి చేసే పద్ధతిని బట్టి వీరికి మరణానంతర జీవితంలో కూడా నమ్మకం ఉండేదని తెలుస్తున్నది. సింధూ ప్రజల దేవతలు, వారి నమ్మకాలు, వారి ఆచారాలు ఈనాటి హిందూ మతంలో సజీవంగా నిలిచి ఉండటం గమనించదగిన విషయం.

## 4.1.12. అంతరించడానికి గల కారణాలు :

సింధూ నాగరికత క్షీణించడానికి గల కారణాలను గురించి పురావస్తు శాస్త్రవేత్తలు భిన్న అభిప్రాయాలను వ్యక్తం చేసిరి. తరచుగా వచ్చే సింధూ నదీ వరదలే నాగరికత పతనానికి ప్రధాన కారణమని కొందరి అభిప్రాయం. అయితే ఇప్పటి వరకు బయల్పడ్డ 1400 సింధూ స్థావరాల్లో - సింధూ లోయ ప్రాంతంలో 86 స్థావరాలు మాత్రమే ఉన్నాయి. కనుక వీరి అభిప్రాయం సరికాదు. మరి కొందరు ఈ నాగరికత పతనానికి ఆర్య దండయాత్రలు కారణమని అభిప్రాయపడిరి. కాని అందుకు సాక్ష్యం ఒక్క హరప్పాలో మాత్రమే కనిపిస్తుంది. సింధూ నాగరికత క్షీణించడానికి ప్రధాన కారణం ఆర్థిక పరిస్థితి క్షీణించడమే. సింధూ ప్రాంతంలో క్రీ.పూ. 3000 ప్రాంతంలో వర్షపాతం కొద్దిగా పెరిగిందనీ, రెండో సహస్రాబ్దం ప్రారంభంలో తగ్గిందని కొందరు అభిప్రాయపడిరి. ఇలా వర్షపాతం తగ్గటం వ్యవసాయాన్ని, పశుపాలననూ దెబ్బతీసి ఉండవచ్చు. పక్కనే ఉన్న ఎడారి విస్తరించటం చేత భూసారం తగ్గిపోయి, భూమి చవిటి పర్రగా మారిపోయి ఉండవచ్చునని కొందరు ఊహించుట జరుగుచున్నది. వరదల వల్ల భూమి పల్లంగానో, మిట్టగానో మారిపోయి ఉండవచ్చునని మరికొందరు అభిప్రాయపడుచుండిరి. భూకంపాలు వచ్చి సింధూ నది ప్రవహించే మార్గం మారిపోయి, మొహంజాదారో మునిగిపోయి ఉండవచ్చునని కొందరి అభిప్రాయం.

ఈ నాగరికతకు చెందిన స్థావరాలు అనేకం సరస్వతీ లోయలో కలవు. సరస్వతీ నది తన దారి మళ్ళించుకోవటం వల్ల ఆ ప్రాంతమంతా నిరుపయోగమైంది. ఫలితంగా ప్రజలు తూర్పు వైపునకు పయనించారు. అందువల్ల విదేశీ వ్యాపారం కూడా క్షీణించింది. సుమేరియా రికార్డులలో కూడా భారతదేశం పేరును తొలగించడం జరిగింది. ఫలితంగానే లోథాల్ రేవు పట్టణం క్షీణించింది. ఏది ఏమైనా సింధూ నాగరికత క్షీణించడానికి వరదలు, దండయాత్రలు, నదీ ప్రవాహంలో వచ్చిన మార్పు, వ్యాపారం క్షీణించడం మొదలైన కారణాలు దోహదం చేశాయని చెప్పవచ్చు.

## 4.1.13. సారాంశము :

ప్రపంచ నాగరికతలలో ధీటుగా భారతీయ సంస్కృతిని సింధూలోయ నాగరికత నిలబెట్టబడినది. సింధూలోయ నాగరికతలో విశిష్టమైన నగర నిర్మాణాలు ప్రాచీన సంస్కృతిలో పట్టణ నాగరికత సంస్కృతికి ప్రతిబింబాలుగా సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు కనబడుతున్నాయి.

## 4.1.14. నమూనా ప్రశ్నలు :

1. సింధూ లోయ నాగరికత స్థావరాల గురించి వివరింపుము.

## 4.1.15. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Mohenjadaro and the Indus Valley Civilisation | - | Marshall |
| 2. | The Indus Civilisation | - | E.J.H. Macay |
| 3. | Further Excavations in Mohenjadaro | - | E.J.H. Macay |
| 4. | Pre Historic Civilisation of Indus Valley | - | K.N. Dikshit |
| 5. | An Advanced History of India | - | R.C. Majumdar and Others |
| 6. | History of Ancient India | - | Aru Bhatla Charjee |
| 7. | భారతదేశ చరిత్ర - సంస్కృతి | - | వారణాసి యశోదా దేవి<br>బి.యస్.ఎల్. హనుమంతరావు |
| 8. | An introduction to Indian Archaeology | - | H.D. Sankaliya |
| 9. | The Culture and Civilisation of Ancient India<br>An Historical Outline | - | D.D. Kosambi |
| 10. | The Birth of Indian Civilization | - | B.R. Allchin |
| 11. | Ancient India | - | R.S. Sharma |
| 12. | Studies in Ancient Indian Social History | - | Romilla Thapar |
| 13. | The Wonder that was India. | - | A.L. Basham |

**పాఠం - 4.2**

# నాగార్జున కొండ

## 4.2.0. లక్ష్యం :

నాగార్జున కొండ విశేషాలను గురించి తెలియచేయుటమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :


**4.2.1.** పరిచయము

**4.2.2.** చరిత్ర పూర్వయుగం నాటి అవశేషాలు

**4.2.2.1** ఇతర పురావస్తు సామాగ్రి

**4.2.3.** బౌద్ధ కట్టడాలు

**4.2.3.1.** మహా చైత్యం

**4.2.3.2.** ఘుళ ధమ్మగిరి చైత్యాలయం

**4.2.3.3.** బౌద్ధ శిల్పం

**4.2.4.** విజయపురి కోట అవశేషాలు

**4.2.5.** బ్రాహ్మణ దేవాలయాలు

**4.2.5.1.** అష్ట భుజస్వామి ఆలయం

**4.2.5.2.** పుష్ప భద్రస్వామి ఆలయం

**4.2.5.3.** బ్రాహ్మణ శిల్పం

**4.2.6.** పతనం

**4.2.7.** పురావస్తు ప్రదర్శన శాల

**4.2.8.** సారాంశము

**4.2.9.** నమూనా ప్రశ్నలు

**4.2.10.** చదువదగిన గ్రంథాలు


## 4.2.1. పరిచయము :

నాగార్జునకొండ ఒకప్పుడు హిందూ బౌద్ధమత విశ్వాసాలకు కేంద్రంగా ఉండేది. మహాయాన బౌద్ధమత ప్రసిద్ధి చెందిన ఆచార్య నాగార్జునుడు నివశించి, మహాయన బౌద్ధమత ప్రచారం కావించినాడు. ఇచ్చట బుద్ధ ధాతువు పై నిర్మించిన చైత్యాలయం కలదు. నాగార్జున కొండను మనుష్యుల భావ వ్యక్తీకరణకు, మత విశ్వాసాలకు నిలయమైన స్థలం. ఇక్ష్వాకుల చేత "విజయపురి" అనే పేరున

పాలించబడింది. నాడు బాగా చేతివృత్తులు కొనసాగిన స్థలం. ఇచ్చట ప్రపంచ ప్రసిద్ధి చెందిన పురావస్తు ప్రదర్శనశాల కలదు. ఇచ్చటనే నాగార్జునసాగర్ అనే బహుళార్ధ సాధక ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం, మరియు నల్గొండ జిల్లా వాసులకు తాగునీరు, సాగునీరు అందించబడుతుంది.

నాగార్జున కొండ లోయ మొత్తం 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది. దీనికి ఒక వైపున కృష్ణానది, మూడువైపుల నల్లమల కొండలు గలవు. ఈ ప్రాంతం మాచర్లకు 25 కిలో మీటర్ల దూరంలో ఉన్నది. ఆ ప్రాంతాన్ని పూర్వం శ్రీ పర్వతమని, విజయపురి అని పిలిచేవారు. ఇచ్చట నాగార్జునుడు బోధనలు చేశాడు కాబట్టి ఈ ప్రాంతానికి నాగార్జున కొండ అనే పేరు వచ్చింది.

1926 లో ప్రప్రథమంగా నాగార్జునకొండను కనుగొన్న ఘనత ఎ.ఆర్. సరస్వతి గారికి దక్కింది. వీరు మద్రాస్ పురావస్తు శాఖలో తెలుగు అసిస్టెంట్‌గా పనిచేశారు. ఇతని నివేదిక ఆధారంగా ఏ. హెచ్. లాంగ్ హర్స్ట్ (1927-1931), టి.యస్. రామచంద్రన్ (1938), రాయప్రోలు సుబ్రహ్మణ్యం (1954-1960) లలో ఒకరి తర్వాత ఒకరు త్రవ్వకాలను జరిపించారు. ఈ త్రవ్వకాలలో బ్రాహ్మణ, బౌద్ధ మతాలకు చెందిన నిర్మాణాలు దుర్గం, శిలా పనిముట్లు, శాసనాలు ఇంకా అనేకం అభించాయి. వీటన్నింటిని నేడు కొండ మీద గల మ్యూజియంలో భద్రపరిచారు. ఈ మ్యూజియం కొండ చుట్టూ నదీ ప్రవాహం కలదు. ద్వీపంలో కల ప్రదర్శనశాలలో ప్రపంచం మొత్తం మీద నాగార్జున కొండ మొదటిది. ప్రపంచంలో రెండవది ఈజిప్టులో అస్వాన్ డామ్‌కు సమీపంలో అబూసెంబెల్ వద్ద ఉన్నది.

భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చొరవతో భారత పురావస్తుశాఖ 1954 తర్వాత 6 సంవత్సరాల స్వల్ప కాలంలో మొత్తం లోయలో త్రవ్వకాలను పూర్తి చేసింది.

## 4.2.2 చరిత్ర పూర్వయుగం - నాటి అవశేషాలు :

నాగార్జున కొండ త్రవ్వకాలలో చరిత్ర పూర్వ యుగంనాటి అవశేషాలు లభించాయి. ప్రాచీన శిలాయుగం నుంచి చారిత్రక కాలం వరకు అన్ని దశల పనిముట్లు వరుసగా ఇక్కడ దొరికాయి. ఇవి భూమి ఉపరి భాగాన, నదీతీరంలో లభించాయి. ప్రాచీన శిలాయుగం నాటి అవశేషాలకంటే నవీన శిలాయుగంనాటి పరికరాలు ఎక్కువగా లభ్యమైనాయి. సూక్ష్మరాతి యుగం నాటి లనేక సూక్ష్మశిలా పరికరాలు కూడా ఎక్కువగా లభ్యమైనాయి. రాతి గొడ్డళ్ళు, మొనతేలినరాతి పనిముట్లు, మెరుపు కల్గిన బూడిదరంగు కుండ పెంకులు కనుగొన్నారు. పెద్దబానలో శిశువును పెట్టి పూడ్చిన సమాధి, రాగి ముక్కలు లభించాయి.

ఇవిగాక " రాక్షసి గుళ్ళు లేదా బృహత్ సమాధులు " ఇక్కడ కన్పించాయి. ఇంతవరకు వీటిలో రెండు సమాధులను తెరిచి పరిశోధన గావించారు. వాటిలో ఒకదానిలో మూడు పుర్రెలు, మానవ అస్థికలు, రెండోదానిలో నవీన శిలాయుగానికి చెందిన కుండ సామాగ్రి లభించినది.

**4.2.2.1. ఇతర పురావస్తు సామాగ్రి :** నాగార్జున కొండలోయలో జరిగిన త్రవ్వకాలలో పైన పేర్కొన్నవే గాక నాణాలు, పూసలు, మట్టిబొమ్మలు, రాగి, ఇనుప వస్తువులు, బంగారు ఆభరణాలు లభించాయి. లభించిన నాణాలలో కొన్ని రోమన్ చక్రవర్తులవి కాగా, కొన్ని శాతవాహనుల కాలంనాటి సీసపు నాణాలు, కొన్ని ఇక్ష్వకుల కాలంనాటి బంగారం, సీసం, పోటీన్ నాణాలు లభించాయి.

శ్రీ పర్వతంలో ఆచార్య నాగార్జునుని కొరకై ఆంధ్రశాతవాహన చక్రవర్తి యజ్ఞశ్రీ శాతకర్ణి ఒక గొప్ప సంఘారామాన్ని, 5 అంతస్తుల విహారాన్ని నిర్మించి ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఇక్కడ నాగార్జునుడు సుమారు 120 సంవత్సరములు బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని నడిపినాడు. ఈ విశ్వవిద్యాలయంలో స్వదేశీయులేకాక చైనా, టిబెట్, సింహళం మొదలైన విదేశీయులు కూడా విద్యనభ్యసించేవారు. దేశంలోని మొత్తం 30 ప్రాంతాలలోని బౌద్ధ ఆరామాలకు విజయపురి ప్రధాన కేంద్రంగా ఉండేది.

శాతవాహనుల పతనానంతరం విజయపురి ఇక్ష్వాకుల (225-300 A.D.) రాజధాని అయ్యింది.ఇక్ష్వాకు వంశంలో 4 గురు రాజులున్నట్లు వారి శాసనాలవల్ల తెలుస్తున్నది. వీరు 1. వాసిష్టీపుత్ర శ్రీ క్షాంతమూలుడు 2. వీరపురుషదత్తుడు 3. ఎహువల క్షాంతమూలుడు 4. రుద్ర పురుషదత్తుడు, ఇక్ష్వాకుల రాజులు వైదిక మతాన్ని అవలంబించి అశ్వమేధాయాగాలను నిర్వహించారు. కాని వారి రాణులు,

ఇతర అంతఃపుర స్త్రీలు బౌద్ధమతాభిమానులు కావడంవల్ల ఇక్ష్వాకురాజులు కూడా బౌద్ధమతాన్ని ఆదరింపక తప్పలేదు. వీరి ఆదరణలో నాగార్జున కొండ సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రమైనది. థేరవాద, మహాసాంఘిక శాఖలనేకం నాగార్జున కొండలో ఉన్నట్లు శాసనాలు చాటుతున్నాయి.

ఇక్ష్వాకుల శాసనాలు నాగార్జున కొండలో దాదాపు 45 లభించాయి. వీటిలో ఎక్కువ భాగం బ్రాహ్మిలిపి, ప్రాకృత భాషలో ఉన్నాయి. కొన్ని సంస్కృత శాసనాలు కూడా లభించాయి. ఈ శాసనాలు స్థూపాల వేదికలపై నున్న ఆయక్తస్తంభాల మీద, విగ్రహాల మీద చెక్కబడ్డాయి. ఇక్కడ లభించిన అతి ప్రాచీన శాసనం శాతవాహన చక్రవర్తులలో కడపటి వాడైన విజయశాతకర్ణికి చెందినది.ఇక్ష్వాకులకు పూర్వమే ఇక్కడ బౌద్ధమతం వర్ధిల్లినట్లు తెలుస్తున్నది.

## 4.2.3 బౌద్ధ కట్టడాలు :

1927లో నాగార్జునకొండలో లాంగ్ హర్ట్స్ నిర్వహించిన త్రవ్వకాల ఫలితంగా ఒక మహాచైత్యం (పెద్ద స్థూపం) 8 చిన్న స్థూపాలు, 6 గజపృష్టాకార చైత్యగృహాలు, 4 మండపాలు రాజప్రాసాద స్థలం బయల్పడ్డాయి. 1938 లో టి.యన్. రామచంద్రన్ జరిపిన త్రవ్వకాలవల్ల రెండు చైత్యగృహాలు, ఒక సంఘారామం వెలుగులోనికి వచ్చాయి. 1954లో డా॥ ఆర్. సుబ్రహ్మణ్యం జరిపిన త్రవ్వకాలలో 10 స్థూపాలు, 26 విహారాలు బయల్పడ్డాయి. ఇక్కడి స్థూపాలు బండి చక్రం ఆకారంలో నిర్మించబడ్డాయి. స్థూపాల నిర్మాణంలో ఇటుక, సున్నం వాడబడింది. కానీ ఈ స్థూపాలు ఉత్తరభారతదేశంలోని స్థూపాలంతగట్టివి కావు. నాగార్జున కొండలో బయల్పడిన స్థూపాలను 2 రకాలుగా విభజించవచ్చు. అవి. 1. సాధారణ స్థూపాలు 2. శిల్పసంశోభితమైన స్థూపాలు.

**4.2.3.1. మహాచైత్యం :** వీరపురుషదత్తుని (ఇక్ష్వాకురాజు) 6వ రాజ్యపాలనా కాలంలో అతని మేనత్త ఛాంతిశ్రీ, శ్రీ పర్వతంపైన పాడుబడి ఉన్న మహాచైత్యమును పునర్ నిర్మించింది. ఇది శారీరక స్థూపం. దీని వ్యాసం 106 అడుగులు, ఎత్తు 80 అడుగులు ఉండేది. నలుదిక్కులా వేదికలు వాటిపై ఐదేసి ఆయక్త స్తంభాలు ఉండేవి. ఒక ఆయక్త స్థంభం మీద ఉన్న ఇక్ష్వాకుల నాటి ప్రాకృత శాసనంలో ఇక్కడ బుద్ధుని ధాతువు నిక్షిప్తంచేయబడినట్లుగా చెప్పబడింది. ఈ స్థూపానికి 13 అడుగుల చుట్టుకొలత కల్గిన ప్రదక్షిణాపదం ఉంది. ఈ స్థూపం అడుగున పశ్చిమోత్తరాన గల ఒక గుడిలో లభ్యమైన ఒక చిన్న బంగారు భరణెలో "దంతం" అవశేషం లభించింది. ఇది ఇక్ష్వాకుకాలానికి పూర్వమే నిర్మించబడింది. అయితే దీనిని ఛాంతిశ్రీ, ఇతర రాకుమార్తెలు జీర్ణోద్ధారణచేసి, దీనికి శిల్పాలు కల్గిన చలవరాతి ఫలకలను చెక్కించి అమర్చారు.

**4.2.3.2. ఘుళ ధమ్మగిరి చైత్యాలయం :** బౌద్ధ సంస్థలకు దానాలిచ్చిన స్త్రీలలో రాజభాండాగారి మేనకోడలు ఉపాసిక బోధశ్రీ గణుతి కెక్కింది. ఈ మెతామ్రపర్ణి, కాశ్మీర్, గాంధార, చైనా, కిరాట, తోసలి, అపరాంత, వంగ, వనవాసి మొదలైన రాజ్యాల్లో బౌద్ధాన్ని ప్రచారం చేసే భిక్షువుల కోసం ఘుళ ధమ్మగిరి పైన (మహాచైత్యానికి తూర్పుగా ఉన్న నల్లరాళ్ళ బోడులనే గుట్టమీద) గజపృష్టాకార చైత్యాలయాన్ని, చతుశ్శాలను నిర్మింపచేసింది. ఇంకా ఈమె కుల విహారం దగ్గర ఒక చైత్యాలయాన్ని సింహళ విహారంలో ఉన్న బోధి వృక్షానికి వేదికను, దేవగిరిపై ప్రార్ధనాశాలను నిర్మింపచేసినట్లు ఒక శాసనం వల్ల తెలుస్తున్నది. నాగార్జున కొండలోని " సింహళవిహారం" సింహళయాత్రికుల కోసం ఉద్దేశించినదే.

ఈమె గాక భటీదేవి (ఎహువల క్షాంతమూలుని తల్లి) కొడబలిశ్రీ (ఎహువలక్షాంతమూలుని సోదరి) అనేవారు కూడా ఆరామాలు నిర్మించినట్లు ఆధారాలున్నాయి.

ఈ స్థూపాలు, చైత్యాలు, విహారాలు నిర్మాణానికి కావలసిన శిల్పఫలకాలు, అడ్డపట్టీలు మొ॥వి అనేక మంది వర్తకులు, పాటకజనం, స్త్రీలు, పురజనుల చేత దానాలు చేయబడ్డాయి. ఒక చైత్య విహార సముదాయానికి కుమారనంది అనే వర్తకుడు శిల్ప ఫలకాన్ని దానం చేసినట్లు అక్కడ శాసనాన్ని బట్టి తెలియవస్తున్నది.

**4.2.3.3. బౌద్ధ శిల్పం :** నాగార్జున కొండలోని పెక్కు స్థూపాలశిధిలాలనుంచి శిల్పాలు లభించాయి. ఈ శిల్పాలలో రెండు దశలు స్పష్టంగా కన్పిస్తాయి. అవి. 1. దేశీయమైనది. ఈ శిల్పం సాంచి, భిల్సా శిల్పానికి సన్నిహితంగా ఉంటుంది. 2. గాంధారశిల్ప ఛాయలు కన్పిస్తాయి. మార్షల్ చెప్పినట్లు " గాంధార నుంచి వచ్చిన కొన్ని అలంకారాలు, సంకేతాలు పూర్తిగా అంతర్లీనం అయిపోయి స్థానిక లక్షణాలుగానే ఈ శిల్పాలలో భాసిస్తున్నాయి." అని పేర్కొనెను. ఈ శిల్పాలన్నీ తెల్లని సున్నపురాతితో చెక్కబడ్డాయి. లాంగ్ హార్స్ట్ ఆధ్వర్యంలో జరిగిన త్రవ్వకాలలో దాదాపు 500 శిల్ప కళాఖండాలు వెలుగులోనికి వచ్చాయి. పూర్తిగా శిల్పాలతో అలంకరించిన ధమరుక ఫలకాలు, 22 ఛాయా స్థంభాలు బయల్పడ్డాయి. బౌద్ధమతానికి చెందిన 12 జాతక కథలు, బుద్ధుని జీవిత విశేషాలు, రాజుల గాథలు ఈ శిల్పాలలో కన్పిస్తాయి. అనేక రకాల భంగిమలలో గౌతమబుద్ధ ప్రతిమలు లభించాయి. మిధునాలు, సాలభంజికలు, వృక్షాలు, యక్షిణులు-మనోహరంగా సృష్ఠించబడ్డాయి. ఇక్కడి మిధునశిల్పాలకు ఒక ప్రత్యేకత ఉంది. వీటిలో జీవకళ ఉట్టిపడుతుంటుంది. కోపం వచ్చిన స్త్రీని పురుషుడు బుజ్జగించడం, అతడు ఆమెకు మధుపాత్రను అందించడానికి ప్రయత్నంచేయడం, ఆమె నిరాకరించడం, మొదలైన దృశ్యాలు ఎంతో సహజంగా ఉన్నాయి.

కవచం ధరించిన స్కితియన్ వీరుని విగ్రహం నాగార్జున కొండలో లభించింది. దీనిని బట్టి ఇక్ష్వాకు రాజులకు, స్కితియన్ చక్రవర్తులకు మధ్య దౌత్య సంబంధాలుండేవి. వీర పురుషదత్తుని తర్వాత రాజ్యానికి వచ్చిన ఎహువల క్షాంతమూలుడు వైదికమతాన్ని కాదని, దానిని అణచివేసినాడు. నాగార్జునకొండలో ఒక స్థంభం మీద ఈయన చెక్కించిన శిల్పాలవల్ల ఈ విషయం బోధపడుతుంది. ఒక శిల్పంలో గౌతమ బుద్ధుడు స్వర్గంనుంచి దిగుతూ ఉంటాడు. రాజు, రాణులు అతని వద్దకు చేరుతున్నారు. మరో శిల్పంలో రాణులు పెట్టిన అడ్డు తొలగించి, రాజు బుద్ధునికి సాష్టాంగపడి ప్రమాణం చేస్తున్నాడు. మూడోశిల్పంలో రాజు తన కాలితో ఏడుపడగల నాగుపాము మధ్యనున్న లింగాన్ని తొక్కతూ ఉంటాడు. ఈ రాజు వీర పురుషదత్తుడు అని కొంతమంది ఈ శిల్పం మాంధాత జాతకంలోని భాగమని అభిప్రాయపడ్డారు.

## 4.2.4. విజయపురి కోట అవశేషాలు :

విజయపురి ఇక్ష్వాకులకు రాజధాని. దీనిని తొలుత శాతవాహన రాజులలో మొదటివాడు విజయశాతకర్ణి అనే పేరుతో నిర్మించారని అదే అ తర్వాత ఇక్ష్వాకులకు రాజధాని అయిందనే ఒక అభిప్రాయం ఉంది. మూడు వైపులా పర్వత శ్రేణులను కలుపుతూ రక్షణ శ్రేణులు, మరొక వైపు కృష్ణాజలాలతో విజయపురి బలిష్టమైన దుర్గంగా ఉండేది. దుర్గప్రాకారాన్నంటుకొని లోతైన కందకం ఉండేది. విజయపురి కోట కుఉండిన ప్రాకారాలలో లోపల పెక్కు భవన శిధిలాలు, చతురస్రాకారంగా ఉన్న ఒక బహిరంగ ప్రదర్శనశాల అవబృధ స్నానవాటిక, అశ్వమేధయాగశాల, సైనికుల నివాసాలు మొదలైన అనేక శిధిలావశేషాలు వెలుగులోకి వచ్చాయి. బహిరంగ ప్రదర్శనశాల దీర్ఘచతురస్రాకారంగా ఉండి లోపల చదునైన స్థలంలో ఒక వేదిక ఉన్నది. అది ఉపన్యాస వేదిక అయి ఉండవచ్చు. వేదికపై నిల్చొని మాట్లాడితే 200 అడుగుల వరకు స్పష్టంగా మాటలు వినిపిస్తాయి. మిక్కిలి క్లిష్టమైన ఈ ప్రదర్శనశాల నిర్మాణంలో రోమన్ నిపుణులు సహాయపడి ఉంటారు.

శ్రీ క్షాంతమూలుని కాలంనాటి అశ్వమేధా వేదిక బయల్పడింది. అశ్వాన్ని భూ స్థాపితం చేసిన స్థలంలో అశ్వం ఎముకలు లభించాయి. విజయపురి దుర్గంలో బయల్పడ్డ కట్టడాలలో అన్నింటికంటె పెద్దది అవబృధస్నాన వాటిక. ఇది 27 అడుగుల చతురస్రాకార కట్టడం. 6 అడుగుల లోతు ఉంటుంది. దీనిలోనికి దిగడానికి నాలుగు వైపులా మెట్లున్నాయి. రాజులు స్నానానికి దిగినపుడు పవిత్ర జలాన్ని పంపటంకోసం పైనించి ప్రత్యేక తూమును ఏర్పాటు చేశారు. అశ్వమేధా వేదిక సమీపంలోని కట్టడాలు రాజప్రసాదమై ఉండవచ్చు. ఇంకా ఇక్కడ బావులు,కాల్వలు, స్నానాలగదులు, వంటశాల శిధిలాలు బయల్పడ్డాయి.

## 4.2.5 బ్రాహ్మణ దేవాలయాలు :

ఇక్ష్వాకు రాజుల కాలంలో బౌద్ధమతంతో పాటు బ్రాహ్మణ మతం కూడా ఎంతో అభివృద్ధి చెందింది. నాగార్జున కొండ త్రవ్వకాలలో బయల్పడిన బ్రాహ్మణదేవాలయాలు, ఇక్ష్వాకురాజుల సహజసిద్ధమైన వైదిక మతాభిమానానికి తార్కాణాలు. ఇక్ష్వాకులు శైవులు. వారి మిత్రులైన అభీరులు వైష్ణవులు. వీరిరువుకలసి నాగార్జున కొండలో అనేక దేవాలయాలు నిర్మించిరి. ముఖ్యంగా ఎహువల క్షాంతమూలుని కాలంలో నాగార్జున కొండలోయలో ఒక వైపు బౌద్ధ సంస్థలు, మరొక వైపు బ్రాహ్మణాలయాలు నిర్మాణం విరివిగా జరిగింది. కొన్ని దేవాలయాలు దుర్గంచుట్టూ, కృష్ణానది ఉత్తర వాహినివైపుకు నిర్మించబడగా, మరికొన్ని ఆలయాలు స్నానవాటిక సమీపంలో ఉన్నాయి. కోటచుట్టూఉన్న 9 ఆలయాలలో 5 ఆలయాలు నదీతీరంలో ఉన్నాయి. శాసనాల వల్ల ఈ దేవాలయాల నిర్మాణాలు తెలియవస్తున్నాయి. శైవ, వైష్ణవ, శాక్తేయ ఆలయాల నిర్మాణం ఇక్కడ జరిగింది. ఇక్కడ బయల్పడ్డ ఆలయ శిధిలాలలో అష్టభుజస్వామి, పుష్పభద్రస్వామి హరీతీ, సర్వదేవ, కార్తికేయ, నవగ్రహ ఆలయాలున్నాయి. ఈ ఆలయాల శిధిలాలను ఆగమ శాస్త్ర పద్ధతి ప్రకారం నిర్మించారని తెలియవస్తున్నది. దక్షిణ పధంలో దేవాలయాల నిర్మాణానికి ఇవి ప్రారంభమని చెప్పవచ్చు.( క్రీ॥శ॥ 270).

**4.2.5.1 అష్టభుజస్వామి ఆలయం :** నాగార్జున కొండలోని సిద్దులాద్రి కొండ వద్ద ఈ ఆలయం ఉంది. క్రీ॥శే॥ 278లో అభీరులు దీనిని నిర్మించారు. ఈ ఆలయంలోనే గర్భగృహంలో రాతి వేదికపై కొయ్యతో చేసిన విష్ణు విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ఇక్కడి శాసనాన్ని బట్టి తెలియవస్తున్నది. దీనికి కొద్ది దూరంలో నొడగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఆలయానికి సమీపంలో ఉన్న మండపం చితిశాలగా భావించడమైనది. సతీ సహగమన దృశ్య శిల్పం ఈ వాదాన్ని బలపరుస్తుంది.

**4.2.5.2. పుష్పభద్రస్వామి ఆలయం :** స్నానఘట్టానికి సమీపంలో పుష్పభద్రస్వామి ఆలయ పునాదులు బయల్పడ్డాయి. ఇవి గుర్రపు నాడా ఆకృతిని పోలి ఉన్నది. ఈ పుష్పభద్రస్వామి ఆలయానికి సమీపంలోనే "సర్వదేవ ఆలయం" ఉంది. ఎహువల క్షాంతమూలుని 11 వ రాజ్య పరిపాలనా కాలంలో ఆతని సేనాపతి అయిన ఎలిశ్రీ దీనిని నిర్మించినట్లు తెలుస్తున్నది. ఒకే శాసనం ఈ ఆలయంలోని స్తంభాలమీద ఆరేడు సార్లు చెక్కబడటం విశేషం. ఈ ఆలయంలోని శివ విగ్రహం ఎహువల క్షాంతమూలుని 14 వ రాజ్యపరిపాలనా కాలంలో వీరపురుష దత్తునిచే ప్రతిష్టించినట్లు ఆలయ ధ్వజ స్థంభంపై శాసనాన్ని బట్టి తెలియవస్తున్నది. ఈ ఆలయానికి సమీపంలోనే "హారతీ" విగ్రహం లభించింది. ఇంకా త్రవ్వకాలలో "మృణ్మయ శక్తి విగ్రహాలు" అనేకం లభించాయి. ఈ ఆలయానికి దగ్గరలో గుర్తు తెలియని రెండు మందిరాలున్న ఒక ఆలయం, దాని ప్రక్కనే చతురస్రగర్భగృహం కనుక్కోవడమైనది. కార్తికేయ విగ్రహం ఈ ప్రాంతంలోనే దొరికింది. ఇంకా గుర్తు తెలియని అనేక అవశేషాలు త్రవ్వకాలలో వెలికి వచ్చాయి.

**4.2.5.3. బ్రాహ్మణశిల్పం :** నాగార్జున కొండ త్రవ్వకాలలో బ్రాహ్మణ మత శిల్పాలు అనేక బయల్పడ్డాయి. వీటిలో యుద్ధ దృశ్యాలకు సంబంధించిన శిల్పాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. అశ్వాలమీద నుంచి, గజాలమీద నుంచి వీరులు యుద్ధం చేస్తున్న దృశ్యాలు కన్పించాయి. కార్తికేయ, దేవసేన, మరుగుజ్జు గణాలు, సతీ శిల్పం - బ్రాహ్మణ శిల్పాలలో ముఖ్యమైనవి. ఇంకా ఈ శిల్పాలలో వివిధ నాట్య భంగిమలలో రమణీయంగా కన్పిస్తాయి.

## 4.2.6. పతనం :

ఇక్ష్వాకుల పతనానంతరం పల్లవుల కాలంలో బౌద్ధ మతం అధిక్షేపించబడింది. నాగార్జున కొండలోని శిల్పాలు, భవనాలు ధ్వంసం చేయబడినాయి. తర్వాత కాలంలో శంకరాచార్యులు బౌద్ధ మతస్తులనోడించి నాగార్జున కొండను శంకరమఠంగా మార్చినాడు.

## 4.2.7. పురావస్తు ప్రదర్శనశాల :

పోయినవి పోగా మిగిలిన శిధిల శిల్పాలు, మృణ్మయ పాత్రలు, నాణాలు కొండ మీద గల మ్యూజియంలో భద్రపరచినారు. నాగార్జున సాగర్ ఆనకట్ట నిర్మాణం వల్ల నాగార్జున కొండలో యంతా నీటిలో మునిగిపోయింది. కాబట్టి లోయ నమూనాను కూడా తయారు చేసి మ్యూజియంలో ఉంచారు.

నాగార్జున కొండ ప్రదర్శనశాలకు పడమరగా మహా చైత్యం, సింహళ విహారం, అవబృధస్నాన ఘట్టం, కూర్మచితి మొదలైనవి కన్పిస్తాయి. నాగార్జున కొండ లోయ మునిగిన తర్వాత పునఃనిర్మిత కట్టడాలు, మహాస్థూపంలోని బౌద్ధ ధాతువును సారనాధ్ మూల గంధ కుటి విహారానికి తరలించినట్లుగా తెలుస్తుంది.

ఒకనాటి హిందూ, బౌద్ధ సంస్కృతీ కేంద్రం నాగార్జున కొండ తథాగతుని ధాతువుపై నిర్మితమైన చైత్యం సమీపంలో శ్రీక్షాంత మూలుడు యజ్ఞవేదిక నిర్మించి, యజ్ఞం చేయడం మత సహనానికి, సహజీవన సూత్రానికి నిదర్శనం. అద్భుత శిల్ప కళాఖండాలకు నిలయం నాగార్జున కొండ.

## 4.2.8. సారాంశము :

నాగార్జున కొండ మానవ చరిత్రలోని అంశాలు అయిన చరిత్ర పూర్వయుగానికి, చారిత్రక యుగానికి ప్రతిరూపము. నాగార్జున కొండలో చరిత్ర పూర్వయుగ అవశేషాలు చారిత్రక యుగంలోని బౌద్ధ కట్టడాలు విజయపురి కోట అవశేషాలు బ్రాహ్మణ దేవాలయాలు విశదీకరించబడినాయి.

## 4.2.9. నమూనా ప్రశ్నలు :

1. నాగార్జున కొండ త్రవ్వకాల విశేషాలను తెల్పుము.

## 4.2.10. చదువదగిన గ్రంధాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | P.R. Ramachandra Rao | - | The Art of NagarjunaKonda |
| 2. | A.H. Longhurts | - | The Buddhist Antiquities of Nagarjuna Konda |
| 3. | T.N. Rama Chandran | - | Nagarjuna Konda and Indian Archaeology - A Review |
| 4. | R. Subrahmanyam | - | Nagarjuna Konda |
| 5. | K. Krishna Murthy | - | Nagarjuna Konda - A Cultural Study. |
| 6. | H. Sarkar and B.N. Riyra | - | Nagarjuna Konda |
| 7. | D.C. Circar | - | Successors of Stavahanas |
| 8. | B.V. Krishna Rao | - | Early Dynastics of Andhradesa. |


- పి. లక్ష్మీనారాయణ

పాఠం - 5

# లిపి రకాలు

## 5.0. లక్ష్యం :

ప్రాచీన భారతచరిత్రలో లిపి రకాలు గురించి వివరించటమే ఈ పాఠ్యాంశ లక్ష్యం.

## విషయసూచిక :


5.1. పరిచయము

5.2. లిపి - రకాలు

5.3. బ్రాహ్మి లిపి

- 5.3.1. సెమిటిక్ లిపి
- 5.3.2. స్వదేశీయము
- 5.3.3. బ్రాహ్మి లిపికి మొదట చదివినది
- 5.3.4. బ్రాహ్మి లిపిలో శాసనాలు

5.4. ఖరోష్టి లిపి

5.5. తెలుగు లిపి

- 5.5.1. ద్రావిడ భాష నుండి పుట్టినది
- 5.5.2. దేశి భాష
- 5.5.3. తెలుగులో మొదటి శాసనం
- 5.5.4. తెలుగులో మొదటి గ్రంథం

5.6. సారాంశము

5.7. నమూనా ప్రశ్నలు


## 5.1. పరిచయము :

మనం వ్రాసేటప్పుడు ఉపయోగించే కూర్పును లిపి అంటారు. మన అనుభవాలను, అనుభూతులను వర్తమానంలో సాధించిన విద్య, వైజ్ఞానిక, అభివృద్ధి తదితర అంశాలను అక్షరబద్ధంచేసి భవిష్యత్తు తరాలవారికి అందించగలగటం అనే ప్రక్రియ 'లిపి' ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అందువలన నాగరిక సమాజాలకు తప్పని సరిగా ఉండవలసిన ముఖ్యలక్షణాలలో లిపి జ్ఞానము ఒకటిగా పరిగణించబడుతుంది. అయితే లిపి ఏ ప్రాంతాలలో మొట్టమొదట జన్మించింది ? లిపిని వాడిన మొదటి మానవ సమాజము ఏది? ఇత్యాది విషయాలు నిర్ణయించి చెప్పటం కష్టసాధ్యమైయ్యే పని. కాని లిపి జ్ఞానము ప్రపంచం అంతటా ఒకేసారి ప్రారంభము అయ్యే

అవకాశాలు లేవు. ఇప్పుడువరకు లభించిన ఆధారాలను బట్టి క్రీ. పూ. 4వ శతాబ్దంలో మెసపటోమియాలోని సుమేరియన్ ప్రజలు తొలిసారిగా తాము నిత్య వ్యవహారాలలో లిపిని వాడి ఉంటారని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. సుమేరియాలోని ఉర్, కిష్ ప్రాంతాలవద్ద లభించిన మట్టి రాతి బిళ్ళలపై చెక్కబడిన పడవలు, పశువుల తలలు వివిధ రకాల జంతువుల బొమ్మలు, పాత్రలు, మానవ శరీర భాగాలు మొదలైన చిత్రాలు అర్దవంతమైన భావాలను గ్రహించటానికి అనువుగా ఉన్నందున ఈ చిత్రాలే ప్రపంచములో ప్రాచీన లేఖనాలై ఉండియుండవచ్చునని భావించడం వలన లిపి జ్ఞానము కలిగిన మొట్టమొదట వారు సుమేరియన్‌లే అని అనుకోవలసి వస్తుంది. అయితే రమారమీ ఇదే కాలానికి చెందిన ఈజిప్షియన్‌లు కూడా పవిత్ర చిహ్నాల పేరు మీద (Heiroglyphs - హీరోగ్లిఫులు) చిత్ర లిపిని భావప్రకటనకు వాడినారు. కాలక్రమములో చిత్రాలను లేదా సంకేతాలను చిహ్నాలుగా తదుపరి అక్షరాలుగా మార్చి ఉచ్ఛారణలు ఏర్పరచి క్లిష్టతరమైన భావాలను కూడా వ్యక్తంచేయగల పదాల కూర్పును క్రీ. పూ. 19-18 శతాబ్దాలలో మధ్యదరా సముద్ర ప్రాంతవాసులైన సెమిటిక్ (Semitic) తెగవారు కనుగొని ఉంటారని నేడు ఎక్కువమంది పండితులు విశ్వసిస్తున్నారు.

ఇక భారతదేశానికి విషయానికి వస్తే ఈ దేశంలోని ప్రజలకు లిపిజ్ఞానం ఎప్పుడు అలవడిందనే విషయం ఇతిమిద్ధంగా తేల్చి చెప్పడం సాధ్యమయ్యే విషయం కాదు. అత్యంత ప్రాచీన నాగరికతా దేశాల్లో ఒకటిగా పరిగణించబడతూ ప్రపంచంలోనే సుదీర్ఘ చరిత్ర కల్గిన మన దేశంలో క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన అశోకునికి చెందిన శిలాశాసనాలే తొలి లిఖిత ప్రతులు కావడం ఇందుకు ప్రధాన కారణము. దీనిని బట్టి మాక్స్ మిల్లర్ వంటి పాశ్చాత్యులు, భారతీయులకు క్రీ. పూ. 4.5 శతాబ్దాల పూర్వం భారతీయులకు లిపి జ్ఞానంలేదని అభిప్రాయపడినారు. అయితే లిపి విషయంలో భారతీయ పండితుల అభిప్రాయాలకు, పాశ్చాత్యుల భావాలకు పొత్తులేదు. శ్రుతి, సాహిత్యము పురాణాల లిపిని బ్రహ్మదేవుడు సృష్టించాడు కాబట్టి అవి ప్రాచీనము అని తెలుస్తుంది. వేదవ్యాసుడు భగవంతుని అనుగ్రహంతో 50 అక్షరాల లిపిని కనుగొన్నాడని భారతీయులలో ఒక భావం ఉంది. అలాగే పాశ్చాత్యులు నిర్ణయించిన లిపి కాలానికి ముందే మన దేశంలో లిపి ఉంది అనటానికి ఆధారాలున్నాయి. పాణిని అనే వ్యాకరణ గ్రంథకర్త తన అష్టాధ్యాయ గ్రంథంలో లిపి, లిపికార గ్రంధ అనే పదాలను వాడాడు. ఆ విధంగానే కల్ప సూత్రాలలో లిఖిత పత్రాల ప్రస్తావన ఉంది. చాందోగ్య అనే ఉపనిషత్తులో 'అక్షరం' అనే మాట వాడబడినది.

వేదకాలం నాటికే మన ప్రాచీనులకు వ్రాత తెలుసునని చెప్పడానికి ఆధారాలున్నాయి. వేదాలలోని మంత్రాలు చందోబద్దాలు. సామాన్య మానవునికి ఛందో వివరణ సాధ్యపడదు. కనుక లిపి అతి ప్రాచీన కాలమైనదని తెలుస్తుంది. అదియును గాక పాశ్చాత్యుల అభిప్రాయాన్ని అంగీకరించకపోవడానికి మరొక ఉదాహరణ సింధూ నాగరికతలో బయలుపడిన మరియు లభించిన ముద్రికలు వలన మన దేశంలో లిపి అతి ప్రాచీన కాలం నుంచి వస్తుందని చెప్పవచ్చును.

అలాగే భారతదేశంలో వాడిన తొలి లిపి స్వదేశమా లేదా విదేశీ అనుకరణ అనే ప్రశ్న ఈజిప్టు, సుమేరియాలకు సమకాలీన నాగరికత ఉన్న విషయము స్పష్టమౌతుందన్న లిపి జ్ఞానాన్ని విదేశీయుల నుండి సంగ్రహించారని పాశ్చాత్య చరిత్రకారుల వాదనను అంగీకరించడానికి అవకాశము లేదు. హరప్పా, మొహంజోదారో వద్ద త్రవ్వకాలలో దొరికిన ముద్రికలలో బొమ్మలతో పాటు కూడిన 396 అక్షరాలు ఉన్నాయి. ఈ ముద్రికలలోని వృషణాలు, పశుపతితో పాటు శక్తి బొమ్మలు ఋగ్వేద వర్ణనకి సరిపోతున్నాయి. కాబట్టి ఈ లిపి స్వదేశమని టి. ఎన్. రామచంద్రన్ అభిప్రాయపడినారు.

అతి ప్రాచీన కాలం నుండి భారతదేశంలో అనేక లిపులు వాడుకలో ఉన్నట్లుగా తెలియ చెప్పె ఆధారాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు జైన మత గ్రంధాలైన పన్నవన సూత్ర, సమవాయంగ సూత్రాలలో 18 రకాల లిపుల ప్రస్తావన ఉంది. అవి 1. బ్రాహ్మి 2. జవనాలియ 3. దోసపురియ 4. ఖరోష్ఠి 5. పుక్కరసియా 6. భోగవైగ 7. పహారయ్య 8. ఉయామితరకారియ 9. అక్కర పిత్తియ 10. తేవనైయా 11. గిన్వాయా 12. అంకలిపి 13. గణిత లిపి 14. గంధర్వలిపి 15. ఆదంసలిపి 16. మహేశారి 17. దామిలి 18. పొలిండి. లలితా విస్తారమనే బౌద్ధమత గ్రంధంలో 64 లిపుల పేర్లు సూచించబడినవి. అవి బ్రాహ్మి, ఖరోష్ఠి, వంగ, మగధ, ద్రవిడ, దాక్షణ్యా కిరాత, యక్ష, గంధర్వ మొదలగునవి. చైనాలో దొరికిన విజ్ఞాన సర్వస్వంలో బ్రాహ్మి, ఖరోష్ఠి అనే భారతీయ లిపుల గురించి ప్రస్తావన ఉంది.

## 5.2. లిపి - రకాలు :

పైన ఉదాహరించబడిన దానిని బట్టి బ్రాహ్మి, ఖరోష్ఠి ప్రాచీనమైనవని తెలుస్తుంది. అలాగే ఆధునిక కాలంలో బయల్పడిన సింధూ నాగరికత కాలం నాటి బొమ్మల లిపిని కూడా అతి ప్రాచీనమైన లిపిగా పరిగణించవచ్చు.

## 5.3 బ్రాహ్మి లిపి :

మనదేశంలోని అతి ప్రాచీన లిపులలో బ్రాహ్మిలిపి ఒకటి. బ్రాహ్మిలిపి పుట్టు పూర్వోత్తరాల గురించి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. కొందరు బ్రాహ్మీలిపి విదేశీయమని మరికొందరు స్వదేశీయమని అన్నారు.

విదేశీయమని చెప్పనివారిలో జోన్స్ ప్రిన్సస్, బుహ్లర్ మొదలైన పండితులు ముఖ్యులు. జోన్స్ ప్రిన్సస్ , సేనార్డ్ పండితులు బ్రాహ్మీలిపి గ్రీకు లిపి నుండి ఉద్భవించినదని చెప్పినారు. కాని దీనిని ప్రస్తుతం సమర్ధించేవారు లేరు. ఎందుకంటే మౌర్యులకు పూర్వమే బ్రాహ్మీలిపి భారతదేశంలో వాడుకలో ఉన్నదని అనటానికి అనేక అధారాలున్నాయి. అలాంటిది మౌర్యుల కాలంలో వచ్చిన గ్రీకుల నుండి మరియు గ్రీకు లిపినుంచి బ్రాహ్మిలిపి వచ్చింది అనుట గమనార్హం.

**5.3.1 సెమిటిక్ లిపి :** బుహ్లర్ పండితుని అభిప్రాయం ప్రకారం బ్రాహ్మిలిపికి సెమిటిక్ లిపికి దగ్గర సంబంధం ఉండుటచేత బ్రాహ్మిలిపిని సెమిటి లిపి మాతృక అని చెప్పినాడు. అంటే పూర్వము భారతదేశానికి ఇతర దేశాలకు వర్తక సంబంధాలు ఉండేవి. కాబట్టి బ్రాహ్మిలిపి షిమిషియా లిపి నుండి పుట్టినదని వ్రాత పద్ధతి కూడా సెమిటిక్ జాతులవారి నుండి నేర్చుకున్నారు. సెమిటిక్ లిపిని కూడా కూడి నుంచి ఎడమకు రాసేవారు. బ్రాహ్మిలిపి కూడా కుడి నుండి ఎడమకు రాయబడేది. కానీ ఈ రెండు లిపులలో కొన్ని అక్షరాలలో పోలికలు ఉన్నందున ఈ రెండు లిపులు ఒకటే అని ఊహించుట పొరబాటు. లిపులలోని ప్రధాన లక్షణాలలో తేడా ఉంది. కావున బుహ్లర్ పండితుని వాదన త్రోసిపుచ్చినారు.

**5.3.2 స్వదేశీయము :** వేద సాహిత్యంలో వాక్కుకు అధీష్టన దేవతా సరస్వతి ఆ వాక్కును రూపకల్పన చేసిన బ్రహ్మ పేరునే బ్రాహ్మలిపిగా స్థిరపడి ఉంటుందని స్వదేశీయుల వాదన. ఎడ్వర్డ్ థామస్, కన్నింగ్ హామ్ పండితులు బ్రాహ్మి సింధూ నాగరికతా బొమ్మల లిపి నుంచి బ్రాహ్మిలిపి జనించినదని ఇది పూర్తిగా స్వదేశీయమని వాదించినారు. అయితే ఈ లిపి భారతదేశంలోని ద్రావిడులుదా? ఆర్యులుదా? అని మరొక సమస్య తలెత్తినది. ఇది మొదట ద్రావిడుల లిపి అని తర్వాత ఆర్యులు దీనిని స్వీకరించినారని వీరి వాదము. ఈ ద్రావిడ వాదానికి బలమైన సాక్ష్యాదారాలు లేవు. ఉత్తర హిందూ స్థానంలో అతి ప్రాచీన కాలం నుండి వాడుకలో ఉండుటచేత దీనిని ఆర్యలిపి అనటంలో తప్పులేదు. డా॥ శ్యామా శాస్త్రీ అభిప్రాయంలో బ్రాహ్మీ స్వదేశం అని తాంత్రిక బీజాక్షరాల నుంచి ఉద్భవించినదని అభిప్రాయము. అలాగే డా॥ డి.ఆర్. అంబేద్కర్ శిలాయుగపు అవశేషాలు అయిన మట్టి పాత్రలపై ఉండే గుట్టల నుంచి పుట్టినదని తన అభిప్రాయాన్ని వెల్లబుచ్చినాడు. మనకు అశోకుని కాలము వరకు ఈ లిపి పుట్టుక గురించి నిర్దిష్టమైన ఆధారాలు దొరకలేదు. కావున మన దేశంలో లభించిన సింధూలోయ నాగరికతా కాలం నాటి బొమ్మల లిపి నుంచి బ్రాహ్మిలిపి వరకు వివరించటము కష్టము. కావున రాబోయే కాలంలో పరిశోధనల ఫలితంగా బ్రాహ్మీలిపి గురించి మరికొన్ని విశేషాలు వెలుగు చూడవచ్చును.

**5.3.3 బ్రాహ్మిలిపిని మొదట చదివినది :** అనేక మంది చరిత్రకారులు బ్రాహ్మిలిపిని చదవటానికి ప్రయత్నించి విఫలం అయినారు. చివరకు 1837 లో యాసియాటిక్ కార్యదర్శి అయిన జెమ్స్ ప్రిన్సస్ బ్రాహ్మీలిపిని చదివినాడు. ఈ రోజు బ్రాహ్మిలిపిని చదువుతున్నామంటే ఆయన పుణ్యమే.

**5.3.4. బ్రాహ్మిలిపిలో శాసనాలు :** అశోకుని కాలంలో ప్రారంభమైన శాసనాల రచనా ప్రక్రియ క్రీ. శ. 3వ శతాబ్దం వరకు అనేక మార్పులు చోటు చేసుకున్నవి. అశోకుని తర్వాత కుషానులు, శకులు, క్షాత్రకులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, మొదలగు రాజులు బ్రాహ్మలిపిలో శాసనాలు వేయించినారు. మౌర్యలిపికి శాతవాహనుల లిపికి అంత భేదం కన్పించదు. కాని ఇక్ష్వాకుల కాలంలో బ్రాహ్మ రూపము కొద్దిగా మారినది. తర్వాత కాలములో బ్రాహ్మలిపి కాలక్రమేణా అంతరించినది. స్వదేశంలోనే కాకుండా బ్రాహ్మలిపి

భౌద్ధ భిక్షువుల ద్వారా వ్యాపారుల ద్వారా లంక, బర్మా, మలయా, కాంబోడియా, చైనా, జపాన్, మొదలగు దేశాలకు పయనించినది. కాని ఎక్కువ కాలం నిల్వ లేకపోయినది.

## 5.4. ఖరోష్ఠి లిపి :

లలితా విస్తరము అనే గ్రంధములో సూచించబడిన లిపులలో మొదటిది బ్రాహ్మి, ఖరోష్ఠి అలాగే చైనాలో లభ్యమైన విజ్ఞాన సర్వస్వంలో బ్రాహ్మి, ఖరోష్ఠి లిపుల గూర్చి ప్రస్తావించబడినది. ఖరులు వాడే లిపిని ఖరోష్ఠి అంటారు. అనాగరికుల పెదవుల నుండి వెలువడేవి కనుక దీనిని ఖరోష్ఠి అనే పేరు వచ్చినది. ఈ లిపికి భారతదేశంలో అంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

## 5.5 తెలుగు లిపి :

దక్షిణ భారతదేశంలో లిపులలో తెలుగు లిపి ఒకటి. ఆంధ్రము తెలుగు, తెనుగు అనేవి పర్యాయ పదాలుగా వాడబడుచున్నాయి. వీటిని చారిత్రకంగా ఇలా పిలువబడడానికి అనేక కారణాలు ఉన్నాయి. అవి విశ్వామిత్రుని కొడుకుల్లో జ్యేష్ఠుని పేరు ఆంధ్రుడు. అతని వంశం వారే ఆంధ్రులు అయ్యారని చెబుతారు. వారు మాట్లాడే భాషే ఆంధ్రము. అలాగే " తేన్" అంటే దక్షిణ దిక్కు. కాబట్టి దక్షిణాది వారు మాట్లాడే భాష తెనుగు ఆంటారని చెప్పేవారు కొందరు. దక్షిణ భారతదేశంలో శ్రీశైలం, శ్రీకాళహస్తి మరియు ద్రాక్షారామం అనే త్రిలింగాలు కొలువై ఉన్నాయి. కాబట్టి ఈ మూడు లింగాల మధ్య ఉన్న ప్రదేశాన్ని త్రిలింగ దేశమని అని ఇక్కడ మాట్లాడే భాష త్రిలింగ భాష కావున కాలక్రమమున త్రిలింగ పదం తెలుగు గా మారినదని పండితుల అభిప్రాయం.

చరిత్రపరంగా చూస్తే బ్రాహ్మీలిపి నుండి తెలుగు, కన్నడ, తమిళ, తుళు, మలయాళం, మొదలగు భాషలు పుట్టినవని అభిప్రాయము. ఆంధ్రదేశాన్ని మౌర్యులు పతనానంతరం శాతవాహనుల స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించినారు. వారు తర్వాత ఆంధ్రదేశాన్ని అనేక రాజ వంశాల వారు పరిపాలించినారు. వారు ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్ఫ వాయనులు, చాళుక్యులు, చోళులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు పరిపాలించినారు. వారు తమ శాసనాలను మాతృభాషలోను, మరియు కొన్ని దేశీయ భాషలలోను వేయించినారు. ముఖ్యంగా ఆంధ్రదేశ శాసనాల్లో ప్రాచీన బ్రాహ్మి పాకృతము, సంస్కృతము, తెలుగు భాష లిపులు కన్పించును. అయితే ఈ తెలుగు భాష పుట్టుక మీద చరిత్రకారులలోను, భాషా పండితులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

**5.5.1 ద్రావిడ భాష నుండి పుట్టినది :** సంస్కృత భాష నుంచి తెలుగు భాష ఉద్భవించినదని కొందరు పండితులు తెలిపితే, ఇది సత్య దూరమని తెలుగు ద్రావిడ భాష నుండి పుట్టినదని పండితులు ఋజువు చేసినారు. మూల ద్రావిడ భాష కాలక్రమమున మాండలికలుగా చీలిపోయి ద్రావిడ భాష తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, అని భాషలుగా స్థిరపడినాయి.

**5.5.2 దేశ భాష :** గుణాఢ్యుడు రాసిన బృహత్ కథ ఆధారంగా శాతవాహనుల కాలంలో ప్రాకృతము, సంస్కృతము, గాక " దేశి" అనే మరొక భాష ఉన్నట్లుగా తెలిపినాడు. సామాన్య ప్రజలు వాడినదే " దేశి" భాష ఇది నేటి తెలుగు భాషకి మాతృకం అయి ఉండొచ్చు.

**5.5.3. తెలుగులో మొదటి శాసనం :** అమరావతి స్థూపం వద్ద లభ్యమైన బండ మీద " నాగము" అనే పదం కనబడింది. ఇది నాగము అనే రెండ పాళీయ భాష పదాలని కొందరు అభిప్రాయపడితే వేటూరి ప్రభాకర శాస్త్రి ఇది తెలుగు పదము అని స్పష్టం చేసినాడు.6వ శతాబ్దంలో విష్ణుకుండిన రాజు విజయేంద్రవర్మ ఒక శాసనం వేయించినాడు. దానిని చిక్కుల శాసనం అంటారు. " విజయ రాజ్య సంవత్సరంబున్" ఇక్కడ కూడా 'బు' అనే అక్షరం కన్పిస్తుంది. ఇది తెలుగు పదం.

ఇప్పటి వరకు తెలుపబడిన శాసనాల్లో ధనుంజయుని కలమళ్ళ శాసనం మొట్ట మొదటిది. కడప జిల్లా కమలపురం తాలూకా ఎర్ర గుడిపాడు గ్రామములో చెన్నకేశవ ఆలయం ప్రక్కన చెక్కబడినది. రెండవది రేణాటి చోళులదే సత్యాశ్రయుడు అనే రాజు వేయించిన శాసనం కడప జిల్లా పొట్లగుత్తి, మాళపాడు గ్రామములో దొరికినది. తర్వాత పరిపాలించిన కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు శాసన ప్రక్రియలో తెలుగు లిపిని అభివృద్ధి చేయుటకు ఎంతో కృషి చేసినారు.

**5.5.4. తెలుగులో మొదటి గ్రంథం :** తెలుగు భాషలో మనకు లభించిన మొదటి గ్రంథం భారతం. భారతాన్ని సంస్కృతం నుంచి నన్నయ్య, తిక్కన, ఎర్రన ఆంధ్రీకరించినారు. 11వ శతాబ్దంలో జీవించిన నన్నయభట్టు భారతానువాదాన్ని ప్రారంభించినాడు. భరతుడు నాట్య శాస్త్రంలో ఆంధ్రభాష నామాన్ని పేర్కొన్నాడు. అయితే భరతుని కాలాన్ని సరిగా ఊహించలేము. అలాగే నన్నయ భారతం ముందే అనగా 9వ శతాబ్దంలోనే అద్దంకి పాండురంగని శాసనంలోను పద్యాలు, 10వ శతాబ్దంలో బెజవాడ యుద్ధమల్లుని శాసనంలో మధ్యాక్కర పద్యాలు ఉన్నాయి. దీనిని బట్టి తెలుగులో సలక్షణమైన పద్య కవితలు ఉన్నాయని తెలుస్తుంది.

## 5.6. సారాంశము :

ప్రాచీన భారతదేశ చరిత్రలో లిపుల పరిచయము లిపి రకాలు గురించి వివరించబడినాయి. ప్రాచీన లిపులు అయిన బ్రాహ్మి, ఖరోష్టి మరియు తెలుగు లిపుల పుట్టు పూర్వోత్తరాలు గురించి చరిత్రకారులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినారు.

## 5.7. నమూనా ప్రశ్నలు :

1. లిపి అనగానేమి ? వివరింపుము ?
2. బ్రాహ్మి లిపి గురించి వివరింపుము ?
3. తెలుగు లిపి గురించి వివరింపుము ?

**- పి. శ్రీనివాసరావు**

**పాఠం - 6**

# శాసనాలు - రకాలు - సాధనాలు - ఆధారాలు

## 6.1 శాసనాలు - రకాలు:

### 6.1.0 లక్ష్యం :

ప్రాచీన కాలంలో వేయించిన శాసనాలు వాటి రకాలు గురించి వివరించటమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :


6.1 శాసనం

- 6.1.1 పరిచయము
- 6.1.2 శాసన-రకాలు
- 6.1.3.1 ప్రశస్తి శాసనాలు
- 6.1.4.2 పరిపాలనా శాసనాలు
- 6.1.5.3 దాన శాసనాలు
- 6.1.6.4 అంకిత శాసనాలు
- 6.1.7.5 స్మృతి లేదా జ్ఞాపిక శాసనాలు
- 6.1.8.6 మత ప్రబోదక శాసనాలు
- 6.1.9.7 సాహిత్య సంబంధమైన శాసనాలు
- 6.1.10.8 మంత్రసంబంధమైన శాసనాలు
- 6.1.11.9 వ్యాపార శాసనాలు
- 6.1.12.10 విదేశీ శాసనాలు


### 6.1 శాసనం :

సాధారణంగా 'శాసనం' అంటే 'ప్రభుత్వ ఉత్తర్వు' లేదా 'ఆజ్ఞ' అనే భావం స్ఫురిస్తుంది. కాని ప్రాచీన కాలంలో శాసనం అనే భావన విస్తృతార్థంలో ఉపయోగించబడింది. వశిష్ఠుడు తన స్మృతిచంద్రిక అనే గ్రంథంలో శాసనాలను రాజకీయం మరియు లౌకికం లేదా జానపదం అని రెండు రకాలుగా వర్గీకరించాడు. అంతేకాక రాజకీయం అంటే పాలకులు లేదా వారి ప్రతినిధులు ప్రకటించినవి గాను, జానపదం అనగా సామాన్యుల చేత ప్రకటింపబడినవి గాను పేర్కొన్నాడు. దీనిని బట్టి పాలకులు గాని, సామాన్య ప్రజలు గాని తాము చేసిన ఘణనీయ కృత్యాలు అనగా సాధించిన ఘనకార్యాలు, చేసిన దానాలు వంటి అంశాలకు శాశ్వతత్వం కలిగించాలనే ఉద్దేశ్యంతో గాని, భావితరాల వారికి తెలియచేయాలనే తలంపుతో గాని అక్షర బద్ధం చేస్తూ వ్రాయించిన ప్రకటనలను శాసనాలని అభివర్ణించవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే లిఖిత ప్రకటనలే శాసనాలు.

### 6.1.1. పరిచయము :

లిఖింపబడే ప్రకటనలు త్వరగా శిథిలమైపోకుండా ఉండేందుకు దీర్ఘకాలం మన్నె పదార్థ సముదాయాలను, శాసనాలను చెక్కించడానికి మన ప్రాచీనులు ఉపయోగించారు. సాధారణంగా శాసనాలను చెక్కించడానికి తొలుత రాయి లేదా శిలను విస్తృతంగా

ఉపయోగించారు. కాలగమనంలో రాగి, ఇత్తడి, వెండి, కంచు, బంగారం, ఇనుము, వంటి లోహాలు కూడా శాసనాలు చెక్కటానికి ఉపయోగపడ్డాయి. వీటిలో రాగి లోహం లేదా తామ్రం విరివిగా ఉపయోగపడగా మిగిలిన లోహాలు పరిమితంగా వాడబడినాయి. వీటి అన్నింటితో పాటు మట్టి బిళ్ళలు, ఇటుక, చిప్పలు, దంతాలు, కొయ్య వంటి పదార్థాలు కూడా శాసనపాఠాన్ని చెక్కించేందుకు ఉపయోగించారు.

భారతదేశానికి సంబంధించినంత వరకు అశోకుని శాలా శాసనాలే తొలి లిఖిత ఆధారాలుగా భావించడం జరుగుతుంది. అశోకుడు తన శాసనాలల్లో బ్రాహ్మి, ఖరోష్ఠి అనే లిపులను మరియు పాళీ, ప్రాకృత భాషలను ఉపయోగించినాడు. క్రీ.శ. 4వ శతాబ్ది నాటికి ఖరోష్ఠి భారతదేశం నుండి అంతర్ధానమైపోగా కాల గమనంలో అనేక మార్పులకు లోనైన బ్రాహ్మి లిపి నుండి రూపాంతరం చెందిన నాగర, తమిళ, తెలుగు, కన్నడ, వంటి స్థానిక స్వభావం కలిగిన లిపులు శాసనాలను చెక్కడంలో ఉపయోగపడినాయి. అట్లాగే 3వ శతాబ్ది ద్వితీయార్థం నుండి పాళి, ప్రాకృత భాషల స్థానంలో సంస్కృతి భాష శాసన భాషగా స్థానం సంపాదించింది. క్రీ.శ. 6,7 శతాబ్దాల మధ్య కాలం నుండి ఉత్తర, దక్షిణ భారతదేశాలలో స్థానిక భాషల్లో శాసనాలు జారీ చేయడం ప్రారంభమైనది.

తెలుగు భాషకు సంబంధించినంత వరకు తెలుగులో శాసనాలను జారీ చేసిన తొలి పాలకులు రేనాటి చోళులు. ఈ వంశానికి చెందిన ధనుంజయుని కళమల్ల శాసనం తెలుగులో మొదటి శాసనంగా పరిగణింపబడుతుంది. ఈ శాసనం క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందినది. ఇదే వంశానికి చెందిన సత్యాశ్రయుని కడప జిల్లా శాసనం తెలుగులో జారీ చేయబడిన రెండవ శాసనంగా పరిగణింపబడుతుంది.

### 6.1.2 శాసనాలు - రకాలు :-

శాసనాల్లో ప్రస్తావించబడిన విషయానికి వున్న ప్రాముఖ్యత - సమాచార స్వభావము మొదలగు అంశాలను అనుసరించి శాసనాలను 1. ప్రశస్తి శాసనాలు (Eulogistic) 2. పరిపాలన (Administrative) 3. దాన (Donative) 4. అంకిత (Dedicative) 5. స్మృతి లేదా జ్ఞాపిక (Commemorative) 6. మత-ప్రబోధక (Religious-Didactic) 7. సాహిత్య (Literary) 8. మంత్ర (Magic) 9. వ్యాపార (Commercial) 10. విదేశీ (Foreign) అనే వర్గాలుగా విభజించవచ్చు.

### 6.1.3.1. ప్రశస్తి శాసనాలు (Eulogistic) :-

ప్రభువులు మరియు వారి వంశాలను కీర్తిస్తూ ఆస్థాన విద్వాంసులచే కావ్యశైలిలో వ్రాయబడి లిఖితం చేయబడిన ప్రకటనలను 'ప్రశస్తి శాసనాలు' అని అంటారు. వివిధ పాలకుల పేర్లు, వారి జీవిత విశేషాలు, వంశావళి, సాధించిన సైనిక విజయాలు, రాజకీయ విభాగాలు, పాలనా సంబంధమైన అంశాలు, ఇరుగుపొరుగు రాజ్యాల పేర్లతో పాటు రాజు వ్యక్తిగత అభిరుచులు, కళాపిపాస, దాన గుణం ఇత్యాది విషయాల సంబంధించిన సమాచారం ఈ తరహా శాసనాల ద్వారా లభిస్తుంది.

హరిసేనుడు వ్రాసిన సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం, వాసులుడు రచించిన యశోధర విష్ణువర్ధనుని మందసోర్ శాసనం, రవికీర్తి వ్రాసిన II వ పులకేశి ఐహోల్ శాసనం మొ॥ ప్రశస్తి శాసనాలకు సంబంధించి చక్కని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

సామాన్యంగా ఈ తరహా శాసనాలు ఆస్థాన విద్వాంసులచే వ్రాయబడి ఉండటం చేత ఆయా పాలకుల గురించిన విషయ, వివరణలో కొంత అతిశయోక్తి చోటు చేసుకొనే అవకాశం ఉంది.

### 6.1.4.2. పరిపాలనా సంబంధమైన శాసనాలు (Administrative) :-

పాలనాపరమైన శాసనాలకు అశోకుని శాసనాలే తొలి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. అశోకుని రాజధర్మ స్వరూపం. బౌద్ధ ధర్మ ప్రచారం, అతని ప్రజాహిత కార్యక్రమాలు మొదలైన పాలనాంశాలకు సంబంధించిన విలువైన సమాచారం అశోకుని శాసనాల్లో కనిపిస్తుంది. క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన సోహగౌరా, తామ్ర శాసనం, రుద్రదమనుని జునాఘడ్ శాసనం, హర్షవర్ధనుని భ్యస్కెరా శాసనం, పాలనా సంబంధమైన శాసనాలలో ప్రముఖమైనవి. ఈ తరహా శాసనాలలో చోళ శాసనాలకు ప్రత్యేక స్థానం ఉంది. చోళ పరాంతకుని ఉత్తర మేరూర్ శాసనం చోళుల కాలం నాటి స్థానిక పాలనా వ్యవస్థలు. గ్రామ పరిపాలన తదితర అంశాల గురించి వివరిస్తుంది. మరికొన్ని చోళ శాసనాలల్లో దేవాలయాల పరిపాలనకు సంబంధించిన వర్ణనలు ఉన్నాయి.

### 6.1.5.3. దాన శాసనాలు (Donative) :-

భారతదేశంలో లభించిన అత్యధిక శాసనాలు ఈ కోవకు చెందినట్టివే. ప్రభువులు కాని రాజప్రతినిధులు కాని సామాన్య ప్రజలు కాని ఏ దేవాలయానికో, బ్రామ్మణులకో, కళాకారులకో, ఏ ధార్మిక సంస్థకో చేసిన దాన సంబంధమైన సమాచారాన్ని అక్షర బద్ధం చేసిన ప్రకటనలకు దాన శాసనాలని పేరు. ఈ రకమైన శాసనాలు మన ప్రాచీనుల ధాతృత్వానికి, ధర్మచిత్తనకు దృష్టాంతరాలే కాక నాటి సమాజానికి రాజకీయ, మతపరమైన అంశాలను తెలుసుకొనేందుకు ఉపకరిస్తాయి.

సాధారణంగా ఈ దానాలు భూమి రూపంలో కాని, ధన రూపంలో కాని ఉంటాయి. ఈ దానాలకు సంబంధించిన వివరాలను శిలలపైగాని, తామ్రపత్రాలపైగాని (రాగిలోహం) చెక్కించటం జరిగేది. బ్రాహ్మణులకు దానం చేయబడిన భూములను బ్రహ్మదీయాలు లేదా అగ్రహారాలని, దేవుళ్ళకు చేసిన దానాలైతే దైవదేయాలని పిలిచేవారు.

నాసిక్‌లో లభించిన శాతవాహనుల శాసనాలు, పల్లవరాజైన శివస్కంధవర్మ హిరహడగల్లి, మైదవోలు, చోళరాజైన రాజరాజనరేంద్రుని కోరుమిల్లి, నందపూడి తామ్రశాసనాల్లో భూదానాలకు సంబంధించిన వివరాలు లభిస్తాయి.

కుషాణు వంశస్థుడైన కనిష్కుని కాలానికి చెందిన మధుర శాసనంలో ధన సంబంధమైన దానానికి సంబంధించిన సమాచారం ఇవ్వబడింది. ప్రాచీనకుడనే అతడు పేదలకు నిత్య అన్నదానం చేసే నిమిత్తం 550 నాణేలతో ఒక నిధిని ఏర్పాటు చేసినట్లు ఈ శాసనంలో పేర్కొనబడింది.

### 6.1.6.4. అంకిత శాసనాలు (Dedicative) :-

దేవాలయాలనో, ప్రతిమలనో, గుహలనో, స్థంభాలనో నిర్మించి తమ ఇష్టదైవాలకు అంకితమిచ్చే సందర్భంలో మన ప్రాచీనులు శాసనాలను చెక్కించేవారు. ఇటువంటి వాటిని అంకిత శాసనాలని అంటారు. బుద్ధుని అస్థికలు గల బరిణెను అంకితమిచ్చే సందర్భంలో జారీ చేయబడిన పిప్రవా బైద్ధ కుంభ శాసనం (The priprahwa vase inscription) ఈ తరహా శాసనాల్లో మొదటిదిగా పేర్కొనవచ్చు. గ్రీకు రాయబారియైన హెలియడోరస్ విదిశలో (బేస్‌నగర్) నిర్మించిన గరుడ స్థంభాన్ని దేవదేవుడైన వాసుదేవునకు అంకితమిచ్చినట్లు తెలుస్తుంది. చంద్రగుప్త విక్రమాదిత్యుని సామంతులలో ఒకడైన సనకానిక మహారాజు అనునతడు ఉదయసిరిలో ఒక గుహను తొలిపించి విష్ణుదేవునికి అంకితమిచ్చినట్లు అక్కడ లభించిన శాసనాల్లో ఉంది. ఇక దేవాలయాల నిర్మాణానికి సంబంధించిన శాసనాలు అనేకం ఉన్నాయి.

### 6.1.7.5 స్మృతి లేదా జ్ఞాపిక శాసనాలు (Commemorative) :-

ప్రవక్తలు, మత ప్రచారకులు లేదా సమాజంలో ప్రముఖ వ్యక్తులు యుద్ధరంగంలో వీరోచిత మరణం పొందిన త్యాగధనులకు జ్ఞాపకార్థం చెక్కింపబడే శాసనాలను స్మృతి లేదా జ్ఞాపిక శాసనాలని అంటారు. మరణించిన వ్యక్తి యొక్క వంశవృక్షం, అతడు సాధించిన ఘనకార్యాలు అతడి గురించి ప్రశంస, నాటి పాలకుల పేర్లు తదితర విషయాలు ఈ శాసనాల ద్వారా లభ్యమవుతాయి. క్రీ.శ. 510 సం॥నికి చెందిన భానుగుప్తుని "ఎరాన్" శాసనం యుద్ధంలో వీర స్వర్గమలంకరించిన "గోపరాజు" అనే వీరుని భార్య సతీసహగమనం చేసి ప్రాణత్యాగం చేసిన సందర్భానికి జ్ఞాపక చిహ్నంగా జారీ చేయబడింది.

ఆంధ్రదేశంలోని రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో వీరగల్లులుగా పిలువబడే రాతి విగ్రహాలు యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీరుల స్మారకార్థం చెక్కింపబడినట్లుగా గుర్తించారు.

ఒక నాయకుడుగాని, ప్రభువుగాని తీర్థయాత్రలు చేసినపుడు ప్రజోపయోగమైన కార్యక్రమాలు నిర్వహించినపుడు ఆయా సందర్భాలను పురస్కరించుకొని గుర్తుగా జారీ చేసే శాసనాలను కూడా జ్ఞాపిక శాసనాలని అంటారు. ఉదాహరణకు బుద్ధుని జన్మభూమియైన లుంబిని గ్రామాన్ని అశోకుడు సందర్శించిన సందర్భానికి గుర్తుగా లుంబినిలో ఒక స్తంభ శాసనం చెక్కింపబడింది. మౌర్యుల కాలంలో నిర్మింపబడిన సుదర్శనము అనే తటాకానికి మహాక్షాత్రప రాజైన రుద్రదమనుడు క్రీ.శ. 150 ప్రాంతంలో మరమ్మత్తులు చేసి దాని జ్ఞాపకార్థం జునాఘడ్‌లో శాసనం చెక్కింపబడింది. కొండవీటికి సమీపంలో "సంతాన సాగరమనే" తటాకాన్ని నిర్మించిన సందర్భాన్ని పురస్కరించుకొని కొండవీటి రెడ్డి రాజ్యాధినేత పెదకోమటి వేమారెడ్డి ఒక శాసనాన్ని అదే ప్రాంతంలో చెక్కించాడు. విజయనగర రాకుమారుడైన భాస్కర బవదూరుని పోరుమామిళ్ళ శాసనం కూడ తటాక నిర్మాణానికి గుర్తుగా జారీ చేయబడినటువంటిదే, కాక తీరంద్రదేవుని అమాత్యుడొకరు అనేక దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించి కోనేరులు తవ్వించిన సందర్భాన్ని పురస్కరించుకొని శాసనాలు చెక్కించటం జరిగింది. హెలియడోరస్ అనే గ్రీకు రాయబారి వాసుదేవుని స్మృతి చిహ్నంగా గరుడ స్థంభాన్ని నిలిపిన సమాచారం బెస్‌నగర్ (విదిశ) శాసనం వల్ల తెలుస్తుంది.

### 6.1.8.6. మత ప్రభోదక శాసనాలు (Religious and dedactic) :-

ప్రత్యేకించి ఏదైనా మతాన్నో, ధర్మాన్నో ప్రచారం చేసే ఉద్దేశ్యంతో చెక్కించబడిన శాసనాలను మత లేదా ప్రబోధక శాసనాలని అంటారు. మొహంజదారో, హరప్పాలలో లభ్యమైన అమ్మతల్లి, పశుపతి తదితర దేవతాముద్రికలు ఈ తరహా శాసనాలకు సంబంధించినట్టివే అని పరిశీలకులు భావిస్తున్నారు. ధర్మలిపులుగా అశోకునిచే పేర్కొనబడిన అశోకుని శాసనాలు ప్రబోదక శాసనాలకు చక్కటి ఉదాహరణగా పేర్కొనవచ్చు. సత్యం, అహింస, పెద్దల పట్ల గౌరవాన్ని చూపటం, దాసుల మీద దయ కలిగి ఉండటం, బ్రాహ్మణులకు శ్రమణులకు దానధర్మాలు చేయటం సత్శీలులు మొదలైన అంశాలలో కూడుకున్న నడవడికే ధర్మబద్ధమైనదని తన శాసనాలలో అశోకుడు ప్రబోధించాడు.

శృంగ రాజు అయిన బాగభద్రుని కాలంలో హెలియాడోరస్ అనే గ్రీకు రాయబారిచే జారీ చేయబడిన 'బోస్‌నగర్' (విదిశ)లోని గరుడ స్తంభ శాసనంలో 'ఆత్మ నిగ్రహం' (self control) విసర్జన (Renumaration) భయరహితం (freedom from fear) అనేవి వైదిక మతం బోధించే మోక్ష మార్గాలు అని పేర్కొనబడినది. II వ కుమారగుప్తుని మందసోర్ శాసనంలో ఆధ్యాత్మిక ప్రబోధం కనిపిస్తుంది.

### 6.1.9.7 సాహిత్య సంబంధమైన శాసనాలు (Literary) :-

చెప్పదలుచుకొన్న సాహిత్య విలువలతో కూడిన కవితాశైలిలో పొందికైన పదజాలం ప్రయోగించి అక్షర బద్ధం చేసిన కథనాలను సాహిత్య శాసనాలు అని అంటారు. చక్కని కావ్యశైలిలో శిలాఫలకాలపై చెక్కబడి “ధారా” నగరంలో లభించిన మదనుడి “పారిజాత మంజరీ”, భోజుని కోదండ కావ్యం అజ్మీర్‌లో లభించిన సోమదేవుని లలిత విగ్రహ రాజము అనే నాటకము ఈ తరహా శాసనాలలో ప్రముఖమైనవిగా పేర్కొనవచ్చు. చౌహాన్ రాజు అయిన విగ్రహరాజు గుణగణాలు కావ్యశైలిలో వర్ణింపబడినాయి. కొన్ని సందర్భాలలో మత ధర్మాలు కూడా కావ్య శైలిలో పొందుపరచబడి లిపి బద్ధం చేయబడే అవకాశం ఉంది. హుసీ నగరంలోని ‘మహాపరి’ నిర్యాణ స్తూపం దగ్గర దొరికిన ఒక తామ్ర శాసనంలో ‘ఉదాన సూత్రాలు’ అని పిలువబడే బుద్ధుని బోధనలు చక్కటి కావ్యశైలిలో 13 పంక్తులుగా లిఖించబడి ఉన్నాయి.

రుద్రదమనునికి చెందిన జునాఘడ్, సముద్రగుప్తుని అలహాబాద్, II వ పులకేశికి చెందిన ఐహోల్ శాసనాలల్లో విషయ వివరణతో పాటు కావ్యశైలి కూడా ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది.

### 8. మంత్ర సంబంధమైన శాసనాలు (Magic) :-

మంత్ర శక్తుల సమూపార్జన కోసం క్షుద్ర శక్తులను తృప్తిపరిచే నిమిత్తం భూత, ప్రేత, పిశాచాలను పారద్రోలే ఉద్దేశ్యంతోను చిహ్న ముద్రితమైన తాయత్తులను, భుజాలకు కట్టుకొనే ఆచారం ప్రాచీనులకు ఉండేది. తాయత్తులపై వాడిన చిహ్నాలలో దేవతల ప్రతినిధి రూపాలైన జింక, ఎనుము, ఎద్దు, ఏనుగు, మేక, కుందేలు, మనిషి, కోతి, ఖడ్గమృగం, పులి వంటి జంతు ఆకృతులు ఉండేవి. కొన్ని తాయత్తులపై లోహ పాత్రలపై మంత్రసంబంధిత బీజాక్షరాలు లేదా మంత్ర శాసనాలు చెక్కబడి ఉంటాయి. ఇటువంటి వాటినే మంత్ర శాసనాలు అని అంటారు. సింధు నాగరికతలో లభించిన అనేక ముద్రికలు మంత్ర చిహ్నాలకు సంబంధించినవే అనే అభిప్రాయం పండితులలో ఉంది.

### 6.1.11.9 వ్యాపార శాసనాలు (Commercial) :-

వస్తువులు ఉన్న మూటలను గుర్తించేందుకు గాను ఆ మూటలకు సంక్షిప్తంగా వస్తు వివరణ, వ్యాపారస్థుని పేరు, చెక్కబడిన ముద్రికలను వ్యాపారస్తులు ఉపయోగించేవారు. అంతేకాక ‘నిగమశ్రేణి’ అనే ప్రాచీన వర్తక సంఘాలు వ్యాపారం సకాలంగా సాగే నిమిత్తం అక్షర బద్ధమైన ముద్రికలు, గాణాలను జారీ చేసేవి. క్రీ.శ. 529కి చెందిన కుమారగుప్తుని మాండసోర్ శిలాశాసనంలో వ్యాపార విషయాలను గురించి ప్రస్తావన కన్పిస్తుంది. శాతవాహన కాలం నాటి ‘నాసిక్’ శాసనంలో అనేక రకాల వర్తక సంఘాల గురించి ప్రస్తావన ఉంది.

### 6.1.12.10 విదేశీ శాసనాలు (Foreign) :-

విదేశాలలో లభించిన కొన్ని శాసనాలలో భారతదేశానికి సంబంధించిన సమాచారం లిభింపబడి ఉండే అవకాశం ఉంది. ఆసియా మైనర్‌లోని కపడోషియా దగ్గర ‘బోగాజ్‌కొయి’ లో లభించిన ఒక శాసనంలో ఇంద్ర, వరుణ, రుద్ర, వంటి ఆర్య దేవతల ప్రస్తావన ఉండటం గమనించదగిన విషయం. ఆగ్నేయ, ఆసియా దేశాలలో లభించిన అనేక శాసనాలలో భారతదేశానికి ఆగ్నేయాసియా దేశాలకు మధ్య నెలకొన్న సాంస్కృతిక, రాజకీయ సంబంధ, భాందవ్యాలు సాగిన వర్తక వాణిజ్యాలు మొదలైన అంశాలకు సంబంధించిన విశేష సమాచారం లభిస్తుంది.

**పాఠం - 6**

# శాసనాలు - రకాలు - సాధనాలు - ఆధారాలు

## 6.2 వ్రాత సాధనాలు

## 6.3 చరిత్ర రచనకు శాసనాధారాలు

### 6.2.0 లక్ష్యం :

శాసనాలకు ఉపయోగించిన వ్రాతసాధనాలు మరియు చరిత్ర రచనకు శాసనాధారాలు ఎలా ఉపయోగపడుచున్నవో వివరించుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :


6.2 వ్రాత సాధనాలు

- 6.2.1 శిలలు
- 6.2.2 ఇటుకలు, మట్టిముద్రలు
- 6.2.3 లోహ పరికరాలు
- 6.2.4 తాళపత్రాలు
- 6.2.5 బూర్జ పత్రాలు
- 6.2.6 వస్త్రము, చర్మము, కాగితము
- 6.2.7 కలం, సిరా
- 6.3 చరిత్ర రచనకు శాసనాధారాలు
- 6.3.1 రాజకీయ చరిత్ర
- 6.3.2 సాంఘిక చరిత్ర
- 6.3.3 ఆర్థిక చరిత్ర
- 6.3.4 మత చరిత్ర
- 6.3.5 సాహిత్య చరిత్ర
- 6.3.6 వాస్తుశిల్ప చరిత్ర
- 6.3.7 కాల నిర్ణయం
- 6.3.8 విదేశ శాసనాలు
- 6.3.9 సారాంశము
- 6.4 నమూనా ప్రశ్నలు


### 6.2 వ్రాత సాధనాలు :

చరిత్రలో జరిగిన భూత, వర్తమాన కాలంలో జరిగిన విశేష విషయాలను భావితరాల వారికి అందించటానికి లిపి ఎంత ముఖ్యమో ఆ లిపిని జాగ్రత్త పరుచు వ్రాత సాధనాలు లేదా వ్రాత పరికరాలు కూడ అంత ముఖ్యము. గ్రీసు, రోమ్, చైనా దేశాల

లో వలె మన పూర్వీకులు గ్రంథ రూపాలలో తాము సాధించిన విషయాలను భావితరాల వారికి అందించలేదు. ప్రాచీన భారతదేశంలో రాజులు తాము సాధించిన ఘన విజయాలు ప్రజా అవసరాలకు సంబంధించిన విషయాలు తెలియచేసేందుకు శాసనాలు చేసేవారు. ఈ శాసనాలకు వినియోగించు వ్రాత పరికరాలు ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే ముడి సరుకును బట్టి ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా ప్రాచీన కాలం నుండి వాడిన వ్రాత పరికరాలు శిలలు, లోహాలు, బూర్జపత్రాలు, తాళపత్రాలు, ఇటుకలు, మట్టి ముద్రలు, చర్మాలు, వస్త్రాలు, కాగితము, కలము, సిరా మొదలగునవి.

### 6.2.1. శిలలు :

మన ప్రాచీనులు వేయించిన శాసనాలు స్థిరంగాను, శాశ్వతంగాను ఉండాలని శాసనాలు శిలలపై చెక్కించినారు. శిలలు అనగా కొండ గుహలలో ఉన్న రాయిని గాని, దేవాలయ గోడలకు ఉపయోగించబడే రాళ్ళు, రాతిస్థంభాలకు ఉపయోగించబడే రాళ్ళు, విగ్రహాలకు ఉపయోగించబడే రాళ్ళు ఈ శిలల కోవకు వస్తాయి. సాధారణంగా వీటి మీదే శాసనాలు చెక్కించబడతాయి. శాసనాలు చెక్కే ముందు రాయిని చదును చేస్తారు. సుద్ద ముక్కతో శాసన పాఠాన్ని వ్రాసి తర్వాత ఉలి సహాయంతో అక్షరాలు తొలపబడేవి (చెక్కబడేవి) ఈ శాసనాలను వేయించే ఆచారం ప్రాచీన భారతదేశంలో అశోకుని కాలం నాటి నుండి ప్రారంభమయ్యింది. అశోకుడు వేయించినటువంటి శాసనాలు ఎక్కువగా రాళ్ళమీద, గుహలమీద, స్థంభాల మీద కనబడతాయి.

ఈ శిలాస్తంభ శాసనాలు పలు రకాలు కలవు. ద్వజ స్తంభము, జయస్తంభము కీర్తి స్తంభము. దీప స్తంభము లాంటివి. అలాగే సతీసహగమనము చేసిన స్త్రీల గురించి తెలిపే శాసనాలను సతీరాళ్ళు అంటారు. వీరుల గురించి చెప్పె శాసనాలను వీరగళ్ళు అంటారు. చనిపోయిన వ్యక్తి యొక్క ఘనతను చెప్తూ రాసే శాసనాన్ని ఛాయా స్తంభ శాసనము అంటారు. దీనిని బట్టి చూస్తే మన ప్రాచీనులు తాము వేయించిన శాసనాలు చిరస్థాయిగా ఉండాలనే ఉద్దేశ్యంతో శిలలను రాతి పరికరాలుగా ఉపయోగించినారు.

### 6.2.2 ఇటుకలు, మట్టి ముద్రలు :-

ప్రాచీన కాలంలో శిలలు మాత్రమే కాకుండా ఇటుకలు, మట్టిముద్రలు వ్రాతపరికరాలుగా ఉపయోగించుకున్నారు. బౌద్ధధర్మాలను, సూత్రాలను ఇటుకలపై వ్రాయబడినాయి. అశ్వమేధయాగాలు చేసేటప్పుడు ఇటుకల మీద ఆ యాగ వివరాలను వ్రాసేవారు. అలాగే కుండమీద, పెంకుల మీద, మట్టి పచ్చిగా ఉన్నపుడు అక్షరాలు వ్రాసి కాల్చేవారు. అందువలన అక్షరాలు శాశ్వతంగా ఉంటాయి. శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండంలో ఆలుచిప్పల మీద, శంఖుల మీద వ్రాసిన శాసనాలు దొరికినాయి.

### 6.2.3 లోహ పరికరాలు :-

బంగారం, వెండి, కంచు, ఇత్తడి, ఇనుము మొదలగు లోహాలు మన ప్రాచీనులు లోహ పరికరాలుగా వాడినారు. రాగి రేకుల మీద వ్రాసిన శాసనాలను తామ్ర శాసనాలు అని అంటారు. ఈ రాగి రేకులను శాసన ప్రక్రియ కోసం ప్రాచీనులు ఎక్కువగా వాడినట్లు మనకి విరివిగా దొరికిన తామ్ర శాసనాల బట్టి తెలుస్తుంది. కొన్ని ప్రాంతాలలో రాగి విగ్రహాలను ప్రతిష్టించి విగ్రహ పాదాల దగ్గర శాసనాలను లిఖించి ఉన్న శాసనాలు కూడా లభ్యమైనాయి. తామ్ర శాసనాలు మొదట మౌర్యులు వాడినట్లుగా చరిత్రకారులు చెప్పినారు. ఉదాః సోహగౌర వద్ద మౌర్యులు వ్రాయించిన తామ్రశాసనం లభించింది. తరువాత కాలంలో రాగి రేకులు ఎక్కువగా దాన శాసనాలకు ఉపయోగించినట్లు తెలుస్తుంది.

వెండి, బంగారం, లోహాలు అతి విలువైనవి కనుక ప్రాచీనంలో వాటిని శాసన వ్రాత పరికరాలుగా వాడినప్పటికి కాలక్రమంలో బయటకు రాలేకపోయినవి. బైద్ధమత గ్రంథాలలో కులీనులు, ఐశ్వర్య వ్యాపారస్థులు, రాజ శాసనాలు, మత సూత్రాలను వెండి,

బంగారం రేకుల మీద వ్రాయించినట్లుగా తెలుస్తుంది. ప్రజలకు దొరికిన ఈ లోహ శాసనాలు ఎవరు తొందరగా బయట పెట్టరు. ప్రభుత్వ త్రవ్వకాలలో బయటపడిన బంగారం, వెండి లోహ శాసనాలు మాత్రమే భద్రపరచబడుతున్నవి. ఉదా: తక్షశిల త్రవ్వకాలల్లో బయటపడిన బంగారు రేకుల మీద ఉన్న శాసనము, భట్టిప్రోలు వద్ద జరిగిన త్రవ్వకాలలో బయటపడిన రజిత శాసనం మొదలగునవి.

కంచు, ఇనుము లోహాల మీద శాసనాలు వ్రాయించటం చాలా అరుదు. కాంస్య విగ్రహాల ప్రతిమల క్రింద అనగా పాదాల వద్ద శాసనాలు ఎక్కువగా లభించబడినవి. అలాగే దేవాలయాలలో ఇత్తడి, పంచ లోహాలు కంచుతో విగ్రహాలను తయారు చేసి, చేయించిన కర్తలు తమ పేర్లను వాటిపై చెక్కించుకొనే ఆచారం మన దేశంలో ప్రాచీన కాలం నుండి ఎక్కువగా ఉండేది. దీని వలన దాతపేర్లు, వంశక్రమము, తేది, బహుమతి ఉద్దేశం మొదలగునవి చరిత్ర రచనకు ఉపయోగపడతాయి.

### 6.2.4 తాళ పత్రాలు :

మనకు లభ్యమయిన గ్రంథాలలో విరివిగా లభించేవి తాళపత్ర గ్రంథాలు ఎక్కువ. తాళ వృక్షాన్ని తాడి లేదా తాడి చెట్టు అంటారు. తాటి ఆకులను కోసుకొచ్చి నీటిలో నానబెట్టి తర్వాత ఎండలో ఆరబెట్టి తర్వాత గులక రాయితో చదును చేసి ఆకు చివరను కత్తిరించి కాగితపు బొంతర లాగా తయారు చేసేవారు. వీటి మీద అక్షరాలు బాగా కన్పించేందుకు లోహ గంటాన్ని వినియోగించేవారు. అక్షరాలు బాగా కనబడటానికి మసి పూసేవారు. ఉత్తర భారతదేశంలో ఈ తాళ పత్రాల పైనా సేనా, సిరాలతో రాసేవారు. ఈ వ్రాసిన ప్రతులు చెడిపోకుండా ప్రతులు కింద, పైన చెక్కముక్కలు పెట్టి కుట్టేవారు. ఈ తాళ వృక్షాలు దక్షిణ భారతదేశంలో విరివిగా పెరుగుతాయి. మన దేశ ప్రాచీన కాలంలో తాళ పత్రాలను రాత పరికరాలుగా వాడారని అనేక ఆధారాలు కలవు. ప్రసిద్ధ చైనా యాత్రికుడైనా యువాన్ చాంగ్ బుద్ధుని నిర్యాణం తర్వాత ఆయన బోధనలు భౌద్ధ, జాతక కథలు తాళపత్రాల మీద రాసినట్లు చెప్పినాడు. సంస్కృతంలో రాయబడిన గ్రంథాలు కూడా మనకు విరివిగా లభించినాయి.

### 6.2.5 భూర్జ పత్రాలు :

ఖరోష్టి, సంస్కృతం మొదలగు భాషలలో వ్రాయబడిన గ్రంథాలకు తొలి రూపాలు భూర్జ పత్ర గ్రంథాలు. ఖరోష్టి లిపిలో రాయబడిన దమ్మ లేదా ధర్మ పదం అనే బైద్ధ మత గ్రంథం అత్యంత ప్రాచీనమైన భూర్జపత్ర గ్రంథం. ఈ గ్రంథం క్రీ.శ. 2,3 శతాబ్దాలకు చెందినది. కాళాదాసు రాసిన కుమార సంభవం అనే గ్రంథంలో భూర్జ పత్రాల ప్రస్థావన ఉంది. ఈ భూర్జ చెట్లు హిమాలయ ప్రాంతాలలో విరివిగా పెరుగుతాయి. భూర్జ వృక్షం యొక్క చర్మము (బెరడు)ను తీసి ఆ బెరుడును సన్నని పొరలుగా చీల్చి, చీల్చిన పొరలను చదును చేసి నూనెలో రుద్ది కావలసిన పరిమాణంలో ముక్కలుగా కోసి ఆ ముక్కలను వ్రాత పరిమాణంలో రాస్తారు. వీటినే భూర్జపత్రాలు అంటారు. వీటి మీద రాయటానికి నాణాలతో తయారు చేయబడ్డ "అవర్ణ" అనే కలాన్ని ఒకరకమైన సిరాన్ని వాడారు. క్రీ.శ. 4వ శతాబ్దంలో సంయుక్త గయ మరియొక భూర్జవకత్వ గ్రంథం లభ్యమైనది. 16వ శతాబ్దం వరకు భూర్జ పత్రాలను వాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

### 6.2.6 వస్త్రము, చర్మము, కాగితము :

శిలలు, లోహాలే కాకుండా ఇంకా రకరకాలైన వస్తువులను వ్రాత సాధనాలుగా వాడినట్లు ప్రాచీన సాహిత్యంను బట్టి తెలుస్తుంది. అవి వస్త్రము, చర్మము, కాగితము మొదలగునవి గ్రీకు రచనలు బట్టి మౌర్య యుగంలో పట్టుగుడ్డలను వ్రాతకు ఉపయోగించినట్లు తెలుస్తుంది. అలాగే రాజులు తమ మధ్య సందేశాలను వస్త్రాల మీదే వ్రాయించి పంపేవారు. వస్త్రమును కావలసిన పరిమాణంలో ముక్కలుగా కత్తిరించి వాటి మీద అన్నపు తేటగాని, పిండిగాని పూసి గులకరాయితో చదును చేసేవారు. శృంగేరి మఠంలో ఇటువంటి వస్త్రాల మీద వ్రాసిన గ్రంథాలు భద్రపరచబడినాయి. క్రీ.శ. 1351కి చెందిన దర్మవిధి అనే గ్రంథం

శ్రీప్రభసూరి వ్రాసినారు. అన్హిల్‌వాడాపటన్ జైన గ్రంథాలయంలో భద్రపరచబడిన ఈ గ్రంథపత్రాలు 13 అంగుళాలు పొడవు, 5 అంగుళాలు వెడల్పు ఉన్నవి. మొత్తం గుడ్డ ముక్కల సంఖ్య 93. హర్షవర్థనుడు కూడా వస్త్రాల పైన గ్రంథాలు వ్రాసాడని తెలుస్తుంది. బైద్దమత గ్రంథాలను చర్మాల మీద కూడా వ్రాసినారని ఆధారాలు ఉన్నాయి. సుబంధు వ్రాసిన వాసవదత్తలో ఆజీవ అనే జింక లేదా పులి చర్మాన్ని వ్రాత సాధనంగా ఉపయోగించారని తెలుస్తుంది.

క్రీ.శ. 105లో చైనీయులు కాగితాన్ని తయారు చేయడం కనుగొన్నారు. అయితే అది ఎప్పుడు భారతదేశంలో వినియోగించినారో అని తేల్చి చెప్పటం కష్టం. క్రీ.శ. 8వ శతాబ్దం నాటి సంస్కృత, వ్యాకరణ గ్రంథాలలో "కకారి" అనే మాట వాడబడింది. ఇది కాగజ్ (కాగితం) అనే పదానికి వికృతరూపం. దీనిని బట్టి కాగితం ప్రాచీన కాలంలో మనవారు వాడినట్లు తెలుస్తుంది.

వ్రాత పరికరంగా ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు కొయ్య (wood) ను వాడుచున్నాము. కొయ్యతో చేసిన బల్లలమీద సుద్దతో వ్రాయటం నేటికి అలవాటు. బౌద్ధమత గ్రంథమైన వినయ పీఠకంలో కొయ్య బల్లల ప్రసక్తి ఉంది. దండి కాత్యాయనుడు వ్రాసిన రచనలలో కూడ కొయ్య బల్లల ప్రసక్తి ఉంది. ఖరోష్ఠి లిపిలో వ్రాయబడిన కొయ్య ఫలకలు మధ్య ఆసియాలో ఈ మధ్యనే కనుగొనబడినవి.

### 6.2.7 కలము - సిరా :-

ప్రాచీన కాలంలో బూర్జపత్రాలు, తాళపత్రాలు వ్రాసేటప్పుడు ఇనుప ముక్కలను కలంగా వాడేవారు. ఈ వ్రాత సాధనాన్ని "లేఖిని" (కలము) అంటారు. వెదురుతో తయారు చేసిన లేఖినిని ఇసికా అంటారు. సంస్కృతంలో సిరాను మసి, మాసి, మేళ అనే పేర్లతో పిలుస్తారు. సిరా బుడ్లను సంస్కృతంలో మసిమణి, మసిబంధ, మసిపాత్ర అని పిలిచేవారు. క్రీ.పూ. 4వశతాబ్దంలోనే భారతీయులు సిరాబుడ్లను ఉపయోగించినట్లు తెలుస్తుంది. అలాగే రాజుల కాలంలో ఈ శాసనాలు వ్రాయటానికి ప్రత్యేకమైన లిపికారులు ఉండేవారు. వీరికున్న యోగ్యతలను బట్టి రాజులు జీతభత్యాలు ఇచ్చి పోషించేవారు.

పాఠం - 6

# శాసనాలు - రకాలు - సాధనాలు - ఆధారాలు

## 6.3 చరిత్ర రచనకు శాసనాధారాలు

భారతీయ చరిత్రను పునర్నిర్మించుకొనవలెనంటె అనేక ఆధారాలు మీద ఆధారపడాల్సి వస్తుంది. అలాంటి ఆధారాలలో ముఖ్యమైనవి శాసనాలు. ఈ శాసనాలు ఏ దేశానికి చెందినవో ఆ దేశ, ఆ కాలం నాటి రాజకీయ, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవటానికి అవి అమూల్యమైనటువంటి ఆధారాలు అని రాప్సన్ పండితుడు చెప్పినాడు. మన ప్రాచీనులకు చారిత్రక జ్ఞానం లేకపోవటం మరియు హెరిటోటస్, దూసిడైడిస్ లాంటి చరిత్రకారులు మనదేశంలో లేకపోవటం చేత లిఖితపూర్వకమైన ఈ శాసనాలు ఆధారాలు అయినాయి. రాజుల దగ్గర నుంచి సామాన్య ప్రజానికం వరకు తాము చేసిన ఘనకార్యాలను, దానాలను రాయించిన ప్రకటనలు శాసనాలు అంటారు. తమ ఖ్యాతి చిరస్థాయిగా ఉండటానికి రాళ్ళ మీద, స్తంభాల పైన, గుహలపైన, లోహాలపైన చెక్కేవారు. అలాగే ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు బ్రాహ్మి, ఖరోష్ఠి, ప్రాకృతం, సంస్కృతం, తమిళ, తెలుగు భాషా లిపులలో రూపొందించబడినవి. ఇవి శిలాక్షరాలు అయినందువలన సాహిత్య గ్రంథాల వలె అసత్యమునకు తావు లేని సాక్ష్యాధారాలుగా పరిగణించవచ్చు. చరిత్రలో మొట్ట మొదట శాసనం వేయించినది అశోకుడు. ఆ తరువాత వచ్చిన రాజులు, రాజవంశాల వారు వేయించిన శాసనాలలో రాజుల గుణగణాలు రాజ్యాల విస్తీర్ణము ఆ నాటి రాజకీయ, ఆర్థిక, మత, నైతిక, అంశాలు విశదీకరించబడతాయి. కావున చరిత్రను పునర్నిర్మించుకోవటానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి.

### రాజకీయ చరిత్ర :

భారతీయ రాజకీయ చరిత్రలో వెలికి తీయటానికి రాజ శాసనాలు ఎంతగానో ఉపయోగబడతాయి. ఫ్లీట్ అన్నట్లు "కేవలం శాసనాలు శాస్త్రీయమైన పరిశోధన వలెనె ప్రాచీన భారతదేశ రాజకీయ చరిత్ర వెలుగులోనికి వస్తుంది". శాసనాల పరిశోధన భిన్న ప్రయోగాలలో జరుగుతుంది. కనుక ఈ రాజ శాసనాలల్లో రాజులకు సంబంధించిన రాజకీయ చరిత్ర. రాజుల గుణగణాలు రాజ్య సరిహద్దులు, రాజు దిగ్విజయ యాత్రలు తెలియబడతాయి. ఉదా: అశోకుని 13వ శిలా శాసనం వలన భారతదేశంలోనే కాక ప్రపంచ చరిత్రలో అశోకునికి ఒక స్థానం కల్పించబడినది. దీనిలో ముఖ్యంగా అశోకుడు చేసిన కళింగ యుద్ధము, యుద్ధానంతరము అశోకుడు పడిన పశ్చాత్తాపము. అశోకుని ఉదాత్తమైన రాజ్య ధర్మము అతని సామ్రాజ్య సరిహద్దులు తెలుపబడినాయి. హాథిగుఫా శాసనము దొరకపోయినట్లైతే ప్రాచీన భారతేదశ చరిత్రలో క్రీ.పూ. 2వ శతాబ్దానికి చెందిన ఖారవేలుని కథనం చరిత్రలో కన్పించేదే కాదు. శాతవాహన రాజులు, రాణులు వేయించిన వివిధ శాసనాలల్లో ముఖ్యమైన నానాఘడ్ శాసనము. నాసిక్ శాసనము, శాసనములలో శాతవాహన రాజుల గొప్పతనాన్ని, ఆనాటి సమకాలీకులైన శక యవ్వన, షహరాట. పహ్లావుల రాజకీయ చరిత్రను తెలుపుతాయి. అలాగే సముద్రగుప్తుని అలహాబాద్ శాసన ప్రశస్తి వలన అతడు ఓడించిన ఆర్యవర్తన రాజుల పేర్లు, దక్షణాపథ రాజుల పేర్లు మనకు విశిదమౌతాయి. 2వ పులకేశి కాలం నాటి రవికీర్తి రచించిన ఐ-హోల్ శాసనము, బాదామి చాళుక్య వంశ వృక్షము పులకేశి దిగ్విజయ యాత్రలు, ఉత్తర భారతదేశ రాజుయైన హర్షవర్థనుని ఓడించినట్లుగా తెలుపుట వలన హర్ష చరిత్రకు పులకేశి చరిత్రకు ముఖ్య ఆధారము అయినది.

చోళ రాజులు వేయించిన శాసనాల వలన వారి బిరుదులు దిగ్విజయాలు చోళులు గ్రామ పరిపాలన వ్యవస్థ మొదలగు విషయాలు చరిత్రకు అపురూపమైనటువంటి ఆధారాలు. దక్షిణాపథంలో శాతవాహనుల తరువాత రాజవంశాలు అయిన ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణు కుండీలు, వేంగి చాళుక్యులు మొదలైన వంశాలలోని రాజుల పేర్లు, వారి పరిపాలనా విశేషాలు, వారు

వేయించిన శిలా తామ్ర శాసనాల ద్వారా మాత్రమే తెలుస్తున్నాయి. చరిత్రకారులు ప్రాచీన చరిత్ర రచనలలో వీటిని ఉపయోగిస్తున్నారు. కొన్ని శాసనాలలో ఆయా రాజ్యాలలోని ప్రాంతీయ విభాగాలను అప్పటి వివిధ ఉద్యోగుల గురించి తెలియజేస్తాయి. కొంతమంది ప్రభువులకు పదవికి గుర్తుగా లాంఛనాలు ఇవ్వబడేవి. అలాగే పరిపాలన శాఖల గురించి విపులంగా తను శాసనాలల్లో వివరించబడినాయి. ఇవి చిరత్ర రచనకు ముఖ్య ఆధారాలు.

### 6.3.2. సాంఘిక చరిత్ర :

చరిత్ర రచనల్లో ముఖ్య లక్షణము సాంఘిక పరిస్థితులు. ఏయే రాజుల కాలంలో ప్రజల సాంఘిక స్థితిగతులు ఎలా ఉండాలో తెలుసుకొనటానికి శాసనాలు కూడా దోహదపడతాయి. సామాజిక వ్యవస్థలో కులం పుట్టుకను బట్టి కాక వృత్తిని బట్టి కులవ్యవస్థ ఏర్పడినది అని చెప్పడానికి ఆధారము శాతవాహన కాలంలో 17 రకాల పనివాండ్లు ఉన్నట్లు వృత్తికే ప్రాధాన్యత ఇవ్వబడినట్లు శాతవాహన రాజులు వేయించిన శాసనాల బట్టి తెలుస్తుంది. విదేశీయులు అయిన వాళ్ళు సహితం భారత సంఘ జీవనంలో కలిసిపోయినట్లు, హైందవ, జైన, బౌద్ధ మతాలకు దార ధర్మాలు ఇచ్చినట్లు చెప్పే శాసనాలు మనకు దొరకటం చేత భారతదేశం ఆనాడే భిన్నత్వంలో ఏకత్వం సాధించినది అని చెప్పవచ్చు. సాంఘిక దురాచారాలను ఆనాడే అశోకుడు మతం పేరిట జరిగే జంతుబలులను, హింసాయుతమైనటువంటి వినోదాలను అశోకుడు తమ రాజ్యంలో రద్దు చేసినట్లుగా అతని శాసనాలల్లో తెలుస్తుంది. తోటి మానవుని వలె జంతువుల పట్ల కూడా భూతదయ కలిగి ఉండాలని అశోకుడు అహింసా ధర్మాన్ని చెప్పినాడు. శాసనాల ఆధారంగా ప్రాచీన కాలంలో వివిధ కాలాలలోని ప్రజలు ఆహార పద్ధతులు అలవాట్లు, విందులు, వినోదాలు, మత్తుపానీయాలు, మొదలగు, సాంఘిక ఆచారాలు బయటపడుట చేత అవి చరిత్ర రచనకు ఆధారాలు అవుతాయి. వర్ణ, గోత్రాల చరిత్రను శాసన ఆధారముగా తెలుసుకొనవచ్చును. ఎలాగంటే రాజులు చేసే దానాలు, శిలలు తామ్ర పత్రాల మీద వ్రాయించేవారు. దీనిని బట్టి ఇచ్చి, పుచ్చుకొనే వారి వర్ణగోత్రాలు మొదలగు విషయాలు తెలుస్తాయి. ఉదాహరణకు పులోమావి వేయించిన శాసనాలు, పల్లవ శివస్కంధవర్మ మైదవోలు శాసనం, రాజరాజ నరేంద్రుని కోరుమల్లి, నన్నంపూడి తామ్ర శాసనాలు. వీరగళ్ళు అనే రాళ్ళు వలన ప్రాచీన కాలంలో యుద్ధంలో వీర స్వర్గం అలంకరించిన వీరుల గాథలు తెలుస్తాయి. మనకు వీటి లభ్యం వలన చరిత్రలో మరుగున పడిపోయిన వీరుల చరిత్రను తిరిగి వ్రాయడానికి ఆవకాశం కలుగును. ప్రాచీన కాలంలో సతీసహగమనం చేసిన విషయము మధ్యప్రదేశ్‌లో 'ఎరన్' అనే గ్రామంలో ఉన్న క్రీ.శ. 510-511 నాటి శాసనంలో గోపరాజు అనే అతడు యుద్ధంలో వీరస్వర్గం అలంకరించగా అతని భార్య సతీసహగమనం చేసినట్లు చెప్పబడెను. ప్రాచీన సాంఘిక వ్యవస్థను తెలుసుకొని వాటి చరిత్రను పునర్నిర్మించడానికి శాసనాల ప్రాముఖ్యత ఎంతైన ఉంటుంది.

### 6.3.3 ఆర్థిక చరిత్ర :-

ప్రాచీన భారతదేశ చరిత్రలో రాజులకు వచ్చె ఆదాయము వ్యవసాయము, వ్యాపారము ద్వారా. కావున ఆనాటి రాజు తాను రాజ్య అభివృద్ధి కొరకు వ్యవసాయ, వాణిజ్యాన్ని పెంపొందించుకొనుటకు చేసిన పనులను తను శాసనాలల్లో పొందుపరచినారు. కావున శాసనాల వలన మనకు ఆనాటి సంఘంలో ఉన్న వ్యాపార, వ్యవసాయ పంటలు వృత్తుల పేర్లు చేసిన నీటిపారుదల సౌకర్యాలు, కాలువలు మొదలగునవి తెలుస్తాయి.

ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయము. కావున రాజులు వ్యవసాయాభివృద్ధి కొరకు చేసిన నీటిపారుదల సౌకర్యాలు, మంచి నీటి చెరువుల త్రవ్వకము, వాటి వ్యయం నిర్వహణ వాటి మీద పన్నుల విధింపు మొదలగు విషయాలు శాసనాల వలన కూడా తెలుస్తాయి. ఉదా:కు రుద్ర దమనుని జునాఘడ్ శాసనంలో తాము నిర్మించిన 'సుదర్శన తటాకం' గురించి వివరణ ఉంది. విజయనగరం కాలంలోని 'కోరుమామిళ్ళ' శాసనంలో తటాక నిర్మాణంతో పాటు తటాకానికి ఉండవలసిన లక్షణాలు, దోషాలు

విపులంగా చర్చించబడినాయి. అలాగే పెదకోమటి వేమారెడ్డి వేయించిన 'సంతాన సాగర' శాసనం కూడా ఈ కోవకు చెందినదే.

రాజులు వ్యవసాయంతో పాటు తను రాజ్యంలోను మరియు పక్క రాజ్యాలతోను, విదేశాలతోను వ్యాపార విషయాలలో చేసిన లావాదేవీలను కూడా శాసనాలలో పొందుపరచినారు. ప్రాచీన దేశ చరిత్రలో ఉన్న వృత్తులను శాసనాల ద్వారానే తెలియచేయబడినాయి. ఉదా: శాతవాహన రాజులు వేయించిన శాసనాల ద్వారా అనేక రకాల చేతి పనివాండ్ల ప్రస్తావనలు ఉన్నాయి. కోలిక (సాలె) కులార (కమ్మరి) తిలిపిసక (తైలకులు) కసకార (కంచరి) సువనక (స్వర్ణకార) మొదలగునవి. ఇలా వృత్తుల ద్వారా ఏర్పడిన సంఘాలను శ్రేణులు అని పిలిచేవారు. ఈ శ్రేణులు పరిశ్రమలకు అవసరమైన ధన సహాయాన్ని చేసేవారు. ఆనాడు ఈ శ్రేణులు బ్యాంకులుగా పనిచేసేవి. అలాగే శాసనాలు స్వదేశ, విదేశ, వర్తక, వ్యాపారాలు, పన్నుల ఆదాయాలు ఏ వస్తువు మీద ఎంత ఎంత పన్ను ఉందో తెలుపుతాయి. కాకతీయుల రాజు అయిన గణపతిదేవుడు జారీ చేసిన శాసనం 'అభయశాసనం'గా అభివర్ణించబడినది. స్వదేశీ, విదేశాలలో వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తుల కొరకు వారు ఎదుర్కొనుచున్న ఇక్కట్లను తొలగిస్తూ మరియు సముద్రాంతర దేశాలలో ఓడల ద్వారా వ్యాపారం చేస్తున్న వారికి దొంగల భయం లేకుండా ఉండేటట్లు వారికి అభయ శాసనాన్ని వేయించినాడు. విజయనగర రాజు అయిన I దేవరాయలు యొక్క 'మోటుపల్లి' శాసనంలో ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన వివిధ సరకులపై చెల్లించవలసిన సుంకాల ప్రసక్తి ఉంది. అలాగే శాసనంలో ఆర్థిక విషయాలకు సంబంధించిన విషయాలు కూడా పొందుపరచబడినవి. ధనరూపంలో దానధర్మాలను ఇచ్చినటువంటి శాసనాలల్లో 'సాంచి' శాసనం ఒకటి. ఇరవై నాలుగు దినార్లు నిధిని బౌద్ధ సంఘానికి దానమిచ్చినట్లుగా ఉంది. కాకతీయుల కాలంలో గద్యాన, రూక అనే నాణ్యములు చెలామణిలో ఉన్నాయని శాసనాల ద్వారా తెలుస్తుంది.

### 6.3.4. మత చరిత్ర :-

చరిత్రలోని మత విషయాలను శాసనాల ద్వారా గ్రహించవచ్చును. ఈ శాసనాల వలన నాటి మత పరిస్థితులు దేవాలయ నిర్మాణాలను, విగ్రహ ప్రతిష్ఠతను, దానధర్మాల గురించి తెలుసుకొనవచ్చును. ప్రాచీన భారతదేశ చరిత్రలో వైదిక మతం తర్వాత విజృంభించిన బౌద్ధ మతాన్ని అశోకుడు స్వీకరించి దేశ, విదేశాలల్లో ఎలా ప్రచారం చేసింది అతని 13వ శిలాశాసనం ద్వారా తెలుస్తుంది. శృంగులు, శాతవాహనులు, బ్రాహ్మణ మతాభిమానులు అయినప్పటికి ఆనాటి ప్రజాభిమానం పొందుతున్న బౌద్ధమతాన్ని కూడా పరమత సహనంతో పోషించినారు. శాతవాహన రాణులు వేయించిన శాసనాల ద్వారా తెలుస్తుంది. ఒకవైపు రాజులు బ్రాహ్మణ మత (వైదికమతం) పునర్జీవనోద్యమము ప్రారంభిస్తే, మరొక వైపు రాణులు బౌద్ధ మతాభివృద్ధికి కృషి చేసినారు. హెలియోడోరస్ అనే గ్రీకు రాయబారి ప్రతిష్ఠించిన గరుడ స్తంభం ద్వారా వాసుదేవ భక్తుడైనాడు. గ్రీకు వాసుదేవ భక్తి ప్రధానమైన భాగవతం మతం ద్వారా భారతీయతలో విలీనమైనారు. అలాగే గౌతమీ పుత్ర శాతకర్ణి శాసనంలో వైష్ణవ చిహ్నాలు ఉండుట చేత వైష్ణవ మతానికి అంకురార్పణం శాతవాహనులు కాలంలోనే ప్రారంభమైనదనే భావించవచ్చును. అలాగే భారతదేశంలో వైదిక మతం హిందూమతంగా గుప్తుల కాలంలో రూపొందింది. గుప్తుల యుగంలో వైష్ణవ మతం బాగా ప్రాచుర్యం పొందింది. గుప్త చక్రవర్తులు పరమ భాగవతులమని వారి శాసనాలల్లో చెప్పుకున్నారు. సముద్రగుప్తుని ఎరిన్ శిలాశాసనం ఒక వైష్ణవ దేవాలయ నిర్మాణం గురించి చెపుతుంది. II వ చంద్రగుప్తుని మధుర స్తంభ శాసనం మధురలో వెలసిల్లిన మహేశ్వరులమనే శైవశాఖ చరిత్రను పేర్కొంటుంది. కుశిపుడు ఈ శాఖ స్థాపకుడు.

కాకతీయులు కాలంలో శైవ మతానికి మహర్దశ కనిపిస్తుంది. కాకతీయుల కాలం నాటి త్రిపురాంతకం, మల్కాపురం శాసనాలు శైవ మతంలో కాలాపన, పాశుపత, కాపాలిక, శివశాసన మొదలగు శాసనాలు ఉన్నట్లు తెలుపుచున్నాయి. మత ప్రాచుర్యంతో పాటు ప్రజాహిత చర్యలను కూడా చేపట్టినట్లు ఈ శాసనాలల్లో తెలియపరుస్తున్నాయి.

ప్రసిద్ధి చెందిన తంజావూరు, తిరుపతి మొదలగు పుణ్యక్షేత్రాలల్లో లభ్యమైన వందలాది శాసనాలలో అక్కడ ఉన్న వివిధ ఆలయ నిర్మాణాలను, వాటికిచ్చిన దానధర్మాలను ఆలయ సిబ్బంది యొక్క వివరాలను తెలుపుతాయి. ఇవన్నీ చరిత్ర రచనకు ఎంతగానో ఉపయోగపడతాయి.

## 6.3.5. సాహిత్య చరిత్ర :-

శాసనాలు ప్రాచీన సాహిత్యాలకు ప్రతిరూపాలు. కావున శాసనాల వలన మన దేశంలోని భాష, లిపులు ఎప్పుడు ప్రారంభమైనాయో తెలియజేస్తాయి. శాసనాలు మొదటి వ్రాతపరికరంగా వాడుట జరిగినది. మన దేశంలో శాసనా సాహిత్యం అశోకుని శాసనంతో ప్రారంభమైనది. అశోకుని శాసనాలు బ్రాహ్మి, ఖరోష్టి లిపులలో వ్రాయబడినాయి. తర్వాత బ్రాహ్మిలో వచ్చిన మార్పుల చేత ఉత్తర భారతదేశంలో బ్రాహ్మి నాగరిక లిపిగాను, దక్కన్‌లో తెలుగు, తమిళ, కన్నడ లిపులుగాను రూపొందించబడినదని చరిత్రకారుల అభిప్రాయం. భాషలైతే శాసనాల్లో వాడబడిన భాష ప్రాకృతం తర్వాత క్రీ.శ. ఆరంభం నుండి సంస్కృతానికి మారిపోయినది. క్రీ.శ. 6,7 శాతాబ్దాలలో ఆంధ్ర, కర్ణాటక శాసనాల వల్ల తెలుగు, కన్నడ భాషలు ఏవిధంగా మార్పులు చెందినవో తెలుస్తుంది.

ఈ శాసనాల ప్రక్రియలో ఒక చక్కని కవిత్వం కనపడును. ఉదాహరణకు హరిసేనుడు రాసిన సముద్రగుప్తుని అలహాబాద్ ప్రశస్తి, రవికీర్తి రాసిన 2వ పులకేసి హైగోల్ శాసనాలలోని సాహిత్యం ప్రముఖ కవులు అయినా కాళిదాసు, భారవి సాహిత్యాలతో పోల్చవచ్చు. రుద్రదేవుడు వేయించిన వేయి స్థంభాల గుడి శాసనంలో అచింతేంద్రయతి రచించిన ఒక చిన్నా కావ్యం కూడా సాహిత్యానికి మచ్చుతునక అలాగే సంపూర్ణ కావ్యాలుగా ప్రసంసించబడుతున్నా మదనుడు రాసిన పారిజాత మంజరి భోజుడు రాసిన కోదండ కావ్యము సంపూర్ణంగా ఫలకాలపై శాసనాలుగా చెక్కించబడి ఉన్నాయి. పల్లవ రాజు మొదటి మహేంద్రుని కుడిమి యామిలై శాసనంలో సంగీత వీణ పాఠాలు చక్కగా చెక్కబడి ఉన్నాయి. పాండురంగని అద్దంకి శాసనం తెలుగు భాష పరిణామ ప్రగతికి నిదర్శనం సాహిత్యపరమైన ఈశాసనాధారాల వలన ప్రాచీన భారతీయ చరిత్ర భాష లిపులను వాటి పురోగతి తెలుసుకొనవచ్చును.

## 6.3.6. వాస్తు శిల్ప చరిత్ర :-

రాజులు పోషించిన జైన, బౌద్ధ, హిందూ మతాల ప్రగతిని చూపించేది వారు నిర్మించిన వాస్తూ, శిల్ప నిర్మాణాలు. ఈ నిర్మాణాల్లో ఉన్న వాస్తూ శిల్ప శైలిని మరియు రానురాను కాలక్రమమున వచ్చిన మార్పులు రాజులు వేయించిన శాసనాల్లో తెలుస్తుంది. ముఖ్యంగా ఈ రకంగా వేయించిన శాసనాల ఉద్దేశ్యం ఒక స్థూపాన్ని గాని, దేవాలయాన్ని గాని నిర్మించినట్లు చెప్పటం విగ్రహ ప్రతిష్టాపన గురించి గాని వాటికి భూదానాది విరాళాలు ఇచ్చిన విషయాలు తెలియజెప్పటం, దేవాలయాల నిర్మించిన వాస్తు శిల్ప శైలిని బట్టి రాజవంశాల పేర్లు తెలుసుకొనవచ్చును. ఉదా: పల్లవశైలి, చాళుక్య శైలి, విజయనగర శైలి. ఈ విధంగా దేవాలయ ప్రాంగణంలో చేయించబడిన శాసనాలు చరిత్ర రచనకు ఎంతగానో ఉపయోగపడతాయి.

## 6.3.7 కాల నిర్ణయం :-

చరిత్ర యొక్క కాల నిర్ణయం చేసేటపుడు అనేక వివాదస్పదమైనటువంటి పరిస్థితులు ఎదురౌతాయి. అలాంటి సమయంలో శాసనాల్లో ఉన్నా కాలాలు ఈ సమస్యను పరిష్కరిస్తాయి. ఉదాహరణకు మొదటిసారిగా ధ్రువ కాలాన్ని (Era) అనుసరించినది విదేశీయులైనా సింధియన్లు, పార్థియన్లు, కుషానులు అని వారు వేయించిన శాసనాల బట్టి తెలుస్తుంది. కృత కాలం క్రీ.శ. పూర్వం కరి, శక కాలం క్రీ.శ 78లో ప్రారంభమైనదని తెలుస్తుంది. అలాగే శాసనాల్లో చారిత్రక సంఘటనలే కాక సంవత్సరాలుగా

సూచించబడటం చరిత్రను పున: నిర్మించడానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

## 6.3.8 విదేశీ శాసనాలు :-

మనదేశానికి విదేశాలకు మత వర్తక సంబంధ భాంధవ్యాలు ఉండటం వలన విదేశాలలో లభ్యమయినా శాసనాలు మనదేశ చరిత్రను పునర్ని నిర్మించుకోడానికి ఎంతగానో ఉపయోగకరం. ఉదా:- ఆసియా మైనరులోని (కవడోసియా) బోఘజ్ కుయీ'' కి చెందిన మిత్తని శాసనాలలో (క్రీ.పూ. 1400) (ప్రస్తుత బలూచిస్తాన్ - ఇరాన్ ప్రాంతం) అనేక ఆర్య దేవతల పేర్లుండుట వలన ఆర్యులు మనదేశానికి ఏ విధంగా వలస వచ్చారో తెలుస్తున్నది. ఆ విధంగానే ఆగ్నేయాసియా ప్రాంతాలలోలభించిన శాసనాల వలన భారతదేశానికి ఆగ్నేయాసియా దేశాల మధ్య ఉన్న సంబంధాలు తెలుస్తాయి.

## 6.3.9 సారాంశము :-

శాసనాలు చరిత్ర రచనకు ఎంతగానో ఉపయోగపడతాయి అని అనుటలో అతిశయోక్తి లేదు. కాని శాసనాలను చరిత్రకు ఉపయోగించుకొనే ముందు చాలా జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. మొదటిది శాసనాలు చాలా సంక్షిప్తంగా ఉంటాయి కనుక వాటిని తెలుసుకొనేటపుడు ఊహలకి అవకాశం ఇవ్వకుండా ప్రధానాంశాలను మాత్రమే పరిగణంలోకి తీసుకొనవలెను. శాసన రచయితలు కవులు అయి ఉంటారు కావున రాజులను ఘనంగా కీర్తించటానికి అవకాశం ఉంది. కావునా దీనిని చరిత్రకారులు గమనించవలెను. కనుక శాసనాలలో విశదీకరించబడిన విషయాలను ఇతర ఆధారాలైన వాఙ్మయ, నాణ్యాలు ఇతర పురావస్తు ఆధారాలు సమర్థిస్తున్నాయె చూచుకొని వీటిని ఉపయోగించుకున్నపుడు చరిత్ర రచనకు ఇవి ఎంతో ఉపయోగకరాలు.

## 6.4 నమూనా ప్రశ్నలు :-

1. శాసనం అనగానేమి? శాసనాలలోని రకాలు వివరింపుము?
2. వ్రాత సాధనాలు శాసన రచన ఎలా ఉపయోగపడుచున్నవో వివరింపుము?
3. చరిత్ర రచనకు శాసనాధారాల ప్రాముఖ్యత వివరింపుము?

**పి. శ్రీనివాసరావు**

**పాఠం - 7**

# శాసనాలు - ప్రశస్తి

## 7.0 లక్ష్యం :

ఈ పాఠ్య భాగాన్ని చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

* శాసనాలలోని అశోకుని 13వ శిలా శాసనము,
* నాసిక్ శాసనము
* మల్కాపురం శిలా స్తంభ శాసనము
* మరియు సింహాచల శాసనములలోని అంశాలను తెలుపుటయే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


7.1 అశోకుని 13వ శిలా శాసనము

7.1.1 కళింగ యుద్ధం

7.1.2 అశోకుని దమ్మ విధానము

7.1.3 అశోకుని రాజ్యములోని ప్రజలు

7.1.4 స్వతంత్ర రాజ్యాలు

7.1.5 విదేశాలు

7.1.6 శాసనం ప్రాముఖ్యత

7.2 గౌతమి బాలశ్రీ నాసిక్ ప్రశస్తి

7.2.1. దిగ్విజయాత్రలు

7.2.2 సాంఘిక మత పరిస్థితులు

7.2.3 వ్యక్తిత్వం

7.3 రాణిరుద్రాంబ మల్కాపుర శిలాస్తంభ శాసనము

7.3.1 శాసనంలోని ముఖ్యాంశాలు

7.3.2 కాకతీయ వంశావళి

7.3.3 సాంస్కృతిక చరిత్ర

7.3.4 గోళీకిమఠము

7.3.5 శాసన ప్రాముఖ్యత

7.4 శ్రీకృష్ణ దేవరాయలు సింహాచల శాసనము

7.4.1 శాసనంలోని ముఖ్యాంశాలు

7.4.2 శాసన ప్రాముఖ్యత

7.5 సారాంశము

7.6 నమూనా ప్రశ్నలు

7.7 చదువదగిన గ్రంథాలు

## 7.1 అశోకుని 13వ శిలా శాసనము :

**ఉపోద్ఘాతము:** అశోకుని చేత వేయించిన శిలా శాసనాలలో 13వ శిలాశాసనం ప్రాముఖ్యత సంతరించుకున్నది. ఇది బ్రాహ్మి లిపి ప్రాకృత భాషలో వ్రాయబడినది. ఈ శాసనం కూడా అశోకుని పేరుతో కాకుండా బిరుదులైన 'దేవనామ్‌ప్రియ', 'ప్రియదర్శిని'తో రాయబడినవి. ఈ 13వ శిలా పాఠాన్ని అశోకుడు స్వంతంగా సంకల్ప చేసినాడని పండితుల వాదన. దీనిలో అశోకునిలో కళింగ యుద్ధం తర్వాత వచ్చిన పరివర్తన, దర్మప్రచారం, సామ్రాజ్య సరిహద్దులు మొదలగు అంశాలు శాసనములో పొందుపర్చబడినాయి.

### 7.1.1 కళింగ యుద్ధము :

మౌర్య చక్రవర్తి అయిన అశోకుని జీవితాన్ని మార్చివేసిన సంఘటన కళింగ యుద్ధము. క్రీస్తు పూర్వము 260లో జరిగిన కళింగ యుద్ధంలో అశోకుడు విజయము సాధించినప్పటికీ ఆనందానికి బదులు విషాదము చోటు చేసుకొంది. ఈ దారుణ యుద్ధకాండలో లక్షమంది చనిపోయినట్లుగాను లక్షన్నర మంది కాళ్ళు చేతులు తెగిపోయి గాయపడినట్లుగా ఈ శాసనంలో పేర్కొనబడినది. ఈ యుద్ధంలో కన్నులకు కనబడుచున్న శవాల గుట్టలు, గాయపడిన వారి హాహాకారాలు అశోకుని మనస్సును ద్రవింపచేసినాయి. అతడు పడిన బాధ, పశ్చాత్తాపము ఈ శాసనములోని పదాలలో వ్యక్తమవుతుంది. చనిపోయిన వారి బంధువుల ఆక్రందనలు అశోకుని చెవులలో మారుమ్రోగుచున్నట్లుగా అనిపించటంతో పశ్చాతాపాగ్నిలో చిక్కుకొన్న అశోకుడు ఇక ముందెప్పుడు యుద్ధాలు చేయకూడదని నిశ్చయించుకోవడమే కాక ధమ్మాని లేదా ధర్మన్ని అనుసరించి బోధించి వ్యాప్తి చేయడమే తన ధ్యేయంగా పెట్టుకొని ధర్మ అశోకునిగా మారిపోయాడు.

### 7.1.2 అశోకుని ధమ్మ విధానము :-

ధర్మానికి పాకృత రూపమే ధమ్మము. అశోకుడు తన ధమ్మ విధానాన్ని రూపొందించుకోవడంలో ఉద్దేశ్యము, ప్రజలకు అనుకూలము ఆచరణీయము అయిన నైతిక సూత్రాలను, ఉన్నతమైన జీవన విధానాన్ని అందించటయే. అందువల్లనే అశోకుడు సామాన్య ప్రజలకు పరిచయమున్న స్వర్గలోక ప్రాప్తి ప్రసక్తిని తన శాసనాలలో ప్రస్తావించాడు. నైతిక జీవనం వలన, ధర్మాచరణ వలన స్వర్గలోక ప్రాప్తి ప్రతిఫలంగా కలుగుతుందనే భావనను ప్రచారం చేశాడు. ధర్మాపేక్ష, శ్రద్ధ, విధేయత, పాపభీతి, సామర్థ్యము లేకపోతే ఇహపరలోక సుఖాలను పొందలేరని బోధించాడు.

సామాన్య ప్రజలు కూడా సులభంగా అర్థం చేసుకొని తమ ధమ్మ మార్గాన్ని అనుసరించటానికి కొన్ని సూత్రాలను తన శాసనంలో వివరించినాడు. అవి తల్లిదండ్రులు, పెద్దలు, గురువుల పట్ల వినయ విధేయతలు కలిగి ఉండటం, బ్రాహ్మణులను, శ్రమణులను, స్నేహితులను, బంధువులను, పేదలను, దీనులను దయతో చూస్తూ దానాలు చేయవలెను. జీవులను హింసించరాదు. సర్వప్రాణుల పట్లా దయా, కరుణ చూపవలెను. ప్రతి వారు సత్యమునే పలుకవలెను. సాంఘిక ధర్మాన్ని పాటిస్తూ, పవిత్ర మనస్సు కలిగి వుండాలి. ఈ ధర్మాలను ప్రజలకు అందించాలన్న ఆశయంతో శిలల పైన, శిలా స్తంభాల పైన చెక్కించి దేశములో జన సమర్ధము ఎక్కువగా వున్నటువంటి ప్రదేశాలలో ఈ శాసనాలను నెలకొల్పినాడు. ఈ ధర్మాల ప్రచారాల కోసం ధర్మ ప్రచారకులను నియమించినాడు. ధర్మప్రచారకులు వెళ్ళని దేశాలలో కూడా అశోకుని ధర్మ బోధనలను విని ధర్మాన్ని పాటిస్తున్నారని అశోకుడు తన ఈ శాసనంలో వ్రాసుకున్నాడు.

ధమ్మ లేదా ధర్మ సిద్ధాంతానికి సహజ పరిణామం ధర్మ విజయమని భావము. యుద్ధాలలో సాధించే విజయానికి పూర్తి విరుద్ధము. ఒక రాజ్యాన్ని జయించాలంటే బలమైన సైనిక శక్తి మరియు అనేక మంది మరణాలపై వచ్చు విజయము, విజయము కాదని అశోకుని విశ్వాసము. ధర్మ విజయము అంటే ఆయా రాజ్యాలలోని ప్రజలు ధర్మ సూత్రాలని అనుసరించటయే అనే భావన

అశోకుని శాసనంలో కనిపిస్తుంది. సిరియా, ఈజిప్టు, సైకిన్, మేక్సడోనియా, ఎసిరస్ అనే ఐదు గ్రీకు రాజ్యాలను ధర్మంతో జయించినట్లుగా తన శాసనంలో చెప్పుకున్నాడు అంటే ఆ రాజ్యాలకు మత ప్రచారకులను పంపి ధర్మాన్ని వ్యాపింపచేశాడని అర్థము.

ధర్మ విజయాన్ని కాంక్షిస్తూనే అశోకుడు తన రాజ ధర్మమును కూడ శాసనంలో గుర్తు చేశాడు. నేరస్థులను శిక్షించగల సామర్థ్యం తనకున్నదని, హింసా ప్రవృత్తిని మానుకోవాలని ఆటవికులను హెచ్చరించాడు. యుద్ధం చేయటం తప్పనిసరైనప్పుడు సమన్వయము నిధానము, దయ పాటించాలని కోరినాడు.

### 7.1.3 అశోకుని రాజ్యంలోని ప్రజలు :-

తన సామ్రాజ్యంలో ఉన్న వివిధ వంశ ప్రజలను తన శాసనంలో పొందుపరిచినాడు. (ఎ) యవనులు (వాయవ్య సరిహద్దు (బి) కాంభోజులు (వాయవ్య సరిహద్దు) (సి) గాందారులు (ఇరాన్ సింధూనది ప్రాంతం. (డి) రాష్ట్రికులు (మహారాష్ట్ర) (ఇ) భోజకులు (కొంకన్) (ఎఫ్) పిటినికులు (బీరార్, గంగానది ఎగువ భాగం) (జి) ఆంధ్రులు (కృష్ణ, గోదావరి మధ్య భాగం) (హెచ్) నాభులు (ఐ) పుళిందులు మొదలగువారు.

### 7.1.4 స్వతంత్ర రాజ్యాలు :-

దక్షిణ ప్రాంతంలో నాలుగు స్వతంత్ర రాజ్యాలు ఉన్నట్లుగా అశోకుడు శాసనంలో పేర్కొన్నాడు. అవి చోళ రాజ్యం, పాండ్య రాజ్యం, కేరళ పుత్ర రాజ్యం, సత్యపుత్ర రాజ్యం అయితే ఈ రాజ్యాల గుర్తింపులలో చరిత్రకారుల మధ్య కొంత వివాదం ఉంది.

### 7.1.5 విదేశాలు :-

అశోకుడు పరిపాలించు నాటికి ఐదు గ్రీకు రాజ్యాలు ఉన్నాయని ఈ శాసనంలో పేర్కొనబడెను. (ఎ) ఎటియోకస్ (పశ్చిమ ఆసియా) (బి) తురుమయ (ఈజిప్టు) (సి) మకా (కైరన్) (డి) ఆంటికినా (మేసిడోనియా) (ఇ) అలికసుందర్ (ఎపెరన్).

### 7.1.6 శాసనం ప్రాముఖ్యత :-

అశోకుని 13వ శిలాశాసనం అశోకుని చరిత్ర రచనకు ముఖ్యమైన ఆధారము అశోకుని ఛండ అశోకుడుగా బంధుప్రీతి లేనివాడుగా బౌద్ధమత గ్రంథాలు చిత్రీకరిస్తుంటే అతని 13వ శిలాశాసనము బయట పడుట వలన ప్రపంచ శాంతిని కోరుతున్న చక్రవర్తిగా చరిత్రలో నిలిచిపోయినాడు.

## 7.2 గౌతమీ బాలశ్రీ, నాసిక్ ప్రశస్తి :-

**ఉపోద్ఘాతము:** శాతవాహన రాజులలో గొప్పవాడు గౌతమీ పుత్ర శాతకర్ణి. శాతవాహన కాలంలో 23వ వాడు. అతని తల్లి పేరు గౌతమీ బాలశ్రీ. ఈమె తన కుమారుని గొప్పతనాన్ని చాటి చెప్పుటకు తన మనవడు అయిన వాశిష్ఠీపుత్ర పులోమావి 19వ పాలన సం॥లో ఒక శాసనాన్ని జారీ చేయించినది. ఇది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమలో ఉన్న నాసిక్ గ్రామానికి 8 కి.మీ. దూరంలో 'త్రిరామ' కొండ గుహలోని శాతవాహన గుహలలో 3వ సంఖ్యగల గుహలలో ఈ శాసనం ఉంది. ఈ శాసనం ప్రాకృత భాషలో ఉండినది. ఈ శాసనం ద్వారా గౌతమీ పుత్ర శాతకర్ణి దిగ్విజయ యాత్రలు నాటి సాంఘిక, మత పరిస్థితులు అర్థమవుతాయి.

### 7.2.1 దిగ్విజయ యాత్రలు :-

గౌతమీ పుత్ర శాతకర్ణి రాజ్యానికి రాక ముందు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మాళ్వా, సౌరాష్ట్ర మొదలగు ప్రాంతాలు పశ్చిమ రాజుల అధీనంలో ఉండేవి. శాతవాహన రాజ్యానికి ఏర్పడిన దుస్థితిని తన విజయ పరంపర ద్వారా తొలగించినాడు. క్రీ.శ. 62వ ప్రాంతంలో గౌతమీ పుత్ర శాతకర్ణి రాజ్యానికి రావటంతో శాతవాహనులను భాగ్యదేవత వరించినది. ఈ లోపు శక పహ్లవుల ఐకమత్యం కోల్పోయినారు. ఈ పరిస్థితి గౌతమీ పుత్ర శాతకర్ణికి అనుకూలించి వారి మీద దండయాత్రలు సాగించినాడని ఈ శాసనం తెలియజేస్తునది. ఈ శాసనం ప్రకారం గౌతమీ పుత్ర శాతకర్ణి దిగ్విజయ యాత్రలు చేసి తమ సామ్రాజ్యంలో కలుపుకున్న రాజ్యాల యొక్క పేర్లు ఆసక, ఆసికా, ముళక, సౌరాష్ట్ర, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, అకర, అవంతి పేర్లు ఈ శాసనంలో ఉన్నాయి. అలాగే వింధ్య, అచపరిపారియాత్ర, సహ్య, కణ్వగిరి, సిరితన, మలయ, మహేంద్ర, సేత, చకోరా మొదలగు పర్వతాలు గౌతమీపుత్ర అధీనంలో వున్న సామ్రాజ్యంలో ఉన్నాయని ఈ శాసనం చెబుతోంది. దీనిని బట్టి గౌతమి పుత్ర శాతకర్ణి సామ్రాజ్యం తూర్పున బంగాళాఖాతం నుంచి పడమర అరేబియా సముద్రం వరకు ఉత్తరాన రాజస్థాన్ నుంచి దక్షిణాన హిందూ మహాసముద్రం వరకు విస్తరించి ఉండేది. దీనిని బట్టి గౌతమీ పుత్ర శాతకర్ణి అశ్వాలు మూడు సముద్రాల నీరు త్రాగుట చేత గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనంలో గౌతమి పుత్ర శాతకర్ణికి "త్రి సముద్రలోయ పితావాహన" అనే బిరుదు కలదని సూచించినది.

### 7.2.2 సాంఘిక, మత పరిస్థితులు :-

శాతకర్ణికి "శాతవాహన కులయశ: ప్రతిష్టాపనకరు"డని, "క్షత్రియ దర్పయాన మర్దనుడ"ని, "క్షహరాట వంశ నిరవశేషకరు"డని, శక యవన పహ్లవని ఘాదను" డని, శాసనంలో ప్రశంసించింది. తాను తలచిన దానిని రాజులందరి చేత చేయించగల సమర్థుడని అరవీర భయంకరుడని వీలైనట్లైతే పగవారిని కూడా రక్షించడానికి ప్రయత్నించే ఉదార హృదయుడని ఈ శాసనంలో ప్రశంసించబడినది.

తన కాలంలో సాంఘీక పరిస్థితులను అర్థం చేసుకొని హిందూమతోద్ధరణకు నడుముకట్టి ఏక బ్రాహ్మణుడని, ఏక శూరుడని, ఏక దనుర్ధరుడని, అగమ నిలయుడని, త్రివర్గాలైన ధర్మార్థ, కామాలను చక్కగా ఆచరణలో పెట్టినాడని, వర్ణ సంకర్యాన్ని మాన్పించిన వాడని ఈ శాసనం చెబుతోంది.

### 7.2.3 వ్యక్తిత్వం :-

తండ్రిపిల్లలకు ఎలాంటి ప్రేమ చూపిస్తాడో ప్రజలకు రాజు అలాంటి మంచి పనులు చేసి అలాంటి ప్రేమను అందించాలని ఉద్దేశ్యం కలవాడు. దైవ స్వరూపిని అయిన తల్లికి సేవలను అందించిన తనయుడు అని అందమైన రూపం కలవాడని ఆజానుబాహుడని 'వర వారణ విక్రయచారు విక్రముడని, వజ్ర సంకల్పుడని, మూర్తీభవించిన నాయకాగ్రణి అతని వ్యక్తిత్వాన్ని ఈ శాసనంలో ప్రశంసించబడినది.

గౌతమీ పుత్ర శాతకర్ణి పరిపాలించినది 21 వ సం॥ అని పురాణాలు చెబుతున్నాయి. కాని శాసనంలో 24 ఏళ్ల పాలించినట్లు తెలుస్తుంది.

## 7.3 రాణి రుద్రాంబ మల్కాపుర శిలా స్తంభ శాసనము :-

**ఉపోద్ఘాతము:** మల్కాపుర శిలాస్తంభ శాసనము కాకతీయ వంశములోని రాజు అయిన గణపతి దేవుని కుమార్తె అయిన రాణి రుద్రాంబ చేత విడుదల చేయబడినది. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మల్కాపురం (మందడం) లోని విశ్వేశ్వరాలయము అనే

శిథిలాలయం ముందు భాగమున ఉన్న రాతి స్తంభానికి మూడు వైపుల శిలా శాసనం చెక్కబడింది. ఈ శాసనం సంస్కృత భాషలో 182 పంక్తులలో ఉంది. దీని రచయిత విశ్వేశ్వరుడు. కాకతీయుల రాజగురువు.

### 7.3.1 శాసనంలోని ముఖ్యాంశాలు :-

రాణి రుద్రాంబ చేత విడుదల చేయబడిన ఈ శాసనంలో కాకతీయ వంశాన్ని గురించి గోళికి మఠాచార్య వంశాన్ని గురించి తెలియచేయబడుతుంది. అంతేకాక నాటి రాజకీయ విశేషాలను సాంస్కృతిక పరిస్థితులను అధ్యయనం చేయటానికి ఈ శాసనం అత్యంత ప్రాముఖ్యమైనది.

### 7.3.2 కాకతీయ వంశావళి :-

ఈ శాసన రచయిత అయిన విశ్వేశ్వరుడు కాకతీయులు సూర్యవంశ క్షత్రియులని దుర్జయునుడు వీరి వంశ స్థాపకుడని చెప్పినాడు. కాకతీయుల వంశ పుట్టుక వంశ మూల పురుషుడు గురించి అటు గ్రంథాలలోను ఇటు శాసనాలలోను వివాదాస్పదమైన విషయము. సామంత ప్రభువులుగా మొదటి బేతరాజు, తర్వాత అతని కుమారుడు మొదటి పోలరాజు తర్వాత అతని కుమారుడు రెండో బేతరాజు, రెండోవ బేతరాజు కుమారులు దుర్గరాజు తర్వాత రెండో పోలరాజు పశ్చిమ చాళుక్యుల వద్ద పని చేశారని ఈ శాసనంలో తెలుపబడెను.

రెండో పోలరాజు జ్యేష్ఠ పుత్రుడు రుద్రదేవుడు మొదట స్వతంత్ర రాజ్యస్థాపన చేసినాడు. రుద్రదేవుని తర్వాత సోదరుడు మహాదేవుడు, తర్వాత మహాదేవుని కుమారుడు గణపతిదేవుడు పరిపాలించినాడు. గణపతి దేవునికి కుమారులు లేనందున కుమార్తె అయిన రుద్రాంబకు పురుషోచిత విద్యలు నేర్పి క్రీ.శ. 1260 నాటికే రుద్రాంబను రాణిగా ప్రకటించినట్లు ఈ శాసనము ద్వారా తెలుస్తున్నది.

### 7.3.3 సాంస్కృతికి చరిత్ర :-

ఈ శాసనం ముఖ్యంగా సంఘంలో ఆనాడు కీలక పాత్ర నిర్వహించిన శుద్ధ శైవ సాంప్రదాయానికి చెందిన గోళకి మఠ స్థాపన గురించి, ఆ మఠాధిపతుల గురించే గాక నాటి సాంస్కృతిక పరిస్థితుల గురించి కూడా తెలియచేయబడెను.

### 7.3.4 గోళకీ మఠము :-

భగీరథ, నర్మద నదుల మధ్య ఉన్న దాహళ మండలంలో దూర్వాసుని ఆధ్యాత్మిక సంతతి వారైన శైవాచారులు ఉన్నారు. వీరిలో సద్భావశంభు, కాలచూరి యువరాజ దేవుని నుంచి మూడు లక్షల గ్రామాలు ఉన్న రాష్ట్రాన్ని భిక్షగా స్వీకరించినాడు. ఈ సద్భావ శంభుయే గోళకీ మఠం స్థాపించినాడు. తర్వాత శైవాచారులలో సోమ శంభు, రామ శంభు అనేవారు ముఖ్యులు. ఆ తర్వాత గురువులలో ఒకరైన ధర్మదేవుని తనయుడైన విశ్వేశ్వర శంభు ఈ గోళకీ మఠాధిపతి అయినాడు. ఇతడు గొప్ప వేద పండితుడు. ఈ గోళకి మఠాధిపతులు లేక గురువులుగా ఉత్త కాకతీయులకే కాక ఛేది, మాళవ, చోళ రాజులు కూడా రాజ గురువులుగా ఉండేవారని ఈ శాసనంలో తెలుపబడెను.

గణపతిదేవుని కాలంలో ఆంధ్రాలో గోళకీ మఠం విశేష ప్రజాదరణ పొందింది. త్రిపురాంతకము, శ్రీశైలం, మందడ మొదలగు చోట్ల గోళకీ మఠశాఖలు వెలిసినాయి. తన తండ్రి గణపతిదేవుని కోరిక మేరకు క్రీ.శ. 1261 మార్చి 23న రాణి రుద్రాంబ ఆనాటి రాజగురువు గోళకీ పీఠాధిపతి అయిన విశ్వేశ్వర శంభుకు మందారం (మందడం) గ్రామాన్ని కృష్ణలంకతో పాటు

దానం చేసినట్లుగా మల్కాపుర శాసనం తెలుపుతోంది. ఈ దానాన్ని విశ్వేశ్వర శంభు ఒక మతస్థాపన కొరకు పొందినాడు. విశ్వేశ్వర శంభు ఆగ్రామంలో ఒక మఠాన్ని ఒక శివాలయాన్ని స్థాపించినాడు. ఇవేకాక కులవర్ణ భేదన లేకుండా అన్నం పెట్టేందుకు ఒక సత్రం వేద పాఠశాల, ఆరోగ్యశాల, ప్రసూతిశాల నెలకొల్పాడు. తమిళదేశము నుంచి అరవై మంది బ్రాహ్మణ కుటుంబాలను తీసుకు వచ్చి వసతి కల్పించాడు. దేవాలయములోను, మఠములోను, సత్రంలోను సేవలు చేయటానికి సేవకులను నియమించినారు. గ్రామ రక్షణ కోసం పది మంది వీరభద్రులు నియమించబడ్డారు. సాంప్రదాయ బద్దంగా దేవాలయములో పదిమంది ఆటగత్తెలు, పదహారు మంది పాటగత్తెలు, ఇద్దరు సన్నాయిగాళ్ళు, ఎనిమిది మంది బాజావాలు, నలుగురు వంటవారు, నలుగురు పరిచారికులు మొదలగువారు ఉన్నట్లుగా ఈ శాసనం చెబుతున్నది.

పై విధముగా సంక్రమించిన గ్రామ సర్వాధికారాలు విశ్వేశ్వరునికి వచ్చినప్పటికి, తన బాద్యతలను సరిగ్గా నిర్వహించ లేకపోయినట్లైతే శైవ కుటుంబీకులంతా కలసి తనని తీసివేసి ఆ పదవిలో వేరొకరిని నియమించుకునే అధికారము ఇచ్చినాడని ఈ శాసనంలో తెలుపబడెను. ఇలా గ్రామాన్ని అన్ని సదుపాయాలతో కూడిన ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దిన వాడు విశ్వేశ్వర శంభు.

### 7.3.5 శాసన ప్రాముఖ్యత :-

కాకతీయుల కాలం నాటి రాజవంశాల చరిత్రను మరియు శుద్ధశైవ సాంప్రదాయానికి చెందిన గోళకీ మఠస్థాపన, అభివృద్ధి ఈ శాసనం వలన తెలుస్తుంది. ఒక గ్రామంలో మఠము, పాఠశాల, సత్రము, ఆరోగ్యశాల, ప్రసూతిశాల మరియు అన్ని వృత్తుల వారికి (కుమ్మరి, కమ్మరి, కంసాలి) గ్రామంలో సౌకర్యం ఏర్పాటు చేయవచ్చును అని గోళకీ మఠాధిపతులు ఈ మల్కాపుర శిలాస్తంభ శాసనంలో తెలియచేయటం జరిగినది.

## 7.4 శ్రీకృష్ణదేవరాయల సింహాచల శాసనము :-

**ఉపోద్ఘాతము:** దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రాలలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఒకటి. ఈ దేవాలయంలో అనేక శాసనాలు ఉన్నాయి. విజయనగర సార్వభౌముడు, గొప్పవాడు అయిన శ్రీకృష్ణదేవరాయలు జారీ చేసిన నాలుగు శాసనాలు కూడా కలవు. వీటిలో మూడు శాసనాలు శ్రీ వరాహ నరసింహ స్వామి దేవాలయాన్ని శ్రీ కృష్ణదేవరాయలు సందర్శించి స్వామి వారికి అనేక ఆభరణాలు, కానుకలు ఇచ్చినట్లుగా తెలియజేస్తున్నాయి.

### 7.4.1 శాసనంలోని ముఖ్య అంశాలు :-

మిగిలిన నాలుగో శాసనము అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయలు చేత జారీ చేయబడిన ఈ శాసనంలో అతని యొక్క శక్తి సామర్థ్యాలు చాలా విపులంగా వర్ణించబడ్డాయి. అలాగే 1509 లో రాయులు సింహాసనం ఎక్కేనాటికి విజయనగర పరిస్థితులు తెలుపబడినాయి. సింహాసనం అధిష్టించిన తర్వాత చేసిన దిగ్విజయ యాత్రలు వరుస క్రమంలో చాలా విపులంగా విశదీకరించబడినాయి. శ్రీకృష్ణదేవరాయలు రాజ్యానికి రాక ముందు తీరాంధ్రాన్ని గజపతులు ఆక్రమించుకున్నారు. రాయలు కళింగ దండయాత్ర క్రీ.శ. 1513లో ప్రారంభమై క్రీ.శ. 1519 వరకు అనగా ఏడు సంవత్సరములు యుద్ధము సాగినది. శ్రీకృష్ణదేవరాయులే స్వయంగా కళింగ మీదకి రెండు సార్లు సైన్యాన్ని నడిపాడని ఈ శాసనంలో తెలుపబడెను. ఈ దండ యాత్రలోనే ఎనిమిది నెలలు పోరాడె ఉదయగిరి దుర్గాన్ని రాయలు వశపరచుకున్నాడు. తర్వాత కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరము మొదలగు దుర్గాల పైకి తమ సైన్యాన్ని పంపి, వాటిని ఆక్రమించి చివరకు ప్రతాపరుద్ర గజపతిని రాజధాని

అయిన కటక్‌లో పట్టుకున్నాడు. దానితో ప్రతాపరుద్ర గజపతి రాయలుతో సంధి చేసుకుని తన కుమార్తె నిచ్చి వివాహం చేసినాడు. ఈ విజయానికి గుర్తుగా శ్రీకృష్ణదేవరాయలు సింహాచలము, పోట్నూరు లో విజయస్తంభాలను నాటి గజపతికి కానుకగా కృష్ణానదికి ఉత్తరంగా ఉన్న భూములను ఇచ్చినాడు.

### 7.4.2 శాసన ప్రాముఖ్యత :-

శ్రీ కృష్ణదేవరాయలు యొక్క యుద్ధ విజయాలు ధార్మిక బుద్ధి, హిందూ మతోద్ధరణకు అతను చేసిన కృషి మొదలగు అంశాలు ఈ శాసనంలో తెలుస్తాయి. అణగారిపోవుచున్న విజయనగర వైభవానికి ఈ యుద్ధ విజయాల వల్ల మరల విజయనగర వైభవము మరల వెలిగినది. ముస్లిం సామ్రాజ్య విస్తరణ అరికట్టి హిందూ మత సంస్కృతుల రక్షణ పోషణకు మరల రాయలు జీవం పోశాడు. శైవ వైష్ణవ మతాలను సమానంగా ఆదరించాడని అతడు చేసిన దాన శాసనాల వల్ల తెలుస్తుంది. నరసింహ, మల్లిఖార్జున, వెంకటేశ్వర్లకు విలువైన కానుకలు, విలువైన ఆభరణాలు దానం చేశాడు. తెలుగు భాషకు విజయనగర సామ్రాజ్య కాలంలో అత్యంత ప్రాధాన్యత ఉంది అనుటకు ఈ శాసనంలో తెలుగును విరివిగా ఉపయోగించటమే దీనికి ఉదాహరణ.

## 7.5 సారాంశము :-

శాసనాలలోని ప్రాధాన్యత గల అశోకుని 13వ శాసనము, గౌతమీ బాలశ్రీ నాసిక్ ప్రశస్తి రాణి రుద్రాంబ మల్కాపురి శిలాస్తంభ శాసనము మరియు శ్రీకృష్ణదేవరాయల సింహాచల శాసనములలోని ప్రశస్తులను వివరించబడును.

## 7.6 నమూనా ప్రశ్నలు :-

1. అశోకుని 13వ శిలా శాసనము వివరింపుము?
2. నాసిక్ శాసనములోని ముఖ్యాంశాలు వివరింపుము?
3. మల్కాపుర శిలాస్తంభ శాసనము యొక్క ప్రాముఖ్యత వివరింపుము?
4. సింహాచల శాసనంలోని శ్రీకృష్ణదేవరాయలు దిగ్విజయ యాత్రలు వివరింపుము?

## 7.7 చదువదగిన గ్రంథాలు :-

1 C. Siva Rama Murthy - Indian Epigraphy
2 D.C. Sarkar - Indian Epigraphy

**డా॥ అజయ్ కుమార్**

**పాఠం - 8**

# నాణాలు (Numismatics)

## 8.0 లక్ష్యం :

నాణాల ప్రాచీనత, వివిధ రాజవంశాల కాలంలో నాణాల తీరు తెన్నులు, భారతదేశ చరిత్రకు నాణేల విలువను వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


8.1 ఉపోద్ఘాతం
8.2 నాణాల ప్రాచీనత
8.3 విద్ధాంక నాణాలు
8.4 ఇండో-గ్రీకు నాణాలు
8.5 సిథియన్, పార్థియన్ల నాణాలు
8.6 కుషాణుల నాణాలు
8.7 రోమన్ నాణాలు
8.8 శాతవాహనుల నాణాలు
8.9 గుప్తరాజుల నాణాలు
8.10 తూర్పు చాళుక్యుల నాణాలు
8.11 చోళుల కాలంలో నాణాలు
8.12 యాదవుల నాణాలు
8.13 హోయసాలులు
8.14 పాండ్యుల నాణాలు
8.15 విజయనగర రాజుల కాలంలో
8.16 ముస్లింల నాణాలు
8.17 తుగ్లక్ నాణాలు
8.18 మొగల్ నాణాలు
8.19 చరిత్ర రచనకు నాణాల విలువ
8.20 సారాంశం
8.21 నమూనా ప్రశ్నలు
8.22 చదువదగిన గ్రంథాలు


## 8.1 ఉపోద్ఘాతం :

"ధనమేరా అన్నిటికీ మూలం, ఆ ధనం విలువ తెలిసికొనుట మానవ ధర్మం" అన్నాడు ఓ కవి. మానవుని జీవితం పుట్టినప్పటి నుంచి మరణించే వరకు డబ్బుతోనే ముడిపడి ఉంది. పైగా మనం నివసించే సమాజం ఆర్థికపరమైంది. అందువల్ల

మానవుని డబ్బు నడిపిస్తుంది. పైసాలోనే ఉంది పరమాత్మ. ఆ పైసలు లేనిదే మానవుని మనుగడ దుర్లభం. మానవ నాగరికత సాధించిన అపూర్వ సృష్టి డబ్బు. వీటి పరిణామ వికాసంలో నాణాలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకున్నాయి.

నాణానికి మారు పేరు టంకం. మనమిప్పుడు "డబ్బు" అనే కొనుగోలు సాధనాలుగా వాడే రూపాయలు, పైసలు వివిధ ఆకారాలలో, వివిధ తూకాలలో అతి ప్రాచీన కాలం నుంచి మన దేశంలో వాడుకలో ఉన్నాయి. నిశ్చితమైన ఆకారం, తూకం కలిగి, ప్రామాణిక నిదర్శనంగా అధికార లాంఛనమున్న లోహ ఖండాలను నాణాలంటాము. సాధారణంగా నాణాలు ఆ కాలమందున్న పాలకులచేత వెండి, బంగారం, రాగి మొదలైన లోహాలపై ముద్రించబడతాయి. ఇవి ముఖ్యంగా దేశంలో వర్తక వ్యాపారాలను సులభతరం చేయడానికి, వాటిని పెంపొందించడానికి మారకద్రవ్యంగా ఉపయోగిస్తారు. ప్రజావసరాలకు తోడ్పడటమే గాక గత చరిత్రను ముందు కాలానికి తెలియ చెప్పే దూతలుగా ఇవి పనికి వస్తాయి. మనదేశంలో వివిధ ప్రాంతాలలో, తవ్వకాలలో వేల కొలది నాణాలు రాశులురాశులుగా దొరికాయి.

నాణాల చరిత్రను, వాటి రూపాలను పరిశోధించే శాస్త్రానికి "న్యూమిస్‌మాటిక్స్" (Numismatics) అని పేరు. "న్యూమిస్మా" అనే పదానికి లాటిన్‌లో ద్రవ్యమని అర్థం. దీనికే ముద్ర విద్య, ముద్ర విజ్ఞాన, ముద్రతత్వ అనే పేర్లు కూడా ఉన్నాయి. దీనినే "పణశాస్త్రం" అని కూడా అనవచ్చును.

## 8.2 నాణాల ప్రాచీనత :

నాణాలు మనదేశంలో చెలామణిలో లేనప్పుడు వర్తక వ్యాపారాలు సాగి ఉండలేదనడానికి వీలు లేదు. నవీన శిలా యుగం ప్రజలు కూడా కొన్ని దూరపు ప్రాంతాలతో వర్తక వ్యాపారం చేసేవారు. మన ప్రాచీనులు శ్రమ శక్తి ద్వారా తమ అవసరాలను తీర్చుకుంటుండేవారు. నాణాలను కనుగొనడానికి పూర్వం వర్తక వ్యాపారాలలో "వస్తు మార్పిడి పద్ధతి" (Barter System) అమలులో ఉండేది. ఓ రైతు తాను పండించిన ధాన్యాన్ని కొంత భాగం ఇచ్చి తనకు కావలసిన వస్త్రాన్ని నేత కార్మికుడి నుంచి పొందేవాడు. అయితే ఈ పద్ధతిలో మారక వస్తువులు ఉభయుల అవసరాలను తీర్చేదిగా లేనప్పుడు సమస్య ఎదురైంది. వేదకాలం నాటి ఆర్యులు ఈ పద్ధతిలో గోవును ప్రమాణంగా పెట్టుకొనేవారు. 'గోవు'ను మార్పిడి చేసుకోవడం ద్వారా తమకు కావలసిన వస్తువులను పొందేవారు. వస్తువు పరిమాణం, విలువను బట్టి ఎన్ని ఆవులను ఇవ్వాలనేది నిర్ణయించేవారు. ఉదా:- ఋగ్వేదంలో ఇంద్రుని ప్రతిమ ఖరీదు 10 గోవులని చెప్పబడింది. కాని, ఈ పద్ధతి కూడా అంత ఆచరణ యోగ్యం కాలేకపోయింది. ఎందుకంటే ఆవు కంటే తక్కువ విలువ కల్గిన వస్తువులు కొనవలసి వచ్చినప్పుడు సమస్యలు ఎదురయ్యేవి. ఆ పరిస్థితులలో ఆభరణాలుగా వాడే గవ్వలను మారకం క్రింద వినియోగించేవారు. ఈ విధమైన మారకం పద్ధతికి ఒక శాశ్వత పరిష్కారం చూడాలనే యోచన కల్గింది. ఆ ఆలోచనకు తుది రూపమే 'నాణం' ఆవిర్భావానికి హేతువైంది. నాగరికతా చరిత్రలో నాణెం కనిపెట్టడం ఒక మైలు రాయి. మానవుడు సాధించిన అపూర్వ సృష్టి నాణాలు జాతి జీవనంలో చోటు చేసుకున్నాక అప్పటి వరకు మానవుడు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కారం లభించింది. ద్రవ్యం లేకుండా వ్యాపార వాణిజ్య రంగాల అభివృద్ధి అసాధ్యం.

ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీనాలైన నాణాలు గ్రీసు దేశంలో క్రీ.పూ. 8వ శతాబ్దిలో వాడుకలో ఉండేవి. గ్రీకు నాగరికతా సంస్కృతులు వికసించి, వాటిచే ప్రభావితాలైన విశాల ప్రాంతాలలో అవి వ్యాప్తి చెందే కొద్దీ, గ్రీకు నాణాలు కూడా బహుముఖాలుగా విస్తరించాయి. ఆ తర్వాత రోమన్ల ప్రాబల్యమధికం కావడంతో, నాణాల ముద్రణలో గ్రీకు, రోమనుల సంస్కృతులు పరస్పరం విలీనమయ్యాయి. భారతదేశంపై జరిగిన అనేక విదేశీ దండయాత్రలు, పశ్చిమోత్తర పర్వత కనుమల ద్వారా జరిగాయి. ఈ కనుమల ద్వారా పంజాబు, పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రాలపై జరిగిన దండయాత్రల సమయంలో ప్రాచీన విదేశీ నాణాలు

దిగుమతి అయ్యాయి. ఆ నాణాల వలన భారతదేశ నాణాలపై ప్రసరించిన విదేశీ ప్రభావం విదితమౌతుంది.

కాని హిందూ పురాణ గ్రంథాలలో జాతీయమైన ఒక నాణక విధానం ప్రాచీన కాలం నుండి వ్యవహారంలో ఉన్నట్లు స్పష్టమైన సూచనలు ఉన్నాయి. పురాణాల రచనా కాలం క్రీ.శ. 7 లేక 8వ శతాబ్ది అని విశ్వసిస్తే, అందులో పేర్కొన్న నాణాలు వేదకాలం నాటివి మాత్రమే కాక, అంతకు ముందు నాటివని కూడా భావించడానికి ఆస్కారముంది. క్రీ.పూ. 8 లేక 7 శాతాబ్దాలలో భారతదేశంలో కనీసం మూడు రకాలైన బంగారు నాణాలుండేవని భండార్కర్ పండితుని ప్రగాఢ విశ్వాసం. ఆ రోజుల్లో 'మాష' అనే నాణాన్ని తూకంలో ప్రామాణికంగా పెట్టుకొనేవారు. ఇక ఆ తూకానికి సమానంగా 'మాషక్' అనే నాణెం వాడుకలో ఉండేదని తెలుస్తున్నది. కాఠక సంహితలో (11-4) "హిరణ్య కృష్ణక్" అనే నాణానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. క్రీ.పూ. 250 ప్రాంతంలో తయారైన మనుస్మృతి 8వ ప్రకరణంలో 132వ శ్లోకంలో కొన్ని నాణాల పేర్లు ఉదహరింపబడ్డాయి. పాణిని తన అష్టాధ్యాయి (క్రీ.పూ. 700) అనే వ్యాకరణ గ్రంథంలో కొన్ని నాణాల పేర్లను పేర్కొన్నాడు. అగ్ని, విష్ణుధర్మోత్తరీయ, మత్స్య పురాణాలలో కూడా వివిధ నాణాలు, వాటికి సంబంధించిన పట్టికలు, సూచికలు వివరింపబడ్డాయి. రుణగ్రస్థులపై, నేరస్థులపై విధింపబడే అపరాధ రుసుములు చెల్లించేందుకు, దానధర్మాలు చేసేందుకు నాణాలు ప్రవేశపెట్టడం జరిగిందని పురాణాలు పేర్కొంటున్నాయి. అగ్ని పురాణంలో ఈ క్రింది విధంగా నాణాల గురించిన పట్టిక ఉంది. సంస్కృతంలో ఉన్న ఈ శ్లోకం చూడండి.

"త్రియవం కృష్ణకం విద్ధి।
మాషస్తత్పంచకం భవేత్ ।
కృష్ణాలానాం తయాషష్ట్యా ।
కర్షార్థం రామకీర్తితం॥"

| | | |
|---|---|---|
| 3 యవలు | - | 1 కృష్ణకము |
| 5 కృష్ణకములు | - | 1 మాషము |
| 60 కృష్ణకములు | - | 1/2 కర్షకము |
| 16 మాషకములు | - | 1 సువర్ణము |
| 4 సువర్ణాలు | - | 1 నిష్కము |
| 10 నిష్కములు | - | 1 ధరణము |

"రత్తి" లేక 'రక్తిక' అనేది ప్రామాణికమైన ఒక తూకపు రాయి. దాని బరువు 1.83 గ్రెయిన్లు. అంటే 1.18 గ్రాముల బరువుకు సమానం. ఒక సువర్ణం (బంగారు నాణెం) బరువు సాధారణంగా 80 రత్తిలు ఉంటుంది. ఈ నాణెం ఇంతవరకు ఎక్కడా లభింపలేదు. కాని అంతే బరువు కల్గి, బంగారంతో కాకుండా రాగితో తయారైన 'కార్షాపణ' అనే పేరు గల నాణెం మాత్రమే లభ్యమైంది.

ఋగ్వేదంలో కక్షివత్ అనే మునీశ్వరుడు 10 నిష్కాలను భవ్యరాజు నుంచి పొందినట్లు చెప్పబడింది. మన ప్రాచీన సాహిత్యం పేర్కొంటున్న నిష్క, శతమాన, సువర్ణ, కార్షాపణాలు, కార్షాపణాలలో వెండివే గాక రాగివి కూడా ఉన్నట్లు పురాణాలను బట్టి తెలుస్తున్నది. ఈ కార్షాపణాలే 'విద్ధాంక నాణాల'ని (Punch marked coins) పండితుల విశ్వాసం.

## 8.3 విద్ధాంక నాణాలు (Punch Marked Coins) :-

మనదేశంలో వాడుకలోనికి వచ్చిన అతి పురాతన నాణాలలో ముఖ్యంగా పేర్కొనవలసినవి విద్ధాంక నాణాలు. క్రీ.పూ. 6వ శతాబ్దం నుంచి క్రీ.పూ. 1వ శతాబ్దం మధ్య భాగం వరకు తయారు కాబడిన విద్ధాంక నాణాలు దాదాపు భారతదేశం అంతటా ప్రచారంలో ఉన్నాయి. ముఖ్యంగా ఆనాటి జనపదాలైన సూరసేన, పాంచాల, వత్స, కునాల, కోశల, కాశి, మల్ల, మగధ, వంగ, కళింగ, ఆంధ్ర, అశ్మక, మూలక, అవంతి, సురాష్ట్ర, గాంధార దేశాలలో ఈ నాణాలు చెలామణిలో ఉన్నాయి. విద్ధాంక నాణాలకే "పురాణాల"ని పేరు. ఇవన్నీ వెండి, రాగి లోహాలతో తయారు చేయబడ్డాయి. రాగివాటి కంటే వెండివి అధిక సంఖ్యలో లభ్యమయ్యాయి. గుంటూరు జిల్లా అమరావతిలో వెండి విద్ధాంక నాణాలు కొన్ని వేల సంఖ్యలో ఉన్న ఒక పెద్ద నిధి లభ్యమైంది. ఇంకా మనదేశంలో తక్షశిల, హస్తినాపూర్, కౌశాంబి, మధుర, పాట్నా మొదలైన చోట్ల జరిపిన తవ్వకాలలో వేల సంఖ్యంలో ఇవి దొరికాయి. నాణెం చేయదలచిన లోహాన్ని కరిగించి పెద్దపెద్ద పలకలుగా తయారు చేసి చల్లార్చి ముక్కలు ముక్కలుగా చేసి ఆ ముక్కలపై పర్వతాలు, ప్రాకారవృత వృక్షాలు, కలువ మొగ్గలు, జంతువులు, పక్షులు, మనుష్యులు, కిరణాలతో సూర్యుడు, చక్రం, ఆయుధాల వంటి అనేక రకాల చిహ్నాలు విడివిడిగా నొక్కేవారు (Punch). అయితే ఈ నాణాలకు ఒక నిర్దిష్టమైన ఆకారమంటూ లేదు. దీర్ఘ చతురస్రంగా, సమచతురస్రంగా, వృత్తాకారంగా, అర్థవృత్తాకారంగా రకరకాలుగా ఉన్నాయి. నాణాలు తయారయ్యాక నిర్ణీత బరువుకు మించి ఉన్న వాటిని కత్తిరించడం వల్ల ఇన్ని ఆకారాలు చోటు చేసుకున్నాయని పెక్కు పండితుల అభిప్రాయం. క్రీ.పూ. 4వ శతాబ్దంలో కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఈ నాణాలను తయారు చేసే పద్ధతిని గూర్చి విపులంగా వ్రాశాడు.

విద్ధాంక నాణాలకు మొదట ఒక వైపునే చిహ్నాలుండేవి. రెండో వైపు ఖాళీగా ఉండేది. క్రమేణ రెండో వైపు కూడా ఓ చిన్న గుర్తు నొక్కడం ప్రారంభమైంది. ఈ గుర్తు టంకశాలనో లేక విడుదల చేసిన జనపదాన్నో సూచిస్తున్నదని భావించవచ్చు. మరికొన్నింటికి రెండు ప్రక్కల బొమ్మలున్నాయి. వీటిని పునర్ముద్రిత నాణాలంటారు. పూర్వం ఒక రాజ్యాన్ని జయించిన రాజులు ఓడిపోయిన రాజుల నాణాలమీద విజయ చిహ్నంగా తమ గుర్తులను వేసుకొనే ఆచారముంది. మొత్తం మీద విద్ధాంక నాణాలపై సుమారు 300 రకాల చిహ్నాలున్నట్లు నాణాల పరిశోధకులు డా॥ పరమేశ్వరీలాల్ గుప్త అభిప్రాయపడ్డారు. అయితే వాటి మీద ఎలాంటి లిపి ఉండేది కాదు. తొలి నాణాలు రకరకాలుగా ఉంటే తర్వాత వచ్చిన నాణాలు ముద్రలలో (Punch) క్రమబద్ధంగా ఉన్నాయి.

మన ప్రాచీన గ్రంధాలలో పేర్కొనబడ్డ కార్షాపణాలు ఇవేనని పండితుల అభిప్రాయం. మను ధర్మ శాస్త్రాన్ని బట్టి, కార్షాపణాల బరువు 80 గురువింద గింజల (కృష్ణాలాలు)ని తెలుస్తున్నది. ఈ బరువు దాదాపు 146 ధాన్యపు గింజలకు సమానం. ఒక ధాన్యపు గింజ 0.0648 గ్రామ్‌లకు సమానం. మనకు లభించే విద్ధాంక నాణాలు కొన్ని ఈ బరువునే అనుసరించి ఉంటాయని చెబుతారు. కాని ఈ విషయమింకా పరిశీలించవలసి యున్నది. క్రీ.పూ. 6వ శతాబ్దంలో షోడశ మహాజనపదాలు ఉత్తర భారతంలో ఉండేవి. ఆయా రాజులు వారివారి గుర్తులతో ఈ నాణాలను చెలామణిలో ఉంచారు. ఆనాటి జనపదాలైన సూరసేన, పాంచాల, వత్స, కునాల, అస్మక, ములక, అవంతి, సురాష్ట్ర, గాంధార దేశాలలో ఈ నాణాలు చెలామణిలో ఉన్నాయి. క్రీ.పూ. 4వ శతాబ్దిలో మౌర్య సామ్రాజ్య వ్యాప్తితో పాటు బౌద్ధ మత ప్రచారకులతో పాటు వర్తక వ్యాపారాలు విస్తరణ పొంది నేపాల్‌నుండి కావేరి ఇవతల యావత్ భారతదేశంలో ఈ నాణాలు వ్యాప్తి చెందాయి. ఏమైనా, అప్పటికే వాడుకలో ఉన్న ఈ నాణాలు మౌర్యుల కాలంలో విస్తృతమైన ప్రచారం పొందాయి.

నాణాలను గణాంకశాస్త్రం సహాయంతో అధ్యయనం చేసే కొత్త పద్ధతిని (గణాంక పణశాస్త్రం లేక స్టాటిస్టికల్ న్యుమిస్మాటిక్స్) డి.డి కోశాంబి ప్రవేశపెట్టాడు. తక్షశిల తదితర నిక్షేపాలను గణాంకపణ శాస్త్రం సహాయంతో విశ్లేషించి చాలా సమర్థంగా చారిత్రక చిత్రాన్ని ప్రతిపాదించాడు. తన విశ్లేషణను ప్రామాణికంగా వివరించే వ్యాసం The study and Metrology of Silver Punch

- marked coins అని కోశాంబి భావించాడు.  అయితే ఈ వ్యాసం వ్రాసిన పద్ధతి సులభంగా అర్థమయ్యేది కాదు. గణాంక శాస్త్రం నుండి సంస్కృత పదాల విశ్లేషణ దాకా అన్నీ కలగాపులగంగా కలిసిపోయిన వ్యాసమిది. పైగా సామాన్య పాఠకుడికి సులభంగా అందుబాట్లో లేని ఇతర పణశాస్త్రవేత్తల అభిప్రాయాలను వివాదాత్మకంగా (Polemicalగా) పూర్వపక్షం చేయడం ఈ వ్యాసం యొక్క ప్రముఖ ఉద్దేశ్యం కావడం వల్ల అర్థం కావడం మరింత కష్టం.

తక్షశిలలో లభ్యమైన రెండు నిక్షేపాలలో మొదటి నిక్షేపంలోని నాణాలు మౌర్యులకు పూర్వపు మగధ కాలానికి చెందినవి. రెండో నిక్షేపం మౌర్యుల కాలానికి చెందినది. ఈ రెండు నిక్షేపాలను శాస్త్రీయంగా అధ్యయనం చేస్తే మగధ రాజకీయ ఆర్థిక చరిత్రను అర్థం చేసుకోవచ్చును. మన రాష్ట్రంలోని అమరావతి, ఉత్తరప్రదేశ్ ఖేరి జిల్లాలోని పైలా, కర్నాటకలోని బోడేనాయకనూర్‌లలో దొరికిన విద్ధాంక నాణాలను కోశాంబి అధ్యయనం చేసి మగధ కాలపు చరిత్రను వివరించాడు. తక్షశిలలో దొరికిన మొదటి నిక్షేపంలోని  అన్ని నాణాలకు రెండు వైపులా ముద్రలు ఉన్నాయి. ముందు భాగంలో ఉన్న ముద్రలు ఆ నాణాలను ముద్రించిన రాజునూ అతని వంశాన్నీ సూచిస్తాయి. ఉదాహరణకు పురాణాలలో మౌర్యులది చంద్రవంశమని పేర్కొనబడింది. అందుకు తగ్గట్టుగా రెండో తక్షశిల నిక్షేపంలోని అన్ని నాణాలలో మూడో ముద్రలో మూడు తోరణాలు, ఆ తోరణాల మీద అర్థ చంద్రాకారం ఉన్నాయి. అక్కడి వ్యాపారస్తులు ఈ నాణాలను కొన్ని సంవత్సరాలకు ఒకసారి తూకం వేసి తూకం సరిగ్గా ఉన్న పక్షంలో ఆ విషయాన్ని సూచిస్తూ వెనుక భాగంలో ముద్ర వేశారు. తక్షశిలలో దొరికిన రెండో నిక్షేపంలో ముందు భాగంలో రాజవంశ చిహ్నం ఉంది గానీ వెనుక భాగంలో ముద్రలు లేవు. ఇప్పుడు తక్షశిల మౌర్య సామ్రాజ్యంలో అంతర్భాగమే. కనుక అక్కడికి చేరిన మగధ నాణాలు 'విదేశీ' నాణాలు కావు. వాటి ప్రామాణికతకు స్థానిక వర్తకులు గానీ పరిపాలకులు గానీ హామీ ఇయ్యనవసరం లేదు అంటారు డిడి. కోశాంబి. మౌర్యుల కాలం దాకా వెండి నాణాలు ఒకే ప్రమాణానికి ముద్రించారు. వీటినే కార్షాపణములు అన్నారు. వీటి ప్రామాణికమయిన తూకం 3.42 గ్రాములు అయి ఉంటుందని కోశాంబి అంచనా.

ఏమైనప్పటికీ మౌర్య సామ్రాజ్య పతనానంతరమే మనదేశంలో సరియైన నాణాల ముద్రణ ప్రారంభమైంది. ముఖ్యంగా ఇండో గ్రీకు రాజుల పరిపాలనా కాలంలో మనదేశంలో నాణాల ముద్రణ బాగా అభివృద్ధి చెంది, చక్కని నాణాలను ఉత్పత్తి చేయడం ప్రారంభమైనది. నాణాలపైన ఆయా నాణాలను ముద్రించిన రాజుల శిరస్సులను, పేర్లను వ్రాయడం ప్రారంభమైనది.

ప్రాచీన భారతదేశాన్ని పాలించిన చక్రవర్తులకు నాణాల ముద్రణ నిమిత్తం ప్రత్యేక టంకశాలలు ఉండేవి. అయితే ముద్రణా బాధ్యత నేర్పరులైన విశ్వబ్రాహ్మణులకు అప్పజెప్పేవారు. వీరు రాజాజ్ఞ ప్రకారం నాణాలను తయారు చేస్తుండేవారు. కాని కొన్ని పరిస్థితులలో రాజులు వారి బంధువులకు గాని లేక వారి రాష్ట్రాధిపతులకు గాని, నగరాధిపతులకు గాని (శ్రేష్టులు) నాణాల ముద్రణా బాధ్యత అప్పజెప్పేవారు. వారు కొన్ని సందర్భాల్లో ఆ నాణాలపై ముద్రణాలయ స్థలం, పాలక సంస్థ పేరు లేక గుర్తు కూడా ముద్రించేవారు.

## 8.4 ఇండో - గ్రీకు నాణాలు :-

మౌర్య సామ్రాజ్య పతనానికి కారణం యవన దండయాత్ర అని పురాణాలు చెబుతున్నాయి. ఈ యవనులే గ్రీకులు. వీరినే ఇండో గ్రీకులని, బాక్ట్రియన్ గ్రీకులని చరిత్రకారులు వ్యవహరిస్తారు. వీరు మనదేశ వాయవ్య ప్రాంతంలో రాజ్యాన్ని స్థాపించి నాణాల ముద్రణను ప్రారంభించారు. నాటికే గ్రీకులు చక్కని నాణాలను ముద్రించడంలో మంచి నేర్పును కలిగి ఉన్నారు.

ఇండో గ్రీకులు బంగారు, వెండి, రాగి నాణాలను ముద్రించారు. ఇవి గుండ్రంగా, అందంగా ఉంటాయి. అయితే వీటిలో బంగారు నాణాలు భారతదేశం కోసం కాక, బాక్ట్రియా కోసం ఉద్దేశించి ముద్రించబడ్డాయని పండితుల అభిప్రాయం. సాధారణంగా

ఇండో-గ్రీకులు ముద్రించిన నాణాలపై ఒకవైపు రాజు శిరస్సు, రెండో వైపు గ్రీకు దేవతల (జూస్, హెర్క్యులెస్, అపోలో, పాలాస్ మొదలైన) బొమ్మలుంటాయి. దేవతల బొమ్మల ముద్రణలో హైందవ ప్రభావం కనిపిస్తున్నదని విమర్శకుల అభిప్రాయం. మనదేశంలో గ్రీకు రాజ్యాన్ని స్థాపించిన వాడు డెమిట్రియస్ (క్రీ.పూ. 190). ఇతని నాణాలపై ఒకవైపు గ్రీకు, మరొకవైపు ఖరోష్ఠి లిపిలో ఆఖ్యలు (Legends) ఉన్నాయి. ఖరోష్ఠి లిపిలో వ్రాయబడిన ఆఖ్యకు ప్రాకృత భాష వాడబడింది. ఈ విధంగా నాణాలపై రెండు భాషలు వాడడం డెమిట్రయస్ నుంచి కుషాణ చక్రవర్తి అయిన వీమకాడ్‌ఫైసిస్ వరకు చూస్తాము. డెమిట్రయస్ విడుదల చేసిన కొన్ని నాణాల మీద రాజు ఏనుగు తల లాంటి కిరీటం (Elephant scalp) ధరించడం గమనించవచ్చు. డెమిట్రయస్ తన తండ్రి దగ్గర్నుంచి అధికారంతోబాటు, ఎంతో సునిశిత దృష్టిని, ఎంతో తృణీకార భావాన్ని వెలిబుచ్చే బిగపట్టిన పెదవులను పుణికి పుచ్చుకున్నాడు. అది స్పష్టంగా నాణాల మీద కనిపిస్తున్నది. భారతదేశం మీద జరిపిన దండయాత్రల్లో విజయసాధనకి ఇది చిహ్నం. తన సామ్రాజ్యం కన్నా అనేక రెట్లు విస్తారమైన సామ్రాజ్యానికి చక్రవర్తి అయిన అలెగ్జాండర్‌ను అనుకరించాలని కోరుకునేవాడు డెమిట్రయస్. శిరస్త్రాణం అలెగ్జాండర్‌ను బోలి ఉండేది. డెమిట్రయస్ నాణాలకు రెండో వైపున సింహం చర్మంతో, గోళ్లతో హెర్క్యులెస్ బొమ్మ ఉంది. డెమిట్రయస్ తర్వాత ఆంటియోకస్ రాజ్యానికి వచ్చాడు. నాణాలపై అతనిని చూపించే బొమ్మల ద్వారా ఆంటియోకస్ తెలివైనవాడని అర్థమవుతుంది. పెదవులపై చిరునవ్వు, కొంచెం చిట్లించిన కళ్లు చూస్తే అతను కూడా యుద్ధ విజేతే అనిపిస్తుంది. అతని నాణాల వెనక వైపు ఉన్నది జలప్రళయ దేవుడు (పొసైడోన్). ఈ వంశాన్ని రక్షించే హెర్క్యులస్ దేవుడు కాకుండా పొసైడోన్ ఎందకయ్యాడనేది ప్రశ్న. శాస్త్రవేత్తల అభిప్రాయంలో-ఈ సముద్రదేవుడు నాణాల మీద అమూదర్యా, సింధూ నదుల మీద లభించిన పెద్ద విజయానికి చిహ్నంగా వెలిసి ఉంటాడు.

ఇండో-గ్రీకుల నాణాలపై ఆఖ్యలు మూడు పదాలలో కనిపిస్తాయి. అవి - (1) బసిలియోస్ (Basileos) (రాజు) (2) ఈ బిరుదుల్లో ఏదైనా ఒకటి - (ఎ) సొతారోస్ (Satoros), (బి) మెగలో (Megalou) (సి) అనికేతు (Aniketu) (డి) పిలపతారోస్ (Philapatoros) మొదలైనవి (3) ముద్రించిన రాజు పేరు.

## 8.5 సిధియన్ (శకులు), పార్థియన్లు (పహ్లావులు) నాణాలు :-

మౌర్య సామ్రాజ్య పతనాంతరం కుషాణ సామ్రాజ్య మేర్పడడానికి ముందు, మన దేశ వాయవ్య ప్రాంతంలో గ్రీకుల తర్వాత సిధియన్లు, పార్థియన్లు స్వల్ప మార్పులతో అనుసరించారు. వీరి నాణాల మీద రాజు శిరస్సుకు బదులు ఎక్కువగా రాజు అశ్వారూఢుడై ఉన్నట్లు ముద్రించారు. ఇది కూడా కొన్ని గ్రీకు నాణాలకు రెండో వైపు ఉండే ప్రతిమల అనుకరణే! వీరి నాణాల మీద కేవలం గ్రీకు దేవతల బొమ్మలే కాక, శివుడు, పార్వతి, గజలక్ష్మి లాంటి కొన్ని హిందూ దేవతల బొమ్మలు కూడా ఉన్నాయి. పార్థియన్ రాజులలో అగ్రగణ్యుడు గండోఫర్నిస్. ఇతడు రాగి, వెండి నాణాలను విడుదల చేశాడు. ఇతని నాణాల మీద సాధారణంగా ఒకవైపు రాజు అశ్వారూఢుడై ఉన్నట్లు లేక రాజశీర్షం లేక సింహాసీనుడైన రాజు, రెండో వైపు నైక్, పాలాస్, జూస్ మొదలైన గ్రీకు దేవతల బొమ్మలు ముద్రించబడి ఉంటాయి. ఇతనివే మరికొన్ని నాణాల మీద శివుని ప్రతిమతోపాటు 'దేవవ్రత', 'సుదేవవ్రత' అనే ఆఖ్యలు ఉన్నాయి. ఈ నాణాల వల్ల మనదేశంలో స్థిరపడిన ఈ విదేశీయులు హైందవమతం ద్వారా భారతీయులలో లీనం కాసాగారని గ్రహిస్తున్నాము.

## 8.6 కుషాణుల నాణాలు :-

క్రీస్తు శకం 1,2 శతాబ్దాలలో ఉత్తర భారతదేశంలో కుషాణుల నాణాలు విరివిగా ప్రచారంలో ఉన్నాయి. నాణాల శాస్త్రంలో కుషాణుల నాణాల చరిత్ర ఎంతో క్లిష్టమైనదీ, అంతు చిక్కనిదీను. నాణాల ద్వారా తెలుస్తున్న రాజుల పరిపాలించిన కాలాల మీద పరిశోధకులు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ప్రధాన సమస్యల్లో ఇదొకటి. వివిధ పరిశోధకులు పేర్కొనే కాలాల మధ్య తేడా

ఒకోసారి వందల సంవత్సరాల దాకా ఉంటుంది. తొలి కుషాణ చక్రవర్తులైన కుజుల కాడ్ ఫైసిస్, వీమా కాడ్ ఫైసిస్ ఆ తర్వాత కనిష్కుడు, హువిష్కుడు, వాసుదేవుడు మొదలైన వారు వరుసగా ఒకరి తర్వాత ఒకరు నాణాలను ముద్రించారు. వీరి కాలంలోనే వాయవ్య భారతదేశంలో కుషాణ సామ్రాజ్యపు ప్రభావం అత్యున్నత స్థాయికి చేరుకుంది. కనిష్కుడి కాలంలో కొత్త శకం ప్రారంభమైంది. అయితే ఇది సరిగ్గా ఎప్పుడు మొదలైందో ఇంతవరకు నిర్ధారణ కాలేదు. అందుకనే నాణాల కాలం గురించి కూడా ఇన&ఇన వాదవివాదాలూను. కాని, కనిష్కుడు క్రీ.శ. 78లో సింహాసనం ఎక్కి 'శాలివాహన శకం' అనే ప్రసిద్ధమైన శకాన్ని స్థాపించాడని నేడు పెక్కు మంది చరిత్రకారుల అభిప్రాయం. ఈ శకాన్నే నేడు భారత ప్రభుత్వం అనుసరిస్తున్నది.

కుషాణుల తొలి నాణాలు పారశీక, రోమన్ పద్ధతిలో రాగి లోహంతో తయారు చేయబడ్డాయి. తొలి కుషాణ రాజుల పేర్లను గ్రీకు భాషలో వ్రాసేవారు. కుజుల కాడ్ ఫైసిస్ తన నాణాల మీద గ్రీకు రీతిలో చిత్రీకరించబడ్డాడు. ఈ నాణాల మీద గ్రీకు దేవతల బొమ్మలు ఉండేవి. ఇతని నాణాల మీద సింహపు తొడుగు వేసుకున్న హెర్క్యులస్, దుడ్డు కర్రలు, హీలియస్ మొదలైన దేవతల బొమ్మలు ఉన్నాయి. కాని ఈ దేవతలకి తరచు స్వదేశీ పేర్లు పెట్టేవారు. ఉదాహరణకు, 'సెలెన' అనే దేవత 'మాహ్' అనే పేరు గల దేవుడిగా మారిపోయాడు. ఈ దేవుణ్ణి కొమ్ములున్న నెలవంకగా చంద్రుడికి బదులుగా చూపించారు. కుజుల కాడ్ఫైసిస్ కుమారుడు అయిన వీమా కాడ్ఫైసిస్ (క్రీ.శ. 65-75) మనదేశంలో మొట్టమొదటి సారిగా విరివిగా బంగారు నాణాలను ముద్రించి ఖ్యాతి గడించాడు. ఇతని కాలం నుంచి నాణాలపై భారతీయ చిహ్నాలు, చిత్రాలు చోటు చేసుకోసాగాయి. ఉదాహరణకు, గ్రీకు దుస్తులకు భిన్నంగా స్వదేశీ దుస్తుల్లో ఉన్న రాజు బొమ్మ నాణాల మీద అవతరించసాగింది. వీమా దైవపీఠానికి ఎదురుగా నిలబడి ఉన్నట్లో, పద్మాసనం వేసుకుని కూర్చొని ఉన్నట్లో, ఏనుగు మీద ఆసీనుడై ఉన్నట్లో చిత్రీకరించబడింది. ఇతని నాణాల మీదనే శివుడు, అతడి నంది వాహనం గోచరిస్తాయి. నంది వాహనం ఓ ప్రత్యేకత సంపాదించుకుంది. ఆ తర్వాత కాలంలో విడుదలైన భారతీయ రాజవంశాల నాణాల మీద వేలాది సార్లుగా నంది బొమ్మ అవతరిస్తుంది. నాణాల మీద నాలుగు చేతుల దేవత, అర్ధాక్షి సింహాసనం మీద కూర్చొని కోరినదల్లా ఇచ్చే కల్పవృక్షాన్ని పట్టుకుని ఉన్నట్లు ముద్రించబడింది. భవిష&యత్ లో అవతరించేబోయే 'కూర్చొని ఉన్న లక్ష్మీదేవి' చిత్రానికిది తొలి రూపం. సర్వసాధారణంగా వీమా ముద్రించిన బంగారు, వెండి నాణాలపై ఒక వైపు రాజు బొమ్మ వివిధ భంగిమలలో ఉండగా రెండో వైపు శివుని ప్రతిమతోపాటు "రాజాధిరాజమహేశ్వర" అనే ఆఖ్య ఖరోష్ఠి లిపిలో ఉంటుంది. దీనిని బట్టి వీమా శైవమతాభిమాని అని స్పష్టమవుతుంది. నాణాల మీద దీర్ఘమైన బిరుదులను వాడడం కూడా ఇతనితోనే ఆరంభమైందని చెప్పవచ్చు.

కుషాణ చక్రవర్తులు పరమత సహనం కలిగిన వారు. కనుకనే కనిష్కుడు, హువిష్కుడు మొదలైనవారు బౌద్ధమతాభిమానులైనప్పటికీ వారు వేయించిన బంగారు, రాగి నాణాలపై ఒకవైపు వివిధ భంగిమలలో ఉన్న రాజు బొమ్మ ఉండగా రెండో వైపు గ్రీకు, సుమేరియన్, పారశీక, హిందూ దేవతల ప్రతిమలు కన్పిస్తాయి. కనిష్కుని నాణాలతో విస్తృతంగా ఆరంభమైన ఈ నూతన సంప్రదాయం హువిష్కుని నాణాల మీద మరింతగా విస్తరించినట్లు కనిపిస్తుంది. కనిష్కుడు బంగారు, రాగి నాణాలను ముద్రించాడు. ఒకవైపు రాజు నిలబడి ఉండగా, రెండోవైపు వివిధ దేవతల బొమ్మలుంటాయి. ఇతని నాణాలపై గ్రీకు, కొతానీస్ - శక భాషలలో ఆఖ్యలు వ్రాసి ఉంటాయి. మొట్టమొదటిసారిగా నాణాలపై బుద్ధుని ప్రతిమలను ముద్రించడం ప్రవేశపెట్టినది కనిష్కుడే. కనిష్కుని నాణాల మీద ఉన్నట్లుగానే హవిష్కుని నాణాల మీద కూడా ఒక వైపున వివిధ భంగిమలలో రాజు బొమ్మ, మరొక వైపున గ్రీకు, పెర్షియన్, హైందవ దేవతల చిత్తరువులు ఉన్నాయి.

కుషాణ రాజు వాసుదేవుని (క్రీ.శ. 145-176) కాలం నాటికి నాణాల మీద ముద్రించే దేవతల బొమ్మల సంఖ్య ఆకస్మికంగా తగ్గింది. అప్పటి నుంచి కేవలం ముగ్గురు దేవతల ప్రతిమలు నాణాలపై కనిపిస్తున్నాయి. అవి - (1) శివుడు (2) అర్ధాక్షి అనే

రోమన్ దేవత (3) 'నానా' అనే సిరియన్ దేవత. వాసుదేవుని అనంతరం 'నానా' దేవత కూడా కనుమరుగై చివరకు శివుడు, అర్థాక్షి మాత్రమే మిగిలారు. ఈ అర్థాక్షి నాణాలనే గుప్తులు చాలా వరకు అనుసరించారు.

## 8.7 రోమన్ నాణాలు :-

క్రీస్తు శకం ఒకటవ శతాబ్ది నుండి మూడవ శతాబ్ది తొలి దశ వరకు భారతదేశానికి, రోమ్ సామ్రాజ్యానికి వ్యాపార సంబంధాలు ఉండేవి. రోమన్ చక్రవర్తులు భారతీయ సరుకుల కోసం అధికంగా బంగారు నాణాలను భారతదేశానికి తరలించడం వల్ల రోమన్ రాజులు ప్రజల ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తున్నది. మనదేశంలో దొరికిన రోమన్ నాణాలు స్వచ్ఛమైన బంగారంతో తయారు చేయబడ్డాయి. అయితే, బంగారపు పూత పూసిన కొన్ని నకిలీ రోమన్ నాణాలు, వెండి, తిత్తు నాగపు రోమన్ నాణాలు కూడా అక్కడక్కడ దొరకకపోలేదు. కాని బంగారపు నాణాలే విరివిగా దొరికాయి. ఇవి సాధారణంగా 7గ్రాముల బరువు కలిగి, ఒకవైపు రోమన్ చక్రవర్తుల లేదా రాణుల బొమ్మలు, రెండో వైపు గ్రీకు దేవతల మూర్తులు ముద్రించబడి ఉంటాయి. టైబీరియస్ ('క్రీ.శ. 14-37), నీరో (క్రీ.శ. 54-68), డెమిటియస్ (క్రీ.శ. 81-96), యాంటియోకస్ మొదలైన రాజులు ముద్రించిన నాణాలు ఆంధ్రలో దొరికాయి.

రోమన్ చక్రవర్తుల నాణాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర చోట్ల దొరికాయి. ఈ రాష్ట్రాల్లో అన్నింటికంటే ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లో దొరికాయి. నల్గొండ జిల్లా అక్కెనపల్లి, నెల్లూరు, గుంటూరు జిల్లా వినుకొండ, ఘంటసాల, ప్రకాశం జిల్లా దారంవారి పాలెం, శ్రీకాకుళం జిల్లా శాలిహుండం, కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్ మొదలైన చోట్ల అధిక సంఖ్యలో రోమన్ నాణాలు దొరికాయి. చివర చెప్పిన స్థలంలో 38 వెండి నాణాలతో పాటు దేశీయంగా తయారైన విద్ధాంక నాణాలు (Punch marked coins) దొరకడం విశేషం.


ఉత్తర భారతదేశంలో రోమన్ నాణాలు దక్షిణ భారతదేశంలో కంటే అతి తక్కువగా లభించాయి. అందుకు ప్రధాన కారణం - రోమన్‌లు వారి నాణాలకు బదులుగా మార్పిడి చేసుకున్న వస్తువులు దక్షిణ భారతదేశం నుండీ, దక్కను పీఠభూమి నుండి ఎగుమతి చేసుకున్నవి కావడమే. కుషాణ చక్రవర్తి అయిన వీమాకాడ్ ఫైసెస్ (క్రీ.శ. 65-75) మొదలుకొని కుషాణ రాజులందరూ రోమన్ బంగారు నాణాలను కరిగించి ముద్దలు చేసి దానికి సమతూకంలో బంగారు, ఇతర లోహపు నాణాలు జారీ చేశారు. అందువల్లనే అవి ఈనాడు మనకు లభ్యం కావడం లేదని రాధాకుముద్ ముఖర్జీ వ్రాశారు.

రోమన్ నాణాల విషయంలో ప్రత్యేకంగా గమనించవలసిన విషయమేమిటంటే లభ్యమైన నాణాలలో అత్యధికం చిల్లులు పొడవబడిగాని లేదా నాణాలపై ఉన్న చక్రవర్తుల తలలు రూపం తెలియకుండా చెడగొట్టబడి గాని ఉన్నాయి. ఈ విధంగా బొమ్మలను గుర్తించబడానికి వీలులేని విధంగా చెడగొట్టడంలో ఉద్దేశం తప్పనిసరిగా ఈ నాణాలను చెలామణి నుండి తప్పించడం కోసమే. సర్ జార్జ్‌హిల్ పేర్కొన్న విధంగా భారతదేశంలో ఈ నాణాలకు చిల్లులు పొడవడం వాటిని చెలామణిలో లేకుండా చేయడం కోసమే. ఈ విధంగా గర్తు తెలియకుండా రూపాలు చెరపబడిన నాణాలు ఆగస్టస్, టైబీరియస్, సెప్టిమియస్, సెవరస్, క్లాడియస్, నీరో, యస్పాసియస్, హాడ్రేన్ మొదలైన రోమన్ చక్రవర్తుల కాలం నాటివి. ఈ నాణాలు కొన్ని నిర్ణీత కొనుగోళ్ళకు బదులుగా బంగారం లేదా వెండి లోహం రూపంలో తూచి ఇచ్చిన యూనిట్లు అని చెప్పవచ్చు. ఈ నిధులు సాధారణంగా ఎవరైనా దాచుకొన్న వాటిని దొంగలించబడడం కాని, అల్లర్లు జరిగిన కాలంలో పోగొట్టుకున్నవి గాని లేదా దాచుకున్న వ్యక్తి మరణించినందువల్ల ఇతరులకు దొరకకుండా ఉండిపోయినవి గాని అయి ఉంటాయి. అందుచేత దక్షిణ భారతదేశంలో దొరికిన రోమన్ చక్రవర్తుల నాణాలు తప్పనిసరిగా ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్నవే. అంటే భారతదేశంతో రోమన్‌లకు జరిగిన వ్యాపార సంబంధాలకు స్పష్టమైన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయన్నమాట.

భారతదేశంతో వాణిజ్యానికి రోమన్ చక్రవర్తి ఆగస్టస్ (క్రీ.పూ. 27 - క్రీ.శ. 14) కాలంలో అత్యంత ప్రోత్సాహం లభించింది. టైబీరియస్ (క్రీ.శ. 14-37), నీరో (క్రీ.శ. 54-68) చక్రవర్తుల పరిపాలనా కాలంలో ఆసియా ప్రాంతాలను రోమన్లు జయించి తూర్పు, పశ్చిమ ఖండాల మధ్య వాణిజ్య మార్గాలను నియంత్రించే ప్రపంచ శక్తిగా మారిన కాలంలో ఈ వాణిజ్య సంబంధాలు మరింతగా పవర్ధమానమైనాయి. ప్రాచీన రోమన్ల వ్యాపారం గురించి పేరు తెలియని గ్రీకు నావికుడు వ్రాసిన "ఎర్ర సముద్రంపై దినచర్య" (The Periplus of the Erythrian Sea) వర్ణిస్తున్నది. ఈ గ్రంథంలో భారత్‌లోని బరిగజ (బహుశా భారూచ్) పట్టణ ప్రస్తావన ఉంది. అక్కడి మార్కెట్లో రాగి, తగరం, సీసం, పగడాలు, గోమేధికాలు, రకరకాల రంగురంగుల అద్దాలు, మణి శిలలు, అంజనాలు, బంగారు, వెండి నాణాలకు మంచి గిరాకి ఉందని, వ్యాపారులు వాటిని అమ్మి, సుగంధ ద్రవ్యాలు, పరిమళ పదార్థాలు, వనమూళికలు, నూలు-పట్టు-ముతక వస్త్రాలు, మిరియాలు వంటివి కొనుక్కొవచ్చునని ఆ గ్రంథం పేర్కొంది. అదే సమయంలో - రాజు గారి కోసం ఖరీదైన వెండి పాత్రలను, పాటగాళ్ళను, అందమైన అమ్మాయిలను, రుచికరమైన మధువును, సన్నగా నేసిన వస్త్రాన్ని, నాణ్యమైన లేపనాలను తీసుకెళ్ళే విషయం మరచిపోవద్దని రోమన్ వ్యాపారులకు ఆ గ్రంథం స్పష్టం చేసింది. రాజును మంచి చేసుకోవడానికి ఇలాంటి బహుమానాలు తప్పనిసరి అని, లేకపోతే స్థానికంగా అమ్మకం పన్ను చెల్లించాల్సి వస్తుందని తెలిపింది. భారత్ దిగుమతి చేసుకొన్న, ఎగుమతి చేసిన వస్తువుల మధ్య కీలకమైన తేడా ఉంది. భారత్‌లో లభించని రాగి, తగరం, సీసం, అంజనాల వంటి వాటి ఉత్పత్తి కోసం ముడిపదార్థాలను, వెండి బంగారాలను మన వ్యాపారులు దిగుమతి చేసుకొనేవారు. అటు రోమన్లు బంగారాన్ని అనుత్పాదక పెట్టుబడిగా భావించి ఎగుమతి చేసేవారు. మనవారు సుగంధ ద్రవ్యాలను, మనమూలికలను, వస్త్రాలను ఎగుమతి చేసేవారు. పూర్వం నుండి మచిలీపట్నంతో పాటు మోటుపల్లి నుండి కూడా మేలిరకం దుస్తులు ఎగుమతి అయ్యేవి. ఇటువంటి నాణ్యత కలిగిన నూలు బట్టలు ఇప్పటికీ ప్రకాశం జిల్లా మోటుపల్లి సమీపంలోని చీరాలలో తయారవుతున్నాయి.

భారతీయ వ్యాపారులు బంగారాన్ని దిగుమతి చేసుకొని, విలాసవంతమైన వినియోగ వస్తువులను ఎగుమతి చేస్తే రోమన్లు దానికి విరుద్ధంగా చేసేవారు. ప్లినీ రచనల ప్రకారం - భారత్ నుంచి ఖరీదైన వస్తువుల దిగుమతి కోసం రోమ్ చక్రవర్తులు, ఉన్నత వర్గాలకు చెందిన వారు విచ్చలవిడిగా ధనం వ్యయం చేయడం వల్ల ఆనాటి రోమన్ నాయకులు ఆందోళన చెందేవారు. రోమన్లు చేసే ఎగుమతుల కన్నా దిగుమతుల ఖరీదు ఎక్కువగా ఉండేది. ఖరీదును వారు బంగారు, వెండి నాణాల రూపేణా చెల్లించవలసి వచ్చేది. ధనాగారాలు ఖాళీ కావడంతో కలకలం చెలరేగింది. క్రీ.శ. మొదటి శతాబ్దం మధ్య నాటికి రోమన్ పాలకులు వారి సలహాదారులు ఈ ధోరణికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. బంగారం దేశం దాటి వెళ్ళడం రోమన్ మహా సామ్రాజ్య పతనానికి ప్రధాన కారణాల్లో ఒకటి.

## 8.8 శాతవాహనుల నాణాలు :-

ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు రాగి, సీసం లోహాలతోను వాటి రెండింటి మిశ్రమ లోహమైన 'పోటిన్' (Potin) అనే లోహంతోను అధికంగా నాణాలను తయారు చేశారు. వీరివి కొన్ని వెండి నాణాలు కూడా లభ్యమైనాయి. సీసపు నాణాలు వేల సంఖ్యలోను, వెండి నాణాలు అరుదుగా మద్రాసు నుంచి మాళవ వరకు దక్షిణ భారతంలో అనేక చోట్ల దొరికాయి. శాతవాహనులు వారి నాణాలను బహుశా కార్షాపణాలనే పిలిచి ఉండవచ్చు. నానాఘాట్, కన్హేరీల వద్ద గల కొన్ని శాతవాహన శాసనాలలో ఈ పదం కనిపిస్తుంది. వీరి నాణాలపైన సామాన్యంగా ఒక ప్రక్క పర్వతాల గుర్తులు, ఏనుగు, సింహం, వృషభం, అశ్వం, నౌక, చక్రం మొదలైన వాటిలో ఏదైనా ఒక చిహ్నం ఉండి, ఆ చిహ్నానికి పై భాగాన ఆ నాణాన్ని విడుదల చేసిన రాజు పేరు బ్రాహ్మీ లిపిలో, ప్రాకృత భాషలో ఉంటుంది. రెండో ప్రక్క ఉజ్జయినీ చిహ్నం () ఉంటుంది.

క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందిన శాతవాహనుల కాలం నాటి రెండు సీసపు నాణాలు ఇటీవల ఈ పాఠ్య రచయితకు (వి.వి. సుబ్బారెడ్డి) ప్రకాశం జిల్లా అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నదీ తీరాన దొరికాయి. ఈ నాణాలు గుండ్రంగా ఉన్నాయి.

నాణాల వ్యాసం 1.8 సెం.మీ, 1.7 సెం.మీ, వాటి బరువు 2.6 గ్రా, 3.3 గ్రా. నాణాలపై లిపి అసంపూర్ణంగా ఉండగా, చిహ్నాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటి నాణెం ఒకవైపు మూడు కొండల దొంతర దాని కింద జలతరంగం ఉన్నాయి. బొమ్మకు పై భాగాన నాణెం ఒక మూల నుంచి ఇంకొక మూలకు చుట్టూ బ్రాహ్మీ లిపిలో ప్రాకృత భాషలో "రాణో వాసితి పుత పులమవిస" అని వ్రాసి ఉంది. నాణెం రెండో వైపు పెద్ద "ఉజ్జయిని చిహ్నం" ఉంది. రెండో నాణెం మీద ఒక వైపున ఆరు కొండల దొంతర, మిట్ట మీద ఉన్న కొండ మీద ఒక నెల వంక గుర్తు లాంటి గిన్నె ఉంది. ఆరు కొండల దొంతర క్రింద నీటి తరంగం ఉంది. మొదటి నాణెం గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత రాజ్యానికి వచ్చిన అతని కుమారుడు అయిన వారిష్ఠిపుత్ర పులోమావి వేయించినట్లు తెలుస్తుంది. రెండో నాణెం మీద అస్పష్టంగా ఉన్న లిపిని బట్టి అది గౌతమీ పుత్ర యజ్ఞ శ్రీ శాతకర్ణి నాటిదని తెలుస్తున్నది. దక్కన్‌లో లభ్యమైన శాతవాహనుల సీసం నాణాలపై ఒక ప్రక్క మూడు పర్వతాల దొంతర మరొక ప్రక్క ఉజ్జయినీ చిహ్నం ముద్రించబడింది. మధ్యప్రదేశ్‌లో లభించిన శాతవాహనుల నాణాలపై ఒకవైపు సాధారణంగా సింహం బొమ్మ ముద్రించి ఉంది.

శాతవాహనుల అతి ప్రాచీన నాణెం మీద (క్రీ.పూ. 150) "శ్రీశాత" అనే రాజు పేరు లిఖింపబడి ఉంది.

శాతవాహనుల వెండి నాణాల మీద గ్రీకు పద్ధతిలో రాజు శిరస్సు ముద్రించడం గమనించవచ్చు. శాతవాహన వంశంలో అగ్రగణ్యుడైన గైతమీపుత్ర శాతకర్ణి క్షహరాట వంశస్థుడైన నహపాణుని నిరవశేషంగా నిర్మూలించి అతని వెండి నాణాలపై తన పేరును తిరిగి ముద్రించుకున్నాడు. వీటినే పునర్ముద్రిత (Counter Struck) నాణాలంటారు. ఇవి జోగెల్ తంబి నాణక నిధిలో లభించాయి. పూర్వం ఒక రాజ్యాన్ని జయించిన రాజులు ఓడిపోయిన రాజుల నాణాల మీద దిగ్విజయ చిహ్నంగా తమ గుర్తులను వేసుకునే సాంప్రదాయముంది. గౌతమీపుత్రుడు పునర్ముద్రించిన నాణాలపై ఒక వైపు పర్వతాల గుర్తుతోపాటు "రాణో గౌతమీ పుతస సిరిపాతకనిస" అనే ఆఖ్య (Legend) రెండో వైపు ఉజ్జయినీ చిహ్నం ఉంది. గౌతమీ పుత్రుని కాలం నుంచే శాతవాహనుల వెండి నాణాలపై ప్రాకృతం, దేశీ భాషలు అనే రెండు భాషలలో రాజుల పేర్లు కనిపిస్తాయి. వాటిలో దేశీ భాష నేటి తెలుగు భాషకు సన్నిహితంగా ఉందని ఆచార్య డి.సి. సర్కారు వంటి పండితుల అభిప్రాయం. సమకాలికులైన శకరాజులను అనుకరిస్తూ శాతవాహనులు అధికార భాష అయిన ప్రాకృతంలోను, తమ మాతృభాష అయిన తెలుగులోను, తమ పేర్లను ముద్రించిన నాణాలను తమ సామ్రాజ్యంలోని ఆంధ్రేతర ప్రాంతాల్లో ప్రచారం చేశారని ఆచార్య బి.యస్.ఎల్. హనుమంతరావు మొ॥ పండితులు భావిస్తున్నారు.

నౌకా చిహ్నాలున్న శాతవాహనుల (పులోమావి, యజ్ఞశ్రీ) నాణాలను బట్టి వీరు విదేశాలతో వాణిజ్యం చేసినట్లు తెలుస్తుంది. నౌకా చిహ్నాలున్న యజ్ఞశ్రీ సీసపు నాణాలు ఇటీవల చేబ్రోలు (గుంటూరు జిల్లా)లో పెక్కు లభించాయి. వీటి మీద గల నౌకా బొమ్మలకు రెండు పతాక స్తంభాలు కాక, మూడు స్తంభాలున్నట్లు పరిశీలనలో తేలింది. మూడు స్తంభాలలో రెండు నౌక మధ్యన ఉన్నాయి. వాటి నుంచి త్రాళ్ళు, నౌక ముందు వెనుక భాగాలకు కట్టి ఉన్నట్లు, మూడో స్తంభం చుక్కానికి అనుసంధించబడి ఉన్నట్లు కనిపించింది. దీనిని బట్టి నౌకలకు చుక్కాని ఉపయోగించిన ఘనత ఆంధ్రులకే దక్కుతుందని సిద్ధాంతం చేసిన శ్రీ కంభంపాటి సత్యనారాయణ వాదన సహేతుకమైనదేనని తెలుస్తున్నది.

## 8.9 గుప్తరాజుల నాణాలు :-

ప్రాచీన భారతదేశ నాణాల చరిత్రలో మొదటి సారిగా అత్యధిక సంఖ్యలో బంగారు నాణాలను ముద్రించి ప్రసిద్ధికెక్కినవారు - గుప్తరాజులు. దాదాపు గుప్త చక్రవర్తులందరూ బంగారు నాణాలు విడుదల చేశారు. ఇవి అత్యంత కళాత్మక విలువలు కల్గి, రూపంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించాయి. వీటిని దీనార్, సువర్ణ అనే పేర్లతో పిలిచేవారు. ఈ యుగంలో విదేశీ వ్యాపారం వల్ల

బంగారం మనదేశంలోకి ప్రవహించేది. గుప్తులు జారీ చేసిన రకరకాలైన బంగారు నాణాలు ఆ కాలపు ఔన్నత్యానికి, కళాదృక్పథానికి, ఆర్థిక సంపదకు తార్కాణాలైనాయి. మొదటి దశలో గుప్త రాజులు వారి నాణాలను కుషాణుల నాణాలను అనుకరించి ముద్రించినట్లు కనిపిస్తున్నది. ఈ నాణాల మీద గుప్తరాజులు కుషాణుల వలె పొడుగాటి లాగులు (Trousers), పొడుగాటి చొక్కాలు (Long Coats) ధరించి ఉంటారు. తర్వాత కాలంలో పొడుగాటి లాగు బదులు ధోవతి ధరించడం ప్రారంభమైనది. కొన్ని సార్లు చొక్కా లేకుండా ఉంటారు. తల మీద కిరీటం ఉంటుంది.

గుప్తుల కుల దైవం విష్ణువు. అందువల్ల వారికి కొన్ని నాణాల మీద ఒక వైపు రాజదండం మీద విష్ణువు వాహనం అయిన గరుడపక్షి చిత్రీకరించబడింది. మరోవైపు కల్పవృక్షం పట్టుకుని విష్ణువు సహధర్మచారి అయిన లక్ష్మి ఉంది. కుషాణుల నాణాల మీద కూర్చొని ఉన్న దేవత అర్థాక్షి నుంచి వచ్చినదే ఈ రూపం.

సర్వసాధారణంగా గుప్త సామ్రాట్టులు ముద్రించిన నాణాలలో ఒక ప్రక్క వివిధ భంగిమలలో ఉన్న రాజు బొమ్మ - ఎడమ చేతిలో విల్లు పట్టుకుని, కుడిచేతిలో బాణం పట్టుకున్నట్లు, విల్లు ఎక్కి పెట్టి సింహాన్ని సంహరిస్తున్నట్లు, అశ్వంపై స్వారీ చేస్తున్నట్లు మరొక ప్రక్క కమలంపై కూర్చొని ఉన్న లక్ష్మీదేవిగాని, సింహంపై స్వారీ చేస్తున్న దుర్గాదేవిగాని, మకరంపై నిల్చొని ఉన్న గంగాదేవి ప్రతిమ గాని ఉంటుంది.

గుప్త రాజ్య నిర్మాత అయిన మొదటి చంద్రగుప్తుడు వేయించిన బంగారు నాణాలపై ఒక వైపు తన బొమ్మతో పాటు 'కుమారదేవి బొమ్మను, రెండో వైపు సింహాసనాసీన అయిన దేవితో పాటు "లిచ్ఛావయః" (Lichacha Vayah) అనే ఆఖ్య ఉంది. లిచ్ఛవీ రాకుమార్తె అయిన కుమారదేవిని వివాహమాడిన సందర్భంగా చంద్రగుప్తుడు ఈ నాణాలను విడుదల చేశాడు. భారతదేశ నాణాల చరిత్రలో మొట్టమొదటి సారిగా రాజుతోపాటు, రాణి బొమ్మ కనిపించేది ఈ నాణాల మీదనే.

సముద్రగుప్తుడు, ఒకటో కుమారగుప్తుడు అశ్వమేధయాగం సందర్భంగా వేయించిన నాణాలపై ఒక ప్రక్క అశ్వాన్ని యూపస్థంభానికి కట్టివేసినట్లు (Aswamedha type of coins) చూపబడింది. ఈ అశ్వమేధ తరహా నాణాలను పురోహితులకు దానం చేయడానికి వేయించారని భావిస్తున్నారు. సముద్రగుప్తుడు వేయించిన బంగారు నాణాలు మొత్తం ఆరు రకాలున్నాయి. (అశ్వమేధ, ధ్వజ, వీణా, విలుకాని, యుద్ధ గొడ్డలి, వ్యాఘ్ర సంహార, కచ) ఇవి ఒక్కొక్కటి 108 నుంచి 121 దాకా ధాన్యపు గింజల బరువు కలిగి ఉన్నాయి. చంద్రగుప్త విక్రమాదిత్యుని కొన్ని నాణాలపై ఒకవైపు గరుత్మంతుడు సర్పాన్ని తింటున్నట్లుగా ముద్రించబడి ఉండగా, మరికొన్నింటిపై సింహం బొమ్మతోపాటు 'సింహవిక్రమ' అనే ఆఖ్య ఉంటుంది. గుజరాత్‌లో సింహాలు ఎక్కువగా ఉన్నందువల్ల చంద్రగుప్త విక్రమాదిత్యుడు తన గుజరాత్ దిగ్విజయానికి చిహ్నంగా ఈ నాణాలను ముద్రించాడని చెప్పవచ్చు. ఇతడు విడుదల చేసిన నాణాలను 8 రకాలుగా విభజించవచ్చు. (విలుకాడు, పాన్పు, ఛత్ర, చక్రవిక్రమ, సింహసంహార, అశ్వంపై స్వారీ మొదలైనవి). ఈ బంగారు నాణాలు ఒక్కొక్కటి 119 ధాన్యపు గింజల బరువు ఉంది.

ఒకటో కుమారగుప్తుని నాణాలపై  కార్తికేయుని బొమ్మ ఎక్కువగా కనిపిస్తుంది. ఇతడు ముద్రించిన కొన్ని బంగారు నాణాలలో ఒకవైపు కార్తికేయుడు నెమలి వాహనంపై ఆసీనుడై ఉండగా రెండో ప్రక్క రాజు నెమలికి మేత వేస్తున్నట్లు చిత్రించబడింది. ఇతడు 14 రకాల నాణాలను (విలుకాడు, అశ్వమేధ, అశ్వం, సింహసంహార, ఖడ్గమృగ సంహార, గజస్వారీ, వ్యాఘ్ర సంహార మొదలైనవి) విడుదల చేసి నాణాల ముద్రణలో తండ్రి తాతలను మించిపోయాడు. వీటిలో అశ్వంపై స్వారీ చేస్తూ ఖడ్గ మృగాన్ని సంహరిస్తున్నట్లూ, ఏనుగుపై స్వారీ చేస్తూ సింహాన్ని సంహరిస్తున్నట్లు చిత్రీకరించబడిన నాణాలు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి.

ఈ వంశంలో వెండి నాణాలను ప్రవేశపెట్టింది రెండో చంద్రగుప్తుడే. వెండి నాణాలను 'రూపక' అని పిలిచేవారు. వీటిపై ఒక ప్రక్క రాజు బొమ్మ, బొమ్మకు పైభాగాన గుప్త శకంలో కాలం ఉండగా రెండో ప్రక్క గరుత్మంతుని విగ్రహం ఉంటుంది. శకుల నోడించిన పిదప సౌరాష్ట్రంలో చంద్రగుప్తుడు వెండి నాణాలు ముద్రించాడు. ఇవి అంతకు పూర్వము శకులు ముద్రించిన వెండి నాణాల నమూనాయే. ఇతని తర్వాత మొదటి కుమారగుప్తుడు, స్కందగుప్తుడు, బుద్ధగుప్తుడు వెండి నాణాలను వేయించారు. వీటి మీద పవిత్రమైన నెమలిని, శివుని వాహనం అయిన నందిని చిత్రించడం మర్చిపోలేదు. స్కందగుప్తుని కాలం నుంచి నాణాల తయారీకి వాడిన బంగారం వెండి లోహాలలో నాణ్యత లోపించింది. అంతేకాక, గుప్త సామ్రాజ్యం హీనదశ నందుకోవడంతో, నాణాల సంఖ్య తరిగి, స్కందగుప్తుని తరువాత వారంతా ఒక వర్గం బంగారు నాణాలతోనే సంతృప్తి చెందారు.

గుప్త రాజుల రాగి నాణాలు అతి తక్కువ లభించాయి. సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, మొదటి కుమారగుప్తునివి మాత్రమే లభ్యమయ్యాయి. కాని చిన్న వ్యాపారానికి సంతల్లో రాగి నాణాలు ఉపయోగపడేవి. ఎంతో అద్భుతంగా, అతి జాగ్రత్తగా చెక్కిన బంగారు నాణాలు మాత్రం రోజువారీ మారకానికి ఉద్దేశించబడినవి కావు. ఇవి రాజ్యంలోని ఉన్నత కులస్థులైన బ్రాహ్మణులకి దక్షిణగా ఇవ్వడం కోసం ఉద్దేశింపబడేవి. అప్పుడప్పుడు రాజవంశీయులకు దూతలకు స్మారక చిహ్నాలుగా ఈ పతకాలను బహుకరించేవారు. ఎక్కువగా అంతకు ముందు నాటి కుషాణుల నాణాలు వాడకంలో ఉండేవి.

గుప్తుల నాణాల మీద గల ఆఖ్యలు కూడా కడు ఆకర్షణీయంగా ఉంటాయి. కొందరి నాణాల మీద పొగడ్తలతో కూడిన ఆఖ్యలు కనిపిస్తాయి. ఉదాహరణకు సముద్రగుప్తుని కొన్ని నాణాల మీద "అపరాజితుడు, వందలాది సంగ్రామాల్లో విజేత, తన శత్రువుల నందరినీ తుదముట్టించిన వాడు, దేవతల వరాలు పొందిన వాడు'' అనే ఆఖ్యలు ఉన్నాయి. గుప్తరాజుల కొన్ని నాణాల మీద క్రమేణా కవిత్వం కూడా చోటు చేసుకోసాగింది. కుమారగుప్తుడి నాణాల మీద కవిత్వం వెలసింది. తిరిగి ఈ కవిత్వాల్లో ఆ సామ్రాజ్యాన్ని స్థాపించిన పూర్వీకుల పేర్లు వెలిశాయి. అయితే ఈ కవిత్వమంతా సాధారణంగా ఛందోబద్ధంగా ఉంటుంది.

గుప్త చక్రవర్తులు ముద్రించిన నాణాలు - కాళీఘాట్ (హుగ్లీనది సమీపంలో), బార్సర్ (బనారస్ సమీపంలో), బయాన (భరత్‌పూర్ సమీపంలో), సతారా (బొంబాయి సమీపంలో) మొదలైన చోట్ల అధిక సంఖ్యలో "నాణాల నిధులు'' దొరికాయి.

## 8.10 తూర్పు చాళుక్యుల నాణాలు :-

తూర్పు చాళుక్యుల నాణాలు ఎక్కువగా దొరకలేదు. వీరి నాణాల ముఖ భాగం కొంచెం పుటాకారంలో ఉంటుంది. వీరి నాణాలపై వారి రాజలాంఛనమైన 'వరాహం' ప్రముఖంగా కనిపిస్తుంది. ఇదే వరాహ లాంఛనాన్ని విజయనగర ప్రభువులు కూడా స్వీకరించారు. వేంగీలో చాళుక్యాధికార స్థాపన చేసిన కుబ్జ విష్ణు వర్ధనుని ఒక కల్తీ వెండి నాణెం మీద ఒక వైపు సింహం, రెండో వైపు తెలుగు - కన్నడ లిపిలో 'విషమసిద్ధి' అనే అతని బిరుదు ముద్రితమై ఉంది. చాళుక్య రాజరాజనరేంద్రుని (క్రీ.శ.1019-1059) బంగారు నాణాల మీద ఒకవైపు వరాహం కుడిముఖంగా ఉండి దాని చుట్టూ దీపపు స్తంభం, అంకుశం, ఛత్రం, వింజామరం ఉన్నాయి. నాణెం చుట్టూ 'శ్రీరాజరాజ' అనే ఆఖ్య కన్నడ లిపిలో అక్షరాలు విడివిడిగా అచ్చొత్తబడ్డాయి. నాణెం రెండోవైపు ఎలాంటి ముద్రణ లేదు. ఈ వంశంలోని శక్తివర్త (క్రీ.శ. 1000-1012) కూడా ఇలాంటి బంగారు నాణాలనే విడుదల చేశాడు. ఇతని బంగారు నాణాలు స్వదేశంలోనే కాక విదేశమైన సయాంలో కూడా బయల్పడ్డాయి. ఇది నాడు ఆంధ్రదేశం జరిపిన విదేశ వాణిజ్యానికి నిదర్శనమని చరిత్రకారుల అభిప్రాయం.

## 8.11 చోళుల కాలంలో :-

చోళులు బంగారం, వెండి, రాగి నాణాలను ముద్రించారు. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా వెండి నాణాలను ప్రవేశపెట్టిన ఘనత చోళులకే దక్కుతుంది. చోళ వంశంలో మొదటి రాజైన ఉత్తమ చోళుడు బంగారు, వెండి నాణాలను జారీ చేశాడు. ఈ నాణాలపై ఒకవైపు 'ఉత్తమ చోళ' అని నాగరి లిపిలో మరోవైపు దీపపు స్తంభం, ధనస్సు, కూర్చొని ఉన్న పులి, రెండు చేపలు ఒక గొడుగు క్రింద ఉన్నాయి. కానీ, నాణానికి నాణానికి బంగారంలో తేడా ఉండడం వల్ల ఇవి మరుగున పడిపోయాయి. మధ్యకాలం నాటి చోళులు బంగారు, వెండి, రాగి నాణాలను విడుదల చేశారు. కొన్ని బంగారు నాణాలు స్వచ్ఛమైన బంగారంతో చేయబడినవి కాగా, మరికొన్ని వెండితో కల్తీ చేయబడ్డాయి. ఇంకొన్నింటికి బంగారం పూత పూయడం జరిగింది. ఆ విధంగానే కొన్ని రాగి నాణాలకు వెండి పూత పూశారు. వీటిమీద ఉన్న బొమ్మలు కూడా కడు ఆసక్తికరంగా ఉంటాయి. చోళుల అనేక నాణాలపై పులి, చేప, ధనస్సు చిత్రింపబడి ఉంటాయి. పులి చోళుల రాజలాంభనం కాగా, చేప పాండ్యులది, ధనస్సు చేరులది. వీరిపై సాధించిన దిగ్విజయానికి చిహ్నంగా వీరి లాంఛనాలను చోళులు తమ నాణాలపై ముద్రించారు.

ఉత్తమ చోళరాజు తర్వాత రాజైన ఒకటవ రాజరాజు (క్రీ.శ. 985-1016) నాణాలపైన శార్దూలం, దానికిరువైపుల విల్లు, అమ్ము, చేప చిత్రింపబడి ఉంటాయి. అతని నాణాలు దక్షిణ భారతదేశమంతటా, సింహళంలో కూడా చెలామణిలో ఉండేవి. తర్వాత ఈయన ప్రత్యేక తరహాలో గీతల ద్వారా బొమ్మలను రాగి నాణాలపై ముద్రించాడు. ఈ నాణాలకు ఒకవైపున నిలబడి ఉన్న రాజు బొమ్మ రెండో వైపున కూర్చొని చేతిలో శంఖం ధరించిన రాజు బొమ్మ "రాజ రాజ" అని నాగరిలిపిలో అక్షరాలు ముద్రించబడి ఉన్నాయి. ఈ ప్రత్యేక తరహా గీతల బొమ్మలను నాణాలపై ముద్రించడాన్ని మొదట తిరునల్వేలి మండలం కోర్కి ప్రాంతానికి చెందిన పాండ్యులు జారీ చేశారు. రాజరాజు వాటిని అనుకరించాడు. ఇతని కాలంలో ఈ బొమ్మల ముద్రణ బాగా వ్యాప్తి జరగడం వల్ల సిలోన్ రాజులు కూడా ఈ రకం నాణాలను ముద్రించారు. అయితే తరువాత కాలంలో ఈ గీతల బొమ్మలను 'సిలోన్-మనిషి రకం' బొమ్మలని పిలిచారు. రాజరాజు ముద్రించిన ఈ రకపు నాణాలు అన్నీ ఒకే రకంగా ఉండక, బొమ్మలలో తేడా రావడం వల్ల ఈయన తర్వాత ఈ రకపు నాణాలు చాలా కాలం వరకు రాలేదు. రాజరాజ చోళుని కాలం నాటి నాణాలలో కొన్ని సమతులంగాను, కొన్ని రెండువైపులా ఉబ్బుగాను ఉంటాయి. ఈ తరహాకు చెందిన అనేక నాణాలు సింహళంలో లభ్యమయ్యాయి. ఇక్కడ లభ్యమైన నాణాలపై "శ్రీకులోత్తుంగ" లేదా "శ్రీలంకేశ్వర" లేదా "శ్రీలంకవీర" అని తమిళ లిపి అక్షరాలలో ముద్రలు కల్గి ఉన్నాయి. ఇవి చాలా వరకు సింహళాన్ని జయించిన సందర్భంగా రాజరాజ చోళుడే జారీ చేసి ఉండవచ్చు.

## 8.12 యాదవుల నాణాలు :-

దేవగిరి యాదవులు బంగారు విద్ధాంక (Punch) నాణాలు విడుదల చేశారు. స్వతంత్ర యాదవ రాజ్యాన్ని స్థాపించిన అయిదో భిల్లముడు (క్రీ.శ. 1187-1191) తొమ్మిది విద్ధాంకాలున్న నాణాలను జారీ చేశాడు. వీటిలో అయిదు సింహం గుర్తు కలిగినవి కాగా రెండు 'శ్రీ' అని, ఎనిమిదవది 'శంఖం' బొమ్మతో, తొమ్మిదవది 'శ్రీభిల్లమదేవ' అని నాగరిలిపిలో ఆఖ్య ఉంటుంది. జైతుగి కుమారుడైన సింఘన (క్రీ.శ. 1210-47) యాదవ రాజులందరిలో బలవంతుడు. ఇతడు మొదట ఆరు విద్ధాంకాలతోను తర్వాత అయిదు విద్ధాంకాలతోను నాణాలను ముద్రించాడు. ఆరు విద్ధాంకాల నాణాల మీద ఒకవైపు మధ్యలో నాట్యం చేస్తున్న కృష్ణుడు, మిగతా అయిదు విద్ధాంకాల మీద రెండు 'శ్రీ' అని, మూడవది తామరపుష్పం, నాల్గవది శంఖం, అయిదవది 'శ్రీసింఘన' అని నాగరిలిపిలో ఆఖ్య ఉంటుంది. అయిదు విద్ధాంకాలున్న నాణాల మీద మధ్యలో తామరపుష్పం, రెండు విద్ధాంకాల మీద 'శ్రీ' అని, మూడవ దానిమీద శంఖం, నాల్గవ దాని మీద 'శ్రీసింఘన' అని నాగరిలిపిలో వ్రాయబడి ఉంటుంది. ఇతని తర్వాత వచ్చిన రాజులు కూడా ఇదే పద్ధతి అనుసరించారు. యాదవ రామచంద్రుని కొన్ని నాణాల మీద "గరుడ లాంఛనం" కనిపిస్తున్నది.

## 8.13 హోయసాలులు :-

హోయసాల వైభవానికి మూల పురుషుడు అయిన బత్తిదేవ విష్ణువర్థనుడు (క్రీ.శ. 1106-41), రెండో నరసింహుడు (1120-24) ప్రతిముద్ర (Die struck) బంగారు నాణాలు విడుదల చేశారు. బత్తిదేవ విష్ణువర్థనుడు రెండు రకాల నాణాలను జారీ చేశాడు. అవి ఏమంటే (ఎ) నాణానికి ఒకవైపు నోరు తెరుచుకొని జూలుతో ఉన్న ఒక సింహం కుడి ముఖంగా ఉండి తోక ఎత్తినట్టు ఉన్నది. రెండోవైపు "శ్రీతలకడగొండ" అనే ఆఖ్య ఉంది. (బి) సింహంపై స్వారీ చేస్తున్న చాముండ ప్రతిమ ఒకవైపు, మరోవైపు 'శ్రీ నోనంబవాడిగొండ' అనే ఆఖ్య ఉంది. ఈ రెండో రకం నాణాలను రెండో నరసింహుడు కూడా విడుదల చేశాడు. ఇతని నాణాల మీద 'శ్రీప్రతాపనరసింహ' అని వ్రాయబడి ఉంటుంది.

## 8.14 పాండ్యుల నాణాలు :-

పాండ్యుల నాణాల మీద ప్రముఖంగా గోచరించేది మత్స్య లాంఛనం. సామాన్యంగా వీరి నాణాల మీద ఒక ప్రక్క చేప, రెండో ప్రక్క ఏనుగు చిత్రింపబడి ఉంటుంది. చతురస్ర ఆకృతిలో ఉన్న ఈ నాణాలలో వెండి, బంగారువి కూడా ఉన్నాయి. కొన్ని నాణాల మీద "సు" అనే అక్షరం  ఉంది. ఇవి జటావర్మ సుందర పాండ్యుడివి గాని లేదా సుందర పాండ్యుడివి గాని అయి ఉండవచ్చు. పాండ్యుల కొన్ని నాణాల మీద వేణుగోపాలుని బొమ్మ ఒకవైపు, రెండో వైపు "వీరపాండ్య" అని వ్రాసి ఉంది. ఈ నాణాలు చోళుల సామంతులవో లేక పాండ్యులవో అనుమానంగా ఉంది. పాండ్యులు ముద్రించిన కొన్ని నాణాల మీద ఒకవైపు రాజు నిలబడి, కూర్చొని ఉండగా రెండోవైపు 'భూతల ఎల్లాంతలై' 'పారాసురామ', 'కులశేఖర' అనే ఆఖ్యలు ఉన్నాయి. పాండ్యులు పాలించిన కొంగు మండలంలో రాగి, బంగారు నాణాలు చెలామణిలో ఉన్నాయి. ఈ నాణాల మీద విల్లు, అమ్ము, ఏనుగు ముద్రించబడి ఉన్నాయి.

## 8.15 విజయనగర రాజుల కాలంలో :-

దక్షిణాపథ చరిత్రలో విజయనగర రాజుల పాలనా కాలం (క్రీ.శ. 1336-1678) నాణాల ముద్రణలో నూతన అధ్యాయాన్ని సృష్టించింది. వీరు ముద్రించిన నాణాలు సాంకేతికంగాను, కళాత్మకంగాను ఎంతో ఉన్నతమైనవి. వీరు బంగారు, వెండి, రాగి నాణాలను ముద్రించారు. వెండి, రాగి నాణాల కంటే బంగారు నాణాలే వీరివి ఎక్కువగా లభ్యమైనాయి. బంగారు నాణాలు చిన్న సైజులో (సెంటిమీటర్‌కు కాస్త అటూ ఇటూ వ్యాసం కలిగి) ఉంటాయి. వీటిని "గద్యాణాలు" లేక "పగోడాలు" అని పిలుస్తారు. వీటినే "వరహాలు" అని కూడా అంటారు. చాళుక్య రాజుల నాణాలపై సాధారణంగా ముద్రితమై ఉండే "వరాహం" కారణంగా వీటికి ఆ పేరు వాడుకయింది. కనుక, 'వరాహ' మనేది చాళుక్యుల కాలం నుండి వస్తున్న నాణెం అని తెలుస్తున్నది.

విజయనగర చక్రవర్తులు విడుదల చేసిన బంగారు నాణాలపై ఒకవైపు సామాన్యంగా శైవ, వైష్ణవ (ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ, బాలకృష్ణుడు, గండభేరుండం) దేవతల ప్రతిమలు, రెండో వైపు నాగరి లేదా కన్నడ లిపిలో ఆ నాణాన్ని విడుదల చేసిన రాజు పేరు ముద్రించి ఉంటుంది. సంగమ వంశానికి చెందిన మొదటి హరిహర రాయల బంగారు నాణాలపై హనుమంతుని ముద్ర ఉన్నది. వెండి నాణాలు రెండో దేవరాయల (క్రీ.శ. 1422-1446)వి మాత్రమే ఇంతవరకూ బయల్పడ్డాయి. వీటిపైన ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ ముద్రలు ఉన్నాయి. ఈ వెండి నాణెం బరువు 4 ధాన్యపు గింజలు మాత్రమే. దీనికి 'తార్' అనే పేరుంది. విజయనగర రాగి నాణాలపై గరుడ, నందీశ్వరుడు , ఏనుగు, గండబేరుండం మొదలైన చిహ్నాలుంటాయి. వీటిని జిటలు, కాసులు అంటారు. శ్రీకృష్ణదేవరాయలు ముద్రించిన గరుడ నాణాలపై ఒక వైపు కిరీటం ధరించి కుడికాలు మోకరించి వీరసేన భంగిమలో రెండు చేతులెత్తి నమస్కరిస్తున్న గరుడ విగ్రహం ముద్రించి ఉంది. నాణానికి రెండో వైపున దేవనాగరిలిపిలో

'ప్రతాప కృష్ణదేవరాయ' అనే పేరుంది. నాణెం వ్యాసం 1.4 సెం.మీ., దాని బరువు 3.4 గ్రాములు. వీటిలో ఎక్కువ బరువు కల్గిన నాణెం 16.09 గ్రాములు బరువుండగా అతి తక్కువ బరువు కలిగిన నాణెం 1.6 గ్రాములు బరువు మాత్రమే ఉంది. శ్రీకృష్ణదేవరాయలు వేయించిన నందీశ్వర ప్రతిమ ఉన్న రాగి నాణాల మీద కన్నడ లిపి, మిగిలిన అన్ని రకాల నాణాల మీద నాగరిలిపి ఉండటం గమనించవలసిన విషయం.

క్రీ.శ. 1543-1576 వరకు ఏలుబడి సాగించిన సదాశివరాయలు బంగారు నాణాలు, రాగి నాణాలు వేయించాడు. అతను వేయించిన ఒక్కొక్క బంగారు నాణెం 3.4 గ్రాములు తక్కువ కాకుండా ఉంది. నాణెం బొమ్మ వైపున అర్థపర్యంక ముద్రలో పీటంపై ఆసీనులైన లక్ష్మీనారాయణుని మూర్తి ముద్రించి ఉంది. ఆ విష్ణుమూర్తి పై కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం ఉన్నాయి. మామూలు చేయి అభయముద్రలో ఉంది. లక్ష్మీదేవికి రెండు చేతులు ఉన్నాయి. ఆమె కుడిచేతిలో పద్మం ఎడమచేయి డోహస్త ముద్రలో ఉంది. నాణెం రెండో వైపున నంది నాగరిలిపిలో 'శ్రీసదాశివరాయరు' అని వ్రాసి ఉంది. ఇతను వేయించిన బంగారు నాణాలు రెండు రకాలు. ఒకటి వరహా నాణెం. రెండోది అర్ధవరహా నాణెం. 3.4 గ్రాములు బరువు ఉన్న నాణెం అర్ధవరహా నాణెం.

చిక్క రాయలు (క్రీ.శ. 1614-15) ముద్రించిన నందీశ్వర గుర్తు కలిగిన నాణాలపై తెలుగు లిపి వాడడం గమనించవచ్చు.

## 8.16 ముస్లింల నాణాలు :-

ముస్లింల చేతిలో హిందువులు ఓడిపోవడం, భారతదేశంలో ముస్లింలు రాజ్యస్థాపన చేయడంతో భారతదేశ నాణాల చరిత్రలో కొత్త మార్పు వచ్చింది. నాణాల ముద్రణలో ప్రత్యేక శ్రద్ధను చూపించి నాణాల తయారీని పూర్తిగా తమ చెప్పుచేతులలో ఉంచుకొన్నారు ముస్లింలు. అయితే అప్పటి వరకు చెలామణిలో ఉండే నాణాలను రద్దు చేసిన సందర్భాలు తక్కువ. ముస్లింల నాణాలపై గల ఆఖ్యలు చదవడం సులభమే. పెక్కు మహమ్మదీయ ప్రభువులు తమ విజయ రాజ్య సంవత్సరాన్ని ఆ నాణాలపై ముద్రించేవారు. అంతేగాక, వారి పవిత్ర గ్రంథంలోని పవిత్ర వాక్యాలను నాణాలపై లిఖింపజేస్తారు. ఈ అక్షరాలు సాధారణంగా కళాశోభితాలై ఉంటాయి. భారతదేశంలో స్వతంత్రంగా స్వచ్ఛమైన అరబిక్ నాణాలను ముద్రించిన ఢిల్లీ సుల్తాన్ ఇల్టుట్‌మిష్.

## 8.17 తుగ్లక్ నాణాలు :-

నాణాల ముద్రణలో వీరు పశ్చిమ ఆసియా లోని ముస్లిం చక్రవర్తులను అనుకరించేవారు. ఈ కాలంలో కొన్ని నాణాలపై అరబిక్‌లో ఇస్లాం మత బోధన లిఖించబడి ఉంటుంది. సామాన్యంగా వీరు ఏదైనా కొత్తగా ఒక దేశాన్ని గాని లేక దుర్గాన్ని గాని జయించిన సందర్భాలలో కొత్త నాణాలను విడుదల చేస్తుండేవారు. ఈ నాణాలపై రెండు ప్రక్కల అరబిక్ గాని, లేదా పాశీకంలో గాని ఆఖ్యలు ఉంటాయి. మహమ్మద్ బీన్ తుగ్లక్ కొత్త కొత్త ప్రయోగాలను చేయాలనే ఆసక్తితో 201.5 ధాన్యపు గింజల బరువున్న బంగారపు దీనారాన్ని, 144 గింజల తూకం ఉన్న 'అడ్లీన్' అనే వెండి నాణాన్ని, 141.7 గింజల తూకం ఉన్న బిల్లన్ (Billon) (రాగి, వెండి మిశ్రమం) అనే నాణాన్ని ప్రవేశపెట్టాడు. సామాన్యంగా వీటి మీద తన పేరుతో పాటు కలిమా (Kalima) అని వ్రాయబడి ఉంటుంది. సింహాసనం ఎక్కినప్పటి నుంచి తుగ్లక్, దేశంలో చెలామణిలో ఉన్న నాణాలలో అనేకమైన మార్పులు చేశాడు. ఈ మార్పులన్నింటిలో ముఖ్యమైనది వెండి, బిల్లన్ నాణాలకు బదులు రాగి, ఇత్తడి నాణాలను ముద్రించి చెలామణిలోకి తేవడం. ఈ నాణాల మీద "సుల్తాన్‌కు విధేయుడైనవాడు దేవుడికి విధేయుడైనట్లే" అనే ఆఖ్య ఉంది.

## 8.18 మొగల్ నాణాలు :-

భారతీయ నాణాల ముద్రణా చరిత్రలో షేర్షా కాలం ఒక ప్రముఖ అధ్యాయం. అంతకు ముందున్న నాణాలు హీనమైనవి కావడం చేత, మిశ్రమ లోహాలలో (Billon) ముద్రించడం చేత షేర్షా వాటిని రద్దు చేసి కొత్త నాణాలను ముద్రించాడు. ఈ విధంగా ముద్రించినవి 180 ధాన్యపు గింజల తూకం ఉన్న వెండి రూపాయి. 325 గింజల బరువు ఉన్న 'డామ్' అనే రాగి నాణెం. షేర్షా తన నాణాల మీద నాగరి లిపిలోను (శ్రీషేర్షాహి) అరబిక్ (కలిమా, నలుగురు కలీఫాల పేర్లు, షేర్షా పేరు)లోను ఆఖ్యలు వ్రాయించాడు. బంగారం, వెండి, రాగి నాణాల విలువలను నిర్ణయించాడు.

అక్బర్ వెండి, బంగారం, రాగి లోహాలతో నాణాలను ముద్రించాడు. ఇతడు తొలి రోజులలో షేర్షా నాణాలను అనుకరించి ముద్రించాడు. 1584 నుండి తన నాణాలపై "1556"తో మొదలైన దైవశకమనే ఒక ధృవకాలాన్ని ప్రారంభించాడు. సామాన్యంగా ఇతని నాణాలపై "అల్లాహో అక్బర్" అని ఆఖ్య ఉంటుంది. సీతారాముల బొమ్మ ఉన్న నాణాలను కూడా అక్బరు విడుదల చేశాడు. ఈ నాణాల మీద నాగర లిపిలో సీతారాముల పేర్లు సన్నటి అక్షరాల్లో ఉన్నాయి. అక్బర్ తర్వాత అతని కుమారుడు జహంగీర్ వేయించిన కొన్ని నాణాలపై తన పేరుతో పాటు తన ప్రియతమ రాణి అయిన నూర్జహాన్ పేరు కూడా ముద్రించుకున్నాడు. మరికొన్నింటి మీద మధుపాత్రలో కనపడతాడు. అతనికి తన రాణి మీద, మద్యం మీద ఉన్న ప్రేమాతిశయం అటువంటిది.

మొగల్ యుగంలో నాణాల విషయంలో జరిగే లోపాలను తెలుసుకోడానికి, మోసాన్ని అరికట్టడానికి, ప్రచారంలో ఉన్న నాణాలను తెలుసుకోవడానికి ఒక్కొక్క టంకశాలకు ఒక్కొక్క మోనోగ్రామ్ (Monogram) ను ఉపయోగించారు.

మొగల్ చక్రవర్తులు నామమాత్రంగా మిగిలిన రోజులలో కూడా బాహ్య ప్రపంచానికి వారి గొప్పతనాన్ని చాటడానికి స్వతంత్ర రాజ్యాల రాజులు వారు ముద్రించే నాణాలకు ఒకవైపు అప్పటి మొగల్ చక్రవర్తి పేరు, హిజ్రీకాలం, మరొకవైపు నాణెం ముద్రించబడిన ఊరు, రెగ్నల్ సంవత్సరం, టంకశాల చిహ్నం ఉండేటట్లు ముద్రించేవారు.

నాణాల ఉత్పత్తి మొగల్ల కాలంలో ఢిల్లీ, ఆగ్రాలలోనే కాక చాలా చోట్ల టంకశాలలు ఏర్పడ్డాయి. నాణాలను ముద్రించడం ఆనాటి ముఖ్య పరిశ్రమలలో ఒకటి. మద్రాసు, పాండిచ్చేరి టంకశాలలు ఆర్కాట్ నవాబుల పాలనలో ఉన్నప్పుడు అప్పటి మొగల్ పాదుషా మహమ్మద్షా నాణాలు ముద్రణకు అనుమతి ఇవ్వడంతో 1792 సంవత్సరంలో ఆర్కాట్ నుండి ముద్రించినట్లు మొగల్ నాణాలు మద్రాసు టంకశాలే తయారు చేసింది. ఈ నాణాలలో రెగ్నల్ సంవత్సరం '6' మరియు 1192 సంఖ్య తప్పనిసరిగా ఉండేది. ఈ పద్ధతి మహమ్మద్షా చనిపోయిన తర్వాత కూడా కొంతకాలం కొనసాగింది. 1742 వ సంవత్సరం నుండి 1814 సంవత్సరం వరకు ఆర్కాట్ నాణాలను మద్రాసు మరియు కలకత్తా టంకశాలలు ముద్రించాయి. ఈ నాణాలకు ఒకవైపున "సిక్కా ముబారక్ బాద్షా ఘాజీ మహమ్మద్ అజీజుద్దున్ అలంగీర్ 1192" అనీ, రెండో వైపున "మైమ్నాట్ మేనస్ సాన్జూలస్ 6 జార్బ్ ఆర్కాట్" అనీ ఉన్న అక్షరాలతో పాటు "త్రిశూలం" గుర్తు ఉంది.

## 8.19 ప్రాచీన భారతదేశ చరిత్రకు నాణాల విలువ :-

శాసనాల వలె, నాణాలు కూడా ప్రాచీన చరిత్ర రచనకు అమూల్యమైన ఆధారాలు. ముఖ్యంగా, మనదేశ చరిత్ర పునర్నిర్మాణంలో వీటి అవసరమెంతైనా ఉంది. సాధారణంగా నాణాలు ఆ కాలమందున్న రాజుల చేత వెండి, బంగారం, రాగి మొదలైన లోహాలతో ముద్రించబడతాయి. వీటిని ముఖ్యంగా దేశంలో వర్తక వ్యాపారాలను సులభతరం చేయడానికి, వాటిని పెంపొందించడానికి మారక ద్రవ్యంగా ఉపయోగిస్తారు. ఈ నాణాలు అప్పుడప్పుడు కొన్ని చారిత్రాత్మక సంఘటనల జ్ఞాపకార్థంగా

కూడా ముద్రించడం కద్దు. ఈ నాణాలపైన లేఖనాలు, ప్రతిమలు, లాంఛనాలు, చిహ్నాలుంటాయి. ఇవి గడిచిన కాలానికి ఎంతో అమూల్యమైన చారిత్రక మూలాధారాలు. వీటిని అధ్యయనం చేయడం ద్వారా చరిత్రలో వివిధ కాలాలలో విభిన్న రూపాలలో అలముకొన్న చీకట్లను తొలిగించవచ్చు. వేదకాలంలో నిష్క, శతమాన, సువర్ణ మొదలైన నాణాలు ఉపయోగించినప్పటికీ, తర్వాత విద్ధాంక నాణాలు (Punch-marked Coins) కోకొల్లలుగా ఉపయోగించినప్పటికి అశోకుని తర్వాతనే మనదేశంలో సరియైన నాణాల ముద్రణ ప్రారంభమైందని చెప్పవచ్చు. ముఖ&యంగా ఇండో-బాక్ట్రియన్ గ్రీకు రాజులతోనే మనదేశంలో నాణాల ముద్రణా యుగం ప్రారంభమై తర్వాత బాగా అభివృద్ధి చెందినదని చెప్పవచ్చు.

మన దేశంలో వివిధ ప్రాంతాలలో, తవ్వకాలలో వేలకొలది నాణాలు రాసులు రాసులుగా దొరికాయి. నాణాలకు వాడిన లోహాన్ని బట్టి, వాటి మీద గల లాంఛనాలు, బొమ్మలు, ఆఖ్యలను బట్టి, నాణాల యొక్క బరువును బట్టి కూడా నాటి రాజకీయ, ఆర్థిక, మత, వాణిజ్య పరిస్థితులే గాక ఆయా రాజుల గుణగణాలు, రాజ్య విస్తీర్ణం, కళాభినివేశము మొదలైన అంశాలను గ్రహించవచ్చు.

## 8.19.1 రాజకీయ చరిత్ర :-

భారత రాజకీయ చరిత్రలోని అనేక ఘట్టాలకు నాణాలు ముఖ్యమైన ఆధారాలుగా ఉన్నాయి. ముఖ్యంగా మౌర్య-గుప్త సామ్రాజ్యాల మధ్య కాలంలో మనదేశాన్ని పాలించిన ఇండో-గ్రీకు, సిథియన్, కుషాణ, క్షాత్రప రాజవంశాల చరిత్రలను తెలుసుకోడానికి వారి నాణాలే ప్రధాన ఆధారం. అందుకు కారణం - వారు వేయించిన శాసనాలు అతి తక్కువ. వాటిలో లభించే వివరాలు అతి స్వల్పం. వాఙ్మయాధారాలు అంతంత మాత్రంగా ఉండడమే! ఇట్టి పరిస్థితులలో వారి చరిత్రకు వారి నాణాలే శరణ్యం.

సుమారు ఇదే కాలంలో ఉత్తర భారతంలో వివిధ ప్రాంతాలలో పరిపాలన సాగించిన యౌధేయులు, అర్జునాయనులు, మాళవులు, యుదుంబులు, పుళిందులు మొదలైన గణరాజ్యాల వారి చరిత్రకు చాలా వరకు వారి నాణాలే ఆధారం. ఇతర ఆధారాలు లభ్యం కానప్పుడు కేవలం నాణాలు దొరికిన ప్రాంతాల్ని బట్టి ఆ రాజ్య సరిహద్దులు ఎంతవరకు విస్తరించినవో నిర్ణయించడానికి వీలవుతుంది. ఉదా: యౌధేయుల నాణాలు ఎక్కువగా సట్లెజ్-యమునా నదుల మధ్య ప్రాంతంలో లభించడం వల్ల అది వారు పరిపాలించిన ప్రాంతమని నిర్ధారించడం జరిగింది.

క్రీస్తు శకం రెండో శతాబ్దంలో కుషాణుల పతనానికి యౌధేయులే కారణమని నాణాల నుంచి గ్రహించవచ్చు. అది ఎట్లనగా - యౌధేయుల నాణాలు రెండు వేర్వేరు కాల పరిమితులకు చెందినవని, అందులో మొదటిది క్రీస్తు శకారంభమైన తర్వాత అంతమైందని, రెండోది క్రీ.శ. రెండో శతాబ్దాంతాన ఆరంభమైందని నాణాల పరిశోధకుల అభిప్రాయం. ఈ రెండు కాలపరిమితుల మధ్య కుషాణులు విజృంభించారు. యౌధేయుల నాణాలు ఈ కాలంలో చెలామణి కావడం చేత, వీరు (యౌధేయులు) కుషాణులకు కొంతకాలం ఆధీనులై ఉండి, క్రీ.శ. రెండో శతాబ్దంలో బలం పుంజుకొని, విజృంభించి కుషాణ రాజ్య పతనానికి కూడా కారకులై ఉంటారని పండితులు భావిస్తున్నారు. ఈ ఉదాహరణలను బట్టి నాణాలు రాజకీయ చరిత్ర రచనకు ఎలా ఉపయోగపడతాయో ఊహించుకోవచ్చు.

మహారాష్ట్రలోని "జోగల్‌తంబి" నాణకనిధి (Coin Hoard) లో ఆంధ్రశాతవాహన చక్రవర్తి అయిన గౌతమీపుత్ర శాతకర్ణి పునర్ముద్రించిన క్షాత్రపనహపాలుని నాణాలు లభించాయి. ఈ నాణాలు క్షహరాటులపై గౌతమీపుత్రుడు సాధించిన అఖండ విజయాన్ని (నాసిక్ శాసనం చెబుతున్న) ధృవపరుస్తున్నాయి. పూర్వం ఒక రాజ్యాన్ని జయించిన రాజులు ఓడిపోయిన రాజుల నాణాల మీద దిగ్విజయ చిహ్నంగా తమ గుర్తులను వేసుకునే సాంప్రదాయముంది.

చంద్రగుప్తు, కుమారదేవి (లిచ్ఛవీ రాజకుమారి) నాణాల వలన గుప్త సామ్రాజ్య సుస్థిరతలో, విస్తరణలో లిచ్ఛవీలు వహించిన పాత్ర ద్యోతకమగుచున్నది. ఈ నాణాలు దొరికిన స్థలాలను బట్టి (కాశీ, మదుర, లక్నో, బయానా) మొదటి చంద్రగుప్తుని సామ్రాజ్య విస్తీర్ణతను నిర్దేశించవచ్చు.

రెండో చంద్రగుప్తుని సింహముద్రిక (Lion - Slayer) నాణాలు అతని గుజరాత్ ఆక్రమణను సూచిస్తున్నాయి. గుజరాత్‌లో సింహాలు ఎక్కువగా ఉన్నందువల్ల రెండో చంద్రగుప్తుడు తన గుజరాత్ దిగ్విజయానికి చిహ్నంగా ఈ నాణాలను ముద్రించాడని చెప్పవచ్చు.

బాలకృష్ణుని ప్రతిమ గల కృష్ణదేవరాయల నాణాలు అతని ఉదయగిరి దిగ్విజయ యాత్రను ధృవపరుస్తున్నాయి. వాఙ్మయ, శాసనాల ద్వారా గాక కేవలం నాణాల వల్ల వెలుగులోకి వచ్చిన చక్రవర్తులు ఎందరో ఉన్నారు. ఉదా: భారతీయ వాఙ్మయం ప్రకారం బాక్ట్రియన్ గ్రీకు రాజులు నలుగురు మాత్రమే మనకు తెలుసు. కాని వారి నాణాల ఆధారంగా వారు 30 మంది ఉన్నారని తెలుస్తున్నది.

అటులనే శాతవాహన వంశంలో మొదటిరాజైన శాతవాహనుడు, గుప్త వంశంలో కుచుడు మొదలైన వారు కేవలం నాణాల వల్ల వెలుగులోనికి వచ్చారు. ఈ విధంగా నాణాలు చరిత్రలో మరుగునపడిన చక్రవర్తులెందరినో వెలుగులోనికి తెచ్చాయి.

ఇటీవల తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట తాలూకా గట్టువొమ్మ అనే గ్రామంలో విజయనగర రాజుల కాలం నాటి నాణాలు దొరికాయి. ఇవి శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు కాలానికి చెందినవి. అయితే ఇప్పటి వరకు విజయనగర రాజులు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలంచలేదని, ఈ ప్రాంతాన్ని కాకతీయులు, బహమనీ సుల్తానులు, ఆ తర్వాత కుతుబ్‌షాహీలు పరిపాలించారనే నమ్మకం ఉండేది. అయితే ఈ నాణాలు లభ్యం కావడంతో ఈ నమ్మకం మరోసారి వమ్ము అయింది. క్రీ.శ. 1377 నుంచి 1404వ సంవత్సరం వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన రెండో హరిహరరాయలు, క్రీ.శ. 1397లో గోదావరి నదీ తీరాన, ప్రస్తుతం కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ తాలూకాలో ఉన్న కాళేశ్వరంలో బంగారంతో తూగి, ఆ బంగారాన్ని కాళేశ్వరస్వామికి బహుకరించినట్లు కాళేశ్వరంలో శాసనాధారాలు కూడా గతంలో బయటపడ్డాయి.

## 8.19.2 ఆర్థిక స్థితిగతులు :-

నాణాలు కేవలం రాజకీయాలనే కాదు, రాజ్యపు ఆర్థిక స్థితిగతులను కూడా తెలియజేస్తాయి. నాణాల తయారీలో వాడిన లోహాన్ని బట్టి ఆర్థిక పటుత్వాన్ని గురించి చెప్పవచ్చు. ఉదా: గుప్తుల బంగారు నాణాలలో ఉన్న అపద్రవ్యం (Alloy) శాతం గుప్త సామ్రాజ్య ఆర్థిక స్థితిగతులను సూచిస్తున్నది. గుప్త సామ్రాజ్యం మహోజ్వల దశలో ఉన్నప్పుడు గుప్త చక్రవర్తులు ముద్రించిన బంగారు నాణాలలో 10% మాత్రమే అపద్రవ్యం ఉండేది. కాని, కుమారగుప్తుని మరణానంతరం గుప్త సింహాసనం అధిష్టించిన స్కందగుప్తుడు (క్రీ.శ. 435-467) హూణులతోను, ఇతర శత్రువులతోను యుద్ధాలు చేయవలసి రావడం చేత దేశం సంక్షోభితమైంది. ఆర్థిక వ్యవస్థ కొంతవరకు దెబ్బతిన్నది. అందువల్ల స్కందగుప్తుడు వేయించిన బంగారు నాణాలలో అపద్రవ్యం 28% వరకు ఉంది.

స్కందగుప్తుని మరణానంతరం నరసింహగుప్త బాలాదిత్యుడు తిరిగి హూణులతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఈవిధంగా తరచుగా జరిగిన హూణ దండయాత్రలు గుప్త రాజ్య ఆర్థిక వ్యవస్థపై చావు దెబ్బ దీసింది. అందువల్ల ఇతడు ముద్రించిన కొన్ని బంగారు నాణాలలో 46% వరకు అపద్రవ్యం ఉంది. ఈ విధంగా నాణాలకు వాడిన లోహంలో నాణ్యత లోపించడం నాటి ఆర్థిక దుస్థితికి నిదర్శనం.

తీరాంధ్రదేశాన్ని పాలించిన విష్ణుకుండినులు రాగి మలామా చేసిన ఇనుప నాణాలను ముద్రించారు. నాణాలకు ఇనుము వాడడం నాటి రాజ్య ఆర్థిక దుస్థితికి నిదర్శనం కాక మరేమిటి?

నాణాలు విదేశీ వాణిజ్య సంబంధాలను కూడా తెలియజేస్తాయి. ఉదా: క్రీస్తుశకం 1,2 శతాబ్దాల నాటి రోమన్ బంగారు నాణాలు దక్షిణ దేశంలో (అరికమేడు మొదలైన చోట్ల) అసంఖ్యాకంగా బయల్పడ్డాయి. వీటిని బట్టి భారతదేశం రోమ్ మొదలైన విదేశాలతో వాణిజ్యం సాగించి లాభాలు గడించినట్లు తెలుస్తుంది. అంతేకాక, విదేశీ వాఙ్మయ ఆధారాల నుంచి తెలుస్తున్న రోమన్ - దక్షిణ భారత వర్తకాన్ని ఇవి ధృవీకరిస్తున్నాయి.

కుషాణుల నాణాల తులామానం, రోమన్ నాణాల మానంతో సరిపోతుంది. దీని వలన కుషాణులకు - రోమన్‌లకు మధ్య వాణిజ్య సంబంధాలుండేవని తెలుస్తున్నది. విదేశీ వ్యవహారాలలో ఇవి వినిమయ సాధనాలుగా అంగీకరించడానికి రోమన్ బంగారు నాణాల తులామానాన్ని కుషాణులు అనుకరించి ఉంటారు.

నాణాలు ప్రాచీన భారతీయుల విదేశీ సముద్రయానాన్ని ఎరుక పరుస్తాయి. ఉదా: ఆంధ్రశాతవాహనులకు నౌకాబలం ఉండేదని, వారు దూరతీరాలలో వ్యాపార సంబంధాలు పెట్టుకొన్నారని తెరచాపల నౌకా ముద్రలున్న వారి నాణాల వల్ల తేటతెల్లమవుతుంది. నౌకల వర్తకంతో పాటు మన మతం, మన సంస్కృతి, మన కళలు కూడా తూర్పు దేశాలకు ఎగుమతి అయినట్లు ఈ నాణాల వల్ల గ్రహించవచ్చు.

### 8.19.3 మత సంప్రదాయాలు :-

నాణాలు రాజులు లేక రాజవంశాలు అవలంభించిన మత విధానాలను కూడా తెలియజేస్తాయి. నాణాల మీదున్న దేవుళ్ళ బొమ్మలను, గుర్తులను అధ్యయనం చేసి, నాణాన్ని పరిశోధించినట్లయితే వివిధ మతాల ప్రాచీన చరిత్రను కొంత వరకు అవగతం చేసుకోవచ్చు. (3.1) కొన్ని సిధియన్, పార్థియన్, కుషాణ నాణాల మీద శివుడు, పార్వతి, గజలక్ష్మి మొదలైన హైందవ దేవతల ప్రతిమలున్నాయి. దీనిని బట్టి వీరు మొదట విదేశీయులైనప్పటికీ, కాల క్రమాన హిందూ సంప్రదాయాలను పుణికి పుచ్చుకున్నారని తెలియవస్తున్నది. (3.2) గుప్త సామ్రాట్టులు బ్రాహ్మణ మతాభిమానులు. ముఖ్యంగా విష్ణు భక్తులు. వారివి కొన్ని నాణాల మీద (రాజ ప్రతిమ చెక్కిన వైపు) రాజదండం మీద సాధారణంగా విష్ణువు వాహనం అయిన గరుడ పక్షిని చిత్రీకరించేవారు. ఈ నాణాలకు రెండో వైపున కల్పవృక్షం పట్టుకుని విష్ణువు సహధర్మచారి అయిన లక్ష్మీదేవి ఉండేది. ఈ నాణాలను బట్టి వారి ప్రధాన కులదైవం విష్ణువు అని వేరుగా చెప్పనవసరం లేదు. మొదటి కుమారగుప్తుని నాణాలను బట్టి అతని ఇష్టదైవం కార్తికేయుడని తెలుస్తున్నది. ఇతని నాణాల మీద కార్తికేయుడు లేదా కుమారస్వామి కెక్కువ ప్రాధాన్యమిచ్చాడు. ఇతడు ముద్రించిన కొన్ని బంగారు నాణాల మీద ఒకవైపు కార్తికేయుడు మయూర (నెమలి) వాహనం పైనను, మరొకవైపు రాజు మయూరానికి మేతవేస్తున్నట్లు ఉంటుంది. వెండి నాణాలలో గరుడుని స్థానంలో మయూరం కనిపిస్తుంది. కార్తికేయుని వాహనం మయూరం. అందుచేత అతడు ఆ దేవుడి వాహనాన్ని తన నాణాలపై ముద్రించి, తనకు ఆ దేవునిపై గల భక్తి ప్రపత్తులను చాటుకొన్నాడు.

### 8.19.4 రాజుల గుణగణాలు :-

నాటి రాజుల ఘనత, వ్యక్తిత్వం, అభిరుచి ఆయా రాజుల నాణాల వల్ల మనం తెలుసుకోగలుగుతున్నాం. అలహాబాద్ శాసనంలో సముద్రగుప్తుని పాలనా సంబంధమైన అనేక విషయాలు వెల్లడైనప్పటికీ వేరే ఒక బంగారు నాణెం దొరికినప్పుడే అతడు యాగం చేసిన సంగతి వెలుగులోకి వచ్చింది. నాణాలు రాజుల వినోదాలను లేక ప్రియకార్యాలను తెలియజేస్తాయి. ఉదా: గుప్త సామ్రాట్టుల వినోదాలు వారి నాణాలను బట్టి తెలుస్తున్నది. ఆ రాజుల యొక్క వినోదాల చిత్రణ - రాజు సింహాన్ని సంహరిస్తున్నట్లు,

రాజు పులిని చంపుతున్నట్లు, రాజు ఏనుగుపై స్వారీ చేస్తున్నట్లు - ముఖ్యంగా కనపడుచున్నది. వీణ వాయించే సముద్రగుప్తుని ప్రతిమ గల బంగారు నాణాలు అతని సంగీత పటిమను, అభిరుచిని చాటుతున్నాయి. మొగల్ చక్రవర్తి జహంగీర్ వేయించిన కొన్ని నాణాల మీద అతని పేరుతో పాటు అతని ప్రియతమ రాణి అయిన నూర్జహాన్ పేరు కూడా ఉంది. మరి కొన్ని నాణాల మీద అతడు చేతిలో మధుపాత్రతో కనపడతాడు. ఇతనికి తన రాణిమీద, మద్యం మీద ఉన్న ప్రేమాతిశయాలను ఈ నాణాలు వెల్లడి చేస్తున్నాయి.

ఇవే గాక నాణాలపై ముద్రించిన ప్రతిమలు, లాంఛనాలు ఇతర చిహ్నాలు ఆయా కాలాల ప్రజల కళాభిరుచికి నిదర్శనాలు. నాణాలపై ముద్రించిన దైవ ప్రతిమలు ప్రతిమా లక్షణ శాస్త్రానికి ఉపకరిస్తాయి. ఇంకా అప్పటి రాజులు ధరించే దుస్తులు, ఆభరణాలు, కిరీటాలు మొదలైనవి నాణాలపై ముద్రించిన రాజప్రతిమల్ని బట్టి గ్రహించగల్గుతున్నాము.

## 8.20 సారాంశము :-

కొన్ని ప్రాచీన నాణాల ముద్రణలో కొంతలోపం ఉన్నప్పటికీ నాణాలు చరిత్ర రచనలో ఎంతగానో తోడ్పడుతాయనేది నిర్వివాదాంశము. అయితే చరిత్రకారుడు నాణాల నుంచి సందర్భోచితంగా విషయం గ్రహించవలె. శాసనాల మీద ఉన్నట్లు నాణాల మీద విషయ వివరణ ఉండదు. కొన్నిటి మీద ముద్రలు అనాగరికంగాను, అస్పష్టంగాను ఉంటాయి. అందువల్ల విషయ గ్రహణంలో చరిత్రకారుల మధ్య భేదాభిప్రాయాలేర్పడే అవకాశమున్నప్పటికీ, శాసనాల కుండే అసత్య, అతిశయోక్తి దోషాలు నాణాలకుండవు. ఏమైనా నాణాలు గత చరిత్రను వివరించే (కొన్ని సందర్భాల్లో ఏకైక) ప్రతినిధులు. డి.డి. కోశాంబి పండితుడు అభిప్రాయపడినట్లు "సమకాలిక వాస్తవ చరిత్రను తెలుసుకొనడానికి పురావస్తు ఆధారాలలో శాసనాల కంటే నాణాలే ప్రధానమైనవి".

## 8.21 నమూనా ప్రశ్నలు :-

1. భారతదేశంలో నాణాల ప్రాచీనతను తెలపండి.
2. విద్ధాంక నాణాలపై లఘు వ్యాఖ్య వ్రాయుము.
3. శాతవాహనుల నాణెములను గూర్చి వ్రాయుము.
4. గుప్త రాజుల కాలం నాటి వరకు గల నాణాల చరిత్రను వివరించండి.
5. ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు నాణాలెట్లు తోడ్పడుతున్నాయి.
6. భారతదేశ చరిత్ర రచనకు నాణాల విలువను వివరించండి.

## 8.22 చదువదగిన గ్రంథాలు :-


| | | | |
|---|---|---|---|
| 1. | P.L. Gupta | : | Coins, New Delhi |
| 2. | D.D. Kosambi | : | Silver Punch Marked Coins (Essays) New Delhi. |
| 3. | శ్రీపతి నాయుడు & శ్రీ కృష్ణమూర్తి | : | పురావస్తు శాస్త్రము, తెలుగు అకాడమీ, హైదరాబాదు. |


**డా॥వి.వి. సుబ్బారెడ్డి**

పాఠం - 9

# వాస్తుకళ - తొలి దశ

## 9.0 లక్ష్యం :

మౌర్య, శుంగ, కుషానుల కాలం నాటి వాస్తుకళను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


9.1 పరిచయం

9.2 మౌర్యుల వాస్తుకళ

- 9.2.1. లౌకికపరమైన నిర్మాణాలు
- 9.2.2 మతపరమైన నిర్మాణాలు
  - 9.2.2.1 స్తూపాలు
  - 9.2.2.2 గుహాలయాలు
  - 9.2.2.3 ఏకశిలా స్తంభాలు
  - 9.2.2.4 శిల్పకళ

9.3 శుంగుల కాలం నాటి వాస్తుకళ

- 9.3.1 సాంచీ స్తూపం
- 9.3.2 బార్హుత్ స్తూపం

9.4 కుషాణుల నాటి వాస్తుకళ

- 9.4.1 మధుర ప్రాంతం
- 9.4.2 గాంధార ప్రాంతం

9.5 సారాంశము

9.6 నమూనా ప్రశ్నలు


## 9.1 పరిచయం :

దేవాలయాలు, స్తూపాలు, విహారాలు, గృహాలు, పట్టణాలు, కోటలు మొదలగు వాటి నిర్మాణక్రమం వివరించేది వాస్తు శాస్త్రము. కట్టడాల ఆకృతులు, వాటి నిర్మాణక్రమం, వాటివాటి ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాయి. ప్రాచీన కాలంలో భారతీయులు భవనాలను, ఆలయాలను ఉత్తమంగా నిర్మించడంలోను, వాటిని చాలా శోభాయమానంగా చిత్రకళా ఖండాలతో అలంకరించడంలోను వాసికెక్కినారు. చిత్రకళలో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. అవి శిల్పము, చిత్రలేఖనము. వాస్తవానికి వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలు మూడు ఒకదానికొకటి సంబంధించినవే కాని వేరు కావు. భారతీయులు కూడా ఈ మూడింటినీ పరస్పర అనుబంధ శాఖలుగానే భావించినారు.

సంగీత సాహిత్యాలలాగానే, వాస్తు చిత్రకళలను కూడా ప్రాచీన కాలంలో భారతీయులు ఎక్కువగా దైవ కార్యార్థమై వినియోగించినారు. అందుచేత ప్రాచీన భారతీయ వాస్తు చిత్ర కళారీతులు చాలావరకు మతపరమైనవే. భారతదేశము అనేక మతాలకు పుట్టినిల్లు. వీటిలో హైందవము, బౌద్ధము, జైనము ప్రధానమైనవి. ఈ మూడు మతాలు కాలక్రమేణ శాఖోపశాఖలుగా చీలినాయి. ఈ మత శాఖల ఆరాధనా పద్ధతులలోను, దేవ గృహ నిర్మాణ రీతులలోను భేదాలున్నాయి. ఈ విషయానికి సంబంధించి ప్రాచీన కాలంలో భారతీయులు అనేక గ్రంథాలు రచించినారు. వాటిలో ప్రధానంగా పేర్కొనవలసినవి మయమత, మానసార, సమరాంగణ సూత్రధరము, రూప మండనం, విష్ణుధర్మోత్తరం, శిల్ప రత్నం మొదలగునవి.

భారతదేశపు అత్యంత ప్రాచీన నిర్మాణాలను గురించి ప్రస్తావించేటప్పుడు ప్రధానంగా పేర్కొనవలసినవి హరప్పా, మొహంజాదారో, లోథాల్, కాలీబంగన్ లాంటి సింధూ నాగరికతా స్థావరాలలో లభించిన అవశేషాలు. సింధు నాగరకులు పట్టణ వాసులు. చుట్టూ ప్రాకారాలు, తిన్నగా తీర్చిదిద్దినట్లున్న వీధులు, ఉత్తమమైన నీటిపారుదల ఏర్పాట్లు సింధు పట్టణాల ప్రత్యేకతలు. సింధు నాగరకుల కట్టడాలలో మొహంజాదారోలో ఉన్న స్నానవాటిక, లోథల్‌లో ఉన్న నౌకాశ్రయము బహు ప్రసిద్ధమైనవి. సింధు ప్రజలు నిర్దుష్టమైన వాస్తు సూత్రాలను అనుసరించినట్లు తెలుస్తుంది. వీరి నిర్మాణాలన్నీ ఉపయోగాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మించినవే. వీరి నిర్మాణాలు మత సంబంధమైనవి కాదు. వీరు తను నిర్మాణాలకు కాల్చిన ఇటుకలు వాడారు. సింధు ప్రజలు శిల్పకళలో కూడా నేర్పరులు. వీరి శిల్పకళా కౌశలానికి తార్కాణాలు మొహంజాదారోలో లభించిన నాట్యకత్తె కాంస్య ప్రతిమ, ధ్యాన నిమగ్నుడైన ఒక పురుష పుంగవుని ఊర్ధ్వ కాయము, హరప్పాలోని శిలా నిర్మితాలైన మనుష్యుల మొండేలు రెండు. ఈ మూర్తుల రూప కల్పన, శిల్పులు వాటి మీద చూపిన అలంకరణలు ఇప్పటి భారతీయ సంప్రదాయాలను స్ఫురణకు తెస్తున్నాయి. సింధు స్థావరాలలో మట్టి బొమ్మలనేకం కనిపించాయి. మట్టితో మానవాకారాలు, జంతువుల బొమ్మలు విరివిగా తయారు చేసినారు. జంతువుల బొమ్మలలో కొన్ని సహజత్వం ఉట్టిపడుతూ చూడముచ్చటగా ఉంటాయి. సింధు నాగరకుల కళాత్మక సృష్టిలో వారి ముద్రికలు అతిప్రసిద్ధమైనవి. అవి స్టియటైట్ అనే మెత్తని రాతితో చేసిన చతురస్రాకారపు బిళ్లలు. వాటికొక పక్క జంతువుల స్వరూపాలు అతి చతురతతో చెక్కి ఉంటాయి. ఒక రకపు ముద్రికలలో యోగ భంగిమలలో కూర్చున్న మూడు శృంగాలు గల మూర్తీ, దాని చుట్టూ కొన్ని జంతువులూ ఉన్నాయి. ఈ మూర్తి పశుపతి శివుడే అని మార్షల్ అభిప్రాయం.

సింధు నాగరికత పతనానంతరము మళ్ళీ మౌర్య సామ్రాజ్యమేర్పడే వరకూ చెప్పదగిన వాస్తు శిల్ప కళా ఖండాలేమీ కన్పించవు. వేద కాలంలో వెదురు, దారువు, మట్టి, రెల్లు, ఆకులతో నిర్మాణాలు జరిగేవని, అవి ఆదిమ రీతిలో ఉండేవని తెలుస్తుంది. కాని నాటి నిర్మాణాలన్నీ అశాశ్వతమైనవి కాబట్టి నేడు అవి మనకు లభించుట లేదు. అయితే నాటి నిర్మాణాల వివరాలు ఋగ్వేదం, మలి వేదాలు, బ్రాహ్మణాలు, సూత్ర సాహిత్యం, ఇతిహాసాలు మొదలైన ప్రాచీన గ్రంథాలను బట్టి గ్రహించవచ్చు. క్రీ.పూ. 5వ శతాబ్దం నాటి బౌద్ధ విమర్శకుడు ధమ్మపాలుడు కూడా మహాగోవిందు అనే వడ్రంగి అనేక రాజధానుల గృహాలను నిర్మించినట్లు ప్రస్తావించాడు. క్రీ.పూ. 8వ శతాబ్ది నాటి సుల్వ్ శాస్త్రాలు యజ్ఞ వేదికల నిర్మాణం గురించి కొన్ని సూత్రాలను నిర్దేశించాయి. ఋగ్వేదం లౌకిక నిర్మాణాల గురించి మలి వేదాలు, బ్రాహ్మణాలు మత నిర్మాణాల గురించి తెలుపుతున్నాయి. సాంఖ్యాయన గృహ్య సూత్ర, అశ్వలాయన గృహ్య సూత్రాలలో గృహ నిర్మాణ సూత్రాల గురించి ఉంది. ఇతిహాసాలలో నగరాలు, అంతఃపురాలు, సభామండపాలు, కోటలు మొదలైన వాటి ప్రస్తావన ఉంది. ఈ కాలంలో స్థపతులను గౌరవించేవారు. విశ్వకర్మ, మాయ అనేవారు దేవతలు, అసురుల వడ్రంగులుగా ఇతిహాసాల్లో ప్రస్తావించబడి ఉంది. కాని వేదకాలపు శిల్పాలేవి లభించలేదు.

## 9.2 మౌర్యుల వాస్తు కళ :

భారతదేశంలో సమగ్రమైన వాస్తు చరిత్ర మౌర్యుల కాలంలోనే ఆరంభమవుతుంది. ఈ కాలంలో భారత వాస్తు, శిల్ప కళలు ఎంతో అభివృద్ధి పొందినాయి. మౌర్యుల నాటి కట్టడాలను లౌకికమైనవి, మత సంబంధమైనవి అని రెండు రకాలుగా

విభజించవచ్చు.

## 9.2.1 లౌకికపరమైన నిర్మాణాలు :-

మౌర్య చంద్రగుప్తుని ఆస్థానంలో ఉన్న మెగస్తనీస్ పాటలీపుత్రాన్ని పరిభా ప్రాకారాదులు, అనేక ప్రవేశ ద్వారాలు కలిగి బహు విస్తృతమై ఉన్న పట్టణంగా వర్ణించినాడు. కుమ్రాహర్ ప్రాంతంలో చంద్రగుప్తుని అంతఃపురాన్ని కనుగొన్నారు. బులందీబాగ్ వద్ద నగరకోట గోడ కనిపించింది. ఈ ప్రాంతాల తవ్వకాలను స్పూనర్ పండితుడు నిర్వహించాడు. కుమ్రాహర్ సభా మండపం 80 స్తంభాలను కలిగి ఉన్నది. ఈ స్తంభాలు చాలావరకు అగ్ని ప్రమాదంలో శిథిలమైనాయి. ఈ స్తంభాలు బంగారు ద్రాక్ష తీగలతో వెండి పక్షులు, ఆకుల అలంకరణతో నగిషీ చేయబడి ఉండేదని పాహియాన్ రచనల వల్ల తెలుస్తుంది. సభామండపానికి దక్షిణాన దారువుతో నిర్మించబడిన ఏడు వేదికలు తవ్వకాల్లో బయల్పడ్డాయి. బులందీబాగ్‌లో దారువుతో నిర్మించబడిన కోట గోడ బయల్పడింది. పాటలీపుత్రం వద్ద కూడా ఇటువంటి కోట గోడను స్పూనర్ కనుగొన్నాడు.

## 9.2.2 మతపరమైన నిర్మాణాలు :-

మౌర్యుల నాటి మతసంబంధమైన కట్టడాలు అనేకం ఉన్నాయి. వీటిలో స్తూపాలు, గుహాలయాలు, ఏకశిలా స్తంభాలు పేర్కొనదగినవి.

### 9.2.2.1 స్తూపాలు :-

బుద్ధుడు లేదా బౌద్ధ మతాచార్యుల అవశేషాలపై నిర్మించబడిన కట్టడాలను స్తూపాలంటారు. ఇవి ఇసుక, మట్టి, రాయి లాంటి పదార్థాలతో అర్ధగోళాకృతిలో దిబ్బలాగా నిర్మించబడ్డాయి. అశోకుడు 84 వేల స్తూపాలను నిర్మించినట్లు ప్రతీతి. ఇవి సాంచి, సారనాధ్, ప్రయాగ, అమరావతి మొదలైన చోట్ల ఉన్నాయి. వీటిలో సాంచి స్తూపం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అశోకుడు దీనిని ఇటుకలతో నిర్మించాడు. వేదిక, అండము, హార్మికము, ఛత్రము, ప్రాకారము, ప్రదక్షిణాపథం అను అంశాలతో కూడి ఉంటుంది. ప్రాకారము దారు నిర్మాణము.

### 9.2.2.2 గుహాలయాలు :-

భారతదేశంలో గుహాలయ నిర్మాణానికి ఒరవడి పెట్టింది మౌర్యులు. ఈ గుహాలయాలు భిక్షువుల నివాసానికి లేక మత సమావేశాలకు ఉద్దేశింపబడింది. అంతేగాక ఈ గుహాలయాలు ప్రార్థనా మందిరాలుగా కూడా ఉపయోగపడ్డాయి. మౌర్య అశోకుడు బీహార్‌లోని బరాబర్ కొండలలో అజీవకులనే మతశాఖ వారి కోసం గుహాలయాలను తొలిపించాడు. అతి కఠిన శిల నుంచి శిలా ఖండానికి నేరుగా తొలిచిన ఈ గుహలు మొత్తం నాలుగున్నాయి. ఈ గుహలు బండిగూడు ఆకారంలో ఉంటాయి. వీటిలోపలి కుడ్య భాగాలు అద్దం లాగా మెరిసే నునుపును కలిగి ఉన్నాయి. ప్రవేశ మార్గం సమ లంబ చతుర్భుజ ఆకారంలో ఉన్నాయి. ఈ గుహల ఒకదానికొకటి కలిపే మార్గ భాగం పై కప్పు మాత్రం సమతలంగా ఉన్నది. ఈ గుహలలో సుదామ, లోమశ రుషి గుహలు అతి ప్రాచీనమైనవి. సుదామ గుహ ముందు భాగం దీర్ఘ చతురస్రాకారంలోను, వెనుక భాగం వలయాకృతిలోను మలచబడింది. లోమశ రుషి గుహ ముందు భాగం దీర్ఘ చతురస్రాకారంగాను, వెనుకభాగం ఆండాకృతిలో మలచబడింది. గుహ ముఖతలం ఆర్చి వలె తీర్చిదిద్దబడింది. ద్వారానికి కప్పుకు మధ్యలో గల ఏనుగు శిల్పాలు జీవం పోసుకున్నట్లు కన్పించడం విశేషం. ఈ గుహాలయాల్లో కొయ్య నిర్మాణాల అనుకరణ కన్పిస్తుంది.

బీహార్‌లోనే గయకు సమీపంలో నాగార్జున గుహలున్నాయి. వీటిని అశోకుని మనుమడు దశరథుడు తొలిపించాడు. వీటిలో గోపికా గుహ పేర్కొనదగింది. ఇది 44 అడుగుల పొడవు, 19 అడుగుల వెడల్పు, 10 అడుగుల ఎత్తు కలిగి ఉంది. గయకు సమీపంలోనే సీతామర్హి గుహ ఉంది. ఇది కూడా మౌర్యుల కాలంనాటిదే. ఈ గుహాలయాలు నాటి కళాకారుల నైపుణ్యానికి, పనితనానికి నిదర్శనాలు. ఈ గుహాలయాల వాస్తువే రాబోయే యుగాల చైత్య గుహాలయాల నిర్మాణానికి మార్గదర్శకమైంది.

### 9.2.2.3 ఏకశిలా స్తంభాలు :-

మౌర్యుల నాటి కళాఖండాలలో ఏకశిలా స్తంభాలు ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించినాయి. ఈ స్తంభాలు బుద్ధుని జీవితానికి సంబంధించిన ముఖ్య ప్రదేశాలలో, బౌద్ధమతానికి ప్రాముఖ్యం ఉన్న స్థలాల్లో నిర్మించబడ్డాయి. వీటిలో కొన్నింటి మీద రాజ శాసనాలు చెక్కి ఉన్నాయి. అశోకుని స్తంభాల సంఖ్య మొత్తము 30. వీటిలో నేడు 10 మాత్రమే దర్శనమిస్తున్నాయి. వీటిలో బకిరా, రాంపూర్వా, తారియ నందనఘర్, రుమ్మిండై, సంకిస, సారనాద్, సాంచీ స్తూపాలు పేర్కొనదగినవి. ఈ స్తంభాలు కొన్ని తెల్లటి సున్నపు రాళ్ళతోను, మరికొన్ని లేత పసుపు వర్ణ సున్నపు రాతితోను తయారు చేశారు. తెల్ల వర్ణం కలిగినవి మధుర ప్రాంతంలో, పసుపు వర్ణం కల్గినవి చునార్ ప్రాంతంలో లభ్యమవుతుంది. ఈ స్తంభాలు సాధారణంగా 50 అడుగుల ఎత్తుతో, 50 టన్నుల బరువు కలిగి ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానంలో, కళా నైపుణ్యంలో, రాతిని మలచటంలో నాటి కళాకారులు అపూర్వమైన ప్రజ్ఞను కనబరచినారు.

అశోక స్తంభాలను మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి: ఆధారం కోసం భూమి లోపల ఉన్న పునాది, కాండం, కిరీటం. ఆధారం కోసం భూమి లోపల ఉన్న తొలి స్తంభ భాగంపై అందమైన నెమళ్ళ బొమ్మలు మలచబడ్డాయి. ఇది బహుశ మౌర్య చంద్రగుప్తుని తండ్రి మయూర పోషకుడని తెలపడానికి చెక్కి ఉండవచ్చని కొందరి పండితుల అభిప్రాయం. మధ్య భాగం లేదా కాండం గుండ్రంగా ఉంటుంది. ఈ భాగం నునుపుతేలి లోహం వలె కన్పిస్తుంది. కిరీటంలో మూడు భాగాలు కలవు. అవి అధోముఖ పద్మం, ఫలకం, జంతు శిల్పాలు. ఇవి ఒకే రాతిపై చెక్కబడ్డాయి. కాండంపైన గల కిరీటంలో మొదటి భాగము అధోముఖ పద్మం. పాశ్చాత్య పండితులు దీనిని పర్షియన్‌ల గంట అని పేర్కొన్నారు. ఈ పద్మం దాని సౌందర్యానికి, మృదుత్వానికి, ఉసాస్వాదనకు చెప్పుకోదగినది. అధోముఖ పద్మంపై గల ఫలకం గుండ్రంగా లేదా చతురస్రంగా లేదా దీర్ఘ చతురస్త్రంగా ఉంటుంది. ఫలకం చుట్టూ అందమైన పువ్వులు, పక్షులు, జంతువుల బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. ఈ ఫలకం మీద గల జంతువుల నడుమ ధర్మ చక్రం మలచబడింది. ఫలకం మీద జంతు శిల్పాలు కూర్చున్నట్లు లేదా నిలబడినట్లు మలచబడింది.

బకిరా స్తంభ కాండము చెప్పుకోదగిన పొడవు లేదు. ఈ స్తంభ ఫలకం దీర్ఘ చతురస్రాకారంగా ఉండి శిఖరంపై భాగంలో సింహం ఉంది. స్తంభ ఫలకం చుట్టూ ఎటువంటి అలంకరణ లేదు. రాంపూర్వ స్తంభము 44 అడుగుల 10 అంగుళాల పొడవు ఉంది. ఈ స్తంభ ఫలకం గుండ్రంగా ఉంది. దీనిపై అలంకరణ ఉంది. తారియా నందన ఘర్ స్తంభ కిరీటంలో సింహముంది. రుమ్మిండై కిరీటంలో అశ్వముంది. మౌర్యుల నాటి స్తంభాలలో ప్రముఖమైంది సారనాధ్ స్తంభము. ఈ స్తంభ కిరీటంలో నాలుగు సింహాలు గలవు. ఫలకం మీద సింహం, ఏనుగు, వృషభం, అశ్వాల శిల్పాలు మలచబడి ఉంది. ఈ నాలుగు జంతువులను నాలుగు దిక్కులకు రక్షకులుగా బౌద్ధ గ్రంథాలు వర్ణిస్తున్నాయి. ఏనుగు తూర్పు దిక్కుకు, వృషభం పశ్చిమ దిక్కుకు, సింహం ఉత్తరానికి, అశ్వం దక్షిణానికి రక్షకులు అని ఈ గ్రంథాలంటున్నాయి వీటి మధ్య ధర్మచక్రం ఉండటం వల్ల నాలుగు దిక్కులా ధర్మాన్ని ఈ జంతువులు కాపాడుతాయి అనవచ్చు. మలచిన తీరులో, సాంకేతిక విజ్ఞానంలో ఇవి మచ్చు తునకలు.

## 9.2.2.4 శిల్ప కళ :-

మౌర్యుల నాటి శిల్ప చిత్రాలు అనేకం లభించాయి. మౌర్య పూర్వయుగపు శిలా శిల్ప ఖండాలేమీ కన్పించకపోవడం చేత, సింధు నాగరికత తరవాత, శిలలను చిత్తరువులుగా చెక్కడానికి పూనుకున్నది మౌర్యులే అని భావిస్తున్నారు. మౌర్యుల కళా ఖండాలలో ప్రధానంగా పేర్కొనవలసినవి అశోకుని ఏకశిలా స్తంభాలు. ఇవి నునుపు తేలి, మెరుస్తున్నట్లు కాండము, అగ్రభాగాన సింహ ప్రతిమగాని, వృషభ ప్రతిమ గాని ఉండడం ఈ స్తంభాల కుండే ప్రధాన లక్షణాలు. సారనాథ్ స్తంభం పైన మాత్రము సింహ ప్రతిరూపాలు నాలుగున్నాయి. మరి ఏ ఇతర దేశ శిల్పంలో ఇంత సుందరమైన, ప్రాచీనమైన జంతు శిల్పాలను చూడజాలమని, ఇది సహజత్వంతో నిండినదని, ఖచ్చితమైన కొలతలు కలిగి, అతి సూక్ష్మమైన విషయాలు కూడా సమగ్రంగా చెక్కబడిందని స్మిత్ పండితుడంటాడు.

ఒరిస్సాలోని ధేళిలో చెక్కిన ఏనుగు శిల్పం గుండ్రంగా శాసనం మీద ఉంది. ఇది చెక్కబడిన విధానం ఏనుగు గుహ నుంచి బయటకు వస్తున్నట్లుంది. రాతితో చెక్కబడిన ఉన్నతమైన ఏనుగు గంభీర ఆకారంలో, అంగ సౌష్ఠవంతో, ముఖంలో చూపబడిన మృదువైన భావాలు మౌర్యుల నాటి శిల్పకళలో అత్యున్నతమైనవిగా పరిగణించబడినాయి. నిర్మాణతలో, గంభీర ఆకృతిలో, అంగ సౌష్టవం చూపటంలో, ముఖంలోని మృదువైన భావ ప్రకటనలో ఈ శిల్పానికి సాటి లేదని నిహారంజన్‌రే పేర్కొన్నాడు.

మౌర్యుల కాలపు యక్ష ప్రతిమలు కూడా కొన్ని చోట్ల లభించినాయి. ఆనాడు యక్ష పూజలు జరుగుతూ వుండేవనడానికి ఇవి తార్కాణాలు. ఈ ప్రతిమలను చూడగానే మనకు తోచేది అవి స్తబ్ధులు, స్థూలకాయాలు అని. అంతేగాక ఇవి శిలా ప్రతిమలైనప్పటికీ కర్ర బొమ్మలను పోలి ఉంటాయి. దీదర్ గంజ్ అనే చోట లభించిన యక్షిణీ ప్రతిమలో మాత్రము జడత్వం లోపించి కొంత అభినయము, స్త్రీ సహజమైన మృదుత్వం కనిపిస్తున్నాయి. ఈ యక్ష, యక్షిణీ ప్రతిమలు తరవాత కాలపు శిల్ప రీతులకు కొంతవరకు మార్గదర్శకమైనాయి. మౌర్యుల కాలంనాటి మట్టి బొమ్మలు కూడా అనేకం లభించాయి. అహిచ్ఛత్రంలో అమ్మతల్లి మట్టి బొమ్మలు లభించాయి.

తమ పోషకుల ఆధిపత్యాన్ని, అధికారాన్ని చూపడానికి మాత్రమే మౌర్య శిల్ప కళ పరిమితమైందని అనిపిస్తుంది. మౌర్య యుగపు స్తంభాలు, జంతు శిల్పాలు ఒంటరిగా, విడిగా ఉన్నట్లు ఈ కళ కూడా ఒంటరిగా ప్రత్యేకంగా ఉంటుందని కొందరి పండితుల భావన.

## 9.3 శుంగుల కాలం నాటి వాస్తు కళ :-

మౌర్యుల తరవాత తూర్పు భారతదేశంలో శుంగులు రాజ్యమేలినారు. వీరి వాస్తు శిల్పకళకు సాంచి, బార్హుత్ ముఖ్య కేంద్రాలు. వీరి శిల్ప కళ మౌర్యుల రీతికి భిన్నమైందే గాక విదేశీ ప్రభావం లేనిది. వీరి కాలంలో బౌద్ధ స్తూపాల నిర్మాణ కార్యక్రమం జరిగింది.

## 9.3.1 సాంచీ స్తూపం :-

భారతదేశంలో ఉన్న బౌద్ధ స్తూపాలన్నింటిలోను పేరెన్నికగన్నది నేటి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సాంచీ స్తూపం. శాసనాల ద్వారా సాంచీ అసలు పేరు 'కాకనదబోట' అని తెలుస్తుంది. అశోకుని కాలంలో సాంచీ ప్రసిద్ధ బౌద్ధ కేంద్రమైనట్లు ఇచట లభించిన శాసనాల వల్ల గ్రహించవచ్చు. విదిశ నగరానికి సమీపంలో ఉన్నందున సాంచీకి ప్రాముఖ్యత పెరిగింది. సాంచీని

బుద్ధుడు దర్శించలేదు. కాని విదిశలోని ఒక వ్యాపారస్తుని కుమార్తెను అశోకుడు వివాహమాడినాడు. వీరికి జన్మించిన మహేంద్రుడు బౌద్ధ మత ప్రచార నిమిత్తం సింహళం వెళ్తూ ఇచట ఒక నెల రోజుల పాటు విడిది చేశాడు. ఈ కాలంలోనే అశోకుడు ఇచట స్తూప నిర్మాణం చేపట్టి ఉండవచ్చు. సాంచీలోని 7 స్తూపాలలో నేడు మూడు స్తూపాలు మాత్రమే కన్పిస్తున్నాయి. వీటిలో 1వ సంఖ్య గల స్తూపమే మహాచైత్యం. ఈ స్తూప దక్షిణ ద్వారం ముందు అశోక స్తంభం గలదు. ప్రముఖ వర్తక కేంద్రమైన విదిశ నగరం సాంచీకి సుమారు 8 కి.మీ దూరంలో ఉండడం చేత, విదిశ వర్తకులు సాంచీ బౌద్ధ సంస్థలకు పెద్ద ఎత్తున దానధర్మాలు చేశారు. ఫలితంగా సాంచీ పరిపూర్ణమైన బౌద్ధ క్షేత్రంగా వర్ధిల్లినది.

అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ 1851లో శాస్త్రీయ పద్ధతిలో ఉత్ఖాతనాలు జరిపి 2,3 సంఖ్య గల స్తూపాల నుంచి అస్తికల బరిణెలను వెలికి తీశాడు. వీటిలో 3వ సంఖ్య గల స్తూపంలో బుద్ధుని ముఖ్య శిష్యులైన సారిపుత్రుని, మౌద్గలాయనుని అస్థికలు నిక్షిప్తమై ఉన్నాయి. కన్నింగ్‌హామ్ 1854లో 'భిల్సాతోప్స్' అను పేరుతో ఒక గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథంలో సాంచీలోని 7 స్తూపాలతో బాటు ఇతర సమీప ప్రాంతాల స్తూపాల వివరం గలదు. కన్నింగ్ హామ్ తరవాత మేజర్ కూలే అను పండితుడు సాంచీ స్తూపాల పునరుద్ధరణ, పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టినాడు. మార్షల్ కూడా ఇచట ఉత్ఖాతనాలు జరిపి, పరిశోధనలు చేయడమేగాక ఇచట కట్టడాలకు మరమ్మత్తు చేశాడు. సాంచీ గొప్పతనాన్ని చాటింది మార్షల్ పండితుడే.

సాంచీ మహా స్తూపాన్ని అశోకుడు నిర్మించాడు. ఇది ఇటుకల నిర్మాణం. ఆ తరవాత శుంగుల కాలంలో ఈ స్తూపం చుట్టూ రాతి నిర్మాణం చేసి విస్తృతపరిచారు. ఈ నూతన నిర్మాణం మౌర్యుల నిర్మాణానికి రెండింతలయింది. ఇది నేడు 120 అడుగుల వ్యాసం, 54 అడుగుల ఎత్తు కలిగి ఉన్నది. అర్ధగోళాకృతిలో ఉన్న ఈ స్తూప అండం చుట్టూ దానిని ఆనుకొని 16 అడుగుల ఎత్తు వరకు వేదిక వుంది. వేదికపైన చుట్టూ ఒక చిన్న శిలా ప్రాకారముంది. ఫలితంగా వేదికపైన ప్రదక్షిణాపథం ఏర్పాటయింది.  వేదికపైకి చేరుకోవడానికి మెట్ల వరుస ఉంది. అండంపైన హార్మికం, దాని మధ్య ఛత్రయష్ఠి ఉంది. హార్మికం చుట్టూ కూడా శిలా ప్రాకారం గలదు. వేదిక చుట్టూ కొంత దూరంలో శిలా ప్రాకారం, దానికి నాలుగు వైపులా నాలుగు తోరణ ద్వారాలు వున్నాయి. వేదిక, శిలా ప్రాకారానికి మధ్య గల స్థలమే ప్రదక్షిణా పథం. ఈ తోరణ ద్వారాలను ఆంధ్ర శాతవాహనులు నిర్మించారు. దారువుతో అశోకుడు నిర్మించిన ప్రాకారం పాడు కాగా శుంగ, శాతవాహన కాలంలో దానిని రాతితో నిర్మించినట్లు పండితుల భావం. తోరణాలలో దక్షిణ దిక్కున గలది మొదట నిర్మించబడింది. దీని తరవాత ఉత్తరం వైపున గలది నిర్మించబడింది. తరవాత తూర్పు, పశ్చిమ తోరణాలు నిర్మించబడ్డాయి. ఈ తోరణాలన్నీ ఒకే రీతిలో గలవు. ప్రతి తోరణం 34 అడుగుల ఎత్తు ఉంది. ప్రతి తోరణానికి రెండు నిలువు స్తంభాలు మూడు అడ్డ దూలాలు గలవు. అడ్డ దూలాల చివరి భాగం స్ప్రింగ్ ఆకృతిలో గలవు.

సాంచీ మహాస్తూప తోరణ ద్వారాలపైన అద్భుత శిల్ప సంపద గలదు. ఈ శిల్పాలన్నీ స్వల్పోల్బణ శిల్పాలు. ఇచటి శిల్పాలలో మలచడంలో విదిశకు చెందిన దంత శిల్పులు పాల్గొన్నట్లు శాసనాలను బట్టి తెలుస్తుంది. ఇచటి శిల్పాలన్నీ దేశీయ సాంప్రదాయాలకు అనుగుణంగా తయారైనవి. ఇచటి శిల్పాలు గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ప్రకృతికి అతి సన్నిహితంగా ఉంటాయి. ఈ శిల్పాల ప్రత్యేకత నిరాడంబరం, సహజ సౌందర్యం. ఇచటి శిల్పాలలో పేర్కొనదగినవి బుద్ధుని జీవిత విశేషాలు, జాతక కథలు, చారిత్రక దృశ్యాలు, యక్షయక్షిణీ శిల్పాలు, మిధున శిల్పాలు, జంతువులు, పక్షులు, లతలు, పుష్పాలు. ఇచటి యక్షిణీ ప్రతిమలలో చైతన్యము, అంగాల పూర్ణ సౌష్టవము గోచరిస్తాయి. మూర్తుల రూప కల్పనలోను, చెక్కుడు పనిలోను ఈ కాలపు శిల్పులు ఒక పరిణతి సాధించారు. జాతక కథల, బుద్ధుని జీవిత ఘట్టాలు చిత్రీకరణలో బార్హుత్ కంటే అభివృద్ధి కనిపిస్తుంది.

### 9.3.2 బార్హుత్ స్తూపం :-

శుంగుల కాలం నాటి కట్టడాలలో ప్రధానంగా పేర్కొనవలసినది బార్హుత్ స్తూపము. ఈ స్తూపాన్ని మొదట అలెగ్జాండర్ కన్నింగ్ హాం కనుగొన్నాడు. ఈ స్తూప నిర్మాణ కార్యక్రమము మౌర్యుల కాలంలోనే ఆరంభమైనా, వాటికొక స్థిరమైన ఆకారమేర్పడింది. శుంగుల కాలంలోనే, స్తూపము ప్రధాన భాగం అండము. ఇది గోళాకృతిలో ఉంటుంది. అండం చుట్టూ దాన్ని ఆనుకొని కొంత ఎత్తు వరకూ వేదిక ఉంటుంది. దాని చుట్టూ శిలా ప్రాకారము, రాతి తోరణాలు ఉంటాయి. వేదిక, శిలా ప్రాకారాల మధ్య భాగము ప్రదక్షిణా పథము. అండము మీద హార్మికము, దాని మధ్య ఒక ఛత్రయష్టి ఉంటుంది. బార్హుత్ స్తూపము ఈ వర్ణించిన ఆకృతినే పోలి ఉంటుంది. స్తూపము శిధిలమై పోగా తోరణమూ, ప్రాకారంలో కొంత భాగము మాత్రము కలకత్తాలోని వస్తు సంగ్రహాలయంలో భద్రపరచి ఉంచినారు. బార్హుత్ స్తూప ప్రాకార తోరణాల మీద ఎంతో శిల్ప సంపద కనిపిస్తుంది. వీటి మీద చెట్లు, లతలు, యక్ష, యక్షిణీ మూర్తులు చిత్రించి ఉన్నాయి. ప్రాకార స్తంభాల మీద బుద్ధుని జాతక కథలు చిత్రించిన కపాటాలున్నాయి. బార్హుత్ స్తూపం మీద బుద్ధుని మనుష్య రూపంలో చిత్రించలేదు. ఆయన ఉనికిని తెలపడానికి ధర్మ చక్రము, బోధి వృక్షము, వజ్రాసనం, పాదుకలు, ఛత్రము ఉపయోగించినారు.

## 9.4 కుషాణుల నాటి వాస్తు కళ :-

కుషాణుల కాలంలోవాస్తు, శిల్ప కళలు సాధించిన అభివృద్ధికి మధుర, గాంధార ప్రాంతాలలో లభించిన కళాఖండాలే సాక్షి. కుషాణుల కళాసృష్టిలో రెండు విభిన్న సంప్రదాయాలున్నాయి. ఇందులో మొదటిది మధుర సాంప్రదాయము. ఇది బార్హుత్, సాంచీల ననుసరించి ఉంటుంది. ఇక రెండో దానికి నెలవు గాంధారము. ఇక్కడి కళా సృష్టిలో రోమన్ రీతుల ప్రభావం కనపడుతూ ఉంటుంది.

### 9.4.1 మధుర ప్రాంతం :-

మధురలో ఉన్న కుషానుల నాటి కట్టడాలన్నీ ధ్వంసం కావడం చేత ప్రస్తుతం వాటి నిదర్శనాలు కన్పించవు. బార్హుత్, సాంచీల లాగా ఇక్కడా స్తూప నిర్మాణ కార్యక్రమం సాగిందనడానికి తగిన ఆధారాలున్నాయి. మధురలో బుద్ధ ప్రతిమలతో బాటు, యక్షిణి బొమ్మలు లభించాయి. సుర్క కోటల్ ప్రాంతంలోని పర్వతంపై కనిష్కుడు నిర్మించిన ఆలయాలున్నాయి.

### 9.4.2 గాంధార ప్రాంతం :-

గాంధార ప్రాంతంలో కనిష్కుని పోషణలో అనేక స్తూపాలు, విహారాలు నిర్మించబడినాయి. గాంధార స్తూపాల రూప విశేషాదులు కైలర్ ప్రాంతంలో ఉన్న ఆలీమజీద్ స్తూపంలో గోచరిస్తాయి. గాంధార స్తూపాలకు బార్హుత్, సాంచీల లాగ కాక నలుచదరపు పీఠాలు ఉండేవి. అండము కేవలం అర్ధగోళాకృతిగా కాక దీర్ఘతమమై, వర్తులాగ్రమో, లేక తీక్షణాగ్రమో కలిగి ఉండేవి. ఆలీమజీద్ స్తూపానికి రెండంతరువుల పీఠం ఉంది. పీఠ ముఖ భాగాలకు కుడ్యస్తంభాలు, ప్రతిమానికేతనాలు అలంకరిస్తున్నాయి. అలంకరణలో పాశ్చాత్య రీతులు కనిపిస్తున్నాయి. పెషావర్ సమీపంలో ఉన్న తాఖ్తిబాహై అనే చోట ఒక పెద్ద బౌద్ధారామం బయటపడింది. చైనా యాత్రికులు అత్యద్భుతమని వర్ణించిన కనిష్క నిర్మితమైన స్తూపం మనకిప్పుడు కనపడదు. ఆ స్థలంలో ఒక మట్టి దిబ్బ మాత్రం మిగిలి ఉంది. ఆఫ్ఘనిస్తాన్‌లోని గుల్దారాలో చిత్రలేఖనాలు గల స్తూప, విహారాలున్నాయి. స్వాత్ లోయలో స్తూప రూప శిల్పం ఉంది. పెషావర్ దగ్గరలో వున్న షాజీకిధేరి వద్ద గాంధార రీతి స్తూపం గలదు. ఇది 300 అడుగుల వ్యాసాన్ని, 700 అడుగుల ఎత్తును కలిగి ఉంది. దీనికి 13 అలంకార ఛత్రాలున్నాయి. నేడు ఇది శిధిలమై ఉన్నది. కాని ఈ స్తూప శిధిలాలలో లభించిన కంచు శిల్పం అద్భుతంగా ఉంది. ఆఫ్ఘనిస్థాన్‌లోని బిమరాన్‌లో కెంపులు పొదిగిన పై పెట్టె వంటిది లభించింది. దీని పక్కలలో

తోరణాల వంటి విభాగాలు, వాటిలో బుద్ధుని శిల్పం ఉన్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌లోని హడ్డ, ఫోన్ డుకిస్థాలోని బౌద్ధ నిర్మాణాలలో బౌద్ధ చిత్రలేఖనాలున్నాయి.

## 9.5 సారాంశము :-

వాస్తుకళలోని తొలిదశ మౌర్యులు లౌకికపరమైన నిర్మాణాలు, మతపరమైన నిర్మాణాలు గావించినారు. శృంగులు వాస్తుకళలో సాంచి స్తూపం బార్హుత్ స్తూపం నిర్మాణాలు నిదర్శనాలు. మౌర్యులు, శృంగులు తరువాత భారతదేశములో వాస్తుకళలకు కృషి చేసినవారు కుషాణులు. వారి పాలనలో మధుర, గాంధార ప్రాంతాలలో లభించిన కళాఖండాలే వారు వాస్తుకళలో సాధించిన అభివృద్ధికి సాక్షి.

## 9.6 నమూనా ప్రశ్నలు :-

1) మౌర్యుల వాస్తుకళ గురించి వివరింపుము.

2) సాంచీ స్తూప నిర్మాణం గురించి వివరింపుము

3) బార్హుత్ స్తూపం

4) గాంధార ప్రాంత స్తూపాలు

**డా॥ వి.కె. మోహన్**

**పాఠం - 10**

# బౌద్ధ స్తూపాలు - ఆంధ్ర

## 10.0 లక్ష్యం :

ఆంధ్రలోని బౌద్ధ స్తూపాలు, ప్రత్యేకించి అమరావతి స్తూపాన్ని గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


10.1 పరిచయం

10.2 ఆంధ్రలోని బౌద్ధ స్తూపాలు

10.2.1. భట్టిప్రోలు

10.2.2 గుడివాడ

10.2.3 ఘంటసాల

10.2.4 గుంటుపల్లి

10.2.5 రామతీర్థం

10.2.6 శాలి హుండం

10.2.7 శంకారం

10.2.8 అల్లూరు

10.2.9 గుమ్మడిదుర్రు

10.2.10 కొండాపురం

10.2.11 బావికొండ

10.2.12 మజ్జిగూడెం

10.2.13 గోలి

10.2.14 గరికపాడు

10.2.15 నాగార్జున కొండ

10.2.16 జగ్గయ్యపేట

10.2.17 చందవరం

10.2.18 పెదగంజాం

10.3 అమరావతి

10.3.1 పరిశోధనలు

10.3.2 కాలం

10.3.3 మహాస్తూప వాస్తుకళ

10.3.4 శిల్ప కళ

10.3.5 అమరావతి శిల్ప కళ ప్రభావం

10.4 సారాంశము

10.5 నమూనా ప్రశ్నలు

## 10.1 పరిచయం :

బౌద్ధ వాస్తు చరిత్రలో స్తూపాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. వాస్తవానికి స్తూపాల నిర్మాణ కార్యక్రమం బౌద్ధ మతానికంటే ప్రాచీనమైంది. ఆనాడు మహావ్యక్తులు, రాజులు మరణించినపుడు వారి శరీర అవశేషాలపై స్తూపాలు నిర్మించారు. పురావస్తు పరిశోధనలలో వేదకాలం నాటి అవశేషాలు బీహారులో బయల్పడ్డాయి. కాని బౌద్ధులు స్తూప నిర్మాణంలో ఉత్సాహాన్ని చూపి బౌద్ధ సాంప్రదాయంగా మార్పు చేశారు. చనిపోయిన వారి ఆత్మలను భద్రపరచడం కోసం వినియోగించబడే భూ గృహాలే స్తూపాలని లాంగ్‌హార్ట్స్ అంటాడు. బుద్ధుడు లేదా బౌద్ధ మతాచార్యుల అవశేషాలపై నిర్మించబడిన కట్టడాలనే స్తూపాలని అంటారు. బౌద్ధులు ఈ స్తూపాలను బుద్ధుడుగా భావించి ఆరాధించేవారు. నిత్యపూజ నిమిత్తం చైత్య గృహాలలో కూడా స్తూపాలను నిర్మించారు.

'స్తూప'మన్నా 'చైత్య'మన్నా ఒక్కటే అర్థం. కొన్ని అవశేషాలపై నిర్మించబడే కట్టడాలను స్తూపాలని, భస్మమైపోయిన అవశేష సముదాయాలపై నిర్మించే వాటిని చైత్యాలని భావించవచ్చు. స్తూపాలు మూడు రకాలు. అవి (1) శారీరక స్తూపాలు, (2) పారిభోగిక స్తూపాలు (3) ఉద్దేశిక స్తూపాలు. బుద్ధుడు లేక బౌద్ధ మతాచార్యుల శరీర అవశేషాలపై నిర్మించబడిన కట్టడాలను శారీరక స్తూపాలంటారు. వీటినే 'దగోబా' లని 'ధాతుగర్భా'లని కూడా అంటారు. బుద్ధుడు సారనాథ్‌లో జ్ఞానోదయమయిన తరవాత తన వెంట్రుకలను, గోళ్ళను త్రపుస, భల్లక అనే నగర శ్రేష్టులకు ఇవ్వగా వారు వాటిపై స్తూపాలు నిర్మించారు. బుద్ధుని నిర్వాణానంతరం అతని శరీర అవశేషాలపై ఎనిమిది స్తూపాలు నిర్మించబడ్డాయి. వీటిలోని ఏడు స్తూపాలను మౌర్య అశోకుడు తవ్వి, అందలి అవశేషాలను 84 వేలుగా విభజించి వాటిపై స్తూపాలు నిర్మించినట్లు బౌద్ధ అనుశృతి. బుద్ధుడు లేక బౌద్ధమతాచార్యులు ఉపయోగించిన వస్తువులమీద నిర్మించబడిన కట్టడాలను పారిభోగిక స్తూపాలంటారు. బుద్ధునికి గుర్తుగా ఎటువంటి అవశేషాలు లేకుండా నిర్మించబడినవి ఉద్దేశిక స్తూపాలు.

ఇటుక, మట్టి, రాయి లాంటి పదార్థాలతో నిర్మించిన అర్ధగోళాకారపు దిబ్బలను స్తూపాలంటారు. బహు ప్రసిద్ధమైన స్తూపాలు అమరావతి, సాంచి, బార్హుత్, సారనాథ్, బుద్ధగయ, నాగార్జునకొండ మొదలైన చోట్ల ఉన్నాయి. బౌద్ధ స్తూప నిర్మాణ కార్యక్రమము మౌర్య అశోకుని కాలంలోనే ఆరంభమైనా, వాటికొక స్థిరమైన ఆకారమేర్పడింది శుంగుల కాలంలోనే. స్తూపము ప్రధాన భాగము అండము. ఇది గోళాకృతిలో ఉంటుంది. తీక్షణాగ్రము కలిగిన స్తూపాలు కూడా బయల్పడ్డాయి. అండము చుట్టూ దాన్ని ఆనుకొని కొంత ఎత్తు వరకు వేదిక ఉంటుంది. అండము మీద హార్మికము, దాని మధ్య పైన ఒక ఛత్రయష్టి ఉంటుంది. వేదిక చుట్టూ శిలా ప్రాకారము, వేదికకు కొంచెం ఎడంగా స్తూపాలకు ప్రధానాలంకారాలైన శిలా ప్రాకారము, రాతితోరణాలు వుంటాయి. ఆంధ్రలో ఎత్తైన తోరణాలు కాక, సింహరక్షితాలైన సామాన్య ద్వారాలున్నాయి. అంతేగాక అండానికి చేర్చి నాలుగు ప్రధాన దిశల కభిముఖంగా, నాలుగు చతురస్రాకారపు తిన్నెలు, వాటిలో ఒక్కొక్క దాని మీద ఐదు ఆయక స్తంభాలు ఆంధ్రస్తూపాల కుండే విశిష్ట లక్షణాలు.

## 10.2 ఆంధ్రలోని బౌద్ధ స్తూపాలు :

ఆంధ్రలోని స్తూపాలు చాలా వరకు పర్వత, నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ స్తూపాల అండము చాలా వరకు చక్రాకృతిలో లేదా స్వస్తికాకృతిలో ఇటుక కుడ్యాలతో నిర్మించబడింది. కుడ్యాల మధ్య గల ఖాళీ భాగాలు మట్టితో నింపబడింది. ఈ విధానం నిర్మాణ ఖర్చును తగ్గించుటే గాక నిర్మాణానికి శక్తినిస్తుంది. అమరావతి స్తూపం చక్రాకృతిలో, నాగార్జున కొండలోని

కొన్ని స్తూపాలు స్వస్తికాకృతిలో నిర్మించబడ్డాయి. ఆంధ్రలో జనించిన చైత్యకులనెడి బౌద్ధ తెగ ఆలోచనతో చక్రాకృతి విధానమేర్పడి ఉండవచ్చు. స్వస్తిక విధానం మత సిద్ధాంత పరంగా ఏర్పడిందని చెప్పవచ్చు. బుద్ధుని స్వస్తిక చిహ్నంతో ఆరాధించుట కలదు. ఇట్టి శిల్పాలు అమరావతి, నాగార్జున కొండల వద్ద బయల్పడినాయి. భట్టిప్రోలు, గుడివాడలలో గల స్తూపాలు పై విధంగా కాక పూర్తిగా ఇటుకలతో నిర్మించబడింది. ఆంధ్రలో ఇటుకలతో నిర్మించబడిన స్తూపాలే గాక రాతితో తొలచినవి కూడా కలవు. అట్టివి శంకరం, గుంటుపల్లిలలో గలవు. పూజా వస్తువులు ఉంచుట కొరకు స్తూపపు వేదిక నాలుగు ప్రధాన దిక్కులలో దీర్ఘ చతురస్రాకార వేదికలు నిర్మించబడ్డాయి. ఈ వేదికలపై ఐదేసి ఆయకస్తంభాలు చలువ రాతితో నిర్మించబడి ఉన్నాయి. ఈ స్తంభాలు బుద్ధుని జీవితంలోని అయిదు ప్రధాన ఘట్టాలకు సాంకేతిక చిహ్నాలు. ఆ ఘట్టాలు (1) బుద్ధుని జననం (2) మహాభినిష్క్రమణ (3) సంబోధి (4) ధర్మచక్ర ప్రవర్తనం (5) మహాపరి నిర్వాణం.

### 10.2.1 భట్టిప్రోలు స్తూపం :-

గుంటూరు జిల్లా భట్టిప్రోలులో గల స్తూపం ఉత్తర భారత స్తూపాల వలె గట్టి నిర్మాణం. ఈ స్తూపం చాలావరకు సాంచి స్తూపాన్ని పోలి ఉంది. ఇందలి శిల్పాలు అమరావతి స్తూప శిల్పాల లాగ వున్నాయి. ఈ స్తూప వ్యాసం 132 అడుగులు కాగా ఎత్తు 66 అడుగులుండేవి. ఈ స్తూపానికి నాల్గు ఆయక వేదికలున్నాయి. అలెగ్జాండర్‌రే ఇచట పరిశోధనలు జరపగా బౌద్ధ చిహ్నాలు గల మూడు రాతి పెట్టెలు, కొన్ని ఆభరణాలు లభ్యమైనాయి. ఒక పెట్టెలో ఎముకలు, బంగారు పుష్పాలు, ముత్యాలు లభించాయి. దీనినిబట్టి భట్టిప్రోలు స్తూపం శారీరక స్తూపమని చెప్పవచ్చు. ఇచట లభ్యమైన శాసనం బ్రాహ్మిలిపిలో వుంది. ఇది అశోకుని కాలానికి చెందిన దాక్షిణాత్య బ్రాహ్మిలిపి అని బూలర్ పండితుడు అభిప్రాయపడినాడు.

### 10.2.2 గుడివాడ స్తూపం :-

కృష్ణా జిల్లా గుడివాడలోని స్తూపాన్ని బాస్వెల్ పండితుడు కనుగొన్నాడు. ఆ తరవాత ఇచట అలేగ్జాండర్ రే ఉత్ఖాతనాలు జరిపాడు. ఈ స్తూపం కూడా సాంచీ రీతిలో వుంది. ఈ స్తూపం 120 అడుగుల వ్యాసాన్ని కలిగి వున్నది.

### 10.2.3 ఘంటసాల స్తూపం :-

కృష్ణాజిల్లా ఘంటశాలలో గల స్తూపం స్వస్తిక, చక్ర కుడ్యాల విధాన మిశ్రమ రీతిలో నిర్మించబడి ఉంది. కంటకసాల అనే పేరుతో ప్రసిద్ధి చెందిన ఘంటసాల పూర్వం ప్రసిద్ధ రేవు పట్టణం. 192 అడుగుల వ్యాసం, 23 అడుగుల ఎత్తు గల ఈ స్తూపం అమరావతీ స్తూపం కంటే ముందుకాలం నాటిదని, కొన్ని సింహళ దేశ స్తూపాలను పోలి వుందని అలెగ్జాండర్ రే పేర్కొన్నాడు. స్వర్ణ పుష్పాలు, వజ్రాలు గల అవశేష పేటికలు ఇచట లభించాయి.

### 10.2.4 గుంటుపల్లి స్తూపం :-

పశ్చిమ గోదావరి జిల్లా గుంటుపల్లి కొండమీద చైత్యాలయాలను, స్తూపాలను, ఆరామాలను రే కనుగొన్నాడు. ఇచట గల మహాచైత్యం 18 అడుగుల వ్యాసం, 14 అడుగుల ఎత్తుగల శిలా నిర్మిత స్తూపం. ఈ చైత్యం అశోకుని కాలంలో బుద్ధ గయ వద్ద బారాబర్ కొండల్లో వున్న లోమాస్ రుషి గుహాలయాన్ని పోలి ఉంది. ఇచటనే ఖారవేలుని శాసనం ఒకటి లభ్యమయింది.

### 10.2.5 రామతీర్థం స్తూపం :-

రామతీర్థం విజయనగరం జిల్లాలో గలదు. అలెగ్జాండర్ రే పరిశోధన ఫలితంగా రామతీర్థంలో గురుభక్తుకొండ, దుర్గకొండ అనే పేర్లతో పిలువబడే కొండమీద బౌద్ధారామాలు, స్తూపాలు, చైత్యగృహాలు బయల్పడినాయి. ఇచట ఆంధ్ర శాతవాహనుల

నాణేలు లభ్యమయ్యాయి.

### 10.2.6 శాలిహుండం స్తూపం :-

శ్రీకాకుళం జిల్లా వంశధారా నది ఒడ్డున శాలిహుండం ఉంది. దీనికి దగ్గరగా వున్న కొండమీద స్తూప అవశేషాలు బయల్పడినాయి. ఈ స్తూపంలో నిక్షిప్తమైన ధాతు పేటికలు స్పటికంతో తయారయ్యాయి. ఈ స్తూపం కళింగ పట్టణం రేవుకు వచ్చిన విదేశీయులను ఆకర్షించేది.

### 10.2.7 శంకారం స్తూపం :-

బొజ్జన్న కొండ అనే మరో పేరున్న ఈ ప్రాచీన బౌద్ధ స్థలం విశాఖపట్నం జిల్లాలో గలదు. ఇచటి గుహాలయానికి రెండు అంతస్తులున్నాయి. చైత్యాలయ ద్వారం పైభాగంలో బుద్ధుని ప్రతిమ ఉంది. 30 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు గల ఈ గుహాలయం 16 స్తంభాల ఆధారంతో నిలబడిన రాతితో మలచబడింది. ఈ గుహాలయ మధ్య భాగంలో నాలుగు అడుగుల ఎత్తు గల ఏకశిలా నిర్మిత స్తూపం ఉంది. ఇచట సముద్రగుప్తుని బంగారు నాణెం దొరికింది.

### 10.2.8 అల్లూరు స్తూపం :-

కృష్ణా జిల్లా అల్లూరులో 1926లో మహమ్మద్ ఖురేషి ఉత్ఖాతనాలు నిర్వహించాడు. ఇచట గల స్తూపం చక్రాకృతిలో ఉంది. స్తూప వేదికకు నాల్గు దిక్కులలో ఆయకవేదికలు, వాటిపై స్తంభాలున్నాయి. వీటిపై బ్రాహ్మిలిపిలో శాసనాలున్నాయి.

### 10.2.9 గుమ్మడి దుర్రు స్తూపం :-

ఈ గ్రామం తెలంగాణాలో మధిర రైల్వే స్టేషన్‌కు 10 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇచట పురావస్తు శాఖ త్రవ్వకాలను నిర్వహించింది. ఎత్తైన ప్రదేశంలో వున్న మహాస్తూపం శిలా ఫలకాలతో అలంకరించబడింది. ఇచట తవ్వకాలలో సీసపు నాణేలు, ముద్రికలు, బంగారు హారం, రజిత పేటిక లభ్యమయ్యాయి.

### 10.2.10 కొండాపురం స్తూపం :-

మెదక్ జిల్లా కొండాపురంలో నిర్వహించిన త్రవ్వకాలలో బయల్పడిన అవశేషాలను బట్టి, ఇది శాతవాహనుల కేంద్రమని, మెగస్తనీస్ పేర్కొన్న 30 నగరాలలో ఇది ఒకటని భావించడం జరిగింది. ఇచటి స్తూపాలు గజపృష్టాకారంలో నిర్మింపబడినాయి. ఇచట అనేక మృణ్మయ పాత్రలు, ఆయుధాలు, రోమన్ చక్రవర్తి అగస్టన్ బంగారు నాణెం, 100 పోటిన్ నాణేలు, ఆంధ్ర రాజుల నాణేలు లభించినాయి.

### 10.2.11 బావికొండ స్తూపం :-

విశాఖపట్నం జిల్లా భీముని పట్నం పోయే దారిలో తొట్ల కొండ, బావి కొండ అను రెండు బౌద్ధ క్షేత్రాలున్నాయి. తొట్ల కొండపై ఒక మహా స్తూపం, అనేక చిన్న చిన్న స్తూపాలు, చైత్యాలు, విహారాలు ఉన్నాయి. ఇచట అనేక రాతి తొట్టెలు ఉన్నాయి. బావి కొండ వద్ద జరిపిన తవ్వకాలలో ఒక మహా స్తూపం వెలుగులోకి వచ్చింది. దీనికి సమీపంలో ఏడు చిన్న స్తూపాలు, ఒక ఆరామం, పెద్ద సమావేశ మందిరం బయల్పడ్డాయి. ఇచట రోమన్ నాణేలు లభించాయి.

### 10.2.12 మజ్జుగూడెం స్తూపం :-

మజ్జు గూడెం ఖమ్మం జిల్లాలో గలదు. దీని సమీపంలో రాష్ట్ర పురవావస్తు శాఖ నిర్వహించిన త్వకాలలో స్తూపం వెలుగులోకి వచ్చింది. ఈ స్తూప వ్యాసం 42 మీటర్లు. దీని చుట్టూ ప్రదక్షిణా పథం ఉంది. ఇచట 9 బుద్ధ విగ్రహాలు, ఇక్ష్వాకుల నాటి సీసపు నాణేలు, విష్ణు కుండినుల నాటి రాగి నాణేలు తవ్వకాలలోలభించాయి.

### 10.2.13 గోలి స్తూపం :-

గుంటూరు జిల్లా గోలిలో చలువరాతిపై చెక్కబడిన శిల్పాలనేకం లభించాయి. ఇవి అమరావతి శిల్పాలలాగా పరిణితి చెందాయి. ఇచటి శిల్పాలలో స్తూప నమూనా గలదు. దీనిని బట్టి ఇచటి స్తూపం వేదిక, అండం, హార్మికం, ఛత్రం, ఆయక వేదిక, స్తంభాలలో కూడి ఉందని గ్రహించవచ్చు.

### 10.2.14 గరికపాడు స్తూపం :-

గరికపాడులో గల స్తూపం ఇటుకలతో నిర్మించబడింది. ఇది 78 అడుగుల వ్యాసాన్ని కలిగి ఉన్నది.

### 10.2.15 నాగార్జున కొండ స్తూపాలు :-

నాగార్జున కొండ గుంటూరు జిల్లాలో కృష్ణానది దక్షిణ ఒడ్డున గలదు. ఇచట గల స్తూపాలు చక్ర కుడ్య విధానంలో నిర్మించబడి ఉన్నాయి. ఇచట గల మహా చైత్యాన్ని ఇక్ష్వాకు రాణి పునర్నిర్మించింది. ఇది చక్రాకృతిలో వుంది. ఈ స్తూపానికి ఆయక వేదికలు, ఆయక స్తంభాలు గలవు. బుద్ధుని జీవితానికి, జాతక కథలకు సంబంధించి అనేక శిల్పాలు ఇచట బయల్పడ్డాయి. మహాచైత్యమే గాక నాగార్జున కొండలో ఎనిమిది చక్ర కుడ్యాలు గల ఎనిమిది స్తూపాలు, నాల్గు చక్ర కుడ్యాలు గల ఆరు స్తూపాలు, పది చక్ర కుడ్యాలు గల ఒక స్తూపం తవ్వకాలలో బయల్పడ్డాయి. కొన్ని స్తూపాలు చక్ర కుడ్యాలు లేకుండాను, ఆయక వేదికలు లేకుండాను కూడా ఇచట నిర్మించబడ్డాయి.

### 10.2.16 జగ్గయ్యపేట స్తూపం :-

కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని ధనంబోడు వద్ద బర్జెస్ జరిపిన పరిశోధనల వల్ల చైత్యాలు, ఉద్దేశిక స్తూపాలు, సంఘారామాలు వెలుగు లోకి వచ్చాయి. ఇచట లభించిన శిల్పాలలో మాంధాత చక్రవర్తి శిల్పం ఆకర్షణీయంగా వుంది. స్తూప మధ్య భాగంలో ధాతు పాత్ర లభించింది.

### 10.2.17 చందవరం స్తూపం :-

ప్రకాశం జిల్లా చందవరం గ్రామానికి సమీపంలోని కొండమీద ఆకర్షణీయమైన స్తూపం ఉంది. ఇచట రాష్ట్ర పురావస్తు శాఖ తవ్వకాలు నిర్వహించింది. ఈ స్తూప వ్యాసం 50 మీటర్లు, ఎత్తు 80 మీటర్లు, స్తూప అండంపై శిల్పాలతో కూడిన పాలరాతి ఫలకాలను తాపడం చేయడం జరిగింది. ఈ స్తూపానికి ఆయక వేదికలు, ఆయక స్తంభాలుండేవి. ఈ స్తూపం హార్మికం వరకు నేటికి నిలబడి ఉంది.

### 10.2.18 పెద్దగంజాం స్తూపం :-

ప్రకాశం జిల్లా పెద్ద గంజాంలో ఐదు స్తూపాలు గలవు. వీటిలో ఒక స్తూపం భోగం దాని దిబ్బలోవున్నది. ఇది ఘంటసాల స్తూపం వలె ఉన్నది. దీని వ్యాసం 54 అడుగులు. ప్రదక్షిణా పథం 13 1/2 అడుగుల వెడల్పు కలిగి ఉంది. స్తూప ప్రాకారం చలువరాతితో నిర్మించబడింది. స్తూపమంతా తాపడం చేయబడి ఉన్నది.

### 10.2.19 అమరావతి స్తూపం :-

నేటి గుంటూరు జిల్లాలోని గుంటూరు పట్టణానికి 35 కిలోమీటర్ల దూరంలో అమరావతి వుంది. ఇచట ప్రపంచ ఖ్యాతి గాంచి, ఆంధ్రులకు కీర్తిని ఆర్జించి పెట్టిన మహాస్తూపం వుంది. దీనికి దీపాల దిన్నె, దీపాల దిబ్బ, దీపాల కొండ అను పేర్లు గలవు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో గల స్తూపాలన్నింటిలో కెల్లా అద్భుతమైన నిర్మాణం. ఈ స్తూప నిర్మాణానికి మౌర్య అశోకునిచే పంపబడిన మహాదేవభిక్షువు పునాదులు వేయగా శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో గొప్పగా అభివృద్ధి చేయబడింది. ఈ స్తూప అండం, ప్రాకారం అద్భుత శిల్పాలతో అలంకరించబడి వుండేది. భారతదేశ బౌద్ధకళా చరిత్రలో అమరావతి శిల్పకళకు ప్రత్యేక స్థానముంది. అమరావతి శిల్ప కళా ప్రభావం ఆగ్నేయాసియా దేశాలలో కూడా కన్పిస్తుంది.

### 10.3.1 పరిశోధనలు :-

కల్నల్ మెకంజీ 1797లో అమరావతి స్తూపాన్ని కనుగొని సర్వే నిర్వహించగా ఆ శిల్పాలతో కూడిన రాతి ఫలకాలు కొన్ని లభించాయి. మెకంజీ ఈ ప్రాంతాన్ని సందర్శించక ముందే చింతపల్లి జమీందార్ రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు తన నివాసాన్ని చింతపల్లి నుంచి అమరావతికి మార్చి అచట గల అమరేశ్వరాలయం చుట్టూ పెద్ద పట్టణం నిర్మించాడు. ఈ సందర్భంలో అతడు మహాచైత్యం వున్న చోట తవ్వకాలు నిర్వహించి లభించిన ఇటుకలను, రాళ్ళను, శిలాఫలకాలను తన స్వంత భవనాలకు వాడుకొన్నాడు. ఈవిధంగా మహా స్తూప అవశేషాలు చాలావరకు నాశనమయ్యాయి. మెకంజీ తర్వాత కొంతమంది యూరోపియన్ పురావస్తు శాస్త్రవేత్తలు ఉత్ఖాతనాలు జరిపి పరిశోధకులకు మార్గం చూపారు. 1877లో రాబర్ట్ సూయల్, 1881లో జేమ్స్, బర్గెస్ 1888-89, 1905-6, 1908-9 సంవత్సరాలలో అలెగ్జాండర్ రే, ఉత్ఖాతనాలు జరిపారు. ఆ తరవాత పురావస్తు శాఖకు చెందిన ఆర్. సుబ్రహ్మణ్యం, కె. కృష్ణమూర్తి 1958-59 సంవత్సరాలలో తవ్వకాలు నిర్వహించి స్తూప చరిత్రను వ్రాసారు. ఉత్ఖాతనాల ఫలితంగా ఇటుకలు, మృణ్మయ పాత్రలు, అద్భుత శిల్పాలు వెలుగులోకి వచ్చాయి. ఈ శిల్ప కళా ఖండాలు నేడు లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో, కలకత్తా మ్యూజియంలో, మద్రాస్ ఎగ్మూర్ మ్యూజియంలో, అమరావతి మ్యూజియంలో దర్శనమిస్తున్నాయి.

### 10.3.2 కాలం :-

అమరావతీ స్తూప నిర్మాణ కార్యక్రమం క్రీ.పూ. మూడవ శతాబ్దంలో మౌర్య అశోకుని కాలంలో ప్రారంభమయింది. బౌద్ధమత వ్యాప్తి కార్యక్రమంలో భాగంగా అశోకుడు ఆంధ్రదేశానికి మహాదేవుడనే బౌద్ధ భిక్షువుని పంపాడు. ఇతడే ఈ మహాస్తూప నిర్మాణం ప్రారంభించి వుండవచ్చని పెక్కుమంది పండితుల భావం. మౌర్య కాలానికి ముందే ఇచట స్తూప నిర్మాణ కార్యక్రమం ప్రారంభమయినట్లు కొంతమంది పండితులు పేర్కొంటున్నారు. అయితే ఆంధ్రశాతవాహన, ఇక్ష్వాకుల కాలాలలో ఈ స్తూపానికి అనేక మార్పులు, చేర్పులు చేయడమేగాక అద్భుత శిల్పాలలో అలంకృతం చేయబడింది. శాతవాహనులు, ఇక్ష్వాకులు పరమత సహనం ప్రదర్శించినందువల్ల ఈ కాలంలో బౌద్ధం తన కార్యక్రమాలను యధేచ్ఛగా కొనసాగించింది. వర్తకులు, వృత్తి పనివారు, స్త్రీలు, సామాన్య ప్రజలు బౌద్ధాన్ని ఆదరించి పోషించారు. ఫలితంగా ఈ కాలంలో అనేక స్తూపాలు, చైత్యాలయాలు, విహారాలు నిర్మించబడ్డాయి. ఇవన్నీ నాటి వాణిజ్య కేంద్రాలైన పట్టణాలకు సమీపంలో, రహదారులపై నిర్మించబడ్డాయి. వాటిలో ప్రధాన

మైనదే అమరావతి స్తూపం. మహాయానాన్ని ఒక నిర్దుష్టమైన మతంగా రూపొందించిన ఆచార్య నాగార్జునుడు ఈ స్తూపాన్ని శిల్పాలతో అలంకృతం చేశాడు.

## 10.3.3 మహాస్తూప వాస్తు కళ :-

ఆంధ్రదేశంలో బయల్పడిన స్తూపాలలో అమరావతి స్తూపం చాలా గొప్ప కట్టడం. ఈ స్తూపం వ్యాసం 162 అడుగులు, ఎత్తు 100 అడుగులు. స్తూపం చుట్టూ గల ప్రాకారం చుట్టుకొలత 600 అడుగులు. మొత్తం స్తూప వైశాల్యం 16,800 అడుగులు. స్తూప ప్రధాన అంగాలు వేదిక,అండం, హార్మికము, ఛత్రం, ఆయకవేదికలు, ప్రదక్షిణాపథం, ప్రాకారం. పెద్ద పరిమాణం గల ఇటుకలతో కట్టబడిన ఈ స్తూప వేదిక వర్తులాకారంలో వుంది. వేదికకు నాల్గు ప్రధాన దిక్కులలో నాల్గు చతురస్రాకారపు తిన్నెలు వుండేవి. ఒక్కొక్క తిన్నె పొడవు 7.20 మీటర్లు, వెడల్పు 2.10 మీటర్లు. ప్రతి తెన్నెపై ఐదేసి ఆయక స్తంభాలు ఉండేవి. ఈ ఆయక స్తంభాలు బుద్ధుని జీవితంలోని అయిదు ప్రధాన ఘట్టాలకు చిహ్నాలు. జననం, మహాభి నిష్క్రమణం, సంబోధి, ధర్మ చక్ర ప్రవర్తన, మహా పరినిర్వాణం అనునవి ఆ ప్రధాన ఘట్టాలు. చతురస్త్రాకారం గల తిన్నెలు లేక ఆయక వేదికలు శిల్ప సంశోభితమైన శిలాఫలకాలతో అలంకరించబడి వుండేది. స్తూపం దక్షిణ వైపున గల ఆయక వేదిక క్రింద అయిదు రాతి గూళ్ళు వున్నాయి. ఈ గూళ్ళలో వుంచబడిన స్పటిక పేటికలు, అందులోని ధాతువుల, బంగారు పుష్పాలు, ముత్యాలు నేడు అమరావతి మ్యూజియంలో భద్రపరచబడి వుంది. ధాతువులు లభ్యం కావడం అమరావతి స్తూపం శారీరక స్తూపం. స్తూప వేదికపై అర్థగోళాకారపు కట్టడముండేది. దీనిని అండము అని అంటారు. ఈ అండము శిల్పాలంకృమైన శిలాఫలకాలతో, సున్నంతో మలచబడిన మాలాంకృత పట్టికలో అందంగా తీర్చిదిద్దబడి వుండేది. అండము పైన చతురాస్త్రాకారపు హార్మికం, దానిపై మధ్యలో దండ సహిత ఛత్రం నిర్మించబడి వుండేది. స్తూప ప్రాకారానికి నాల్గు వైపులా నాల్గు సింహరక్షితాలైన సాధారణ ద్వారాలున్నాయి. ఈ ప్రాకారం శిల్ప సమన్వితం.

ఆంధ్రశాతవాహన, ఇక్ష్వాకుల కాలాలలో మహోజ్వల దశను అనుభవించిన ఈ అమరావతి మహా స్తూపం తరవాత కొంత కాలానికి కాలగర్భంలో కలిసి పోయింది. ఉత్ఖాతనాలలో బయల్పడిన శిలా ఫలకాలలో స్తూపాకృతులు గలవు. వీటి ఆధారంగా, ఇతర స్తూప అవశేషాలు ఆధారంగా అమరావతి మహాస్తూప ఆకృతిని ఊహించి పెర్సీబ్రౌన్ అను పండితుడు రేఖా చిత్రాన్ని గీశాడు. దీని ఆధారంగా ప్లాస్టర్‌తో నమూనాను తయారు చేసి మొదట మద్రాస్ ఎగ్మోర్ మ్యూజియంలో, ఆ తరవాత పర్యాటకుల కోసం నమూనాలు తయారు చేసి అమరావతి, గుంటూరు మ్యూజియంలలో ఏర్పాటు చేశారు.

## 10.3.4 శిల్ప కళ :-

అమరావతి స్తూపంలోని శిల్పాలలో అత్యధిక భాగం ఆంధ్రశాతవాహనుల కాలంలో తయారయింది. ఇక్కడి శిల్పాలలో ఎక్కువ భాగం బుద్ధుని జీవిత గాధలకు, జాతక కథలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. సాంచీ, బార్హూత్ శిల్పాలవలె అమరావతి శిల్పాలు దేశీయ సాంప్రదాయాలకు అనుగుణంగా రూపొందాయి. అయినప్పటికీ అమరావతి శిల్పాలు ఒక ప్రత్యేకమైన స్థానిక పద్ధతిలో రూపొందించబడ్డాయి. ఈ కళాశైలిని పోలిన శిల్పాలే ఇతర ఆంధ్ర స్తూపాలలో కూడా లభ్యమయినందువల్ల బౌద్ధయుగ ఆంధ్ర శిల్పానికి 'అమరావతి శైలి' అను పేరు వచ్చింది. ఈ శిల్ప శైలి క్రీ.పూ. 3వ శతాబ్ది నుంచి క్రీ.శ 3వ శతాబ్ది వరకు వర్థిల్లినది. పల్నాడు క్వారీలలో లభించే ఆకుపచ్చ లేక దూసర వర్ణ పాలరాయిని శిల్పాల తయారీకి ఉపయోగించారు. ఈ శిల్పాలు నేడు లండన్, పారిస్, కలకత్తా, మద్రాస్, అమరావతి మ్యూజియంలలో భద్రపరచబడి వుంది.

సాంచీ, బార్హుత్ శిల్ప సంపద గ్రామీణ జీవితానికి సన్నిహితంగా రూపొందించబడగా, అందుకు భిన్నంగా అమరావతి శిల్పంలో నాగరిక జీవితం గోచరిస్తుంది. అమరావతి శిల్పం ధనికుల, శ్రేష్ఠుల పోషణలో తయారు కావడమే అందుకు కారణమయి ఉండవచ్చు. అమరావతి శిల్పాల గురించి దేవి ప్రసాద్ ఘోష్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు. "ఉల్లాసకరము, నాగరికము అయిన జీవితం అమరావతి శిల్పంలో ప్రతిఫలిస్తుందని, వివిధ భంగిమలలో మానవాకృతిని మలచడంలోను, క్లిష్టాలైన మనోగత భావాలను చిత్రించడంలోను సిద్ధహస్తులైన అమరావతి శిల్పులకు సాటి మరొకరు లేదు''. అమరావతీ శిల్పకళ భారతీయ శిల్పకళకే పరాకాష్ట'' అని ఫెర్గూసన్ పండితుడంటాడు.

ప్రథమంలో అమరావతి శిల్పాలలో బుద్ధుని మనుష్య రూపంలో శిల్పీకరించలేదు. ఆయన ఉనికిని తెలపడానికి కొన్ని సంకేతాలు వాడారు. ఆయన బుద్ధత్వానికి బోధివృక్షం, బోధనకు ధర్మచక్రం, నిర్వాణానికి స్తూపం సంకేతాలుగా వాడారు. ఈ కాలం నాటి శిల్పాలు అజంతా 10వ సంఖ్య గుహలోని వర్ణ చిత్రాలను పోలి ఉన్నాయి. ఈ కాలపు శిల్పాలలో లావణ్యం ఉట్టిపడుతుంది. ఆ తరవాత రూపొందిన శిల్పాలలో గాంధార శిల్ప లక్షణాలు కన్పిస్తాయి. అయినా ఆంధ్ర శిల్పి తన వ్యక్తిత్వానికి, దేశీయతకు భంగం కలగకుండా గాంధార శిల్ప లక్షణాలను జీర్ణించుకున్నాడు. ఈ కాలంలోనే బుద్ధుని మానవరూపంలో శిల్పీకరించడం జరిగింది.

అమరావతి శిల్పాలలో ప్రధాన కథా వస్తువు బౌద్ధ మతానికి సంబంధించినది. బుద్ధుని జీవిత ఘట్టాలు, జాతక కథలు అమరావతి శిల్పాలలో ప్రధానంగా చోటుచేసుకొన్నాయి. ఇంకా సామాన్య జీవిత దృశ్యాలు, భవనాలు, పశు పక్ష్యాదులు చిత్రీకరించబడింది. ఒక్కొక్క ఘట్టాన్ని చదరంగా కాని, దీర్ఘ చతురస్రంగా గాని, గుండ్రంగా కాని ఉన్న గదులలో ఉల్బణ శిల్పంగా మలచబడింది. ఈ అమరావతీ శిల్పం భారతీయ శిల్పంలో మొగ్గదొడిగి వికసించిన శృంగార రసమయ లలిత కుసుమం అని ఆనంద కుమారస్వామి అంటాడు.

బుద్ధుని జీవిత ప్రధాన ఘట్టాలు, జాతక కథలు తెలిపే శిల్ప ఫలకాలు అనేకం అమరావతి తవ్వకాలలో లభించాయి. మాయాదేవి స్వప్నం, మార ప్రలోభ దృశ్యం, నందునితో సంభాషణ, నలగిరి అనే ఏనుగు మోకరిల్లడం, బుద్ధుని భిక్షా పాత్రను దేవతలు తీసుకొని పోవడం మొదలగు బుద్ధుని జీవిత సన్నివేశాలను ప్రదర్శించే శిల్పాలు, అజాత శత్రువు బుద్ధుని దర్శించడం లాంటి చారిత్రక సంఘటనలు, మాంధాత జాతకం, చద్దంత జాతకం, వెస్సాంతర జాతకం మొదలగు జాతక కథా దృశ్యాలు అత్యంత మనోహరంగా రూపొందించబడ్డాయి.

అమరావతి శిల్పాలలో నాగుల ప్రభావం కూడా కనిపిస్తుంది. ముచిలింద నాగ దృశ్యం అమరావతి శిల్పాలలో ఒక ప్రధాన ఆకర్షణ. సర్పాకారంలో ఉన్న స్తూపాలు, నాగుపాము పడగలు ఉన్న స్త్రీ పురుష శిల్పాలు అనేకం తవ్వకాలలో లభించాయి. స్థానిక నాగ జాతి ప్రభావం వల్ల ఈ రకపు శిల్పాలు రూపొందినట్లు పండితులు భావిస్తున్నారు. అమరావతిలో స్థానిక బౌద్ధ విగ్రహాలు లభించాయి. ఇవి 6 అడుగుల 4 అంగుళాల ఎత్తును కలిగి వున్నాయి. స్థానక భంగిమలో వున్న ఈ ప్రతిమల ఎడమ చేయి ధ్యానముద్రలో ఉండగా, కుడిచేయి అభయ ముద్రలో వుంది. అంగవస్త్రం ఎడమ భుజం నుంచి ఎడమ ముంజేతి వరకు ఉంది. ఈ అంగవస్త్రం మడతలు చెక్కడంలో శిల్పులు అసమాన ప్రజ్ఞ చూపారు.

అమరావతీ శిల్పాలలో ఆనాటి సామాజిక జీవితం చక్కగా ప్రతిఫలిస్తుంది. స్త్రీ పురుషులుభయులు వివిధ దుస్తులలో, అలంకారాలలో, భంగిమలలో దర్శనమిస్తారు. శృంగార సన్నివేశాలను నాటి శిల్పి రమణీయంగా మలిచాడు. యక్ష, యక్షిణీ ప్రతిమలు కూడా ఇచట లభించాయి. వీటిలో బార్హుత్ కంటే అభివృద్ధి కనిపిస్తుంది. అమరావతి శిల్పాలలో శాస్త్ర యుక్తమైన అనేక నృత్య

దృశ్యాలున్నాయి. ఈ నృత్య భంగిమలలో వీణ, వేణువు, మృదంగం, శంఖం మొదలగు వాద్యాలు కన్పిస్తాయి. అంతఃపురంలో స్త్రీలు నృత్యం చేసే దృశ్యం, బుద్ధుని అవశేషాలు పంచుకొనే సందర్భంలో నృత్యం చేసే దృశ్యం అతి రమ్యంగా మలచబడింది. అమరావతి శిల్పాలలో పశుపక్ష్యాదుల చిత్రణ అత్యంత ఆహ్లాదకరంగా వుంది. స్తంభాల పై మలచిన పద్మాలు, లతల రూప రచన ఎంతో నాజూకుగా వున్నాయి. జంతు చిత్రాలలో చాలా భాగం రెక్కలున్న ఊహాజనిత జంతువులున్నాయి.

అమరావతి శిల్పాలలో అనేక రకాల నిర్మాణాలు కనిపిస్తాయి. వీటిలో రెండు, మూడు అంతస్తులున్న భవనాలు కూడా వున్నాయి. గుర్రపు నాడ ఆకారం కలిగిన కిటికీలు, కూటాగారాలు, వరండాలు గల భవనాలు చిత్రించబడింది. పట్టణాల చుట్టూ ప్రాకారాలుండేవని ఇచటి శిల్పాలను బట్టి గ్రహించవచ్చు. అమరావతి శిలా ఫలకాలపై గల భవన నిర్మాణాలను పరిశీలిస్తే ఆనాటి నాగరిక జీవితం ఎంతగా అభివృద్ధి చెందిందో స్పష్టమవుతుంది. మహాబలిపురంలోని రాతి రథాలను పరిశీలిస్తే అమరావతి శిల్ప ఫలకాలలోని నిర్మాణాలు గుర్తుకు వస్తాయి.

## 10.3.5 అమరావతి శిల్ప కళా ప్రభావం :-

అమరావతీ శిల్ప కళా రీతి అమరావతికే పరిమితం కాక ఆంధ్రదేశమంతా విస్తరించింది. భట్టిప్రోలు, జగ్గయ్యపేట, నాగార్జునకొండ, గోలి, చినగంజాం, పెద గంజాం, కనుపర్తి, అల్లూరు, గుమ్మడి దుర్రు, చందవరం, దూపాడు, బుద్ధాం, ఘంటసాల, కర్లపాలెం మొదలగు ప్రాంతాలలో గల స్తూపాలు, అందలి శిల్పాలపై అమరావతి ప్రభావం ప్రసరించింది. ఇక్కడే గాక సాంచీ స్తూప ద్వార తోరణాల మీద ఆంధ్ర శిల్పుల పనితనం కన్పిస్తుంది. అమరావతి శిల్పరీతి భారతదేశానికే పరిమితం కాక ఆగ్నేయాసియా దేశాలకు వ్యాప్తి చెందినది. అమరావతి శిల్ప రీతిలో తయారైన బుద్ధ విగ్రహాలు ఈ దీవులంతటా లభించాయి. వీటిలో అధిక భాగం బుద్ధాం ప్రాంతం నుంచి ఎగుమతి అయినట్లు తెలుస్తుంది. శ్రీలంక, థాయ్‌లాండ్, సుమత్రా, అన్నాం, జావా, బోర్నియాలలో అమరావతి శిల్పరీతి ప్రభావం కన్పిస్తుంది.

## 10.4 సారాంశము :-

ఆంధ్రప్రదేశ్‌లోని బౌద్ధ క్షేత్రాలన్నిటిలో అమరావతి ప్రసిద్ధమైనది. ఇచట గల స్తూపం ప్రపంచ ఖ్యాతి గాంచింది. సింహ రక్షితాలైన ద్వారాలు, ఆయక వేదికలు, వాటిపై ఆయక స్తంభాలు, శిల్ప చిత్ర సమన్వితమైన అండము అమరావతి స్తూప ప్రత్యేకతలు. అమరావతిలోని స్త్రీ చిత్ర రచన అద్భుతంగా ఉంది. ఒక స్త్రీ చిత్రాన్ని పోలిన మరో స్త్రీ చిత్రం ఇక్కడ లభించదు. స్త్రీ పురుష శిల్పాలలో రసానికి అనుగుణంగా వివిధ భావాలు ప్రకటితమై జీవకళ కనిపిస్తుంది. అమరావతి శిల్పంలో మొదట సంకేత రూపంలో చూపబడిన బుద్ధుడు తరవాత మానవరూపంలో చిత్రీకరించబడినాడు. అమరావతి శిల్పులు గాంధార శిల్పంలోని మనోహర కల్పనలను, రీతులను స్వీకరించి వాటికి ఆంధ్రతనాన్ని ఆపాదించినారు. అమరావతిలో ఆసీన, స్థానక బుద్ధ ప్రతిమలు లభించాయి. అమరావతి శిల్పాలు నేడు లండన్, పారిస్, కలకత్తా, మద్రాస్, అమరావతి మ్యూజియంలలో భద్రపరచబడివుంది.

## 10.5 నమూనా ప్రశ్నలు :-

1) ఆంధ్రలోని బౌద్ధ స్తూపాల గురించి వివరింపుము.

2) శాతవాహన, ఇక్ష్వాకుల నాటి బౌద్ధ స్తూపాల గూర్చి వివరింపుము.

3) అమరావతి స్తూప వాస్తు శిల్ప లక్షణాలు వివరింపుము.

4) స్తూపమనగా నేమి?

**డా॥. వి.కె. మోహన్**

పాఠం-11.1

# జైన గుహాలయం-ఉదయగిరి

## 11.1.0 లక్ష్యం :

ఒరిస్సాలోని ఉదయగిరి వద్దగల జైన గుహాలయాలు, ఇతర ప్రాంతాలలోగల జైన గుహాలయాలు,జైన ఆలయాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

**విషయసూచిక :**


**11.1.1** **పరిచయము**

**11.1.2** **ఉదయగిరి గుహాలయాలు**

**11.1.2.1** **ముఖ్యలక్షణాలు**

**11.1.2.2** **ఉదయగిరి గుహాలు**

**11.1.2.2.1** **మొదటి గుహ**

**11.1.2.2.2** **మూడోగుహ**

**11.1.2.2.3** **నాల్గో గుహ**

**11.1.2.2.4** **ఐదో గుహ**

**11.1.2.2.5** **తోమ్మిదొ గుహ**

**11.1.2.2.6** **పదో గుహ**

**11.1.2.2.7** **పన్నెండో గుహ**

**11.1.2.2.8** **పదునాల్గో గుహ**

**11.1.2.3** **ఖందగిరి గుహలు**

**11.1.2.3.1** **మూడోగుహ**

**11.1.2.3.2** **ఏడోగుహ**

**11.1.2.3.3** **ఎనిమిది,తొమ్మిది గుహలు**

**11.1.2.3.4** **పది, పదకొండు గుహలు**

**11.1.2.4** **సమీక్ష**

**11.1.3** **ఎల్లోరా గుహలు**

**11.1.4** **బాదామి గుహలు**

**11.1.5 అయ్యవోలు గుహలు**

**11.1.6 జైనుల ఆలయాలు ( ఆలయనగరాలు )**

**11.1.6.1 శత్రుంజయ ఆలయనగరం**

**11.1.6.2 గిర్నార్ ఆలయనగరం**

**11.1.6.3 శ్రావణ బెళ్గోల**

**11.1.6.4 ఇతరప్రాంత ఆలయాలు**

**11.1.6.5 మాన స్తంభాలు**

**11.1.7 సారాంశము**

**11.1.8 నమూనా ప్రశ్నలు**

## 11.1.1 పరిచయము:

భారతదేశంలో జైన గుహాలయాలు ఒరిస్సా రాష్ట్రంలోని ఉదయగిరి, ఖండగిరి కొండలలో,మహారాష్ట్రంలోని ఎల్లోరాలో, కర్ణాటకలో బాదామి,అయ్యవొలులలో గలవు. ఉదయగిరిలో 19, ఖందగిరిలో 16 గుహలునాయి.ఈ గుహలలో భౌద్ధవిహారాలలో వలె హాలు లేదు. ఇవి చిన్న చిన్న గదులు మాత్రమే. కొన్ని గుహలలో గదుల వరసకు ముందు వరండా ఉన్నది. ఈ గుహలలో మందిరాలు కానరావు. ఈ గదులలో జైన భిక్షువు నిటారుగా నిలవడానికి కూడ వీలుపడదు. ఈ గుహలు చాలా వరకు చేదివంశానికి చెందిన ఖారవేలుని కాలంలో తొలిపించబడినవి. వీటిలోని శిల్పాలు నాటి సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుంది. ఎల్లోరాలోని 34 గుహలలో 5 గుహలు జైన గుహలు. ఇవి రాష్ట్ర కూటల, యాదవుల కాలానికి చెందినవి. బాదామిలోని 4 గుహలలో ఒకటి జైనగుహ. జైనులు ప్రధానంగా కొండలపై ఆలయాలు నిర్మించారు. అట్టివి శత్రుంజయ,గిర్నార్ మొదలగు కొండలపై గలవు. కర్ణాటకలోని శ్రావణబెల్గొళ జైనుల ముఖ్యకేంద్రం. జైనులు మాన స్తంభాలను కూడా నిర్మించారు.

## 11.1.2 ఉదయగిరి గుహాలయాలు :

ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు వాయవ్యంగా గల ఉదయగిరి వద్ద ఉదయగిరి,ఖందగిరి అను కొండలున్నాయి. ఇవి ఇసుకరాతి కొండలు. వీటిలోని గుహలు క్రీ.పూ.100. క్రీ.శ. 150 మధ్య కాలానికి చెందినవి. ఉదయగిరి కొండలో 19 గుహాలు. ఖందగిరి కొండలో 16 గుహలున్నాయి. ఇవి అన్నీ జైన గుహాలు.

### 11.1.2.1 ముఖ్య లక్షణాలు :

ఒరిస్సా రాష్ట్రంళోని ఉదయగిరి వద్ద గల ఉదయగిరి,ఖందగిరి కొండలలోని జైనగుహాలయాల ముఖ్యలక్షణాలు 1. బౌద్ధ విహారాలలో వలె వీటికి స్తంభాల హాలు లేదు. (2) ఈ గుహలు శిలాఖండాల పైభాగాలకు దగ్గరగా తొలచి రూపొందించబడ్డాయి. (3) బౌద్ధ విహారాలల్లోని గదుల కన్న వీటిలోని గదులు చాలా చిన్నవి. (4) కొన్ని గుహలు ఒకే గదిని కలిగి ఉన్నాయి, వరండా కూడా లేదు. (5) కొన్ని గుహాలు వరండాలను కలిగి వాటి వెనుక గోడలో గదులు ఉన్నాయి. (6) కొన్ని గుహలు రెండు అంతస్తులు కలిగి ఉన్నాయి. (7) గుహాలయాలు గదుల పైప్రవేశాల పైభాగాల్లోతోరణాలు,అద్భుత శిల్పాలున్నాయి. (8) ప్రవేశమార్గాల ఇరువైపులా గల కుడ్య స్తంభాల శీర్షిక భాగంళ నాల్గు వీపులు కలిసినట్లున్న జంతువులున్నాయి. (9) కొన్ని గుహలకు ముందు భాగంలో ప్రాంగణాలున్నాయి. (10) గదులు ప్రాంగణం ఒకవైపు లేదా రెండు వైపులా లేక మూడు వైపులా ఉన్నాయి. (11) స్తంభాల పైభాగం ఘనచతురస్రాకారంగాను, మధ్యభాగం అష్టముఖం రూపంలో ఉన్నాయి.

### 11.1.2.2 ఉదయగిరి గుహాలు :

ఒరిస్సా రాష్ట్రంలోని ఉదయగిరి కొండలో 19 ఉదయగిరి గుహాలున్నాయి. ఇవి జైన గుహాలు, వీటిలో రాణీ గుంఫా,హతిగుంఫా, గణేశగుంఫా,మంచాపురి గుహాలు ముఖ్యమైనవి. ఈ గుహలు క్రీ.పూ.100. క్రీ.శ. 150 మధ్య కాలం నాటివి. ఇవి ఇసుకరాతి కొండలలో తొలచబడినవి.

### 11.1.2.2.1 మొదటి గుహా :

ఈ గుహాను 'రాణి గుంఫా' అంటారు. ఇది రెండంతస్తుల గుహ. ఇది ఉదయగిరి గుహాలో పెద్దది. ప్రాంగణం మూడు వైపులా గదులు ఉన్నాయి. కుడివైపు వరసలో గల గదికి మూడు ప్రవేశమార్గాలు, స్తంభం వరండా గలదు. ఎడమవైపు వరసలో ఒకస్తంభం వరండా,దానివెనుక గోడ భాగంలో మూడు గదులు, ఎడమ వైపు ఒక గది ఉంది. వరండా స్తంభాలు,దాని పైకప్పు శిధిలమయింది. కింది అంతస్తులో ద్వారాల కిరువైపులా ద్వారపాలకుల విగ్రహాలు గలవు. ఈ గుహాల సాహిత్య, నాటక కధలలొని ఘట్టాలు శిల్పీకరించబడి వుంది. గుహా గదుల ద్వారాల కిరువైపులా గల కుడ్య స్తంభాల ఫలకం పైన రెక్కల సింహం, ఎద్దు మొదలగు జంతువుల శిల్పాలు ఉన్నాయి. ద్వారాల పై నున్న కూడులొ తేనే టీగలు,జంతువుల నోటి నుండి ఉద్భవించుచున్న తీగలు, పద్మాలు, వాటి పై శ్రీవత్స చిహ్నాలు ఉన్నాయి. ఈ గుహాలో ఉదయన, వాసవదత్త కథ, దుష్యంతశకుంతల కధా శిల్పాలున్నాయి. శకుంతల,దుష్యంతల కథలో దుష్యంతరాజు కణ్వమహర్షి ఆశ్రమానికెళ్ళటం, అచట శకుంతలను చూచి ఆమెను ప్రేమించుట అనె గాథ ఇచటి శిల్పాల్లో స్పష్టంగా రూపొందించబడి వుంది. తొలి చిత్రంలో దుష్యంతరాజు సైన్యంతో వచ్చుట, రెండొ చిత్రంలో జింకల పై అతడు బాణం వదలుట, ముడో చిత్రంలో రాజు దృష్టి ఒక స్త్రీపై పడుట చిత్రీకరించబడింది. ఈ చిత్రాలన్నీ మహభారతంలోని శకుంతల, దుష్యంతుల కధకు దగ్గరగా ఉన్నాయి.ఈ కధకు జైన గుహాలో శిల్పారూపంలో మలచడాన్ని బట్టి ఈ కధ నాడు మంచి ప్రచారంలో ఉన్నట్లు భావించవచ్చు. పై అంతస్తులో ఎనిమిది గదులున్నాయి. వీటి ద్వారాలపై ఏడు శిల్ప దృశ్యాలున్నాయి. మొదటి దృశ్యంలో స్వర్గదేవతలు ఒక పద్మాల దండను తీసుకొని వెళ్ళు తున్నట్లు చెక్కబడింది. రెండు ఏనుగులు ప్రజల పై దాడి చేస్తున్నట్లు ఉంది. మూడో చిత్రంలో నాల్గు స్తంభాలు వాటి పై చిత్రాలు గలవు. ఈ చిత్రాలలొ ఒక దానిలొ ఒక పురుషుడు ఒక స్త్రీని ఎత్తుకెళ్ళుతున్నట్లు మలచబడి ఉంది. ఆరో చిత్రంలో ముగ్గురు జంటలు ఆనందంగా తాగుతున్నట్లు చూపబడింది. ఈ చిత్రం సాంచిలోని ఉత్తర చిత్రాన్ని పోలి వుంది. ఉత్తరకురు అనెది ఊహాతితమైన ఆనందనిలయం.ఇందు స్త్రీ పురుషులు నిరంతరం యవ్వనాన్ని కలిగి వుంటారు. వారి కోర్కెలను కల్పవృక్షం తీరుస్తుంది. ఈ గుహ పై అంతస్తులోని గదుల ద్వారాలపై గల కూడుల భాగాల్లొ తేనేటీగలు, పద్మం, పలురకాల తీగలు, జంతువులను తరుముచున్న బాలుర చిత్రాలున్నాయి. కూడుల మధ్యగల విభాగాల్లొ శకుంతల, దుష్యంతుల కధా శిల్పముంది.

### 11.1.2.2.2 మూడో గుహా :

ఈ గుహాను 'ఛోటా హతీ గుంఫా' అంటారు. ఇది ఒక చిన్న గది. దీనికి వరండా లేదు. దీని ముఖ భాగంలో ద్వారం పైన తోరణం, ద్వారానికిరువైపులా మూడు చొప్పున మొత్తం ఆరు ఏనుగులున్నాయి. ద్వారానికిరువైపులా గల కుడ్య స్తంభాలపైన రెక్కల జంతువుల శిల్పాలున్నాయి.

### 11.1.2.2.3 నాల్గో గుహా :

ఉదయగిరిలో కొండలలోని నాల్గో గుహను 'అలకపురి గుంఫా' అంటారు. ఇది రెండు అంతస్తుల గుహ.

### 11.1.2.2.4 ఐదో గుహా :

ఉదయగిరి గుహలలొ ఐదో గుహను 'జయవిజయ గుంఫా' అంటారు. దీనికి ఒక వరండా, రెండు గదులున్నాయి.

### 11.1.2.2.5 తొమ్మిదో గుహ :

ఉదయగిరిలోని పెద్ద గుహలలో ఇది ఒకటి. ఇది రెండు అంతస్తుల గుహ. కింది గుహను 'మంచాపురియని', పై గుహను స్వర్గపురియని అంటారు. మంచాపురికి రెండు వరసల్లో నాల్గు గదులున్నాయి. గదుల ప్రవేశానికి ఇరువైపులా ద్వారపాలకులున్నారు. స్వర్గపురి గదుల ద్వారాల పైన మకరాల నోటినుంచి వస్తున్నట్లున్న తీగల శిల్పముంది. ఈ గుహను ఖారవేలుని రాణి జైన సన్యాసులకు దానమిచ్చినట్లు తెలుస్తుంది.

### 11.1.2.2.6 పదో గుహ :

దీనిని 'గణేశ గుహ' అంటారు. ఈ గుహ వెనుక గోడపై గణేశ శిల్పముంది. ఈ గుహ ముందు రెండు ఏక శిలా ఏనుగులున్నాయి. ఈ ఏనుగుల తొండాలలో మామిడి కొమ్మలు గలవు. ఈ గుహ చారిత్రక శిల్పాలకు ప్రసిద్ధి. ఇందులో కళింగ రాజు ఖారవేలుడు యుద్ధ భూమి కెళ్ళడం, యుద్ధ భూమి నుంచి తిరిగివచ్చుట శిల్పీకరించబడి ఉంది. మొదటి చిత్రంలో కాల్బల సైనికుల గుంపు చూపబడింది. సైనికులకు ముందు ముగ్గురు వ్యక్తులు ఏనుగుపై పయనిస్తున్నారు. వీరిలో మధ్య గల వ్యక్తి ప్రముఖంగా చూపబడింది. అందువల్ల ఇతడు వేలుడై ఉండవచ్చు ఏనుగును స్త్రీ నడుపుతున్నది. రెండో చిత్రంలో ముగ్గురు వ్యక్తులు కిందికి దిగుచున్నట్లు చిత్రీకరించబడింది. మూడో చిత్రంలో ముగ్గురు ముందుకు వెళ్తున్నట్లు చూపబడింది. రాణి గుంఫా గుహలో వలె ఈగుహలో కూడా ఒక పురుషుడు ఒక స్త్రీని ఎత్తుకెళ్ళుతున్న శిల్పముంది.

### 11.1.2.2.7 పన్నెండో గుహ :

ఉదయగిరిలోని 12 వ గుహను 'పులి గుహ' అంటారు. పులి పై దవడ లాగ ఈ గుహ పై విభాగంలో రూపొందించి ఉన్నందున దీనికీ పేరొచ్చింది.

### 11.1.2.2.8 పదునాల్గొ గుహ :

ఉదయగిరిలోని 14 వ గుహను 'హతీగుంఫా' అని అంటారు. ఈ గుహ ముందు వరండా లేదు. ఈ గుహ పైన ఖారవేలుని శాసనముంది.

## 11.1.2.3 ఖందగిరి గుహలు :

ఒరిస్సా రాష్ట్రంలోని ఉదయగిరి వద్దగల ఖందగిరి కొండలో 16 జైన గుహలున్నాయి. ఇవి ఇసుక రాతిలో తొలచబడినవి. ఇవి కూడా ఉదయగిరి గుహల కాలానికి చెందినవే.

### 11.1.2.3.1 మూడోగుహ :

ఖందగిరి కొండలోని మూడొ గుహను 'అనంతగుంఫా' అంటారు. దీని ద్వారాల పైన గల తోరణాలి భాగంలో సర్పాల జంటల శిల్పాలున్నాయి. జైన చిహ్నాలైన నందిపాద, శ్రీవత్స,స్వస్తిక చిహ్నాలు కూడా ద్వారాలపై ఉన్నాయి. కూడు భాగంలో సూర్య, గజలక్ష్మి శిల్పాలున్నాయి. గజలక్ష్మి వికసించిన తామరలున్న కొలనులొ నిలబడి ఉంది. ఈమె చేతులకు తామరలు చుట్టుకొని ఉన్నాయి. ఈమెకు ఇరువైపుల ఏనుగులు గలవు. ఈ గుహ కూడుల మధ్య భాగాల్లో గంధర్వుల శిల్పాలున్నాయి.

### 11.1.2.3.2 ఏడో గుహ :

ఖందగిరిలోని ఏడోగుహను 'నవముని గుహ' అని అంటారు. ఈ గుహలో 9 మంది తీర్ధంకరుల శిల్పాలున్నాయి. ఈ తీర్ధంకరులు పద్మాసనంలో కొష్టాల్లో ఆశీనులై ఉన్నారు. తీర్ధంకరులపై ఛత్రాలున్నాయి. వీరి క్రింద శాసన దేవతలున్నారు. వీరిలో చక్రేశ్వరి, రోహిణి, ప్రజ్ఞపతి, వజ్రశృంఖల, గాంధారి,పద్మావతి,అమర అనువారు ఉన్నారు. వీరిపైన గణపతి మలచబడింది.

**11.1.2.3.3 ఎనిమిది,తొమ్మిది గుహలు :**

ఖందగిరిలొని ఎనిమిదో గుహలో24 మంది తీర్థంకరులున్నారు. వీరిలో ఒకరిని పలుమార్లు చెక్కిఉన్నారు. 24 మంది కింద 24 మంది శాసనదేవతలు గలరు. తొమ్మిది గుహలో 8 మంది తీర్థంకరులున్నారు. రుషభనాధుడు, అతని పరివార సేవకుల శిల్పాలు కూడ ఉన్నాయి.

**11.1.2.3.4 పది, పదకొండు గుహలు :**

ఖందగిరిలోని పది,పదకొండు గుహలలొ కూడా కొన్ని తీర్థంకరులు శిల్పాలున్నాయి.

## 11.1.2.4 సమీక్ష :

ఉదయగిరి వద్ద గల ఉదయగిరి, ఖండగిరి కొండలలో జైన గుహలున్నాయి. ఇవి కొండ పైభాగానికి దగ్గరగా రూపొందించబడి ఉన్నాయి. ఈ విధానం గుహపైన గల బరువు తగ్గించుటకు అనుసరించడం జరిగింది. కొండరాయి మెతువు వల్ల కూడా ఇట్టి పద్ధతి అనుసరించడం జరిగింది. గదులు శిల్పరహితంగా ఉండగా, గుహల ముఖ భాగాలు, స్తంభాలపై శిల్పాలున్నాయి.ఈ శిల్పాలలో శిల్పనైపుణ్యంలో ఏక రీతీ కనపడదు. కాని ఇవి బార్హుత్ శిల్పాల కన్నా పరిణితి చెందినవి. రాణిగుంఫా పైఅంతస్తులోని శిల్పాలు సాంబితోరణాల శిల్పాల లాగ ఉన్నత రీతిలో ఉన్నాయి. ఉదయగిరి, ఖందగిరిలలో శిల్పాలను శిల్పి సహజంగా చూపాడు. ఈ శిల్పాలు ఆనాటి ప్రజలు సాంఘిక జీవనాన్ని గూర్చి కూడా తెలుపుతున్నాయి. వాటిలో నాటి ప్రజల దుస్తులు, నగలు, శిరొజాలంకరణాలు, గృహోపకరణాలు మొదలైనవి గలవు. నాటి ప్రజలు పలుచటి ధొవతిని ధరించేవారు. స్త్రీల శరీర పైభాగం నగ్నంగా వుంది. పురుషులు తలపాగాలు ధరించేవారు. ధనవంతుదులు వీటికి విలువైన ఆభరణాలు ధరించేవారు. స్త్రీలు వలువలను తలపై కప్పుకొనేవారు. స్త్రీల శిరోజాలు అనేకరకాల ముడుతలతో,నగలతో అలంకరించు కొనేవారు. స్త్రీలు దుస్తుల, కన్నా నగలను ఎక్కువగా ధరించేవారు. చెవి ఆభరణాలు,నెక్‌లెస్‌లు, గాజులు,వడ్డాణాలు, కాలి గజ్జెలు, తలాభరణాలు ధరించేవారు. చెవికి రింగులు, కమ్మలు ధరించేవారు.గృహోపకరణాల్లో పరుపులు, పీటలు,మేజాలు గలవు. ఈ శిల్పాలు నాటిప్రజల సంగీత నాట్యాల గురించి కూడా తెలుపుచున్నాయి.

## 11.1.3 ఎల్లోరా గుహలు :

మహారాష్ట్రలోని ఎల్లోరాలో మొత్తం 34 గుహలున్నాయి. వాటిలో 30,31,32,33,34 సంఖ్యగల గుహలు జైన గుహాలయాలు.ఇవి క్రీ.శ. 9,10 శతాబ్దాల నాటివి. ఇవి ఇచట గల హిందూ గుహాలయాల వలె ఉన్నాయి. 30వ గుహను 'ఛోటా కైలాస' మంటారు. ఈ గుహముందు ఏకశిలా గోపుర ద్వారాముంది. గోపుర ద్వారం తర్వాత నంది విగ్రహం గలదు. ఈ గుహకు గర్భగృహం, అంతరాళం, ముఖమండపం గలవు, గుహగోడల పై అనేక జైన శిల్పాలున్నాయి. గర్భగృహంలో సింహాసనంపై అసీనుడైన మహవీరుని శిల్పముంది. 32వ గుహను 'ఇంద్ర సభ' అంటారు. ఈ గుహముందు ఏకశిలా గోపుర ద్వారాముంది. గోపురంలోపల ప్రాంగణం మధ్యలో ఏకశిలా ఆలయముంది. ఈ ఆలయం ద్రావిడరీతిలో వుంది. ఈ గుహ రెండు అంతస్తులుగా ఉంది. కింది అంతస్తు స్తంభవరండాను, అనేక గదులను కలిగివుంది. గదులలో జైన శిల్పాలున్నాయి. వీటిలో మహవీరుడు, వృషభనాధుడు, గోమదేశ్వరుడు, మాతంగుడు ముఖ్యమైనవి. గదులద్వారాల రక్షకులుగా ద్వార పాలకులున్నారు పైఅంతస్థులో వరండా, హాలు, గర్భగృహం, వరండాకు కుడి, ఎడమల్లో శిల్పాలున్నాయి. పై అంతస్తును 'ఇంద్రసభ' అంటారు. ఇందలి హాలులో 12 స్తంభాలున్నాయి. స్తంభా అగ్రభాగాలలో పూర్ణకలశ విభాగం వున్నది. హాలుకు రెండు వైపుల మాతంగ, శిద్దాంకుల శిల్పాలున్నాయి. ఇచట ఇతర శిల్పాల్లో మహావీర, పార్శ్యనాధ శిల్పాలు గలవు. పై అంతస్తులోని హాలులో 14 స్తంభాలున్నాయి. హాలు వెనుక గర్భ గృహం కలదు. 34వ నెంబరు గుహలో మాతంగ, సిద్ధక, మహావీర శిల్పాలు కలవు.

## 11.1.4 బాదామి గుహలు :

కర్ణాటకలోని బాదామిలో 4 గుహాలయాలున్నాయి. వాటిలో 4వ సంఖ్యగల గుహ జైన గుహాలయం. ఇది వరండా, హాలు, గర్భగృహం కలిగి వున్నాయి. దీని కుడ్యాలపై అనేక శిల్పాలున్నాయి.

## 11.1.5 అయ్యవోలు గుహలు :

కర్ణాటకలోని అయ్యవోలులో రెండు గుహాలుయాలున్నాయి. వీటిలో ఒకటి రావణగుడి. ఇది శివాలయం. రెండో గుహ జైన గుహాలయం. ఇది బాదామి గుహలాగా వరండా, హాలు, గర్భగృహం కలిగి వుంది.

## 11.1.6 జైనుల ఆలయాలు (ఆలయ నగరాలు) :

భారతదేశంలో ప్రత్యేకమైన జైన వాస్తురీతి రూపుదిద్దుకోలేదు. కాని వీరి నిర్మాణాలు తమ మత అవసరాలను తీర్చేరీతిలో ఉన్నాయి. జైన మతంలో మొత్తం 24 మంది తీర్థంకరులు గలరు. వీరికి దైవత్వం ఆపాదించి జైన ఆలయాల్లో ప్రతిష్టింపబడి ఆరాధించ బడ్డారు. హైందవులు లాగానే జైనులు కూడా వివిధ ప్రాంతాలలో ఆలయాలను నిర్మించారు. ఇవి ఆయా ప్రాంతాల్లోని హిందూ దేవాలయ రీతులకు దగ్గరగా వున్నాయి. జైన ఆలయాలు ప్రధానంగా పర్వతాలపై నిర్మించబడ్డాయి. వీరి పర్వత ఆలయాల సమూహాలనే 'ఆలయ నగరాలు' అంటారు. వీరి ఆలయాలు చాలా వరకు మధ్యయుగ రెండో భాగానికి చెందినవి. జైనులు. అలయ నగరాల చుట్టూ ప్రాకారం ఉంది. ఈ ఆలయ నగరాలనే తీర్థాలని పిలుస్తారు, ఈ నగరాల్లో మానవ నివాస గృహాలుండవు. నిర్ణీత రోజుల్లో మాత్రమే భక్తులు ఈ నగర ఆలయాలను సందర్శించేవారు. ఈ నగరాల్లో ఏక గృహనిర్మాణాలు, బహుగృహ నిర్మాణాలు, అంతస్తుల నిర్మాణాలు, స్తంభ వరండాలతో కూడిన నిర్మాణాలు గలవు. చతుర్ముఖ తీర్థంకరుల శిల్పాలు గల దేవగృహాలు కూడా కొన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. ఇటువంటి ఆలయాలకు నాలుగు ద్వారాలు గలవు.

### 11.1.6.1 శత్రుంజయ ఆలయనగరం :

ఆలయ నగరాల్లో ముఖ్యమైనవి కథియవాడ్ జిల్లాలోని శత్రుంజయ, గిర్నార్ కొండలపై గలవు. వీటలో శత్రుంజయ ఆలయనగరం పెద్దది. ఇచటి ఆలయాలు రెండు పర్వత భాగాలపై గలవు. ఇచట పలు పరిమాణాలలో కూడిన ఆలయాలున్నాయి. వీటిలో ఆధినాధుని చౌముఖ్ ఆలయం ఒకటి. ఈ ఆలయ గర్భ గృహం చతురస్రాకారంగా, నాల్గుద్వారాలు కలిగివుంది. శ్రీ ఆదీశ్వరాలయం కూడా నాలుగు ద్వారాలతో కూడి ఉంది. ఈ ఆలయ గర్భగృహం ముందు స్తంభాల వసారా గలదు.

### 11.1.6.2 గిర్నార్ ఆలయనగరం :

జునాఘడ్ దగ్గరలోని గిర్నార్ పర్వతం పైగల ఆలయ నగరంలో ముఖ్యమైన ఆలయం నేమినాధ ఆలయం నేమినాధ ఆలయం. 190 అడుగులు పొడవు, 30 అడుగుల వెడల్పుగల ప్రాకారం మధ్య ఈ ఆలయం నిర్మించబడి వుంది. దీని చుట్టూ 70 ప్రాకార దేవతా గృహాలు గల స్తంభాల వసారా గలదు. ఆలయం పొడవు 120 అడుగులు, వెడల్పు 60 అడుగులు. ఆలయం ముందు చతురస్రాకారపు మండపముంది. విమాన భాగంలో లఘు విమానాలు కలవు. గిర్నాల్ పర్వతంపై వాస్తుపాల, తేజపాల దేవాలయం కలవు. ఈ ఆలయంలో హాలు, మూడు వైపులా దేవగృహాలున్నాయి. తూర్పు దేవగృహంలో మల్లినాధుని ప్రతిమ ఉంది.

### 11.1.6.3 శ్రావణ బెళ్గొల :

దక్షిణ భారతదేశంలో శ్రావణ బెళ్గొల ఒక ముఖ్య జైన కేంద్రం. ఇచట చంద్రగుప్తమౌర్యుడు, భద్రబాహు జైనమత సాంప్రదాయం ప్రకారం తనువు చాలించినట్లు ఆధారాలు గలవు అందువల్లనే ఇచటి పర్వతానికి చంద్రగిరి అనే పేరు వచ్చింది. ఇచట క్రీ.శ. 12వ శతాబ్దం తరువాత అనేక ఆలయాలు నిర్మించబడినాయి. ఇచట చంద్రగిరి, ఇంద్రబెట్ట అను పర్వత భాగాలున్నాయి. ఈ రెంటి మధ్య బెళ్గొల అను కొలనువుంది. చంద్రగరి ఆలయాలను 'బసదీలు' అంటారు. ఇవి మొత్తం 15 గలవు. ఇవి చంద్రగిరి కొండపై ఉన్నాయి. ఇవి ద్రావిడ రీతిలో నిర్మించబడింది. ఇవి క్రీ.శ. 12వ శతాబ్దినాటివి. ఇచటి ఆలయాల్లో చాముండరాయ బసది పెద్దది. ఈ ఆలయం పిరమిడు ఆకృతిలో వుంది. ఇంద్రబెట్ట చుట్టూ ప్రాకారం వుంది. లోపలి భాగంలో స్తంభా వరుస, మధ్యలో జైన ప్రతిమలు వున్నాయి. ఈ ప్రతిమలు స్థానక రూపంలో ఏకశిలలో రూపొందించబడింది. ఇటు వంటి ప్రతిమలు కెనరాలోని కర్కల, ఏనూర్‌లలో గలవు. ఇంద్రబెట్టు పర్వతం

పైన ప్రసిద్ధిగాంచిన గోమటేశ్వరుని ప్రతిమ వుంది. గోమటేశ్వరుడు మొదటి జైన తీర్థంకరుడైన రుషభనాధుని కుమారుడు. గోమటేశ్వరుని ప్రతిమ ఎత్తు 56 ఆడుగులు. దీనిని గాంగ రాజైన రెండో రాచమల్లుని కాలంలో మలచబడింది. రాచమల్లుని మంత్రి చాముండ రాయని కోరిక మేరకు ఈ విగ్రహం క్రీ.శ. 983 లో రూపొందినట్లు తెలుస్తుంది. ఈ శిల్పం దిగంబరంగా వుంది.

### 11.1.6.4 ఇతర ప్రాంత ఆలయాలు :

మధ్యభారతంలో సోనార్‌ఘర్‌లో, మధ్య ప్రావిన్స్‌లో కుందల్ పూర్‌లో, బీహార్‌లోని ముక్తగిరిలో, పరాశనాథలో జైన ఆలయ నగరాలు కలవు. మార్వార్‌లో రాణ్‌పూర్ యందు ఆదినాధ అలయం గలదు.దీని నిర్మాత ధరణక, స్థపతి దేవకుడు. ఇది క్రీ.శ.1439లో నిర్మితమైంది. ఈ ఆలయంలో 29 మండపాలు,420 స్తంభాలు గలవు. ఇచట 66 దేవగృహాలున్నాయి. ప్రతి దేశ గృహంపై లఘుశిఖరాలున్నాయి. హనుమకొండలోని పద్మాక్షి ఆలయం, హంఎలోని జైన అలయాలు పిరమిడు ఆకృతిలోగలవు. బిక్కవోలులో ఒక జైనాలయం గలదు. దీనికి గర్భగృహం, మండపం వున్నాయి. ఈ ఆలయప్రవేశానికి ఇరువైపులా ద్వారపాలకులు, ద్వారబంధం మీద గజలక్ష్మి వుంది. పట్టడకల్‌లొ ఒక జైనాలయముంది. ఆంధ్రలో దానవులపాడు, హనుమకొండ, బెజవాడ, గుడివాడ, బిక్కవొలు,పితాపురం, రామతీర్ధం మొదలగు చోట్ల జైన చిహ్నాలు కన్పిస్తున్నాయి. దానవులపాడు,బెజవాడ, పెనుమంచిలలో చౌముఖ జైన విగ్రహాలు గలవు.

రాజస్థాన్‌లొ అబూ పర్వతం మీద గల జైన ఆలయాలు గుజరాత్ సాంప్రదాయ రీతిలో నిర్మించబడ్డాయి. ఇచట ఒకే ఒక చతుర్భుజ ప్రాకారంలొ నాలుగు ప్రధాన ఆలయాలు నిర్మించ బడ్డాయి. వీటిలో అతి ప్రసిద్ధి చెందినవి రెండు ఆలయాలు, అవి రుషభనాధ, నేమినాధ ఆలయాలు. రుషభనాధాలయాన్ని క్రీ.శ. 1031 లో విమల అనే జైన ధనికుడు నిర్మించాడు. నేమినాధాలయాన్ని క్రీ.శ. 1232 లో తేజపాల,వస్తుపాల అనే ఇద్దరు వణిక్ సోదరులు నిర్మించారు. ఈ ఆలయంలో పశ్చిమ దిశ గర్భగృహం, దానిముందు మండపం, అర్ధమండపం గలవు. ఈ మూడు విభాగాల చుట్టూ స్తంభాల మండపం గలదు. ఈ స్తంభాల పై విగ్రహాలు చెక్కబడి వున్నాయి. పాలరాయితో నిర్మించబడిన ఈ ఆలయ లోపలిభాగం ఆద్భుతంగా అలంకరించబడి వుంది. స్తంభాలు మలచడంలో, వితానాలకున్న చెక్కడాలలో అత్యంత ప్రావీణ్యం ప్రదర్శితమైంది. ఈ వితానాలలో చెక్కిన స్పటిక వర్ణ సహస్రదళ పద్మాలు జగత్ప్ర సిద్ధమైనవి. పద్మం చుట్టూ ఉన్న విద్యాదేవిమూర్తులు అత్యంత రమణీయంగా వుంటాయి. అలయ కుడ్యాల మీద రాజపుత్రుల వీరగాధలు, జానపద గాధలున్నాయి. పాలరాతితొ నిర్మించబడిన ఈ అలయాలలొ శిల్పులు ప్రదర్శించిన సునీతమైన పనితనం, రేఖాలంకరణలోని వైవిధ్యం, భావనాశక్తి వర్ణణాతీతం.

### 11.1.6.5 మానస్తంభాలు :

జైనులు మానస్తంభాలనెడి స్వేచ్ఛా స్థానక సంభాలను నిర్మించారు. ఇవి బసదీల ముందు నిర్మించడం జరిగేది. శ్రావణ బెళ్గొలలోని పార్శ్వనాధ ఆలయం ముందు మానస్తంభం గలదు. ఈ స్తంభాలు ఆకర్షణీయంగా సుమారు 50 అడుగులు ఎత్తు కలిగివుంటాయి.

## 11.1.7 సారాంశము :

భారతదేశములోని ఒరిస్సాలో ఉదయగిరి, చంద్రగిరి కొండల్లో నిర్మించబడిన జైన గుహాలయాలు, లక్షణాలు అలాగే వివిధ ప్రాంతాలలో నిర్మించబడిన జైన గుహాలయాల వాస్తుశిల్ప లక్షణాలు విశదీకరించబడ్డాయి.

## 11.1.8 నమూనా ప్రశ్నలు :

1) ఉదయగిరి వద్దగల జైన గుహాలయాలను గురించి వివరింపుము.

2) జైన మత వాస్తు, శిల్ప చరిత్రను గురించి వ్రాయుము.

డా.వి.కె.మోహన్

# 11.2,హిందూ - బౌద్ధ గుహాలయాల వాస్తు శిల్పం -

# 11.3.బౌద్ధ గుహాలయాల వాస్తు శిల్పం

## 11.2.0 లక్ష్యం :

హిందూ గుహలయాల వాస్తుశిల్పం మరియు బౌద్ధ గుహాలయాల వాస్తు శిల్పం గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


**11.2 హిందూ గుహాలయాల వాస్తు శిల్పం**

**11.2.1 హిందూ గుహాలయాలు**

**11.2.1.1 పరిచయము**

**11.2.1.2 ఉదయగిరి**

**11.2.1.3 బాదామి**

**11.2.1.4 ఎల్లోరా**

**11.2.1.5 ఎలిఫెంటా**

**11.2.1.6 జోగేశ్వరి**

**11.2.1.7 విజయవాడ**

**11.2.1.8 మొగల్‌రాజపురం**

**11.2.1.9 ఉండవల్లి**

**11.2.1.10 భైరవకోన**

**11.3 బౌద్ధ గుహాలయాలు**

**11.3.1 పరిచయము**

**11.3.2 చైత్యగృహాలు**

**11.3.2.1 హీనయాన చైత్యగృహాలు**

**11.3.2.2 మహాయాన చైత్యగృహాలు**

**11.3.3 విహారాలు**

**11.3.3.1 హీనయాన విహారాలు**

**11.3.3.2 మహాయాన విహారాలు**

11.3.4 సారాంశము

11.3.5 నమూనా ప్రశ్నలు

## 11.2 హిందూ గుహాలయాలు :

### 11.2.1 పరిచయము :

గుహాలయ నిర్మాణానికి ఒరవడి పెట్టిన వారు మౌర్యులు. భారతదేశంలో తొలిసారిగా మౌర్య అశోకుడు, అతని మనుమడైన దశరథుడు బీహర్‌లో గయ దగ్గర బారాబర్,నాగార్జుని, సీతామర్హి కొండలలొ గుహలయాలు తొలిపించారు. వాటిలో సుదామ,లొమస్ రుషి గుహలు ముఖ్యమైనవి. ఇవి కఠిన శిలయందు తొలిపించబడ్డాయి. ఆంధ్రశాతవాహనుల కాలంలో ఈగుహాలయాలు నిర్దుష్టమైన రూపురేఖలను సమకూర్చుకొని చైత్యశాలలుగాను, విహారాలు గాను అవతరించాయి. చైత్యశాల ప్రార్ధనా మందిరమైతే, విహారం భిక్షువుల నివాస స్థలం. క్రీ.పూ. 200 మధ్య కాలంలో పశ్చిమ దక్కన్‌లో నాసిక్, అజంతా, ఔరంగాబాద్, ఎల్లొరా మొదలగు చోట్ల మెతువు శిలయందు చైత్యగృహాలు, విహరాలు తొలచబడ్డాయి. ఉత్తర ఆంధ్ర కోస్తాలో గుంటుపల్లి, శంకరంలలో, దక్షిణ ఒరిస్సాలో ఖందగిరి, ఉదయగిరి ప్రాంతాలలో మెతువు శిలలో గుహాలయాలు నిర్మించబడ్డాయి. గుంటుపల్లి గుహాలయం సుదామ, లోమస్ రుషి గుహాలయాలను పోలి ఉంది. అజంతాలో గుహాలయాల నిర్మాణ క్రమం క్రీ. పూ. 2వ శతాబ్దిలో ప్రారంభమయి క్రీ.శ. 9వ శతాబ్దం వరకు కొనసాగింది. ఎల్లోరా గుహాలయాలు క్రీ. శ. 4వ శతాబ్దం నుంచి క్రీ.శ. 7వ శతాబ్దం వరకు నిర్మించబడ్డాయి. దక్షిణ భారతదేశంలో బాదామి చాళుక్యులు, విష్ణుకుండినులు, పల్లవులు, పాండ్యులు, రేనాటి చోళులు క్రీ.శ. 6వ శతాబ్దం మొదలు క్రీ.శ. 10 వ శతాబ్దం వరకు హిందూ, జైన బౌద్ధ గుహాలయ నిర్మాణం కొనసాగించారు. బాదామి చాళుక్యరాజైన మంగళేశుడు, అతనికి సమకాలీనుడైన సల్లరాజు మొదటి మహేంద్రవర్మ తో దక్షిణ దేశంలో గుహాలయాల నిర్మాణం ప్రారంభమైంది. మంగళేశుడు బాదామిలో తొలి విష్ణుగుహాలయాన్ని నిర్మించగా మొదటి మహేంద్రవర్మ మందగపట్టులో త్రిమూర్తుల కొరకు తొలిగుహాలయం నిర్మించాడు. మంగళేశుడు ఇసుకరాయి, లేక సున్నపురాయితో గుహాలయాలు తొలిపించగా, మహేంద్ర వర్మ కఠినశిలతో నిర్మించాడు. మొదటి మహేంద్రవర్మ తరువాత అతని వారసులు ఈ నిర్మాణ రీతిని కొనసాగించారు. విష్ణుకుండినులు కృష్ణానదికి ఇరువైపులా మెతువుశిలలో అనేక గుహాలయాలను నిర్మించారు. ఇవి విజయవాడ, మొగల్ రాజపురం, పెనమాక, సీతారామపురం, ఉండవల్లి ప్రాంతాలలో గలవు. రేనాటి చోళులు ప్రకాశం జిల్లా భైరవ కోనలో గుహాలయాలు తొలిపించారు.

### 11.2.2. ఉదయగిరి :

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో విదిశ పట్టణానికి నాలు కిలోమీటర్ల దూరంలోగల ఉదయగిరిలో 20 గుహలున్నాయి. ఇవి పరిమాణంలో చాలా చిన్నవి. వీటిలో 1,20 సంఖ్య గల గుహలు జైనమతానికి సంబంధించినవి కాగా మిగిలినవి హిందు గుహలు. ప్రతి గుహలో దేవతల ప్రతిమలు గలవు. ఇచటి గుహలన్నింటిలో 5వ సంఖ్య గల గుహ ప్రఖ్యాతి వహించింది. ఇచటనే వరాహావతార విగ్రహం వుంది. గుహకు రెండు వైపులా గంగా, యమునా శిల్పాలు గలవు. ఈ గుహ గుప్తుల కాలం నాటిది. నాల్గవ సంఖ్యగల గుహలో వీణ వాయిస్తున్న మనిషి విగ్రహముంది. 6,7 సంఖ్య గల గుహలలో గుప్తరాజుల శాసనాలు గలవు. 13 వ సంఖ్య గల గుహలో శేషసాయి. విష్ణు విగ్రహముంది.

### 11.2.3 బాదామి :

కర్ణాటకలో గల బాదామి తొలి చాళుక్యుల రాజధాని. ఇచట గల నాల్గు గుహలయాలలో మూడు హిందు గుహాలయాలు. ఈ గుహలు దీర్ఘచతురస్రాకారపు స్తంభాల వరండా, స్తంభ మండపం, మండపం వెనుక గోడ భాగంలో గర్భగృహం కలిగి ఉన్నాయి. మొదటి గుహ శివగృహం. దీని వరండా కూడ్య భాగాలపై హరిహర, అర్ధనారీశ్వర, మహిషమర్ధని శిల్పాలున్నాయి. వితానంలో నటరాజ శిల్పముంది. ఇతనికి సర్పశరీరం, మానవ శిరస్సు వుంది. ఈ గుహలోనే గరుడుని పైనున్న విష్ణు శిల్పం కలదు. రెండో గుహ విష్ణు గుహలయం ఈ గుహవరండాలో, హాలులో నాల్గు స్తంభాల వరుసలు గలవు. ఈ గుహలో వరాహ, త్రివిక్రమ, ద్వార పాలకుల శిల్పాలు, గలవు. మూడవ గుహ కూడా విష్ణు గుహాలయం. దీనిని తొలిచాళుక్య రాజు మంగళేశుడు క్రీ.శ. 578లో తోలిపించాడు. పై రెండు కన్నా ఇది పరిమాణంలో

పెద్దది. గుహ గోడలపై త్రివిక్రమ, స్థానక విష్ణు, హరిహర, వరాహ నరసింహ శిల్పాలున్నాయి. వరండాలోని చివరి స్తంభాలకు 'బ్రాకెట్ ఫిగర్స్' ఉన్నాయి.

## 11.2.4. ఎల్లోరా :

మహారాష్ట్రలోని ఎల్లోరాలో మొత్తం 34 గుహలున్నాయి. అందులో 17 హిందూ గుహాలయాలు. ఇవి క్రీ.శ. 4వ శతాబ్దం క్రీ.శ. 8వ శతాబ్దం మధ్య కాలంలో నిర్మించబడ్డాయి. 14వ గుహలయాన్ని రావణ ఖై అంటారు. దీనికి గర్భ గృహం, దాని చుట్టూ ప్రదక్షిణా పథం, మండపం ఉంది. గర్భగృహంలో దుర్గప్రతిమ ఉంది. ఉత్తర కుడ్యంపై అనేక వైష్ణవ శిల్పాలున్నాయి. దక్షిణ కుడ్యం పై శైవ శిల్పాలున్నాయి. మహిష మర్దని, శివపార్వతులు, భృంగిలో నటరాజు, పార్వతి, కైలాసాన్ని కదలించుచున్న రావణుడు, భైరవుడు, యముడు, సప్తమాతృకలు, దుర్గ, గజలక్ష్మి, వరాహ, శ్రీదేవి, భూదేవి, విష్ణ శిల్పాలు పేర్కొనదగినవి. 15వ గుహాలయాన్ని దశావతార గుహాలయ మంటారు. దీనికి ఏకశిలా ప్రవేశ మార్గముంది. ప్రాంగణంలో నాల్గు స్తంభాల నంది మండపముంది. దీని వెనుక రెండు అంతస్తుల గుహలయ ముంది. కింది అంతస్తులో మండపం, గర్భగృహం గలవు, గర్భగృహంలో శివలింగముంది. మండపంలో 14 స్తంభాలున్నాయి. పై అంతస్తులోని మండపంలో 54 స్తంభాలున్నాయి. ఈగుహల్లో ఒక వైపు వైష్ణవ శిల్పాలు, మరొక వైపు శైవ శిల్పాలున్నాయి.

ఎల్లోరాలోని 16వ గుహ కైలాసనాథాలయం. ఈ ఆలయం ఏకశిలా ఖండంలో తొలచబడింది. దీని నిర్మాత రాష్ట్రకూట మొదటి కృష్ణుడు. ఈ ఆలయానికి గోపుర ద్వారం, నంది మండపం, ముఖమండపం, అంతరాళము, గర్భగృహం, ప్రదక్షిణాపథం, పరివార దేవతాగృహలు, ప్రాంగణం, స్తంభాల వసారా అను అంగాలు గలవు. ఆలయ అధిష్టానం పై ఏనుగుల శిల్పాలున్నాయి. గర్భగృహ, అంతరాళ కుడ్యాలపై కుడ్య స్తంభాలున్నాయి. కుడ్యాలపై దేవ కొష్టాలు గలవు. కోష్టాల పై తోరణాలున్నాయి. తోరణాలలో మానవరూపాలు ఉన్నాయి. విమాన భాగంలో కూట, పంజర, శాలహారములు వరస గలదు. శిఖరం ఆరుముఖాలుగా వుంది. ఇది ద్రావిడ రీతిని తెలియ జేస్తుంది. స్తంభాలవసారా కుడ్యాలపై అనేక శిల్పాలున్నాయి. వీటిలో గజలక్ష్మి, రావణుడు, గంగాదేవి శిల్పాలు ముఖ్యమైనవి. కైలాసనాథాలయం భారతీయ వాస్తుశిల్ప చరిత్రలోనే మకుటాయ మానం. పట్టడకల్ లోని విరూపాక్షాలయం దీనికి మాతృక అని కొందరి భావం. ఈ ఆలయం ప్రపంచ వింతలలో ఒకటని, దీనిని తొలచిన ప్రజలకు, వారి రాజుకు ఇది గర్వ కారణమని స్మిత్ ప్రశంసించాడు.

ఎల్లోరాలోని 21వ గుహలయాన్ని రామేశ్వర గుహలయమంటారు. ఈ గుహలయంలో పెద్ద ప్రాంగణం, ప్రాంగణం మధ్యలో నంది మండపం ఉన్నాయి. ఈ గుహలయానికి స్తంభవరండా, స్తంభమండపం, గర్భగృహం, దీనిచుట్టూ ప్రదక్షిణా పథం ఉన్నాయి. వరండాలోని స్తంభాలపై అందమైన స్త్రీల శిల్పాలున్నాయి. గుహముఖభాగంలో అద్భుతమైన గంగా శిల్పముంది. గర్భగృహంలో శివలింగం ఉంది. మండప కుడ్యాలపై మహిషమర్దని, శివపార్వతులు, నంది, గణాలు, నటరాజ, విష్ణు, లక్ష్మీ, గణేశ, శివ, సప్తమాతృకల శిల్పాలున్నాయి. ఎల్లోరాలోని 29వ గుహాలయాన్ని ధుమార లీన గుంఫా అంటారు. ఇది ఒక పెద్ద హాలు లాగ ఉంది. దీనికి మూడు వైపులా ప్రవేశమార్గాలున్నాయి. ఈ మార్గాల ముందు భాగం లో వరండాలున్నాయి. హలు మధ్య భాగంలో గర్భగృహం ఉంది. దీనికి నాల్గు వైపులా ప్రవేశమార్గాలున్నాయి. గర్భగృహ ప్రవేశమార్గాల కిరువైపులా ద్వార పాలుర శిల్పాలున్నాయి. గర్భగృహంలో శివలింగ ముంది. హాలు కుడ్యాల పై అంధ కాసుర సంహర మూర్తి, రావణానుగ్రహమూర్తి, లకులీశుడు, శివ, పార్వతులు, గంగా యమునల శిల్పాలు ముఖ్యమైనవి.

## 11.2.5. ఎలిఫెంటా :

బొంబాయి వద్ద గల ఒక దీవి ప్రాంతం ఎలిఫెంటా. ఇచట గుహలు శిల్పాలకు ప్రసిద్ధి. ముఖ్యంగా మహేశ శిల్పం ప్రసిద్ధి గాంచింది. ఈ గుహ కొండ పొడుగునా తొలచబడి ఉంది. దీనికి పెద్ద స్తంభాల మండపముంది.

## 11.2.6. జోగేశ్వరి :

సాల్ సెటీ దీవిలోని ఒక ప్రాంతం పేరు జోగేశ్వరి. ఇది ఎలిఫెంటా గుహాలయం వలె ఉంది. దీని హాలు ఎల్లోరాలోని ధూమార్లేను హాలును పోలి ఉన్నది. హలులో 20 స్తంభాలున్నాయి. ఇచటి శిల్పాలన్ని శిథిలమై ఉన్నాయి.

## 11.2.7 విజయవాడ :

విజయవాడ వద్దగల ఇంద్రకీల పర్వతపు తూర్పు పశ్చిమ వాలు భాగాల్లో గల గుహలయాల్లో తూర్పు భాగాన గల అక్కన్న మాదన్న మండపమనెడి రెండో గుహాలయం ముఖ్యమైనది. ఇందు ముందు భాగాన స్తంభ వరండా, దాని వెనుక భాగంలో మూడు దేవగృహాలు కలవు. దీని 'గ్రౌండ్ ప్లాన్' పల్లవ రీతిలో ఉంది. కాని స్తంభాలు పల్లవేతర వాస్తురీతిలో వుంది. ఇచటి క్లుప్త శాసనంలోని 'ఉత్పత్తి పిడుగు' అను పదముంది. ఈ గుహాలయం క్రీ.శ. 7వ శతాబ్దికి చెందినది.

## 11.2.8. మొగల్‌రాజపురం :

విజయవాడకు తూర్పునగల మొగల్రాజపురం కొండలలో హిందూ మతానికి చెందిన ప్రాచీన గుహలున్నాయి. వీటిని విష్ణుకుండిన రాజులు తొలిపించినట్లు పెక్కు మంది చరిత్రకారులు భావిస్తున్నారు. ఇచట మొత్తం 5 గుహలున్నాయి. ఈ గుహలకు స్తంభమండపం, దాని వెనుక ఒకటి లేదా మూడుగదులు గల గర్భగృహం ఉంది. మొదటి గుహాలయానికి మూడు దేవ గృహలున్నాయి. వీటి ముందు అన్నింటికి కలిపి ఒక వరండా వుంది. రెండో గుహలయం ఒకే దేవ గృహాన్ని కలిగి దాని ముందు ధీర్ఘచతురస్రాకార వరండా కలిగి వుంది. మూడో గుహాలయం చాలా చిన్నది. దీనికి దేవగృహం, దీర్ఘచతురస్రాకార వరండా వుంది. ఈ దేవ గృహ వెనుక కాడ్య భాగాన దుర్గ ప్రతిమ ఉంది. నాల్గోగుహ వెనుక గోడపై అర్ధనారీశ్వర మూర్తి మలచబడివుంది. ఐదవగుహ అన్నింటికి కంటే పెద్దది, అందమైనది. ఈ గుహముఖ భాగంలో అష్టభుజ నటరాజ విగ్రహం చెక్కబడివుంది. ఈ గుహలోని స్తంభ మండపానికి వెనుక మూడు గృహాలున్నాయి. ఈ మూడు త్రిమూర్తులకు అంకితమై ఉండవచ్చు.

## 11.2.9. ఉండవల్లి :

గుంటూరు జిల్లాలో కృష్ణానది తీరాన ఉండవల్లి గ్రామం ఉంది. ఈ గ్రామానికి సమీపంలోని కొండల్లో గుహలున్నాయి. ఈ గుహలు నాల్గు అంతస్థులలో తొలచపడింది. దీని నిర్మాతలు విష్ణుకుండినులు. ఇవి మొదట బౌద్ధానికి చెందినవని తర్వాత వీటిని హిందూ ఆలయంగా మార్చారనే సూయల్ అభిప్రాయం సరికాదు. ఈ గుహ రెండవ అంతస్థులో కాడివైపు చివరి భాగంలో శేషతల్పశాయి భారీవిగ్రహం ఉంది. ఈ విగ్రహం పొడవు 13 అడుగులు. ఈ గుహలోని నాల్గు వరసలుగా వున్న స్తంభాలపై రామాయణ, భాగవత, పురాణగాథలు వర్ణిస్తూ అనేక శిల్పాలు మలచబడ్డాయి. మూడో అంతస్తులోని స్తంభాలమీద మలచిన శిల్పాలు పురాణ గాధలను తెలియజేస్తాయి. ఈ గుహస్తంభాల పై సింహం ప్రతిరూపం చెక్కి ఉంది. క్రింది అంతస్థు నుంచి రెండో అంతస్థుకు వెళ్ళే దారిలో రెడ్డి రాజుల శాసనం ఒకటి వుంది.

## 11.2.10. భైరవకోన :

ప్రకాశం జిల్లా భైరవకోనలో ఎనిమిది గుహాలయాలున్నాయి. ఇచట గల ఒక చిన్నగుడిలో వున్న భైరవ విగ్రహాన్నిబట్టి ఈ ప్రాంతానికి భైరవకొండ అనే పేరు వచ్చింది. ఇచ్చటగల గుహలయాలన్నీ శివునికి అంకితమైనవి ఈ ఆలయాలన్ని ఒకే రీతిలో మలచ బడ్డాయి. ప్రతి గుహాలయానికి ముందు ఒక వరండా ఉంది. ఇది రెండు సింహపాద స్తంభాల మీద ఆధారపడి నిలబడినట్లు తొలచబడింది. ప్రవేశ ద్వారానికి పై భాగాన కూడు అలంకరణ మలచబడింది. వరండా వెనుక భాగంలో గది తొలచబడింది. ద్వారాని కిరువైపులా ద్వార పాలకులు గలరు. ఈ గుహాలయాలు రేనాటి చోడుల పోషణలో రూపొందాయి.

## 11.3 బౌద్ధ గుహలయాలు :

### 11.3.1 పరిచయము :

భారతదేశంలో గుహలయ నిర్మాణానికి ఒరవడి పెట్టిన వారు మౌర్యులు. మౌర్యుల తరువాత దక్షిణాపథంలో అధికారంలోకి వచ్చిన శాతవాహనుల కాలంలో గుహలయాలు నిర్దుష్టమైన రూపురేఖలను సమకూర్చుకొని చైత్యశాలలుగా, విహారాలుగా అవతరించాయి. అతిప్రాచీన చైత్యశాలలకు ఉదాహరణాలుగా మహారాష్ట్రంలో భాజాదగ్గర, ఆంధ్రలో గుంటుపల్లి దగ్గర ఉన్న మందిరాలను పేర్కొన వచ్చు. చైత్యశాలల్లో చాలా రమ్యమైనవి మహారాష్ట్రంలో కార్లే దగ్గర ఉంది. రాతిలో తొలిచి నిర్మించబడి తొలి విహారాలు అశోకుని కాలం నాటి బీహార్‌లోని సుదామ, లోనుస్‌రుషి గుహలు. ఇవి ఆజీవిక భిక్షువుల కోసం తొలచబడ్డాయి.

### 11.3.2. చైత్యగృహాలు :

బౌద్ధులు నిర్మించుకొన్న ప్రార్ధనా మందిరాలను చైత్యశాలలు లేక చైత్యగృహాలంటారు. ఇవి అవలి చివర వర్తులాంశంగా ఉన్న దీర్ఘచతురస్రాకార మందిరాలు. వృత్త భాగంలో స్మారక స్తూపం ఉంటుంది. హాలును, ప్రక్కన ఉన్న మార్గం అనే భాగాన్ని విభజిస్తూ స్తంభాలవరస ఉంటుంది. ఈ స్తంభాల వరస స్తూపానికి వెనుక భాగంలో పొడిగించబడి ప్రదక్షిణా పథంగా కూడా ఉపయోగిస్తుంది. చైత్యగృహాల ముందు భాగంలో ఒక వరండా ఉంది. దీని ముఖ భాగం కొన్ని సందర్భాల్లో రెండు అంతస్తులుగా ఉన్నది. కింది విభాగంలో ప్రవేశ వసారా, పై విభాగంలో లోపలికి గాలి, వెలుతురును ఇచ్చె పెద్ద చైత్య కిటికీ ఉన్నది. చైత్య గృహాలను హీనయాన చైత్యగృహలని, మహాయాన చైత్యగృహాలని రెండు వర్గాలుగా విభజించవచ్చు.

#### 11.3.2.1 హీనయాన చైత్యగృహాలు :

బౌద్ధ గుహాలయాల నిర్మాణంలో క్రీ. పూ. 200 - క్రీ.శ. 200 మధ్య కాలం తొలిదశగా చెప్పవచ్చు. ఈ కాలంలోనే హీనయాన బౌద్ధచైత్య గృహాల నిర్మాణం సాగింది. మహారాష్ట్రలో పూనా జిల్లాలోని భాజ, బేడ్స, నాసిక్, జునాల్, కార్లే, కొలబ జిల్లాలోని కొండల్లో, ఔరంగాబాద్ జిల్లా లోని పితల్ కోరా, బొంబాయి వద్దగల కన్హేరి, అజంతా ప్రాంతాలలో హీనయాన చైత్యగృహాలు గలవు.

**1. భాజ :** చైత్యగృహాలలో మహారాష్ట్రలోని భాజ దగ్గర గల చైత్యగృహం అత్యంత ప్రాచీనమైంది. ఇది క్రీ.పూ. 200 నాటిది. ఈ చైత్యగృహం 55 అడుగుల పోడవు 28 1/2 అడుగుల వెడల్పు కలిగి ఉంది. ఇందలి స్తంభాల ఎత్తు 11 అడుగులు . ఈ చైత్యగృహానికి మూడు ద్వారాలున్నాయి. మధ్యది హాలు లోకి, మిగతారెండు కుడ్య, స్తంభ భాగాలకు మధ్య ప్రవేశం కొరకు గలవు. వృత్త భాగంలో స్మారక స్తూపముంది. వితానం బండిగూడు ఆకృతిలో గలదు. ఈ చైత్యగృహంలో త్రిరత్న, ధర్మచక్రం, వంటి బౌద్ధచిహ్నాలు, స్తంభాలపై నగల పద్మాల వంటి శిల్పాలు ఉన్నాయి.

**2. కొండనె :**మహారాష్ట్రలోని కొలబ జిల్లాలో గల కొండనెలో ఒక చైత్యగృహం ఉంది. ఈ గృహం 66 అడుగులు పొడవు 27 అడుగులు వెడల్పు , 28 అడుగులు ఎత్తు కలిగిఉంది. దీనికి ముందు భాగంలో ఒక స్తంభవరండా, దానివెనుక హాలు, అందులో స్తంభాలు, వృత్తభాగంలో స్మారక స్తూపం గలవు. ఈ గృహంలోని కొన్ని స్తంభాలు దారువుతో చేయబడి ఉంది.

**3. పితల్ ఖోర :** మహారాష్ట్రలోని ఔరంగబాద్ జిల్లాలో పితల్ ఖోర ఉన్నది. ఇచట గల మూడో గుహాలయం చైత్యగృహం. ఇది క్రీ.పూ. 2వ శతాబ్దినాటిది. ఇది కొంత కాలం హీనయాన బౌద్ధులు ఉపయోగించారు. ఆ తరవాత దీనిని మహాయానులు ఉపయోగించారు. ఈ కాలం నాటి వర్ణ చిత్రాలు కొన్ని ఇచట గలవు. ఈ గృహం నేడు శిధిలావస్థలో వుంది. ఇచటి చైత్యగృహం 86 అడుగుల పొడవు, 35 అడుగుల వెడల్పు కలిగి వుంది. ఇందలి హాలులో37 స్తంభాలుండేవి. నేడు 12 మాత్రమే గలవు. వృత్తభాగంలో స్మారక స్తూపం గలదు.

**4. అజంతా** : అజంతాలోని గుహలలో కొన్ని హీనయాన కాలానికి చెందినవి కలవు. ఇచటి 9,10 సంఖ్య గలవి హీనయాన చైత్యగృహాలు. 10వ సంఖ్యగల గుహ 100 అడుగుల పొడవు, 40 అడుగులు వెడల్పు, 33 అడుగులు ఎత్తు కలిగిఉంది. హాలులో 39 స్తంభాలు గలవు. వృత్తభాగంలో రెండంతస్తుల స్మారక స్తూపం ఉంది. చైత్యముఖ భాగంలో క్రీ.పూ. 2వ శతాబ్దినాటి శాసనం గలదు. 9వ సంఖ్యగల చైత్యగృహం పై భాగంలో వెలుతురులోనికి ప్రవేశానికి చైత్యకిటికీ ఉన్నది. ఈ చైత్యగృహాన్ని మహాయాన కాలంలో బుద్ధుడు, బోధిసత్వుల శిల్పాలలో అలంకరించారు.

**5. బేడ్సా** : మహారాష్ట్రలోని పూనా జిల్లాలో బేడ్సా కలదు. ఇచట చైత్యగృహం నాలుగు స్తంభాల వరండాను కలిగివుంది. స్తంభాలకు తలక్రిందులుగా ఉన్న పద్మాలంకారముంది. వృతభాగంలో స్మారక స్తూపం ఉంది. స్తంభ అగ్రభాగాన మానవ, జంతు శిల్పాలున్నాయి.

**6. నాసిక్** : మహారాష్ట్రలోని నాసిక్ గల చైత్యగృహంలో శాతవాహన రాజుల శాసనాలున్నాయి. ఈ చైత్యముఖ భాగం రెండు ఆంతస్తులుగా ఉన్నది. పై విభాగం లో చైత్యకిటికీ ఉంది. ద్వారానికిరువైపుల కుడ్యం పైన కుడ్య, స్తంభాలు, స్తూపరూపాల శిల్పాలున్నాయి.

**7. జునార్** : ఇచటి చైత్య గృహం వర్తులాకారంలో 25 అడుగుల వ్యాసాన్ని కలిగివుంది. స్మారక స్తూపం చైత్యగృహం మధ్యలో గలదు. దీని చుట్టూ 12 స్తంభాలున్నాయి.

**8. కార్లే** : మహారాష్ట్రంలో పూనా జిల్లాలో మాలవెల్లి రైల్వేస్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరంలో కార్లే గ్రామముంది. ఇచటి గుహలలో ఒక చైత్యగృహం సుందరమైంది, ప్రముఖమైంది. దీనిలో చైత్యగృహ వాస్తువు పరాకాష్ట చెందింది. ఇంత పెద్దది, సుందరమైంది భారతదేశంలొ మరెచ్చటలేదు. ఇది క్రీ.పూ. 2 లేక 1వ శతాబ్దానికి చెందినది. దీనికి ముందు భాగంలో ఒక వరండా గలదు. వరండా ముందు భాగంలో రెండు అశోకస్తంభాల వంటివి గలవు. వీటి ఎత్తు 50 అడుగులు. స్తంభశీర్షికలో పద్మం, ఫలకం, చక్రం కలవు. ఈ చైత్యగృహానికి ముడు ప్రవేశ మార్గాలు కలవు. చైత్యముఖ భాగం రెండు అంతస్తులుగా వుంది. పైవిభాగంలో పెద్ద చైత్యకిటికీ, కింది విభాగంలో ద్వార ముఖభాగాల కిరువైపులా శిల్పాలున్నాయి. వీటిలో ఆర్గురు దాతల ప్రతిమలు, స్థానకబుద్ధ ప్రతిమలున్నాయి. ఈ విభాగ అధిష్టాన భాగంలో ఏనుగుల శిల్పాలున్నాయి. చైత్యగృహవితానం బండి గూడు ఆకారంలో వుంది. చైత్యగృహం పొడవు 124 అడుగులు, వెడల్పు 46 అడుగులు, ఎత్తు 46 అడుగులు. హాలులో 37 స్తంభాలున్నాయి. స్తంభ అగ్రభాగాన ఏనుగుల, అశ్వాల జంటల శిల్పాలున్నాయి. వృత్తభాగంలో స్మారక స్తూపముంది.

**9. కన్హేరి** : ఇది బొంబాయి దగ్గరిలోని సాల్‌సెట్ దీవిలో వుంది. ఇచటి 3వ గుహాలయం హీనయాన చైత్యగృహం. దీనిముఖ భాగంలో తలపాగాధరించిన దాతల శిల్పాలున్నాయి. గుహ ముందు శిలా ఖండములో సింహాల శిల్పాలున్నాయి. చైత్యగృహవరండాలో గల బుద్ధుని రెండు శిల్పాలు తరవాతి కాలానివి. చైత్యగృహం లోపల క్రీ.శ. 5వ శతాబ్దం నాటి బుద్ధుని శిల్పం గలదు.

**10. ఔరంగాబాద్** : మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నాల్గవ గుహలయం చైత్యగృహం. దీని పొడవు 38 అడుగులు, వెడల్పు 23 అడుగులు. ఈ చైత్య ముఖభాగం శిధిలమైంది. వృత్తభాగంలో స్మారక స్తూపం ఉంది. హాలు పై కప్పు బండిగూడు ఆకారంలో, దారి మార్గం పైకప్పు చదరంగాను వున్నది.

**11. గుంటుపల్లి** : ఆంధ్రలో పశ్చిమ గోదావరి జిల్లాలోని గుంటుపల్లిలో గల చైత్యగృహం గుండ్రంగా వుంది. దీనిమధ్య స్మారక స్తూపముంది. ఈ చైత్య గృహం క్రీ.పూ. 200 నాటిది. చైత్యగృహం ముందు భాగంలో వరండా ఉంది.

## 11.3.2.2 మహాయాన చైత్యగృహాలు :

మహయాన చైత్యగృహాలు క్రీ.శ. 450-700 మధ్యకాలం నాటివి. ఇవి చాలా వరకు వాకాటకుల కాలానికి చందినవి. అజంతా, ఎల్లోరా, నాగార్జున కొండ మెదలగు ప్రాంతాలలో మహాయాన చైత్యగృహాలు గలవు. వీటిలో దారు శైలి ప్రభావం చాలా వరకు తగ్గిపోయింది.

లోపల ఉన్న స్మారక స్తూపం మీద బుద్ధుని ప్రతిమ చెక్కడ ముఖ్యమైన విశేషము. బుద్ధుని ఆసీన లేక స్థానిక రూపంలో చెక్కినారు. చైత్యగృహం వెలుపల, లోపల బుద్ధుని, బోధిసత్వుని శిల్పాలను విరివిగా చెక్కడం ఆరంభించారు. చైత్యగృహం ముందు భాగం రెండు అంతస్థులుగా మలచబడింది. కింది విభాగంలో స్తంభ వరండా, పై భాగంలో చైత్యకూడు ఉంది. వీటి మధ్య భాగంలో కపోతం ఉంది. దీనిపై శిల్పాలున్నాయి. చైత్యముఖంపై విభాగంలో కొన్ని చైత్యాలలో ముందుకు చొచ్చుకొని ఉన్న వరండా ఉన్నది. దీనికి కిందినుంచి మెట్లు గలవు.

**1. అజంతా :** అజంతా లోని 19, 26 సంఖ్య గల గుహలు మహాయాన చైత్యగృహాలు. 19 వ సంఖ్య గల చైత్యగృహానికి ఒకే ఒక ప్రవేశ ద్వారమున్నది. ముందు భాగం రెండు అంతస్థులుగా అమర్చబడి మధ్యలో కపోతమున్నది. కపోత భాగంలో రెండు వరుసల ఆసీన బుద్ధుని శిల్పాలు గలవు. ప్రవేశ ద్వారానికిరువైపులా బుద్ధుని, బోధిసత్వుల శిల్పాలున్నాయి. గుహముందు పైభాగంలో పెద్ద చైత్యవాతాయనానికి రెండు వైపులా కుబేర యక్షుల శిల్పాలున్నవి. చైత్యగృహం లోపల 17 స్తంభాలున్నాయి. వీటి శీర్షిక భాగంలో మిధున జంటల శిల్పాలున్నాయి. వృత్తభాగంలో స్మారక స్థూపం ఉన్నది. దీనికి ఎత్తైన వేదిక, అండం, హార్మికం, ఛత్రం గలవు. స్థూప ముఖభాగంలో బుద్ధుని శిల్పం ఉంది. 26 వ సంఖ్య గల గుహ అద్భుతమైన శిల్పాలతో నిండి ఉన్నది. దీని ముందు భాగంలో స్తంభ వరండా గలదు. వరండా వెనుక గల కుడ్యమందు మూడు ప్రవేశ మార్గాలు కలవు. ఈ ద్వారాలకిరువైపుల కుడ్య భాగంపై బుద్ధుని శిల్పాలున్నాయి. వృత్తభాగంలో గల స్మారక స్తూపం ముందు భాగంలో బుద్ధుని ఆసీన శిల్పం గలదు. ఈ చైత్యగృహంలోని బుద్ధుని మహానిర్వాణ శిల్పం, మార దర్శనము కడు మనోహరాలు.

**2. ఎల్లోరా :** ఎల్లోరాలోని 34 గుహలలో తొలి 10 గుహలు బౌద్ధగుహాలయాలు. వీటిలో 9 విహారాలు కాగా ఒకటి మాత్రం చైత్యగృహం. ఈ చైత్యగృహాన్నే విశ్వకర్మ చైత్యగృహం అంటారు. ఈ చైత్య ముఖ భాగం రెండు భాగాలుగా వుంది. రెంటి మధ్య కపోత కలదు. పైవిభాగం త్రిపత్ర కూడులాగా ఉంది. దీనికి మెట్లు గలవు. కింది భాగం స్తంభ వరండా. ఈ వరండా కుడి, ఎడమల్లో రెండు పూజా మందిరాలున్నాయి. వీటి గోడలపై బుద్ధుడు, పరివారకులు, తార మొదలగు శిల్పాలు గలవు. వరండా నుంచి చైత్యహాలులోనికి మూడు ప్రవేశ మార్గాలున్నాయి. చైత్యగృహం 86 అడుగులు పొడవు, 43 అడుగులు వెడల్పు, 34 అడుగులు ఎత్తు కలిగి ఉన్నది. హాలులో 28 స్తంభాలున్నాయి. హాలు వృత్తభాగంలో 27 అడుగుల ఎత్తుగల స్తూపం ఉంది. దీని ముందు భాగంపై ధర్మ చక్ర ప్రవర్తనలో బుద్ధునిశిల్పం ఉంది. ఈ శిల్పం ఎత్తు 11 అడుగులు. బుద్ధునికిరువైపులా పరివారకులున్నారు.

**3. నాగార్జున కొండ :** గుంటూరు జిల్లా నాగార్జున కొండలో ఇటుకలతో నిర్మించబడిన రెండు చైత్యగృహాలున్నాయి. ఈ రెండిటిలో ఒకటి హీనయాన కాలపు చైత్యగృహం. దీనిలో స్మారక స్తూపం ఉంది. రెండోది మహాయాన కాలపు చైత్యగృహం. దీనిలో వృత్తభాగంలో బుద్ధుని విగ్రహం ఉంది. ఈ రెండు చైత్యగృహాలలో స్తంభాలులేవు. రెండు చైత్యగృహాల ప్రవేశ మార్గానికి ముందు అర్ధ చంద్రాకార శిలలు ఉంది. దీనినే చంద్రశిల అంటారు. ఈ చైత్యగృహాలపై కప్పు శిథిలమై ఉంది.

## 11.3.3. విహారాలు :

బౌద్ధభిక్షువుల విశ్రాంతి మందిరాలను విహారాలని అంటారు. తొలి విహారాలు దారువు, ఇటుకలతో నిర్మించినందున త్వరగా శిథిలమైనాయి. రాతిని తొలిచి నిర్మించబడిన తొలి విహారాలు మౌర్య అశోకుని కాలం నాటివి. బీహారులోని బరాబర్ కొండలలో ఆజీవిక భిక్షువుల కోసం గుహలు తొలిపించబడినాయి. మౌర్య కాలానంతరం అజంతా, నాసిక్, భాజా, బేడ్సా, గుంటుపల్లి మొదలగు చోట్ల పలు విహారాలు నిర్మించబడినాయి. విహారాలను హీనయాన, మహాయాన అని రెండు వర్గాలుగా విభజించవచ్చు. విహారంలో దీర్ఘ చతురస్రంగా గాని చతురస్రంగా గాని ఉన్న హాలు, హాలుకు మూడువైపులా గదులు, హాలు వెలుపల స్తంభాలున్న వరండా ఉంటాయి. పైకప్పు సమతలంగా ఉంటుంది. అయితే పితల్ కోరా, బేడ్సాలలోని తొలివిహారాలు గజాపృష్టాకారంలో నిర్మించబడి, బండిగూడు ఆకారంలో పైకప్పు కలిగి ఉన్నాయి. కొన్ని విహారాలలో హాలులోపల బల్లలు ఏర్పాటు చేయబడినాయి. కొన్ని విహారాలలో వరండా చివరల గదులు తొలచబడింది. మహాయాన విహారాలలో హాలు వెనుక గోడల మధ్య భాగంలో బుద్ధునికి ఒక గదిని ఏర్పాటు చేయబడింది.

### 11.3.3.1 హీనయాన విహారాలు :

క్రీ. పూ. 200 మొదలు క్రీ. శ. 200 వరకు నిర్మించిన విహారాలను తొలిదశకు చెందిన విహారాలు లేదా హీనయాన విహారాలుగా వర్ణించవచ్చు. తొలివిహారాలు కేవలం నివాసానికి ఉద్దేశింపబడినవి. ఇవి చాలావరకు చైత్యగృహాలకు సమీపంలో గలవు. హీనయాన విహారాలలో స్తంభాలు లేవు. వీటిలో శిల్పాలు తక్కువగా ఉన్నాయి.

**1. అజంతా :** అజంతాలో 8,12,13,30 సంఖ్యగల గుహలు హీనయాన విహారాలు. వీటిలో 30వ సంఖ్య గల విహారం చాలా ప్రాచీనమయింది. దీనిలో హాలు, మూడుగదులు గలవు. గదులలో రాతిశయ్యలు గలవు. హాలులో స్తంభాలు లేవు. గదుల ద్వారాల పై గవాక్షాలున్నవి. ఈ విహారంలో బుద్ధుని ప్రతిమ లేదు. 8వ సంఖ్య గుహ చాలా వరకు శిధిలమై ఉంది. 12వ సంఖ్య గల గుహలో 12గదులు కలవు. 13వ సంఖ్య గుహలో 7 గదులు గలవు. ప్రతిగదిలో రెండు రాతి పడకలు గలవు.

**2 నాసిక్ :** మహారాష్ట్రలోని నాసిక్ వద్దగల గుహలలో 3,8,15 సంఖ్య గల గుహలు హీనయాన విహారాలు. ఇవి గౌతమీ పుత్ర శాతకర్ణి, నహపాణుడు, యజ్ఞశ్రీల కాలాల్లో రూపొందించ బడ్డాయి. ఈ గుహలలో స్తంభాలు లేవు. నివాస గదులలో శయనించడానికి రాతిశయ్యలు ఉన్నవి. ఈ గుహల ముందు స్తంభాలున్న వరండాలు గలవు.

**3. భాజా :** మహారాష్ట్రలోని భాజాలో విహార, చైత్య గృహాలు పక్క పక్కగా నిర్మించబడివుంది. వరండా పైకప్పు బండిగూడు ఆకారంలో ఉన్నది. హాలు ఇరు వైపులా గదులున్నవి. ఈ విహారంలో శిల్పాలు అతితక్కువగా ఉన్నాయి.

**4. బేడ్సా :** మహారాష్ట్రలోని బేడ్సా ప్రాంతంలో కూడా విహార, చైత్య గృహాలు పక్కపక్కనే తొలచబడి ఉంది. ఈ రెండు గజపృష్టాకారంలో రూపొందింపబడి, పైకప్పు గజపృష్టాకారంలో ఉంది.

**5 గుంటుపల్లి :** ఆంధ్రలోని గుంటుపల్లిలో రెండు విహారాలున్నాయి. ప్రతి విహారానికి మూడుద్వారాలున్నాయి. ఒక విహారం శిధిలావస్థలో వుంది.

### 11.3.3.2 మహాయాన విహారాలు :

మహాయాన విహారం కేవలం బౌద్ధ భిక్షువుల నివాసానికేకాక, ప్రార్థనా మందిరంగా కూడా ఉపయోగిస్తుంది. హాలు వెనుక గోడ మధ్య భాగంలో బుద్ధునికి ఒక గదిని నిర్మించడం జరిగింది. క్రీ.శ. 200-500 మధ్యకాలం నాటివి ఇవి.

**1. బాగ్ :** మధ్యప్రదేశ్ లోని ధార్ జిల్లాలో గల బాగ్ ప్రాంత విహారాలు మహాయాన విహారాలు. ఇచట మొత్తం 9 గుహలున్నాయి. వీటిలో 4వ గుహ ప్రసిద్ధి గాంచినది. దీనినే రంగమహల్ అంటారు. హలుకి మూడు వైపులా గదులు గలవు. హాలులో అన్ని వైపులా రెండు వరుసల్లో 28 స్తంభాలున్నాయి.

**2. అజంతా :** ఆజంతాలో 1 నుంచి 5 వరకు గలగుహలు, 15,16,17,18,20,27, 29 సంఖ్య గల గుహలు మహాయాన విహారాలు. వీటిలో 16వ సంఖ్య విహారం చాలా అందమైంది. దీనిని వాకాటక రాజు హరిసేనుని మంత్రి వరాహదేవుడు తొలిపించాడు. ఈ విహారం ముందు ఒక స్తంభ వరండా గలదు. ఈ వరండా రెండు వైపులా రెండు గదులు గలవు. హాలులో మూడు వైపులా 14 గదులున్నాయి. హాలులో స్తంభాలు గలవు. హాలు వెనుక గోడలో పూజామందిరముంది. ఇందు బుద్ధుని ప్రతిమ గలదు. ఇతని కిరువైపులా వజ్రపాణి, పద్మపాణి గలరు. వెనుక గోడపై గంధర్వుల శిల్పాలున్నాయి. 1వ విహారంలో వరండా, హాలు, ప్రక్కగదులు, పూజాగది కలవు. పూజాగదిలో బుద్ధుని విగ్రహముంది. బుద్ధుని కిరువైపులా పద్మపాణి, వజ్రపాణి గలరు. 2వ విహారంలో బుద్ధుడు ఆశీనమై ఉన్న పీఠం పై ధర్మచక్ర శిల్పముంది. దీని పై ఒక బోధకుడు శిష్యులకు బోధిస్తున్నట్లు శిల్పం గలదు. 4వ విహారం అజంతాలోని గుహల్లో పెద్దది.

**3 ఎల్లోరా :** ఎల్లోరాలో మహాయాన విహారాలున్నాయి. 1,2,3,5 విహారాలు క్రీ.శ. 400 నాటివి. 4,6,12 విహారాలు క్రీ.శ. 6,7 శతాబ్దాల నాటివి. మొదటి విహారానికి ఒక హాలు, ఎనిమిది గదులు గలవు. రెండో విహారానికి హాలు గలదు కాని గదులు లేవు. ఈ విహార కుడ్యాలపై బౌద్ధ శిల్పాలు గలవు. మూడో విహారంలో రెండు వైపులా గదులు కలవు. హాలువెనక గోడలో బుద్ధుని శిల్పం గలదు. ఎల్లోరాలో 5వ విహారం చాలా పెద్దది. ఈ విహారాన్నే మహన్వాడ అంటారు. హాలువెనక గోడలో పూజాగది, కుడి, ఎడమ కుడ్యాల్లో గదులు కలవు. పూజాగది ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకుల శిల్పాలు గలవు. నాల్గవ విహారం రెండంతస్తుల గుహ. 6వ విహారంలో 6 గదులు కలవు. హాలు వెనుక కుడ్యంలో పూజామందిరం, దాని ముందు అర్ధ మండపం గలవు. ఈ గది గోడల పై బుద్ధుని శిల్పాలు గలవు. 7,11,12 విహారాలలో అద్భుత శిల్పాలున్నాయి. 12వ గుహను ప్రాంతీయంగా 'తీన్‌తాల్' అంటారు. ఇది మూడంతస్తుల మహాయాన విహారం. ప్రతి అంతస్తులో ముందుగల వరండాలో 8 స్తంభాలు గలవు. హాలులో మూడు వరుసల్లో స్తంభాలున్నాయి. ప్రతి వరుసలో 8 స్తంభాలున్నాయి. హాలువెనుక గోడపై బౌద్ధ శిల్పాలు గలవు. రెండో అంతస్తు హాలులో 4 వరుసల్లో స్తంభాలున్నాయి. ప్రతి వరుసలో 10 స్తంభాలున్నాయి. మూడో అంతస్తులో కూడా స్తంభాలు గలవు. ప్రతి అంతస్తు హాలు వెనుక గోడలో పూజామందిరం వుంది.

**4. ఔరంగాబాద్ :** ఔరంగాబాద్‌లో 8 విహారాలున్నాయి. ఇవి క్రీ.శ. 7,8 శతాబ్దాల కాలం నాటివి. మొదటి గుహ వరండాలోని స్తంభాల శీర్షికలో స్త్రీల శిల్పాలున్నాయి. వరండా వెనుక గోడపై బుద్ధుని శిల్పముంది. రెండో విహారంలో ధర్మచక్ర ప్రవర్తన బుద్ధుని శిల్పముంది. మూడో విహారంలో 12 స్తంభాలున్నాయి. 7వ విహారం చుట్టూ ప్రదక్షిణా పథం గలదు. దీని ముందు వరండా గలదు. హాలులోని గదులలో బుద్ధుని శిల్పాలున్నాయి. ఈ విహారంలో అద్భుత శిల్పాలు ఉన్నాయి.

## 11.3.4. సారాంశము :

భారతదేశములో నిర్మించబడిన హిందూ గుహాలయాల యొక్క వాస్తు శిల్ప విశిష్టత మరియు ప్రాచీన భారతదేశములోని గొప్పగా వెలుగుపొందిన బౌద్ధమతముయొక్క బౌద్ధగుహాలయములు వాస్తు శిల్పలక్షణములు ప్రస్తావించ బడ్డాయి.

## 11.3.5. నమునా ప్రశ్నలు :

1) హిందూ గుహాలయ వాస్తుశిల్పం గురించి వివరింపుము.

2) బౌద్ధ చైత్యగృహాలు, విహారాలు గురించి వివరింపుము.

**డా. వి.కె.మోహన్**

పాఠం - 12.1

# హిందూ కట్టడ దేవాలయాల వర్గీకరణ

## 12.1.0 లక్ష్యం :

హిందూ కట్టడ దేవాలయాల ప్రాచీనత, దేవాలయాల వర్గీకరణ, దేవాలయాల లక్షణాలు గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :-


**12.1.1 పరిచయము**

**12.1.2 దేవాలయాల ప్రాచీనత**

**12.1.3 దేవాలయాల వర్గీకరణ**

**12.1.3.1 వాస్తు గ్రంథాలలో వర్గీకరణ**

**12.1.3.2 ఇప్పటి నిపుణుల వర్గీకరణ**

**12.1.4 దక్షిణ భారతదేశ దేవాలయాల లక్షణాలు ( ద్రావిడశైలి )**

**12.1.5 ఉత్తర భారతదేశ దేవాలయాల లక్షణాలు ( నాగరశైలి )**

**12.1.6 చాళుక్య మండల రీతి లక్షణాలు ( వేసరశైలి )**

**12.1.7 సారాంశము**

**12.1.8 నమూనా ప్రశ్నలు**


## 12.1.1 పరిచయము :

భారతదేశంలో అత్యంత ప్రాచీనకాలం నుంచి పూజా విధానం ఉంది. చరిత్ర పూర్వయుగంలో మానవుడు ప్రకృతి దేవతలను ఆరాధించేవాడు. సింధులోయ నాగరికతా కాలంలో ప్రజలు అమ్మ తల్లి, పశుపతి శివుడు మొదలగు దేవతలను పూజించేవారు. వైదిక యుగంలో ఇంద్రుడు, వరణుడు, యముడు, సూర్యుడు, చంద్రుడు మొదలైన ప్రకృతి దేవతలను ప్రజలు పూజించారు. వేదకాలంలో బహుళ అశాశ్విత పదార్ధంతో దేవతల ప్రతిమలు రూపొందించి ఉండవచ్చు. అందువల్లనే నేడు ఆధారాలు కన్పించడంలేదు. వైదిక యుగంలో దారువుతో ఆలయాలుకూడా నిర్మించబడి ఉండవచ్చు. కుషాణుల కాలంలో బుద్ధుని భగవంతునిగా ఆరాధించడం ప్రారంభమైంది. ఈ కాలంలో గాంధార, మధుర ప్రాంతాలలో అనేక బుద్ధ విగ్రహాలు తయారయ్యాయి. దీని ప్రభావంతో ప్రతిమా రూపంలో దేవుని ఆరాధించు విధానం హిందూమతంలో కూడా ప్రారంభమైంది. బౌద్ధం నుంచి పోటీని తట్టుకోవడానికి హిందువులు కృష్ణుడు, విష్ణువు, దుర్గ మొదలైన ప్రతిమలు రూపొందించి ఆరాధించడం మొదలెట్టారు. భక్తివిధానంలో హిందూ మతం వ్యాప్తి చెందసాగింది. ఈ కాలంలోనే హిందూ శిల్పకళకూడా వృద్ధి చెందసాగింది. ఇట్టి శిల్పకళకు మధుర ప్రధాన కేంద్రమయింది. భక్తి విధానంలో దేవతాప్రతిమలను ఆరాధించే విధానం అభివృద్ధి చెందుటతో పాటు ఆ ప్రతిమలను స్థాపించుటకు దేవాలయ నిర్మాణం అవసరమయింది. మొదట దారువుతోను తరవాత ఇటుక, రాయి లాంటి గట్టిపదార్ధంతో దేవాలయాలు నిర్మించుట ప్రారంభమయింది.

**12.1.2 దేవాలయాల ప్రాచీనత :**

భారతదేశంలో ఎచట మొదటి దేవాలయం నిర్మించ బడినదో, ఏది దీని నిర్మాణానికి మార్గదర్శకమైందో ఖచ్చితంగా చెప్పడం కష్టం. ప్రతిమా రూపంలో దేవుని పూజించే విధానంతో దేవాలయ నిర్మాణం ప్రారంభమైనదని భావించవచ్చు. ప్రాచీన కాలంలో ప్రకృతి ఆరాధన ఉండేది. ఆ తరువాత కొంత కాలానికి ఈ ప్రకృతి శక్తులను చిహ్నరూపంలో ఆరాధించడం ప్రారంభమైంది. ఆ తరువాత కొంత కాలానికి ఈ చిహ్నరూపం స్థానంలో ప్రకృతి దేవతలను ప్రతిమా రూపంలో మానవ ఆకారంలో పూజించడం ఆరంభమైంది. ఈదేవతా ప్రతిమలను మొదట జమ్మి, రావి, విప్ప చెట్లు కింద ప్రతిష్టించబడి పూజింపబడేవి. మరికొంత కాలానికి ఈ దేవతా ప్రతిమలున్న ప్రాంతం చుట్టూ ప్రాకారం వంటిది ఏర్పాటు చేశారు. ఇదే కాలంలో మానవుడు సర్పాలు, చెట్లు ,పుట్టలు మొదలైన ప్రకృతి శక్తులను కూడా ఆరాధించేవాడు. దేవతలకు ఒక గృహం నిర్మించాలని తరువాత తలంచాడు. ఫలితంగా దేవతా ప్రతిమలకు మూడువైపులా రాతి నిలువులు ఏర్పాటు చేసి పైన మరో చిన్న రాయిని పెట్టి దేవ గృహములాగా ఏర్పరిచారు. కొన్ని సందర్భాలలో ఇటువంటి దేవగృహాల చుట్టూ ప్రాకారం నిర్మించారు. ఆ తరువాత దేవతలకు గుహాలయాలు నిర్మించే పద్ధతి ప్రారంభమైంది. ఈ పద్ధతి పర్వత ప్రాంతాలలో మాత్రమేగాని ప్రజానీకం ఉన్నచోట్ల నిర్మించుట సాధ్యం కాదు. అందువల్ల తరవాత ప్రజలున్న పల్లపు ప్రాంతాలలో రాతితో దేవాలయాలు నిర్మించుట మొదలైంది.

భౌద్ధ స్తూపాలను మార్గదర్శకంగా తీసుకొని హిందువులు దేవాలయ నిర్మాణ కార్యక్రమం చేపట్టారని కొందరు పండితులు భావించారు. హిందూ మతమందలి యజ్ఞ వేదికలను ప్రాతిపదికగా ఉంచుకొని హిందువులు దేవాలయాలు నిర్మించినట్లు మరికొందరు అభిప్రాయపడ్డారు. సమాధుల నిర్మాణ పద్ధతి నుంచి దేవతా గృహాల నిర్మాణ విధానం ఏర్పడిందని కొందరు వాస్తు నిపుణులు పేర్కొన్నారు. భౌద్ధయుగానికి పూర్వమే రాజులు, మహావ్యక్తులు మరణించినపుడు వారి శరీర అవశేషాలపై నిర్మాణాలు చేశారనడానికి ఆధారాలున్నాయి. అలాగే ఇటీవల సింధు లోయ నాగరికత స్థావరాల వద్ద తవ్వకాలలో యజ్ఞ వేదికలు బయల్పడ్డాయి. ప్రాచీన కాలంలో భారతదేశమందలి ఆలయాలను హర్మ్యం, ప్రాసాదం, మందిరం, దేవయానం, విమానం అని పలుపేర్లతో పిలిచేవారు. ప్రాచీన కాలంలో ఈపేర్ల అర్థం ఒకటే అయినా కాలక్రమాన ఇందలి కొన్నిపేర్లు ఇతర అర్థాలలో వాడేవారు. చివరకు దేవాలయం అనేపేరు స్థిరంగా నిలిచింది.

భారతదేశంలో నిర్దుష్టమైన రీతిలో దేవాలయ నిర్మాణ కార్యక్రమం ఉత్తరాన గుప్తులలో, దక్షిణాన పల్లవ, చాళుక్యులలో ప్రారంభమైంది. కాని అంతకు ముందు కూడా దేవాలయాలు నిర్మించబడినట్లు ఆధారాలు గలవు. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో బైరాట్ ప్రాంతంలో జరిగిన త్రవ్వకాలలో మౌర్యులనాటి ఆలయం బయల్పడింది. ఇది దారువు, ఇటుకలతో నిర్మించిన గుండ్రని ఆలయం. ఈ ఆలయానికి 26 దారువుతో చేసిన స్తంభాలున్నాయి. ఇదేకాలానికి చెందిన మరో ఆలయం సాంచి వద్ద (40 నెంబరు) జరిపిన త్రవ్వకాలలో లభ్యమైంది. రాతితో గజపుష్ఠాకారంలో నిర్మించిన ఈ ఆలయం పైకప్పు దారువుతో నిర్మించబడింది. సాంచిలో వున్న 18 వ నంబరు ఆలయం మొదట క్రీ.పూ. రెండవ శతాబ్దంలో నిర్మించబడినట్లు తెలుస్తుంది. ఈ ఆలయాన్ని రాతితో గజపృష్ఠాకారంలో నిర్మించి పైకప్పు బహుశా దారువుతో నిర్మించడం జరిగింది. ఉదయపూర్ జిల్లా నగరిలో సంకర్షణ, వాసుదేవ ఆలయం, బేస్ నగర్ వద్ద గల భాగవత ఆలయం మౌర్యుల కాలపు ఆలయాలుగా చెప్పవచ్చు. బేస్ నగర్ ఆలయ ముందు భాగాన గ్రీకు రాయబారి హెలియడోరస్ నాటించిన గరుడ ధ్వజము ఉన్నది. నాగార్జున కొండ తవ్వకాలలో ఇక్ష్వాకుల కాలానికి చెందిన గజపృష్ఠాకార దేవాలయాలు బయల్పడినాయి. శివునికి, కార్తికేయునికి అంకితమయిన ఈ ఆలయాలు క్రీ.శ. 2 లేక 3 శతాబ్దాలకు చెందినవి. శాతవాహన యుగానికే చెందిన ఇటుకల నిర్మాణాలు ఇటీవల కర్నూలు జిల్లాలో బయల్పడినాయి.

పైన వివరించినట్లు ఇంతవరకు లభ్యమైన ఆధారాలను బట్టి దేవాలయ నిర్మాణ కార్యక్రమం గుప్తుల కాలానికి ముందే ప్రారంభమైనట్లు తెలుస్తున్నది. కాని గుప్తులకు ముందు నిర్మించబడిన దేవాలయాలు ఒక నిర్దుష్ట పద్ధతిలో లేవు. అంతేగాక పరిపూర్ణంగా ఆలయాలు లభించలేదు. గుప్తుల కాలంనుంచే దేవాలయాలు పరిపూర్ణ దశలో మనకు లభిస్తున్నాయి. తమకు పూర్వముండిన గుహాలయాలు, దేవాలయాలను మార్గదర్శకంగా తీసుకొని ఒకవైపు గుప్తులు మరొకవైపు పల్లవులు, బాదామి చాళుక్యులు దేవాలయ నిర్మాణం

ప్రారంభించినట్లు తెలుస్తుంది.

గుప్తుల కాలంలో హైందవము పునరుజ్జీవితమవడంచేత హిందూ దేవాలయ నిర్మాణము కీ.శ. 4 వ శతాబ్దం నుంచీ సమర్ధంగా సాగింది. ఈనాటి దేవాలయాలకు దృష్టాంతాలు సాంచీ వద్ద లభించాయి. వీటిని పోలిన ఆలయం ఒకటి కర్ణాటకలో ఐహోలు దగ్గర వుంది. గుప్తుల దేవాలయాలన్నింటిలో పేరెన్నికగన్నది క్రీ.శ. 6 వ శతాబ్ధి నాటి దేవఘడ్‌లోని దశావతారాలయం. ఈ ఆలయంపై గల శిఖరం ఉత్తర భారత రేఖాశైలి తొలిదశను సూచిస్తున్నది. గుప్తులు చేపట్టిన దేవాలయ నిర్మాణ కార్యక్రమము వారి తరువాత సుమారొక వేయి సంవత్సరాలపాటు తీవ్రగతిలో సాగింది. ఈ దేవాలయాల రూపు రేఖలలో కొన్ని ప్రాంతీయ విభేదాలు కనిపిస్తాయి. కర్ణాటకలో వున్న ఐహోలు, బాదామి, పట్టడకల్, ఆంధ్రలోని అలంపురం మొదలగు చోట్ల క్రీ.శ. 5 - 8 శతాబ్ధాల మధ్య తొలి చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు అనేకం వున్నాయి. వీటిలో ప్రాచీన దేవాలయాల ఆకారాలలో చెందిన పరిణామము కొంతవరకు విశదమవుతుంది. మొదట చిన్నవై కేవలం గర్భగృహం, ప్రవాణము మాత్రం ఉన్న దేవాలయాలు బాదామి, ఐహోలులలో సువిశాలంగా వుండి కొన్ని నిర్దుష్టమైన రూపురేఖలు సమకూర్చుకొన్నాయి. ఈనాటి దేవాలయాలలో ప్రధాన అంగాలు గర్భగృహం, దానిమీద శిఖరము, గర్భాలయానికెదురుగా మండపం, ఈ రెండిటి నడుమ చిన్న అంతరాళము, మండపానికి ముందు అర్ధ మండపం లేదా ప్రవాణము, భక్తులు గర్భగృహాన్ని చుట్టిరావడానికి వీలుగా ప్రదక్షిణ పధము. కొన్ని ప్రాంతీయాలైన మార్పులు మినహా హైందియ దేవాలయాలకుండే ప్రధానాంగాలు ఇవే. చాళుక్యులు నిర్మించిన ఆలయాలలో ఐహోలు దుర్గాలయం, బాదామి మాతెగిట్టి శివాలయం, పట్టడకల్ లోని పాపనాధ, విరూపాక్ష దేవాలయాలు పేర్కొనదగినవి. వీటిలో కొన్ని రేఖాశిఖరం, మరి కొన్ని ద్రావిడ శిఖరం కలిగి ఉన్నాయి. దాక్షిణాత్య దేవాలయ రీతులకు సరియైన పునాది వేసిన వారు పల్లవులు. వీరు కళాసేవ క్రీ.శ. 600 ప్రాంతంలో ఆరంభమై రమారమి 300 ఏళ్ళపాటు సాగింది. వీరు గుహాలయాలు, దేవాలయాలు నిర్మించారు. మహాబలిపురం, కంచి ప్రాంతాలలో వీరి నిర్మాణాలు చూడవచ్చు. వీరి నిర్మాణాలలో అద్భుతమైనది కంచి కైలాసనాధాలయం. ఆలయానికి ఉండవలసిన అన్ని అంగాలు ఇందులో గలవు. చాళుక్యులు, పల్లవులు రూపకల్పన చేసిన దాక్షిణాత్య దేవాలయ వాస్తురీతులను చోళులు, పాండ్యులు, విజయనగర రాజులు పోషించి అభివృద్ధి చేశారు. విజయనగర కాలానికి హిందూ వాస్తువు పరాకాష్ఠ చెందినది. అందుకు చక్కటి తార్కాణము హంపిలోని విఠలాలయం. ఉత్తరాన గుప్తులు ప్రారంభించిన దేవాలయ నిర్మాణరీతి రాజపుత్రుల కాలంలో పరాకాష్ఠ చెందినది. ఈకాలపు దేవాలయ నిర్మాణ రీతులలో కొన్ని ప్రాంతీయ సంప్రదాయాలు కనిపిస్తున్నాయి. వీటిలో ముఖ్యమైనవి కళింగ, మధ్యభారత్, గుజరాత్ సంప్రదాయాలు.

## 12.1.3 దేవాలయాల వర్గీకరణ :

భారతదేశములో గుప్తులు చేపట్టిన దేవాలయ నిర్మాణ కార్యక్రమము వారి అనంతరము సుమారోక వేయి సంవత్సరాల పాటు తీవ్రగతితో సాగింది. గుప్తుల తరువాత ఉత్తర భారతదేశంలో రాజ్యమేలిన ప్రతిహారులు, పరమారులు, కాలచురులు. కచ్చపాఘటులు, చందేలులు, సోలంకులు, కళింగను పాలించిన తూర్పుగాంగులు, గజపతులు, దక్షిణ భారతదేశంలో రాజ్యమేలిన పల్లవులు, చాళుక్యులు, చోళులు, రాష్ట్ర కూటులు, కాకతీయులు, పాండ్యులు, హోయసాలులు, విజయనగర రాజులు అనేక దేవాలయాలు నిర్మించారు. ఈ దేవాలయాల రూపురేఖలలో కొన్ని ప్రాంతీయ విభేధాలు కనిపిస్తాయి. మన ప్రాచీన వాస్తు శిల్ప శాస్త్రజ్ఞులు దేవాలయాలను ఆర్య (నాగర), ద్రావిడ, వేసరాలు అను మూడు రకాలుగా విభజించారు. ఇప్పటి నిపుణులు శిఖరాల రూపురేఖలను బట్టి భారతదేశ దేవాలయాలను దాక్షిణాత్యాలనీ, ఔత్తరాహికాలనీ విభజన చేసినారు. కొందరు ఈ రెండు గాక మూడో రకాన్ని పేర్కొన్నారు. అదే దక్కన్ లేక చాళుక్యరీతి. ఈ చాళుక్యరీతి ఉత్తర, దక్షిణ ఆలయ లక్షణాల కలయిక.

### 12.1.3.1 వాస్తు గ్రంథాలలో వర్గీకరణ :

వాస్తు శిల్ప శాస్త్రజ్ఞులు భారతదేశమందలి దేవాలయాలను రెండువిధాలుగా వర్గీకరించారు. అవి 1. భౌగోళిక పరమైన విభాగం. 2. నిర్మాణరీతి విభాగం.

ఈశానగురుదేవ పద్ధతి, తంత్ర సముచ్ఛయ, శిల్పరత్న, కామికాగమ, సుప్రభేదాగమ వంటి వాస్తు శిల్ప శాస్త్ర గ్రంధాలు భౌగోళిక పరమైన దేవాలయ వర్గీకరణను పేర్కొంటున్నాయి. ఈ గ్రంధాల ప్రకారం భారతదేశమందలి ఒకొక్క ప్రాంతంలో గల దేవాలయాలకు ఒకొక్క పేరుగలదని తెలుస్తుంది. హిమాలయాలకు దక్షిణంగా వింధ్య పర్వతాలకు ఉత్తరంగా ఉన్న దేవాలయాలను 'నాగర' దేవాలయాలని ఈగ్రంధాలు పేర్కొంటున్నాయి. అలాగే వింధ్య పర్వతాలకు దక్షిణంగా కృష్ణానదికి ఉత్తరంగా ఉన్న దేవాలయాలను 'వేసర' దేవాలయాలని, కృష్ణానదికి దక్షిణంగా ఉన్నవాటిని 'ద్రావిడ' దేవాలయాలని ఈ గ్రంధాలు తెలియజేస్తున్నాయి. ఈ విధంగా భారతదేశంలో గల దేవాలయాలను భౌగోళిక పరంగా ఉత్తర భారతదేశంలో గల ఆలయాలను 'నాగరరీతి' ఆలయాలని, దక్కన్‌లో గలవి 'వేసరరీతి' ఆలయాలని, దక్షిణాన ఉన్నవి 'ద్రావిడరీతి' ఆలయాలని ఈ గ్రంధాలు వర్గీకరిస్తున్నాయి.

ఇంకా ఈ గ్రంధాలు భారతదేశ ఆలయాల వర్గీకరణ గురించి మరికొంత ఖచ్చితమైన సమాచారాన్ని ఇస్తున్నాయి. ఈ వర్గీకరణ నిర్మాణ పద్ధతిని బట్టి చేసింది. ఒక దేవాలయం కింది భాగం (అధిష్ఠానం) నుంచి పై భాగం (స్తూపి) వరకు చతుర్ముఖంగా ఉన్నచో అట్టివాటిని 'నాగరరీతికి' చెందినవని ఈ గ్రంధాలు పేర్కొన్నాయి. కొన్ని సంధర్భాలలో గర్భగుడి పైనగల శిఖరంభాగం చతురస్రాకారంగా ఉన్నచో వాటిని కూడా 'నాగర వర్గం' కిందికి చేర్చడం జరిగింది. దేవాలయం లేక ఆలయ శిఖరం గజపృష్ఠాకారంలో ఉంటే వాటిని 'వేసరరీతి' అని, దేవాలయం లేక దాని శిఖరం అష్టముఖంగా ఉంటే వాటిని 'ద్రావిడరీతి' దేవాలయాలని ఈ గ్రంధాలు పేర్కొన్నాయి.

దేవాలయాల వర్గీకరణ అన్ని శాస్త్ర గ్రంధాలందు ఒకే విధంగా వివరించ లేదు. కొన్ని గ్రంథాలు దేవాలయం మొత్తాన్ని ఆధారంగా తీసుకొనగా, కొన్ని శిఖరం మాత్రం ఆధారంగా తీసుకొని దేవాలయ వర్గీకరణ చేసింది. అంతేగాక విష్ణుప్రతిమ గర్భ గృహంలో ఉంటే అట్టి దేవాలయాలు నాగర దేవాలయాలని కొన్ని గ్రంధాలు పేర్కొంటున్నాయి. అందువల్ల వాస్తుశిల్ప గ్రంధాలలో పేర్కొనబడిన భౌగొళిక ప్రాంతీయ విభజన కుదరదు. అంతేగాక వాస్తు గ్రంధాలలో పేర్కొన్నవాటికి విరుద్ధంగా ఆలయాలు ఉన్నాయి. ఉదాహరణకు దక్కన్‌లో నాగర,ద్రావిడ రీతి ఆలయాలు కలగాపులగంగా కలిసి వున్నాయి. మధ్యప్రదేశ్‌లోగల నాచనకుతారాలోని పార్వతీ ఆలయం ద్రావిడ రీతిలో వుంది. కర్ణాటకలోని పట్టడకల్, అయ్యావోలు, ఆంధ్రలోని అలంపురంలో నాగరరీతి ఆలయాలు గలవు. కావున ప్రాచీన వాస్తు శాస్త్ర గ్రంథాలలో ప్రస్తావించబడిన నాగర్,వేసర, ద్రావిడ విభజన కుదరదు.

### 12.1.3.2 ఇప్పటి నిపుణుల వర్గీకరణ :

దేవాలయాల శిఖరాల రూపు రేఖలను ఆధారంగా చేసుకొని ఇప్పటి నిపుణులు భారతదేశ దేవాలయాలను మూడు తరగతులుగా వర్గీకరించారు. అవి (1) ఔత్తరాహిక లేక నాగరరీతి(2) దాక్షిణాత్య లేక ద్రావిడరీతి (3) దక్కన్ లేక చాళుక్యరీతి.

జేమ్స్ ఫెర్గూసన్ అను పురావస్తు శాస్త్రవేత్త భారతదేశంలోని దేవాలయాలను (1) ఇండో-ఆర్యన్ (2) చాళుక్యన్ (3) ద్రవిడియన్ అను మూడు తరగతులుగా వర్గీకరించాడు. పెర్సీబ్రౌన్, కజిన్ అను వాస్తుశాస్త్రజ్ఞులు కూడా ఫెర్గూసన్ అభిప్రాయాన్నే వెలిబుచ్చినారు. వీరి అభిప్రాయంలో ఇండో-ఆర్యన్ దేవాలయాలనగా ఉత్తర భారతదేశమందలి దేవాలయాలని అర్థం. చాళుక్యన్ దేవాలయాలనగా చాళుక్యుల దేవాలయాలు. దక్షిణ భారతదేశములోని దేవాలయాలు ద్రావిడ దేవాలయాలు. వీరి ఉద్దేశం ప్రకారం ఇండో-ఆర్యన్ నాగర రీతికి, చాళుక్యన్ వేసరరీతికి, ద్రవిడియన్ ద్రావిడరీతికి చెందిన దేవాలయాలు. వీరి వర్గీకరణలో పేర్లువేరైనా భావం ఒక్కటే.

జేమ్స్ ఫెర్గూసన్ అభిప్రాయాన్ని ఎస్.కె.సరస్వతి, ఆనంద కుమారస్వామి విమర్శించారు. 'మానసార' అను వాస్తుశాస్త్ర గ్రంథం ఆధారంగా ఎస్.కె.సరస్వతి దేవాలయాల వర్గీకరణ చేశాడు. వీరిప్రకారం నాగర, వేసర, ద్రావిడ అను దేవాలయాలు కలవని, కాని అట్టి వర్గీకరణ ఇతర వాస్తు శాస్త్రాలచే సరిదిద్దబడిందని భావిస్తున్నారు. భారతదేశములో నాగర, ద్రావిడ రీతి దేవాలయాలు మాత్రమే కలవని, వేసర రీతి అనునది ప్రత్యేకంగా లేదని వీరు అభిప్రాయపడుచున్నారు. కాని వీరి అభిప్రాయం సరియైనది కాదని భావించుట కూడా కలదు. ఎందుకనగా పోహోల్, పట్టడకల్, అలంపురం మొదలైన ప్రాంతాలలోని తోలిచాళుక్య దేవాలయాలు పరిశీలిస్తే నాగర, ద్రావిడ రీతికి చెందిన ఒక నూతన రీతి దేవాలయాలను మనం చూడవచ్చు. వీటినే వేసర దేవాలయాలంటారు.

## 12.1.4 దక్షిణ భారతదేశ దేవాలయాల (ద్రావిడశైలి) లక్షణాలు :

దక్షిణ భారతదేశములో దేవాలయ నిర్మాణ కార్యక్రమం ఆంధ్ర శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలోనే ప్రారంభమైంది. కాని నేడు అవి శిధిలమైనాయి. విష్ణుకుండినులు విజయవాడ పరిసర ప్రాంతాల్లో గుహాలయాలు తొలిపించారు. కాని దాక్షిణాత్య దేవాలయ రీతులకు సరియైన పునాదివేసిన వారు పల్లవులు. వీరు మొదట గుహాలయ నిర్మాణం, ఆ తరవాత దేవాలయ నిర్మాణం సాగించారు. వీరికి సమకాలికంగా దక్కన్‌లో తొలిచాళుక్యులు దేవాలయ నిర్మాణంలో అనేక ప్రయోగాలు చేశారు. పల్లవులు, తొలిచాళుక్యుల తరవాత రాష్ట్ర కూటులు, చోళులు, వేంగీ చాళుక్యులు కాకతీయులు హొయసాలులు, విజయ నగర రాజులు, ఇంకా పెక్కు చిన్న చిన్న రాజవంశాల వారు అనేక దేవాలయాలను నిర్మించారు.

దక్షిణ భారతదేశ దేవాలయాలలో మనకు కనిపించే ప్రధాన అంగాలు : గర్భగృహం, ప్రదక్షిణా పథం, అంతరాళం, ప్రవాణం, ముఖ మండపము, మహామండపం, పరివార దేవతా గృహాలు, అమ్మన్ దేవగృహం, బహుస్తంభమండపాలు, ప్రాంగణం, ప్రాకారం, గోపురం మొదలైనవి. అంతేగాక ప్రతి గర్భగృహానికి ఊర్ధ్వముఖంగా ఉపపీఠ, అధిష్టానం, కుడ్య భాగము, కపోతం, విమానం, గ్రీవ,శిఖరం,కలశం అను విభాగాలున్నాయి. దక్షిణ భారతదేశంలో గర్భగృహ నిర్మాణానికి మహబలిపురంలోని ధర్మరాజ, అర్జున రధాలు మార్గదర్శకంగా, భీమరధం గాలి గోపురాల నిర్మాణానికి పునాది అయింది.

దక్షిణ భారతదేశ దేవాలయాలన్నీ అధిష్ఠానం అనే విభాగాన్ని గర్భ గృహం, అంతరాళం, ముఖమండపం మొదలగు అంగాలందు కలిగి ఉన్నాయి. ఈ అధిష్ఠానం సాధారణంగా అనేక విభాగాలుగా విభజింపబడి భిన్నరీతులలో వుంటాయి. వీటి ముఖ భాగాలపై కొన్ని దేవాలయాలలో శిల్పాలు చెక్కి ఉంటాయి. ఈ అధిష్ఠానం రెండు అడుగుల మొదలు 5 అడుగుల వరకు ఎత్తు కలిగి వుంటుంది. కొన్ని ఆలయాల్లో ఈ అధిష్ఠానం క్రింద ఉపపీఠం అను విభాగాన్ని ఆలయ ఎత్తు పెంచటం కోసం నిర్మించడం జరిగింది.

అధిష్ఠానం పైన కుడ్యభాగం నిర్మించబడి వుంది. ఈ కుడ్య భాగం కుడ్యస్తంభాలు, వాటిమధ్య దేవ కోష్ఠాలతో అలంకృతమై ఉంటుంది. దేవ కోష్ఠాలలో దేవతా ప్రతిమలు ప్రతిష్టింపబడి ఉంటాయి. దేవ కోష్ఠాల పైభాగం మకర తోరణాలతో రూపొందించబడి ఉంటుంది. కుడ్యస్తంభాల,శీర్ష భాగంలో 'కార్బెల్ ' అను విభాగం ఉంటుంది. ఇది ఒక్కొక్క రాజ వంశం కాలంలో ఒక్కొక్క రూపంలో వుంది. ఈ 'కార్బెల్ ' ఆకారం ఆధారంగా ఆలయం ఏ రాజవంశ కాలానికి చెందిందో తెలుసుకొనవచ్చు 'పుష్ప పోతిక కార్బెల్ ' విజయనగర స్తంభాల పాద భాగంలో సింహాల ప్రతిమలున్నాయి.

కుడ్యభాగానికి పైన దేవాలయం చుట్టూ కపోతమనే విభాగం వుంది. ఇది అర్ధ చంద్రాకారంలో ఉంటుంది. వీటి ముఖ భాగాలలో కూడు లేక చైత్య అనే చిత్ర రూపాల వరస ఉంది. ఈ కూడులలో జంతు, మానవ శిల్పాలు కన్పిస్తాయి.

కపోతము పైన అనేక అంతస్తులతో కూడిన విమానం ఉంటుంది. ఈ విమానంలో ప్రతి అంతస్తులో కూట, పంజర, శాల అను హారాల వరస దేవాలయం చుట్టూ నిర్మించబడి వుంది. విమానం మూలలందు కూట అను విభాగం, మధ్యలో శాల ఆను విభాగం, రెండిటి మధ్యలో పంజర ఆను విభాగం ఉంటాయి. ఈ హరాల పై కలశాలు కూడా ఉండవచ్చు. హారాల మధ్య స్థలం దేవతా వాహనాలతో అలంకరించబడి ఉంటుంది. విమానం పైన గ్రీవ మనెడి ఎనిమిది ముఖాలు గల విభాగం వుంది. దీని పై అష్టముఖ, లేదా గుండ్రటి శిఖరముంది. శిఖరంపైన కలశం వుంది. కలశం శిలతో గాని లేక లోహంతోగాని నిర్మించబడి ఉంటుంది.

గర్భగృహం పై భాగంలో మాత్రమే విమానం నిర్మించబడి ఉంటుంది. ఈ విభాగం సాధారణంగా ఇటుకలతో నిర్మించబడి వుంటుంది. అధిష్టానం నుంచి కపోతం వరకు మాత్రమే శిలతో నిర్మించబడి వుంటుంది. బాపట్ల భావనారాయణ స్వామి ఆలయం ఆధిష్టానం నుంచి విమానం వరకు శిలతో నిర్మించబడింది. గర్భగృహానికి ముందుగల అంగాల పై విమాన నిర్మాణం వుండదు. గర్భగృహం ముందుగల అర్ధమండపం, ముఖమండపం మొదలగు విభాగాలన్నీ సమతలంగా వుంటాయి.

గర్భగృహం చుట్టూగాని లేక గర్భగృహం, అంతరాళం రెండింటి చుట్టూగాని ప్రదక్షిణా పథం అనే విభాగం భక్తులు గర్భగుడి చుట్టిరావడానికి ఏర్పాటు చేయబడింది. ఈ ప్రదక్షిణా పథంలో కొన్ని సందర్భాలలో దేవతా ప్రతిమలు, వర్ణచిత్రాలతో అలంకరించబడి ఉంటుంది.

కొన్ని దేవాలయాల ప్రాంగణంలో పరివారదేవతలకు దేవగృహాలు నిర్మించబడి వుంది. కొన్నింటిలో ముఖ్యదేవుని సతికి ప్రత్యేకంగా గృహనిర్మాణం చేసే సాంప్రదాయం కూడా ఉంది. ఇట్టి దేవగృహాలను అమ్మాళ్ కోయిల్ అంటారు. ఆ పద్దతి చోళుల చివరి కాలంలో ప్రారంభమైంది.

అనేక స్తంభాలతో కూడిన మండపాలను ఆలయ ప్రాంగణంలో నిర్మించే విధానం కూడా గలదు. ఈ మండపాలు అనేక వరసలుగల స్తంభాలను కలిగి, కుడ్య విభాగం లేకుండా నిర్మంచబడివుంది. స్తంభాలు దైవ, మానవ మూర్తులతో అలంకరించబడింది. విజయనగర రాజుల కాలంలో 100 స్తంభాల మండపాలు అనేకంతో నిర్మించబడింది. మధుర మీనాక్షి ఆలయంలో 1000 స్తంభాల మండపముంది.

దేవాలయ ప్రాంగణం చుట్టూ సాధారణంగా ప్రాకారం నిర్మించబడి వుంటుంది. కొన్ని దేవాలయాలకు రెండు ప్రాకారాలు కూడా కలవు. ప్రాకారగోడ మధ్య భాగంలో ఒక వైపు గాని లేక రెండు వైపులాగాని గాలి గోపుర ద్వారం నిర్మించబడివుంది. పల్లవులతో ప్రారంభమైన ఈవిధానం పాండ్య, విజయనగర కాలంలో పరాకాష్ఠ చెందింది. ఈ గాలిగోపురాలు అనేక అంతస్థులు కలిగి పైన బండిగూడు ఆకారం కలిగి ఉంటుంది. దీని పై కలశాల వరుస ఉంటుంది. తంజావూరు, మధుర, కాళహస్తి, మంగళగిరి మొదలగు చోట్ల ఎత్తైన గోపురాలు గలవు. కొన్ని ఆలయాలలో ప్రాంగణంలోగాని ప్రాకారం వెలుపలగాని పుష్కరిణి ఉంటుంది. దేవతా సంబంధమైన ప్రత్యేక ఉత్సవాల కోసం, భక్తుల అభ్యంగన స్నానాల కోసం వీటిని నిర్మించడం జరిగింది.

## 12.1.5 ఉత్తర భారతదేశ దేవాలయాల ( నాగరశైలి ) లక్షణాలు :

ఉత్తర భారతదేశ దేవాలయాలను నాగర శైలి దేవాలయాలంటారు. గుప్తుల కాలంలో కొన్ని దేవాలయాల నిర్మాణంలో ఈ శైలి కన్పించినప్పటికీ, క్రమ క్రమంగా అభివృద్ధి చెంది క్రీ.శ. 8వ శతాబ్దిలో ఒక విశిష్టతను సంతరించుకొని ఒక ప్రత్యేక శైలిగా వాడుకలోకి వచ్చింది. నాగర ఆలయాలకు గర్భగృహం, దాని ముందు ప్రవాణం లేక ఇతర భాగాలైన జగిమోహనం, నాట్యమండపం, భోగమండపం ఉన్నాయి. చతురస్రాయతాస్రమైన భూవిన్యాసం, అను వృత్తాకారం విమానం, ఆపైన గుమ్మడికాయ ఆకారంలో ఆమలకశిల, ఆపైన కలశం నాగర శైలి ఆలయాల ప్రముఖలక్షణాలు. విమానాలు గర్భగృహం భాగమందు రాహాపాగా,అనురాహాపాగా, కోనికాపాగా అను విభాగాలు కల్గి ఉన్నాయి. విమానం యొక్క అంతస్థులు తెలుపుటకు కోనికాపాగా విభాగంలో భూమి ఆమలకాలు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఈ విమాన భాగాలందు 'గేబుల్ డిజైన్లు' ఒకదాని పై మరొకటి రూపొందించ బడివున్నాయి. ఈ విమానాలను రేఖాశిఖరాలని కూడా అంటారు. నాగర ఆలయాల్లో 'త్రింధ' , 'పంచరధ' , 'సప్తంధ' మను రూపాలు గలవు. దక్షిణ భారత దేశంలో లాగా కాక ఉత్తర భారతదేశ దేవాలయాలలో స్తంభాలు చాలావరకు లేవు. గర్భగృహం పై అను వృత్తాకారంలో శిఖరం ఉండగా, గర్భగుడి ముందు గల విభాగాల పై పిరమిడ్ ఆకృతిలో శిఖరాలు ఉండడం 'నాగర' ఆలయాల ప్రత్యేకత.

ఉత్తర భారతదేశ దేవాలయ నిర్మాణ రీతులలో కొన్ని ప్రాంతీయ లక్షణాలు కనిపిస్తున్నాయి. వీటి ఆధారంగా ఉత్తర దేశ దేవాలయాలను కళింగ, మధ్యభారత, గుజరాత్ రీతి ఆలయాలుగా విభజించవచ్చు. కళింగ దేవాలయాలలో ప్రధాన అంగాలు వరసగా భోగమందిరము, నట మందిరము, జగమోహనము, శ్రీ మందిరం. విమానం ఆను వృత్తాకారంలో ఉంటుంది. మందిరాలపై వేర్వేరుగా పిరమిడు ఆకారంలో కప్పులున్నాయి. కళింగ దేవాలయాలు ఉన్నత శిఖరాలు కలవయితే, మధ్య భారత దేవాలయాలు సుసంధిబంధురాలు. కళింగ ఆలయాలలో లాగా విడిఅంగాలు ఒక చోట వరసగా కూర్చినట్లుగా కాక ఒక కట్టడంలో అంతర్భాగాలుగా ఇమిడి ఉంటాయి.

గుజరాత్ దేవాలయాలు లలిత సుందరంగా ఉంటాయి. వీటిలో ప్రధానంగా గర్భగృహం, మండపము అను రెండు ప్రధాన అంగాలుంటాయి. మండపంలో సుందరంగా చెక్కిన స్తంభాలుంటాయి. మధ్య భారత, గుజరాత్ ఆలయాల శిఖరాలకు ప్రధానాలంకారాలు పెద్ద శృంగాలు లేదా లఘు శిఖరాలు.

## 12.1.6 చాళుక్య మండల రీతి ( వేసరశైలి ) లక్షణాలు :

దక్షిణ దేశంలో పల్లవుల ఆదరణలో అభివృద్ధి చెందిన ద్రావిడ రీతి కృష్ణానదికి ఎగువ భాగాన చాళుక్య మండలానికి విస్తరించి, అక్కడ కొన్ని నూతన లక్షణాలను సంతరించుకొని చాళుక్య రీతిగా పరిణమించింది. ఈ చాళుక్య రీతినే కొందరు పండితులు వేసర సాంప్రదాయంగా పరిగణించారు. కర్ణాటకలోని లక్కుండిలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఈ రీతి పరిపూర్ణత చెందింది. ఈ క్రీ.శ. 12వ శతాబ్ది ఉత్తరార్ధంలో నిర్మించబడిన ఈ ఆలయంలో రెండు గర్భగృహాలు గలవు. విమానంలోను, భూముల ఏర్పాటు ద్రావిడ వాస్తు వలె ఉన్నప్పటికీ, భూములలో శాలల ఏర్పాటు ఒక దాని పై ఒకటి నిట్టనిలువుగా జరగడం వలన, రేఖా దేవాలయాల శిఖరాల రూపాలను ఇది కొంతవరకు సంతరించుకోగలిగింది. ఈ రీతి ఆలయాలు ఇత్తగి, డంబల్‌లలో గలవు. వేసర రీతి హోయసాలుల కాలంలో ఒక నూతన రీతిని సంతరించుకొంది. ఒకే కట్టడంలో ఒకటికన్నా ఎక్కువ దేవతలను వేర్వేరు గర్భగృహాలలో ప్రతిష్ఠించడం, ఇవి ఒక మండపాన్ని పరివేష్టించి ఉండడం, ఆలయాలు నక్షత్రాకారంలో ఉండడం హోయసాల ఆలయాల విశిష్టత. హోయసాల ఆలయాలు చాలావరకు చాళుక్య రీతులననుసరించి ఉన్నాయని పండితుల అభిప్రాయం. హోయసాల ఆలయాలకు ప్రసిద్ధస్థానాలు బేలూరు, హాలెబీడు, సోమనాథపురం.

## 12.1.7 సారాంశము :

ప్రాచీన భారతదేశములోని హిందూ దేవాలయాల ప్రాచీనత. దేవాలయాల వర్గీకరణ, వాస్తు నిర్మాణ శైలిలో దక్షిణ భారతదేశపు దేవాలయాల లక్షణాలు. ఉత్తర భారతదేశ లక్షణాలు మరియు చాళుక్య మండలరీతి లక్షణాలు విశదీకరించ బడినాయి.

## 12.1.8 నమూనా ప్రశ్నలు :

1) హిందూ దేవాలయాల వర్గీకరణ గురించి చర్చింపుము.

2) హిందూ దేవాలయాల పుట్టుపూర్వోత్తరాల గురించి వివరింపుము.

3) నాగర, ద్రావిడ, వేసర శైలిలక్షణాలు తెలుపుము.

**డా.వి.కె.మోహన్**

పాఠం-12.2

# తొలి చాళుక్య నిర్మాణశైలి

## 12.2.0 లక్ష్యం :

తొలి చాళుక్య నిర్మాణశైలి, వేంగి చాళుక్య దేవాలయాల, మలిచాళుక్య నిర్మాణ శైలి గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


**12.2.1 పరిచయం**

**12.2.2 తొలి చాళుక్య నిర్మాణశైలి లక్షణాలు**

**12.2.3 బాదామి**

**12.2.3.1 గుహాలయాలు**

**12.2.3.2 దేవాలయులు**

**12.2.3.2.1 మాలెగిత్తి శివాలయం**

**12.2.3.2.2 మహాకూడేశ్వరాలయం**

**12.2.4 ఐహొల్**

**12.2.4.1 లాడ్ ఖాన్ దేవాలయం**

**12.2.4.2 కోంటిగుడి**

**12.2.4.3 దుర్గాలయం**

**12.2.4.4 హుచి మల్లిగుడి**

**12.2.4.5 మెగూతి ఆలయం**

**12.2.5 పట్టడకల్**

**12.2.5.1 సంగమేశ్వరాలయం**

**12.2.5.2 విరూపాక్షాలయం**

**12.2.5.3 మల్లికార్జునాలయం**

**12.2.5.4 పాపానాధాలయం**

**12.2.5.5 గళగనాధాలయం**

**12.2.5.6 కాశీ విశ్వేశ్వరాలయం**

**12.2.5.7 కాడ్ సిద్ధేశ్వరాలయం**

**12.2.6 ఆలంపురం - నవబ్రహ్మాలయాలు**

**12.2.7 సమీక్ష**

**12.2.8 వేంగీ లేక తూర్పు చాళుక్య దేవాలయాలు**

**12.2.8.1 బక్కవోలు**

**12.2.8.2 చేబ్రోలు**

**12.2.8.3 పంచారామాలు**

**12.2.9 కళ్యాణి లేక మలిచాళుక్య దేవాలయాలు**

**12.2.10 సారాంశము**

**12.2.11 నమూనా ప్రశ్నలు**

## 12.2.1 పరిచయం :

తొలి చాళుక్యులు బాదామి లేదా వాతాపి రాజధానిగా క్రీ.శ. 6వ శతాబ్దం నుండి క్రీ.శ. 8వ శతాబ్దం వరకు పరిపాలించారు. ఈ వంశానికి చెందిన పాలకులలో మొదటి పులకేశి, మొదటి కీర్తి వర్మ, రెండవపులకేశి, విజయాదిత్యుడు, విక్రమాదిత్యుడు ముఖ్యమైనవారు. ఈ వంశపురాజులు హిందూ మతాభిమానులు. అయినా పరమతసహనం పాటించారు. అందువల్ల ఈ కాలంలో హిందూ దేవాలయాలే గాక జైన దేవాలయాలు కూడా నిర్మించ బడినాయి. ఈ వంశపురాజులు నిరంతరం పల్లవులతో యుద్ధాలు కొనసాగించినా, దేవాలయ నిర్మాణ రీతిలో వారితో పోటీపడి ఒకనూతన కళారీతికి రూపురేఖలు దిద్దారు. దీనినే 'చాళుక్య శైలి' అని ఫెర్గూసన్ పండితుడంటాడు. ఇందులో నాగర, ద్రవిడ నిర్మాణ శైలులు మిళితమయి.

తొలి చాళుక్యులు నిర్మించిన ఆలయాలు కర్ణాటకలోని బాదామి,పట్టడకల్, వేహోల్‌లలో, ఆంధ్రలోని, మహానంది, సత్యవోలులలో గలవు. వీటిలో కొన్ని ద్రావిడ రీతిలో, మరికొన్ని నాగరరీతిలో ఉన్నాయి. బాదామిలోని మాలెగిత్తిశివాలయం, ఆలంపురం పట్టడకల్‌లోని విరూపాక్షాలయం ద్రావిడ రీతికి చక్కటి తార్కాణాలు. నాగరరీతికి పట్టడకల్‌లోని పాపానాథాలయం, వేహోల్‌లోని దుర్గాలయం చక్కటి నిదర్శనాలు.

## 12.2.2 తొలి చాళుక్య నిర్మాణశైలి లక్షణాలు :

తొలి చాళుక్యులు ప్రథమంలో కొండలను తొలచి గుహాలయాలు నిర్మించారు. ఇట్టివి బాదామిలో కలవు. ఆ తరువాత వీరు తమ సామ్రాజ్యంలోని బాదామి, పట్టడకల్, వేహోల్, ఆలంపురం మొదలగు చోట్ల దేవాలయాలను నిర్మించారు. వీరి నిర్మాణాలలో గుప్త నిర్మాణ ప్రభావం కనబడుతుంది. వీరి దేవాలయాల ప్రధాన అంగాలు గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణాపథం, ముఖమండపం, ప్రవాణం, గర్భగుడి పై విమానం, ప్రాకారం, గోపురం. వీరి దేవాలయాల విమానాలు నాగర, ద్రవిడ అను రెండు రీతులలో గలవు. వీరి ఆలయాలు కొన్నింటిలో గర్భగృహం లోపల నాల్గు మూలలందు స్తంభాలు నిర్మించే పద్ధతి ఉంది. ఈ పద్ధతి ఆలంపురం ఆలయాల్లో చూడవచ్చు. గర్భగృహ ద్వారానికి ఇరు వైపులా అనేక శాఖల నిర్మాణం కలదు. ద్వారం పై భాగంలో గరుడ ప్రతిమ ఉంది. కొన్ని దేవాలయాల్లో ద్వారాల కిరువైపులా గంగ , యమున శిల్పాలున్నాయి. గర్భ గృహ కుడ్యాల బాహ్య భాగంలో దేవ కోష్టాలు, వాటి పై మకరతోరణ అలంకరణ కలదు. వీరు నిర్మించిన దేవాలయాలు కొన్నింటిలో 'సుఖనాస' అను విభాగం విమానంలో గలదు. సుఖనాస ముఖ భాగంలో గల కూడులో సాధారణంగా నటరాజ ప్రతిమ ఉన్నది. వీరి దేవాలయాల్లో స్తంభాలు సాధారణంగా ఘనంగా ఉండి, స్తంభశీర్శిక భాగంలో తరంగ 'కార్బెల్' గలదు. తొలిచాళుక్య నిర్మాణంలో అమరావతి శిల్ప కళాప్రభావం కొంత వరకు కన్పిస్తుంది. అంతేగాక పల్లవచాళుక్య ఘర్షణల వల్ల చాళుక్య వాస్తుశిల్ప కళలో కొంత పల్లవ సాంప్రదాయం కూడా కన్పిస్తుంది.

## 12.2.3. బాదామి :

బాదామిలో తొలిచాళుక్యులు తొలిపించిన గుహాలయాలు, రాతితో నిర్మించిన దేవాలయాలు గలవు.

### 12.2.3.1 గుహాలయాలు :

ద్రావిడ దేశంలో పల్లవులు గుహాలయాలను తొలపించినట్లుగానే తొలి చాళుక్యులు బాదామిలోని ఇసుక రాతి కొండలో నాల్గుగుహాలయాలు తొలిపించారు. వీటిలో మూడు హిందూమతానికి, ఒకటి జైన మతానికి చెందినవి. ఈ గుహాలయాలు ఒక ప్రాంగణం, దీర్ఘచతురస్రాకారపు స్తంభవరండా, స్తంభమండపం, ఈ మండపం వెనుక గర్భగృహం అను భాగాల కలిగి ఉన్నాయి. స్తంభాలపై, కుడ్యస్తంభాలపై, కుడ్యాలపై శిల్పాలున్నాయి. బాదానిలోని మొదటి గుహాలయం శివాలయం. ఇందులో నటరాజ, అర్ధనారీశ్వర, మహిషాసురమర్ధిని, గణపతి, హరిహర శిల్పాలున్నాయి. రెండో గుహాలయం, ముడో గుహాలయం విష్ణువుకు అంకితం. రెండో గుహలో వామన, వరాహ, త్రివిక్రమ, ద్వారపాలకుల శిల్పాలున్నాయి. మూడో గుహలో త్రివిక్రమ, విష్ణు, హరిహర, వరాహ, నరసింహ శిల్పాలున్నాయి. నాల్గోగుహ ఆదినాధుని ఆలయం. గర్భగుడిలో సింహాసనం పై అధిష్టించిన ఆదినాధుని విగ్రహం ఉంది. గుహకుడ్యాల పై అనేక జైన శిల్పాలున్నాయి.

### 12.2.3.2 దేవాలయాలు :

తొలిచాళుక్యులు నిర్మించిన ఆలయాలు బాదామిలో, దాని పక్కనే ఉన్న ముక్తేశ్వర్ యందు కలవు. వీటిలో బాదామిలోని మాలెగిత్తి శివాలయం, మహా కూటేశ్వల్ ఆలయ సమూహంలోని మహాకూటేశ్వర, మల్లికార్జున ఆలయాలు ముఖ్యమైనవి.

#### 12.2.3.2.1 మాలెగిత్తి శివాలయం :

దీని నిర్మాత మొదటి కీర్తివర్మ. కొండ పైగల ఈ దేవాలయానికి గర్భగృహం, మండపం, ప్రవాణం అను విభాగాలున్నాయి. గర్భగృహంలో శివలింగముంది. గర్భగృహద్వారం పై గరుడుని ప్రతిమ ఉంది. గర్భగృహ, మండపాల కుడ్యాలపై దేవకోష్ఠాలు, రంధ్రాలున్నరాతి గవాక్షాలు వున్నాయి. మండప ప్రవేశమార్గానికిరువైపులా ఆయుధాలు ధరించిన ఇద్దరు వీరుల ప్రతిమలున్నాయి. మండప ఉత్తర కుడ్యంలో విష్ణువ, దక్షిణ కుడ్యంలో శివుని ప్రతిమలు గలవు. గర్భగృహం పై రెండస్థుల ద్రావిడ విమానం కలదు. ఈ ఆలయానికి సమీపంలోనే కింది శివాలయం, పై శివాలయం అను దేవాలయాలున్నాయి.

#### 12.2.3.2.2 మహకూడేశ్వరాలయం :

బాదామికి సమీపంలో మహాకూడేశ్వర్ లోని ఆలయాల సముదాయంలో మహకూడేశ్వరాలయం ప్రముఖమైంది. దీనికి గర్భగృహం, ప్రదక్షిణా పథం, మండపం ఆను విభాగాలున్నాయి. ఈ ఆలయ కుడ్యాలలో దేవ కోష్ఠాలు, రంధ్రాలున్న రాతి గవాక్షాలు, కుడ్యస్తంభాలున్నాయి. గర్భగృహం పై రెండు అంతస్తుల ద్రావిడ విమానముంది. మహాకూడేశ్వర్ ఆలయ సముదాయంలో ఒకటి మల్లికార్జునాలయం. ఇది కూడా మహకూడేశ్వర ఆలయంలాగా వుంది.

## 12.2.4 ఐహొల్ :

తొలి చాళుక్యులు తమ తొలి రాజధానియైన ఐహొల్ లో దాదాపు 70 దేవాలయాలు నిర్మించారు. వీటిలో లాడ్ఖాన్, కోంట్గుడి, దుర్గ, హుచి మల్లిగుడి, మెగూతి దేవాలయాలు ముఖ్యమైనవి.

### 12.2.4.1 లాడ్ ఖాన్ దేవాలయం :

తొలి చాళుక్యులు నిర్మించిన దేవాలయాల్లో అతి ప్రాచీనమైంది లాడ్ ఖాన్ దేవాలయం. దీని నిర్మాత మొదటి పులకేశి. ఈ దేవాలయానికి ఒక దీర్ఘ చతురస్రాకారపు హాలు, దాని వెనుక చతురస్రాకారపు గర్భగృహం అను రెండు అంగాలు గలవు. గర్భగృహం పైన మరో గర్భగృహం నిర్మించ బడి ఉండుట ఈ ఆలయ ప్రత్యేకత, ఈ పద్ధతి గుప్తుల నాటి పార్వతీ ఆలయాన్ని గుర్తుకు తెస్తుంది. గర్భగృహ కుడ్యాల పై వెలుపల దేవ కోష్టాలున్నాయి. వాటిలో ఒక దానిలో విష్ణుప్రతిరూపములు, రేఖా చిత్రణ గలవు. హాలు ముందు గల వసారా స్తంభాలపై గంగా, యమున ప్రతిమలున్నాయి. రెండో గర్భగుడి పై భాగం సమతలంగా వుంది.

**12.2.4.2 కోంట్‌గుడి :**

ఐహోల్ లోని ముఖ్య ఆలయాల్లో ఇది ఒకటి. ఈ ఆలయానికి పెద్దహాలు, వెనుక గర్భగృహంవుంది. గర్భగృహం పైన కూట, పంజర, హారాలవరుసలో ఏకతల విమానం గలదు. గర్భగృహంలో శివలింగం వుంది. ద్వారం పైన గరుడుని శిల్పం వుంది. హాలులో గల విమానంలో అష్టదిక్పాలకుల చిత్రాలున్నాయి. వీరందరూ బ్రహ్మ చుట్టూ ఆయాదిక్కుల్లో ఉన్నట్లు మలచబడింది.

**12.2.4.3 దుర్గాలయం :**

క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన దుర్గాలయం గజపృష్ఠాకారంలో వుంది. ఆలయ గర్భగృహం చుట్టూ రెండు కుడ్యనిర్మాణాలున్నాయి. గర్భగృహం ముందు ప్రవాణం కలదు. ఆలయం చుట్టూ ప్రాకారం కలదు. గర్భగృహం పై గల విమానం నాగర రీతికి చెందినది. విమాన మందు రాహాపాగ, కోనికాపాగ అను విభాగాలు ఉన్నాయి. గర్భగృహ ద్వారం పైన గురుడుని శిల్పం వుంది. గర్భగృహ కుడ్యంలోని దేవకోష్ఠాలలో దుర్గ, వరాహ, విష్ణు, అర్ధనారీశ్వర, నరసింహ ప్రతిములుగలవు. ప్రవాణ స్తంభాలపై మిధాన, తామర పధకాలు, గళ చిత్రాలున్నాయి. ఆలయ గోపుర ద్వారంపై రెండో విక్రమాదిత్యుని శాసనం ఉంది.

**12.2.4.4 హుచిమల్లిగుడి :**

నాగర రీతిలో నిర్మించబడిన ఈ ఆలయంలో గర్భగృహం, అంతరాళం, మండపము, వసారా అను అంగాలు గలవు. ప్రవాణంలోని వితానంలో కార్తికేయుని చిత్రం, అతని పరివార దేవతల చిత్రాలున్నాయి. ఆలయ స్తంభాలు ఘనచతుర స్రాకారంలో ఉన్నాయి.

**12.2.4.5 మెగూతి ఆలయం :**

ఇది ఒక జైన ఆలయం. ఈ ఆలయంలో రవికీర్తి రచించిన రెండో పులకేశి శాసనం ఉంది. ఈ ఆలయానికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, ఆంతరాళం, ముఖ మండపం అను లింగాలు గలవు. ఒక దాని మీద ఒకటిగా రెండు గర్భగృహాలున్నాయి. గర్భగృహం చుట్టూగల కప్పు ఏటవాలుగా వుంది. కుడ్యాలలో కుడ్యస్తంభాలు, దేవ కోష్ఠాలు, రంధ్రాలున్న రాతిగవాక్షాలు ఉన్నాయి.

## 12.2.5 పట్టడకల్ :

బాదామికి 15 కి.మీ దూరంలో వున్న పట్టడకల్‌లో 10 తోలి చాళుక్య దేవాలయాలున్నాయి. వీటిలో నాల్గు ఔత్తరాహిక రీతిలోను, మిగిలినవి దాక్షిణాత్య రీతిలోను ఉన్నాయి.

**12.2.5.1 సంగమేశ్వరాలయం :**

రెండో పులకేశి నిర్మించినట్లు భావిస్తున్న ఈ ఆలయానికి గర్భగృహం, అర్ధమండపము, ప్రదక్షిణాపదం, మహమండపాలున్నాయి. మండప కుడ్యాలలో దేవకోష్ఠాలు, రంధ్రాలున్న రాతి గవాక్షాలు ఉన్నాయి. పశ్చిమ కుడ్యాలలో నాల్గు శివ ప్రతిమలు గలవు.

**12.2.5.2 విరూపాక్షాలయం :**

పట్టడకల్‌లోని దేవాలయాలలో విరూపాక్షాలయం ప్రధానమైంది. ఇది ద్రావిడ రీతికి చక్కని నిదర్శనం. ఈ ఆలయాన్ని తొలి చాళుక్య రాజైన రెండో విక్రమాదిత్యుని రాణి లోకమహాదేవిచే నిర్మించబడింది. రెండో విక్రమాదిత్యుడు పల్లవ రాజ్యం పై దాడి చేసిన సందర్భంలో కంచిలోని కైలాసనాధ ఆలయాన్ని చూసి ఆశ్చర్య చకితుడై, అట్టి ఆలయాన్ని తన తాత్కాలిక రాజధాని పట్టడకల్‌లో నిర్మించదలిచాడు. కాంచీపురంలోని 'గుండ' అను వాస్తునిపుణుని తనతోబాటు తీసుకొని వచ్చి ఈఆలయాన్ని నిర్మింప చేశారు. ఈ దేవాలయానికి గర్భగృహం, ఆంతరాళం, ప్రదక్షిణాపథం, ముఖ మండపం అను అంగాలున్నాయి. ఆలయం చుట్టూ ప్రాకారముంది. గర్భగృహం లో శివలింగం కలదు. ఆలయ కుడ్యాలపై దేవ కోష్ఠాలు ద్వితల ద్రావిడ రీతి విమానాలు గలవు. కపోత భాగంలో మానవతలలు గల కూడు, వ్యాళాలంకరణ గలవు. విమానం నాల్గు ఆంతస్థులలో వుంది. విమానం తూర్పు వైపు సుఖనాస నిర్మాణం వుంది.

మండపంలోనాల్గు వరసల స్తంభాలున్నాయి. ఒక్కోక్క వరుసలో ఐదు స్తంభాలున్నాయి. ఈ స్తంభాలపై రామాయణ, మహాభారత కథా శిల్పాలున్నాయి. మండప వితానంలో ఏడు అశ్వాలతో గల సూర్యని శిల్పం ఉన్నది. మండపం మూడు వైపులా మూడు వసారాలు నిర్మించబడి ఉన్నాయి. ఆంతరాళం వైపు మండప చివరి భాగాల్లో దుర్గ, గణేశ దేవగృహాలున్నాయి. ఆలయ ప్రాకారం లోపలి వైపు గోడను ఆనుకోని పది ప్రాకార దేవతా గృహాలున్నాయి.

### 12.2.5.3 మల్లికార్జునాలయం :

పట్టడకల్ లోని మల్లికార్జునాలయం నిర్మాత రెండో విక్రమాదిత్యుడు. ఈ ఆలయాన్ని త్రైలోక్య మహాదేవి ఆలయం అనికూడా పిలుస్తారు. ఈ ఆలయ ప్రధాన అంగాలు గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణాపథం, స్తంభ మండపం, వసారా. గర్భగృహ ద్వారంపై గరుడుని శిల్పముంది. గర్భగృహం పై నాల్గు అంతస్థుల విమానం ఉంది. ఆలయం ముందు నందిమండపం ఉంది. ఆలయంలో భగవద్గీతలోని పలు ఘట్టాలతో కూడిన శిల్పాలున్నాయి.

### 12.2.5.4 పాపానాథాలయం :

పట్టడకల్ లోని నాగర శైలి నిర్మాణాలలో పాపానాథాలయం ప్రముఖమైంది. ఇందు గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, స్తంభ మండపం, ప్రవాణం అను భాగాలున్నాయి. గర్భగృహం పై గరుడుని శిల్పం వుంది. ముఖ మండప వితానంలో దిక్పాలకుల చిత్రాలు ఉన్నాయి. ప్రవాణ స్తంభాల పై గణ, దేవత, పధక చిత్రాలున్నాయి. స్తంభ శీర్షికలలో తరంగ కార్బెల్ వుంది. ఆలయ కుడ్యభాగాలలో దేవకోష్ఠాలు, రంధ్రాల కిటికీలు, కుడ్యస్తంభాలు,వీటి పై కూడు అలంకరణ ఉన్నాయి. ఈ ఆలయ విమానం నాగర రీతిరో వుంది. విమానం ముందు సుఖనాస నిర్మాణం ఉంది. సుఖనాస ముఖభాగాన గల కూడులో నట రాజప్రతిమ కలదు.

### 12.2.5.5 గళగనాథాలయం :

పట్టడకల్ లోని గళగనాథాలయం నాగర రీతిలో నిర్మితమయింది. ఈ ఆలయ గర్భగృహ వెలుపలి కుడ్యముఖభాగం మూడు ఉబ్బెత్తు వసారాలలాగ ఉంది. త్రిరధ శిఖరం కలదు. విమాన కోనికాపాగలో భూమి ఆమలకలు విమాన తలాలను తెలుపుతున్నాయి.

### 12.2.5.6 కాశీ విశ్వేశ్వరాలయం :

ఈ ఆలయం నాగర రీతిలో నిర్మితమైంది. ఈ ఆలయానికి గర్భగృహం, మండపం ఉన్నాయి. గర్భగృహంలో శివలింగం కలదు. మండప వితానంలో శివపార్వతులు, వారి చుట్టూ దిక్పాలురు గల శిల్ప ముంది. గర్భగృహ ద్వారంపై గరుడుని శిల్పముంది. మండప 'లంటెల్' భాగంలో నటరాజు ప్రతిమ వుంది.

### 12.2.5.7 కాడ్ సిద్దేశ్వరాలయం :

ఈ ఆలయం నాగర రీతిలో నిర్మితమైంది. గర్భగృహ కుడ్యభాగాలలో దేవ కోష్ఠాలున్నాయి. ఉత్తరం వైపుగల కోష్ఠంలో దేవీ ప్రతిమ ఉంది. పశ్చిమం వైపుగల కోష్ఠంలో విష్ణుప్రతిమ ఉంది. ఆలయ విమానం ముందు సుఖనాస నిర్మాణం వుంది. ఇందుగల కూడులో నటరాజ ప్రతిమ గలదు.

## 12.2.6 ఆలంపురం - నవబ్రహ్మాలయాలు :

తొలి చాళుక్యులు నిర్మించిన ఆలయాలు కర్ణాటకలోనే గాక ఆంధ్రప్రదేశ్ లో ఆలంపురం, సంగమేశ్వర్, కడమర కాల్వ, మహానంది, సత్యవోలులో గలవు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలంపురంలో తుంగభద్రానది ఒడ్డున 9 దేవాలయాలున్నాయి. వీటిని నవబ్రహ్మాలయాలు అంటారు. ఇవన్నీ శైవ ఆలయాలు. అన్నింటికీ గర్భగృహం, ఆంతరాళం, ప్రదక్షిణాపథం, మండపం అను లింగాలు కలవు. వీటిలో తారకబ్రహ్మాలయం ద్రావిడ రీతిలో నిర్మితమైంది. మిగతా ఎనిమిది ఆలయాలు నాగర రీతిలో నిర్మితమయ్యాయి. అవి కుమారబ్రహ్మ బాలబ్రహ్మ, ఆర్కబ్రహ్మ, వీరబ్రహ్మ, విశ్వబ్రహ్మ, పద్మబ్రహ్మ, గరుడబ్రహ్మ, స్వర్గబ్రహ్మదేవాలయాలు ఆలయాలన్నీ

తూర్పు ముఖం కలిగివున్నాయి. ఆలయ కుడ్యాలపై, వితానంలో, స్తంభాలపై మనోహర శిల్ప సంపదగలదు. గర్భగృహ ద్వారాల కిరువైపులా గంగా, యమునా శిల్పాలు, ద్వారంపైన గరుడుని శిల్పం గలవు. ఆలయాల కుడ్యాలపై లింగోద్భవ మూర్తి, సూర్యుడు, త్రిపురాంతక మూర్తి, బిక్షాటన మూర్తి, శివలీల గంగావతరణం, మిధాన శిల్పాలు గలవు.

## 12.2.7 సమీక్ష :

తొలిచాళుక్యులు లేదా బాదామి చాళుక్యులు కర్ణాటక, పశ్చిమ ఆంధ్ర ప్రాంతాలను క్రీ.శ. 6వ శతాబ్దం మొదలు క్రీ.శ. 8వ శతాబ్దం వరకు పరిపాలించారు. వీరు గుహాలయాలు తొలిపించారు, దేవాలయాలు నిర్మించారు. బాదామిలో వీరి గుహాలయాలు కలవు. బాదామి, పట్టడకల్, వేహోల్, ఆలంపురం మొదలగు ప్రాంతాలలో దేవాలయాలు గలవు. వీరి నిర్మాణాలలో నాగర, ద్రావిడ శైలి లక్షణాలు మిళితమైనాయి. వీరి నిర్మాణాలలో శైవ, వైష్ణవ శిల్పాలు రెండూ కలవు. వీరి నిర్మాణాలు రాబోయే యుగాలకు మార్గదర్శకాలైనాయి.

## 12.2.8 వేంగీలేక తూర్పు చాళుక్య దేవాలయాలు :

తొలిచాళుక్య చక్రవర్తి రెండోపులకేశి తీరాంధ్రం పైదండెత్తి వచ్చి, దాని నాక్రమించి తన సోదరుడైన కుబ్జ విష్ణు వర్ధనుని తన ప్రతినిధిగా అచట నిలిపాడు. ఇతడు వేంగీ రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. ఈతని వంశస్థులు క్రీ.శ. 7వ శతాబ్ది మొదలు క్రీ.శ. 1070 వరకు తీరంధ్రాన్ని పాలించారు. వీరినే తూర్పుచాళుక్యులు లేదా వేంగీ చాళుక్యులంటారు. వీరు తీరాంధ్రంలో అనేక ఆలయాలు నిర్మించారు. వాటిలో ముఖ్యమైనవి బిక్కవోలులో గలవు. ఆంధ్రలో పంచారామాలని ప్రసిద్ధి గాంచిన శైవాలయాలను నిర్మించింది వీరే.

### 12.2.8.1 బిక్కవోలు :

తూర్పు గోదావరి జిల్లాలోని బిక్కవోలులో తూర్పు చాళుక్యులు ఆరు దేవాలయాలు నిర్మించారు. వీటిలో మూడు ఒక ప్రాకారంలో, మిగిలినవి ప్రాకారం వెలుపల ఉన్నాయి. వీటిని తూర్పు చాళుక్యరాజు గుణగ విజయాదిత్యుడు ( క్రీ.శ 848 - 891) నిర్మింపజేశాడు. ఈతని బిరుదైన 'బిరుదాంకన భీమ' నుండే బిక్కవోలుకు బిరుదాంకనవ్రోలు అను పేరువచ్చింది. దీని నుండే బిక్కవోలు అనే పేరువచ్చింది. ఇచట గల ఆరు దేవాలయాలలో కాన్సరగుడి, నక్కలగుడి, మరొకగుడి తొలిదశ దేవాలయాలు. మిగిలిన మూడు గోలింగేశ్వరాలయం, చంద్రశేఖరాలయం. రాజరాజేశ్వరాలయం మలిదశకు చెందినవి. తొలిదశలో నిర్మించబడిన దేవాలయాలన్నీ చతురుస్రాకారంగా వున్నాయి. ఈ ఆలయాలకు మూడు అంతస్థులున్నాయి.

గోలింగేశ్వరాలయానికి గర్భగృహం, అంతరాళం, రెండు మండపాలున్నాయి. ఆలయకుడ్యాల పైగల కోష్ఠాలలో సూర్య, అగ్ని, విష్ణు, శివ, బ్రహ్మ, చాముండి, భిక్షాటన మూర్తి, అర్ధనారీశ్వర ప్రతిమలున్నాయి. ఈ ఆలయానికి రెండు అంతస్థుల విమానం గలదు. చంద్రశేఖరాలయానికి చతురస్రాకార గర్భగృహం ఉంది. ఈ ఆలయంలో మిధాన శిల్పాలున్నాయి. రాజరాజేశ్వరాలయానికి గర్భగృహం, ప్రవాణం గలవు. కుడ్యభాగంలో దేవకోష్ఠాలు, కుడ్యస్తంభాలు గలవు. కోశాలలో కుమార, కుబేరుల ప్రతిమలున్నాయి. ఆలయ విమానం రెండు అంతస్థులు కలిగివుంది.

### 12.2.8.2 చేబ్రోలు :

గుంటూరు జిల్లాలోని చేబ్రోలులో భీమలింగేశ్వరాలయం గలదు. దీనిని మొదటి చాళుక్య భీముడు (క్రీ.శ. 892-922) నిర్మించాడు. ఇది రెండుంతస్తుల ఆలయం. ఇచట కింద, పైన గర్భగృహాలున్నాయి. కింద చతురస్రాకారగర్భగృహం, దానిచుట్టూ ప్రదక్షిణాపథం, ముఖమండపం, ప్రవాణం ఉన్నాయి. గర్భగృహంలో ఎత్తైన శివలింగమున్నది. పై అంతస్థులో కూడా శివలింగ ముంది. ఇది నేటికి పై అంతస్థులో పూజలందు కొంటుంది.

**12.2.8.3 పంచారామాలు :**

ఆంధ్రలోని ద్రాక్షారామం, కుమారా రామం (నేటి భీమవరం), క్షీరా రామం (నేటి పాలకొల్లు), సోమారామం (నేటి సోమవరం), ఆమరారామం (నేటి అమరావతి), అనే శైవక్షేత్రాలను పంచారామాలంటారు. వీటిని తూర్పుచాళుక్య రాజు మొదటి చాళుక్యభీముడు నిర్మించాడు. తూర్పు గోదావరి జిల్లాలోని ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం గలదు. ఈ ఆలయం రెండంతస్తులుగా ఉంది. ప్రతి అంతస్తులో గర్భగృహం ఉన్నది. ఆలయంచుట్టూ రెండు ప్రాకారాలున్నాయి. కింది అంతస్తులో గర్భగృహం, దానిచుట్టూ ప్రదక్షిణా పథం, ముఖమండపం, వరండా అను అంగాలు కలవు. గర్భగుడిలోని శివలింగం ఆయక స్తంభమని కొందరి భావం. పై అంతస్తులో గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, రెండు మండపాలున్నాయి. ఇచటి గర్భగృహం నాల్గువైపులా ద్వారాలున్నాయి. ఇందలి శివలింగం కూడా ఆయక స్తంభాన్ని గుర్తుచేస్తుంది. ఆలయానికి పడమరవైపు ఏడు అంతస్తుల గోపుర మున్నది. ఆలయ ప్రాంగణంలో ఏకశిలా దేవగృహం ఉంది. పై అంతస్తులో పూజ జరుగుచున్నది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భీమేశ్వరాలయం ఉన్నది. ఇది కూడా రెండంతస్థులుగా రెండు గర్భగృహాలు కలిగి వున్నది. దీనిని చాళుక్య భీముడు నిర్మించాడు. పాలకొల్లులో రామలింగేశ్వరాలయముంది. ఇచట ఒకే ప్రాంగణంలో ఐదుదేవగృహాలున్నాయి. వీటి మధ్యగల ఆలయాన్ని అమరలింగేశ్వరాలయం అంటారు. సోమవరంలో గల సోమేశ్వరాలయం రెండంతస్తుల ఆలయం. అమరావతిలోని అమరేశ్వరాలయంలో అనేక శాసనాలున్నాయి. వీటిలో రాజులు ఆలయానికిచ్చిన దానాల ప్రసక్తి గలదు. ఈ ఆలయం కూడా రెండస్తుల ఆలయం. ఈ ఆలయానికి మూడు ప్రాకారాలున్నాయి. గర్భగృహంలో 15 అడుగుల ఎత్తుగల తెల్లచలువరాయి లింగమున్నది. ఇది కూడా ఆయకస్తంభమై ఉండవచ్చు. ఆలయంలో కోట రాజులు, రెడ్డిరాజులు, విజయనగరరాజుల శాసనాలున్నాయి. ఇవి క్రీ.శ. 12. క్రీ.శ. 17 శతాబ్దాల మధ్య కాలంనాటివి.

## 12.2.9 కళ్యాణి లేక మలి చాళుక్య దేవాలయాలు :

మలి పశ్చిమ చాళుక్యలు కళ్యాణి రాజధానిగా క్రీ.శ. 973 మొదలు 1200 వరకు రాజ్యమేలినారు. వీరు నిర్మించిన ఆలయాలు కర్ణాటక ప్రాంతంలో గలవు. మలిచాళుక్యుల తొలి నిర్మాణాలు ధార్వార్ జిల్లాలోని నవలింగ దేవాలయాల సమూహం. ఇది క్రీ.శ. 10వ శతాబ్దం నాటివి. ఈ నవలింగ దేవాలయ ప్రత్యేకత మూడు మండపాల చుట్టూ 9 దేవగృహాలు నిర్మంచబడి ఉండటం. వీటికుడ్యాలపై విమాన స్తంభాలు గలవు. ఈ కొత్త లక్షణాన్ని తరవాతి రాజులు కొనసాగించారు. ఆలయ విమాన భాగంలో సుఖనాస విభాగమున్నది. ఆలయ నిర్మాణానికి ఆకుపచ్చనలుపు 'క్లోరైట్ సిస్ట్' ఉపయోగించారు. ఆలయ స్తంభాలు, ద్వారాలు, పైకప్పులు మెరుస్తున్నట్లు రూపొందించబడ్డాయి. అలయదేవగృహాలకు రెండు లేక మూడు అంతస్తుల విమానాలున్నాయి. కుక్కనూర్‌లోని కొల్లేశ్వరాలయం కొంతవరకు పట్టడకల్‌లోని విరూపాక్షాలయాన్ని పోలిఉంది. ఆలయ ప్రధాన అంగాలు గర్భగృహం, అంతరాళం, మండపం, నందిమండపం. ఆలయకుడ్యాలపై దేవకోష్ఠాలు, కూడ్యస్తంభాలు, విమాన స్తంభాలు గలవు. కుడ్యంపైన మూడుఅంతస్తుల విమానం ఉంది. లక్కుండి ప్రాంతంలోని జైన ఆలయం క్రీ.శ. 11వ శతాబ్దినాటిది. ఈ ఆలయం మెత్తటి 'క్లోరైట్ సిస్ట్'లో నిర్మించబడింది. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, నవరంగ మండపం, మండపం అను అంగాలు గలవు. ఈ ఆలయానికి నాల్గు అంతస్తుల విమానముంది. క్రీ.శ. 11వ శతాబ్దికి చెందిన ఆలయాలలో చౌదరంపూర్ లోని ముక్తేశ్వరాలయం, హవేరిలోని సిద్ధేశ్వరాలయం, హరల్ హల్‌లోని సోమేశ్వరాలయం, దొడ్డగడ్డవళ్ళిలోని లక్ష్మీదేవి ఆలయం పేర్కొనదగినవి. మలిచాళుక్యులు క్రీ.శ. 12వ శతాబ్దంలో నిర్మించిన ఆలయాలు పరిణతిదశకు చెందిన ఆలయాలు. వీటిలో లక్కుండిలోని కాశీవిశ్వేశ్వరాలయం శిల్పాల పరంగా పేరు గాంచింది. ఇత్తగిలోని మహాదేవ ఆలయం ఈ కాలం నాటిదే. దీనికి గర్భగృహం, అంతరాళం, నవరంగము, మండపం అను అంగాలున్నాయి. గర్భగృహంపై ఐదు అంతస్తుల విమానం ఉంది. బళ్ళారి జిల్లా కురవట్టిలో మల్లికార్జునాలయం వుంది. దీనికి గర్భగృహం, అంతరాళం, నంది మండపం గలవు. నంది మండపం విజయనగర కాలం నాటిది. ధార్వార్ జిల్లాలోని దొడ్డ బసప్ప దేవాలయం నక్షత్ర ఆకారంలో నిర్మించబడింది. ఈ ఆలయంలో గర్భగృహం, మండపం గలవు. ఈ రెండు నక్షత్రాకారంలో ఉన్నాయి.

## 12.2.10 సారాంశము :

తొలి చాళుక్యులు నిర్మాణశైలి, బాదామి, ఐహోల్, పట్టడకల్, అలంపూర్‌లలో దేవాలయాలు వేంగి చాళుక్యులు లేదా తూర్పు చాళుక్యులు, బిక్కవోలు, చేబ్రోలు. పంచారామాలలో నిర్మించిన దేవాలయములు తరువాత కళ్యాణి లేక మలిచాళుక్యులు నిర్మించిన దేవాలయాల వాస్తుశిల్పకళ వివరించబడినది.

## 12.2.11 నమూనా ప్రశ్నలు :

1) తొలిచాళుక్య నిర్మాణశైలిని వివరింపుము.

2) వేంగి చాళుక్యుల దేవాలయాల గురించి వివరింపుము.

3) కళ్యాణిచాళ్యుకుల దేవాలయాల గురించి వివరింపుము.

4) ఆలంపురం

5) పంచారామాలు.

**డా - వి. కె.మోహన్**

పాఠం-13

# పల్లవ నిర్మాణ శైలి, చోళుల దేవాలయాలు

## 13.0 లక్ష్యం :

పల్లవ నిర్మాణ శైలి గురించి, చోళుల దేవాలయాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


**13.1 పల్లవ నిర్మాణ శైలి**

**13.1.1 పరిచయం**

**13.1.2 మహాబలిపురం**

**13.1.2.1 గుహాలయాలు (మండపాలు)**

**13.1.2.2 రాతి రథాలు**

**13.1.2.3 తీర దేవాలయం**

**13.1.2.4 అర్జున తపోదృశ్యశిల్పం**

**13.1.3 కంచి**

**13.1.3.1 కైలాసనాథాలయం**

**13.1.3.2 వైకుంఠ పెరుమాల్ ఆలయం**

**13.1.4 ఇతర దేవాలయాలు**

**13.1.5 పల్లవ శిల్పకళ**

**13.1.6 పల్లవ వర్ణ చిత్రాలు**

**13.1.7 సమీక్ష**

**13.2 చోళుల దేవాలయాలు**

**13.2.1 పరిచయం**

**13.2.2 తొలిదశ దేవాలయాలు**

**13.2.3 మధ్య దశ దేవాలయాలు**

**13.2.4 మలి దశ దేవాలయాలు**

**13.2.5 శిల్పకళ, చిత్రలేఖనము**

**13.2.6 సమీక్ష**

**13.3 సారాంశము**

**13.4 నమూనా ప్రశ్నలు**

## 13.1 పల్లవ నిర్మాణ శైలి :

### 13.1.1 పరిచయం :

పల్లవులు కంచి రాజధానిగా క్రీ.శ. 6వ శతాబ్దం మొదలు 9వ శతాబ్దం వరకు ద్రావిడ దేశంలో రాజ్యమేలినారు. పల్లవ రాజులలో 'విచిత్ర చిత్త' బిరుదాంకితుడైన మొదటి మహేంద్రవర్మ, 'మామల్ల' బిరుదాంకితుడైన మొదటి నరసింహ వర్మ, రాజసింహ బిరుదుగల రెండో నరసింహ వర్మ, నందివర్మ పేర్కొనదగినవారు. పల్లవులు ఒకవైపు నిరంతర యుద్ధాలు కొనసాగించినా, మరోవైపు ద్రావిడ శిల్ప కళారీతులకు శ్రీకారం చుట్టి, దాక్షిణాత్య ఆలయరీతులకు సరిఅయిన పునాది వేశారు. దక్షిణ భారతదేశంలో వాస్తవంగా వాస్తుశిల్ప చరిత్ర పల్లవుల కాలంలో ప్రారంభమైందని స్మిత్ పండితుడంటాడు.

పల్లవుల కాలంనాటి నిర్మాణాలను రెండు దశలుగా విభజించవచ్చు. అవి (1) రాతిలో తొలచినవి (2) రాతితో నిర్మించినవి. రాతిలో తొలచినవాటిని నిర్మాణరీత్యా మూడు భాగాలు చేయవచ్చు. అవి మండపాలు, ఏకశిలా రథాలు, పెద్దశిల పై మలచబడిన శిల్పసమూహం. క్రీ.శ. 600-630 మధ్య కాలంలో రూపొందించబడిన మండపాలను 'మహేంద్రరీతి' అని, క్రీ.శ. 630-690 మధ్య కాలంలో నిర్మించబడిన మండపాలు, ఏకాశిలా రథాలను 'మామల్ల రీతి' అని తొలిదశ నిర్మాణాలను విభజించవచ్చు. ధర్మరాజ మండపం, కోటికల్ మండపం, వరాహ మండపం 'మహేంద్ర రీతి'కి చెందినవి కాగా, త్రిమూర్తి మండపం, మహిషమర్దని మండపం, వరాహ మండపం, త్రివిక్రమ మండపం, పంచ పాండవరథాలు, గంగావతరణం, రామానుజ మండపం, గణేశరథం 'మామల్ల రీతి' కి చెందినవి.

క్రీ.శ. 700-800 మధ్యకాలంలో నిర్మించిన ఆలయాలను 'రాజసింహ' రీతిగాను, క్రీ.శ. 800-900 మధ్యకాలం లో నిర్మించిన ఆలయాలను 'నందివర్మ' రీతిగాను రెండో దశ ఆలయాలను విభజించవచ్చు. తీరదేవాలయం, కైలాసనాథాలయం రాజసింహ రీతికి, వైకుంఠ పెరుమాళ ఆలయం, పరశురామేశ్వరాలయం నందివర్మరీతికి తార్కాణాలు. రెండో దశ ఆలయాల నిర్మాణానికి చాలావరకు మొదటి దశలోని రాతి రథాలు మార్గదర్శకమైనాయి. తొలిదశలో పల్లవులు నిర్మాణానికి 'కాకిరాయి'ని, మలిదశలో 'ఇసుకరాయి'ని ఉపయోగించారు.

### 13.1.2 మహాబలిపురం :

వాస్తు, శిల్పకళలో పల్లవుల తొలిప్రయోగాలకు ముఖ్యకేంద్రం మహాబలిపురం. ఇది చెన్నై నగరానికి 60 కి.మీ. దూరంలో బంగాళాఖాతం తీరంలో కలదు, దీని నిర్మాత పల్లవరాజు మొదటి నరసింహవర్మ (మామల్ల లేక మహామల్ల). ఇచట నిర్మాణాలను మండపాలు, రాతి రథాలు, దేవాలయాలు, పెద్దశిలపై మలచబడ్డ శిల్పసముదాయం అని నాల్గు తరగతులుగా విభజించవచ్చు.

#### 13.1.2.1 గుహాలయాలు (మండపాలు) :

ఒక పెద్ద కొండను తొలచి నిర్మించిన గుహాలయాలే మండపాలు. మహాబలిపురంలో మొత్తం 15 మండపాలున్నాయి. ఇవి పల్లవుల తొలిశైలికి నిదర్శనాలు. స్తంభాలతో కూడిన వరండా, దానిలోనుంచి లోపలికి తొలిచిన గది లేక గదులు మండప ప్రధాన అంగాలు. మండపాల ముందు భాగంలో సింహాలు మోస్తున్నట్లున్న రెండు స్తంభాలుంటాయి. మండపంలో పౌరానిక గాథలను శిల్పాల రూపంలో అద్భుతంగా మలచడం జరిగింది. ఇచటి మండపాలలో వరాహ, మహిషాసుర మర్దని, త్రివిక్రమ, విష్ణుమండపాలు ప్రసిద్ధి గాంచినవి. వీటిలో వరాహ, దుర్గ మండపాలు మొదటి మహేంద్రవర్మ కాలం నాటివి. ఇటుక, కలప,లోహం లేని దేవగృహం త్రిమూర్తులకు నిర్మించినట్లు మహేంద్రవర్మ చెప్పుకున్నాడు. ఇది మందగపట్టులో గలదు. ఇదే ద్రావిడ దేశంలో తొలి గుహాలయం. తొలిచాళుక్యాలు ఇసుక రాయితో గుహలయాలు లోలిపించగా (మంగళేశుడు), పల్లవులు (మహేంద్రవర్మ) కఠిన శిలలో గుహాలయాలు తొలిపించాడు.

**13.1.2.2 రాతిరథాలు :**

మహాబలిపురంలోని కొండకు సమీపంలో ఒక రాయిలో మలచి వేరు చేయబడిన రథాలు ఐదు ఉన్నాయి. వీటిని పంచపాండవ రథాలు అని అంటారు. వీటికి పంచపాండవులకు ఎటువంటి సంబంధంలేదు. వీటిలో చాలాభాగం పల్లవరాజు మొదటి నరసింహవర్మ తొలపించాడు. ఇవి దేవాలయాల నమూనాలు, ఏకశిలలో మలచిన ఈ రథాలు పరిపూర్ణమైన ఆలయలక్షణాలు సంతరించుకొన్నవి. ఐదు రథాలలో నాల్గు ఒకదాని వెంట ఒకటి వరుసగా ఉండగా మరొకటి వాటికి సమీపంలో వుంది. ధర్మరాజ రథం ద్రావిడ రీతికి తొలి నిదర్శనం. ఇది మూడు అంతస్తులుగా చెక్కబడింది. ఈ రథ కుడ్యాలపై బ్రహ్మ, హరిహర, శివ, కార్తికేయ, అర్ధనారీశ్వర శిల్పాలున్నాయి. భీమరథం శిఖరం బండిగూడు ఆకారంలో వుంది. ఇది తరవాతి గాలి గోపురాలకు మార్గ దర్శకమయింది. అర్జున రథం ధర్మరాజరథం వలెవున్నది. కాని దీనికి రెండంతస్తుల విమానం ఉంది. ఈ రెండు రథాలు ద్రావిడ రీతికి చక్కటి తొలినిదర్శనాలు. అర్జునరథంలో వృషభవాహన, ఇంద్ర, రాజదంపతులు మొదలగు శిల్పాలు గలవు, ద్రౌపది రథం చతురస్రాకారమైన గుడిసెలా మలచబడింది. ఈ రథంలో దుర్గాదేవి శిల్పముంది. నకుల సహదేవ రథం గజపృష్ఠాకారంలో మలచబడింది. ఈ రథాలు ఆతరువాత నిర్మించబడిన ప్రసిద్ధ దేవాలయాలకు నమూనాలైనాయని పెర్సీబ్రౌన్ పండితుడంటాడు.

**13.1.2.3 తీర దేవాలయం :**

మహాబలిపురంలోని తీర దేవాలయం పల్లవులు నిర్మించిన తొలి ఆలయం. ఇది సముద్రానికి ఆనుకుని ఉండుట వలన దీనికి ఆ పేరు వచ్చింది. దీనిని పల్లవ రాజైన రెండో నరసింహవర్మ (రాజసింహ) క్రీ.శ 8వ శతాబ్దంలో నిర్మించాడు. కఠిన శిలను ఉపయోగించి తొలిసారిగా ద్రావిడ దేశంలో ఈ ఆలయం నిర్మించడం జరిగింది. ఈ ఆలయంలో మూడు గర్భగృహాలున్నాయి. తూర్పుదిశలో గల శివాలయాన్ని ' క్షత్రియ సింహ పల్లవేశ్వర ' గృహమని, పశ్చిమ దిక్కున వున్న శివాలయాన్ని ' రాజసింహ పల్లవేశ్వర ' గృహమని, రెంటికి మధ్యగలది విష్ణు అనంతశాయి గృహమని అంటారు. ఈ దేవాలయ సముదాయానికి తూర్పున ఒక గోపురద్వారం, పడమర రెండు ఆవరణాలు ఉన్నాయి. ఈ ఆవరణాలలో శిధిల నిర్మాణాలున్నాయి. తూర్పున గల గోపురం గజపృష్ఠాకారంలో ఉన్నది. తూర్పు దిశలోని శివాలయానికి గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణాపథం ఉన్నాయి. గర్భగృహం పై ద్రావిడ విమానం ఉంది. విమానం నాల్గు అంతస్తులుగా వుంది. మొదట అంతస్తు నాల్గు మూలలలో కూర్చొని ఉన్న సింహాల బొమ్మలున్నాయి. నాల్గవ అంతస్తు మూలలలో భూత గణాల బొమ్మలుగలవు. ఈ ఆలయ అంతరాళ కుడ్య భాగంపై శిల్పాలున్నాయి. గర్భగృహంలో 16 ముఖాలు గల శివలింగ మున్నది. శివలింగం వెనుక కుడ్య భాగం పై సోమస్కంద శిల్పమున్నది. పశ్చిమదిశలోని శివాలయాలకి 36 అంతస్తులున్నాయి. దీనికి గర్భగృహం, అంతరాళం ఉన్నాయి. గర్భగృహంలో నేడు శివలింగం లేదు. దీని వెనుక కుడ్య భాగంలో సోమస్కంద శిల్పముంది. గర్భగృహం పై ద్రావిడ విమానం ఉంది. అనంతశాయి విష్ణుదేవగృహం తూర్పు ముఖంగా వుంది. ఈ ఆలయానికి దీర్ఘచతురస్రాకార గర్భగృహం , అంతరాళం ఉన్నాయి. గర్భగృహం శయన భంగిమలో విషువు విగ్రహం ఉంది. అంతరాళ దక్షిణ కుడ్యంలో గజేంద్ర మోక్షం, ఉత్తర కుడ్యంలో కాళీయ కృష్ణ శిల్పాలున్నాయి. ఆలయం చుట్టూ రెండు ప్రాకారాలు, వాటి పై వరుసగా నంది ప్రతిమలున్నాయి.

**13.1.2.4 అర్జున తపోదృశ్యశిల్పం :**

మహాబలిపురంలో పర్యాటకులను విశేషంగా ఆకర్షించేది. ఒక పెద్ద బండరాయి పై మలచబడ్డ శిల్ప సముదాయం. దీనినే 'అర్జున తపోదృశ్యశిల్పం' అని పిలుస్తారు. ఇది భారతదేశ శిల్పకళలోనే ఒక మచ్చుతునక. ఇది శిలలో సంతరించిన కుడ్య చిత్రం అని గ్రూసెట్ పండితుడంటాడు. 100 అడుగుల వెడల్పు, 50 అడుగుల ఎత్తు కలిగిన ఈ శిల పై దాదాపు 150 అందమైన శిల్పాలున్నాయి. ఇచటి శిల్ప సముదాయంలో పలు పరిమాణాల్లో దేవతలు, గంధర్వులు, నాగరాజులు, నాగ సర్పాలు, ఏనుగులు, సింహాలు, పెద్ద పులులు, కోతులు మొదలైనవి ఉన్నాయి. ప్రతి శిల్పం అద్భుతంగా మలచబడింది. ప్రతిశిల్పం దర్పాన్ని, అందాన్ని కలిగి ఉన్నాయి. అన్నీ సహజత్వాన్ని కలిగి ఉన్నాయి. వృద్ధుడైన రుషి దేవగృహం ముందు ప్రణామం చేస్తున్నట్లున్న శిల్పంలో, ఒక్కకాలిపై నిమగ్నంగా తపస్సు చేస్తున్నట్లున్న శిల్పంలో, ఆకాశంలో ఎగురుతున్న జంటలు, దేవతలు, మానవులు మొదలైనవన్ని సహజత్వంగా రూపొందించ బడ్డాయి. జంతు శిల్పాలు

అత్యంత అద్భుతాలు. అర్జునుడు తపస్సు చేస్తున్న దృశ్యం. శివుడు ప్రత్యక్షమైన దృశ్యం రమ్యంగా మలచబడింది. ఈ మొత్తం శిలమధ్య భాగంలో నిలువుగా ఏర్పడిన ఒక చీలికను గంగానది ప్రవహిస్తున్నట్లుగా శిల్పి అతి చాకచక్యంతో రూపకల్పన చేశాడు. గంగానదిలో నాగరాజులు సతీసమేతంగా విహరిస్తున్నట్లు చూపబడింది.

**13.1.3. కంచి :**

చెన్నై నగరానికి 70 కి.మీ. దూరంలో కంచి వుంది. ఇది పల్లవుల రాజధాని. ఇచట పల్లవులు దేవాలయ నిర్మాణంలో అనేక ప్రయోగాలు చేసి, విజయంసాధించి, ద్రావిడ రీతికి చక్కటి రూపం ఇచ్చారు. ఇచటి ఆలయాల్లో కైలాసనాథాలయం, వైకుంఠ పెరుమాళ్ ఆలయం ప్రముఖమైనవి.

**13.1.3.1 కైలాసనాథాలయం :**

దేవాలయానికి ఉండవలసిన అన్ని హంగులతో రూపొందిన తొలి దేవాలయం కంచిలోని కైలాసనాథాలయం. ఈ ఆలయంలో తొలిసారిగా ద్రావిడ వాస్తువు పరిణతరూపంలో కన్పిస్తుంది. దీనిని రెండో నరసింహవర్మ నిర్మించాడు. ఈ ఆలయానికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, మండపం అను భాగాలున్నాయి. ఆలయ విమానం ద్రావిడరీతిలో నాల్గు అంతస్తులు కలిగి వుంది. ప్రతి అంతస్తులో కూట, పంజర, శాలహారాలున్నాయి. అంతరాళంలో విజయ నగర కాలపు 6 స్తంభాలు, మండపంలో పల్లవరీతి స్తంభాలు 12 ఉన్నాయి. వీటిలో ఒక దాని పై చాళుక్యరాజు రెండో విక్రమాదిత్యుని శాసనం ఉంది. గర్భగృహం వెలుపలి కుడ్యభాగాల్లో దేవ కోష్ఠాలున్నాయి. ఆలయ ప్రాంగణంలో మహేంద్ర వర్మేశ్వరదేవగృహం ఉంది. దీనికి గర్భగృహం, అంతరాళం ఉన్నాయి. ఆలయ ప్రాకారం లోపలి ముఖభాగంలో పరివార దేవతాగృహాలు, చిత్రలేఖనాలు ఉన్నాయి. ఆలయ ప్రవేశ గోపుర ద్వారం గజపృష్ఠాకారంలో ఉంది. ఈ గోపురానికి ఎడమవైపు ఆరు, కుడి వైపు రెండు ప్రాకార దేవగృహాలున్నాయి.

**13.1.3.2 వైకుంఠ పెరుమాళ్ దేవాలయం :**

కంచిలోని మరో ప్రసిద్ధ ఆలయం వైకుంఠ పెరుమాళ్ దేవాలయం. దీని నిర్మాత పల్లవరాజైన నందివర్మ (731-96). ఈ ఆలయంలో కొంత భాగం కఠినశిలలోను, మరి కొంత భాగం ఇసుక రాయిలోను నిర్మంచబడింది. ఈ ఆలయం విష్ణువుకు అంకితమైంది. ఈ ఆలయంలో గర్భగృహాలు మూడు ఒక దాని పై మరొకటి కలవు. క్రింది గర్భగృహంలో అశీన విష్ణు విగ్రహం, మధ్య గర్భగృహంలో శయన విష్ణు విగ్రహం, దాని పైన గల గర్భగృహంలో స్థానక విష్ణువు విగ్రహం ఉంది. ఈ ఆలయ శిఖరం ద్రావిడ రీతిలో నిర్మితమైంది ప్రతి అంతస్తులో కూట, పంజర, శాల హారాల వరుస గలదు. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం అను భాగాలున్నాయి. గర్భగృహం చుట్టూ ప్రదక్షిణా పథం ఉంది. ఆలయం ముందు ఒక స్తంభ మండపం, గరుడమండపం ఉన్నాయి. ఆలయం చుట్టూగల ఎత్తైన ప్రాకారంలోపలి గోడల మీద పల్లవ చరిత్రలోని ముఖ్య ఘట్టాలను శిల్పాలుగా చెక్కారు.

**13.1.4 ఇతర దేవాలయాలు :**

కంచిలోని ముక్తేశ్వర, మాతంగేశ్వర, ఐరావతేశ్వర, త్రిపురాంతకేశ్వర దేవాలయాలు చివరిదశకు చెందిన పల్లవ ఆలయాలు. ఇవన్నీ పరిమాణంలో చిన్నవిగా వున్నాయి. వీటికి గర్భగృహం, ప్రవాణం ఉన్నాయి. కుడ్యభాగంలో కుడ్యస్తంభాలు, దేవతా శిల్పాలు గల కోష్ఠాలున్నాయి. కోష్ఠాల పై మకర తోరణాలున్నాయి. వీటి ఒకటి లేక రెండు అంతస్తులున్నాయి. ప్రతితలంలో కూట, పంజర, శాల హారాల వరుసలున్నాయి.

తిరుపతికి సమీపంలోని గుడిమల్లంలో పరశురామేశ్వరాలయం ఉంది. దీనిని నందివర్మ నిర్మింపజేశాడు. దీనికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, ప్రవాణం అను అంగాలున్నాయి. ఆలయం చుట్టూ ప్రాకారం, పశ్చిమ కుడ్యభాగంలో గోపుర ద్వారమున్నది. గర్భగృహం అంతరాళం పల్లవులకాలంలో, నిర్మించబడింది. ఆలయ కుడ్యాల పై దేవ కోష్ఠాలు, కుడ్యస్తంభాలు గలవు. కోష్ఠాల పై మకరతోరణం ఉన్నది. కోష్ఠాలలో బ్రహ్మ, విష్ణు, దుర్గ, గణపతి, దక్షిణామూర్తి ప్రతిమలున్నాయి. ముఖమండపం, స్తంభాలతో కూడిన

ప్రదక్షిణాపథం చోళుల కాలంలో నిర్మించబడాయి. ప్రవాణం విజయనగర కాలం నాటిది. ఆలయ గర్భగృహంలో క్రీ.శ మొదటి శతాబ్దికి చెందిన శివలింగం ఉంది. గర్భగృహం పై గజపృష్ఠాకారంలో విమానమున్నది. ఆలయ ప్రాంగణంలో సూర్య, కుమార, నంది దేవగృహాలున్నాయి. ఇవి చోళుల కాలానికి చెందినవి.

తిరుత్తణిలోని విరట్టానేశ్వరాలయాన్ని పల్లవరాజైన అపరాజిత వర్మ నిర్మించాడు. దీనికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. ఈ ఆలయ దేవ కోష్ఠాలలో బ్రహ్మ, విష్ణు, దుర్గ, గణపతి, దక్షిణామూర్తి ప్రతిమలున్నాయి. ఉత్తర మేరూర్‌లో వైకుంఠ పెరుమాళ్, సుందరవరద పెరుమాళ్ ఆలయాలు ఇటుకల నిర్మాణాలు.

### 13.1.5 పల్లవ శిల్పకళ :

పల్లవుల శిల్పకళపై ప్రథమంలో వేంగి శిల్పకళాప్రభావం, ఆతరవాత తొలిచాళుక్యుల శిల్పకళాప్రభావం కనబడుతుంది. మహేంద్రవర్మ ద్రావిడ దేశంలో తొలిసారిగా గుహాలయ నిర్మాణ పద్ధతిని ప్రవేశ పెట్టాడు. ఇతనిపై విష్ణు కుండినుల గుహాలయాల వాస్తు శిల్ప ప్రభావం ప్రసరించింది. అందువల్ల తమిళకంలో అటువంటి గుహాలయాలను మహాబలిపురం, మామండూర్, మండగపట్టు, దళవానూర్, వల్లం మొదలగు చోట్ల తొలిపించాడు. ఇతుడు తొలిపించిన గుహాలయాల్లో ద్వారపాలకుల రూపాలు ఆకర్షణీయంగా మలచబడ్డాయి. విష్ణువు కిరీటం ఎత్తుగా పీపాలాగ ఉన్నది. తిరుచునాపల్లిలోని గంగాధర శిల్పం అద్భుతమైంది. తిరుక్కళ కున్రం గుహలో యువరాజు శిల్పం ఆకర్షణీయంగా వుంది. మహాబలపురంలోని గంగావతరణం లేక అర్జునుని తపస్సు దృశ్యశిల్పం భారతీయ శిల్పచరిత్రలో మహోన్నతమైనది. మహాబలిపురం లోని మరో అద్భుత శిల్ప ఖండం గోవర్ధన శిల్పం. ఇందులో కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తుతున్నట్లు చూపబడింది. కృష్ణునితో బాటు గోపాలురు, గోపికలున్నారు. వరాహగుహలో గజలక్ష్మీ, మహిషమర్ధని గుహలో శేషసాయి విష్ణువు, మహిష మర్ధని శిల్పాలున్నాయి. వరాహ గుహలో పల్లవరాజైన సింహవిష్ణువు, మొదటి మహేంద్రవర్మ, వారి రాణుల శిల్పాలున్నాయి. ధర్మరాజు రథంపై మొదటి నరసింహవర్మ శిల్పముంది. పల్లవ రథాలపై గల కుడ్య స్తంభాల మధ్యభాగంలో అనేక శిల్పాలున్నాయి.

పల్లవుల కాలం నాటి సంస్కృతిని తెలిపే శిల్పాలనేకం వైకుంఠ పెరుమాళ్ ఆలయంలో చెక్కబడి ఉన్నాయి. నగర జీవనం, యుద్ధదృశ్యాలు, అశ్వమేధయాగాలు, పట్టాభిషేక మహోత్సవాలు, ఆలయ నిర్మాణం మొదలైన వివరాలు తెలుపే శిల్పాలెన్నో ఉన్నాయి. పల్లవ శిల్పాల్లో ప్రతిమాలక్షణ వివరాలెన్నో ఉన్నాయి. పల్లవ దేవాలయాల్లో సాధారణంగా సోమస్కంధ శిల్పరూపం కన్పిస్తుంది. పల్లవుల శిల్పాలలో సన్నటి శరీర రూపాలకు ప్రాధాన్యమివ్వబడింది. ఈ రీతి కొంత వరకు వేంగీ శిల్పరీతి ప్రభావమని చెప్పవచ్చు.

### 13.1.6 పల్లవ వర్ణ చిత్రాలు :

పల్లవుల కుడ్య చిత్రాలు పుదుక్కోట సమీపంలోని చిత్తన్నవాసల్ గుహలు, మహాబలిపురంలోని ఆది వరాహ గుహ, మామండూర్‌లోని గుహలు, కంచి కైలాస నాథాలయం, పానమలైలోని తలగిరీశ్వరాలయంలలో ఉన్నాయి. ఈ చిత్రాలు అజంతా చిత్ర లేఖనాలను గుర్తుకు తెస్తాయి. చిత్తిన్నవాసల్ వితానంలో కమలాలతో నిండి సరోవరంలో హంసలు, చేపలు, ఏనుగులు, అప్సరసలు విహరిస్తున్నట్లు చిత్రించబడింది. పానమలైలోని తలగిరీశ్వరాలయంలో శివుడు నాట్యం చేస్తున్న దృశ్యం, నృత్యాన్ని పార్వతి తిలకిస్తున్న దృశ్యం అద్భుతం.

### 13.1.7 సమీక్ష :

పల్లవులు వాస్తు, చిత్రకళలలో గొప్ప కృషిచేసి భారతదేశ శిల్పకళా చరిత్రలో చెరగని ముద్రవేసారు. వీరు మొదట గుహాలయాలు తొలపించారు. ఆ తరవాత దేవాలయాలు నిర్మించారు. వీరినిర్మాణాలలో రాతి రథాలు, కైలాస నాథాలయం, వైకుంఠ పెరుమాల్ ఆలయం ప్రఖ్యాతి గాంచినవి. దక్షిణ భారతదేశాన్ని పాలించిన రాజవంశాల వారందరిలోను వాస్తుకళపై పల్లవులలాగ తమ ప్రభావాన్ని చూపిన వంశం మరొకటిలేదు. దక్షిణ భారతదేశంలో ప్రత్యేకతను సంతరించుకొన్న ద్రావిడ శైలికి పల్లవులు మూలపురుషులయ్యారని పెర్సీ బ్రౌన్ అంటాడు.

## 13.2 చోళుల దేవాలయాలు :

### 13.2.1 పరిచయం :

చోళులు తంజావూరు రాజధానిగా క్రీ.శ. 9వ శతాబ్దం మొదలు 12 వ శతాబ్దం వరకు దక్షిణ భారతదేశంలో పరిపాలించారు. వీరు అనేక జైత్య యాత్రలు జరిపి రాజ్యాన్ని విస్తరింప చేయటంతో పాటు అనేక దేవాలయాలు నిర్మించారు. చోళ చక్రవర్తులలో రాజరాజు (క్రీ.శ 985-1012), రాజేంద్రచోళుడు (క్రీ.శ 1012-44) సుప్రసిద్ధులు. తంజావూరులోని బృహదీశ్వరాలయాన్ని రాజరాజు, నిర్మించగా, గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వరాలయాన్ని రాజేంద్ర చోళుడు నిర్మించాడు.

చోళ చక్రవర్తులలో ఎక్కువ మంది శైవులు. అందువల్ల ఈ కాలంలో అనేక శివాలయాలు నిర్మించబడ్డాయి. పల్లవులు రూపకల్పన చేసిన ద్రావిడ ఆలయ వాస్తు రీతిని చోళులు కోనసాగించడమే గాక అభివృద్ధిపరచారు. ద్రావిడ వాస్తు రీతి చోళుల కాలంలో అత్యున్నత స్థితికి చేరిందని ఎస్.ఆర్. బాలసుబ్రమణ్యం పండితుడంటాడు. పల్లవుల లాగా చోళులు కూడా సాధారణంగా తమ దేవాలయాల్లో గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, ముఖమండపం, ప్రవాణం అను అంగాలను నిర్మించారు. పెద్ద ప్రాకారాలు, పల్లవుల కాలపు గోపురాల కన్నా పెద్ద గోపురాలు చోళ దేవాలయాల ఒక ముఖ్యలక్షణం. దేవాలయ కుడ్యాలు కుడ్యస్తంభాలతో, దేవకోష్టాలతో, కుంభ పంజరాలతో అలంకృతమై ఉంటాయి. స్తంభాల శీర్షిక భాగంలో పుష్ప పోటిక నూతనంగా రూపొందించబడింది. ద్వారపాలకులు చతుర్భుజాలను, భయంకర రూపాలు కలిగి ఉన్నారు. ఈ కాలంలో ప్రత్యేక మండపాల నిర్మాణ విధానం ప్రారంభమైనది. అంతేగాక ఈకాలం చివర్లో ప్రత్యేక దేవీగృహాల నిర్మాణం కూడా మొదలైంది. విమానం ద్రావిడ రీతిలో ఉంది.

### 13.2.2 తొలిదశ దేవాలయాలు :

చోళులు నిర్మించిన దేవాలయాలను తొలిదశ, రెండోదశ, మూడోదశ ఆలయాలుగా విభజించవచ్చు. చోళులు మొదట్లో నిర్మించిన దేవాలయాలు లడ్డిగం, తోండమనాడు, నార్తమలై, శ్రీ రంగం, కుడుంబలూరు మొదలగు చోట్ల గలవు. చిత్తురు జిల్లాలోని లడ్డిగంలో ఇరుంగోలీశ్వర దేవాలయం గలదు. ఇందు గర్భగృహం, అంతరాళం, ముఖమండపం అను అంగాలు కలవు. చిత్తూరు జిల్లా చోండమనాడులో ఆదిత్యేశ్వర దేవాలయం ఉన్నది. ఇందులో గర్భగృహం, అంతరాళం, ప్రవాణం అను అంగాలున్నాయి. తమిళనాడులో పుదుక్కోటై జిల్లాలోని నార్తమలైలో విజయాలయ చోళేశ్వర దేవాలయం ఉంది. దీనిని చోళ రాజు మొదటి ఆదిత్యుడు నిర్మించాడు. ఈ ఆలయ గర్భగృహం వర్తులాకారంలో ఉంది. ఈ రూపం అధిష్ఠానం మొదలు శిఖరం వరకు ఉంది. విజయాలయ చోళేశ్వరాలయం లాగా శ్రీరంగంలోని రంగనాధ దేవాలయం నిర్మించబడి వుంది. దీనికి కూడా గుండ్రటి గర్భగృహం, దాని చుట్టూ ప్రదక్షిణాపథం ఉన్నాయి. ఆలయం చుట్టూ గల ప్రాంగణంలో ఏడు పరివార దేవగృహాలున్నాయి. మొదటి ఆదిత్యునిచే నిర్మించబడిన భిలైయూర్ దేవాలయం, పరాంతకునిచే నిర్మించబడిన మేలప్పలువూర్‌లోని శివాలయం, తిరుక్కత్తలూర్ నందలి శివాలయం పరివార దేవగృహాలతో కూడి ఉంది. మొదటి పరాంతకుడు శ్రీనివాస నల్లూర్‌లో నిర్మించిన కోరంగనాథాలయం విమానం మీద దేవతా విగ్రహాలు కలవు.

పుదుక్కోట జిల్లాలోని కుడంబలూర్ నందలి మూవర్ కోయిల్ త్రిమూర్తులకు నిర్మించబడిన తొలి పెద్ద ఆలయం. ఈ ఆలయంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు విడివిడిగా ఒకదాని పక్క మరొకటిగా మూడు దేవగృహాలు నిర్మించబడివున్నాయి. దీనిని రెండో పరాంతకుడు (956-73) నిర్మించాడు. ఈ మూడు దేవగృహాలకు గర్భగృహం, అంతరాళం అను విభాగాలున్నాయి. మూడు దేవగృహాలకు ముందు దీర్ఘచతురస్రాకారపు స్తంభాల మండపం ఉంది. ఈ మండపం ముందు నంది మండపం, బలిపీఠం ఉన్నాయి. ఆలయం చుట్టూ ప్రాకారం లోపలి ముఖభాగంలో పదిహేను ప్రాకార దేవతా గృహాలున్నాయి. వీటిలో సూర్యుడు, సప్తమాతృకలు మొదలైన వారి విగ్రహాలున్నాయి. ఆలయ ప్రవేశంలో గోపురం ద్వారం ఉంది.

### 13.2.3 మధ్య దశ దేవాలయాలు :

మొదటి రాజరాజుతో రెండోదశ దేవాలయాల నిర్మాణం ప్రారంభమవుతుంది. ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని మాలెపాడి లోని రెండు దేవాలయాలు, చిత్తూరు జిల్లాలోని లడ్డిగం నందలి శివాలయాలు, తిరునల్వేలి జిల్లాలోని తిరువలేశ్వరం నందలి శివాలయం, తిరుచ్చి జిల్లాలోని తిరువన్‌వాడి యందలి వైద్యనాథాలయం రెండో దశకు చెందిన ఆలయాలు. మాలెపాడిలోని అరంజ యేశ్వరాలయాన్ని రాజరాజు తన తాత గారి సమాధిపై నిర్మించాడు. మొదటి పరాంతకుడు తనతండ్రి సమాధిపై తోండమనాడులో ఆలయాన్ని నిర్మించారు. మధ్యదశకు చెందిన చోళ దేవాలయాలలో తంజావూరులోని బృహదీశ్వరాలయం, గంగైకొండ చోళపురమందలి బృహదీశ్వరాలయం ప్రముఖమైనవి.

తంజావూరులో మొదటి రాజరాజు నిర్మించిన బృహదీశ్వరాలయం చోళులు నిర్మించిన ఆలయాలన్నిటిలో పెద్దది. ఈ ఆలయాన్నే 'రాజరాజేశ్వర దేవాలయం' అని కూడా అంటారు. ఈ ఆలయ నిర్మాణం క్రీ.శ. 1003 లో ప్రారంభమై క్రీ.శ. 1010 లో పూర్తి అయింది. ఈ ఆలయం నల్లటి గ్రానైట్ రాయితో నిర్మించబడింది. ఈ ఆలయం వాస్తు శిల్పకళకే గాక చిత్రలేఖనాలకు కూడా ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయం దీర్ఘ చతురస్రాకార ప్రాంగణంలో నిర్మించబడి ఉంది. ఆలయ ప్రాకారం 500 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పు కలిగి వుంది. ప్రాకారం లోపల వరసగా గర్భగృహం, దాని చుట్టూ ప్రదక్షిణా పథం, అర్ధ మండపం, మహామండపం, నిర్మించబడి ఉంది. ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశించుటకు లోపలి ప్రాకారం యొక్క తూర్పువైపు గోపుర ద్వారముంది. గోపురానికి ఇరువైపులా ద్వారపాలకులున్నారు. గోపురంలో శైవమతసంబంధ ప్రతిమలున్నాయి. గర్భగృహంలో మహాలింగము కలదు. గర్భగృహం చుట్టూ గల ప్రదక్షిణా పథంలో అనేక శిల్పాలు, చిత్రలేఖనాలున్నాయి. ఇచటి చిత్రలేఖనాల్లో దక్షిణామూర్తి, నటరాజు, త్రిపురాంతకమూర్తి, పేర్కొనదగింది. గర్భగృహ కుడ్యం రెండు భాగాలుగా ఉంది. కింది భాగంలో అర్ధనారీశ్వర, గంగాధర, వీరభద్ర, గణేశ, విష్ణు, శ్రీదేవి, భూదేవి, హరిహర, చంద్రశేఖర మొదలైన దేవతా శిల్పాలున్నాయి. పై భాగంలో త్రిపురాంతకమూర్తి శిల్పాలున్నాయి. ఆలయ గర్భగృహంపై గల విమానం 216 అడుగుల ఎత్తు ఉన్నది. ఈ విమానం 16 అంతస్థులు కలిగి ప్రతి అంతస్థులో కూట, పంజర, శాల హారాల వరుస కలిగి ఉన్నాయి. విమానంపై గల ద్రావిడ శిఖరం 80 టన్నుల బరువు ఉంది. గర్భగృహం పై అంతస్తు ప్రదక్షిణాపథంలో 104 భిన్న శివ నట రాజ శిల్పాలున్నాయి. ఈ ఆలయంలోని నంది విగ్రహం చాలా పెద్దది. దీని పొడవు 19 1/2 అడగులు, వెడల్పు 8 1/2 అడుగులు, ఎత్తు 12 అడుగులు.

రాజరాజు కుమారుడైన రాజేంద్రచోళుడు గంగైకొండ చోళపురంలో బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. ఇది తంజావూరు ఆలయం కంటే చిన్నది, కాని దానికంటె ఎక్కువగా అలంకరించబడివుంది. ఈ ఆలయం పొడవు 340 అడుగులు, వెడల్పు 100 అడుగులు, మహామండపం పోడవు 175 అడుగులు, వెడల్పు 95 అడుగులు. గర్భగృహానికి మహామండపానికి మధ్య అంతరాళం ఉంది. మహామండపంలో 140 స్తంభాలు 8వరసల్లో వున్నాయి. విమాన శిఖరం ఎత్తు 120 అడుగులు. ఈ విమానం 8 అంతస్తుల్లో వుంది. ఆలయం చుట్టూ ప్రాకారం వుంది. తూర్పు వైపు గోపుర ద్వారం ఉంది. ప్రాకారం లోపల నందిమండపం, బలిపీఠం ఉన్నాయి.

తంజావూరులోని బృహదీశ్వరాలయం చోళుల శక్తి సంపదకు చిహ్నం కాగా, గంగై కొండ చోళపురం లోని బృహదీశ్వరాలయం వారి ఐశ్వర్యాతిశయానికి నిదర్శనాలు.

### 13.2.4 మలి దశ దేవాలయాలు :

రెండో రాజరాజు (క్రీ.శ. 1146-73) దారాసురంలో నిర్మించిన ఐరావతేశ్వర దేవాలయం, మూడో కులోత్తుంగచోళుడు (క్రీ.శ. 1178-1223) త్రిభువనంలో నిర్మించిన కంపహరేశ్వరాలయం మలిదశ దేవాలయాలలో ముఖ్యమైనవి. మలిదశ చోళ దేవాలయాలపై చాళుక్య, రాష్ట్రకూట వాస్తురీతుల ప్రభావం కనపడుతుంది. మలిదశ ఆలయాలకు గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, ముఖమండపం, మహామండపం, ప్రవాణం అను అంగాలు ఉన్నాయి. దారాసుర మందలి మహమండపం రథంలాగా నిర్మించబడిఉంది. దారాసురం,

త్రిభువనం దేవాలయాలకు రెండేసి ప్రాకారాలు ఒకదాని ముందు మరొకటిగా నిర్మించబడిఉన్నాయి. ఈ ప్రాకారాల లోపలి ముఖభాగాన్ని అనుకొని ప్రాకర దేవతాగృహాలున్నాయి. ఈ రెండు ఆలయాల్లో ప్రత్యేక దేవీగృహాలు నిర్మించబడివున్నాయి. దేవీగృహాలు నిర్మాణం మలిదశ చోళ ఆలయాల ప్రత్యేకత. రెండు ఆలయాల అధిష్టానాలపై వ్యాళ, గణ, భూతగణ మొదలైన శిల్పాలున్నాయి. కుడ్యభాగంలో కుడ్యస్తంభాలు, దేవకోష్టాలుగలవు. దేవకోష్టాలలో అర్ధనారీశ్వర, వీరభద్ర, దక్షిణామూర్తి, త్రిపురాంతక మూర్తి మొదలైన ప్రతిమలున్నాయి. దారాసురం ఆలయానికి నాల్గు అంతస్దుల విమానం, త్రిభువనం ఆలయానికి ఆరు అంతస్థుల విమానం ఉంది. ప్రతి అంతస్తులో కూట, పంజర, శాల హారాల వరస ఉంది. ఆలయాల స్తంభాలలో కొన్ని సింహపాదము కలిగివున్నాయి. కొన్ని స్తంభాలలో నూతనంగా ఉపస్తంభాలు రూపొందించడం జరిగింది. ఈ కాలంలోనే పుష్పపోటిక కార్బెల్‌ను స్తంభాల శీర్షభాగంలో ప్రవేశ పెట్టబడింది.

### 13.2.5 శిల్పకళ, చిత్రలేఖనము :

చోళులు కఠినశిలలో శిల్పాలను రూపొందించారు. ఈ శిల్పాలు లోతుగా, గుండ్రని ఆకారంలో చెక్కారు. చోళుల శిల్పాలు సజీవంగా, ఆకర్షనీయంగా కనిపిస్తాయి. పల్లవశిల్పాలలో దేవతామూర్తులు, రాజులు, రాణులు ఒక విధంగా కన్పించగా, చోళశిల్పాలలో మానవ మూర్తులు వాస్తవికంగా, దేవతామూర్తులు ఉదాత్తంగా,కన్పిస్తాయి . స్త్రీ ప్రతిమలలో సుకుమారత్వం కన్పిస్తుంది. చోళశిల్పాలల్లో వ్యక్తులు ఒక పక్కకు తిరిగి వయ్యారాన్ని ఒలక బోస్తున్నట్లు మలచబడ్డాయి. తంజావూరు బృహదేశ్వరాలయంలోని కోష్టాలలో విష్ణు అనుగ్రహమూర్తి, భిక్షాటనమూర్తి, వీరభద్ర, దక్షిణా మూర్తి, కళారిమూర్తి, హరిహర, అర్ధనారీశ్వర చండేశానుగ్రహమూర్తి, గంగాధర, చంద్రశేఖర, గణపతి, మహిషమర్ధని వంటి శిల్పాలున్నాయి. పై ప్రదక్షిణాపథంలో 104 శివనటరాజ శిల్పాలున్నాయి. గంగై కొండచోళపుర శివాలయ కుడ్యభాగాలలో నటరాజ. గంగాధర, లింగోద్భవ, విష్ణు, దేవి, శివ, ఉమ, అర్ధనారీశ్వర, హరిహర మొదలగు శిల్పాలున్నాయి. దారాసురం ఆలయ కోష్టాలలో అర్ధనారీశ్వర, అఘోరమూర్తి, శరభేశమూర్తి, జ్ఞాన సంబంధార్ శిల్పాలున్నాయి. అంతేగాక శైవ అచార్యుల జీవిత గాధలను తెలిపే శిల్పాలు ఉన్నాయి. లడ్డిగం ఆలయంలో బ్రహ్మ, ఇంద్ర, విష్ణు, శివ, గణపతి, బ్రహ్మ, దక్షిణామూర్తి, యోగనరసింహ శిల్పాలు ఉన్నాయి. నార్త మలైలో దుర్గ, సప్తమాతృకలు, గణేశ, చండేశ, చంద్ర మొదలగు శిల్పాలున్నాయి.

చోళుల కాలంలో కంచుతోను, పంచలోహాలతోను వివిధ భంగిమలలో దైవ ప్రతిమలను తయారు చేయడం జరిగింది. ఆనాటి లోహ విగ్రహాలలో నటరాజు విగ్రహాలు ప్రసిద్ధమైనవి. చోళుల ఇలవేల్పు నటరాజు. అందువల్ల ఈ కాలంలో అనేక నటరాజు విగ్రహాలు రూపొందించడం జరిగింది.

చోళరాజులలో రాజరాజు, రాజేంద్రచోళుడు చిత్రకళను ఎక్కువగా ఆదరించారు. ఈ ఆలయం గర్భగృహం చుట్టూగల ప్రదక్షిణా పథంలో శివలీల, ఘట్టాలు, శివ భక్తుల చిత్రాలు చిత్రీకరించబడ్డాయి.

### 13.2.6 సమీక్ష :

పల్లవులు రూపొందించిన ద్రావిడ రీతిని చోళులు కొనసాగించి అభివృద్ధి పరిచారు. ఈ కాలపు నిర్మాణాలలో తంజావూరు, గంగైకొండ చోళపురం, దారాసురం. త్రిభువనంలలో ఆలయాలు ప్రసిద్ధమైనవి. ఈ కాలంలో నటరాజు కాంస్య విగ్రహాలను అద్భుతంగా రూపొందించడం జరిగింది.

## 13.3 సారాంశము :

దక్షిణ భారతదేశ చరిత్రలో పల్లవుల వాస్తు నిర్మాణశైలికి ప్రత్యేకత ఉంది. మహాబలిపురంలోని గుహాలయాలు. రాతిరథాలు, తీరదేవాలయాల, కైలాస దేవాలయము పల్లవుల శిల్ప కళావర్ణచిత్రాలు అద్భుతంగా వివరించ బడినాయి. అలాగే పల్లవుల తరువాత చోళులు నిర్మించిన గుహాలయాలలోని శిల్పకళా చిత్రకళ ప్రసిద్ధి గావించినాయి.

## 13.4 నమూనా ప్రశ్నలు :

1) పల్లవ నిర్మాణ శైలిని గూర్చి వివరింపుము.

2) చోళ దేవాలయాలలోని వివిధ దశలను చర్చింపుము.

3) మహాబలిపురం

4) కంచి

5) తంజావూర్

డా . వి. కె. మోహన్

పాఠం-14

# కాకతీయ, హోయసాల, విజయనగరం ఆలయాల వాస్తుశిల్పం

## 14.0 లక్ష్యం :

కాకతీయ, హోయసాల, విజయనగర రాజుల దేవాలయాల లక్షణాల సోదాహరణంగా వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :


**14.1 కాకతీయ నిర్మాణశైలి**

**14.1.1 పరిచయం**

**14.1.2 నిర్మాణశైలి లక్షణాలు**

**14.1.3 ఓరుగల్లు**

**14.1.4 హనుమకోండ**

**14.1.5 పాలంపేట**

**14.1.6 పిల్లల మర్రి**

**14.1.7 సమీక్ష**

**14.2 హోయసాల నిర్మాణశైలి**

**14.2.1 పరిచయం**

**14.2.2 నిర్మాణశైలి లక్షణాలు**

**14.2.3 బేలూరు**

**14.2.4 హళెబీడు**

**14.2.5 సోమనాథపురం**

**14.2.6 సమీక్ష**

**14.3 విజయనగర నిర్మాణశైలి**

**14.3.1 పరిచయం**

**14.3.2 నిర్మాణశైలి లక్షణాలు**

**14.3.3 హంపి**

**14.3.4 లేపాక్షి**

**14.3.5 తాడిపత్రి**

**14.3.6 ఇతర ప్రాంత దేవాలయాలు**

**14.3.7 శిల్ప చిత్ర లేఖనాలు**

**14.3.8 సమీక్ష**

**14.4 సారాంశము**

**14.5 నమూనా ప్రశ్నలు**

## 14.1 కాకతీయ నిర్మాణశైలి:

### 14.1.1 పరిచయం :

కాకతీయులు మొదట హనుమకోండ, తరవాత ఓరుగల్లు రాజధానిగా క్రీ.శ.11వ శతాబ్ది నుంచి క్రీ.శ.14వ శతాబ్ది మొదటి శతాబ్దం వరకు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. వీరి కాలంలోనే తొలిసారిగా తెలుగు భాషా ప్రాంతాలు ఒకటయ్యాయి. మొదటి కాకతీయులు కళ్యాణి చాళుక్యుల సామంతులుగా హనుమకోండ ప్రాంతాన్ని పాలించారు. రెండో ప్రోలరాజు (క్రీ.శ.1110-58) స్వతంత్ర కాకతీయ రాజ్యాన్ని స్థాపించాడు. ఆ తరవాత గణపతిదేవుడు ఈ రాజ్యాన్ని సుస్థిరపరిచాడు. ఇతడు ఓరుగల్లు కోటను నిర్మించి రాజధానిని హనుమకోండ నుంచి ఓరుగల్లుకు మార్పించాడు. గణపతిదేవుని తరవాత అధికారంలోకి వచ్చిన రుద్రమదేవి కాలంలో కాకతీయ రాజ్యం ఉచ్చస్థితి ననుభవించింది. ఈమె ఓరుగల్లు కోటనిర్మాణాన్ని పూర్తిచేసింది. ఈ వంశంలో చివరి పాలకుడు ప్రతాపరుద్రుడు. కాకతీయులు అనేక దుర్గాలు నిర్మించారు. వాటిలో రాయచూర్, గోల్కొండ, రాచకొండ, దేవరకోండ దుర్గాలు ముఖ్యమైనవి. ఓరుగల్లు కోట చుట్టూ మూడు రక్షణ శ్రేణులుండేవి. కాకతీయులు శైవ మాతాభిమానులు. కాకతీయ రాజులు, సామంతులు అనేక సుందర దేవాలయాలను నిర్మించారు. వీటి పునాదులు లోతుగా లేకపోవడం వల్ల చాలా దేవాలయాలు శిధిలమయ్యాయి. కాకతీయులు నిర్మించిన దేవాలయాలలో ఓరుగల్లు కోటని స్వయంభూ ఆలయం, హనుమకోండలోని వేయి స్తంభాల గుడి, పద్మాక్షి ఆలయం, పానగల్లు, పిల్లలమర్రి, పాలంపేట, నాగులపాడు, మాచెర్ల, గురజాల , మోటుపల్లి, మందడం, చందోలుల లోని దేవాలయాలు పేర్కొనదగినవి.

### 14.1.2 నిర్మాణశైలి లక్షణాలు :

కాకతీయులు వీర శైవ మతస్థులు. అందువల్ల వీరు ఎక్కువగా శివాలయాలు నిర్మించారు. కాకతీయులు నిర్మించిన ఆలయాలల్లో కొన్ని ఆలయాల అంగాలు వరుసగా ఉండగా, మరికొన్ని మండపానికి మూడు వైపులా మూడు దేవగృహాలు కలిగి ఉన్నాయి. వీరి ఆలయాలలో అధిష్ఠానం కింద ఉపపీఠ అను విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కుడ్య భాగంలో కుడ్య స్తంభాలు, చిన్నతరహా దేవగృహాలు,ఒకటి లేక మూడు విమానాలు చిన్న పరిమాణంలో నిర్మించబడింది. ఆలయాల విమానాలలో ప్రతి అంతస్థులో కూట, పంజర, శాలహారాల వరుస ఉంది. దేవాలయాల విమానాల ముందు భాగంలో సుఖనాస నిర్మాణం ఉంది. జాలాలంకృతాలైన పిట్ట గోడలతో కూడిన మండపాలు, తోరణస్తంభాలు, భిన్న శిల్పాలతో కూడిన శిల్పాలు,ఎత్తైన అధిష్ఠానాలు, పెద్ద పరిమాణంలో రాతి దూలాల ఉపయోగం కాకతీయ దేవాలయాల ప్రత్యేకలక్షణాలు. ద్వారబంధాలు, స్తంభాలు నల్లని అతి కఠినమైన శిలతో రూపొందించిన శిల్పాలలో సున్నితమైన పనితనం కన్పిస్తుంది.

### 14.1.3 ఓరుగల్లు :

ఓరుగల్లులోని కోట నిర్మాణం క్రీ.శ.1199లో కాకతి గణపతి దేవుడు ప్రారంభించగా రుద్రమదేవి 1261 లో దానిని పూర్తి చేసింది. ఇది దుర్భేద్యమైన కోట. ఈ కోటలోని ఎన్నో దేవాలయాలు ముస్లిం దాడులలో ధ్వంసమైనాయి. కోట త్రవ్వకాలలో స్వయంభూ దేవాలయం, విష్ణు అలయం, సూర్యాలయం బయల్పడ్డాయి. స్వయంభూ ఆలయ శిధిలాలకు నాల్గు వైపులా గంభీరమైన శిలాతోరణాలు

గలవు. ఈ తోరణాలు సాంచీ స్తూప ద్వారతోరణాలను గుర్తుకుతెస్తున్నాయి. స్వయంభూ దేవుని విగ్రహం నేడు ఢిల్లీ ప్రదర్శనశాలలో వుంది.

**14.1.4 హనుమకొండ :**

హనుమకొండలోని వేయి స్తంభాల గుడి లేదా రుద్రేశ్వరాలయాన్ని కాకతి రుద్రుడు క్రీ.శ.1162 లో నిర్మించాడు. ఈ ఆలయం నక్షత్రాకారంలో ఉంది. ఈ ఆలయంలో మండపానికి మూడు వైపులా మూడు దేవగృహాలున్నాయి. అందువల్ల ఇది త్రికూట ఆలయం. మూడు దేవగృహాలకు గర్భగృహం, అంతరాళం అను అంగాలున్నాయి. మండప వితానంలో నవ విగ్రహాలు మలచబడి ఉన్నాయి. మండపానికి ముందు నంది గృహముంది. ఈ మొత్తం పీఠం పై భాగం ప్రదక్షిణా పథంలాగా ఉపయోగపడుతుంది. ఉపపీఠం పై ఆలయ అధిష్ఠానం, దాని పై కుడ్యం ఉన్నాయి. కుడ్యంలోని ఉబ్బెత్తు, లోతు విభాగాలలో కుడ్య స్తంభాలున్నాయి. లోతువిభాగాల స్తంభశీర్షిక విభాగంలో చిన్నతరహా విమాన నమూనా ఉంది. కుడ్యం మధ్యలో దేవగృహ నిర్మాణనమూనా ఉంది. దీని పై విమాన నమూనా ఉంది. మండపంలోని స్తంభాలపై, గర్భగృహ ద్వారబంధాల పై పూల తీగలు, వివిధ పుష్పాలు రమ్యంగా మలచబడ్డాయి. ఈ ఆలయాని కెదురుగా శిధిలమైన మండపం ఉంది.

**14.1.5 పాలంపేట :**

వరంగల్ జిల్లా పాలంపేటలోని దేవాలయాలలో రామప్పగుడి ముఖ్యమైంది. ఈ ఆలయం కాకతీయ నిర్మాణాలలో అద్భుతమైంది. దీనిని క్రీ.శ. 1234 లో కాకతిగణపతి దేవుని సామంతుడైన రేచర్ల రూద్రారెడ్డి నిర్మించాడు. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, నవరంగము అను అంగాలున్నాయి. దేవాలయం ముందు భాగంలో నంది మండపం ఉంది. ఈ ఆలయంలోని మూల విరాట్ రామ లింగేశ్వరుడే అయినా ప్రధానశిల్పి రామప్ప పేరుతో ఈ ఆలయం రామప్పగుడిగా ఖ్యాతిగాంచింది. నక్షత్రాకారంలో వున్న ఎత్తైన అధిష్ఠానం మీద ఈ ఆలయం నిర్మించ బడింది. ఆలయ విమానం నాల్గు అంతస్థులలో వుంది. ఉపపీఠం ప్రదక్షిణా పథంగా ఉపయోగడుతుంది, కుడ్య భాగంలో కుడ్య స్తంభాలు, చిన్నతరహా దేవగృహాలు గలవు. గర్భగృహం పైన కూట, పంజర, శాల హారాల వరసగల విమానం ఉంది. విమానం పై గ్రీవ, శిఖర భాగాలు గలవు. మండపం మధ్యలో నాల్గు స్తంభాలు గలవు. మండపం చుట్టూ పిట్టగోడ ఉన్నది. ఈ గోడలో 32 స్తంభాలున్నాయి. 12 స్తంభాలలో స్త్రీ శిల్పాలు, మిగిలిన వాటిలో వ్యాల శిల్పాలు గలవు. గర్భగృహ ద్వారం పై రంధ్రాలలో అష్ట కోణాలతో తీర్చిన రాతి చెక్కడాలున్నాయి. దేవాలయ కుడ్య భాగంలో ఏనుగులు, సింహాలు, పద్మాలు, మిధునాలు, అప్సరసలు మలచబడ్డాయి. రామప్పగుడిలోని శిల్పాలన్నింటిలో నాగినీ శిల్పం మహోన్నతమైనది. నవరంగ స్తంభాల మీద పార్వతీ కళ్యాణం, దశావతారాలు, గోపికావస్త్రాపహరణం, కృష్ణావతారం మొదలగు ఘట్టాలు ఎంతో నైపుణ్యంగా చెక్కబడ్డాయి. ఈ ఆలయ శిల్ప భంగిమల ఆధారంగా రామకృష్ణ పేరిణి నృత్యాన్ని రూపొందించాడు. ఈ నృత్యం వీరత్వంతో కూడుకుని ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా రామకృష్ణ ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఏటా ఒకసారి ఈ నృత్యం రామప్పగుడిలో ప్రదర్శింపబడుతుంది.

**14.1.6 పిల్లల మర్రి :**

నల్గొండ జిల్లాలోని పిల్లల మర్రిలో కాకతీయ అలయాలనేకం ఉన్నాయి. వీటిలో ఎరాకేశ్వర, సోమేశ్వర దేవాలయాలు ముఖ్యమైనవి. ఇవి క్రీ.శ. 1208లో నిర్మించబడింది. దీనిని గర్భగృహం, అంతరాళం, ముఖమండపం అను అంగాలున్నాయి. ఈ ఆలయం ఎత్తైన ఉపపీఠం పై నిర్మించబడింది. ఈ ఉపపీఠం ప్రదక్షిణకు ఉపయోగపడుతుంది. గర్భగృహం మూడు వైపుల కుడ్య మధ్యభాగంలో చిన్న దేవ కోష్ఠాలు, వాటి కిరు వైపులా విమానస్తంభాలు గలవు. గర్భగృహం పై గల విమానంలో సుఖనాస విభాగం వుంది. మండపం మధ్యలో నాల్గు స్తంభాలున్నాయి. పిల్లల మర్రిలో మరో చోట నామేశ్వరాలయం వుంది. దీనిని క్రీ.శ. 1202లో నామిరెడ్డి నిర్మించాడు. దీనికి కూడా గర్భగృహం, అంతరాళం, ముఖమండపం అను అంగాలున్నాయి. ముఖమండపం ముందు ప్రవాణం ఉంది. ఈ ఆలయం దగ్గరలోనే కచ్చేశ్వర ముక్కంటి శివాలయం వుంది. ఇందులో మూడు దేవగృహాలున్నాయి. దీనిని కూడా నామిరెడ్డి నిర్మించాడు.

**14.1.7 సమీక్ష :**

వీర శైవ మతాభిమానులైన కాకతీయులు ఆంధ్రదేశంలో అనేక ఆలయాలు, దుర్గాలు, చెరువులు నిర్మించారు. వీరు ఆలయాలలో ముఖ్యమైనవి ఓరుగల్లు, హనుమకొండ, పాలంపేట, పిల్లల మర్రి మొదలగు ప్రాంతాలలో గలవు. వీరి ఆలయాలు కొంతవరకు పశ్చిమ కళ్యాణి చాళుక్య రీతిని పోలి ఉన్నాయి. వీరి శిల్పాలు అన్నీ అలంకారాలతో , వివిధ భంగిమలలో ఉన్నాయి. ప్రతి శిల్పంలో చైతన్యం, సొగసు భావ ప్రకటనలో లాలిత్యం వుంది. గర్భగృహ ద్వారబంధాల పై, వితానంలో, స్తంభాలపై, వెలుపలి గోడలపై అద్భుత శిల్పాలను మలిచారు. వీటిలో శివలీలలు, నర్తకీ రూపాలు, వేట దృశ్యాలు గలవు. కాకతీయ స్తంభాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఇవి నునుపుతేలి, భిన్న ఆకృతులు కలిగివున్నాయి. మాచర్ల చెన్నకేశవాలయ స్తంభాలపై రామాయణంలోని ఘట్టాలు, దశావతారాలలోని విషయాలు సుందరంగా మలచబడ్డాయి. కాకతీయ శిల్పంలోని ప్రతిమలు సన్నని పొడవైన శరీర భాగాలు కలిగివున్నాయి. కాకతీయులు దేవాలయ నిర్మాణంలో వాస్తువుకు. శిల్పానికి సమానమైన ప్రాధాన్యతనిచ్చారు.

## 14.2 హోయసాల నిర్మాణశైలి :

**14.2.1 పరిచయం :**

హోయసాలులు కర్ణాటక ప్రాంతంలో క్రీ.శ. 1106 మొదలు 1342 వరకు రాజ్యమేలినారు. వీరు మొదట చోళులకు సామంతులుగా ఉంటూ, చోళ - కళ్యాణీ చాళుక్య రాజ వంశాల మధ్య జరిగిన యుద్ధాలలో తెలివిగా గెలిచిన వారిపక్షం వహిస్తూ, రెండు రాజ్యాలు క్షీణించగానే స్వతంత్రులై ద్వార సముద్రం రాజధానిగా కన్నడ ప్రాంతంలో పాలించారు. ద్రావిడ దేశంలో పాండ్యులు, ఆంధ్రదేశంలో కాకతీయులు దేవాలయాలను నిర్మిస్తున్న సమయంలోనే హోయసాలులు ఒక ప్రత్యేక పద్దతిలో అనేక సుందర దేవాలయాలను నిర్మించారు. కళ్యాణీ చాళుక్యులు,కాకతీయుల వలే వీరు వేసర రీతిలో అనేక దేవాలయాలను కర్నాటక ప్రాంతంలో నిర్మించారు. వీరి నిర్మాణాలలో ప్రముఖమైనవి బేలూరు లోని చెన్నకేశవాలయం, హళెబీడులోని హోయసలేశ్వరాలయం సోమనాధపురంలోని కేశవాలయం.

**14.2.2 నిర్మాణశైలి లక్షణాలు :**

హోయసాలులు దేవాలయనిర్మాణంలో 'క్లోరైట్ స్కిస్టు' అనే మొత్తని శిలను వాడారు. వీరు దేవాలయనిర్మాణంలో వాస్తువు కన్నా శిల్పానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. వీరి ఆలయాలు నక్షత్రాకారంలో ఉంటాయి. ఈ పద్దతికి ఇంతకు ముందే కళ్యాణి చాళుక్యులు ప్రారంభోత్సవం చేశారు. ఒక మండపాన్ని పరివేష్ఠించి వేర్వేరు గర్భగృహాలు నిర్మించడం ఈ ఆలయాల ప్రత్యేకత. గర్భగృహాలు వేరయినట్లే వాటి పై శిఖరాలు కూడా వేరుగా ఉంటాయి. వీరిగర్భగృహ వెలుపలి కోడ్య భాగాల్లో చిన్న చిన్న దేవగృహాలున్నాయి. వీరి ఆలయాలకు విమాన భాగంలో సుఖనాస విభాగముంది. వీరి ఆలయాల్లో అధిష్టానం చాలా ఎత్తుగా ఉంటుంది. ఈ అధిష్టానం అనేక వరుసలుగా విభజింపబడి శిల్పాలతో అలంకృతమై ఉంటుంది. కింది కోడ్య భాగం మంతా నిలువెత్తు దైవమానవ మూర్తులతో నిండి ఉంటుంది. ఆలయ శిఖరం శంఖువు ఆకారంలో ఉంటుంది. గర్భగృహం వెలుపలి పై కుడ్య భాగాలలో చిన్న చిన్న దేవగృహాలు ఉంటాయి. ఆలయాల ఉపపీఠం పై భాగం సుమారు 10 నుంచి 12 అడుగుల వెడల్పు ఉండి ప్రదక్షిణాపథం వలె ఉపయోగపడుతోంది. విమాన భాగంలో కూట, పంజర, శాలహారాలతో కూడిన అనేక అంతస్తులున్నాయి. వీరి ఆలయాల ఎత్తు తక్కువగా, వెడల్పు ఎక్కువగా ఉంటుంది. వీరి ఆలయాలలో ప్రధాన ఆలయం చుట్టూ, అధిష్టానం వెలుపల, మార్గానికిరువైపులా, అధిష్టానం మీద చిన్న చిన్న గుళ్ళు ఉన్నాయి. వీరి ఆలయాల్లోని ద్వారాలలో అద్భుత పనితనం కన్పిస్తుంది. ద్వారం పై గల మకరతోరణం మధ్యలో పురాణగాధలను తెలిపే శిల్ప దృశ్యాలున్నాయి. వీరి ఆలయాల లోని స్తంభాలు నునుపుతేలి మెరుస్తున్నట్లు ఉంటాయి. వీరి శిల్పాలలో స్వర్ణకారుని జిలుగు, నగిషీపని కన్పిస్తుంది. వీరి ఆలయాల్లో స్త్రీ విగ్రహాలు వివిధ భంగిమలలో ఎక్కువ ఆభరణాలు కలిగి వుంటాయి.

**14.2.3 బేలూరు :**

బేలూరులోని చెన్నకేశవాలయాన్ని క్రీ.శ. 1117 లో హొయసాల విష్ణు వర్ధనుడు నిర్మించాడు. ఈ ఆలయం ఒక పెద్ద ప్రాంగణంలో నిర్మించబడి ఉన్నది. ప్రాకారం మధ్యలో గోపుర ద్వారముంది. ప్రాంగణంలో పరివార దేవతా గృహాలున్నాయి. ప్రధాన దేవగృహానికి గర్భగృహం, అంతరాళం, నవరంగ మండపం ఉన్నాయి. ఈ అంగాలన్నీ నక్షత్రాకారంలోని ఉపపీఠం మీద నిర్మించబడి వున్నాయి. అధిష్టానం పై రామాయణ, భారత ఘట్టాలతో కూడిన శిల్పాలు, జంతు బొమ్మలున్నాయి. నవరంగానికి మూడువైపులా ప్రవేశ మార్గాలున్నాయి. వీటికి ముందు మెట్లవరస వుంది. ఈ మెట్ల కిరువైపులా చిన్న దేవగృహాలున్నాయి. వీటిలో చిన్న పరిమాణంలో శివలింగాలున్నాయి. నవరంగ ద్వారాల పై భాగంలో మకరతోరణం ఉంది. నవరంగ కుడ్య భాగం ఒకపిట్ట గోడలాగ ఉంది. దీనినే కాక్షాసనం అంటారు. వీటి పై స్తంభాలున్నాయి. స్తంభాలకు మధ్యగల ఖాళీ స్థలంలో రంధ్రాల కిటికీలున్నాయి. స్తంభాలకు ఆనుకోని మదనిక శిల్పాలున్నాయి. రంధ్రాల కిటికీల పై దర్బారు దృశ్యం, బలికథ వామనుని కథ ఉంది. నవరంగంలో నాలుగు స్తంభాలున్నాయి. వీటికి మదనిక శిల్పాలున్నాయి. నవరంగ మధ్య పై కప్పు ఎత్తుగాను, అర్ధచంద్రాకారంగాను ఉంది. దీనిలోపలి భాగంలో పెద్ద పద్మం ఉంది. గర్భగృహానికి మూడు వైపులా కుడ్యం పై ఒక దాని పై మరొకటిగా రెండు దేవగృహాలున్నాయి. మిగిలిన కుడ్య భాగాలలో విమాన స్తంభాలు, కుడ్య స్తంభాలు, దేవతా శిల్పాలున్నాయి. శిల్పాలలో వామన, వరాహ, బలరామ, అంధకాసుర సంహార మూర్తి, గజాసుర సంహారమూర్తి, హరిహర, దుర్గ, రతి, మన్మథ, గణపతి, చంద్ర, సరస్వతి, కృష్ణ, అర్జున మొదలగు శిల్పాలున్నాయి. శిల్పాల కింద శిల్పుల పేర్లున్నాయి. ఆలయ ప్రధాన ద్వారానికిరువైపులా రెండు శార్దూలాలు తోకలు పై కెత్తి నిలబడినట్లు చెక్కబడి ఉన్నాయి.

**14.2.4 హళేబీడు :**

హళేబీడు లేక ద్వార సముద్రంలోని హొయసాలేశ్వరాలయం క్రీ.శ. 1150 లో నిర్మించబడింది. దీనిని రెండో వీరబల్లాలుడు నిర్మించాడు. ఇచట ఒకే అధిష్టానం పై రెండు గర్భగృహాలు నిర్మించబడ్డాయి. ప్రతి గర్భాలయం ముందు అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. రెండు ఆలయాల ముఖమండపాలను కలుపుతూ ఒక వరండా ఉంది. ఈ ఆలయాల్లో శివలింగాలు ప్రతిష్టించబడ్డాయి. ఇందులో ఒక శివలింగాన్ని హోయసాలేశ్వరుడని, మరోక దాన్ని శాంతలింగేశ్వరుడని పిలుస్తారు. హోయసాలేశ్వరునికి ముందు 30 అడుగుల ఎత్తులో, శాంతలింగేశ్వరునికి ముందు 8 అడుగుల ఎత్తులో నంది విగ్రహాలుగలవు. 12 వరసలుగా విభజింపబడిన అధిష్టానంలో ఏనుగుల వరస, రెక్కల సింహాలవరుస, గుర్రాలు, హంసలు,మొసళ్ళు, రామాయణ భారత భాగవతఘట్టాలు శిల్పీకరించబడింది. కుడ్యభాగంలో ఆరు చిన్న దేవగృహాలు, విమాన స్తంభాలు, దేవతా శిల్పాలున్నాయి. దేవతా శిల్పాలలో నృత్యసరస్వతి, యజ్ఞవరాహ, శివపార్వతులు, లక్ష్మీనారాయణ, వృషభారూఢ మొదలగునవి గలవు. ఈ శిల్పాల కింద శిల్పుల పేర్లు గలవు.

**14.2.5 సోమనాథపురం :**

సోమనాథపురంలో కేశవాలయం ఉంది. దీనిని హొయసార రాజైన ముడో నరసింహుని సైన్యాధిపతి సోమనాధుడు క్రీ.శ. 1268లో నిర్మించాడు. దీన్ని ప్రసిద్ధిగాంచిన శిల్పి జక్కన నిర్మించాడని ప్రతీతి. ఈ ఆలయం పరిమాణంలో బేలూరు, హళేబీడు ఆలయాల కంటే చిన్నదే అయినా ఎక్కువగా అలంకరించబడింది. 215 అడుగుల పొడవు, 177 అడుగుల వెడల్పు గల ప్రాకారం లోపల ఈ ఆలయం నిర్మించబడివుంది. ప్రాకారం లోపలి ముఖభాగంలో 64 దేవతా గృహాలున్నాయి. వీటిలో విష్ణు అవతార ప్రతిమలు ఉండేవి. ఈ ఆలయ నమూనా నక్షత్ర ఆకారంలో ఉంది. ముఖమండపానికి మూడు వైపులా మూడు గర్భగృహాలున్నాయి. మూడు గర్భగృహాల పైన 30 అడుగుల ఎత్తుగల విమానాలున్నాయి. ప్రతి గర్భగృహానికి అంతరాళం ఉంది. ఆలయ అధిష్టానంలో ఆరు విభాగాలున్నాయి. వీటి పై ఏనుగులు, అశ్వాలు, సైనికులు మొదలగు శిల్పాలున్నాయి. ఆలయకుడ్య భాగంలో, మండపవిభాగంలో కుడ్య స్తంభాలు, రంధ్రాల రాతికిటికీలున్నాయి. గర్భగృహ విభాగంలో కుడ్య స్తంభాలు, దేవతా ప్రతిమలు, మొదలగునవి ఉన్నాయి. మండపం పై కప్పు కొసలలో ఇటుకలలో నిర్మించిన కూడులలో దేవతా ప్రతిమలున్నాయి. విమానంలోని ప్రతి అంతస్తులో కూట, పంజర, శాల హారాలున్నాయి. విమానం ముందు భాగంలో సుఖనాస విభాగం ఉంది. ఇందు కూడు డిజైన్ ఉంది. మూడు గర్భగృహాల కుడ్యాల పై

దేవతా శిల్పాలున్నాయి. వీటిలో ఎక్కువ భాగం దేవీ శిల్పాలుగలవు. ఇంకా నరసింహ, వరాహ, వేణుగోపాల,బ్రహ్మ, శివ, మహిషమర్ధని, ఇంద్ర, మన్మధ, లక్ష్మీ, సరస్వతి, శిల్పాలున్నాయి. వీటికింద శిల్పుల పేర్లున్నాయి. ఇచటి తూర్పుముఖ గర్భగృహంలో చెన్నకేశవ విగ్రహం, మిగిలిన రెండు గర్భగృహాలలో జనార్ధన, వేణుగోపాల శిల్పాలున్నాయి. కేశవ దేవాలయంలోని వివిధ భాగాలు చక్కగా సమన్వయం చేయబడింది.

### 14.2.6 సమీక్ష :

ద్వారసముద్రం రాజధానిగా పరిపాలించిన హొయసాల రాజులు మొదటి కళ్యాణి చాళుక్యులకు సామంతులుగా ఉండేవారు. అందువల్ల వీరి నిర్మాణాల పై చాళుక్య ప్రభావం కనబడుతుంది. కళ్యాణి చాళుక్యుల శిల్పకళ హొయసాల కాలంలో పరిపూర్ణతను పొందింది. హొయసల శిల్ప కళలో అలంకరణ, ఆభరణాల ప్రాధాన్యం కనపడుతుంది. ఈ కాలంలో శిల్పాల క్రింద శిల్పుల పేర్లు చెక్కడం ఒక ప్రత్యేకత. వీరిలో బల్లిగవె దారోజు, చవనుడు, నాగోజ, మాబ పేర్కొనదగినవారు.

## 14.3 విజయనగర నిర్మాణశైలి :

### 14.3.1 పరిచయం :

విజయనగర రాజులు క్రీ.శ. 1336 మొదలు 1685 వరకు కృష్ణానదికి దక్షిణంగా గల భూభాగంలో రాజ్యమేలినారు. వీరు సుమారు రెండు శతాబ్దాల కాలం హిందూ సంస్కృతికి రక్షణగా నిలిచారు. వీరు నిరంతరం ఒక వైపు ముస్లింలతో పోరాటాలు చేసినా, మరోవైపు వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలను ఆదరించారు. వాస్తవానికి వీరి కాలంలో హిందూ వాస్తువు పరాకాష్ఠ చెందినది. వీరు కృష్ణానదికి దక్షిణంగా గల కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలలో అనేక ఆలయాలు నిర్మించారు. వీరి ఆలయాలు ఎక్కువగా రాజధాని హంపిలో (విజయనగరం), రాయలసీమలో ఉన్నాయి. రాయలసీమలో అనంతపురం జిల్లాలో కదిరి, గోరంట్ల, పెనుగొండ, తాడిపత్రి మొదలగు చోట్ల, చిత్తూరు జిల్లాలో నాగాలాపురం, నారాయణవనం, సోమపాళెం మొదలగు చోట్ల, కర్నూలు జిల్లాలో మార్కాపురం, శ్రీశైలం, వెంకటరెడిపల్లి మొదలగు చోట్ల, కడప జిల్లాలో రాయచోట, పుష్పగిరి మొదలగు చోట్ల వీరి దేవాలయాలు గలవు. తమిళనాడులో వెల్లూరు, విరంజపురం, కంచి మొదలగు చోట్ల వీరి దేవాలయాలున్నాయి. విజయనగర చక్రవర్తులు పరమత సహనం గలవారు. అందువల్ల ఈ కాలంలో రాజధాని హంపిలో హిందూ నిర్మాణాలే గాక జైన, మహమ్మదీయ, క్రైస్తవ కట్టడాలు నిర్మించబడినాయి. విజయనగరాన్ని దర్శించిన పారశీక రాయబారి అబ్దుల్ రజాక్, ఇటలీయాత్రికుడు నికోలోకాంటే రాజధానిగూర్చి వర్ణించారు. హంపిలో కోటగోడలు, బురుజులు, రాజప్రాసాదాలు, రాణివాసాలు, దేవాలయాలు, దసరాదిబ్బ, అశ్వశాలలు, గజశాలలు, పద్మమహల్, తూలాభారం, స్నానవాటికలు, నీటి పారుదల సౌకర్యం విజయనగర కళాకారుల పనితనానికి నిదర్శనంగా నేటికి నిల్చి ఉన్నాయి.

### 14.3.2 నిర్మాణశైలి లక్షణాలు :

విజయనగర పాలకులు దేవాలయాల నిర్మాణంలో నల్లటి కఠిన శిలను, కొంత వరకు ఇసుకరాయిని ఉపయోగించారు. దక్కన్‌లో వీరు నిర్మించిన దేవాలయాలకు చాళుక్య,హొయసాల, కాకతీయ నిర్మాణ రీతుల ప్రభావం ఉంది. వీరి ద్రావిడ దేశ ఆలయాల్లో పల్లవ, చోళ, పాడ్య నిర్మాణ రీతుల ప్రభావం ఉండగా, వీరు పాత వాస్తు సాంప్రదాయాలను అనుసరించటమేగాక అనేక నూతన వాస్తు పద్ధతులను ప్రవేశపెట్టారు. పల్లవ, చోళ, చాళుక్య మొదలైన రాజవంశాల కాలమందువలె వీరి దేవాలయాల్లో గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, ముఖ మండపం అనే విభాగాలున్నాయి. ఇవేగాక వేయి స్తంభాల మండపాలు, కళ్యాణ మండపాలు, యజ్ఞశాల , ఎత్తైన గాలి గోపురాలు, విశాల ప్రాంగణాలు, దేవీగృహాలుకూడా వీరి ఆలయాలలో కలవు. వీరికాలంలో అధిష్టానాలు సుమారు 6 మొదలు 12 ఆడుగుల ఎత్తు వరకు ఉన్నాయి. వీరి ఆలయాల కుడ్యభాగం తొలిదశలో దేవకోష్టాలతో నిండి ఉండేవి. కాని తరవాత పరివార దేవతలకు ప్రత్యేక దేవగృహాలు నిర్మించే ఆచారం ప్రారంభం కావడంలో కుడ్యభాగం శాల కోష్టాలు, కుడ్యస్తంభాలు, కుంభ పంజరాలతో అలంకృతం చేయబడింది. కపోత భాగంలో సింహలలాటం కూడులు, కపోతపద్మం గలవు. ఆలయ విమానంలో ప్రతి అంతస్తులో కూట,

పంజర, శాలహారాల వరస ఉంది. విమానం పైన గ్రీవ, శిఖర, కపురి భాగాలు ద్రావిడ రీతిలో ఉన్నాయి. వీరు గర్భగృహం పై గల విమానం కంటే గోపుర ద్వారాలు ఎత్తుగా నిర్మించారు. కొన్ని ఆలయాల విమానాల ముందు భాగంలో సుఖనాస విభాగ ముంది. వీరి గోపురాలు దాదాపు 12 అంతస్తులు కలిగి ఉంది. అందువల్ల వీటిని రాయగోపురాలంటారు. వీరి కాలంలో దేవాలయ ప్రాంగణంలో దేవగృహం ప్రత్యేకంగా నిర్మించే సాంప్రదాయ ఉంది. ఇది చోళుల కాలం చివరలో ప్రారంభమయింది. వీరు ఆలయాలప్రాంగణాలలో వేయి స్తంభాలు, వంద స్తంభాల మండపాలు, యజ్ఞశాలలు, కళ్యాణ మండపాలు నిర్మించారు. దేవాలయాల చుట్టూ ఒకటి గాని అంతకంటే ఎక్కువ గాని ప్రాకారాలు నిర్మించారు. వీరి ఆలయాల్లోని స్తంభాలు భిన్నరీతులతో ఉన్నాయి. కొన్నింటిలో సింహాల శిల్పాలున్నాయి. కొన్నింటిలో ఉపస్తంభాలు 14వరకు ఉన్నాయి. కొన్ని స్తంభాల పై దేవతాశిల్పాలున్నాయి. స్తంభాల శీర్షికలో గల 'కార్బెల్' సంపుల్ల పుష్పాకృతి కలిగి ఉంటాయి. వీరి కాలంలో హిందూ ముస్లిం వాస్తురీతుల మిశ్రమంతొ కూడిన నిర్మాణాలు కూడా కలవు. ఇందుకు హంపిలోని పద్మమహల్, చంద్రగిరిలోని రాజభవనాలు, హంపిలోని గజశాలలు చక్కటి నిదర్శనాలు.

**14.3.3 హంపి :**

విజయనగర రాజులు రాజధాని విజయనగరం (నేటి హంపి) లో హజారా రామాలయం, విఠలస్వామి ఆలయం, విరూపాక్షాలయం, అచ్చుతరామాలయం, పట్టాభిరామాలయం మొదలగు దేవాలయాలు నిర్మించారు. హంపిలోనే వినాయక, ఉగ్రనరసింహ విగ్రహాలు ఒకే శిలలో మలిచారు. ఇంకా హంపిలో పద్మమహల్, గజశాలలు, రాజప్రాసాదాలు గలవు. వీటిలో ఎక్కువ భాగం 1565 లో జరిగిన తల్లికోట యుద్ధంలో ధ్వంసమయ్యాయి.

హంపిలోని హజారా రామాలయాన్ని తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు నిర్మించాడు. ఈ ఆలయం 200 అడుగుల పొడవు 110 అడుగుల వెడల్పు గల ప్రాకారం మధ్య గల ప్రాంగణంలో నిర్మించబడింది. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. ముఖమండపానికి మూడు వైపులా ప్రవాణాలున్నాయి. ముఖ మండపం మధ్యగల స్తంభాల పై దేవతా చిత్రాలున్నాయి. గర్భకుడ్య భాగంలో కుడ్య స్తంభాలు, కుంభపంజరాలు, శాల కోష్టాలున్నాయి. అంతేగాక ఈ కుడ్యాల మీద రామాయణ గాధలను తెలిపే శిల్పాలున్నాయి. గర్భగృహంపై గల విమానం రెండు అంతస్తులలో వుంది. శిఖరం చతుర్ముఖంగా ఉంది. విమానం ముందు భాగంలో సుఖనాస విభాగముంది. ఆలయ ప్రాంగణంలో దేవీ గృహముంది. దీనికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, ఒక అంతస్తు ద్రావిడ విమానం కలవు.

విజయనగం దేవాలయాలలో పేరెన్నికగన్నది హంపిలోని విఠల ఆలయం. ఈ ఆలయం రెండో దేవరాయల కాలంలో ప్రారంభమైంది. ఇది శ్రీకృష్ణదేవరాయల కాలంనాటికి కూడా సంపూర్ణంగా నిర్మించబడలేదు. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణా పథం, ముఖమండపం, సంగీత మండపం ఆను అంగాలున్నాయి. ప్రాకార కుడ్యం లోపలి ముఖభాగాన్ని ఆనుకొని ఒక స్తంభాల వరండా నిర్మితమై ఉంది. ప్రాకారం మూడు వైపులా ప్రవాణాలు గలువు. సంగీత మండపంలోని ప్రతిస్తంభంలో ఉపస్తంభాలున్నాయి. వీటిని మీటితే సప్తస్వరాలు పలుకుతాయి. గర్భగృహ ప్రాంతమందలి కుడ్యవెలుపలి ముఖభాగంలో కుడ్యస్తంభాలు, శాల కోష్టాలు, కుంభ పంజరాలున్నాయి. సంగీత మండపానికి ముందు కొంత దూరంలో గరుడవాహనముంది. దీనినే ఏకశిలారథం అంటారు. ఇది కూడా గర్భగృహం, అంతరాళం, ముఖమండపం అను అంగాలను కలిగి ఉంది. ఈ ఆలయ ప్రాంగణంలో మూడు స్తంభాల మండపాలున్నాయి.

హంపిలోని విరూపాక్షాలయం విజయనగర సామ్రాజ్యం స్థాపించేనాటికే వుంది. ఈ అలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం,మహామండపం అను అంగాలున్నాయి. ఆలయ ప్రాంగణంలో దేవగృహం ఉంది. ఈ ఆలయంలో అనేక చిత్ర లేఖనాలున్నాయి. ఈ చిత్ర లేఖనాలలో ముఖ్యమైంది విద్యారణ్యుని చిత్రం. హంపిలోని పట్టాభిరామాలయాన్ని 1539లో అచ్యుతరాయలు నిర్మించాడు. ఇది రెండు ప్రాకారాలను, రెండు గోపురాలను, దేవగృహాన్ని, మండపాలను దేవీగృహాన్ని కలిగి ఉంది.

క్రీ.శ. 1539లో నిర్మించబడిన అచ్యుత రాయదేవాలయం 1565 యుద్ధంలో ముస్లింలచే నాశనం చేయబడింది. ఈ ఆలయానికి రెండు ప్రాకారాలు గలవు. ఆలయ ప్రాంగణం మధ్యలో ప్రధాన దేవాలయం, దేవీగృహం నిర్మించబడి ఉంది. ప్రధాన ఆలయానికి గర్భగృహం,అంతరాళం, ప్రదక్షిణాపథం, ముఖమండపం, మహామండపం ఉన్నాయి. దేవీగృహానికి గర్భగృహం,అంతరాళం, ముఖమండపం అను అంగాలున్నాయి. లోపలిప్రాకారం లోపలి ముఖభాగం ఆనుకుని ఒక స్తంభ వరండా ఉంది. వెలుపలి ప్రాకారం లోపలిభాగంలో వాయువ్య మూలంలో ఒక పెద్ద స్తంభ మండపముంది.

### 14.3.4 లేపాక్షి :

విజయనగర కాలపు దేవాలయాలలో అనంతపురం జిల్లాలోని లేపాక్షిలోగల వీరభద్రాలయం ప్రముఖమైంది. ఈ ఆలయాన్ని అచ్యుతరాయల కాలంలో క్రీ.శ. 1533లో పెనుగొండ కోశాధికారి విరూపన్న నిర్మించాడు. ఈ ఆలయానికి రెండు ప్రాకారాలు గలవు. మొదటి ప్రాకారంలో మూడు ప్రవేశ మార్గాలున్నాయి. ఉత్తరదిశలో గోపుర ద్వార ముంది. ఈ ప్రాకార కుడ్యులోపలి ముఖభాగాన్ని ఆనుకుని స్తంభాల వరండా గలదు. ఈ ప్రాకారంలో వలే ఒక స్తంభాల మండపముంది. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణా పథం, ముఖమండపం, ప్రవాణం, నాట్య మండపం ఉన్నాయి. గర్భగృహంపై రెండు అంతస్తుల విమానముంది. ఆలయ ప్రాంగణంలో విష్ణు దేవగృహం, పాపవినాశేశ్వర దేవగృహం ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాల ఆలయాలు కూడా ఉన్నాయి. ఇచటి నాట్యమండపంలో 70 స్తంభాలున్నాయి. స్తంభాలవసారాలోని వితానంలో అనేక చిత్ర లేఖనాలున్నాయి. స్తంభాలపై నిలువెత్తు నాట్యకత్తెలు, గంధర్వ కన్యలు, సాలభంజికలు వివిధ నాట్య విన్యాసాలతో మనోహరంగా చెక్కబడ్డాయి. ఈ ఆలయానికి కొద్దిదూరంలో బసవన్న ఏకశిలా విగ్రహముంది. ఇది 206 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవు కలిగి వుంది. విజయనగర శిల్ప కళానైపుణ్యానికి, చిత్ర లేఖనాలకు లేపాక్షి ప్రసిద్ధిగాంచింది.

### 14.3.5 తాడిపత్రి :

ఆంధ్రదేశంలోని విజయనగర దేవాలయాలలో ప్రసిద్ధమైనవి తాడిపత్రిలోని చింతల వెంకటరమణ, బుగ్గరామలింగేశ్వరాలయాలు. ఈ ఆలయాలలో విజయనగర వాస్తువు పరాకాష్ఠ చెందింది. వీటిలో వెంకటరమణ ఆలయం రెండో దేవరాయలి కాలంలో తాడిపత్రి పాలకులుగా ఉన్న రామలింగనాయుడు, తిమ్మనాయుడు నిర్మించారు. ఈ ఆలయానికి గర్భగృహం,అంతరాళం,కళ్యాణమండపం, మహామండపం ఉన్నాయి. గర్భగృహం పై రెండు అంతస్తుల విమానం ఉంది. ప్రధాన ద్వారం మీద, వరండాలో,మండపాలలో రామాయణ గాథలు అద్భుతంగా శిల్పీకరించబడింది. ఇచటగల రాతిరథం హంపిలోని రాతిరథాన్ని పోలిఉంది. రామలింగేశ్వరాలయం పెన్నానది ఒడ్డున గలదు. ఈ ఆలయానికి గల మూడు గోపురాలు సుందరంగా ఉన్నాయి. ఈ ఆలయాన్ని కూడా పెమ్మసాని రామలింగ నాయుడు నిర్మించాడు. ఈ ఆలయంలో అద్భుత శిల్పాలున్నాయి. వాటిలో వీరభద్రుని శిల్పం ఆకర్షణీయంగా ఉంది.

### 14.3.6 ఇతర ప్రాంత దేవాలయాలు :

విజయనగర రాజుల దేవాలయాల్లో ఒకటి శృంగేరి ప్రాంతంలో గలదు. ఇచట గల విద్యాశంకర దేవాలయాన్ని హరిహర, బుక్క సోదరులు 1338లో నిర్మించారు. ఇది తొలి విజయనగర ఆలయాల్లో పెద్దది. దీనికి గర్భగృహం,స్తంభమండపం, మూడు అంతస్తుల విమానం ఉన్నాయి. విజయనగర రాజులు నిర్మించిన దేవాలయాలు అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి.

### 14.3.7 శిల్ప చిత్ర లేఖనాలు :

విజయనగర కాలంలో వాస్తుకళకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. కానీ శిల్పం నిరాదరణ పొందలేదు. ఆలయాల స్తంభాలు, కుడ్యాలు, విమానాలు, గోపురాలు, అధిష్ఠానాలపై శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. విజయనగర శిల్ప నైపుణ్యానికి వ్యాళల నోటిలోని కదలే శిలా బంతులే తార్కాణం. ఇది శిల్ప కళలో ఒక అద్భుతం . ఈ కాలపు భారీ శిల్పాలు హంపిలో గలవు. వీటిలో పేర్కొనదగినవి గణేశ,

ఉగ్రనరసింహ శిల్పాలు. భారీశిల్పాలకు మరో తార్కాణం తిరుపతి చక్ర తీర్థంలోని రంగనాధ శిల్పం. తాడిపత్రి, లేపాక్షి ఆలయాల్లో అద్భుత విజయనగర శిల్పాలున్నాయి. లేపాక్షిలోని కౌవలమూర్తి, నటరాజ, కళ్యాణ సుందరమూర్తి, వృషభవాహన,గజాసుర సంహారమూర్తి, భిక్షాటన మూర్తి, గణపతి,విష్ణు శిల్పాలు పేర్కొనదగినవి. హంపి హజారా రామాలయంలో, పెనుగొండ విష్ణు ఆలయం, తాడిపత్రిలో రామాయణ, భగవద్గీత, కృష్ణలీలల కధా వివరణ శిల్పాలున్నాయి.

విజయనగర కాలంనాటి వర్ణచిత్రాలు హంపి విరూపాక్షాలయ మండపంలో, లేపాక్షి వీరభద్రాలయంలో, తాడిపత్రి, కంచి, కాళహస్తి,తిరుపతి, చిత్తురు జిల్లాలోని సోమపాలెం మొదలగు చోట్ల గలవు. ఈ వర్ణ చిత్రాలలో ఇతిహాస, పురాణగాధలు, కృష్ణలీలలు, రతీమన్మధలీలలు, సామాజిక జీవిత దృశ్యాలు గలవు. విరూపాక్షాలయ మండపంలో విద్యారణ్యుని పల్లకీలో ఊరేగించే దృశ్యం అందంగా చిత్రీకరించబడింది. వీరభద్రాలయ నాట్యమండపంలోని వితానంలో మార్కండేయ చరిత్ర, గంగావతరణం, త్రిపురాసుర సంహారం మొదలగు పురాణ గాధలు గలవు. ఈ మండపంలోని చిత్రాలలో ఆద్భుతమైంది వటపత్రశాయి చిత్రం. ఈ చిత్రాల ద్వారా నాటి స్త్రీ పురుషుల వస్త్రధారణ, ఆభరణాల తీరుతెన్నులు గ్రహించవచ్చు.

### 14.3.8 సమీక్ష :

ఆంధ్రశాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో ప్రారంభమైన హిందూ దేవాలయ వాస్తువు విజయనగర కాలంలో హంపి విఠలాలయంలో, తాడిపత్రి ఆలయాలలో పరాకాష్ట చెందింది.

### 14.4 సారాంశాము :

భారతదేశములోని ప్రముఖ రాజవంశాలు అయిన కాకతీయ, హోయసాల, విజయనగర రాజులు వారి వారి కాలములలో తమదైన నిర్మాణశైలిలో దేవాలయాలు నిర్మించి వాస్తుకళ, శిల్పకళ, చిత్రకళలకు ఎనలేని కృషి చేసినారు.

### 14.5 నమూనా ప్రశ్నలు :

(1) కాకతీయ నిర్మాణ శైలిని గురించి వివరింపుము.

(2) హోయసాల దేవాలయాల లక్షణాలు సోదాహరణంగా వివరింపుము

(3) విజయనగర నిర్మాణ శైలి లక్షణాలు తెల్పుము.

**డా ॥ వి. కె. మోహన్**

పాఠం-15

# ఉత్తర భారతదేశ దేవాలయాలు

## 15.0 లక్ష్యం :

మధ్య భారత, గుజరాత్, ఒరిస్సా ప్రాంత దేవాలయాలతో బాటు గుప్తుల దేవాలయాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


**15.1** పరిచయము

**15.2** గుప్తుల దేవాలయాలు

- **15.2.1** పరిచయం
- **15.2.2** తొలి దశ దేవాలయాలు
- **15.2.3** రెండో దశ దేవాలయాలు
- **15.2.4** చివరి దశ దేవాలయాలు
- **15.2.5** సమీక్ష

**15.3** మధ్య భారత దేవాలయాలు

- **15.3.1** పరిచయం
- **15.3.2** ముఖ్య లక్షణాలు
- **15.3.3** ప్రతీహారుల దేవాలయాలు
- **15.3.4** పరమారుల దేవాలయాలు
- **15.3.5** కాలచూరి దేవాలయాలు
- **15.3.6** కచ్ఛపఘటుల దేవాలయాలు
- **15.3.7** చందేలుల దేవాలయాలు - ఖజురహో
- **15.3.8** సమీక్ష

**15.4** గుజరాత్, రాజస్థాన్‌లలో గల దేవాలయాలు

- **15.4.1** సోలంకీ పూర్వ దేవాలయాలు
- **15.4.2** సోలంకీ కాలపు దేవాలయాలు - మొధేర
- **15.4.3** రాజస్థాన్ దేవాలయాలు - మౌంట్ ఆబూ

**15.5** ఒరిస్సా దేవాలయాలు

15.5.1 పరిచయం

15.5.2 లక్షణాలు

15.5.3 భువనేశ్వర్

15.5.4 పూరి

15.5.5 కొణార్క

15.5.6 ముఖలింగం

15.6 సారాంశము

15.7 నమూనా ప్రశ్నలు

## 15.1. పరిచయము :

భారతదేశంలో గల దేవాలయాల శిఖరాల రూపురేఖలను బట్టి నేటి వాస్తు నిపుణులు దేవాలయాలను మూడు రీతులుగా విభజించారు. అవి 1. ఔత్తరాహిక రీతి 2. దాక్షిణాత్య రీతి 3. చాళుక్య రీతి. ఔత్తరాహిక రీతిలోని ఆలయాలలో గల స్థానిక భేదాలను అనుసరించి వాటిని మధ్య భారత్, గుజరాత్, రాజస్థాన్, ఒరిస్సా రీతులుగా విభజించి పరిశీలించడం జరిగింది.

ఉత్తర భారతదేశ దేవాలయాలను నాగర లేక ఔత్తరాహిక రీతి దేవాలయాలంటారు. ఈ ఆలయాలకు గర్భగృహం, దానిలో ఉబ్బెత్తు రథా విభాగాలు, గర్భగృహం ముందు ప్రవాణం లేక జగ మోహనం, నాట్యమండపం, భోగమండపం అను అంగాలు కలవు. ఈ ఆలయాల గర్భగృహ విమాన భాగంలో రాహాపాగా, అనూరాహా పాగా, కొనికా పాగా అను విభాగాలున్నాయి. విమానం యొక్క అంతస్తులు గుర్తించుటకు వీలుగా కోనికా పాగా విభాగంలో భూమి ఆమలకాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విమానం అనువృత్తాకారంలో వుంటుంది. విమానం పైన గ్రీవ, ఆమలకశిల, కలశం ఉంటాయి. ఈ దేవాలయాలలో చాలా వరకు స్తంభాలు లేవు. గర్భగృహంపై రేఖా శిఖరం ఉండగా, గర్భగృహం ముందు గల మండపాలపై పిరమిడ్ ఆకృతిలో శిఖరాలుంటాయి.

## 15.2 గుప్తుల దేవాలయాలు :

### 15.2.1 పరిచయం :

ఉత్తర భారతదేశ దేవాలయాలలో అతి ప్రాచీనమైనవి గుప్తుల కాలానికి ( క్రీ.శ. 320 - 540 ) చెందినవి. గుప్త చక్రవర్తులు వైదిక మతాభిమానులు, విష్ణు భక్తులు. వీరి ఆదరణలో వైదిక మతం నేటి హిందూమతంగా అవతరించింది. హిందూమతమందలి భక్తి ఉద్యమము ఆనాటి వాస్తు శిల్ప కళాభివృద్ధికి కారణమయింది. భక్తి ఉద్యమం కృష్ణ, వాసుదేవ, బలరామ, స్కంద, వరాహ, శివ, బుద్ధ, విష్ణు దేవతలను ఆరాధించే విధానాన్ని ప్రచారం చేసింది. గుప్త చక్రవర్తులు హిందూ మతాన్ని ముఖ్యంగా వైష్ణవశాఖను ప్రోత్సహించారు. హిందూ మత వ్యాప్తితో బాటు దేవతా ప్రతిమల వ్యాప్తి జరిగి వాటి స్థాపనకై దేవాలయ నిర్మాణాలు ఈ కాలమందు ప్రారంభమైనవి.

### 15.2.2 తొలిదశ దేవాలయాలు :

గుప్తుల కాలపు తొలిదశ దేవాలయాలు చతురస్రాకారపు గర్భ గృహం కలిగి ఉంది. ఈదశలోనే కొంత కాలానికి గర్భగృహానికి ముందు ఒక ప్రవాణం నిర్మించే విధానం ప్రారంభమైంది. ఆలయం పై కప్పు సమతలంగా ఉంటుంది. ఈ దశలోని దేవాలయ గోడలు ఎటువంటి అలంకరణ లేకుండా ఉన్నాయి. గర్భగృహ ద్వారాలపై గంగ, యమునా శిల్పాలు కలవు. సాంచిలోని 17 వ నంబరు దేవాలయం, తిగావాలోని విష్ణు ఆలయం, ఎరన్‌లో ఉన్న ఆలయం, సకోర్‌లో ఉన్న శివాలయం తొలిదశకు చెందిన గుప్తుల ఆలయాలు. వీటిలో సాంచిలోని 17 వ నంబర్ దేవాలయం అతి ప్రాచీనమైంది. ఈ ఆలయానికి గర్భగృహం, నాలుగుస్తంభాల మండపం ఉంది. గర్భగృహం

చతురస్రాకారంగా ఉంది. మండపంలో గల స్తంభ శీర్షికల మీద ఆసీన సింహాలున్నాయి. గర్భగృహ ద్వారానికి ఇరువైపులా గంగ, యమునా శిల్పాలున్నాయి. తిగావా లోని విష్ణు ఆలయం గుప్త శైలిలో కొంత పురోగతిని సూచిస్తున్నాయి. ఈ ఆలయ ద్వారబంధాలు నగీషి చేయబడి, స్తంభాల పై భాగంలో పూర్ణఘటం ఆసీన సింహాలతో మలచబడింది. ఎరన్‌లోని విష్ణు ఆలయం నాలుగు ప్రధాన దిశలవైపు కేంద్రాభి ముఖాలను కలిగివుంది. సకోర్ ఆలయానికి కుడ్యాలతో కూడిన మండపం ఉన్నది.

### 15.2.3 రెండో దశ దేవాలయాలు :

భుమారలోని శివాలయం, నాచన కుతార లోని పార్వతీ దేవాలయం, బాంగ్లాదేశ్‌లో బైగ్రామ్‌లోని దేవాలయం గుప్తుల కాలానికి చెందిన రెండో దశ ఆలయాలు. ఈ ఆలయాలలో గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేయడానికి చతురస్రాకారంలో నిర్మాణాలు ఉన్నాయి. నాచన దేవాలయ కుడ్యాలు ప్రతిమా నికేతనాలతో అలంకరించబడి ఉన్నాయి. భుమార ఆలయానికి సోపానాలకిరువైపులా రెండు పరివార దేవాలయాలు నిర్మించబడ్డాయి. ఈ ఆలయంలో దేవతా విగ్రహాలు, గణాలు, కీర్తి ముఖాలు అర్ధ చంద్రాకారపు ఆర్చీలలో మలచబడ్డాయి. ఈ ఆలయ ద్వారాలపై గంగ, యమునా శిల్పాలు గలవు. నాచన దేవాలయ గర్భగృహం పై కప్పు మీద మరో గది నిర్మితమైంది. ఈ ఆలయానికి స్తంభాలతో కూడిన ప్రవాణం ఉన్నది. గర్భగృహం, ప్రదిక్షిణాలలో వెలుతురు కొరకు రాతి కిటికీల నిర్మాణం ఏర్పాటు చేయబడింది.

### 15.2.4 చివరిదశ దేవాలయాలు :

దేవఘర్‌లోని దశావతారాలయం, భీటార్ గాన్ లోని శివాలయం చివరి, పరిణత దశకు చెందిన గుప్తుల ఆలయాలకు తార్కాణాలు. ఇవి క్రీ.శ. 6 వ శతాబ్ది నాటివి. ఈ దేవాలయాలలో గుప్తశైలి పరాకాష్ట నందు కొన్నది. ఉత్తర భారత రేఖాశైలి, నాగరశైలి ఈ దశలో ప్రారంభమైంది. దేవఘర్‌లోని దశావతారాలయం 1.54 మీటర్ల ఎత్తు గల అధిష్టానంపై నిర్మించబడింది. ఈ అధిష్టానానికి నాల్గువైపులా మెట్లు వున్నాయి. ఆలయం నాలుగు మూలలలో నాలుగు ఆలయ నమూనాలున్నాయి. అందువల్ల ఈ దేవాలయాన్ని పంచాయతన దేవాలయంగా పేర్కొంటారు. ఆలయ అధిష్టానం చుట్టూ రామాయణంలోని దృశ్యాలు, కృష్ణ లీలా శిల్పాలున్నాయి. కుడ్యభాగంలో మూడు దేవకోష్టాలున్నాయి. వీటిలో అనంతశాయి, నారాయణ, గజేంద్ర మోక్ష శిల్పాలున్నాయి. గర్భగృహం ద్వారం రెండు వైపులా ద్వారపాలకుల శిల్పాలు గలవు. ఈ ద్వారంపైన మిధున చిత్రాలు, ఆసన యోగి చిత్రాలున్నాయి. ఈ ఆలయంలో కృష్ణ లీలలు, రామకృష్ణ శిల్పాలు, హనుమంతుడు సంజీవిని తెచ్చుట, లక్ష్మణుడు శూర్పణక ముక్కు కోయు శిల్పాలున్నాయి. కుడ్యంపై కపోత భాగం ఉంది. గర్భగుడిపై గల శిఖరం నాగరశైలి తొలిదశను సూచిస్తుంది. విమానంలో రాహాపాగా, అనురాహా పాగా, కోనిక పాగా అను విభాగాలున్నాయి. అంతస్థులు తెలుపుటకు కోనికపాగయందు భూమి ఆమలకలు గలవు. విమానంపై ఆమలక శిల, స్తూపి ఉండేవి. ఈ ఆలయం చుట్టూ ప్రదక్షిణాపథం, ఆలయం ముందు ప్రవాణం ఉన్నాయి. భీటార్ గాన్ లోని శివాలయం ఇటుక, మట్టితో నిర్మించబడింది. దీనికి గర్భగృహం, అంతరాళం, ప్రవాణం అను అంగాలున్నాయి. ఆలయ కుడ్య భాగంలో ప్రతిమానికేతనాలు, కుడ్య స్తంభాలు, బంక మట్టి శిల్పాలు గలవు. ఈ శిల్పాలలో గణపతి, ఆదివరాహ, మహిషాసురమర్ధని, గంగా యమునలు, సీతాపహరణం, నరనారాయణుల తపస్సు మొదలగున్నవి గలవు. లౌకికపరమైన శిల్పాలు కూడా ఈ భాగంలో ఉన్నాయి. కుడ్య భాగంపై కపోతముంది. విమానం ' రథ ప్రాజెక్షన్స్ ' కలిగి వాటి ముఖభాగాన చైత్య అలంకరణ ఉంది. ఆలయ శిఖరం ప్రస్తుతం శిథిలమై ఉన్నది. మహాబోధి దేవాలయం దేవఘర్, భీటర్‌గాన్ దేవాలయాలను పోలివుంది. దీని నిర్మాణం పంచరథ పద్ధతిలో జరిగింది. ఈ ఆలయంలో గర్భగృహం, అంతరాళం, నాట్యమండపం, భోగమండపం అను అంగాలున్నాయి. ఈ ఆలయానికి నాలుగువైపులా మెట్లున్నాయి. నాలుగుమూలల నాలుగు దేవగృహాలున్నాయి. గర్భగృహంలో బుద్ధుని ప్రతిమ ఉంది. గర్భగృహం అనువృత్తాకారంలో ఉండి ఆపైన ఆమలకశిల ఉంది. గర్భగుడి ముందున్న భాగాలపై పిరమిడ్ ఆకృతిలో శిఖరాలున్నాయి.

### 15.2.5 సమీక్ష :

ఉత్తరభారతదేశ దేవాలయరీతికి (నాగర) గుప్తులు శ్రీకారం చుట్టారు. వీరు మొదట గర్భగృహం పైభాగం సమతలంగా రూపొందించారు. తరువాత గర్భగుడిపై అను వృత్తాకారంలో విమానం నిర్మించి నాగరశైలికి రూపమిచ్చారు. గర్భగృహం ముందు ఉన్న మండపాలపై పిరమిడ్ ఆకృతిలో శిఖరాలు ఏర్పాటు చేశారు. ఈ రకమైన నిర్మాణ పద్ధతి రాజపుత్రుల కాలంలో పరాకాష్ట చెందినది.

## 15.3 మధ్యభారత దేవాలయాలు :

### 15.3.1 పరిచయం :

మధ్యయగంలో మధ్యభారతదేశంలో ప్రతీహారులు కనోజ్ రాజధానిగా పరిపాలిస్తూ అనేక దేవాలయాలు నిర్మించారు. వీరి తరువాత మధ్య భారత తూర్పు భాగంలో కాలచూరి వంశస్తులు, మధ్యభారత ఉత్తర భాగంలో కచ్చహపఘటులు, మధ్యభారత పశ్చిమ భాగంలో పరమారులు, మధ్యభారత మధ్య భాగంలో చందేల వంశస్తులు సమకాలికంగ పాలిస్తూ పెక్కుదేవాలయాలు నిర్మించారు.

### 15.3.2 ముఖ్య లక్షణాలు :

మధ్యభారతంలో తొలిదశలో నిర్మించిన దేవాలయాలకు గర్భగృహం, అర్ధమండపం ఉండేవి. తరవాత వీటిముందు ప్రవాణం ఏర్పాటు చేశారు. తొలిదశలో శిఖరం పొట్టిగా ఉండేది. మలిదశలో అర్ధమండపం, ప్రవాణం మధ్యదశలో మండపం నిర్మించడం ప్రారంభించారు. ఈ కాలంలోనే శిఖరం పంచరథ, సప్తరథ శిఖరాలుగా రూపొందించారు. మండప విమానముందు సుఖనాస నిర్మాణం జరిగింది. తొలిదశ ఆలయాల్లో కుడ్యాలలో ఒక వరస దేవతా శిల్పాలు గల కోష్టాలుండగా మలిదశలో రెండు వరసలలో శిల్పాలు రూపొందించారు. ఈ ప్రాంత దేవాలయాల శిఖరాలు సుసంధిబంధురాలు. కొన్ని పెద్ద ఆలయాలలో నాలుగు మూలల నాలుగు చిన్న ఆలయాలున్నాయి. ఈ ప్రాంత ఆలయాల్లో శిల్పాలతో బాటు గొప్ప నగిషీ పనితనం కనిపిస్తుంది.

### 15.3.3 ప్రతీహారుల దేవాలయాలు :

ప్రతీహారులు కనూజ్ రాజధానిగా క్రీ.శ. 8 - 9 శతాబ్దాల మధ్యకాలంలో మధ్య భారతంలో రాజ్యమేలినారు. వీరు అనేక దేవాలయాలు నిర్మించారు. వీరు నిర్మించిన దేవాలయాల్లో ప్రధానమైనవి గ్వాలియర్ సమీపంలో సరేసర్‌లో గల దేవాలయాల సముదాయం. ఈ ఆలయాలకు చతురస్రాకార గర్భగృహం ఉంది. దీనిపై త్రిరథ రేఖాశిఖరం ఉంది. గర్భగృహముందు అర్ధమండపం లేక అంతరాళం ఉంది. ఈ రెండింటి ద్వారాలపై కుడ్య స్తంభాలు, గరుడుని శిల్పం ఉన్నాయి. ఈ ఆలయ కుడ్యభాగం మధ్య ఉబ్బెత్తుగా వుంది. ఇందులో గణేశ, కార్తికేయ, లకులీశ, సూర్య, పార్వతి గల దేవకోష్టాలున్నాయి. గ్వాలియర్ సమీపంలోని బతేసర లోని దేవాలయం, అమ్రోల్ లోని మహాదేవ దేవాలయం, శివపురి జిల్లాలోని మహువలో గల శివాలయం ఈకాలం నాటివే. మహువా సమీపంలోని తెహారి యందలి దేవాలయం పంచరథ గర్భగృహాన్ని, ప్రవాణాన్ని కలిగివుంది. గ్వాలియర్‌లోని తెలిక మందిర్ ప్రతీహారుల తొలి పెద్ద దేవాలయం. దీనికి దీర్ఘచతురస్త్రాకార గర్భగృహం, ప్రవాణం ఉన్నాయి. గర్భకుడ్య భాగంలో దేవతలు, దేవీలు, శిఖర రూపాలు, చైత్యాలున్నాయి. ఈ ఆలయం క్రీ.శ. 9వ శతాబ్ది మధ్యకాలం నాటిది. మధ్యప్రదేశ్ లో గుణ జిల్లాలోని ఇండో నందు గల శివాలయం గుండ్రంగా వుంది. ఈ ఆలయ కోష్టాలలో గణేష, కార్తికేయ, ఉమ మొదలైన శిల్పాలున్నాయి. ఝాన్సీ జిల్లాలోని బర్వసాగర్‌లోని జరైమల్ ఆలయం, విదిశ జిల్లాలోని బదోహ్ నందలి గదర్‌మల్ దేవాలయాలు దీర్ఘ చతురస్రాకార పంచరథ గర్భగృహం, శిధిలమైన శిఖరం, అందమైన స్తంభాలున్నాయి. గదర్‌మల్ దేవాలయం చుట్టూ ఏడు పరివార దేవతాగృహాలున్నాయి. పన్న జిల్లాలోని నాచన యందు చతుర్ముఖ మహాదేవ ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి త్రిరథ గర్భగృహం, దానిపై పంచరథ నాగరరీతి శిఖరం ఉన్నాయి. తికంఘర్ జిల్లాలోని మాన్‌ఖేడ్ లో సూర్య దేవాలయముంది. ఈ ఆలయానికి చతురస్రాకాల పంచరథ గర్భగృహం, అంతరాళం, ప్రవాణం ఉన్నాయి.

**15.3.4 పరమారుల దేవాలయాలు :**

పరమారులు మాళ్వ కేంద్రంగా మధ్యభారత పశ్చిమ భాగంలో క్రీ.శ. 10-12 శతాబ్దాల మధ్యకాలంలో పరిపాలించారు. వీరు భూమిజరీతిలో దేవాలయాలు నిర్మించారు. వీరు నిర్మించిన ఆలయాలు ఉదయపూర్, ఉన్, ఓనార్కమంథట, జమ్లి, నేమవార్‌లలో ఉన్నాయి. పరమారులు నిర్మించిన ఆలయాలలో ఉదయపూర్‌లోని నీలకంఠేశ్వరాలయం పెద్దది. దీనిని ఉదయాదిత్యుడు క్రీ.శ. 11వ శతాబ్దం రెండో భాగంలో నిర్మించాడు. దీనికి సప్తరథ గర్భ గృహం, అంతరాళం, మండపం, మండపానికి మూడువైపులా ప్రవాణాలున్నాయి. ఈ ఆలయం చుట్టూ ఎనిమిది పరివార దేవతా గృహాలున్నాయి. ఆలయం పెద్ద అధిష్టానంపై నిర్మించబడింది. దీనిపైకి మెట్లున్నాయి. వీటికి రెండువైపులా ద్వారపాలకులున్నారు. గర్భగృహంపై ఏడు అంతస్థుల శిఖరం ఉంది. దీనిపై ఐదు వరుసల్లో లఘు శిఖరాలున్నాయి.

**15.3.5 కాలచూరి దేవాలయాలు :**

కాలచూరి వంశస్థులు దహల రాజధానిగా క్రీ.శ. 10 -12 శతాబ్దాల మధ్య కాలంలో మధ్య భారత తూర్పు ప్రాంతంలో పరిపాలించారు. వీరు నిర్మించిన దేవాలయాలలో రేవా జిల్లాలోని బైజ్‌నాథ్‌లోని వైద్యనాథాలయం, సాగర్ జిల్లాలోని బినైక యందలి దేవాలయం, షాదోల్ జిల్లాలోని అర్జుల యందలి విష్ణు దేవాలయం, సిధి జిల్లాలోని చెంద్రెహిలోని శివాలయం ముఖ్యమైనవి. బైజ్‌నాద్, అర్జుల దేవాలయాలు చాలా చిన్నవి., క్రీ.శ. 9వ శతాబ్దం నాటివి. చెంద్రహి ఆలయం క్రీ.శ. 10వ శతాబ్ది నాటిది. దీనికి గుండ్రని గర్భగృహం కలదు. సత్నా జిల్లాలోని మైహర్ నందలి శివాలయం పంచరథ గర్భగృహం. గర్భగృహం కుడ్యభాగంలో అప్సరసలు, వ్యాళలు ఉన్నాయి. దమోహ్ జిల్లాలో నోహల్ ప్రాంతంలో మహాదేవ ఆలయం ఉంది. రేవా దగ్గరలో గూర్గి యందు అద్భుత శిల్పాలను కలిగి ఉన్న తోరణముంది. దీనిపై శివకళ్యాణం, శివపార్వతి మొదలైన శిల్పాలున్నాయి. ఈ కాలానికి చెందిన ఆలయాల్లో జబల్‌పూర్ జిల్లాలోని తీవార్, బిల్వారి ప్రాంతాల ఆలయాలు, సత్నా జిల్లాలోని మరై యందలి శివాలయం, పన్నాజిల్లాలోని అజైఘర్‌లోని శివాలయం పేర్కొనదగినవి. షాదోల్ జిల్లాలోని అమర్‌కంటక్ నందలి ఆలయాలు క్రీ.శ. 11వ శతాబ్దినాటివి. వీటికి గర్భగృహం, రేఖాశిఖరం, ప్రవాణం, స్తంభ మండపం ఉన్నాయి. ఇచట కర్ణ దేవాలయం సప్తరథ గర్భగృహం కాగా మిగిలినవి పంచరథ రీతి ఆలయాలు. కర్ణదేవాలయం మూడుగర్భగృహాల ఆలయం. ఈ మూడింటికి కలిపి ఏకమండపం ఉంది. ఆలయ కుడ్యాలలో మూడు వరుసల శిల్పాలున్నాయి. షాదోల్ జిల్లాలోని సోహగ్‌పూర్ నందలి విరాటేశ్వర దేవాలయం ఖజురహో దేవాలయం లాగా ఉన్నది. జబల్‌పూర్ జిల్లాలోని భేరఘట్‌లో చౌసత్ యోగిని దేవాలయం అనేక శిల్పాలను కలిగిఉంది. గర్భగృహంలో ఉమామహేశ్వరి శిల్పముంది. కాలచూరి వంశస్తుల ఆలయాలు చాంద జిల్లాలో, బిలాస్‌పూర్ జిల్లాలో, దృగ్ జిల్లాలో, బస్తర్ జిల్లాలో కూడా కలదు.

**15.3.6 కచ్ఛహపఘటుల దేవాలయాలు :**

మధ్యభారత ఉత్తర భాగంలో నర్వార్, దుబ్‌కుండ్, గ్వాలియర్‌లు కేంద్రాలుగా కచ్ఛహపఘటులు క్రీ.శ. 10 -12 శతాబ్దాల మధ్య కాలంలో పరిపాలించారు. వీరికాలంలో అనేక ఆలయాలు నిర్మించబడింది. ఈ కాలపు వీరి ఆలయాలు తక్కువ ఎత్తుగల అధిష్టానం, పొట్టి స్తంభాలు కలిగి ఉన్నాయి. వీరి ఆలయాల్లో సుర్వాయ దేవాలయం తొలి దశకు చెందినది. ఇది క్రీ.శ. 10వ శతాబ్దానిది. సుహానియాలోని కాకన్మద్ దేవాలయం మధ్య దశకు చెందినది. ఇది క్రీ.శ. 11వ శతాబ్ది మొదటి పాదం నాటిది. ఎత్తైన వేదికపై నిర్మించబడిన కాకన్మద్ దేవాలయం చుట్టూ పరివార దేవతా గృహాలున్నాయి. దీనికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, రేఖాశిఖరం, మండపం, ప్రవాణం, ఎదురుగా మెట్లు ఉన్నాయి. కద్వహలో సుమారు 30 దేవాలయాలున్నాయి. ఇవన్నీ పంచరథ ఆలయాలు, వీటికి గర్భగృహం, అంతరాళం, మండపం ఉన్నాయి. గ్వాలియర్‌లో వైష్ణవాలయం ఉంది. దీనికి గర్భగృహం, అంతరాళం, మండపం, మూడు ప్రవాణాలున్నాయి. ఈ ఆలయం మొత్తం శిల్పాలతో అలంకృతమై ఉంది.

**15.3.7 చందేలుల దేవాలయాలు - ఖజురహో :**

చందేలులు క్రీ.శ. 10 - 11 శతాబ్దాల కాలంలో మధ్యభారత మధ్యభాగంలో పరిపాలించారు. వీరు నిర్మించిన దేవాలయాలు

ఖజురహో, మహోబ, కలింజర్, అజైఘర్, చాంద్‌పూర్ మొదలగు ప్రాంతాలలో గలవు. వీటిలో ఖజురహోలోని దేవాలయాలు ప్రసిద్ధిగాంచాయి. ఇచట శైవ, వైష్ణవ, జైన ఆలయాలున్నాయి. ఖజురహో ఆలయాలకు గర్భగృహం, అంతరాళం, మండపం, ప్రవాణం అను అంగాలు వరసగా, ఒకదాని కంటే మరొకటి కొంత ఎత్తులో ఉన్నాయి. ఈ అంగాలలో గర్భగృహం అన్నింటి కన్నా ఎత్తులో ఉన్నది. ఈ అంగాలన్నీ ఎత్తైన అధిష్టానంపై నిర్మించబడి ఉన్నాయి. అధిష్టానం మూలలలో పరివార దేవతా గృహాలున్నాయి. గర్భగృహ భాగంలో అన్ని నిర్మాణ అంగాలు సప్తాంగ విధానంలో ఉన్నాయి. కుడ్య భాగం శిల్పాలతో అలంకృతమైంది. శిఖరం చుట్టూ లఘు శిఖరాలున్నాయి. శిఖరాలపైన జంట ఆమలక శిలలున్నాయి. గర్భగృహంపై రేఖా శిఖరముండగా, గర్భగృహం ముందు భాగాలపై పిరమిడ్ ఆకృతిలో శిఖరాలున్నాయి. మండప స్తంభాలు శిల్పాలతో అలంకృతమైంది.

చందేలులు తమ రాజధాని నగరమైన ఖజురహోలో నిర్మించిన దేవాలయాలు, వాటిపై మలచబడిన శిల్పాలు నేడు ప్రపంచ ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఇచటి ఆలయాలను చందేల రాజులు క్రీ.శ. **950 - 1150** మధ్య కాలంలో నిర్మించారు. వీటిలో పేర్కొనదగినవి మాంతగేశ్వరాలయం, లక్ష్మణుడి ఆలయం, విశ్వనాథ ఆలయం, కందరియా మహాదేవాలయం.

ఖజురాహోలో ప్రథమంలో నిర్మించిన ఆలయాల్లో మాతంగేశ్వరాలయం ఒకటి. ఇది క్రీ.శ. **10**వ శతాబ్ధం తొలిపాదంలో నిర్మించబడింది. ఈ ఆలయ గర్భగడిలో శివలింగం వుంది. ఈ ఆలయం నేటికీ పూజలందు కొంటున్నది. లక్ష్మణుని గుడిని క్రీ.శ. **930 - 950** మధ్యకాలంలో యశోవర్మ నిర్మించాడు. ఇది పంచాయతనలోని సాధారణరీతికి చెందినది. ఈ ఆలయం గర్భగుడిలో విష్ణుమూర్తి విగ్రహం ఉంది. ఈ ఆలయంలో మానవ నిత్యజీవిత కృత్యాలన్నీ శిల్పాల రూపంలో కనిపిస్తాయి. ఖజురహోలోని విశ్వనాధాలయం పంచాయతనరీతిలో నిర్మించబడింది. ఈ ఆలయం మొత్తం అందమైన శిల్పాలతో అలంకృతమైంది. ఈ శిల్పాలలో శృంగార శిల్పాలు కనిపిస్తాయి. ఈ ఆలయం క్రీ.శ. **1002** లో నిర్మించబడింది.

ఖజురాహోలోని ఆలయాల్లో వాస్తుపరంగా, శిల్పపరంగా అద్భుతమైన ఆలయం కందరియా మహాదేవ ఆలయం. ఈ ఆలయం **109** అడుగుల పొడవు, **60** అడుగుల వెడల్పు, **88** అడుగుల ఎత్తు కలిగి వుంది. ఈ ఆలయం మధ్యభారత నిర్మాణరీతికి చక్కటి తార్కాణం. ఈ ఆలయ శిఖరాలు ఒక శిఖరంపైన మరొకటిగా ఆకాశాన్ని తాకుతున్నట్లు కనిపిస్తాయి. ప్రధాన శిఖరాన్ని ఆనుకొని లఘు శిఖరాలు **84** ఉన్నాయి. ఈ ఆలయ ప్రధాన అంగాలు అర్ధ మండపం, మండపం, మహామండపం, అంతరాళం, గర్భగృహం. గర్భగృహం చుట్టూ ప్రదక్షిణాపథం ఉంది. దేవాలయ బయటి గోడల చుట్టూ అంచెలంచెలుగా శిల్పాలు అత్యంత రమ్యంగా చెక్కబడి ఉన్నాయి. దేవాలయం లోపలి భాగంలో కూడా శిల్పాలున్నాయి.

ఖజురాహో ఆలయ సముదాయంలో ఇంకా చెప్పుకోదగిన దేవాలయాలు చౌషట్ యోగిని ఆలయం, లాల్ గుయాన్, వరాహాలయం, పార్వతీ ఆలయం, చిత్రగుప్తుని ఆలయం, జగదాంబాలయం, బహ్మాలయం, వామనాలయం, ఆదినాధ ఆలయం, పార్శ్వనాధాలయం మొదలగునవి.

ఖజురాహో దేవాలయాలపై అద్భుత శిల్ప సంపద ఉంది. ఈ శిల్పాలు స్తంభాలపైన, గోడలపైన, వితానంలో ఉన్నాయి. ఈ శిల్పాలలో దేవతా విగ్రహాలు, పరివార దేవతా విగ్రహాలు, దిక్పాలకుల విగ్రహాలు, అప్సరసల విగ్రహాలు, నాట్యగత్తెలు, సంగీతకారులు, వేటగాళ్ళు, జంతువులు, యోధులు, అధ్యాపకులు, శిష్యులు మొదలైనవారి శిల్పాలు, మిధున శిల్పాలు, స్త్రీ పురుషులు కలసివున్న శిల్పాలు, కామక్రీడల భంగిమలు, శృంగార భరిత శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాల ద్వారా నాటి వస్త్రాలంకరణ, ఆభరణాలు గ్రహించవచ్చు.

### 15.3.8 సమీక్ష :

నాగర లేక ఔత్తరాహిక రీతిలోని మధ్యభారత సాంప్రదాయానికి ఖజురాహో ఆలయాలు చక్కటి తార్కాణాలు. ఈ ఆలయాలపై గల శిల్ప సంపద ప్రపంచ ప్రజలను ఆకర్షిస్తున్నది. నాగర శైలి ఖజురహోలో పరాకాష్ఠ చెందింది.

## 15.4 గుజరాత్, రాజస్థాన్‌లలో గల దేవాలయాలు :

గుజరాత్‌లో అనిహిల్ వాడ్ రాజధానిగా చేసుకొని సోలంకి రాజులు క్రీ.శ. 10 - 13 శతాబ్దాలలో పరిపాలించినారు. వీరు నాగరశైలిలో అనేక దేవాలయాలను నిర్మించారు. క్రీ.శ. 6వ శతాబ్దంలో ప్రారంభమైన గుజరాత్ నిర్మాణశైలి సోలంకీరాజుల కాలంలో మహోన్నత శిఖరాలను అందుకున్నది. గుజరాత్‌లోని దేవాలయాలను సోలంకీలకు పూర్వపు ఆలయాలు, సోలంకీల కాలపు ఆలయాలు అని రెండు భాగాలుగా విభజించవచ్చు.

### 15.4.1 సోలంకీ పూర్వదేవాలయాలు :

గుజరాత్ ప్రాంతంలో నేటికీ నిలిచి వున్న దేవాలయాల్లో మొదటిది క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన జామ్‌నగర్ జిల్లాలోని గోవ్ దేవాలయం. ఈ ఆలయం అంతస్తుల రీతిలో ఉంది. గర్భగృహ వేదిక భాగంలో దేవ కోష్ఠాలున్నాయి. వీటిలో ప్రతిమలున్నాయి. కుడ్య భాగం అలంకారరహితం. కుడ్యంపై పిరమిడ్ ఆకారంలో శిఖరం ఉన్నది. ఈ శిఖరం ముఖభాగంలో చైత్యాలున్నాయి. వీటిలో ఆశీన గణేశ, పార్వతుల శిల్పాలున్నాయి. సౌరాష్ట్రంలో గోవ్ ఆలయరీతిలో సుమారు 50 ఆలయాలున్నాయి. వీటిలో జునాఘడ్ జిల్లా మియాని ప్రాంతంలోని హర్షత్ మత ఆలయం, భనసార దేవాలయం, భీమేశ్వరాలయం, బిలేశ్వర దేవాలయం, జాంనగర్ జిల్లాలోని పిండర, నవిద్రవిడ్ దేవాలయాలు, ముఖ్యమైనవి. ఇవి క్రీ.శ. 6వ శతాబ్దం నుంచి కాలక్రమంలో నిర్మించబడ్డాయి. ప్రభాస్ పటన్ దగ్గరలోని కద్వార్ లోని వరాహి దేవాలయం క్రీ.శ. 7వ శతాబ్దానికి చెందినది.దీనికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, ప్రవాణం ఉన్నాయి. ప్రభాస్‌పటన్ దగ్గరలోని సుత్రపాదలోని సూర్యాలయానికి నాగర శిఖరముంది. ఇది క్రీ.శ. 8వ శతాబ్దినాటిది. క్రీ.శ. 8వ శతాబ్దానికి చెందిన దేవాలయాల సమూహం సబర్ కాంత జిల్లాలోని రోడ్ ప్రాంతంలో ఉన్నది. వీటికి త్రిరథ లేక పంచరథ గర్భగృహం, ప్రవాణం, కొన్నింటికి మండపం ఉన్నాయి. ప్రభాస్ పటాన్ దగ్గరలోని భీమనాథ వద్ద గల సూర్యదేవాలయం, జామ్‌నగర్ దగ్గర గల భిమ్రాన్ దేవాలయం క్రీ.శ. 9వ శతాబ్దినాటివి.

### 15.4.2. సోలంకీ కాలపు దేవాలయాలు - మొధేర :

సోలంకీ వంశస్థుల దేవాలయాలు నాగరరీతిలోనే ఉన్నప్పటికీ, రాజస్థాన్ ఆలయాలరీతికి దగ్గరగా వున్నాయి. వీరి ఆలయాలకు గర్భగృహం, అంతరాళం, ప్రవాణం ఉన్నాయి. పెద్దపెద్ద దేవాలయాలలో స్తంభరహిత హాలు ఉంది. హాలు ముందు తోరణ ద్వార ప్రవేశం ఉంది. వీరి ఆలయాల్లోని కొన్ని హాలులలో అందమైన స్తంభాలు, విల్లు ఆకారపు పైకప్పు, తోరణాలు ఉన్నాయి. వీరి ఆలయాలకు అధిష్ఠానం, కుడ్యం, కపోతం, శిఖరం అను విభాగాలు కలవు.

గుజరాత్‌లో మోహ్‌సాన జిల్లాలో పటాన్‌కు 30 కి.మీ. దూరంలో మొధేరలో సోలంకీలు క్రీ.శ. 1026 ప్రాంతంలో నిర్మించిన సూర్యదేవాలయముంది. ఎత్తైన అధిష్ఠానంపై నిర్మించబడిన ఈ ఆలయానికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, మండపం, ప్రవాణం అను అంగాలు గలవు. విడిగా సభా మండపం, తోరణద్వారం, పరివార దేవతాగృహాలు, పుష్కరిణి గలవు. మండప స్తంభాలు ఎత్తుగా అలంకారాలతో ఉన్నాయి. నాల్గువైపులా నాల్గుతోరణ ద్వారాలున్నాయి. ప్రభాస్ పటాన్ వద్ద గల రుద్రేశ్వరాలయం సూర్యదేవాలయరీతిలోనే వుంది. క్రీ.శ. 11వ శతాబ్దంలో సోలంకీలు నిర్మించిన దేవాలయాలు గోరడ్, సందేర్, ధినోజ్, దేల్‌మల్, మాద్రోపూర్, పవాఘర్‌లలో గలవు.

ప్రభాస్‌పటాన్ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన సోమనాథ దేవాలయం నిర్మింపబడింది. దీనిని క్రీ.శ. 10వ శతాబ్దంలో కుమారపాలుడు నిర్మించాడు. దీనిని గజనీ మహమ్మద్ క్రీ.శ. 1026లో ధ్వంసం చేయగా మొదటి భీమరాజు పునర్నిర్మించాడు. భారతదేశంలోని పవిత్ర ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఇది ఒకటిని భావిస్తున్నారు. ఈ ఆలయానికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, మండపం, మూడు ప్రవేశ మార్గాలు కలవు. గుజరాత్‌లో మెహ్‌సన జిల్లా సునక్ వద్ద నీలకంఠ మహాదేవాలయం ఉంది. ఈ ఆలయంలో ఒకే అధిష్ఠానంపై గర్భగృహం, మండపం, అర్ధమండపం గలవు. గర్భాలయశిఖరం లఘు శిఖరాలలో , ఆమలక ద్వయంలో అలరారుతుంది. మండప పార్శ్వాలలో కక్షాసనాలు గలవు. ఆలయ స్తంభాలు, గోడలు అద్భుత శిల్పాలతో అలంకృతమైంది.

మోహ్‌సాన్ జిల్లాలోని వలం ప్రాంతంలోని శ్రీకృష్ణదేవాలయం, సురేంద్రనగర్ జిల్లాలోని సేజక్‌పూర్‌లోని నవలఖదేవాలయం, మోహ్‌సాన్ జిల్లాలోని శిద్దాపూర్ జిల్లాలోని రుద్రమాల దేవాలయం, అహమదాబాద్ జిల్లాలోని వీరంగం ప్రాంతమందలి దేవాలయం క్రీ.శ. 12వ శతాబ్ధం నాటివి. నవలఖ దేవాలయం లోపల, వెలుపల అద్భుత శిల్పాలతో నిండి ఉంది. రుద్రమాల దేవాలయాన్ని జయసింహుడు నిర్మించాడు. ఈఆలయంలో 11 పరివార దేవతా గృహాలున్నాయి. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, రెండు వసారాలు, ఒక తోరణం ఉన్నాయి.

సోలంకీ వంశస్థులు నిర్మించిన చివరిదశ దేవాలయాలు చాలావరకు జైనమత సంబంధమైనవి. ఇవి సౌరాష్ట్రలోని శత్రుంజయ, గిర్నార్ పర్వతాల్లో ఉన్నాయి. జైన మంత్రి వాస్తుపాలునిచే నిర్మించబడ్డ జునాఘడ్‌లోని గిర్నార్ ప్రాంతంలో గల మూడు గృహాల ఆదినాధ ఆలయం అద్భుత నిర్మాణం. కుమారపాలుని తరంగ ప్రాంతంలోని జైన దేవాలయం, రాణక్‌పూర్ జైన ఆలయాలు ఆఖరిదశకు చెందిన సోలంకీల ఆలయాలు.

### 15.4.3. రాజస్థాన్‌దేవాలయాలు - మౌంట్ ఆబూ :

రాజస్థాన్ ప్రాంతంలో నిర్మించబడ్డ ఆలయాలలో ఝలవార్ జిల్లాలోని చంద్రభాగ ప్రాంతంలోని శీతలేశ్వర దేవాలయం మొట్టమొదటిది. ఇది క్రీ.శ. 7వ శతాబ్దినాటిది. దీనికి గర్భగృహం, అంతరాళం, మండపం ఉన్నాయి. కుడ్యం కుడ్య స్తంభాలతో, దేవకోష్టాలతో కూడి ఉంది. గర్భగృహం ద్వారంపై గంగా, యమున శిల్పాలున్నాయి. కోట జిల్లాలోని కన్సువ ప్రాంతంలోని శివాలయం, జైపూర్ జిల్లాలోని అబనేరిలోని హర్షత్‌మత దేవాలయం క్రీ.శ. 8వ శతాబ్దినాటివి. వీటి గర్భగృహాలు పంచరథరీతిలో ఉన్నాయి. అబనేరి ఆలయదేవకోష్టాలలో వాసుదేవ, విష్ణు, ప్రద్యుమ్న, బలరామ, సంకర్షణ శిల్పాలు గలవు. జోద్‌పూర్ జిల్లాలోని ఓసియన్ యందు 18 ఆలయాలు గలవు. ఇవన్నీ పంచాయతనరీతిలో ఉన్నాయి. ఆలయాలపై నరసింహ, త్రివిక్రమ, వరాహ, విష్ణు, హరిహర, గణేశ, సూర్య, చంద్ర, రేవంత, బ్రహ్మ, పార్వతి శిల్పాలున్నాయి. ఒక దేవాలయంలో రుషులు, అప్సరసల శిల్పాలున్నాయి. కొన్ని ఆలయాలపై కృష్ణలీలల శిల్పాలున్నాయి. ఇచటి తొలి ఆలయాలకు గర్భగృహం, అంతరాళం, మండపం, ప్రవాణం అను అంగాలు గలవు. మండపం నవరంగరీతిలో ఉండేది. గర్భగృహ ద్వారంలో నాగశిల్పాలున్నాయి. ప్రవాణ స్తంభాలపై అనేక శిల్పాలు గలవు. ఓసియన్ ఆలయాల్లో హరిహర ఆలయం లోని హాలుపై కప్పు విల్లువంపు ఆకారంలో ఉంది. గర్భగృహం దీర్ఘచతురస్రాకారంలో వుండి పైన బండి గూడు ఆకారంలో కప్పు ఉంది. ఓసియన్ లోని మహావీర ఆలయానికి గర్భగృహం, ప్రదక్షిణాపథం, అంతరాళం, హాలు వసారాలు ఉన్నాయి. దీనిని ప్రతీహార వత్సరాజు నిర్మించాడు. ఈ ఆలయ శిఖరంలో మూడువరుసల లఘుశిఖరాలున్నాయి. ఈ ఆలయంలోని పరివార దేవతా గృహాలు తరవాత కాలానికి చెందినవి. చితోర్‌ఘర్‌లో క్రీ.శ. 8వ శతాబ్దినాటి కలికమఠ, కుంభశ్యామ దేవాలయాలున్నాయి. జోధ్‌పూర్ జిల్లాలోని బుచ్‌కళ్‌లో గల శివవిష్ణువుల జంట దేవాలయం, మార్వార్ ప్రాంతంలోని ఆవలోని కామేశ్వర దేవాలయం, శిరోహి జిల్లాలోని వర్మన్ వద్ద గల సూర్య దేవాలయం క్రీ.శ. 9వ శతాబ్దినాటివి.

ఉదయపూర్ జిల్లాలోని జగత్ ప్రాంతంలో గల అంబిక మఠ దేవాలయం పరిణితి దశకు చెందిన దేవాలయం. ఇది క్రీ.శ. 10వ శతాబ్దినాటిది. దీనికి పంచరథ శిఖరం, 17 లఘుశిఖరాలు గలవు. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, మండపం, ప్రవాణం ఉన్నాయి. ఈ ఆలయం కుడ్యం శిల్పాలతో అలంకృతమైంది. హాల్దిఘాట్ ప్రాంతంలో గల ఉన్వాస్‌లో దుర్గాలయం ఉంది. ఉదయపూర్ జిల్లాలో ఏకలింగజి ప్రాంతంలో లకాలీశ దేవాలయం, నాగ్దలోసాన్ బహు అనే జంట వైష్ణవాలయాలు ఉన్నాయి. సాన్ బహు ఆలయానికి పంచరథ గర్భగృహం, అంతరాళం, మండపం, ప్రవాణాలు గలవు. దీనిచుట్టూ పరివార దేవాతాగృహాలున్నాయి.

క్రీ.శ. 12వ శతాబ్దం నుంచి రాజస్థాన్ దేవాలయరీతి క్రమంగా తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి గుజరాత్ రీతిలో కలిసిపోయింది. ఈ పరిణామం క్రీ.శ. 10వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. ఈ శతాబ్దానికే ఆబు ప్రాంతం సోలంకీల ఆధీనం కిందికి వచ్చింది. క్రీ.శ. 11వ శతాబ్దినాటి బనస్కాంత జిల్లాలోని కుంభరి యజిలోని జైనదేవాలయాల సమూహం దిల్వాలా, మౌంట్ ఆబూ దేవాలయాలకు

మార్గదర్శకమైంది. ఇవి పాలరాతి నిర్మాణాలు, ప్రతి ఆలయానికి పంచరథ గర్భగృహం, అంతరాళం, మండపం, స్తంభ వసారా ఉన్నాయి. శిఖరం లఘు శిఖరాలతో కూడి ఉంది. మండపం పైకప్పు గుండ్రంగా ఉంది.

సోలంకీ రీతి వాస్తుశిల్పకళ మౌంట్ ఆబూ యందలి దిల్వారా జైన ఆలయాల సమూహంలో తారస్థాయికి చేరుకొన్నాయి. వీటిలో విమలవాసహి, లూన వాలహి ఆలయాలు ముఖ్యమైనవి. విమలవాసహి క్రీ.శ. 11వ శతాబ్దంలో, లూనావాసహి క్రీ.శ. 13వ శతాబ్దిలో నిర్మించబడ్డాయి. ఈ రెండు ఆలయాలకు గర్భగృహం, అంతరాళం, స్తంభ వసారా, సభా మండపం ఉన్నాయి. వీటి చుట్టూ పరివార దేవతా గృహాలుగల స్తంభాల వసారా ఉంది. విమలవాసహి ఆలయాన్నే ఆధినాధ ఆలయమంటారు. దీనిలోని స్తంభాలు, వితానం పలురకాల శిల్పాలతో అలంకరించబడింది. సభామండపంలో పృధ్వీపాల, విమల శిల్పాలున్నాయి. ఈ ఆలయంలో విద్యాదేవీలు, దేవదేవీలు, సంగీత నృత్యకారులు, అశ్వారూఢులు మొదలగు శిల్పాలు గలవు.

## 15.5 ఒరిస్సా దేవాలయాలు :

### 15.5.1 పరిచయం :

నేటి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలు, ఒరిస్సా రాష్ట్రంలోని బరంపురం, గంజాం జిల్లాలు కలసిన ప్రాంతాన్ని ప్రాచీన కాలంలో కళింగ రాజ్యమంటారు. ఈ ప్రాంతంలో దేవాలయ వాస్తుకళలో పరిణతి చెందిన ఒక ప్రత్యేకమై శైలి వృద్ధి చెందింది. దీనినే కళింగశైలి అని అంటారు. ఈ శైలిలో నిర్మించిన ఆలయాలు ముఖ్యంగా ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్, పూరి, కోణార్కలలో , ఆంధ్రప్రదేశ్‌లో ముఖలింగంలో (శ్రీకాకుళంజిల్లా) కనిపిస్తాయి. ఈ ఆలయాలన్నీ తూర్పుగాంగుల కాలంలో క్రీ.శ. 7 - 13 శతాబ్దాల మధ్య కాలంలో నిర్మించబడ్డాయి.

### 15.5.2 లక్షణాలు :

కళింగశైలి లేదా ఒరిస్సారీతి తొలి దేవాలయాలు 'దేవుల్ '(గర్భగృహం), 'జగమోహన' (చతురస్రాకార మండపం) అను రెండు అంగాలను కలిగి ఉన్నాయి. గర్భగృహంపైన ఎతైన 'రేఖాశిఖరం' ఉంటుంది. ఇది అనువృత్తాకారంలో ఉంటుంది. శిఖరంపైన అమలక శిల (గుమ్మడికాయ ఆకారంలో శిల) ఉంటుంది. మలిదశ దేవాలయాలలో జగమోహన, నాట్యమండపం, భోగమండపం నిర్మించబడింది. దేవాలయ అధిష్టానాన్ని పిష్ట అంటారు. అధిష్టానంపై గల ఆలయగోడ భాగాన్ని 'బాద' అని, దానిపై నిర్మించబడే శిఖరభాగాన్ని, 'మస్తక్' అని అంటారు. 'బాద' అనే భాగంలో క్రింది నుండి వరసగ పభాగ, జంఘ, బరందా అనే ఉపభాగాలున్నాయి. ' గండి ' ని ' బాద ' నుండి ' బరందా ' వేరు చేస్తున్నది. ఒరిస్సా దేవాలయాలలో జగమోహన నాట్యమందిరం, భోగమండపాలపై ' పిఢాదేవులు ' అను శిఖరాలుంటాయి. శిఖరం అగ్రభాగంలో బండిగూడు ఆకృతిలోని విమానమున్న ఆలయాన్ని 'ఖాకరాదేవులు' అంటారు. స్తంభాలు లేకపోవడం, ఆలయాల లోపలి భాగంలో శిల్పాలంకరణ లేకుండా, ఆలయం వెలుపల అలంకరణ ఉండడం ఒరిస్సా ఆలయాల కుండే ప్రత్యేక లక్షణాలు.

ఒరిస్సా దేవాలయాలలో ప్రసిద్ధమైనవి భువనేశ్వర్‌లోని పరశురామేశ్వరాలయం, వైతాల్ దేవాలయం, ముక్తేశ్వరాలయం, రాజారాణి, లింగరాజ దేవాలయాలు, కోణార్కలోని సూర్యదేవాలయం, పూరిలోని జగన్నాథాలయం, ముఖలింగంలోని ఆలయాలు.

### 15.5.3. భువనేశ్వర్ :

కళింగశైలికి భువనేశ్వర్ అత్యుత్తమ కళాకేంద్రం. ఇచట దాదాపు వంద ఆలయాలున్నాయి. వీటిని శైలోద్భవులు. భౌమాకార వంశపు రాజులు, సోమవంశరాజులు, గాంగరాజులు నిర్మించారు. ఒరిస్సాలో భువనేశ్వర్‌లోని పరశురామేశ్వరాలయం క్రీ.శ. 650 ప్రాంతంలో నిర్మించబడింది. ఈ ఆలయంతో కళింగశైలి ప్రారంభమవుతుంది. ఈ దేవాలయంలో దేవుల్, జగమోహన అను రెండు భాగాలు గలవు. గర్భగృహం త్రిరథ రీతిలో నిర్మితమైంది. తరవాత కాలంలో దేవుల్ ముందు జగమోహనం నిర్మితమైంది. దీని కుడ్య కోష్టాలలో విష్ణు, శివుడు, పార్వతి, అర్ధనారీశ్వర, దిక్పాలకులు, ఇంద్ర, వరుణ, యముడు, వాయువు మొదలగు శిల్పాలు గలవు. గర్భగృహద్వారంపై నవగ్రహ శిల్పాలు మలచబడింది.

భౌమాకార వంశరాజుల కాలంలో క్రీ.శ. 8వ శతాబ్దం చివరిభాగంలో వైతాల్ దేవాలయం నిర్మించబడింది. ఈ ఆలయం చాముండికి అంకితం చేయబడింది. గర్భగృహం దీర్ఘచతురస్త్రాకారంలో వుంది. దీని విమానం బండిగూడు ఆకారంలో వుంది. జగమోహనం నాల్గు మూలల్లో రేఖావిమానం గల త్రిరథ అల్పప్రాసాదాలున్నాయి. దేవులు కుడ్యాలు కుడ్య స్తంభాలతో, దేవకోష్టాలతో అలంకృతమై ఉన్నాయి. ఈ కోష్టాలలో అష్టభుజి, మహిషాసుర మర్ధని, చతుర్భుజ పార్వతి, అర్ధనారీశ్వర మొదలగు శిల్పాలున్నాయి. ఒరిస్సా దేవాలయాలలో ఎక్కువగా కన్పించే శృంగార శిల్పాలు ఈ ఆలయంలోనే మొట్టమొదటిసారిగా రూపొందించబడ్డాయి.

క్రీ.శ. 950లో నిర్మితమైన ముక్తేశ్వరాలయం 'ఇసుకరాతిలో ప్రతిఫలించిన స్వప్న సౌథం' అని గంగూలి పండితుడంటాడు. ఈ ఆలయం దేవుల్ పంచరథ నమూనాలో నిర్మించబడింది. దీనిపై రేఖాశిఖరం ఉంది. జగమోహనం మీద పిఢాదేవుల్ వుంది. ఈ ఆలయ ప్రవేశ ద్వారం తోరణంలా రూపొందించబడింది. దేవుల్, జగమోహనం ప్రవేశ ద్వారాలకిరువైపులా గంగ, యమున శిల్పాలు గలవు. దేవుల్ కుడ్యాలపై మలచబడిన నాయికలు, నాగ, నాగినులు, గజసింహాలు ఒరిస్సాశైలికి చక్కని తార్కాణాలు. జగమోహనం వితాన భాగంలో అష్టదళ పద్మం ఉంది.

భువనేశ్వర్‌లోని ఆలయాలలో రాజారాణి ఆలయం పరిణతదశకు చెందిన ఆలయం. ఈ ఆలయ నిర్మాణానికి రాజారాణియ అను పసుపు ఇసుకరాతిని ఉపయోగించారు. ఈ ఆలయం క్రీ.శ. 11వ శతాబ్ది ఆరంభంలో నిర్మితమైంది. ఆలయ గర్భగృహం చతురస్త్రాకృతిలో ఉంది. ఆలయ శిఖరం కొంతవరకు ఖజురాహో ఆలయాలను పోలిఉంది. శిఖరం చుట్టూ లఘు శిఖరాలు గలవు. గర్భగృహకుడ్యాలపై రాజప్రతినిధుల శిల్పాలు, మదన శిల్పాలు గలవు. జగమోహన కుడ్యస్తంభాల దిగువున గజసింహాలు, పైన నాగాల శిల్పాలున్నాయి.

నాగరశైలిలో ఒరిస్సా సాంప్రదాయంలో నిర్మితమైన ఆలయపు పూర్ణస్వరూపం లింగరాజాలయంలో కన్పిస్తుంది. ఈ ఆలయంలో దేవుల్, జగమోహనం, నాట్య మందిరం, భోగమందిరం అను అంగాలు గలవు. దేవుల్, జగమోహనం పంచరథ పద్ధతిలో మొదట నిర్మితంకాగా, నాట్య, భోగమందిరాలు తరవాత కాలంలో నిర్మితమైంది. దేవుల్ పై రేఖాశిఖరం ఉంది. దేవుల్, జగమోహనం అను రెండు భాగాలకు పిష్ఠ , బాద, గండి, మస్తకం అను నాల్గు ప్రధాన విభాగాలు గలవు. జగమోహనంపై పిరమిడ్ ఆకృతిలో శిఖరముంది. గర్భగృహంపై వ్యాళములు, గజసింహులు, నాయికల శిల్పాలు గలవు. ఈ ఆలయ ప్రాంగణంలో అనేక చిన్న చిన్న బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ దేవాలయాలున్నాయి. ఈ ఆలయంలో మతపరమైన, లౌకికమైన శిల్పాలు అందంగా తీర్చిదిద్దబడింది.

### 15.5.4. పూరి :

భువనేశ్వర్‌కు 64 కి.మీ. దూరంలో సముద్రపు ఒడ్డున గల పూరి జగన్నాథాలయం ప్రపంచ వ్యాప్తంగా యాత్రికులను ఆకర్షిస్తుంది. ఈ ఆలయ నిర్మాణం క్రీ.శ. 7వ శతాబ్దంలో ప్రారంభమై 10వ శతాబ్దం వరకు కొనసాగింది. క్రీ.శ. 12వ శతాబ్దంలో చోడ గంగరాజు అనంతవర్మ చోడగంగ దేవుడు పూరి జగన్నాథ మందిరాన్ని అన్నిహంగులలో మెరుగులు తీర్చిదిద్దాడు. ఈ ఆలయంలో దేవుల్, జగమోహనం, నాట్యమందిరం, భోగమండపం ఉన్నాయి. ఈ ఆలయ ప్రవేశానికి నాలుగువైపులా నాల్గు ద్వారాలున్నాయి. తూర్పువైపున ఉన్న ప్రధాన ముఖద్వారం ముందు 10 మీటర్ల ఎత్తులో 16 కోణాల అరుణ స్తంభం ఉంది. ఈ స్తంభం కోణార్క సూర్యదేవాలయానికి చెందినది. ఈఆలయంలో మొత్తం 30 మందిరాలున్నాయి. ప్రధాన గర్భగుడిలో కర్రతో మలచిన జగన్నాథుడు, అతని సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్ర విగ్రహాలున్నాయి.

### 15.5.5. కోణార్క :

కళింగశైలి కోణార్క సూర్యదేవాలయంలో మహోన్నత శిఖరాలనందుకొంది. భువనేశ్వర్‌కు 66 కి.మీ. దూరంలో సముద్ర తీరాన కోణార్క ఉంది. ఈ ఆలయాన్ని ఒరిస్సాను పాలించిన మొదటి నరసింహవర్మ (క్రీ.శ. 1238 -64) గండ శిలలతో నిర్మించినాడు. ఈ ఆలయాన్ని 'నల్ల ఆలయ'మని ఆంగ్లేయులు పిలిచారు. ఈ ఆలయ ప్రధాన అంగాలు గర్భగృహం, జగమోహనం, నాట్యమండపం,

భోగమండపం. వీటిలో గర్భగృహం, జగమోహనం ఒక రేఖపై ఉండగా, నాట్యమండపం కొంత దూరంలో నిర్మించబడింది. భోగమండపం ప్రక్కనే నిర్మితమైంది. నేడు ఈ ఆలయం శిథిలమైపోయింది. ఒక్క జగమోహనం మాత్రం మిగిలిఉంది. దేవుల్, జగమోహనం పంచరథ నమూనాలో నిర్మితమైనాయి. అంతేగాక, ఇదంతా ఒక రథంపై భాగంగా తీర్చిదిద్ది, క్రింది భాగాన 12 జతల చక్రాలు అమర్చి, దేవాలయాన్నంతటని సప్తాశ్వాలు లాగుతున్నట్లు అద్భుతంగా రూపొందించబడింది. ఆలయ అధిష్టానం దిగువుగా చక్రాల క్రింద గజశ్రేణి శిల్పీకరించబడింది. ఆలయ గోడల మీద గుర్రాలు, ఏనుగులు, స్త్రీ నృత్య, నాట్య, భంగిమలు, శృంగార భరిత శిల్పాలు మలచబడ్డాయి.

**15.5.6. ముఖలింగం :**

శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదీతీరాన ముఖలింగం ఉంది. ఇది కళింగ గాంగుళ రాజధాని. ఇచట గాంగరాజులు అనేక అద్భుత ఆలయాలు నిర్మించారు. వాటిలో ముఖ్యమైనవి, మధుకేశ్వర, భీమేశ్వర, సోమేశ్వరాలయాలు. మధుకేశ్వరాలయంలో మూలప్రాసాదం, అంతరాళం, ముఖశాల గలవు. ముఖశాలకు నాలుగు మూలల నాల్గు నిర్మాణాలు గలవు. ఇవి రేఖారీతికి చెంది ఎక్కువగా అలంకరించబడి ఉన్నాయి. ఆలయ ప్రధాన శిఖరం పిఢా పద్ధతికి చెందినది. ఆలయ కుడ్యంపై గల దేవకోష్టాలలో మహిషమర్దిని, గంగ, యమున, సూర్య , ఉమామహేశ్వరులు, కార్తికేయుడు, దుర్గ, గణేశ విగ్రహాలున్నాయి. ఆలయ తూర్పు ద్వారానికిరువైపులా సారభంజికలు, లతాపత్రాలు అలంకరించబడిఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో ఎనిమిది పరివార ఆలయాలున్నాయి. వీటిలో ఆరు రేఖారీతిలో గలవు. రెండు పిఢా పద్ధతిలో ఉన్నాయి. సోమేశ్వరాలయంలో నేడు గర్భగృహం మాత్రమే గలదు. పంచరథ శైలిలో ఉన్న ఈ ఆలయ గర్భగృహంలో ఒక వేదిబంధముంది. కుడ్యభాగంలో గంగ, యమున, కార్తికేయ, హరిహర, అర్ధనారీశ్వర, గణేశ, లకులీశ, శివ మొదలైన విగ్రహాలు గలవు.

## 15.6. సారాంశము :

ఔత్తరాహిక రీతికి సంబంధించిన ఒక ప్రత్యేకమైన ప్రాంతీయరీతిలో ఒరిస్సాశైలి ప్రాధాన్యతను సంతరించుకొంది. ఒరిస్సా ఆలయాలలో వాస్తు కళ, శిల్పకళ అవినాభావ సంబంధంలో బృహత్తరీతిలో రూపొందాయి. తూర్పు గాంగ రాజులు భువనేశ్వర్, కోణార్క్, పూరి, ముఖలింగం వంటి ప్రాంతాలలో క్రీ.శ. 8 - 13 శతాబ్దాల మధ్య కాలంలో 'కళింగశైలి' పరాకాష్ఠనందుకొంది. తూర్పు గాంగ వంశస్తుల శిల్పి చాతుర్యం కీ.శ. 13 శతాబ్దపు కోణార్క్ ఆలయంలో తారాస్థాయికి చేరుకున్నది. ఆనాటి సంస్కృతిని తెలిపే అనేక శిల్పాలు ఇచట గలవు.

## 15.7. నమూనా ప్రశ్నలు :

1. ఉత్తరభారత దేవాలయాల గురించి సక్షిప్తంగా వివరింపుము.
2. గుప్తుల దేవాలయాల లక్షణాలు తెల్పుము.
3. మధ్యభారత దేవాలయాల ప్రధాన లక్షణాలు సోదాహరణంగా వివరింపుము.
4. గుజరాత్ దేవాలయ వాస్తుశిల్పరీతిని వివరింపుము.
5. ఒరిస్సా ఆలయాల ప్రత్యేకతను వివరింపుము.

**డా ॥ వి.కె.మోహన్**

పాఠం - 16

# శిల్పకళ - ప్రారంభదశ

## 16.0 లక్ష్యం :

భారతీయ శిల్పకళ తొలిదశ గురించి ముఖ్యంగా మౌర్య, శుంగ, కాషాణుల కాలం నాటి శిల్పాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయ సూచిక :


**16.1 పరిచయం**

**16.2 సింధూ నాగరికా కాలపు శిల్పము**

**16.3 వైదిక యుగము**

**16.4 మౌర్యుల కాలపు శిల్పకళ**

**16.4.1 రాజపోషణలోని కళ**

**16.4.2 ప్రజాకళ**

**16.4.3 విమర్శ**

**16.5 శుంగుల కాలపు శిల్పకళ**

**16.5.1 బార్హుత్ శిల్పాలు**

**16.5.2 బోద్‌గయ శిల్పాలు**

**16.6 కుషాణుల నాటి శిల్పకళ**

**16.6.1 గాంధార శిల్పకళ**

**16.6.1.1 లక్షణాలు**

**16.6.1.2 కథా వస్తువు**

**16.6.1.3 కాలం**

**16.6.1.4 శిల్పాలు**

**16.6.1.5 ప్రభావం**

**16.6.1.6 వ్యాప్తి**

**16.6.1.7 పతనం**

**16.7 మధుర శిల్పకళ**

**16.7.1 లక్షణాలు**

**16.7.2 శిల్పాలు**

**16.8 సారాంశము**

**16.9 నమూనా ప్రశ్నలు**

## 16.1 పరిచయం :

దేవాలయాలు, నివాస గృహాలు, పల్లెలు, పట్టణాలు, కోటలు మొదలగువాటి నిర్మాణక్రమం వివరించేది వాస్తు శాస్త్రము. కట్టడాల ఆకృతులు, వాటి నిర్మాణక్రమం వాటి వాటి ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాయి. ప్రాచీన కాలంలో భారతీయులు భవనాలను, ఆలయాలను ఉత్తమంగా నిర్మించడంలోను, వాటిని చాలా శోభాయమానంగా చిత్రకళా ఖండాలతో అలంకరించడంలోను ప్రసిద్ధిగాంచారు. చిత్రకళలో రెండంశాలు ఇమిడి ఉన్నాయి. అవి శిల్పము, చిత్రలేఖనము. వాస్తవానికి వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలు మూడూ ఒకదానికొకటి సంబంధించినవే కాని వేరు కావు. ఈ మూడింటిని భారతీయులు ఎక్కువగా దైవ కార్యార్థమై వినియోగించినారు. అందుచేత ప్రాచీన భారతీయ వాస్తు, చిత్రకాళారీతులు చాలావరకు మత సంబంధమైనవే. భారతదేశం అనేక మతాలకు పుట్టినిల్లు. వీటిలో హైందవము, బౌద్ధము, జైనము ప్రధానమైనవి. ఈ మూడు మతాలు కాలక్రమేణ శాఖోపశాఖలుగా చీలినాయి. ఈ మతశాఖల ఆరాధనాపద్ధతులలోను, దేవగృహ నిర్మాణరీతులలోను భేదాలున్నాయి. ఈ విషయానికి సంబంధించిన గ్రంథాలు అనేకం ఉన్నాయి. వాటిలో మానసార, మయమత, సుప్రభేదాగమ, శిల్పరత్న మొదలగు గ్రంథాలు పేర్కొనదగినవి.

భారతీయ శిల్పం ప్రపంచ శిల్పంలోని ఒక భాగము. శిల్పం ప్రధానంగా రెండు విధాలుగా ఉంటుంది. అవి గుండ్రని శిల్పం, శిల్పఫలకం. గుండ్రని శిల్పాన్ని వెనక వైపుగా కూడా చూడవచ్చు. ఈ శిల్పాలు రాయి, మట్టి, లోహం వంటి పదార్ధంతో రూపొందించ బడింది. ఈ శిల్పాల పరిశీలన ద్వారా నాటి మతం, సంస్కృతి, నాగరిక జీవనం గ్రహించవచ్చు. భారతదేశంలో శిల్ప కళా చరిత్ర సింధులోయ నాగరికతా కాలంలోనే అనగా ఇప్పటికి ఐదు వేల సంవత్సరాలనాడే ప్రారంభమైంది. నిజానికి శిలాయుగాల కాలంలోనే చిత్రలేఖనాలనేకం భారతదేశంలో అనేక చోట్ల బయల్పడినాయి. భారతీయ శిల్పులు దైవమానవ మూర్తులనే గాక, పశుపక్ష్యాదులను, లతలు, పుష్పాలు మొదలగు వాటిని ఎంతో అందంగా తీర్చిదిద్దారు. సాంచీ, బార్హూత, అమరావతి, నాగార్జునకొండ, మహాబలిపురం, కంచి, తంజావూరు, పాలంపేట, బేలూరు, తాడిపత్రి, ఖజూరాహోశిల్పాలు, బాగ్, అజంతా, లేపాక్షి చిత్రాలు ఇందుకు చక్కటి నిదర్శనాలు.

## 16.2 సింధు నాగరికతా కాలపు శిల్పము :

భారతదేశంలో తొలి గొప్ప నాగరికత సింధూనది పరివాహక ప్రాంతంలో వెలసింది. నాటి ప్రజలు నిర్దుష్టమైన వాస్తు సూత్రాలను అనుసరించి నిర్మాణాలు చేశారు. వీరి నిర్మాణాలను పరిశీలిస్తే అవి శిల్పరహితమైనవిగా, ఉపయోగార్థలౌకిక నిర్మాణాలుగా కన్పిస్తాయి. అయితే సింధు త్రవ్వకాలలో శిల, కంచు, మట్టివంటి పదార్థాలతో చేసిన శిల్పాలనేకం బయల్పడాయి. వీటిని పరిశీలిస్తే నాటి ప్రజలు శిల్పకళలో నేర్పరులని స్పష్టమవుతుంది. వీరి శిల్పకళా కౌశల్యానికి తార్కాణాలు మొహంజాదారోలో లభించిన నాట్యకత్తై కాంస్య ప్రతిమ, ధ్యాననిమగ్నుడైన ఒక పురుషపుంగవుని ఊర్ధ్వకాయము, హరప్పాలోని శిలా నిర్మితాలైన మనుషుల మొండేలు రెండు. ఈ మూర్తుల రూప కల్పన, వాటిమీద గల అలంకరణలు అనాటి భారతీయ సంప్రదాయాలను స్ఫురణకు తెస్తున్నాయి. సింధు స్థావరాలలో మట్టి బొమ్మలనేకం కనిపించినాయి. మట్టితో మానవాకారాలు, జంతువుల బొమ్మలు విరివిగా తయారు చేసినారు. జంతువులు బొమ్మలలో కొన్ని సహజత్వం ఉట్టి పడుతూ చూడముచ్చటగా ఉంటాయి. సింధు నాగరికుల కళాత్మక సృష్టిలో వారి ముద్రికలు అతి ప్రసిద్ధమైనవి. అవి స్టియటైట్ అనే మెత్తని రాతితో చేసిన చతురస్రాకారపు బిళ్లలు. వాటికొక వైపు జంతువుల స్వరుపాలు అతిచతురతలో చెక్కిఉంటాయి.

ఒకరకపు ముద్రికలలో డేగభంగిమలో కూర్చున్న మూడు శృంగాలు గల మూర్తీ, దాని చుట్టూ కొన్ని జంతువులున్నాయి. ఈ మూర్తి పుశుపతి శివుడ్ అని సర్‌జాన్ మార్షల్ అభిప్రాయం.

## 16.3 వైదిక యుగము :

సింధు నాగరికత పతనానంతరము మళ్ళీ మౌర్య సామ్రాజ్యమేర్పడేవరకూ చెప్పదగిన వాస్తు శిల్పకళా ఖండాలేమీ కన్పించవు. ఈ నడిమ కాలంలో మట్టి, మట్టి ఇటుకలు, వెదురు, కర్ర, తాటాకులు, దుబ్బు వంటి అశాశ్వత పదార్థాలు గుహ నిర్మాణ సాధనాలుగా ఉండేవి. అందువల్ల ఆనాటి నిర్మాణాలు మనకు లభించటంలేదు. అవి లేకున్నా వాటి నిర్మాణాల వివరాలు రుగ్వేదం, మలివేదాలు, బ్రాహ్మణాలు, సూత్రసాహిత్యం, రామాయణ మహాభారతాలు మొదలైన ప్రాచీన గ్రంథాలను బట్టి తెలుసుకోవడానికి వీలవుతుంది. కాని నాటి శిల్పాలేవీ మనకు లభించలేదు. వేదకాల ప్రజలు అనేక మంది దేవతలను ఆరాధించేవారు అని సాహిత్య ప్రస్తావనలున్నాయి.

## 16.4 మౌర్యుల కాలపు శిల్పకళ :

భారతదేశంలో సమగ్రమైన వాస్తుశిల్పకళా చరిత్ర వాస్తవంగా మౌర్యుల కాలంతోనే ఆరంభమవుతున్నది. మౌర్యులు తొలిసారిగా భారతదేశంలో సువిశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించి, అందులో సుస్థిర పరిపాలనను ప్రవేశ పెట్టినారు. వీరి పోషణలో అనేక నిర్మాణాలు జరిగాయి. వీరు నిర్మాణాలలో దారువు స్థానే శిలను వాడడం ప్రారంభించారు. మౌర్యుల వాస్తుశిల్పకళ సింధు నాగరికతా కాలం నాటి వాస్తుశిల్ప కళ సహజ పరిణామమే అని యస్.కె. సరస్వతి లాంటి చరిత్రకారులు పేర్కొనగా, మౌర్యుల వాస్తుశిల్ప కళలలో గ్రీక్, పారశీక వాస్తుశిల్పరీతుల ప్రభావం కలదని స్మిత్ వంటి పండితులు పేర్కొన్నారు. వాస్తవంగా పరిశీలిస్తే వీటిపై విదేశీ ప్రభావం లేదని, రాజుల పోషణలో రూపొందినవని భావించవచ్చు. అంతేగాక ఈ కాలంలో ప్రజాకళ కూడా రూపొందింది.

### 16.4.1 రాజపోషణలోని కళ :

మౌర్య చక్రవర్తుల పోషణలో రూపొందిన కళాఖండాలలో ప్రధానంగా పేర్కొన వలసినవి అశోకుని ఏకశిలా స్తంభాలు. ఈ స్తంభాలపై గల జంతుశిల్పాలు శిల్పచరిత్రలో ఒక అద్భుతం. అశోకుని 30 స్తంభాలలో ముఖ్యమైనవి బఖేరా, రాంపుర్వ, లౌరియ నందనఘర్, రుమ్మిండై, సాంచీ, సారనాథ్‌లలో గలవు. బఖేరా స్తంభ అగ్రభాగాన సింహపు శిల్పం ఉంది. రాంపుర్వస్తంభంపై వృషభ ప్రతిమ ఉంది. లౌరియ నందనఘర్ స్తంభం పై సింహపు శిల్పం, రుమ్మిండై స్తంభంపై అశ్వం శిల్పం కలదు. సారనాథ్ స్తంభంపైన మాత్రము సింహపు ప్రతిరూపాలు నాలుగున్నాయి. సారనాథ్ సింహ కిరీటాన్ని గురించి స్మిత్ : మాటల్లో 'ప్రాచీన యగం నాటి జంతుశిల్పాలలో దీనికి మించిన శిల్పం మరేదేశంలోను చూడలేము. ప్రతి అణువులోను సహజ సౌందర్యాన్ని, అనంతమైన గాంభీర్యాన్ని విజయవంతంగా జోడించి, దీనిని సమగ్రమైన, సంపూర్ణమైన మనోహర కళాఖండంగా శిల్పి తీర్చిదిద్దాడు'. ఈ సింహ కిరీటాన్నే భారత ప్రభుత్వం చిహ్నంగా స్వీకరించింది. సారనాథ్ స్దంభ ఫలకం పై సింహం, ఏనుగు, వృషభం, అశ్వం శిల్పాలు మలచబడినాయి. ఈ నాలుగు జంతువులను నాలుగు దిక్కులకు రక్షకులుగా బౌద్ధగ్రంథాలు వర్ణిస్తున్నాయి. ఏనుగు తూర్పుదిక్కును, వృషభం పశ్చిమదిక్కుకు, సింహం ఉత్తరానికి, అశ్వం దక్షిణానికి రక్షకులని ఈ గ్రంథాలు పేర్కొంటున్నాయి. వీటిమధ్య ధర్మచక్రం ఉండటం వల్ల నాలుగు దిక్కులా ధర్మాన్ని ఈ జంతువులు కాపాడుతాయని భావించవచ్చు. హిందూ వేదాలలో కూడా ఈ జంతువులకు ప్రత్యేకత ఉంది. సింహం జంతురాజవటం. అశ్వం సూర్యుని రథవాహనమవటం, వృషభం శివునికి, ఏనుగు ఇంద్రుని ప్రతీక అవటం చూస్తే ఈ జంతు శిల్పాలు పవిత్రమత లేదా దైవ చిహ్నాలను సూచిస్తుందని భావించవచ్చు. ఇవి శివుడు, దుర్గ, సూర్యుడు, ఇంద్రుల వాహనాలని వీటిని ఆ దేవతలుగా భావించవచ్చని బ్లోచ్ అంటాడు.

బలిస్సాలోని ధౌళిలో చెక్కిన ఏనుగు శిల్పం మౌర్యుల పరిణతి శిల్పకళకు మరో తార్కాణం. ఇది చెక్కబడిన విధానం ఏనుగు గుహనుంచి బయటకు వస్తున్నట్లుంది. నిర్మాణతలో, గంభీర ఆకృతిలో, అంగసౌష్టవం చూపటంలో, ముఖంలోని మృదువైన భావప్రకటనలో ఈ శిల్పానికి సాటిలేదని నిహరంజన్‌రే అంటాడు. ధౌళి ఏనుగు లాగా రాంపుర్వ వృషభం సహజత్వంతో ఉంది. బరాబర్ కొండల్లో

అశోకుడు తొలిపించిన గుహల కుడ్యభాగాలపైగల నునుపైన పాలిష్ వంటి భాగాలు నాటిశిల్పుల నైపుణ్యాన్ని తెలుపుతున్నాయి. అలాగే అశోకుని ఏకశిలా స్తంభాలను పరిశీలిస్తే అవి లోహంతో తయారయ్యాయా అనిపిస్తుంది. పాటలీపుత్ర భవనాలలోని స్తంభాలకు బంగారు, వెండితో చేసిన మిరుమిట్లు గొలిపే బొమ్మలు, తీగలు, నగిషీలు, అద్దాలుండేవి.

### 16.4.2 ప్రజాకళ :

ప్రజాకళకు యక్ష, యక్షిణి శిల్పాలు, మట్టిబొమ్మలు ముఖ్యసాక్ష్యాలు. ఆనాడు యక్షపూజలు జరుగుతూ ఉండేవనడానికి పర్కాం యక్ష శిల్పము, దీదర్ గంజ్, బేస్ నగర్‌లలోని యక్షిణి శిల్పాలు తార్కాణాలు. ఇవి శిలా ప్రతిమలైనప్పటికి కర్మబొమ్మల వలె ఉంటాయి. ఇవి జీవం లేక స్థూలకాయాలతో కన్పిస్తాయి. అయితే దీదల్ గంజ్ యక్షిణి ప్రతిమలో కొంత వరకు స్త్రీ సహజమైన మృదుత్వం కనిపిస్తుంది. ఈ యక్ష, యక్షిణీ ప్రతిమలు తరవాత కాలపు శిల్పరీతులకు కొంతవరకు మార్గ దర్శకమైనాయి. లోహినీ పూర్‌లో లభించిన జైన తీర్థంకరుల విగ్రహాలు ఈ వర్గానికి చెందినవే. ఈ కాలపు మట్టి బొమ్మలు తక్షశిల, అహిచ్ఛత్రం మొదలగు చోట్ల లభించాయి. తక్షశిలలో దొరికిన మట్టి బొమ్మలలో చారిత్రక ప్రతిమలు, ఉద్దేశిక దేవతా శిల్పాలు, ఆట వస్తువులు, ఆభరణాలు పేర్కొనదగినవి. ఆటవస్తువులలో చక్రాలున్న జంతువులు ఎక్కువగా ఉన్నాయి. అహిచ్ఛత్రంలో అమ్మతల్లి మట్టి బొమ్మలు లభించాయి.

### 16.4.3 విమర్శ :

మౌర్యుల శిల్పకళల విషయంలో పండితుల మధ్య భిన్నమైన ఆభిప్రాయాలున్నాయి. నున్నటి పాలిష్ గల ఈ శిలా స్తంభాలను చూసి లోహంతో ఇవి తయారైనవని బిషప్ హెబర్ భ్రమపడ్డాడు. అశోక స్తంభాలపై పర్షియా శిల్పకళా ప్రభావం ఉందని మార్షల్, స్పూనర్, సెనార్ట్ మొదలైన పాశ్చాత్య పండితులు అభిప్రాయపడినారు. అశోక స్తంభాల్లోని గంటాకార శీర్షిక, వాటిపైగల పాలిష్ పర్షియన్ ప్రభావాన్ని చూపుతున్నాయని వీరి భావన. పాటిలీపుత్ర రాజభవనం పై కూడా పారశీక ప్రభావముందని వీరి అభిప్రాయం. అంతేగాక స్తంభాల పై జంతు శిల్పాలు చూపే పద్ధతి కూడా పారశీక సాంప్రదాయమని వీరి అభిప్రాయం.

మౌర్యుల శిల్పకళలో పారశీక ప్రభావం లేదని అగర్వాల్ వంటి పండితులు అభిప్రాయపడినారు. అందుకు వీరు ఈ కారణాలు తెలుపుతున్నారు. మౌర్యుల శిలా స్తంభాలు ఏకశిలా నిర్మితాలు కాగా పర్షియన్ స్తంభాలు ఏకశిలా నిర్మితాలు కావు. మౌర్యుల స్తంభాలు గుండ్రంగా ఉండగా, పర్షియన్ స్తంభాలు ఫలకల ఆకారంలో ఉంది. అశోక స్తంభాలు బహిరంగ ప్రాంతాలలో ప్రతిష్టించబడగా, పర్షియన్ స్తంభాలు భవనాల అంతర్భాగంగా నిర్మించబడి ఉన్నాయి. అశోక స్తంభాలు పర్షియన్ స్తంభాల లాగా కాక గొప్ప పాలిష్ కలిగి లోహపు స్తంభాలలాగా ఉన్నాయి.

మౌర్యుల శిల్పకళను నిశితంగా పరిశీలిస్తే వీటిలో కొంత వరకు నిర్మాణ పద్ధతిలో, అలంకరణ విషయంలో పాశ్చాత్య ప్రభావం కనిపించగా, వీటికి కారణభూతమైన భావాలు, విశ్వాసాలు, ప్రేరణ భారతీయము. ఏది ఏమైనప్పటికి ఈ స్తంభాలు ప్రపంచ శిల్పకళలో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఈ కళ తమ పోషకుల అధిపత్యాన్ని, అధికారాన్ని చూపడానికి మాత్రమే పరిమితమైందని అనిపిస్తుంది. అందువల్ల ఈ కళమౌర్యుల కాలానికి మాత్రమే పరిమితమై అతిత్వరలో నశించింది.

## 16.5 శుంగుల కాలపు శిల్పకళ :

మౌర్య సామ్రాజ్య పతనానంతరం తూర్పు భారతంలో శుంగులు రాజ్యమేలినారు. శుంగుల నాటి శిల్ప కళకు బార్హుత్, బుద్ధగయ ప్రధాన కేంద్రాలు. వీరి శిల్పకళ మౌర్యుల శిల్పకళా రీతికి భిన్నమైంది. మౌర్యుల నాటి శిల్పాలు గుండ్రటి రూపంలో మలచబడగా శుంగులవి అర్ధ శిల్పరీతికి చెందినవి. మౌర్యుల కాలంలో కథాయుక్తమైన శిల్పాలు మలచ బడలేదు. కాని శుంగుల శిల్పాలు కథా వివరణకు కూడుకొన్నది. మౌర్యుల కాలంలో జంతు శిల్పాలు అధికంగా ఉండగా శుంగుల కాలంలో మానవ శిల్పాలు అధికంగా ఉన్నాయి. మౌర్యుల శిల్ప కళ ప్రధానంగా రాజుల పోషణలో వృద్ధి చెందగా శుంగుల నాటి శిల్పకళ బౌద్ధ సంఘం, భూస్వాములు, ధనికులచే పోషింపబడింది. అంతేగాక శుంగుల శిల్పకళ బౌద్ధ సంబంధమైనవి. దీనితో బాటు శుంగుల శిల్పాలలో రేఖా ప్రవాహం కనబడుతుంది.

### 16.5.1 బార్హుత్ శిల్పాలు :

శుంగుల కాలం నాటి కట్టడాలలో ప్రధానంగా పేర్కొనవలసినది బార్హుత్ స్తూపము. ఈ స్తూప ప్రాకారతోరణాల మీద సుమారు 20 జాతక కథలు, 6 చారిత్రక దృశ్యాలు, చెట్లు, లతలు విరివిగా చిత్రించి ఉన్నాయి. ఈ తరుగుల్మాదుల తోటివే యక్ష, యక్షిణీ మూర్తులు. ఇంకా నాగరాజులు, జంతువులు, నౌకలు, రథాలు, ఎద్దుల బండ్లు, సంగీత వాద్యాలు చెక్కబడ్డాయి. ఈ స్తూపంమీద బుద్ధుని మనుష్య రూపంలో చిత్రించలేదు. ధర్మచక్రము, బోధి వృక్షము, వజ్రాసనము, పాదుకలు, ఛత్రం వంటివి ఆయన ఉనికిని తెలిపే సాధనాలుగా ఉపయోగించారు. బార్హుత్‌లో ఉన్న యక్షులు, మౌర్యయక్షులలాగా జడులు, స్తబ్దులు కారు. వీరి హస్త, పదవిన్యాసాలలోను, శరీర భంగిమలలోను కొంత చైతన్యం కన్పిస్తుంది. కాని మూర్తి స్వరూపంలో కఱ్ఱ బొమ్మల వాసనలు పూర్తిగా తొలగి పోలేదు. శరీరభాగాలు, ఆభరణాలు విపులంగా చిత్రించి ఉన్నాయి. అయినప్పటికి మూర్తిలో సంపూర్ణత్వం, సొంపు కన్పించవు. విడి అంగాలన్నీ కూరిస్తే, ఆ బొమ్మ తయారయిందా అనిపిస్తుంది. వెస్సంతర, మృగ, నాగ మొదలగు జాతక కథలలో కూడా అంత నేర్పుగోచరించదు. చుళకోక దేవత, యక్షిణి, సుదర్శన, సిరిమా దేవత శిల్పాలు చరిత్రకారులు ప్రశంసలందుకొన్నాయి.

### 16.5.2. బోధగయ శిల్పాలు :

బార్హుత్ శిల్పాలతో పోల్చిచూస్తే బోధగయలోని శిల్పాలలో కొంత వరకు పురోగతి కన్పిస్తుంది. బార్హుత్ శిల్పాలలో సంపూర్ణత్వం, సొంపు కన్పించవు. బోధగయ శిల్పాలలో ఈ లోపాలు సరిచేయబడి శరీర భంగిమలలో కొంత చైతన్యం కనిపిస్తుంది. ఇక్కడి జాతక కథలు, బుద్ధుని జీవితానికి సంబంధించిన ఘట్టాలు, మిధున శిల్పాలు, గజలక్ష్మి మొదలైన శిల్పాలు గలవు. జాతక కథలలో పేర్కొన - దగినవి ఛద్దంత జాతకం, వెస్సంతర జాతకం, కిన్నర జాతకం మొదలైనవి. బోధగయలో జంతువుల బొమ్మలు విరివిగా చిత్రించ బడినాయి. రెక్కలు గల సింహము, రెక్కలు గల గుర్రము, రెక్కల ఏనుగు, పొట్టేలు, మేక, మొదలగు జంతువులు ఇక్కడ చెక్కబడినాయి. బోధగయ శిల్పులు బార్హుత్ శైలిని అనుసరించి శిల్పరచన చేసి తరువాత తరాల వారయిన సాంచి, మధుర శిల్పులకు ఈ వారసత్వాన్ని అందచేసినారు.

## 16.6 కుషాణుల నాటి శిల్పకళ :

మౌర్య సామ్రాజ్య పతనానంతరం పశ్చిమోత్తర భారతదేశంలో పాలించిన విదేశీరాజవంశాలలో కుషాణుల రాజ్యం ప్రముఖమైంది. వీరి కాలంలో శిల్ప కళారంగంలో సాధించిన ఆభివృద్ధికి మధుర, గాంధారాలలో కళాఖండాలే సాక్షి. కుషానుల కళాసృష్టిలో రెండు విభిన్న సాంప్రదాయాలున్నాయి. ఇందులో మొదటిది మధుర సాంప్రదాయము. ఇది సాంచీ, బార్హుత్‌ల ననుసరించి ఉంటుంది. ఇక రెండో దానికి నెలవు గాంధారము. ఇక్కడ కళాసృష్టిలో రోమన్ రీతుల ప్రభావం కనపడుతూ ఉంటుంది. విషయాలు భారతదేశానివేగాని చిత్రీకరణ మాత్రం రోమన్ పద్ధతి. కుషానులకు రోమ్‌తో ఉండిన వ్యాపార సాంస్కృతిక సంబంధాల దృష్ట్యా, రోమన్ కళారీతులు గాంధారం లో కన్పించడంలో ఆశ్చర్యం లేదు. కాని దేశీయ విషయాలకు, పాశ్చాత్య కళకు పొత్తుకుదర నందున, గాంధార సాంప్రదాయం ఎంతోకాలం నిలవ లేదు. క్రీస్తు శకము రెండో శతాబ్దంలో ఉచ్ఛస్థితిలో, మూడో శతాబ్దంలోనే క్షీణించడం మొదలుపెట్టి ఐదవ శతాబ్దం తరావాత ఇంచుమించుగా అంతరించింది.

### 16.6.1 గాంధార శిల్పకళ :

కుషానుల కాలం నాటి శిల్పకళకు గాంధార, మధురలలో రూపొందిన కళాఖండాలే సాక్ష్యం. కనిష్కుని రాజ్యంలోని స్వాత్, కాబూల్, సింధు నదులతో కూడిన ప్రాంతమే గాంధారము. ఈ ప్రాంతంలో కనిష్కుని పోషణలో ఒక నూతన శిల్పకళా రీతి అభివృద్ధి చెందింది. ఈ శిల్ప కళారీతినే గాంధార శిల్పకళ అంటారు. ఈ శిర్పకళకు ప్రధాన కేంద్రాలు తక్షశిల, పెషావర్, హడ్డ. ఈ ప్రాంతం కనిష్కుని కాలానికి విదేశీయులైన రోమన్‌లు, గ్రీకులు, పర్షియన్‌లు, శకుల ప్రభావానికి లోనైంది. అందుకు సాక్ష్యం కనిష్కుని నాణేల పైగల పర్షియన్, రోమ్, అలెగ్జాండ్రియా దేవతలు.

**16.6.1.1 లక్షణాలు :**

గాంధార శిల్పాలు నల్లని బలపపురాయితో రూపొందించబడినవి. గాంధార శిల్పకళలో రూపొందించిన బుద్ధుడు, బోధిసత్వుల విగ్రహాలు గ్రీక్, రోమన్ రీతిలో ఉన్నాయి. గాంధార బుద్ధునికి తలవెనక ప్రభామండలం, తలపై ఉష్ణీషం. హస్త పాదాలలో చక్రాలు, కనుబొమల మధ్య ఊర్మము, సహజమైన రీతిలో మడతలుగల పలుచని వస్త్రం (సంఘటి), సహజరీతిలో కండరాలు, నరాలు, ఎముకల రూపాలు ఉన్నాయి. బోధి సత్వులకు కొన్ని శిల్పాల్లో మీసాలు, తలపాగాలున్నాయి. కుడిభుజం చేతులపై వస్త్రముండదు. ఈ లక్షణాన్నీ గ్రీక్, రోమక్ ప్రభావాన్ని తెలుపుతున్నాయి. వస్త్రం రోమన్ టోగ లాగ ఉన్నది. ముఖ కవళికలు కూడా గ్రీక్- రోమన్ ప్రభావాన్ని తెలుపుతున్నాయి. బౌద్ధ కథల్లోని సన్యాసులు, పూజారులు గ్రీక్ -రోమన్ శిల్పసంప్రదాయంలోని గడ్డాలుగల తత్త్వవేత్తలు, ఋషులలా ఉన్నారు. యక్ష, యక్షిణి, నాగ, గరుడ, బోధసత్వులు గ్రీక్ -రోమన్ శిల్పంలో హెరాకిల్స్, అట్లాటెజ్, బచూస్, జెయన్, ఎరోక, హెర్మెన్, పోసిడన్, జెనై మొదలైన వారి లాగ ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే గాంధార శిల్పకళలో భారతీయ ఆధ్యాత్మిక చింతన, గ్రీక్ శిల్పరీతి లక్షణాలు జోడింపబడ్డాయి. శిల్పీకరించే పద్దతి విదేశీయమైనా శిల్పదృశ్యాలు భారతదేశానికి సంబంధించినవి.

**16.6.1.2 కథా వస్తువు :**

గాంధార శిల్పకళలో ప్రధాన కథావస్తువు మహాయాన బౌద్ధం. క్రీ.శ. మొదటి శాతబ్దంలో ఉత్తర భారతదేశ శిల్పకళలో మార్పులు రాసాగాయి. అందుకు కారణం అప్పటి వరకు చిహ్నరూపంలో బుద్ధుని ఆరాధించే హీనయాన కాలం అంతరించి, దేవునిగా ప్రతిమ రూపంలో బుద్ధుని ఆరాధించే మహాయాన కాలం ఆరంభమవడమే. దీనిలో బౌద్ధ మతంలో బుద్ధుని ప్రతిమలు రూపొందించ వలసిన అవసరమేర్పడింది. ఫలితంగా అనేక బుద్ధ విగ్రహాలు గ్రీక్ - రోమన్ రీతిలో రూపొందించబడ్డాయి. నాటికే గాంధార ప్రాంతం పై గ్రీక్ - రోమన్ ప్రభావం ప్రసరించడం వల్ల పాశ్చాత్యరీతిలో శిల్పాలు తయారయ్యాయి. బుద్ధునితో బాటు బోధిసత్వుల శిల్పాలు కూడా ఏర్పడసాగాయి. అందువల్ల గాంధార శిల్ప కళలో బౌద్ధమతానికి సంబంధించిన బుద్ధుడు, బోధిసత్వులు, బుద్ధుని జీవితఘట్టాలు, యక్ష, యక్షిణి, నాగ, గరుడ మొదలైనవి ప్రధాన కథా వస్తువు.

**16.6.1.3 కాలం :**

గాంధార శిల్పకళ క్రీ.పూ. 3వ శతాబ్దంలో ప్రారంభమై కనిష్కుని కాలంలో క్రీ.శ. మొదటి శతాబ్దంలో పరాకాష్ఠ చెందినది. ఈ కళ క్రీ.శ. 5వ శతాబ్దంలో హుణుల దాడుల వల్ల నష్టపోయింది. అయినా ఈ కళ క్రీ.శ.8వ శతాబ్దం వరకు కొనసాగింది అనడానికి సాక్ష్యం బమియన్ శిల్పాలే. ఇక్కడి శిల్పాలలో స్థానక బుద్ధుని శిల్పాలు మూడు గొప్పగా రూపొందించబడినవి.

**16.6.1.4 శిల్పాలు :**

మధుర, గాంధార శిల్పరీతులు విభిన్న రీతులలో ఉంటాయని తెలుసుకొన్నాము. కాని ఈ రెండింటిలోను ప్రధమంగా క్రీ.శ. మొదట శతాబ్దంలో బుద్ధుని మానవరూపంలో చిత్రించే ఆచారం ప్రారంభమైంది. అయితే మధుర, గాంధారాలలో బుద్ధుని ప్రతిమల చిత్రీకరణలో ఎంతో భేదం కనపడుతుంది. గాంధార బుద్ధుడు కొంత వరకు గీకు, రొమన్ దేవతలను పోలిఉంటాడు. ఈ క్రింది ఉదాహరణలు పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతుంది నేడు బోస్టన్ మ్యూజియంలో గల ఒక నాణెం పై ఒక వైపు బుద్ధుని ప్రతిమ మరోవైపు కనిష్కుని ప్రతిమ ఉంది. బుద్ధుడు స్ధానక రీతిలో సంఘటి, ఉష్ణీషం, చెవులకు పొడవైన ఆభరణాల ధరించి ఉన్నారు. కుడిచేయి అభయ ముద్రలో ఉండగా, ఎడమ చేయి సంఘటి కొసలను పట్టుకొని ఉన్నది. శిరస్సు వెనుక, శరీరం వెనుక విడివిడిగా రెండు ప్రభామండలాలున్నాయి. కనిష్కుడు కిరీటాన్ని, ఖడ్గాన్ని, చెప్పులు, బెల్టు, గడ్డం కలిగి ఉన్నారు. ఈ నాణెం పైగల బుద్ధుని పోలిన శిల్పం లాహొర్‌లో లభించింది. క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన ఈ ప్రతిమలో బుద్ధుడు రోమన్ 'టోగా' వంటి నిడివైన సంఘటి వస్త్రాన్ని ధరించి ఉన్నాడు. బుద్ధుని నాలుగు జీవిత ఘట్టాలను తెలిపే అర్ధశిల్పాలు గాంధార ప్రాంతంలో ముఖ్యంగా తక్షశిలలో బయల్పడినాయి. ఇవి క్రీ.శ. 2వ శతాబ్దం నాటివి. ఇవి నేడు వాషింగ్‌టన్ ఆర్ట్ గాలరీలో ఉన్నాయి.

గాంధార శిల్పకళారీతిలో బుద్ధుని శిల్పాలే గాక బోది సత్వుని శిల్పాలు కూడా రూపొందించడం జరిగింది. వీటిలో ఒకటి ఫ్లొరిడాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్నది. ఇందులో బోధిసత్వుడు పొడవైన అలంకార శిరోజాలు, మీసాలు, అనేక ఆభరణాలు, చెప్పులు, విలువైన దుస్తులు కలిగి ఉన్నాడు. అభయ ముద్రలో ఉన్న కుడిచేయి, ఎడమచేయి విరిగి ఉన్నాయి. ఇతడు ధరించిన వస్త్రం, శరీరం సహజంగా ఉన్నాయి. ఈ శిల్పం క్రీ.శ. 2వ శతాబ్ది నాటిది. ఆఫ్ఘనిస్థాన్‌లోని బిమరాన్ లో కెంపులు పొదిగిన పెట్టె ఒకటి లభించింది. దీనిపై తోరణాల వంటి విభాగాలు, వాటిలో బుద్ధుని శిల్పం ఉన్నాయి. ఇది నేడు లండన్ మ్యూజియంలో వుంది. నేడు లాహోర్ మ్యూజియంలో గల రోమలేదా అధేన శిల్పం గాంధార శిల్పకళకు మరోనిదర్శనం. ఈ స్త్రీ శిల్పం బూడిదరంగు సిస్ట్‌తో తయారయింది. ఈ స్త్రీ శిరస్సుపై రక్షణ కవచాన్ని ధరించి ఉంది. ఎడమ వైపు ప్రక్కలో కత్తి ఉంది. బమియన్‌లోని బౌద్ధశిల్పాలు గ్రీకురీతిలో రూపొందినవే. పై ఉదాహరణలేగాక క్రీ.శ. మొదటి శతాబ్దపు గాంధారరీతి శిల్పాలు లోర్యాటాంగై, హస్తనగర్, జలాలాబాద్, సిర్కాల్, మర్దన్ తక్త్ఇబహాయ్, సిక్రిలలో లభించాయి.

క్రీ.శ. మూడవ శతాబ్దం తరవాత శిలకు బదులుగా సుద్ద, బంకమట్టితో గాంధార రీతి శిల్పాలు తయారైనాయి. ఈ రకపు శిల్పాలకు మొహరా మొరాతు, జౌలియన్ ప్రాంతాలు ప్రధాన కేంద్రాలు. గాంధర రీతిలో కొన్ని లోహ ప్రతిమలు కూడా లభ్యమైనాయి. తక్షశిలలో హార్ పోక్రేట్స్, డయోనీషియస్ లోహప్రతిమలు లభ్యమైనాయి. హెరాక్లిస్ కంచుప్రతిమ లండన్ మ్యూజియంలో భద్రపరచ బడింది.

**16.6.1.5 ప్రభావం :**

గాంధార శిల్పకలారీతి భారతీయ శిల్పకళపైనేగాక ఆసియా ఖండపు శిల్పకళపై కూడా గొప్పప్రభావాన్ని ప్రసరించింది. అమరావతి శిల్పితన వ్యక్తిత్వానికి భంగం కలగకుండా గాంధార లక్షణాలను అమరావతి శిల్ప శైలిలో పొందుపరిచాడు. అలాగే మధురలో తయారైన కొన్ని శిల్పాలలో గాంధార లక్షణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. నాగార్జున కొండలో కవచం ధరించిన స్కితియన్ వీరుని విగ్రహం లభించింది.

**16.6.1.6 వ్యాప్తి :**

గాంధార శిల్పకళ గాంధార ప్రాంతానికే పరిమితం కాలేదు. కాశ్మీర్, గుజరాత్, మధుర ప్రాంతాలలో కూడా గాంధార శిల్పకళారీతిలో రూపొందిన ప్రతిమలనేకం లభించాయి. అంతేగాక గాంధార శిల్పరీతి ప్రభావం సుదూర ప్రాంతాలకు విస్తరించింది. చైనా, కొరియా, జపాన్, శ్రీలంక, మధ్య ఆసియా మొదలగు ప్రాంతాలకు గాంధార రీతి విస్తరించి అక్కడ స్థానిక సాంప్రదాయాలతో మిళితమైంది. అయినా భారతీయ శిల్ప వికాసంలో, గాంధార రీతి దృఢమైన స్థానాన్ని పొందలేదు.

**16.6.1.7 పతనం :**

గాంధార శిల్పకళలో విషయం భారతదేశానికి సంబంధించినది కాగా చిత్రీకరణ మాత్రమే రోమన్ పద్ధతి. కాని దేశీయ విషయాలకు, పాశ్చాత్య కళకు పొత్తు కుదరనందున గాంధార సాంప్రదాయము ఎంతోకాలం నిలవలేదు. క్రీ.శ. రెండో శతాబ్దంలో కుషానుల కాలంలో ఉచ్ఛస్థితిలో ఉండి, మూడో శతాబ్దంలోనే క్షీణించడం ప్రారంభమయి క్రీ.శ. 5వ శతాబ్దం తరవాత ఇంచుమించుగా అంతరించింది. ఏమైనప్పటికి గాంధార శిల్పకళారీతి శిల్పకళా ప్రపంచంలో ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది.

## 16.7 మధుర శిల్పకళ :

మౌర్యసామ్రాజ్య పతనానంతరం పశ్చిమోత్తర భారతదేశంలో పాలించిన విదేశీ రాజవంశాలలో కుషానుల రాజ్యం ప్రముఖమైంది. వీరి పాలనా కాలంలో మధుర, గాంధారాలనే రెండు విభిన్న కళా సాంప్రదాయాలు పోషింపబడినాయి. ఇందులో మధుర సాంప్రదాయము బార్హుత్, సాంచీల ననుసరించి ఉంటుంది. గాంధార కళాసృష్టిలో రోమన్ రీతుల ప్రభావం కనబడుతుంది. గాంధార సాంప్రదాయము క్రీ.శ. 3వ శతాబ్దం నుంచి క్షీణించి క్రమంగా అంతరించగా, మధుర సాంప్రదాయం తరవాత కూడా సాగి, గుప్త కాలంలో శ్రేష్ఠతరంగా కళాఖండాలను సృజించింది.

క్రీ.పూ.మొదటి శతాబ్దం నుండి మధుర గొప్ప కళాకేంద్రంగా పరిఢవిల్లింది ఇచట వివిధ మతాలకు చెందిన దేవతా విగ్రహాలను తయారు చేసేవారు. క్రీ.శ. మొదటి శతాబ్దంలో మధుర శిల్పాల తయారీ చురుకుగా కొనసాగి కాలక్రమేణా తరవాత శతాబ్దాలలో ఈ శిల్పాలు ప్రయాగ, సారనాథ్, శ్రావస్తి, తక్షశిల, మధ్య ఆసియా మొదలైన ప్రాంతాలకు ఎగుమతి అయినాయి. మధుర శిల్పులు సిక్రీలో లభ్యమయిన మచ్చలు గల ఎర్ర ఇసుకరాయిని ఉపయోగించారు. మధుర శిల్పి భారతీయ సాంప్రదాయాన్ని అనుసరించి హిందూ, బౌద్ధ, జైన దేవతాశిల్పాలను, యక్ష, యక్షణి శిల్పాలను, నాగ నాగినీ శిల్పాల నెన్నింటినో రూపొందించాడు. మధురశిల్పి కొంత వరకు సాంచి, బార్హూత్ శిల్ప శైలిని అనుసరించినాడు. అయితే మధుర శిల్పాలు ఉబ్బెత్తు శిలాలు. మధురలో దాదాపు ఐదువేల శిల్పకళా ఖండాలు లభించాయి. వీటిలో చాలా భాగం కనిష్క, వాసుదేవుల కాలానికి చెందినవి. శిల్పి వృక్ష, జంతు అలంకారాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. ప్రకృతి దృశ్యాలు, సహజపద్ధతిలో చిత్రీకరించబడినాయి. ఈ శిల్పాలలో మానవ సుఖసంతోషాలు స్పష్టంగా కన్పిస్తాయి. సామాజిక జీవనం చూపబడింది.

**16.7.1 లక్షణాలు :**

మధుర శిల్పాలు చాలావరకు కనిష్కుని కాలంలోను, ఆతరువాత హువిష్క, వాసుదేవుల కాలంలోను రూపొందించబడ్డాయి. ఈ శిల్పాలు చాలావరకు సిక్రీలో లభించే తెల్లచుక్కలు గల ఎర్ర ఇసుకరాయితో తయారు చేయబడ్డాయి. ఈ శిల్పాలు లో తుగా చెక్కబడ్డాయి. వెడల్పాటి రొమ్ముభాగం, బరువైన దేహాన్ని కలిగి ఉన్నాయి. ఈ శిల్పాలకు కుడి భుజం పై వస్త్రం లేదు. శిల్పం పై భాగం అందంగా క్రింది భాగం కఠినంగా ఉన్నది. మధుర శిల్పాలలో భిన్నమతాలకు చెందినవి కలవు. మానవుని ఆనందం, ఉద్రేకాలు ప్రకృతి పరంగా చిత్రించబడింది. మానవ శిల్పాల రూపణలో నైపుణ్యం చూపడం జరిగింది. స్త్రీ శిల్పాల రూపణలో శిల్పి ప్రత్యేక శ్రద్ధ కనపరిచాడు. స్థానక విగ్రహాలలో త్రిభంగరీతి ఎక్కువగా కన్పిస్తుంది.

**16.7.2 శిల్పాలు :**

కనిష్కుని కాలంలో బౌద్ధమతంలో మహాయానం పొడసూపింది. ఈ శాఖవారు బుద్ధుని దేవునిగా భావించారు. అందువల్ల బుద్ధుని ప్రతిమలు రూపొందించవలసి వచ్చింది. మధుర శిల్పి తొలిసారిగా బుద్ధుని శిల్పాన్ని రూపొందించాడు. ఇది పూర్తిగా భారతీయ పద్ధతిలో రూపొందించ బడింది. మధురలో లభించిన బౌద్ధ శిల్పాలలో సారనాథ్ మ్యూజియంలో గల స్థానక బోధిసత్వ శాక్యముని శిల్పం, మధుర మ్యూజియంలో గల స్థానక బోధి సత్వమైత్రేయ శిల్పం, బుద్ధుని ఆశిన శిల్పం ముఖ్యమైనవి. ఈ బోధి సత్వుల కాళ్ళ మధ్య ఆసీన బుద్ధుని పీఠం, ముఖభాగన సింహాల ప్రతిమలున్నాయి. ఇవి శాక్య సింహుడనెడి బుద్ధుని బిరుదాన్ని తెలుపుతున్నాయి. దీని వల్ల బుద్ధుని ధర్మచక్ర ప్రవర్తన పూర్వరూపం తెలుస్తుంది. దీని వలన బుద్ధుని బోధిసత్వుడుగా మధుర శిల్పకళలో భావించడం కలదు.

మధురలోని బోధిసత్వుడు స్థానక రూపంలో ఉన్నాడు. ఈ రూపం యక్షప్రతిమ వలె ఉంది. పాట్నా, పార్కంలలోని మౌర్య, శుంగ కాలపు యక్షులతో పోల్చి చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. బోధిసత్వుడు తన శిరస్సు వెనుక ప్రభామండలాన్ని, తలపై ఉష్ణీషం కలిగి ఉన్నాడు. కుడిచేయి. అభయ ముద్రలో ఉండగా, ఎడమ చేతిలో కమండలం ఉంది. కుడి చేయి అరచేతిలో చక్రం ఉంది. వస్త్రధారణ అనాగరికంగా ఉంది. మధురలోని ఆశీన బుద్ధుడు పలుచటి స్వదేశీవస్త్రాన్ని ఎడమ భుజం మీదుగా ధరించి ఉన్నాడు. బుద్ధుడు యోగిలాగ సింహాసనంపై బోధివృక్షం కింద ఆశీనుడై ఉన్నాడు. శిరస్సు వెనుక ప్రభామండలం ఉంది. శిరస్సుపై ఉష్ణీషం ఉంది. కుడిచేయి ఆభయ ముద్రలో, ఎడమ చేయి ఎడమ మోకాలి పై ఉంది. కుడి అరచేయి, పాదాలలో ధర్మచక్రం ఉంది. బుద్ధునికి ఇరువైపులా వింజామరులు, పై భాగంలో దేవతలున్నారు.

కుషానుల కాలంలో మధుర శిల్పులు తొలిసారిగా హిందూ దేవతలైన విష్ణు, లక్ష్మీ, దుర్గ, సప్త మాతృకలు, కార్తికేయుడు మొదలైన వారి శిల్పాలు రూపొందించారు. ఈ దేవతల ప్రతిమా లక్షణాలు నాటి భక్తి ఉద్యమ ప్రభావంతో రూపొందించబడ్డాయి. మధురలో అనేక హిందూదేవతల ప్రతిమలు లభించాయి. కంకాళితిలలోని ఒక ప్రతిమ సూర్యునిదని కూడా ఒక అభిప్రాయం ఉంది.

మధురలో ప్రప్రథమంగా జైన తీర్థంకరుల శిల్పాలు రూపొందించబడ్డాయి. మధుర, కంకాళితిలలలో అనేక జైన శిల్పాలు బయల్పడ్డాయి. వీటిలో స్థానక, ఆశీన శిల్పాలు కలవు. స్థానక శిల్పాలు కామోత్సాగర రీతిలో, ఆశీన శిల్పాలు పద్మాసన రీతిలో ఉన్నాయి. తీర్థంకరుల రూపం ధ్యాన రీతిలో ఉన్నాయి. మధురలో చౌముఖ తీర్థంకరుల శిల్పాలు కూడా రూపొందింపబడ్డాయి. మధురలో మహిష మర్దని, అంబిక, వసుదన్, హారీతి శిల్పాలు కూడా రూపొందాయి.

మధురలో యక్ష, యక్షిణి శిల్పాలు కూడా లభించాయి. యక్షిణి శిల్పాలు నగ్నంగా లేక అర్థనగ్నంగా శృంగార భంగిమల్లో ఉన్నాయి. ఈ శిల్పాలు భారీ ఆకారంతో నిండైన వదనంతో ఉన్నాయి. కంకాళితిలలోని వేదిక స్తంభాలపై వివిధ భంగిమల్లో యక్షిణిలు చిత్రీకరించబడ్డారు. మధురలో స్తూప ప్రాకార అడ్డు, నిలువు దూలాలపై అనేక రకాల స్త్రీల శిల్పాలు అందంగా మలచబడ్డాయి.

మధుర ప్రభావం గాంధారం మీద ప్రసరించినట్లే గాంధార ప్రభావం కూడా మధురలో కనిపిస్తుంది. ఈ సందర్భంలో పేర్కొన వలసినవి వేమా కాడ్‌ఫైసెస్, కనిష్క, చష్టనుల వని భావిస్తున్న రాజ ప్రతిమలు, బఖలానియన్ చిత్రాలు. బఖలానియన్ కపాటాలలో స్త్రీలు మద్యం సేవించడం భారతీయేతర సంప్రదాయము. ఈ రకపు శిల్పాలను అనతి కాలంలోనే విసర్జించడం జరిగింది.

## 16.8 సారాంశము :

కుషాన్ రాజులు పోషించిన గాంధార శిల్పరీతులు వారి రాజ్యంతో పాటు క్రీ.శ 3వ శతాబ్దం నుంచి క్షీణించి క్రమంగా అంతరించినాయి. మధుర సాంప్రదాయం అట్లా కుషానులలో అంతం కాక, తరవాత కూడా సాగి, గుప్త కాలంలో శ్రేష్ఠతరంగా కళాఖండాలను సృజించింది.

## 16.9 నమూనా ప్రశ్నలు :

1. మౌర్యుల కళ ప్రధాన లక్షణాలను వివరింపుము
2. శుంగుల కాలపు శిల్పకళను గూర్చి వివరింపుము
3. గాంధార శిల్పకళను వర్ణింపుము.

**కె. సూర్యప్రకాష్ రెడ్డి**

పాఠం-17

# శిల్పకళ - సాంచీ, అమరావతి

## 17.0 లక్ష్యం :

భారత దేశంలో గల బౌద్ధ స్తూపాలన్నింటిలోను శిల్పకళా నైపుణ్యానికి ఖ్యాతి గాంచిన సాంచీ, అమరావతి స్తూపాల శిల్పకళను వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


17.1 సాంచీ శిల్పకళ

- 17.1.1 పరిచయం
- 17.1.2 శిల్పకళ
- 17.1.3 అంచనా

17.2 అమరావతి శిల్పకళ

- 17.2.1 పరిచయం
- 17.2.2 శిల్పకళా కేంద్రాలు
- 17.2.3 కాలం
- 17.2.4 లక్షణాలు
- 17.2.5 శిల్పకళారీతిలో దశలు
- 17.2.6 శిల్పకళ
- 17.2.7 శిల్పకళా వ్యాప్తి

17.3 సారాంశము

17.4 నమూనా ప్రశ్నలు


## 17.1. సాంచీ శిల్పకళ :

### 17.1.1 పరిచయం :

సాంచీ మహాస్తూప నిర్మాణము మౌర్య అశోకుని కాలంలో ఆరంభమైందనీ శుంగులు ఆ కట్టడాన్ని విస్తృత పరచినారనీ, ఆంధ్రులు దానిని క్రీస్తు శకారంభంలో ప్రాకార తోరణాదులతో అలంకరించినారనీ పండితులు భావిస్తున్నారు. సాంచీ స్తూపానికి నాలుగు వైపులా ఎత్తైన తోరణాలు ఉన్నాయి. ఇచటగల చెక్కడపుపని, బార్హుత్‌లో ఉన్నదానికన్నా ఎన్నోరెట్లు ఆభివృద్ధి పొందింది. ఇక్కడ యక్షిణీ ప్రతిమలలో చైతన్యము, అంగాల పూర్ణ సౌష్ఠవము గోచరిస్తాయి. మూర్తుల రూప కల్పనలోను, చెక్కుడు నిలోను ఈ కాలపు శిల్పలు ఒక పరిణతి సాధించినారు. బార్హుత్ లాగా ఇక్కడా జాతక కథలు, బుద్ధుని జీవితంలో కొన్ని ఘట్టాలు చిత్రీకరించి ఉన్నాయి. కానీ వీటి చిత్రీకరణ పద్ధతిలో బార్హుత్ కంటే ఆభివృద్ధి కన్పిస్తుంది.

**17.1.2 శిల్పకళ :**

నేటి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో విదిశకు సుమారు 9కి.మీ. దూరంలో సాంచీ అనే గ్రామముంది. ఇచట గల కొండపై స్తూపాలు, ఆరామాలు బౌద్ధ వాస్తు, శిల్పకళకు సాక్ష్యంగా నిలిచి ఉన్నాయి. ఇచట గల స్తూపాలలో 1,2,3 సంఖ్యగల స్తూపాలు ముఖ్యమైనవి. 1,3 సంఖ్య గల స్తూపాలు కొండపైన, 2 సంఖ్యగల స్తూపం కొండకు పశ్చిమాన నిర్మించబడి ఉన్నాయి. 1 సంఖ్య గల స్తూపాన్ని మహాచైత్య మంటారు. దీనికి నాలుగు వైపులా ప్రవేశ తోరణాలు గలవు. ఈ మహాచైత్యాన్ని అశోకుడు ఇటుకలతో నిర్మించగా, శుంగులు దీనిని రాతితో విస్తృత పరిచారు. ఆశోకుడు దారువుతో నిర్మించిన ప్రాకారం స్థానే క్రీ.పూ. 1వ శతాబ్దంలో ఆంధ్ర శాతవాహనులు శిలాప్రాకారం, నాలుగు దిక్కులా నాలుగు తోరాణాలు నిర్మించారు. ప్రతి తోరణ ద్వారం ఎత్తు 34 అడుగులు. ప్రతి తోరణ ద్వారానికి రెండు నిలువు స్తంభాలు, మూడు అడ్డు దూలాలు గలవు. దూలాల చివరి భాగం 'స్ప్రింగ్' ఆకృతిలో అలంకరించబడింది. ఇచటి తోరణాల్లో దక్షిన దిక్కున ఉన్నది మొదట నిర్మించబడింది. ఈ ద్వారం మీద 'ఆనంద' అనే శిల్పి పేరుతో ఒక శాసనం ఉన్నది. ఈ ఆనందుడు శాతవాహన రాజైన శాతకర్ణి ఆస్థానంలోని శిల్పులకు అధిపతి. దక్షిణ ద్వారం వద్దనే అశోక స్తంభం వుండేది.

సాంచీ మహాస్తూప తోరణ ద్వారాలపైన, రెండో సంఖ్య గల స్తూప కంబాల మీద, మూడవ సంఖ్య గల స్తూప ప్రాకార తోరణ ద్వారం మీద ఎంతో రమ్యమైన శిల్ప సంపదగలదు. ఇవన్నీ స్వల్పోర్చణ శిల్పాలు. ఈ శిల్పాలన్నీ కేవలం దేశీయ సాంప్రదాయాలకు అనుగుణంగా తయారైనవి. ఇక్కడి శిల్పాలు గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ప్రకృతి సన్నిహితంగా ఉంటాయి. నిరాడంబరం, సహజ సౌదర్యం సాంచీ శిల్పాల ప్రత్యేకత. జాతక కథలు, బుద్ధుని జీవితంలోని నాలుగు ప్రధాన ఘట్టాలు, చారిత్రక దృశ్యాలు, యక్ష, యక్షిణీ శిల్పాలు, జంతు, పక్షి, వృక్ష సంబంధమైన శిల్పాలు సాంచీ శిల్పాలలో చోటు చేసుకొన్నాయి.

బుద్ధుని జీవితంలోని నాల్గు ముఖ్యఘట్టాలైన జననం, సంబోధి, ధర్మచక్రప్రవర్తన, మహాపరినిర్వాణం సాంచీతోరణ శిల్పాల్లో కనపడతాయి. బార్హుత్‌లో వలె ఇచట బుద్ధుడు మనుష్యరూపంలో కనిపించడు. పద్మము, బోధివృక్షము, ధర్మచక్రం, స్తూపం వంటివి బుద్ధుని ఉనికిని తెలిపే సంకేతాలుగా వాడబడ్డాయి. పద్మము బుద్ధుని జననానికి, బోధివృక్షం జ్ఞానోదయానికి, ధర్మచక్రం తొలిబోధనకు స్తూపం మహాపరినిర్వాణానికి ప్రతీకలుగా ఉన్నాయి. ఇవేగాక బౌద్ధచిహ్నాలైన త్రిరత్నగుర్తు, శ్రీవత్స, సింహం లేక గజకిరీటం కలిగిన స్తంభాలు ఈ శిల్పాలలో చోటు చేసుకొన్నాయి. బుద్ధుడు గాలిలో నడవడం, నీటిమీద నడవడం మొదలైన బుద్ధుని అద్భుత కృత్యాలు శిల్పరూపంలో కన్పిస్తాయి. బార్హుత్‌లో వలె ఇచట వెస్సంతర జాతకము, చద్దాంత జాతకము, మహాకపి జాతకము అతిమనోహరంగా మలచబడ్డాయి.

సాంచీ శిల్పాలలో చారిత్రక దృశ్యాలు కూడా గలవు. వాటిలో ప్రధానంగా ప్రస్తావించవలసినవి బుద్ధుని దర్శనం కోసం అజాత శత్రువు రాక, బుద్ధుని దర్శనంకోసం కోసల రాజైన ప్రసేనజిత్తురాక, శ్రావస్తిలోని మామిడి తోటను ప్రసేనజిత్తు దర్శించడం, జీవకుని అమర వనాన్ని అజాత శత్రువు దర్శించడం, బుద్ధునికి స్వాగతం పలికేందుకు మంత్రులు, సామంతులలో శుద్దోదనుడు ఎదురేగడం, బుద్ధుని అస్థికల కోసం యుద్ధం, అశోకుడు బోధి వృక్షాన్ని దర్శించడం, అశోకుడు రామగ్రామ స్తూపాన్ని దర్శించడం మొదలగునవి.

సాంచీ మహస్తూప దక్షిణం వైపు గల తోరణ ద్వారం ముందు భాగంలో శ్రీలక్ష్మీ శిల్పమున్నది. ఈ దేవికి ఇరువైపులా ఏనుగులున్నాయి. ఈ దేవి మాయాదేవియని, శ్రీ లక్ష్మీ అని, సిరిమదేవతని భిన్న అభిప్రాయాలున్నాయి. తోరణ ద్వారం వెనుక వైపు నాల్గు వృక్షాలు, సింహాసనం, ఆరాధకులు ఉన్నారు. సాంచీ స్తూప తోరణ 'బ్రాకెట్ల' లో అద్భుత స్త్రీ శిల్పాలున్నాయి. వీటినే 'సాలభంజిక' లంటారు. ఇవి వృక్షాల కింద నిలబడి ఉన్నట్లు చూపబడ్డాయి. ఈ ప్రతిమలలో చైతన్యము, అంగాల పూర్ణ సౌష్ఠవం గోచరిస్తాయి. యక్షుల శిల్పాలు కూడా ఇచట మలచ బడ్డాయి. సాంచీలో మిధున శిల్పాలు కూడా అత్యంత మనోజ్ఞంగా మలచబడి ఉన్నాయి.

సాంచీ శిల్పాలలో దైవ, మానవమూర్తులేగాక జంతువుల, పక్షుల రూపాలకు కూడా ప్రాముఖ్యం ఇవ్వబడింది. ఈ శిల్పాల్లో జంతువులు లేదా పక్షులు ఒక క్రమానుసారంగా జతలు జతలుగా గోచరిస్తాయి. జంతువులలో కొన్ని నిజమైనవి కాగా మరికొన్ని ఊహా జనితమైనవి. ఇవి కొన్ని చోట్ల చోదకులతోను, మరికొన్ని చోట్ల చోదకులు లేకుండా ఉన్నాయి. జంతువులలో మేకలు, గుర్రాలు, ఎద్దులు,

ఒంటెలు, ఏనుగులు, జింకలు, రెక్కలుగల సింహాలు మలచబడ్డాయి. పక్షులలో నెమళ్ళు, బాతులు ప్రధానంగా గోచరిస్తాయి.

సాంచీలో వృక్ష సంబంధమైన శిల్పాలు అద్భుతంగా ఉన్నాయి. ప్రకృతిని క్షుణ్ణంగా పరిశీలించి శిల్పి వీటిని చెక్కినట్లు తెలుస్తుంది. తామర పుష్పం, తీగలతో ఉన్న తామర, రావి చెట్టు వృక్ష సంబంధమైన శిల్పాల్లో ముఖ్యమైనవి.

### 17.1.3 అంచనా :

ప్రపంచంలోని బౌద్ధ స్తూపాలలో సాంచీ స్తూపం అగ్రస్థానం ఆక్రమించింది. ఇది బౌద్ధమత శిల్పకళకు కాణాచి. ఈ స్తూపం నాలుగు వైపుల నిర్మించిన తోరణాలు ప్రపంచ శిల్పచరిత్రలోనే తలమానికంగా ఎంచుతున్నారు. శాతవాహనరాజు రెండో శాతకర్ణి సాంచీ తోరణాన్ని మరమ్మత్తు చేయించినట్లు అచటగల శాసనంవల్ల తెలుస్తుంది. సాంచీ స్తూప ద్వార తోరణాలపై గల శిల్పాలు విడివిడిగా సంపూర్ణంగా చెక్కబడి ఉన్నాయి. ఒక్కొక్క శిల్పం ఒక్కొక్క చిత్ర కూటమిలాగ ఉన్నది. ఇందుకు తార్కాణం బుద్ధుని అస్థికల కోసం జరిగిన యుద్ధ ఘట్టం. వెస్సంతర జాతక కథ సంక్షిప్తరీతిలో శిల్పంలో చూపబడింది. కాని బార్హుత్ లో లాగ శిల్పాల కింద పేర్లు లేవు. సాంచీ శిల్పాలలో ప్రత్యేకత లత, పుష్పాలంకరణ. ఈ అలంకారాలు అనేక శిల్పాలలో వాడినా సాంచీ శిల్పుల పనితనం పేర్కొనదగినదని మార్షల్ అభిప్రాయం బార్హుత్‌లో వలె కల్పలత అందంగా చిత్రీకరించబడింది. బార్హుత్‌లో లాగ గాక సాంచిలో జాతక కథలు తెలిపే శిల్పాలు తక్కువ. సాంచీలో సద్దంత జాతక కథను పలుమార్లు చెక్కడం జరిగింది. అంతేగాక బుద్ధుని జీవితంలోని ఘట్టాలను తెలిపే శిల్పాలను చెక్కడంలో శిల్పి శ్రద్ధ కనపరచాడు.

సాంచీలో బుద్ధుడు నీటిమీద, గాలిలో నడిచే శిల్పాలు అద్భుతంగా ఉన్నాయి. చారిత్రక అంశాలు కూడా సాంచీలో ఎక్కువగా ఉన్నాయి. అజాత శత్రువు బుద్ధుని వద్దకు వెళ్ళడం, ప్రసేనజిత్తు బుద్ధుని వద్దకెళ్ళడం, బుద్ధుని వద్దకు వెళ్తున్న శుద్ధోదన రాజు మొదలైన దృశ్య శిల్పాలు ఈ కోవకు చెందినవి. 'ఉత్తరకురు' చిత్రాలను కూడా సాంచి శిల్పి చెక్కాడు. కల్పవృక్షం కింద సంగీత మత్తు పానీయాలలో అనంత ఆనందాన్ని పొందడాన్ని 'ఉత్తరకురు' చిత్రమంటారు. నాలుగు జంతువుల వెనుక భాగాలు కలిసి ఉన్నట్లుగా జంతువుల శిల్పాలను చెక్కడంలో సాంచిశిల్పి తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. శ్రీలక్ష్మి, పూర్ణ కుంభ శిల్పాలను సాంచి శిల్పి పలుమార్లు చెక్కాడు.

సాంచీ స్తూప తోరణ ద్వారాల మీద శిల్పాలు బౌద్ధమత ప్రాశస్త్యాన్ని చాటుతున్నాయి. అంతేగాక రాజప్రాసాద వైభవ జీవితము, నగర జీవనము, గృహస్థ జీవితం, వేట, వినోదం చోటు చేసుకొన్నాయి. సాధారణ ప్రజాజీవనం సాంచీలో ప్రతిభింబిస్తున్నది. ఎస్.కె. సరస్వతి మాటల్లో ధనవంతులు, భూస్వాముల దర్బారు జీవితం, నిరంతరం యాంత్రికంగా కృషి చేసే మానవుని నిత్య జీవితం, అణుకువైన నెమ్మది కుటుంబ జీవితాన్ని గడిపే గ్రామీణ జీవితం, ఆటవిక మానవ జావితాలను సాంచీ శిల్పి అతి సహజంగా రూపొందించాడు. సాంచీ శిల్పకళ ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచి శిల్ప చరిత్రలో ప్రముఖ స్థానాన్ని వహించింది.

## 17.2 అమరావతి శిల్పకళ :

### 17.2.1 పరిచయం :

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు 35 కి.మీ. దూరంలో కృష్ణానదీ తీరాన అమరావతి ఉంది. ఇది ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బౌద్ధక్షేత్రం. ఇచటగల స్తూప నిర్మాణ కార్యక్రమం మౌర్య అశోకుని కాలంలోనే ప్రారంభమైనా, శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో అభివృద్ధి చెందినది. ఈ స్తూప అండము శిల్పచిత్ర సమన్వితము. శిల్పాలతో కూడిన ప్రాకారానికి నాలుగు వైపులా సింహరక్షితాలైన సామాన్య ద్వారాలున్నాయి. అండానికి చేర్చి నాలుగు ప్రధానదిశల కభిముఖింగా నాలుగు చతురస్రాకారపు తిన్నెలు, వాటిలో ఒక్కొక్క దాని మీద ఐదు ఆయకస్తంభాలున్నాయి. భారతీయ బౌద్ధకళా చరిత్రలో అమరావతి శిల్పకళకు ప్రత్యేక స్థానముంది. ఇచటి శిల్పాలు ఒక ప్రత్యేకమైన స్థానిక పద్ధతిలో తయారయ్యాయి. ఈ శిల్పకళాశైలని పోలిన శిల్పాలే ఇతర ఆంధ్రప్రాంత స్తూపాలలో కూడా లభ్యమైనందువల్ల బౌద్ధయుగ ఆంధ్ర శిల్పానికి 'అమరావతి శిల్ప కళారీతి' అనే పేరు వచ్చింది.

**17.2.2 శిల్పకళా కేంద్రాలు :**

శాతవాహన, ఇక్ష్వాకుల కాలం ఆంధ్రదేశ బౌద్ధమత చరిత్రలో స్వర్ణయుగము. శాతవాహనులు పరమత సహనం ప్రదర్శించడం వల్ల ఆంధ్రదేశంలో బౌద్ధమతం మహోజ్వల దశ ననుభవించింది. వర్తకులు, వృత్తిపనివారు, ధనికులైన స్త్రీలు విశేషంగా బౌద్ధాన్ని ఆదరించి పోషించినారు. భట్టిప్రోలు, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల, శాలి హుండం, నాగార్జున కొండ, గుడివాడ, గోలి, రామతీర్థం, పెద్దగంజాం, చినగంజాం, రామిరెడ్డిపల్లె, చందవరం, దూపాడు, బావికొండ, బుద్ధాం, కనుపర్తి, అల్లూరు, గుమ్మడి దుర్రు మొదలగు చోట్ల స్తూపవిహారాలు వెలిసాయి. ఇవన్నీ నాటి వాణిజ్య కేంద్రాలకు చేరువుగా, రహదారులపై నిర్మించ బడ్డాయి. ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండ ప్రసిద్ధ బౌద్ధ కేంద్రమయింది. అమరావతీ శిల్పకళకు ప్రధానంగా కృష్ణానదీ తీర ప్రాంతం ముఖ్య కేంద్రం. ఆంధ్రశిల్పుల పనితనం సాంచీ స్తూప ద్వార తోరణాల మీద కూడా కన్పిస్తుంది. ఆంధ్ర ప్రాంత స్తూపాలన్నీ ఇటుకల నిర్మాణాలు కావడం వల్ల వాటిలో అధికభాగం ధ్వంశమయ్యాయి. ఆనాటి బౌద్ధశిల్పాలు ముఖ్యంగా అమరావతి శిల్పాలు నేడు మద్రాస్‌లోని ఎగ్మోర్ మ్యూజియంలో, కలకత్తా, పారిస్, లండన్ మ్యూజియంలలో దర్శనమిస్తున్నాయి. అమరావతి, నాగార్జున కొండ, చందవరం పురావస్తుశాలలో కూడా బౌద్ధ శిల్పాలను మనం చూడవచ్చు.

**17.2.3 కాలం :**

అమరావతి శిల్పకళ క్రీ.పూ. 3వ శతాబ్దంలో ప్రారంభమై క్రీ.శ. 3వ శతాబ్దం వరకు కొనసాగింది. మౌర్య అశోకుని కాలంలో ప్రారంభమైన ఈ శిల్పకళ క్రీ.శ 2,3 శతాబ్దాలలో ఉచ్ఛ స్థితి నందుకొన్నది. క్రీ.శ. 4వ శతాబ్దం నుంచి ఆంధ్రదేశంలో బౌద్ధమతం క్షీణించడం ప్రారంభించడంతో ఇచటి శిల్పకళా చరిత్రలో కూడా ఒక రసవత్తర ఘట్టం ముగిసింది. అమరావతి తేజోనిహీనమైనా, అక్కడి శిల్పకళా సంప్రదాయము పల్లవులకు, చాళుక్యులకు ఆదర్శమైంది.

**17.2.4 లక్షణాలు :**

గుంటూరు జిల్లా పల్నాడు క్వారీలలో లభ్యమగు ఆకుపచ్చ లేక దూసర వర్ణపు రాయిని శిల్పాల తయారీకి అమరావతీ శిల్పి ఉపయోగించాడు. బార్హుత్, సాంచీ శిల్పాలు గ్రామీణ జీవితానికి సన్నిహితంగా ఉంటే అమరావతీ శిల్పంలో నాగరిక జీవితం ఉట్టిపడుతుంది. దేవి ప్రసాద్ ఘోష్ మాటల్లో ఉల్లాసకరము, నాగరికము ఐన జీవితం అమరావతి శిల్పంలో ప్రతిఫలిస్తుందని, వివిధ భంగిమలలో మానవాకృతిని మలచడంలోను, క్లిష్టాలైన మనోగత భావాలను చిత్రించడంలోను సిద్ధహస్తులైన అమరావతి శిల్పులకు సాటి మరొకరు లేరు. అమరావతి శిల్పాలలో లావణ్యం ఉట్టిపడుతుంది. అమరావతి శిల్పకళ భారతీయ కళకే పరాకాష్టయని ఫెర్గూసన్ పండితుటంటాడు. అమరావతీ శిల్పాలను చూసేటప్పుడు చైతన్య పూరితము, ఆదర్శప్రాయమైన సౌందర్యలోకం దర్శనమిస్తుందని బి.యస్.ఎల్. హనుమంతరావు అంటాడు. అయితే అమరావతి శిల్పాలలో పాత్రల సంఖ్య ఎక్కువ. అందువల్లనే మానవాకారాలను తొలిచేటప్పుడు కాళ్ళను సన్నంగా చూపడం జరిగింది.

**17.2.5. శిల్పకళారీతిలో దశలు :**

అమరావతి శిల్ప కళారీతి నాలుగు దశలకు చెందినదిగా పేర్కొనవచ్చు. అవి-

(1) క్రీ.పూ.200 -క్రీ.పూ.100 మధ్యకాలపు శిల్పకళ

(2) క్రీ.శ. 100నాటి శిల్పకళ

(3) క్రీ.శ. 150 నాటి శిల్పకళ

(4) క్రీ.శ. 200-క్రీ.శ. 250 మధ్య కాలపు శిల్పకళ.

మొదటి దశకు చెందిన శిల్పాల్లో కర్కశత్వం, భంగిమల్లో వికారత్వం, ముఖంలో నీరసత్వం కనపడుతుంది. నగల చిత్రీకరణలో సహజత్వం లోపించింది. కాళ్ళు నిలపడానికి వీలులేని భంగిమలలో రూపొందించబడింది. ఈ దశకు చెందిన శిల్పాల్లో మౌర్య, శుంగ కాలపు శిల్ప లక్షణాలు కన్పిస్తాయి. శిల్పాల అలంకరణ, ముఖ భంగిమల్లో బార్హుత్, అజంతాలోని శిల్పాలను పోలి ఉన్నాయి. ముఖాలు నేరుగా ఉన్నట్లు మలచబడింది. అనేక శిల్పాలకు తలపాగ ఉన్నది. కొన్ని శిల్పాలకు ఆభరణాలున్నాయి. ఇచట బుద్ధుని మానవ రూపంలో చూపలేదు. యక్షశిల్పాలు తరవాతి కాలమందలి గణపతి విగ్రహాలకు మార్గం చూపినవా అన్నట్లున్నాయి. మకరాలు పుష్పాలను నోటితో పట్లుకొని ఉన్నట్లు చూపబడింది.

రెండో దశకు చెందిన శిల్పాలు అందంగా, నాజూకుగా మలచడం జరిగింది. ముఖం అతిసహజంగ ఉంది. ఎక్కువ వస్త్రాలతో స్త్రీలను రూపొందించారు. ఈ దశకు చెందిన శిల్పాలు కూషాణులనాటి మధుర శిల్పకళారీతిని పోలి ఉన్నాయి. ఈ కాలంలో బుద్ధుని చిహ్నరూపంలోను, ప్రతిమారూపంలోను చూపటం జరిగింది. ఈ దశకు చెందిన శిల్పాల్లో ముఖ్యమైనవి మహాభినిష్క్రమణ, బుద్ధుని ఆరాధించే వారు, రామగ్రామ స్తూపం, మాయాదేవి స్నానమాచరించడం మొదలైనవి.

మూడో దశకు చెందిన శిల్పాలన్నింటినీ ఆచార్య నాగార్జునుడు నిర్మించిన వేదికపై చెక్కడం జరిగింది. ఈ శిల్పాలు మృదుత్వాన్ని కలిగి ఉన్నాయి. భంగిమలు పరిపూర్ణంగా ఉన్నాయి. ఈ శిల్పాలలో లావణ్యము ఉట్టిపడుతుంది. ఈ దశకు చెందిన శిల్పాల్లో ముఖ్యమైనవి నలగిరి భీభత్సాన్ని సృష్టించే చిత్రం, మహాభి నిష్క్రమణ, చూడా మహోత్సవం మొదలైనవి.

నాల్గో దశకు చెందిన శిల్పాలు పొడవుగా, సన్నగా ఉండడమేగాక ఎక్కువ నగలను కలిగి ఉన్నాయి. వీటిలో మణకర్ణిక, ఉదరబంధం, యజ్ఞోపవీతం ఉన్నాయి. బుద్ధుని జీవిత ఘట్టాలనేకం ఈ కాలంలో మలచబడింది. ఈ కాలంలో శిల్పి స్వేచ్ఛగా శిల్పాలను రూపొందించలేదు. యజ్ఞోపవీతాన్నీ దేవతలు, మానవులు అను భేదం లేకుండా ధరించెడి రీతిని శిల్పి ప్రవేశపెట్టాడు.

ప్రథమంలో అమరావతి శిల్పాలు పూర్తిగా దేశీయ పద్ధతిలో రూపొందాయి. ఈ శిల్పాలు అజంతా 10వ సంఖ్య గుహలోని వర్ణచిత్రాలను పోలి ఉన్నాయి. అమరావతి శిల్పి సృష్టించిన మానవ స్వరూపాలకు ముఖ్యలక్షణము లావణ్యము జగ్గయ్య పేట దగ్గర లభించిన రాతి పలకం మీద ఉన్న చక్రవర్తి స్నిగ్ధ స్వరూపాన్ని ఉదాహరించవచ్చు. ఇచటి క్రీస్తు శకానంతరపు చెక్కడాలలో కనిపించే వంపుసొంపుల స్త్రీ స్వరూపాలు లావణ్యంలో ఉచ్ఛస్థితిని అందుకొన్నాయి. లావణ్య మొక్కటే కాదు వీటిలో చైతన్యం కూడా మూర్తీభవించింది. ఆ తరువాత అమరావతి శిల్పంలో గాంధార శిల్పచ్ఛాయలు చోటు చేసుకున్నాయి. తన వ్యక్తిత్వానికి, దేశయతకు భంగం కలగకుండా ఆంధ్ర శిల్పి గాంధారశిల్ప కళా సాంప్రదాయాలను జీర్ణించుకొన్నాడని మార్షల్ అంటారు.

### 17.2.6 శిల్పకళ :

అమరావతి శిల్పకళలో కథావస్తువు బుద్ధుని జీవితంలోని ముఖ్యసంఘటనలు, జాతక కథలు, సామాన్యజీవిత దృశాలు. చదరంగా లేక గుండ్రముగా లేక దీర్ఘచతురస్రాకారంగా ఉన్న విభాగాలలో ఒక్కొక్క సంఘటనను ఉల్బణ శిల్పంగా మలచబడింది. భారతీయ శిల్పంలో మొగ్గదొడిగి వికసించిన శృంగార రసమయ లలిత కుసుమం అమరావతి శిల్పమని ఆనంద కుమారస్వామి పేర్కొన్నాడు.

బుద్ధుని జీవిత విశేషాలు, జాతక కథలను చిత్రించిన అనేక శిల్పఫలకాలు అమరావతిలో లభించాయి. మాయాదేవిస్వప్నం, మార ప్రలోభదృశ్యం, నందునితో సంభాషణ, నలగిరి అనే ఏనుగు మోకరిల్లడం, బుద్ధుని భిక్షాపాత్రను దేవతలు తీసుకొని పోవడం మొదలగు సన్నివేశాలను ప్రదర్శించే శిల్పాలు నాటి ఆంధ్ర కళాకారుల ప్రతిభకు నిదర్శనాలు. అమరావతి శిల్పకళలో చారిత్రక ఘట్టాలు తెలిపే సంఘటనలు కూడా చోటు చేసుకోన్నాయి. వాటిలో అజాతశత్రువు బుద్ధుని దర్శించడం ప్రధానమైంది. జాతక కథలలో మాంధాతు జాతకం, చద్దాంత జాతకం వెస్సాంతర జాతకం, మొదలగునవి మనోహరంగా శిల్పీకరించబడ్డాయి.

అమరావతి శిల్పకళలో నాగుల ప్రభావం అధికంగా కన్పిస్తుంది. సర్పాకారంలో ఉన్న స్తూపాలు, ముచిలిందనాగ దృశ్యం, నాగుపాము పడగలు ఉన్న స్త్రీ పురుష శిల్పాలనేకం అమరావతి శిల్పాలలో కలవు. ఇవి స్థానిక నాగజాతి ప్రభావమని పండితుల అభిప్రాయం.

కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ముఖ్యంగా అమరావతి, నాగార్జున కొండలలో బుద్ధుని విగ్రహాలనేకం లభించాయి. అమరావతిలో దొరికిన రెండు బౌద్ధ విగ్రహాలు 6 అడుగుల 4 అంగుళాల ఎత్తు కలిగివున్నాయి. స్థానక భంగిమలో ఉన్న ఈ ప్రతిమల ఎడమచేయి. ధ్యానముద్రలో ఉండగా , కుడిచేయి అభయ ముద్రలో వుంది. అంగవస్త్రం ఎడమ భుజం నుంచి ఎడమ ముంజేతి వరకు వుంది. ఈ అంగ వస్త్రం మడతలు చెక్కడంలో శిల్పులు తమ ప్రతిభను చూపారు.

అమరావతి శిల్పులు మానవ ఆకారాలను రమణీయంగాను, స్త్రీలను వివిధ శృంగార భంగిమలలో అపురూప రేఖా విన్యాసంతో మలిచారు. ఈ శిల్పాల్లో శాస్త్రయుక్తమైన అనేక నృత్యదృశ్యాలున్నాయి. వీణ, వేణువు, మృదంగం, శంఖం మొదలగు వాద్యాలు ఈ నృత్య భంగిమలలో కనిపిస్తాయి. అంతఃపురములో చక్రవర్తి ముందు స్త్రీలు నాట్యం చేయడం, బుద్ధుని అవశేషాలు పంచుకోనే సందర్భంలో నృత్యం చేయడం మొదలైన దృశ్యాలు నాటి శిల్పులు అద్భుతంగా చెక్కారు.

అమరావతి శిల్ప కళలో నాటి సామాజిక జీవితం కూడా ప్రతిఫలిస్తుంది. స్త్రీ పురుషులు ఉభయులు వివిధ దుస్తులలో, అలంకారాలలో, వివిధభంగిమల్లో కనిపిస్తారు. పలురకాల ఆభరణాలు, తలపాగాలతో యువతీయువకులు అందంగా చూపబడ్డారు. నగ్న సుందరీమణులు, మిధునశిల్పాలు అద్భుతంగా మలచబడింది. యక్ష, యక్షిణి ప్రతిమలలో బార్హుత్ కంటే అభివృద్ధి కనిపిస్తుంది. స్తంభాలపై మలచిన పద్మాలు, లతలు ఎంతో నాజూకుగా ఉన్నాయి. జంతువుల శిల్పాలు కూడా చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. వీటిలో చాలా భాగం రెక్కలున్న ఊహాజనిత జంతువులు. అమరావతీ శిల్పాలలో పశుపక్ష్యాదుల చిత్రణ అత్యంత ఆహ్లాదకరంగా ఉందని హేవల్ పండితుడంటాడు.

అమరావతి శిల్పాలలో పలురకాల గృహనిర్మాణం కనిపిస్తుంది. వీటిలో రెండు, మూడు అంతస్తులున్న భవనాలు కూడా ఉన్నాయి. గుర్రపునాడ ఆకారం కలిగిన కిటికీలు, కూటాగారాలు, వరండాలు, వాటికి తెరలు ఈ భవనాల ప్రత్యేకత. ఈ భవనాల పై కప్పు సమతలంగా లేక తీక్షణాగ్రం కలిగి ఉన్నాయి. నగరాల చుట్టూ ప్రాకారాలుండేవని అమరావతి శిల్పాలను బట్టి గ్రహించవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే అమరావతి శిల్పాలలో నాగరిక జీవితం ప్రతిఫలిస్తుంది.

నాగార్జున కొండ త్రవ్వకాలలో లభించిన ఇక్ష్వాకుల కాలం నాటి శిల్పాలు అమరావతీ శిల్పరీతి చివరి దశకు చెందినది. ఇచటి శిల్పాలలో బుద్ధుని జీవిత ఘట్టాలు, జాతక కథలు ప్రధాన ఇతివృత్తాలు. ఈ శిల్పాలన్నీ తెల్లని సున్నపు రాతితో చెక్కబడ్డాయి. కొన్ని శిల్పాలలో నైపుణ్యం లోపించినా మరికొన్ని అద్భుతంగా చెక్కబడాయి. మాయాదేవి స్వప్నం, సిద్ధార్థజననము, మహాభినిష్క్రమణ, అజాతశత్రువు బుద్ధుని దర్శనము, గౌతముని తలపాగా దేవతలు కొనిపోవడం మొదలగు దృశ్యాలు ప్రతిభావంతంగా చెక్కబడ్డాయి. స్మారక స్తంభాల మీద యుద్ధదృశ్యాలు అద్బుతంగా మలచబడ్డాయి. ఇంకా పొట్టేలును పట్టుకొని గంతులేస్తున్న మరుగుజ్జు, తొట్టెలో స్నానం చేస్తున్న స్త్రీ, ఆనందోత్సాహాలతో నృత్యాలు చేస్తున్న దృశ్యాలు గొప్పగా శిల్పీకరించబడాయి. వృక్షఛాయలలోని యక్షిణులు, వివిధ శృంగార భంగిమలల్లో వున్న మిధున దృశ్యాలు ఇచటి ప్రత్యేక ఆకర్షణ. నగ్నంగా స్నానమాడే సుందరాంగి, తడిసిన వెంట్రుకలను పిండుతూ ప్రియుని చిలిపి చేష్టలకు సిగ్గుతో ముడుచు కుంటున్న దృశ్యం అద్భుతంగా మలచబడింది. కోపంతో వున్న స్త్రీని పురుషుడు బుజ్జగించడం, అతడు ఆమెకు మధుపాత్రనందించడానికి ప్రయత్నం చేయడం, దానిని ఆమె నిరాకరించడం మొదలైన దృశ్యాలు ఎంతో సహజంగా వున్నాయి. స్త్రీ, పురుషుల శిరోజాలంకరణ, వస్త్రధారణరీతులు ఈ శిల్పాలలో చూడవచ్చు.

**17.2.7 శిల్పకళా వ్యాప్తి :**

అమరావతి శిల్పకళారీతి ఆంధ్రప్రాంతానికి మాత్రమే పరిమితంగాక విదేశాలకు కూడా వ్యాప్తి చెందింది. అమరావతీ శిల్పరీతి లో తయారైన బుద్ధుని విగ్రహాలు ఆగ్నేయాసియా అంతటా కనిపిస్తాయి. దీనిని బట్టి కృష్ణానదీ తీర ప్రాంతంనుంచి బౌద్ధమత ప్రచారకులు ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లినట్లు భావించవచ్చు. సావన్ కోలక్ నందు దొరికిన కంచు విగ్రహాలు గుంటూరు జిల్లా బుద్ధాం నందలి బౌద్ధప్రతిమలను పోలియున్నాయి. సుమత్రాలోని పాలెంబాగ్ సమీపంనందు లభించిన బుద్ధుని విగ్రహము అమరావతిలో తయారు చేయబడిందని కొందరి అభిప్రాయము. అలాగే అన్నాంలోని డాంగ్డువాంగ్, ధాయ్‌లాండ్‌లోని పాంగ్‌తుక్, జావాలోని దక్షిణ జంబర్,

బోర్నియాలోని కోటా, బాంగోయన్‌లలో అమరావతి శిల్ప కళారూపాల ప్రభావం కనిపిస్తుంది.

## 17.3 సారాంశము :

ప్రాముఖ్యంలోగాని, శిల్ప సంపదలో గాని సాంచీ స్తూపానికి ఏమాత్రం తీసిపోనిది అమరావతి స్తూపం. అమరావతి శిల్పంలోని అత్యధికభాగం ఆంధ్రశాతవాహనుల కాలంలో రూపొందినదే. ఇచటి శిల్పాలో ఎక్కువ భాగం బౌద్ధమత సంబంధమైనవే. శిల్పాలలో వివిధరకాల గృహనిర్మాణం మలచబడింది. అమరావతి శిల్పులు సృష్టించిన మానవ స్వరూపాలకు ముఖ్యలక్షణము లావణ్యము. అమరావతీ శిల్పాలలో లావణ్యమొక్కటే గాక చైతన్యం మూర్తీభవించింది. క్రీస్తుశకము రెండో శతాబ్దంలో ఉచ్ఛస్థితి నందుకొన్న అమరావతి చిత్రకళ తరవాత కొంత వరకు నిస్తేజమైంది. ఈ దశ అమరావతిలోనే గాక గోలి, నాగార్జున కొండ, గుమ్మడి దుర్రు మొదలగు చోట్ల దొరికిన చిత్రాలలో కూడా విశదమవుతుంది. క్రీస్తుశకము నాల్గో శతాబ్దం నుంచి ఆంధ్రదేశంలో బౌద్ధం క్షీణించడంతో పాటు అక్కడి శిల్ప కళా చరిత్రలో ప్రసిద్ధమైన ఘట్టం ముగిసింది. అమరావతి తేజోవిహీనమైనా, అక్కడి శిల్పకళా సంప్రదాయము పల్లవులకు, చాళుక్యులకు ఆదర్శమైంది.

## 17.4 నమూనా ప్రశ్నలు :

1) ఆంధ్రశాతవాహనులు పోషించిన చిత్రకళలను గూర్చి తెలుసుకోవడానికి ఆధారాలేవి?

2) సాంచీలోని శిల్పకళను గూర్చి వివరింపుము

3) అమరావతి శిల్పకళా రీతిని గూర్చి వివరింపుము.

**కె. సూర్యప్రకాష్ రెడ్డి.**

పాఠం - 18

# ప్రతిమా లక్షణ శాస్త్రం ( ICONOGRAPHY )

# బ్రహ్మ - విష్ణువు

## 18.0. లక్ష్యం :

ప్రతిమా లక్షణ శాస్త్ర నిర్వచనం, పరిధి,ఆధారాలు, విగ్రహారాధన ప్రాచీనత, బ్రహ్మ, విష్ణువు ప్రతిమా లక్షణాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


**18.1** పరిచయము

**18.1.1** నిర్వచనము, పరిధి

**18.1.2** ఆధారాలు

**18.1.3** విగ్రహారాధన ప్రాచీనత

**18.2** బ్రహ్మ

**18.3** విష్ణువు

**18.3.1** పరిచయము

**18.3.2** విష్ణు ప్రతిమా లక్షణాలు

**18.3.3** స్థానకమూర్తులు

**18.3.3.1** యోగస్థానక మూర్తి

**18.3.3.2** భోగస్థానక మూర్తి

**18.3.3.3** వీరస్థానక మూర్తి

**18.3.3.4** అభిచారికా స్థానక మూర్తి

**18.3.4** ఆసీన మూర్తులు

**18.3.4.1** యోగసన మూర్తి

**18.3.4.2** భోగాసన మూర్తి

**18.3.4.3** వీరాసన మూర్తి

**18.3.4.4** అభిచారికాసన మూర్తి

**18.3.5** శయన మూర్తులు

**18.3.5.1** యోగశయన మూర్తి

18.3.5.2 భోగశయన మూర్తి

18.3.5.3 వీరశయన మూర్తి

18.3.5.4 అభిచారిక శయన మూర్తి

18.3.6 అవతార మూర్తులు

18.3.6.1 మత్స్యావతారం

18.3.6.2 కూర్మావతారం

18.3.6.3 వరాహావతారం

18.3.6.4 నరసింహావతారం

18.3.6.5 వామనావతారం

18.3.6.6 పరుశురామావతారం

18.3.6.7 రామావతారం

18.3.6.8 కృష్ణావతారం

18.3.6.9 బుద్ధ

18.3.6.10 కల్కి

18.3.7 చతుర్వింశ త్రిమూర్తులు

18.4 సారాంశము

18.5 నమూనా ప్రశ్నలు


## 18.1 పరిచయము :

వివిధ మతాలకు సంబంధించిన దేవతా విగ్రహాల లక్షణాలగురించి, మత సాంప్రదాయాలు, ఆచారాల గురించి ప్రతిమాలక్షణ శాస్త్రం వివరిస్తుంది.

### 18.1.1 నిర్వచనము, పరిధి :

ప్రతిమాలక్షణ శాస్త్రం అంటే దైవ ప్రతిమలకు, దేవతారాధనకు సంబంధించిన విద్య. ప్రతిమ అంటే ఆంగ్లంలో ' ఐకొన్ ' (icon) అని, దానిని గూర్చి విశ్లేషణ చేసే శాస్త్రాన్ని ' ఐకొనోగ్రఫీ ' ( iconography ) అని వ్యవహరిస్తారు. దేవతారాధన అనేక విధాలు. ఇది క్రతు రూపంలో ఉంచవచ్చు లేదా జ్ఞాన సంబంధమైన నిర్గుణోపాసనగా ఉండవచ్చు లేదా ఈ ఆరాధన విగ్రహాల రూపంలో ఉండవచ్చు. హిందువులు ప్రధానంగా విగ్రహారాధకాలు. వారు పూజించే విగ్రహాలు ఆయా దేవతా సంబంధమై అలౌకిక శక్తి కలవని వారి నమ్మకము. ప్రాచీన హిందువులు దైవ ప్రతిమలను సూచించడానికి తనువు,ప్రతికృతి, రూపము, బింబము మొదలైన పదాలను వాడినారు. ఈ పదాలలో ఇమిడి ఉన్న భావమే వారి నమ్మకానికి తార్కాణము.

విగ్రహారాధనకు భక్తి, పూజ ప్రధానాలు, పూజావిధానములో ఆలయానికి వెళ్ళి దైవ దర్శనం చేయడం, ప్రార్ధన, మంత్రజపము, అర్చన, ధ్యానము ఉపాదానము అనే అంశాలు ఇమిడి ఉన్నాయి. విగ్రహాలు మానవరూపంలో ఉండవచ్చు లేదా నందీశ్వరునివలె జంతురూపంలో

ఉండవచ్చు లేదా మనుష్య, జంతురూపాలు రెండూ మిశ్రమమై ఉండవచ్చు, నృసింహ స్వామి విగ్రహాలు ఈ రకానికి దృష్టాంతాలు. వీటితో బాటు మారేడు, తులసిలాంటి వృక్ష జాతులు, సాలగ్రామాలు, బాణలింగాలు,యంత్రాలు కూడా పూజార్హాలే. విగ్రహాలు మట్టితోగాని, దారువుతోగాని, శిలతోగాని, లోహాలలోగాని చేయడం జరుగుతుంది.

హిందూమతమేగాక భారతదేశంలో అవిర్భవించిన జైన, బౌద్ధాలు కూడా కాలక్రమేణ విగ్రహారాధనను అలవరచు కొన్నాయి. వేర్వేరు మతాలకు వేర్వేరు దేవగణాలుంటాయి. హిందువులకు త్రిమూర్తులు పూజనీయులైనట్లే, బౌద్ధులకు ధ్యానబుద్ధుడు, జైనులకు తీర్థంకరులు ఆరాధ్యులు. మతాలను బట్టి దేవగణాలలో మార్పులుండడమే గాక ఒకేమతంలో ఉండే దేవగణం పరిమాణంలో కూడా మార్పులు రావచ్చు. కొంతమంది దేవతలు ఒక గణంలో నూతనంగా వచ్చి చేరవచ్చు, ఉన్నవారు. అందులోంచి నిష్క్రమించవచ్చు. ఒకరి స్థాయి తరగవచ్చు, వేరొకరి స్థాయి, పెరగవచ్చు. ఒకే మతంలో ఉండే వివిధ దేవతల లక్షణాలలో కూడా భేదాలుంటాయి. అంతేగాక ఒకే దేవతను సందర్భోచితంగా వివిధరూపాలలో ప్రదర్శించవచ్చు. ఒక మతము, లేదా మతశాఖ తాలూకు దేవగణము, దాని పరిణామక్రమము, అందులో ఉండే దేవతల లక్షణాలు. ఇటువంటివి వివరించేదే ప్రతిమాలక్షణ శాస్త్రము.

ప్రతిమాలక్షణ శాస్త్రపరిధి మూల మూర్తులకు, పార్శ్వమూర్తులకు, సంచారమూర్తులకు పరిమితమైంది. ఈ శాస్త్రంలో కేవలం మతాచారాలకు చెందిన ప్రజామూర్తులకే ప్రాముఖ్యం ఉంది. పై రకం మూర్తులే భంగిమల దృష్ట్యా ఆసీన మూర్తులు, శయన మూర్తులు, ఉత్థాన మూర్తులు అని మూడు రకాలకు చెందినవి. వీని వివరాలు సుప్రభేదాగమం,నారదీయ సంహితలలో ఉన్నాయి.

ప్రతిమాలక్షణ విద్య ప్రాచీన మతసంప్రదాయాలను, సదాచారాలను తేటతెల్లం చేయడమే కాక, వేర్వేరుమతాలు లేదా మతశాఖల మధ్య ఉండే వైరుధ్యాన్ని, వైరశమనమైన తరవాత అవి ఒక దానిలో ఒకటి సమన్వయం పొందిన రీతిని విశద-పరుస్తుంది. వీటికి ఉదాహరణలుగా శరభేశ, అర్ధనారీశ్వర ప్రతిమలను పేర్కోనవచ్చు. శరభేశప్రతిమ శైవ, వైష్ణవుల మధ్య ఒకప్పుడు నెలకొని ఉన్న వైరభావానికి తార్కాణము. అర్ధనారీశ్వర ప్రతిమశైవ, శాక్తేయుల కలయికను సూచిస్తుంది.

### 18.1.2 ఆధారాలు :

దేవప్రతిమా లక్షణాలు తెలిపే ఆధారాలు అనేకమున్నాయి. ముఖ్యంగా ప్రాచీనులు చేసిన రాతి, కంచు విగ్రహాలు దేవాలయాలు, పురావస్తు సంగ్రహాలయాలలో గలవు. వీటితోబాటు పూర్వులు ఇష్టదైవ మూర్తులను నాణేల మీదను, ముద్రికల మీదను కూడా చెక్కించి ఉంచు కొనేవారు. దేవ ప్రతిమాలక్షణాలను గూర్చి వారు రచించిన గ్రంధాలే అనేకమున్నాయి. ప్రతిమలను గూర్చి తెలుసుకోవడానికి ప్రధానమైన ఆధారాలు ఆగమాలు. ఈ ఆగమాలు దేవతామూర్తుల పరంగా శైవాగమాలని, వైష్ణవాగమాలని,శాక్తేయాగమాలని, జైనాగమాలని, బౌద్ధాగమాలని ఐదు రకాలు. శైవాగమాలు ఇంచుమించు 125 పైన ఉన్నాయి. వీటిలో కొన్ని సౌమ్యాగమాలని, కొన్ని రౌద్రాగమాలని ఉన్నాయి. సౌమ్యాగమాలని : కామికాగమం, యగాజాగమం, అచింత్యాగమం, కారణాగమం, దీప్తాగమం, సూక్ష్యాగమం సహస్రాగమం సుప్రభేదాగమం, అంశుమద్భేదాగమం. ఇవి శివుని అంశతత్వాన్ని వివరిస్తాయి. రౌద్రాగమాలలో ముఖ్యమైనవి విజయాగమం,నిశ్వాసతంత్రం, స్వాయంభువాగమం, అనలాగమం, వీరాగమం, రౌరవాగమం, మకుటాగమం, విమలాగమం, చంద్రజ్ఞానాగమం, సిద్ధాగమం మొదలగునవి. వైష్ణవాగమాలలో వైఖానసాగమం, పాంచరాత్రాగమం అనే రెండు ముఖ్యమైనవి. వైభానసాగమంలో తాంత్రిక, వైదిక మార్గాల అనుసంధానత్వ ఉంది. విష్ణువు ఔన్నత్యాన్ని పాంచ రాత్రాగమం ప్రతిపాదిస్తుంది.

పైన పేర్కోన్న ఆగమాలేగాక ప్రతిమాలక్షణాలకు గూర్చి అనేక శిల్పశాస్త్ర, వాస్తు శాస్త్రగ్రంధాలు చెపుతున్నాయి. వానిలో సమరాంగన సూత్రధారము, మానసారం, మయమత, అపరాజిత పృచ్ఛ, మానసోల్లాసం, అంశుమద్బేదాగమం, రూపమండనం, విష్ణు ధర్మోత్తర పురాణం, శిల్పరత్నం, ఈశాన గురుదేవ పద్ధతి ముఖ్యమైనవి.

**18.1.3 విగ్రహారాధన ప్రాచీనత :**

భారతదేశంలో విగ్రహారాధన ఎప్పుడు ఆరంభమైందనే విషయాన్ని గురించి తర్కించాలంటే తొలి సాహిత్యాధారాలు, తొలి పురావస్తు ఆధారాలు పరిశీలించాలి. క్రీ. పూ. 2వ శతాబ్దానికి చెందిన పతంజలి తన ' యోగసూత్రాలలో ' తాను చూసిన మూర్తిని లేదా మానవుని లేదా జంతువుల, వృక్షాల స్వభావ సహితమైన రూపాన్ని మనస్సులో నిల్పుకోవడాన్ని ' యోగం ' అని వివరించాడు. ఈ ' యోగం ' అనే సాంప్రదాయాన్ని పతంజలికి ముందుగానే హిరణ్య గర్భుడు, వార్షగణ్యుడు, యజ్ఞవల్క్యుడు మొదలగు వేదాంతవేత్తలు తెలియజేసారు. అందువల్ల ' యోగ ' సాంప్రదాయం క్రీ. పూ. 2వ శతాబ్ది కన్నా ముందుగానే ఏర్పడిందని భావించవచ్చు.

వ్యాకరణవేత్త అయిన పాణిని తన ' అష్టాధ్యాయి ' లో ' ప్రతికృతి ' అనే మాటను ఉపయోగించాడు. పాణిని క్రీ.పూ. 6 వ శతాబ్దికి చెందినవాడిగా పరిగణిస్తారు. ' ప్రతికృతి ' అంటే బదులుగా చేయడం అని అర్థం. పతంజలి తన వాఖ్యానంలో ఈ ' ప్రతికృతులు ' అర్చన కోసం ఉద్దేశింపబడ్డాయని చెప్పాడు. గృహ్యసూత్రాలలో దేవాలయాల నిర్మాణాన్ని గురించి, దేవతామూర్తుల పూజలకు సంబంధించిన ప్రస్తావనలున్నాయి. ప్రతిమ అనే మాట రుగ్వేదంలో ఉన్న పురుష సూక్తంలో ఉంది. రుగ్వేదంలో కొన్ని చోట్ల అనార్యులను గురించిన ప్రసంగంలో లింగారాధకులను ఇంద్రుడు అంతమొందించెనని ఉంది. ఈ లింగారాధన అనార్యులలో ఒక ఆచారమై ఉండవచ్చు. ఆ పూజ వారి జాతి అభివృద్ధి కోసం ఉద్దేశించి ఉండవచ్చు.

కొన్ని ఉపనిషత్తులలో (క్రీ.పూ. 800 - 500 ) ' సందృశ్ ' , ' ప్రతిమ ' అనే పదాలు ఉన్నాయి. అయినప్పటికి, వేదకాలంలో విగ్రహారాధన, దేవాలయ నిర్మాణం ఉండేవా అనేది వివాదగ్రస్తమైన విషయం. ఉండేదనేవారు కొందరు, లేవని వాదించేవారు మరికొందరు.వేదాలను పరిశీలిస్తే అనాడు వారు ఆరాధించింది ప్రధానంగా ప్రకృతిశక్తులనని తెలియవస్తుంది. వారి ఇంద్రుడు, వాయువు, సూర్యుడు, వరుణుడు, ఉషస్, పృధ్వీ మొదలైన వారు ప్రకృతిశక్తులే. ఆరాధన క్రతురూపంలో ఉండేది. అనగా వారి ఆరాధనా పద్ధతులలో యజ్ఞయగాదులు ప్రముఖ పాత్ర వహించి ఉండేవి. వేదాల నాటి ఈ క్రతు కర్మలు బ్రహ్మణ కాలంలో మరింత విస్తృతమైనాయి. వైదిక మతము క్రతుక్రియాబాహుళ్యమే కాని పూజా ప్రధానం కాదు, అయితే ఇక్కడ గమనించవలసిన విషయమొకటి ఉంది. భారత సంప్రదాయంలో ప్రతి మంత్రానికీ ఒక అధిష్ఠాన దేవత ఉంటుంది. మంత్రం ఆ దేవతాలక్షణాలను కీర్తిస్తుంది. కాని ఆ దేవతలకు భౌతిక సంబంధమైన రూపమిచ్చి ఆర్చించినారా అనేది నిశ్చయంగా చెప్పలేము. ఒక వేళ వేదాలలో విగ్రహారాధనా ప్రసక్తే లేదని భావించినా, వేదాలు తెలియ జేయనంత మాత్రాన ఆనాడు విగ్రహపూజలు లేవని వాదించడం సమంజసం కాదు. అది ఆనార్యుల ఆచారమై ఉండవచ్చు. ఒక వేళ విగ్రహారాధన ప్రధానంగా అనార్యుల ఆచారమే అయినా వైదికార్యులు క్రతు కర్తలేగాని విగ్రహారాధకులు కానప్పటికీ విగ్రహపూజ ఉపనిషత్ కాలానికి గాని తరవాత అనతి కాలంలోనే గాని శిష్టాచార సమ్మతం అయి ఉండవచ్చు. అనార్యులలో సంపర్కం చేతనో, మరి ఏ ఇతర కారణం చేతనో ఉపనిషత్ కాలంలో వైదిక ధర్మంలో కొన్ని విశిష్టమైన మార్పులు జరిగినాయి. ఉపనిషత్తులు మెచ్చినది క్రతువులు కాదు, భక్తి, ధ్యానము. శ్వేతాశ్వతరో పనిషత్తులో భక్తి అనే మాట ఉంది. భక్తి, పూజ, విగ్రహారాధనకు ప్రధాన భూమికలు. ఉపనిషద్గురువులు తపోధ్యాన తత్పరులై, విగ్రహారాధన చేపట్టక పోయినప్పటికీ విగ్రహపూజాదులు గృహ్యసూత్రాలలో గుర్తించడం జరిగింది. ఉపనిషత్ కాలం నుంచీ అర్యులు ఆరాధనా పద్ధతులలో వచ్చిన మార్పుల ననుసరించి వారి దేవగణాలలో కూడా కొన్ని పరిణామాలు జరిగినాయి. వేదాలలో అంతప్రధాన దేవతలుగా పరిగణితులు కాని రుద్రుడు, విష్ణువు తరవాత కాలాలలో ప్రధానులు ముఖ్యలు అయినారు. అప్పటి ప్రధానదేవతలైన ఇంద్ర, వరణాదుల ప్రాశస్త్యం తగ్గి దిక్పాలకులయినారు.

పురావస్తు ఆధారాలు రుగ్వేద కాలం కన్నా ముందరివే. సింధునాగరికత (క్రీ.పూ. 3000 - క్రీ.పూ.1500) స్థావరాలైన హరప్పా, మొహెంజోదారో మొదలగు చోట్ల మట్టితోను, రాతితోను చేసిన బొమ్మలు అనేకం లభించాయి. అందులో కొన్ని లింగరూపంలో ఉన్నాయి. ఈ లింగరూపాలు రుగ్వేదంలో  వచ్చిన లింగారాధకుల ప్రసక్తులను సమర్థిస్తున్నాయి. సింధు స్థావరాలలో మట్టితో చేసిన స్త్రీ ప్రతిమలనేకం లభించాయి. వీటికి మసిసోకి ఉంది. అందువల్ల సింధు ప్రజలు మాతృదేవతకు ఆరాధించే వారని భావించడం జరిగింది. ఒక ముద్రిక పై మూడు ముఖాలలో పద్మాసీనుడైన మూర్తి గలది త్రవ్వకాలలో లభించింది. దీనిని పశుపతి శివునిగా మార్షల్ పండితుడు

పేర్కొన్నాడు. సింధు స్థావరాల దగ్గర త్రవ్వకాలు జరిపిన వారిలో ఒకరైన మాకె పండితుడు అచట లభించిన బొమ్మలు సింధు ప్రజలు పూజించిన దేవతా ప్రతిమలే గాని వారి వినోద విలాస వస్తువులు కావని అభిప్రాయపడినాడు. అది నిజమే అయితే సింధునాగరికతా కాలం నుండే భారతదేశంలో విగ్రహారాధన ఉండేదని భావించవచ్చు.

భారతదేశంలో క్రీస్తుకు కొన్ని శతాబ్దాల పూర్వమే శివ, విష్ణువుల పూజలు ఆరంభమైనట్లు సాహిత్య, పురావస్తు ఆధారాలున్నాయి. కౌటిల్యుని 'అర్థ శాస్త్రం' (క్రీ.పూ. 4వ శతాబ్దం) లో శివాలయాల ప్రసక్తి ఉంది. ప్రాచీన భారత బౌద్ధ సాహిత్యంలో వాసుదేవులను ఒక ప్రత్యేక మతశాఖగా పేర్కొన్నారు. వాసుదేవులు శౌరసేన ప్రాంతంలో ప్రబలులై ఉండినట్లు మెగస్తనీస్ తన 'ఇండిక' లో పేర్కొన్నాడు. సాహిత్య ప్రస్తావనలేగాక శైవులను, వైష్ణవులను గురించి తెలిపే శాసనాలే ఉన్నాయి. క్రీ.పూ. ఒకటి, రెండు శతాబ్దాల నాటి బేస్‌నగర్, ఘోసుండి శాసనాలు వాసు దేవ గృహ నిర్మాణాలను, దైవ ప్రతిమా ప్రతిష్ఠాపనలను గురించి తెలియ జేస్తున్నాయి. శివ, విష్ణువులే గాక యక్షులను, సిద్ధులను, నాగులను, జైనులను కూడా పూజిస్తూండేవారనడానికి నిదర్శనాలున్నాయి. బీహార్‌లో లోహానిపూర్ అనే చోట మౌర్యకాలం నాటిదని భావిస్తున్న జైన తీర్థంకరుని విగ్రహమొకటి బయటపడింది.

## 18.2 బ్రహ్మ :

హిందూమత త్రిమూర్తులలో బ్రహ్మ ఒకడు. కాని శివ, విష్ణువుల వలె బ్రహ్మకు ప్రత్యేక దేవాలయం లేదు. దేవకోష్ఠాలలో బ్రహ్మకు స్థానం ఉంటుంది. విష్ణుపురాణం, శిల్పరత్నం, రూపమండనం వంటి గ్రంథాలలో బ్రహ్మను గురించిన వివరణ ఉంది. ఒక బంగారు గుడ్డు నుంచి జన్మించి హిరణ్య గర్భుడని, విష్ణువునాభికమల నుంచి జన్మించి పద్మగర్భుడని పిలువబడిన బ్రహ్మ అత్రిమహర్షికి, అనసూయకు దత్తాత్రేయుల వారి అంశంగా ఆవిర్భవించాడు. ఇతడు దక్షుడు మొదలైన ప్రజాప్రతులకు తండ్రి. త్రిపురాసుర సంహార సందర్భంగా శివునికి బ్రహ్మరథసారథిగా వ్యవహరించాడు. శివ, పార్వతుల కళ్యాణంలో బ్రహ్మ పూజారిగా వ్యవహరించాడు. విష్ణువుతో బాటు బ్రహ్మ ఔన్నత్యాన్ని లేదని రుజువు చేయడం జరిగింది.

రూపమండనంలో బ్రహ్మకు నాలుగు శిరస్సులని పేర్కొనడం జరిగింది. ఇవి నాలుగు వేదాలను, నాలుగు యుగాలను, నాలుగు వర్ణాలను సూచిస్తాయి. మొదట బ్రహ్మకు ఐదు శిరస్సులున్నాయని, ఒక దానిని శివుడు తొలగించినాడని ప్రతీతి. బ్రహ్మ మూర్తి స్థానక, ఆసీన, యానక పద్ధతులలో ఉంటుంది. స్థానక పద్ధతిలో పద్మపీఠం మీద నిలబడి ఉంటాడు. ఆసీనలో యోగాసన పద్ధతిలో ఉంటాడు. బ్రహ్మచేతులలో క్రింది వస్తువులు కాని, హస్త ముద్రికలు కాని ఉండవచ్చు. (1) కుడి చేతులలో అక్షమాల, కుర్చ, ఎడమచేతిలో కమండలం, (2) శ్రుక్ శ్రువాలు కుడి చేతుల్లో, ఆజ్యస్థాలి, కుశ ఎడమ చేతుల్లో (3) అభయ, వరద ముద్రికలు, వెనుక చేతుల్లో ఆక్షమాల, కమండలం (4) కుడి పైచేతుల్లో శ్రుక్, శ్రువ, క్రింది ఎడమచేతిలో కమండలం, కుడిచేయి వరద ముద్ర (5) శ్రుక, పుస్తకం పై చేతులలో , అక్షమాల, కమండలం క్రింది చేతులలో. రూపమండన గ్రంథంలో బ్రహ్మకు గడ్డం సూచింపబడింది. బ్రహ్మకు కుడి ఎడమ వైపు అతని భార్యలు సరస్వతి, సావిత్రి ఉంటారు.

లేపాక్షి దేవాలయ నాట్యమండపంలో కప్పుమీద చిత్రలేఖనంలోను, అదే దేవాలయంలో కళ్యాణ మండప స్తంభంపైన బ్రహ్మను పురోహితునిగా చిత్రించారు. కాళహస్తీశ్వరాలయ శత స్తంభమండవ స్తంభంలో బ్రహ్మ సమభంగ పద్ధతిలోనిలబడి, మూడు శిరస్సులు, నాలుగు హస్తాలు కలిగి ఉన్నాడు. కిరీటమకుటాలు, రెండు గ్రైవేయకాలు, యజ్ఞోపవీతం, ఛన్నవీర, పూర్ణోరుకం ఇతని అలంకారాలు. తాడిపత్రి రామలింగేశ్వరాలయ ఉత్తర గోపురం మీద హంసారూఢుడైన బ్రహ్మ శిల్పం ఉంది. బ్రహ్మకు దేవాలయాలు తమిళనాడులోని పుష్కర, కుంభకోణం, చిదంబరం, తిరువాడి మొదలగు చోట్ల గలవు. శ్రీశైల దేవాలయ ప్రాంగణంలో తూర్పు ప్రాకారం పై దక్షిణ దిశలో 'విశ్వకర్మ దేవర' అనే పేర ప్రత్యేక దేవతామూర్తిని చెక్కి ఉండడం విశేషం. కాని ఆ మూర్తి బ్రహ్మవలె చతుర్ముఖుడు కాక ఒకే ముఖం, నాలుగు చేతులు కలిగి పద్మాసనం మీద ఉన్నవాడు.

బ్రహ్మకు మాత్రమే కేటాయించిన దేవాలయంలో అతనిని 'విశ్వకర్మ' అనే పేరిట పూజిస్తారు. బ్రహ్మదేవాలయంలో ప్రదక్షిణంగా ఎనిమిది దిక్కులలోను ఆదిశేషుడు, గణేశుడు, మాతృకలు, ఇంద్రుడు, జలశాయి, పార్వతి, రుద్రుడు, నవగ్రహాలు, లక్ష్మి అనే పరివార మూర్తులుండడం కద్దు. బ్రహ్మ దేవాలయానికి సత్యుడు, సధర్ముడు, ప్రియోధ్రువుడు, యజ్ఞుడు, విజయుడు, యజ్ఞభద్రుడు, సర్వకామికుడు, విభవుడు అనే ఎనిమిది మంది ద్వార పాలకులున్నట్లు పేర్కొనడం జరిగింది.

## 18.3 విష్ణువు :

### 18.3.1 పరిచయము :

విష్ణుపూజకులు క్రీస్తు పూర్వమే ఒక మతశాఖగా ఏర్పడినట్లు ఆధారాలు ఉన్నాయి. విష్ణువు యొక్క ప్రసక్తి వేదాలలో ఉంది. కాని అందులో అతనిని శౌర కుటుంబంలో ఒకడుగా మాత్రమే భావించినారు. వేదాలలో విష్ణువుకు ఆపాదించిన లోకోత్తర క్రియ ఈ అనంతాన్ని తన మూడు పాదాలతో కొలవడం చేత ఉరుక్రమ, ఉరుగాయ, త్రివిక్రమ అను పేర్లు వచ్చినాయి. కాని పురాణాల కాలం వచ్చేసరికి విష్ణువు ఒక అసామాన్య ప్రతిభావంతుడైన దైవంగా రూపొందినాడు. ఆయన చుట్టూ ఒక ప్రసిద్ధమైన మతశాఖ ఏర్పడింది. ఈ పరిణామానికి వైదిక విష్ణువు, వాసుదేవ కృష్ణుడు ఒకరే అని భావన కలగడమే కారణము. మొదట వాసుదేవ కృష్ణుని, ఆయన దగ్గర బంధువులయిన సంకర్షణ, ప్రద్యుమ్న, సాంబ, అనిరుద్ధులతో కలిపి పంచ వీరులనే పేరుతో కొలిచినారు. వాయు పురాణంలో పంచవీరుల ప్రసక్తి ఉంది. రాజస్థాన్‌లో మోరా అనే చోట లభించిన ఒక శాసనంలో కూడా పంచవీరుల ప్రశంస ఉంది. కాని త్వరలోనే పాంచవీరము, చాతుర్ వ్యూహంగా మార్పుచెందింది. ఈ వ్యూహానికి కేంద్రం వాసుదేవ విష్ణువు. సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు ముగ్గురినీ ఆయన ప్రతిరూపాలుగా భావించారు. ఈ వ్యూహంలో సాంబుని పేరు లేదు. చాతుర్ వ్యూహ ప్రసక్తి మొదట పతంజలి గ్రంథంలో కనిపిస్తుంది. గుప్తుల కాలం వచ్చేసరికి ఈ వ్యూహంలో ఉన్నవారు నలుగురూ కాక ఇరవైనలుగురైనారు. హిందువులు ఏదైనా పూజ కుపక్రమించేటప్పుడు ఉచ్చరించే కేశవనామావళి ఈ చతుర్వింశ ద్వ్యూహంలో వారి పేర్లే. వాసుదేవ - విష్ణువు కేవలం ఒక వ్యూపంలో కేంద్ర స్థానంలో ఉండే వాడే కాదు. అతడు అవతార మూర్తి. వ్యూహ అవతార భావనలు రెండింటికీ భేదం ఉంది. వ్యూహంలో కేశవాదులు విష్ణువు అను రూపాలే. అవతారం అనురూపం కాదు. విష్ణువే ఈ భునికి ఒక కార్యార్థమై మనుష్యరూపంలోనూ, జంతు రూపంలోనూ లేదా ఆరెంటి మిశ్రమరూపంలోనూ వేంచేయడాన్ని అవతార మంటారు. అవతార భావనము భగవద్గీతలో ఒక శ్లోకంలో వివరించి ఉంది.

### 18.3.2 విష్ణుప్రతిమా లక్షణాలు :

సాధారణంగా విష్ణు మూర్తికి నాలుగు చేతులుంటాయి. పై చేతుల్లో శంఖం, చక్రం, క్రింది చేతులు అభయ, వరద ముద్రల్లో వుంటాయి. మంజీరాలు, ఉదర బంధం, యజ్ఞోపవీతం, గ్రైవేయకాలు, శ్రీవత్స చిహ్నం, కేయూరాలు, కంకణాల, మకర కుండలాలు, శిరో వేష్ఠనం, కరందమకుటం సర్వాలంకాలు. కౌస్తుభమణి, వైజయంతిమాల ఇతని ప్రత్యేక ఆభరణాలు. విష్ణువును నీలమైఘశ్యాముడనీ, పీతాంబర ధరుడనీ గ్రంథాలు ప్రస్తావిస్తున్నాయి. ఈతని అర్ధాంగులు శ్రీలక్ష్మి, భూలక్ష్మి.

విష్ణు ప్రతిమలను మూడు రకాలుగా విభజించవచ్చును. అవి స్థానక, ఆసీన, శయన మూర్తులు. వీటిలో ఒక్కొక్క వర్గంలోని మూర్తులలో తిరిగి యోగ, భోగ, వీర, అభిచారిక అను నాల్గు భేదాలున్నాయి. యోగరూపాన్ని యోగులు, భోగరూపాన్ని గృహస్థులు, వీర రూపాన్ని అధికారాన్ని కాంక్షించే రాజులు, అభిచారిక రూపాన్ని శతృనాశనాన్ని కోరేవారు పూజిస్తారు. ఒక్కొక్క వర్గంలోని మూర్తులను తిరిగి ఉత్తమ, మధ్యమ, అధమ మని మూడు రకాలుగా విభజించుట జరిగింది.

### 18.3.3. స్థానకమూర్తులు :

#### 18.3.3.1 యోగ స్థానక మూర్తి :

ఈ రూపంలో విష్ణువు నాలుగు చేతులు కలిగి, కుడి పైచేతిలో చక్రం, ఎడమ పై చేతిలో శంఖం ఉంటాయి. కుడి కింది చేయి

అభయ లేక వరద ముద్రలో, ఎడమ కింది చేయి కట్యవలంభిత ముద్రలో ఉంటుంది. భృగుమహర్షిని మార్కండేయ మహర్షికి కుడిఎడమలుగా నమస్కరిస్తున్నట్లు లేదా భూదేవిని కుడివైపు మార్కండేయుని ఎడమ వైపు చూపడం జరుగుతుంది. శివుని బొమ్మ ఉత్తడం వైపు ఉంటుంది. దక్షిణం వైపు బ్రహ్మను అక్షమాల, కమండలువుతో చూపడం జరుగుతుంది.

యోగ స్థానక మూర్తి రుషులు, దేవతల చేత పరివేష్టితుడైతే ఉత్తమ మూర్తి అని, బ్రహ్మ, శివులు లోపించినచో మధ్యమ మూర్తి అని, అందరూ లేనట్లయితే అధమ మూర్తి అని పేర్కొనడం జరిగింది.

### 18.3.3.2. భోగ స్థానక మూర్తి :

ఈ రూపంలో విష్ణువు నాల్గు భుజాలు కలిగి, పైకుడి చేతిలో చక్రాన్ని, పై ఎడమ చేతిలో శంఖాన్ని కలిగి, కింది కుడిచేయ అభయ లేద వరదముద్రలో, కింది ఎడమ చేయి కట్యవలంబిత లేదా కటక ముద్రలో ఉంటుంది. విష్ణువుకు కుడివైపు శ్రీదేవిని, ఎడమవైపు భూదేవి ఉంటుంది. విష్ణువుకు కుడివైపున భృగువు, ఎడమవైపున మార్కండేయుడు మోచేతి మీద నుంచుని నమస్కరిస్తున్నట్లు లేక ఉత్కుటి కాసనంలో చూపడం జరుగుతుంది. విష్ణువుకు పైభాగంలో మాయా, సంహ్లోరినీ, కామినీ, వ్యాజనీ వంటి దేవతలు, నారద తుంబురులు, కిన్నెరలు, యక్షులు, గంధర్వులు, ఋషులు, సూర్యుడు, చంద్రుడు అనే వారిని చూపడం జరుగుతుంది. ఉత్తర, దక్షిణ వైపులలో శివుని, బ్రహ్మను చూపడం జరుగుతుంది.

ఈ రూపంలో పై మొత్తాన్ని చూపిన ఉత్తమరకానికి చెందినదని, యక్షులు, విద్యాధరులు, నారద, తుంబురులు చూపిస్తే మధ్యమ రకానికి చెందినదని, వానితో బాటు ఋషులు, సూర్యుడు, చంద్రుడు, ఇతర పూజక మునులు లేనట్లైతే అధమ రకానికి చెందినదని అంటారు.

### 18.3.3.3 వీరస్థానక మూర్తి :

ఈ రూపంలో విష్ణువు శంఖాన్ని, చక్రాన్ని కలిగి ఉంటాడు. బ్రహ్మ, శివుడు, భృగువు, మార్కండేయుడు, కిష్కిందుడు, సుందరుడు, సనక, సనత్కుమార రుషులు, సూర్యుడు, చంద్రుడు విష్ణువును పరివేష్టించి ఉంటారు.

పై మొత్తంగా చూపిన మూర్తిని ఉత్తమ రకానికి చెందినదని, కిష్కిందుడు, సుందరుడు, సనకుడు, సనత్కుమారుడు లేకపోతే మధ్యమ రకానికి చెందినదని, వీరితో బాటు సూర్య, చంద్రులు, పూజక మునులు లేకపోతే అధమ రకానికి చెందినదని అంటారు.

### 18.3.3.4 అభిచారిక స్థానకమూర్తి :

ఈ రూపంలో విష్ణువు రెండు లేదా నాలుగు చేతులను కలిగి నల్లని అంగవస్త్రం ధరించి వుంటాడు. ఈ మూర్తిని ఏరకమైన దేవతలు, రుషులు పరివేష్టించి ఉండరు.

## 18.3.4 ఆసీన మూర్తులు :

### 18.3.4.1 యోగాసక మూర్తి :

ఈ రూపంలో విష్ణువు తెల్లని దేహంతో నాల్గుచేతులు కలిగి బ్రహ్మాసనం లేదా పద్మాసనంలో ఉంటాడు. ముందు రెండు చేతులు యోగ ముద్రలో ఉంటాయి. యజ్ఞోపవీతం, హారాలు, కుండలాలు, కేయూరాలు అలంకరించి ఉంటాయి. శివుని దక్షిణాభి ముఖంగా, బ్రహ్మను ఉత్తారాభిముఖంగా చూపాలి. వెనక వైపు చంద్రుడు, సూర్యుడు, సనక, సనత్కుమారులను, ప్రతిమ రెండు వైపులా బృగు, మార్కండేయులను, లేదా భూదేవి, మార్కండేయులను చూపాలి.

ఈ మొత్తంగా చూపిన మూర్తి ఉత్తమ తరగతికి చెందినది. సనక, సనత్కుమారులు, చంద్రుడు, సూర్యడు లేనట్లైతే అధుమ తరగతికి చెందినది.

**18.3.4.2 భోగాసన మూర్తి :**

ఈ రూపంలో విష్ణువు సింహాసనం మీద ఆసీనుడై ఉంటాడు. కుడివైపు లక్ష్మీ, ఎడమ వైపు భూదేవి ఉంటారు. ఈ మూర్తికి నాలుగు చేతులు, కుడిపై చేతిలో చక్రం, కింది చేయి వరద లేదా అభయ ముద్రలో, ఎడమ పై చేతిలో శంఖం, కింది చేయి కట్యవలంబితంగాగాని, సింహ కర్ణ ముద్రలో గాని ఉంటుంది. బ్రహ్మ, శివ, మార్కండేయ,భృగువులను యోగస్థానమూర్తి రూపంలో చూపాలి. ఈ మూర్తిని ఇంకా వెనక వైపు మాయ, సంహ్లాదినీ అనే దేవతలను, నారద తుంబురలను, కిన్నెరుల జంటను, యక్షవిద్యాధరులను, సనక సనత్కుమార రుషులను, చంద్ర సూర్యులను చూపాలి. వీటితో బాటు కల్పవృక్షాన్ని చూపాలి.

ఈ మొత్తందా చూపిన మూర్తిని ఉత్తమ మూర్తి అని, కిన్నెరులు, నారద తుంబురులు, యక్ష విద్యాధరులు లేనట్లయితే మధ్యమ మూర్తి అని, సనక సనత్కుమారులు, సూర్య చంద్రులు కూడా లేకపోతే అధమ రకానికి చెందిన మూర్తి అని అంటారు. కంచి, బాదామి, ఎల్లోరా మొదలైన చోట్ల భగాసన మూర్తి ప్రతిమలు గలవు.

**18.3.4.3 వీరాసన మూర్తి :**

ఈ రూపంలో విష్ణువు సింహాసన మీద వీరాసనంలో ఉన్నట్ల చూపాలి. క్రింది భాగంలో లక్ష్మిని, భూదేవిని మొక్కుతున్నట్లు చూపాలి. ఈ రూపంలో విష్ణువు నాల్గు చేతులు కలిగి పై చేతుల్లో చక్రం, శంఖం, కింది చేతులు అభయలేవరద ముద్ర, సింహకర్ణ ముద్రలో ఉంటుంది. ఈ మూర్తికి కుడివైపు బ్రహ్మ, మార్కండేయులు, ఎడమవైపు శివుడు, భృగువు ఉంటారు. ఇద్దరు అప్సరస స్త్రీలు ఇరువైపులా చామరాలు వీస్తున్నట్లు చూపించాలి. అలాగే సనక, సనత్కుమార రూషులు, నారద తుంబురులు, సూర్య చంద్రులు కూడా చూపాలి.

ఈ మొత్తం మూర్తిని ఉత్తమ వర్గానికి చెందినదని, నారద, తుంబురులు. అప్సరసలు, రుషులు లేకపోతే మధ్యమ వర్గానికి చెందినవని, బ్రహ్మ, శివుడు, లక్ష్మీ, భూదేవి, సూర్యుడు, చంద్రుడు కూడా లేనట్లైతే అధమ వర్గానికి చెందిన మూర్తి అని అంటారు. అధమ వీరాసన మూర్తి శిల్పం వెహోల్‌లో గలదు.

**18.3.4.4 అభిచారికాసన మూర్తి :**

ఈ రూపంలో విష్ణువు రెండు లేక నాల్గు చేతులు కలిగి ఉంటాడు. ఇతడు కృష్ణ వర్ణుడు. నల్లని అంగ వస్త్రం కలిగినవాడు. ఈ మూర్తికి దైవ, మానుష వ్యక్తులను చూపడం జరగదు.

## 18.3.5 శయన మూర్తులు :

**18.3.5.1 యోగశయన మూర్తి :**

అనంతాసనం మీద ఉన్న ఈ మూర్తి ఒకింత లేచినట్లుండి, మిగిలిన శరీర మంతా పడుకొన్నట్లే ఉంటుంది. ఈ మూర్తికి కేవలం రెండు చేతులే ఉంటాయి. కుడి చేతిని కిరీటం తాకేటట్లుగా ఉంచి, ఎడమ చేతిని కటక ముద్రలో గాని, తొడని తాకేటట్లు శరీరానికి సమాంతరంగా ఉండటం గాని చేయాలి. ఈ మూర్తికి పక్కన భృగువును, మార్కండేయుని, పాదాల దగ్గర మధుకైటుభులను చూపాలి. నాభి పద్మంలో బ్రహ్మను చూపాలి. వెనక వైపు గరుడుడు, విష్వక్సేనుడు అనే ఆయుధ పురుషులను, సప్తర్షులను అంజలి ముద్రలో చూపాలి. దక్షిణం వైపు బ్రహ్మ, ఉత్తరం వైపు శివుని ఆసన స్థితిలో చూపాలి.

ఈ మొత్తంతో కూడిన మూర్తిని ఉత్తమమని, విష్వక్సేనుడు, సప్తరుషులు లేనట్లైతే మధ్యమ మని, పూజక మునులు, మధు, కైటుభులు కూడా లేనట్లైతే అధమ వర్గానికి చెందిన మూర్తి అని అంటారు. మహాబలిపురంలో యోగశయన మూర్తి శిల్పం ఉంది.

**18.3.5.2 భోగశయన మూర్తి :**

పడుకొన్న స్థితిలో ఉన్న ఈ మూర్తి కూడా యోగశయన మూర్తిలాగానే ఉంటుంది. తలవైపున లక్ష్మిని, ఎడమ కాలిని తగిలేటట్లు భూదేవీని చూపాలి. కుడి వైపున మార్కండేయుని, ఎడమ వైపున భృగువును, దక్షిణ గోడపై బ్రహ్మను, ఉత్తర గోడపై శివుని చూపించాలి. వీనికి తోడు దక్షిణం వైపు గణేశుని, ఉత్తరం వైపు దుర్గను చూపాలి. పాదాల దగ్గర మధు, కైటుభులను చూపించాలి. నాభి పద్మం నుండి ఆవిర్భవిస్తున్నట్లు బ్రహ్మను చూపాలి. బ్రహ్మకు కుడి వైపున ఐదుగురు ఆయుధ పురుషులను గరుడుని, గరుడునికి పైన కుడివైపున సూర్యుని చూపాలి. బ్రహ్మకు ఎడమవైపున ఆశ్వినీ దేవతలను, బాల్య స్థితిలో ఉన్న నారద తుంబురులను, చంద్రుని చూపాలి. వీరికితోడు అన్నిదిక్కుల అష్టదిక్పాలకులను, అప్సర స్త్రీలను చూపించాలి.

ఈ మొత్తం దేవ దేవాంగనలతో కూడిన భోగశయన మూర్తిని ఉత్తమ భోగశయన మూర్తి అని, నారద తుంబురులు, దిక్పాలకులు లేనట్లైతే మధ్యమ తరగతికి చెందిన మూర్తి అని అంటారు.

**18.3.5.3 వీరశయన మూర్తి :**

ఈ రూపంలో విష్ణువుకు నాలుగు చేతులుంటాయి. పాదాలవద్ద మధు, కైటుభులను, రెండు వైపులా లక్ష్మీ, భూదేవిలను చూపాలి. కుడివైపున మార్కండేయుని, ఎడమవైపున భృగువును, నాభికమలం నుంచి బ్రహ్మను, వెనుకవైపు ఐదుగురు ఆయుధ పురుషులను, గరుడని, సూర్య చంద్రులను, సప్తర్షులను, ద్వాదశదిత్యులను, ఏకాదశ రుద్రులను, అప్సరసలను, తుంబుర నారదలను, ఇద్దరు కిన్నెరులను, సనక సనత్కుమారును, బ్రహ్మను, శివుని చూపాలి.

ఈ మొత్తంతో కూడిన మూర్తిని ఉత్తమ తరగతికి చెందినదని, ఆదిత్యులు, అప్సరసలు సప్తర్షులు లేక పోతే మధ్యమమని, వీరితో బాటు కిన్నెరులు, సనక సత్కుమారులు, మునులు లేకపోతే అధమ వర్గానికి చెందిన మూర్తి అని అంటారు.

**18.3.5.4 అభిచారిక శయన మూర్తి :**

రెండు పడగల ఆదిశేషుని తల్పంమీద నేలమీద పడుకొన్నట్లు ఈ మూర్తిని చూపాలి. ఈ రూపంలో మూర్తి నాల్గు చేతులు కలిగి ఉంటాడు. పార్శ్వ పరివార దేవతలు ఉండరు.

ఈ తరహా మూర్తిని ఉత్తమ వర్గానికి చెందిన మూర్తిఅని, ఒకేపడగ గల పాము ఉన్నట్లయితే మధ్యమమని, సర్పతల్పం లేక పోతే అధమ తరగతికి చెందిన మూర్తి అని అంటారు.

**18.3.6 అవతార మూర్తులు :**

మత్స్యపురాణం ప్రకారం భృగుమహర్షి శాపం వల్ల విష్ణువు అవతారాలు ధరించవలసి వచ్చినట్లు తెలుస్తుంది. అదే పురాణంలో శుక్రుడు విష్ణువుని ఏడు పర్యాయాలు మానవుడుగా జన్మించాలని శపించినట్లు పేర్కొనబడింది. ఆ శాపం వల్ల విష్ణువు ధర్మగ్లాని జరిగినపుడు జన్మించి అధర్మాన్ని అణచి వేయడం జరిగింది. ఆ ఏడు అవతారాలు దత్తాత్రేయుడు, మాంధాత, పరశురాముడు, రాముడు, వేదవ్యాసుడు, బుద్ధుడు, కల్కి. కాని భాగవత పురాణంలో 22 అవతారాలను పేర్కొనడం జరిగింది. అవిః పురుష , వరాహ, నరాద, నారనారాయణ, కపిల, దత్తాత్రేయ, యజ్ఞ, ఋషభ, పృథు, మత్స్య, కూర్మ, ధన్వంతరి, ధన్వంతరి, నరసింహ, వామన, పరశురామ, వేదవ్యాస, రామ, బలరామ, కృష్ణ, బుద్ధ, కల్కి. వీటన్నింటిలో దశావతారాలు పేరొందినవి. అవి - మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్క్యవతారాలు. వీనిలో కల్క్యవతారం భవిష్యత్తును సూచిస్తుంది.

**18.3.6.1 మత్స్యావతారం :**

శతపథ బ్రాహ్మణంలోను, భారత భాగవతాలలో ఈ మూర్తిని గురించిన గాధాలున్నాయి. హయగ్రీవుడనే రాక్షసుడు వేదాలను దొంగలించగా విష్ణువు మత్స్యరూపంలో హయగ్రీవుని చంపి వేదాలనుద్దరించి బ్రహ్మవశం చేశాడు. ఈ మూర్తిని రెండు రకాలుగా

చూపడం జరిగింది. ఒక రకంలో కేవలం చేపను చూపడం, రెండో రీతిలో సగభాగం చేపగాను, సగభాగం మానవునిగాను చూపడం. రెండొరకం మూర్తికి కిరీట మకుటం, నాలుగు చేతులుంటాయి. రెండు చేతులలో శంఖం, చక్రాలను, మిగిలన రెండు అభయ, వీరద ముద్రలలో చూపాలి.

ఈ రూపం కలిగిన మూర్తి ఆలయాల గోపురాల మీద, స్తంభాల మీద శిల్పరూపంలో వుంటుంది. తాడిపత్రిలోని వెంకటరమణ ఆలయ మహామండపంలోని స్తంభం మీద ఈ రూపం అద్భుతంగా చెక్కి ఉంది.

**18.3.6.2 కూర్మావతారం :**

భాగవత పురాణంలో ఈ అవతారం గూర్చి వర్ణన ఉంది. దేవతలు అమృతం కోసం పాల సముద్రాన్ని చిలికేటప్పుడు కవ్వంగా చేసికొన్న మంధర పర్వతాన్ని మోయడానికి గాను విష్ణువు కూర్మావతారాన్ని ధరించడం జరిగింది. ఈ రూపంలో పై భాగం మానవునిగా, దిగువ భావం తాబేలుగా చూపడం జరుగుతుంది. కిరీటం, నాలుగు చేతులు, పై రెండు చేతులలో శంఖం, చక్రం, కింది రెండు చేతులు అభయ, వరద ముద్రలలో ఉంటాయి.

తాడిప్రతి ఆలయంలో ఈ మూర్తి శిల్పం ఉంది. లేపాక్షి వీరభద్రాలయంలో ఒక చక్కటి వర్ణ చిత్రం ఉన్నది. శ్రీకాకులం జిల్లాలోని శ్రీకూర్మంలో కూడ ఈ రూపం గలదు.

**18.3.6.3 వరాహావతారం :**

విష్ణు, లింగ, గరుడ పురాణాలలో, తైత్తిరీయ ఆరణ్యకంలో ఈ మూర్తి గురించి వివరం ఉంది. హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూమిని చాపగా చుట్టడానికి యత్నించగా విష్ణువు హిరణ్యాక్షుని చంపి భూమిని రక్షించడానికి వరాహావతారాన్ని ధరించాడనేది ప్రాచుర్యంలో ఉన్న కథ. ఈ మూర్తిని మూడు ప్రధాన రూపాలుగా తీర్చారు. అవి - (1) ఆదివరాహ లేదా భూవరాహ మూర్తి (2) యజ్ఞవరాహమూర్తి (3) ప్రళయ వరాహ మూర్తి.

భూవరాహ వర్ణన వైఖాన సాగమం, శిల్పరత్నం, అగ్ని పురాణం, విష్ణు ధర్మోత్తర పురాణాలలో చెప్పడం జరిగింది. వైఖానసాగమం ప్రకారం ఆదివరాహమూర్తి మానవదేహంతో, వరాహ ముఖంతో ఉంటుంది. నాలుగు చేతులలో కుడి ఎడమల చక్రశంఖాలుంటాయి. కుడికాలు కొంచెం ముందుకు వంగి ఆదిశేషుని పడగపై ఉంచాలి. ఎడమ చేయి భూదేవికి ఆసరా ఇస్తున్నట్లు చూపాలి. ముఖాన్ని ఎత్తి ఆమె వక్షాన్ని స్పృశిస్తున్నట్లు చూపాలి. భూదేవిని అంజలి ముద్రలో చూపాలి.

యజ్ఞవరాహ మూర్తిని నాలుగు చేతులతో సింహాసనం మీద కూర్చొన్నట్లు చూపాలి. ఎడమకాలును పీఠం మీద ఉంచి కుడి కాలుని వేలాడదీయాలి. కుడివైపున లక్ష్మిని, ఎడమవైపున భూదేవీని చూపించాలి. లక్ష్మీ ఎడమచేతిలో పద్మం, భూదేవి కుడిచేతిలో నీలోత్పలం ఉండాలి.

ప్రళయ వరాహరూపంలో మూర్తిని నాలుగు చేతులు, పై చేతులలో శంఖ, చక్రాలు, కుడి కిందిచేయి అభయ ముద్రలో, ఎడమ చేయి ఎడమ తొడమీద ఆన్చినట్లు చూపాలి. కుడివైపున నీలోత్పలాన్ని ధరించిన భూదేవిని చూపించాలి.

మహాబలిపురంలో వరాహ అవతారాన్ని చూపించే అద్భుతమైన శిల్పం ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఉదయగిరి గుహల్లో గుప్తుల కాలం నాటి వరాహ శిల్పం ప్రసిద్ధమైనది. వీరాసన పద్ధతిలో పీఠం మీద కూర్చున్న వరాహమూర్తి శిల్పం గోరంట్ల మాధవరాయాలంలో ఉంది. పెనుగొండ రామాలయంలో హిరణ్యాక్షునితో పోరాడుతున్న మూర్తి ఉంది. బాదామి, నాగాలాపురం మొదలగు చోట్ల ఈ మూర్తి శిల్పాలున్నాయి.

**18.3.6.4 నరసింహావతారం :**

కూర్మ, వాయు, పద్మ, భాగవత పురాణాలలో ఈ మూర్తి ఆవిర్భావాన్ని గురించి వివరాలు గలవు. విష్ణువు నరసింహ రూపాన్ని ధరించి తన తొడల మీద హిరణ్యకశిపుడనే రాక్షసుని పెట్టుకొని సంధ్యా సమయంలో గోళ్ళతో చీల్చి చంపిన ఐతిహ్యమిది. ఈ రూపం లో నాలుగు ప్రధాన రకాలున్నాయి. అవి - (1) గిరిజా లేక కేవల నరసింహ (2) ఉగ్ర లేక స్థాన నరసింహ (3) యానక నరసింహ (4) లక్ష్మీ నరసింహ.

గిరిజానరసింహమూర్తి ఉత్కుతి కాసనంతో పద్మం మీద కూర్చొన్నట్లు లేక పద్మాసనంలో ఉన్నట్లు చూపబడతాడు. కాళ్ళకు యోగపట్ట బంధం ఉంటుంది. రెండు లేదా నాలుగు చేతులు, పై కుడి, ఎడమ చేతుల్లో చక్ర శంఖాలు, మిగిలిన రెండు చేతులు మోకాళ్ళమీద అన్చి ఉంటుంది. శిల్పరత్నం ప్రకారం మిగిలిన రెండు చేతులలో గద, పద్మాలుండాలి. శిరస్సుపై కరండ మకుటం ఉండడం సాంప్రదాయం. ఎడమవైపున నీలోత్పలాన్ని ధరించిన భూదేవిని, కుడివైపు పద్మాన్ని ధరించి లక్ష్మిని చూపాలి.

స్థంభం నుంచి ఆవిర్భవించడం వల్ల ఆ మూర్తిని స్థాణ నరసింహమూర్తి అని, ఎంతో కొపాన్ని చూపడం ఉగ్ర నరసింహమూర్తి అని అంటారు. సింహాసనం మీద కూర్చున్న ఈ మూర్తి తన నాలుగు చేతులలో పై రెండింటిలో శంఖ, చక్రాలు, కుడిచేతిని అభయ లేక వరద ముద్రలో, ఎడమ చేతిని తొడపై చూపాలి. మరొక ఆధారం ప్రకారం ఈ మూర్తి ఎడమ తొడపై హిరణ్యకశిపుని చీలుస్తున్నట్లు చూపాలి.

యానక నరసింహ మూర్తిని గరుడుడు గాని, అదిశేషుడు గాని మోస్తున్నట్లు చూపాలి. నాలుగు చేతులు గల ఈ మూర్తి పై ఎడమ, కుడి చేతులలో శంఖ, చక్రాలు ధరించాలి. నరసింహుని శిరస్సుపై ఐదుపడుగల ఆదిశేషుని గొడుగులాగ చూపాలి.

లక్ష్మీనరసింహమూర్తిని పద్మాసనంలో ఆసీన స్థితిలో చూపాలి. ఎడమ తొడమీద లక్ష్మిని ఉంచి ఆమె పాదాలను ఒక పద్మం తాకేలా తీర్చాలి. పై ఎడమ, కుడిచేతులు శంఖ, చక్రాలు ధరించగా కింది కుడి చేయి అభయ ముద్రలో ఎడమ చేయి లక్ష్మీని కౌగలించు కొన్నట్లు చూపాలి. లక్ష్మి కుడిచేతిని నరసింహుని వీపు మీద ఉంచగా, ఎడమ చేతిలో పద్మాన్ని ధరించి ఉంటుంది.

బాదామి, ఎల్లోరా, హలెబీడు, సింహాచలం, యాదగిరి, అహోబలం మొదలగు చోట్ల నరసింహ ప్రతిమలున్నాయి.

**18.3.6.5 వామనావతారం :**

భాగవత, మత్స్య, అగ్ని, విష్ణు ధర్మోత్తర పురాణాలలో, వైఖాన సాగమం, రూప మండపం, శిల్పరత్నాలలో వామనావతార వృత్తాంతం చిత్రించడం జరిగింది. హిరణ్యకశిపుని మనుమడైన బలి అనే రాక్షస రాజును సంహరించడానికి విష్ణువు వామనావతారాన్ని ఎత్తవలసి వచ్చింది. వైఖాస సాగమంలో వామనుడు కమండలాన్ని ఒక చేతిలో, గొడుగును మరో చేతిలో పట్టుకొని ఉన్న సూచితమైంది. అతడు జింక చర్మాన్ని ధరించి ఉంటాడు. పాతాళ, భూలోక, స్వర్గలోకాలను చూపించడానికి ఎడమకాలు మోకాలు వరకు, బొడ్డువరకు, శిరస్సు వరకు ఎత్తబడి ఉంటుంది. వామనునితో బాటుగా త్రివిక్రముని చూపడం పద్ధతి. ఇతనికి నాలుగు, లేదా ఎనిమిది చేతులుంటాయి. శంఖ, చక్ర, గద, ధనుస్సు, హల ఆయుధాలుంటాయి. వరుణుడు, వాయుదేవుడు చామరాలను ధరించి ఉంటారు. కుడి ఎడమ వైపు సూర్య, చంద్రులుంటారు.

మహాబలిపురంలోని వరాహ గుహాలయంలో అద్భుత త్రివిక్రమ శిల్పం వుంది. బాదామి, ఎల్లోరా, బేలూరు మొదలుగు చోట్ల త్రివిక్రమ శిల్పాలు గలవు.

**18.3.6.6 పరశురామావతారం :**

అగ్ని, విష్ణు, భాగవత పురాణాలలో పరశురాముని గురించి వివరం ఉంది. విష్ణు అవతారాలలో ఆవేశభావంగా చెప్పబడిన పరశురాముడు బ్రాహ్మణ, క్షత్రియ సామాజిక సంబంధాలకు దైవత్వాన్ని ఆపాదించడం అనే ప్రయత్నానికి చక్కని ఉదాహరణ. వైఖాన

సాగమం ప్రకారం పరశురామునికి  రెండు చేతులు, కుడి చేతిలో పరశు, ఎడమ చేతిని సూచీ ముఖ హస్తంలో చూపాలి. శిరస్సుపై జటామకుటం, శరీరంపై యజ్ఞోపవీతం ఉండాలి. అగ్ని పురాణం ప్రకారం పరశురాముడు నాలుగు చేతులు కలిగి పరశు, ఖడ్గం, బాణం, ధనస్సు ధరించి ఉండాలి.

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ కళ్యాణ మండపంలో ద్విభంగ పద్ధతిలో నిలబడిన పరశురాముని శిల్పం ఉంది. కెనరా జిల్లా గోకర్ణంలో ఈ మూర్తికి ప్రత్యేక ఆలయం వుంది.

**18.3.6.7 రామావతారం :**

రామాయణం లోని ఉత్తరకాండ రామావతార వివరాలు పేర్కొనగా, రామోపనిషత్తులు రామావతార తత్వాన్ని, రాముని అవతార తత్త్వ రహస్యాలను వివరిస్తున్నాయి. భారతీయులకు ఆదర్శప్రాయుడైన శ్రీరాముడు అనేక దేవాలయాలలో మూలా విరాట్టుగా, శిల్పంగా కన్పిస్తాడు. సామాన్యంగా రాముని ప్రతిమ విడిగా చూడం. అతని ధర్మపత్ని అయిన సీత, సోదరుడైన లక్ష్మణుడు, సేవకుడైనా హనుమంతుడు, ఒక్కొక్కసారి ఇతర సోదరులైన భరత, శత్రుఘ్నులు కూడా కలిసే ఉంటారు. రామప్రతిమ అతిమానుష స్వభావాన్ని అభివ్యక్తం చేస్తూ రెండే చేతులు కలిగి ఉంటుంది. కుడిచేతిలో బాణాన్ని, ఎడమ చేతిలో ధనుస్సును చూపాలి. రాముడు త్రిభంగ పద్ధతిలో కిరీట మకుటం ధరించి ఉంటాడు. సీత తలమీద కరండ మకుటం ఉండాలి. సీత తన ఎడమచేతిలో నీలోత్పలాన్ని ధరించి, కుడిచేతిని జారవిడిచినట్లు చూపాలి. లక్ష్మణుడు అన్నివిధాలా రాముని పోలి ధనుర్బాణాలు ధరించి ఉండాలి. రాముని ఎదురుగా రెండు చేతులు గల హనుమంతుని భక్తి ప్రపత్తిలో చూపాలి.

మహాబలిపురం, రామేశ్వరం, త్రివేంద్రం మొదలైన చోట్ల ప్రసిద్ధ రామ ప్రతిమలున్నాయి. ఆంధ్ర దేశంలోని భద్రాచలంలో గల రామాలయం అతి ప్రసిద్ధమైంది.

**18.3.6.8 కృష్ణావతారం :**

హరివంశం, భాగవత దశమ స్కందం, మహాభారతం కృష్ణావతార వివరాలు తెలుపుచున్నాయి. ఈ అవతారం ద్వాపరయుగానికి చెందినది. కృష్ణావతారంలో అనేక భంగిమలలో మూర్తులున్నాయి. అవి - వటపత్రశాయి, నవనీతనర్తనమూర్తి, కాళియమర్ధన, వేణుగోపాల, మదనగోపాల, రాజగోపాల, మొదలగునవి. వైఖానసాగమం ప్రకారం ఈ మూర్తి కిరీటమకుటం లేదా జటామకుటం, కుడి చేతిలో చేగోల, ఎడమ చేయి మోచేతి దగ్గర మడచినట్లు లేదా శంఖంతో చూపాలి. కృష్ణునికి ఎడమ వైపు సత్యభామ, కుడివైపు రుక్మిణిని చూపాలి. వీరిద్దరు కరండ మకుటాన్ని కలిగి ఉండాలి. విష్ణుపురాణం కృష్ణుడు ఒక చేత చక్రాన్ని ధరించి, ఇంకొక చేతిలో అభయాన్నివ్వాలని, రుక్మిణి చేతిలో పద్మం లేక నీలోత్పలాన్ని ధరించాలని పేర్కొనడం జరిగింది.

వేణు గోపాల మూర్తిని గోవుల చేత, గోపాలుర చేత చుట్టబడి త్రిభంగమలోగాని, విషమ భంగిమలో గాని వేణువు వాయిస్తున్నట్లు చూపాలి. మదన గోపాల మూర్తి ఇంచుమించు పైమూర్తిలానే ఉంటుంది. ఇతడు పద్మం, పరాశువు, చక్రం, పాశం, శంఖం, చెరకువిల్లు కలిగి ఉండాలి. ఈ మూర్తిలోగూడా కృష్ణుని వేణుగానలోలుడు గానే చూపాలి. కాళీయుడనే సర్పాన్ని అణచి వేసిన మూర్తిని కాళియమర్ధన మూర్తి అంటారు. కుడిచేత అభయం ఇస్తూ ఎడమచేత సర్పంతోకను పట్టుకొని, ఎడమ కాలిని పడగ మీద ఉంచి కుడి కాలిని కొంచెం ఎత్తినట్లు చూపే ప్రతిమ ఇది. గోవర్ధనగిరిధారి ప్రతిమ ఇంద్రుని రాళ్ళవాన నుంచి గోవులను, గోపాలురను రక్షించిన రూపం. పార్ధసారధి జ్ఞాన స్వరూపుడైన కృష్ణునిది. గోపికల చీరలను అపహరించి చెట్టుమీద కూర్చున్న మూర్తి గోపికృష్ణ మూర్తి. నాట్యంచేసే బాలుడు నవనీత కృష్ణుడు. వెన్న ముద్దలతో ఆడుకొనే మూర్తి బాలకృష్ణ.

లేపాక్షి వీరభద్రాలయ సభామండపంలోని వితానంలో వటపత్రశాయి చిత్రాన్ని చూడవచ్చు. కృష్ణుని భిన్న రూపాలను దేవాలయాల స్తంభాలపై ఎక్కువగా కన్పిస్తుంది.

**18.3.6.9 బుద్ధ :**

విష్ణుపురాణం బుద్ధుని అవతారంగా గుర్తించింది. బృహత్సంహిత, అగ్ని పురాణం, విష్ణు ధర్మోత్తర పురాణాల్లో బుద్ధుని వర్ణన గలదు. బుద్ధుడు పద్మాసనంలో కూర్చున్నట్లు చూపాలి. పాదాలపైన, అపరచేతులపైన పద్మచిహ్నాలుండాలి. శరీరం నాజూకుగా, హుందాగా, కారుణ్యాభావన కనబడేటట్టుండాలి. కాషాయవస్త్రాన్ని ధరించి భుజం మీద వల్కాన్ని కలిగి ఉండాలి. చేతులు వరద, అభయ ముద్రలలో ఉండాలి. వాస్తవానికి బుద్ధుని ధ్యానస్థుడుగా, చేతులు యోగ ముద్రలో, శిరస్సు వద్ద ప్రభావళి కలిగినట్లు చెక్కడం జరిగింది. చంద్రగిరిలోని కోదండరామస్వామి ఆలయంలో బుద్ధమూర్తిని చూడవచ్చు.

**18.3.6.10 కల్కి :**

విష్ణుపురాణం ప్రకారం విష్ణువు కలియుగంలో కల్కిగా అవతరిస్తాడు. ఈ మూర్తి నాలుగు చేతులలో శంఖం, చక్రం, ఖడ్గం, ఖేటకాలను ధరించి అశ్వాన్ని ఎక్కినట్లు చూపాలి. అగ్నిపురాణం, విష్ణు ధర్మోత్తర పురాణం కల్కిమూర్తి వివరం ఉంది. తాడిపత్రిలోని వెంకటరమణ ఆలయ మహామండపం స్తంభం మీద గుర్రపు ముఖం కలిగిన కల్కి శిల్పం ఉంది.

### 18.3.7 చతుర్వింశతి మూర్తులు :

రూపమండపంలో ఈ మూర్తుల వివరం ఉంది. ఈ మూర్తులు ప్రధానంగా శంఖ, చక్ర, గధా, పద్మాలను ధరించినా, ఆ ధోరణిలో ఉండే వ్యత్యాసం మూర్తుల వ్యక్తిగత లక్షణాలకు గుర్తు. ఈ ఇరవైనాలుగు మూర్తులు : కేశవుడు, నారాయణుడు, మాధవుడు, గోవిందుడు, విష్ణువు, మధుసూధన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అంధోక్షజ, నరసింహ, అచ్యుత, జనార్ధన, ఉపేంద్ర, హరి, కృష్ణ. వీరిలో కృష్ణ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ద, సాంబ పంచవీరులు. వీరి పూజ విధిగా ప్రచారంలో తమిళదేశంలో చాలా కాలంగా ఉందని శిలప్పాధికారం వల్ల తెలుస్తుంది.

## 18.4 సారాంశము :

ప్రతిమాలక్షణ శాస్త్రపరిచయము, నిర్వచనము, పరిధి, విగ్రహారాధన ప్రాచీనతను గురించి తెలియచేయబడినది మరియు బ్రహ్మ, ప్రతిమా లక్షణాలు. విష్ణుమూర్తి ప్రతిమా లక్షణాలు పురాణాల ప్రకారము అవతారాలను విశదీకరించ బడినాయి.

## 18.4 నమూనా ప్రశ్నలు :

1. భారతదేశంలో విగ్రహారాధన పుట్టు పూర్వోత్తరాల గురించి చర్చింపుము.
2. విష్ణుప్రతిమా లక్షణాలను వివరింపుము.

**డా॥ కె. అజయకుమార్**

పాఠం-19

# శివుడు - గణపతి - కుమార

## 19.0 లక్ష్యం :

శివుడు, గణపతి, కుమార ప్రతిమా లక్షణాలను గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


**19.1 శివుడు**

**19.1.1 పరిచయము**

**19.1.2 లింగమూర్తులు**

**19.1.2.1 చల లింగాలు**

**19.1.2.2 అచల లింగాలు**

**19.1.2.2.1 స్వాయంభువ లింగాలు**

**19.1.2.2.2 దైవిక లింగాలు**

**19.1.2.2.3 గాణప లింగాలు**

**19.1.2.2.4 ఆర్ష లింగాలు**

**19.1.2.2.5 మానుష లింగాలు**

**19.1.2.3 లింగాలలో గల శైలీ భేదాలు**

**19.1.2.4 లింగ పీఠాలు**

**19.1.3 లింగోద్భవ మూర్తి**

**19.1.4 మానుష మూర్తులు**

**19.1.4.1 ఉమాసహిత మూర్తులు**

**19.1.4.1.1 ఉమాసహిత చంద్రశేఖరమూర్తి**

**19.1.4.1.2 ఆలింగన చంద్రశేఖరమూర్తి**

**19.1.4.1.3 సోమస్కంద మూర్తి**

**19.1.4.1.4 సూఖాసన మూర్తి**

**19.1.4.1.5 ఉమాసహిత మూర్తి**

**19.1.4.1.6 ఉమామహేశ్వర మూర్తి**

**19.1.4.1.7 గంగాధర మూర్తి**

**19.1.4.1.8 కళ్యాణ సుందర మూర్తి**

**19.1.4.1.9 వృషవాహన మూర్తి**

**19.1.4.2 సంహార మూర్తులు**

**19.1.4.2.1 కామాంతక మూర్తి**

**19.1.4.2.2 త్రిపురాసురసంహార మూర్తి**

**19.1.4.2.3 అంధకాసుర సంహార మూర్తి**

**19.1.4.2.4 గజాసుర సంహార మూర్తి**

**19.1.4.2.5 కాలారి మూర్తి**

**19.1.4.2.6 బ్రహ్మశిరచ్ఛేదక మూర్తి**

**19.1.4.2.7 వీరభద్ర మూర్తి**

**19.1.4.2.8 భైరవ మూర్తి**

**19.1.4.2.9 మహాకాల మూర్తి**

**19.1.4.2.10 శరభేశ మూర్తి**

**19.1.4.2.11 జలందర మూర్తి**

**19.1.4.2.12 అఘోర మూర్తి**

**19.1.4.3 అనుగ్రహ మూర్తులు**

**19.1.4.3.1 చండీశానుగ్రహ మూర్తి**

**19.1.4.3.2 విష్ణుఅనుగ్రహ మూర్తి**

**19.1.4.3.3 రావణానుగ్రహ మూర్తి**

**19.1.4.3.4 నందీశానుగ్రహ మూర్తి**

**19.1.4.3.5 విఘ్నేశానుగ్రహ మూర్తి**

**19.1.4.3.6 కిరాతానుగ్రహ మూర్తి**

**19.1.4.4 నృత్యమూర్తులు ( శివనటరాజు )**

**19.1.4.5 ఇతర రూపాలు**

**19.1.4.5.1 కేవల చంద్రశేఖర మూర్తి**

**19.1.4.5.2 దక్షిణా మూర్తి**

**19.1.4.5.3 కంకాళ మూర్తి**

**19.1.4.5.4 భిక్షాటన మూర్తి**

**19.1.4.5.5 అర్ధనారీశ్వర మూర్తి**

**19.1.4.5.6 హరిహర మూర్తి**

**19.1.4.5.7 విషాపహారణ మూర్తి**

**19.2 గణపతి**

**19.2.1 పరిచయము**

**19.2.2 గణపతి ప్రతిమా లక్షణాలు**

**19.2.3 గణపతి రూపాలు**

**19.2.3.1 బాల గణపతి**

**19.2.3.2 బీజ గణపతి**

**19.2.3.3 హేరంబ గణపతి**

**19.2.3.4 వక్రతుండ గణపతి**

**19.2.3.5 తరుణ గణపతి**

**19.2.3.6 భక్తి గణపతి**

**19.2.3.7 వీర గణపతి**

**19.2.3.8 శక్తి గణపతి**

**19.2.3.9 ధ్వజ గణపతి**

**19.2.3.10 పింగళ గణపతి**

**19.2.3.11 విఘ్నరాజు గణపతి**

**19.2.3.12 లక్ష్మీ గణపతి**

**19.2.3.13 మహా గణపతి**

**19.2.3.14 భువనేశ గణపతి**

**19.2.3.15 ప్రసన్నగణపతి**

**19.2.3.16 ఊర్ధ్వ గణపతి**

**19.2.3.17 హరిద్రా గణపతి**

**19.2.3.18 ఉన్మత్త గణపతి**

**19.2.3.19 ఉఛ్ఛిష్ఠ గణపతి**

**19.2.3.20 నృత్త గణపతి**

**19.2.3.21 వినాయకుడు**

**19.3 కుమార ( కార్తికేయ )**

**19.4 సారాంశము**

**19.5 నమూనాప్రశ్నలు**

## 19.1 శివుడు :

### 19.1.1 పరిచయము :

హిందూమత సాంప్రదాయంలో త్రిమూర్తులలో ఒకడుగా లయకారకుడైనవాడు శివుడు. 'శివ' అనే పదానికి శుభము, సౌమ్యము అని అర్థాలు. ఈ పదాన్ని వేదాలలో వాడినారు. అయితే వేదాలలో ఈ పదము వివిధ దేవతలకు అన్వయించే ఒక విశేషణంగా వాడుకలో ఉండేది. శ్వేతాశ్వతరోపనిషత్తులో శివపదాన్ని రుద్రునికి ఒక నామాంతరంగా ఉపయోగించినారు. వేదకాలంలో రుద్రుడు ఆరాధితుడైన దైవమే. పురాణేతిహాసాల వరకూ వచ్చేసరికి శివుడు హిందూ మతానికి మూలస్తంభాలైన త్రిమూర్తులలో ఒకడుగా అవతరించినాడు. పౌరాణిక శివునిలో వైదిక రుద్రభావం కూడా ఇమిడి ఉంది. త్రిమూర్తులలో ఒకడైన శివుడు ప్రళయ సంహారమూర్తి. కాని శైవులకు అంత కంటే ఎక్కువగా సౌమ్యుడు, వరప్రదాత. సృష్టి, స్థితి, లయాలు మూడింటికి హేతువు ఇతడే. పాణిని సూత్రాలలో శైవరాధన ప్రస్తావనలు ఉన్నాయి. రుద్రశివునకు జంతుబలులు విరివిరిగా సమర్పిస్తూ ఉండినట్లు పతంజలి పేర్కొన్నాడు. క్రీ.పూ. నాలుగో శతాబ్దంలో అలెగ్జాండర్‌తో పోరాడిన 'సిబోయ్' అనే తెగవారు శైవారాధకులు.

శైవమతశాఖ తాలూకు ఆధారాలు సింధు త్రవ్వకాలలో బయల్పడ్డాయి. లింగరూపంలో మట్టితోనూ, రాతితోనూ చేసి బొమ్మలు, ముద్రికలు ఈ సందర్భంలో ప్రత్యేకంగా గమనించవలసినవి. ఒకరకపు ముద్రికలపై యోగ భంగిమలో కూర్చొని ఉన్నట్లు చిత్రీకరించిన మూర్తి పశుపతి శివుడే అని సర్‌జాన్ మార్షల్ అభిప్రాయం వ్యక్తం చేసినాడు. ఈ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో శైవారాధన అత్యంత ప్రాచీనకాలంలోనే ఆరంభమైనట్లు చెప్పవచ్చు.

శైవ ప్రతిమలున్నా శివుని ప్రధానంగా లింగరూపంలోనే ఆరాధిస్తారు. శైవులకు దీక్ష స్వీకరించడం లేదా ఉపదేశం పొందడం ఒక ప్రత్యేకాచారము. ఈ దీక్షలలో భేదాలను బట్టే శైవులలో ఘోరము, అఘోరము అని రెండు శాఖలు ఉద్భవించాయి. ఘోరతత్వాన్ని అనుసరించే వారిలో పాశుపతులు, కాపాలికులు, కాలాముఖులు ప్రధానాలు. సౌమ్యతత్త్వం అనుయాయులలో ఆగమాంతశైవులు, లింగాయతులు మొదలైన వారున్నారు. కామికాగమం, సుప్రభేధాగం వంటి వివిధ ఆగమ గ్రంధాలలో శైవ ప్రతిమా రూపాల వివరాలు ఇవ్వడం జరిగింది. లింగపురాణం, శివపురాణం వంటి పురాణాలు శివుని తత్వాన్ని, లింగారాధన తత్వాన్ని వివరించడం జరిగింది.

### 19.1.2. లింగమూర్తులు :

శివుని ప్రతిమలు ప్రధానంగా రెండు రకాలు. అవి- (1) లింగమూర్తులు (2) మానుష మూర్తులు. శివుని లింగరూపంలో ఆరాధించడం అతి ప్రాచీనకాలం నుంచి భారతదేశంలో ఆచారంలో ఉంది. శివుడు సంతానానికి అధిపతి అనే భావనతో సంతానానికి కారణమైన లింగాన్ని ప్రధాన రూపంగా గుర్తించి పూజా విధానాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. లింగమూర్తులు శుద్ధలింగమూర్తులని, లింగోద్భవ మూర్తులని రెండు రకాలు. శుద్ధలింగ మూర్తులను స్థావర లింగాలని, జంగమ లింగాలని వర్గీకరించవచ్చు. లింగోద్భవమూర్తి రూపం శివుని మానుష రూపానికి, లింగమూర్తికి గల సంధి స్థితిని చూపే దశ.

#### 19.1.2.1. చల లింగాలు :

చల లింగాలనే జంగమ లింగాలు అని కూడా పిలుస్తారు. ఇవి ఆరు రకాలు. అవి మృణ్మయ, లోహజ, రత్నజ, దారుజ, శైలజ, క్షణిక లింగాలు (1) మట్టితో చేసినవి 'మృణ్మయ' లింగాలు (2) బంగారు, వెండి, రాగి, ఇనుము, సీసం, ఇత్తడి, కంచు తగరాలతో

చేసినవి 'లోహజ' లింగాలు (3) ముత్యం, గోమేధికం, వైఢూర్యం, పుష్యరాగం, స్పటికం మొదలగు వాటితో చేసినవి 'రత్నజ' వర్గానికి చెందినవి (4) సామి, మధూక, కర్ణికార, మండూక, తిందుక, అర్జున, పిప్పల, ఉదుంబర వృక్షాల కొయ్యతో చేసినవి 'దారుజ' లింగాలు. కామికాగమం ప్రకారం ఖదిర, చందన, సాల, చిల్వ, బదరీ, దేవదారు వృక్షాల కొయ్యలతో చేసినవి 'దారుజ లింగాలు (5) కొండరాళ్ళతో చేసిన చిన్న, చిన్న లింగాలు 'శైలజ' రకానికి చెందినవి. (6) అప్పటికప్పుడు పూజకోసం ఇసుక, బియ్యం, అన్నం, వంద్రు, పేడ, వెన్న, రుద్రాక్షలు, గంధం, పూవులు, బెల్లంపిండి మొదలైన వానితో చేయబడి పూజానంతరం త్యజింపబడేవి 'క్షణిక' లింగాలు.

పైన పేర్కొన్న లింగాలలో (1) బంగారు లింగం పూజించిన - ఆహారం, (2) పేడలింగాన్ని పూజించిన - ఆరోగ్యం, (3) వెన్నతోచేసిన లింగం పూజిస్తే - సంతోషం, (4) రూద్రాక్ష లింగాన్ని పూజిస్తే - జ్ఞానం, (5) చందన లింగాన్ని పూజిస్తే - సౌభాగ్యం, (6) కూర్చ లింగాన్ని పూజిస్తే - సాయుజ్యం, (7) పుష్పలింగాన్ని పూజిస్తే - ఆయుర్ధాయం (8) బెల్లం లింగాన్ని పూజిస్తే - కోరిన కోర్కెలు సిద్ధిస్తాయని గ్రంథాలలో ప్రస్తావించబడింది.

### 19.1.2.2. అచల లింగాలు :

అచల లింగాలనే స్థావర లింగాలని కూడా అంటారు. ఇవి తొమ్మిది రకాలని సుప్రభేదాగమంలో పేర్కొనబడింది. అవి-స్వాయంభువ లింగాలు, పూర్వపురాణ లింగాలు, దైవత లింగాలు, గాణపత్య లింగాలు, అసుర లింగాలు, పురలింగాలు, ఆర్షలింగాలు, రాక్షస లింగాలు, మానుషలింగాలు, బాణలింగాలు. మానసారం ప్రకారం అచలలింగాలు ఆరు రకాలు. మకుటాగమంలో నాలుగు రకాలైన అచల లింగాలు గుర్తించబడ్డాయి.

### 19.1.2.2.1. స్వాయంభువ లింగాలు :

స్థావర లింగాలన్నింటిలోను స్వాయంభువ లింగాలు ఉత్తమోత్తములు. కామికాగమం ప్రకారం ఇవి తమంతటతాము అవతరించినవి. వారణాసి, ప్రయాగ, ఉజ్జయినీ, గోకర్ణం మొదలైన 69చోట్ల ఈరకపు లింగాలు గలవు. ఇవి యాదృచ్ఛికంగా అగ్ని, జల, మ్లేచ్ఛాదులకు గురి అయి పాడైనా, ఏరకమైన జీర్ణోద్ధరణ లేకుండానే పూజార్హాలు. వీటికి ఏరకమైన కీడు కల్గించినా, వాటిని ధ్వంసం చేసినా రాజ్యానికి కీడు కలుగుతుందనే నమ్మకం ఉంది.

### 19.1.2.2.2. దైవిక లింగాలు :

దైవిక లింగాలు ఉత్తమ మధ్యమాలు. ఇవి అన్ని జ్వాలలాగ లేక అంజలి ముద్రలు ఉన్న రెండు చేతులలాగా ఉంటాయి. టంకముద్రలను, శూల ముద్రలను పోలిన గుర్తులుంటాయి. ఈ రకపు లింగాలు గరుకుగా ఉంటాయి.

### 19.1.2.2.3. గాణప లింగాలు :

దైవికాలలాగే ఇవికూడా ఉత్తమ మాధ్యమాలు. ఇవి గుమ్మడి, నిమ్మ, వెలగ, తాటి పండు ఆకారాల్లో ఉంటాయి. గాణపలింగాలను గణాలు స్థాపించినవని నమ్మకం.

### 19.1.2.2.4. ఆర్ష లింగాలు :

ఆర్ష లింగాలు గుండ్రంగా ఉండి పై భాగం కిందిభాగం కన్న సన్నగా ఉంటుంది. వీటిని ఋషులు స్థాపించినవని నమ్మకం.

### 19.1.2.2.5. మానుష లింగాలు :

అచల లింగాన్నింటిలోను ఎక్కువ సంఖ్యలో గలవి మానుష లింగాలు. ఇవి మానవులు స్థాపించినవి. వీటిలో బ్రహ్మభాగమని, విష్ణు భాగమని, రుద్రభాగమని మూడు భాగాలుంటాయి. చతురస్రాకారంలో ఉన్న పానవట్టం భాగాన్ని బ్రహ్మభాగం అని, అష్టభుజాకారంలో

ఉన్న మధ్యభాగాన్ని విష్ణుభాగం అని, పై భాగాన్ని రుద్ర భాగమని అంటారు. మానుష లింగాలలో సర్వదేశికలింగాలని, సర్వసమలింగాలని రెండు రకాలు గలవు. ప్రధాన దేవాలయం పక్కల కొలతలు ఆధారంగా ఏర్పడినవి సర్వదేశిక లింగాలు. వీనిలో ఉధ్యమ, మధ్యమ, అధమ రకాలు గలవు.

సర్వసమ లింగాలనే సర్వతో భద్రలింగాలని కూడా అంటారు. వీటిలో బ్రహ్మ, విష్ణు, రుద్ర భాగాలు సమాన పరిమాణంలో ఉంటాయి. వీటిలో ఐదురకాలు గలవు. అవి- వర్ధమాన లింగాలు, శైవాధికలింగాలు, స్వస్తిక లింగాలు, త్రైరాశిక లింగాలు, ఆఢ్య లింగాలు (1) ఎక్కడైతే బ్రహ్మభాగం కన్నా విష్ణుభాగం, విష్ణుభాగం కన్నా శైవభాగం ఎక్కువగా ఉంటుందో వాటిని వర్ధమానలింగాలంటారు (2) ఎక్కడైతే బ్రహ్మ, విష్ణు భాగాలు సమానంగా ఉండి, శైవభాగం అధికంగా ఉంటుందో వాటిని శైవధిక లింగాలంటారు. (3) స్వస్తిక లింగాలలో ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క ప్రమాణం అధికంగా ఉంటుంది. (4) త్రైరాశిక లింగాలలో బ్రహ్మభాగం ఎనిమిది భాగాలకు, విష్ణుభాగం (7) భాగాలకు, రుద్రభాగం (6) భాగాలకు సమానంగా ఉండాలి. (5) ఆఢ్యలింగాలలో బ్రహ్మ, విష్ణు, రుద్ర భాగాలు 8.1/2 : 8 : 7.1/2 నిష్పత్తిలో ఉండాలి.

### 19.1.2.3. లింగాలలో గల శైలీ భేదాలు :

లింగాలను నాగర, వేసర, ద్రావిడ అని మూడురకాలుగా వర్గీకరించడం జరిగింది. వీటిని తిరిగి జయద, పౌష్టిక, సార్వకామిక అను మూడు ప్రధాన భాగాలుగా విభజించడం జరిగింది. లింగాలలోని శిరోవర్తన భాగంలో ఐదు ప్రధాన రకాలు గలవు. అవి- ఛత్రాకారం, త్రిపురుషాకారం, కుక్కటాండాకారం, అర్ధచంద్రాకారం, బుద్బుదాకారం. అనగా అవి వరుసగా గొడుగులాగ, గుమ్మడిపండులాగ, కోడిగుడ్డులాగ, అర్ధచంద్రునిలో, నీటిబుగ్గలాగ ఉంటాయి. అలాగే మానుషలింగాలలో అష్టోత్తరశతలింగాలు, సహస్రలింగాలు, ధారాలింగాలు, శైవేష్ట్యకలింగాలు, ముఖలింగాలు అనే ఐదు రకాలు గలవు. లింగం 108 సమాన లింగభాగాలుగా ఉన్నట్లైతే అష్టోత్తరశతలింగమని, వేయిభాగాలుగా విడగొట్టబడిన్నట్లైతే సహస్రలింగమని, పలకలుగా ఉన్నట్లైతే ధారాలింగమని, లింగంపై ముఖాన్ని కలిగి ఉన్నట్లైతే ముఖలింగమని అంటారు.

### 19.1.2.4. లింగ పీఠాలు :

లింగంలో పూజావిభాగం, పీఠం, నాళం అనే మూడు ప్రధాన భాగాలుంటాయి. పూజాభాగంలో రుద్రభాగం, విష్ణుభాగం, బ్రహ్మభాగం అనే మూడు ఉపభాగాలున్నాయి. లింగపీఠాలలో నాగర, వేసర, ద్రావిడ అను రకాలు గలవు. నాగరపీఠం చతురస్రాకారంలో , వేసరపీఠం వృత్తాకారంలో, ద్రావిడ పీఠం అష్టభుజాకారంలో ఉండాలి. లింగపీఠంలో ఉపానం, జగతి, కుముద, పద్మ, కంప, కంఠ, పట్టిక, నిమ్న, ఘృతవారి అనే బంధనాలుంటాయి. నాళం అంటే పూజాభాగం నుండి వెలికినీరు పోవుడానికి అనువైనభాగం. ఇది తొండం ఆకారంలో ఉంటుంది.

### 19.1.3. లింగోద్భవ మూర్తి :

లింగోద్భవమూర్తిని గూర్చిన ఐతిహ్యం లింగపురాణం, కూర్మపురాణం, శివపురాణాలలో గలదు. వీటి ప్రకారం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల మధ్య ఎవరు గొప్ప అనే వాదం వచ్చినపుడు శివుడు లింగరూపాన్ని ధరించాడు. లింగం అంతు తెలుసుకోవడానికి విష్ణువు వరాహరూపంలో భూమిలోకి, బ్రహ్మ తన వాహనం అయిన హంస వల్ల పైలోకాలకు వెళ్ళి లింగం కొసలు తెలుసుకోలేక పోయారు. లింగం నుండి శివుడు జన్మించినందున లింగోద్భవమూర్తి అనే పేరు వచ్చింది.

అంశుమద్భేదాగమంలో లింగానికి ముందు భాగంలో చంద్రశేఖరమూర్తిని చెక్కాలని ఆదేశించబడింది. కారణాగమంలో లింగం కుడివైపు హంసరూపంలో బ్రహ్మను, కింద ఎడమవైపు వరాహరూపంలో విష్ణువును, కుడిఎడమలుగా బ్రహ్మ,విష్ణుమూర్తులను అంజలి ముద్రలో చూపాలని పేర్కొనబడింది. శివుని పాదాలు లేకుండా కటిపర్యంతం చూపాలి. శిల్పరత్నం ప్రకారం లింగోద్భవమూర్తి ఒక

చేతిలో త్రిశూలాన్ని ధరించి ఉండాలి. కారణాగమంలో ఈ మూర్తి నాలుగు చేతులు కలిగి ఉండాలని ఒకచేయి అభయ ముద్రలో మరోచేయి వరద ముద్రతో ఉండాలని, ఒకచేయి పరశువు, వేరొక చేయి కృష్ణ మృగాన్ని ధరించి ఉండాలని, శిరస్సుపై చంద్రకళను చూపాలని చెప్పబడింది.

కంచిలోని కైలాసనాధాలయంలో, ఎల్లోరా కైలాసనాధాలయంలో, శ్రీశైలం మల్లిఖార్జున ఆలయ ప్రాకార కూడ్యాలపైన, గుడిమల్లం పరశురామేశ్వరాలయం, చోళుల బృహదీశ్వరాలయంలో అద్భుత లింగోద్భవమూర్తులున్నాయి.

**19.1.4. మానుష మూర్తులు :**

శివప్రతిమలను గుణాన్ని బట్టి, ప్రవృత్తిని బట్టి ఐదు ప్రధాన రకాలుగా విభజించవచ్చు. అవి ఉమాసహిత మూర్తులు, సంహార మూర్తులు, అనుగ్రహమూర్తులు, నృత్యమూర్తులు, ఇతర రూపాలు.

**19.1.4.1. ఉమాసహిత మూర్తులు :**

శివపార్వతులను కలిపి చెక్కిన మూర్తులను ఉమాసహితమూర్తులని అంటారు. ఈ రూపంలో 9 రకాలు గలవు. అవి -

**19.1.4.1.1. ఉమాసహిత చంద్రశేఖర మూర్తి :**

ఈ రూపంలో చంద్రశేఖరమూర్తి దేవితో కలిసి సమభంగరీతిలో ఉంటాడు. నాలుగు చేతులు, కుడిచేతులలో ఒకటి టంకము వేరొకటి అభయముద్రంలో, ఎడమచేతులలో ఒకటి కృష్ణమృగం, వేరొకటి వరదముద్రతో ఉంటుంది. అర్ధచంద్రం, జటామకుటం కలిగి త్రినేత్రుడై ఉంటాడు. ఈ మూర్తి శిల్పం తిరువొర్రియూర్‌లో గలదు.

**19.1.4.1.2. ఆలింగన చంద్రశేఖర మూర్తి :**

ఈ రూపంలో మూడురకాల ప్రతిమలు గలవు. ఎడమచేతిలో దేవిని కౌగలించుకొన్నట్లు లేదా దేవి కుడిచేతిని శివుని కౌగిలించుకొన్నట్లు లేదా పరస్పరం కౌగిలించుకొన్నట్లు చూపడం జరుగుతుంది. మొదటి రకం ప్రతిమలో దేవి కుడిచేతిలో పద్మం ఉండాలి. రెండో రకం ప్రతిమ అయితే దేవి ఎడమచేతిలో పద్మం ఉండాలి.

**19.1.4.1.3. సోమస్కంద మూర్తి :**

ఈ రూపంలో శివుడు సుఖాసీన పద్దతిలో కూర్చుని ఉండగా ఉమ ఎడమవైపు ఉంటుంది. శివపార్వతులకు మధ్య స్కంధుడు ఉంటాడు. స్కంధుడు నిలబడిగాని, కూర్చొని కాని ఉమ తొడపై కూర్చున్నట్లు గాని ఉండాలి. ఉమ కుడిచేతిలో పద్మం, ఎడమచేయి సింహకర్ణ ముద్రతో ఉంటుంది. ఆమె శిరస్సుపై కరండమకుటం ఉండాలి. స్కంధుడు ఒకే ముఖాన్ని కలిగి కరండమకుటంతో ఉండాలి. పల్లవుల కట్టడాలలో ఈ శిల్పం ఎక్కువగా కన్పిస్తుంది.

**19.1.4.1.4. సుఖాసన మూర్తి :**

ఈ రూపంలో శివుడు నాలుగు చేతులు, మూడు కన్నులు కలిగి ఉండాలి. వెనుక కుడిచేతిలో పరశువు, వెనుక ఎడమచేతిలో కృష్ణమృగం ఉండగా, ముందు కుడిచేయి అభయ ముద్రతో, ముందు ఎడమచేయి వరద లేక సింహ కర్ణముద్రలో ఉండాలి. కుడిచెవికి మకరకుండలం గాని సింహకుండలంగాని, ఎడమ చెవికి పత్ర కుండలం ఉండాలి. జటామకుటం, కంకణాలు, యజ్ఞోపవీతం ఉండాలి. భద్రపీఠంపై ఎడమకాలిని మడిచి, కుడికాలును వేలాడుతున్నట్లు చూపాలి.

**19.1.4.1.5. ఉమాసహిత మూర్తి :**

సోమస్కంధమూర్తిలో స్తంధుడు లేకుండా ఉన్నట్లయితే ఆ రూపం ఉమాసహితమూర్తి. శివునికి ఎడమవైపు దేవి ఉంటుంది.

ఈమె కుడి చేత పద్మాన్ని ధరించి, ఎడమచేతిని సింహకర్ణముద్రతో చూపాలి. ఆమె శిరస్సుపై కరండమకుటం ఉంటుంది. ఆమె కుడికాలు మడచి ఆసీనం మీద ఉండగా ఎడమ కాలు వేలాడుతుండాలి. శివ,పార్వతులు ఒకే ఆసనంపై ఒకే ప్రభామండలాన్ని కలిగి ఉండాలి.

### 19.1.4.1.6. ఉమామహేశ్వర మూర్తి :

ఈ రూపంలో శివుడు, ఉమ ఒకే పీఠంపై ఉండి ఆలింగన మూర్తిలాగా ఉండాలి. శివుడు అర్ధచంద్రం, జటామకుటం కలిగి ఉండాలి. శివునికి రెండు లేదా నాలుగు చేతులుండాలి. రెండు కుడిచేతులలో ఒకదానిలో త్రిశూలాన్ని, ఇంకొక దానిలో మాతులుంగ పుష్పాన్ని ఉంచుకొని, రెండు ఎడమ చేతులలో ఒక దానిలో సర్పాన్ని కలిగి, ఇంకొక చేతిని ఉమ భుజంపై ఉంచాలి.

### 19.1.4.1.7. గంగాధర మూర్తి :

ఈ రూపంలో శివుడు జటామకుటంలో గంగను ధరించి చూపాలి. శివుడు స్థానక పద్ధతిలో కుడుకాలును భూమికి సరిగా ఆనించి, ఎడమకాలు కొద్దిగావంచి ఉండాలి. క్రింది కుడిచేయి ఉమ చెంపవద్ద, ఎడమచేతితో దేవిని ఆలింగనం చేసుకొన్నట్లు చూపాలి. శివునికి ఎడమవైపు భగీరథుడు రూషులతో కలిసి చూపాలి. ఎల్లోరా, ఎలిఫెంటా, తిరుచినాపల్లి మొదలగు చోట్ల ఈ మూర్తి శిల్పాలు గలవు.

### 19.1.4.1.8. కళ్యాణ సుందర మూర్తి :

శివపార్వతుల పరిణయ దృశ్యం ఇది. ఈ రూపంలో శివుడు పార్వతి కుడిచేతిని వివాహ సూచనగా పట్టుకొని ఉన్నట్లు చూపాలి. ఈ మూర్తికి సర్పం, పుర్రెలు ఉండవు. పార్వతి త్రిభంగ పద్ధతిలో నిలబడి ఉంటుంది. విష్ణువు శివపార్వతులకు వెనక వైపు ఉండాలి. హోమాన్ని బ్రహ్మ నిర్వహించాలి. ఈ మూర్తి శిల్పాలు ఎల్లోరా గుహలోను, లేపాక్షి వీరభద్రాలయ కళ్యాణ మండపంలోను, శ్రీశైల మల్లిఖార్జున ఆలయ ప్రాకారగోడ మీదను కన్పిస్తాయి. తిరునొర్రియూర్, రత్నపూర్‌లలో కొండ ఈ మూర్తి శిల్పాలు గలవు.

### 19.1.4.1.9. వృషవాహన మూర్తి :

ఈ రూపంలో మూర్తి కుడికాలు భూమిపై స్థిరంగా ఉంచి, ఎడమకాలును కొంచెం వంచి ఉంచాలి. వెనుకగల కుడి చేతిలో టంకం లేక పరశువు, వెనుకగల ఎడమచేతిలో కృష్ణమృగం ఉండాలి. ముందు కుడిచేతిలో వక్రదండాయుధం ఉండగా, ఎడమచేయి వృషభం తలచుట్టూ ఉన్నట్లు చూపాలి. శిరస్సు మీద జటాభారం గల జటామకుటం ఉండాలి. ఈ మూర్తికి కుడివైపు లేదా ఎడమవైపు దేవిప్రతిమ ఉండాలి. వృషభం శివుని వెనుక నిలబడినట్లు చూపాలి. ఈ రూపం బాదామి చాళుక్య శిల్పాలలో కన్పిస్తుంది.

### 19.1.4.2. సంహార మూర్తులు :

శివుడు అనేక రకాలయిన సంహార భావాలను ప్రదర్శించడం అనేది అతనికి గల ఔన్నత్యాన్ని సూచించే ప్రధానాంశం.

### 19.1.4.2.1. కామాంతక మూర్తి :

మన్మధుడు శివుని తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించగా, మూడో నేత్రంతో శివుడు అతన్ని దగ్ధం చేసిన కథ ఇది. తీక్షణమైన చూపులతో, శిరస్సు మీద జటామకుటం ఉండి శివుని నాలుగు చేతులతో చూపాలి. రెండు చేతుల్లో సర్పం, అక్షమాల, ఒక హస్తం పాతక హస్తం (కింది వైపుకు చూపే చేయి)లో, మరొకటి సూచీహస్తంలో చూపాలి. ఈ మూర్తి శిల్పం శ్రీశైలమల్లిఖార్జునాలయ తూర్పు ప్రాకారంపై గలదు.

**19.1.4.2.2. త్రిపురాసుర సంహార మూర్తి :**

మహాభారతంలో శివుడు త్రిపురకు సంబంధించిన ముగ్గురు రాక్షసులను సంహరించిన కథ ఇది. ఈ రూపంలో శివుడు ఎడమకాలిని వంచి విలుకానివలె ఉండాలి. ముందు కుడి చేయి బాణాన్ని కలిగి సింహకర్ణ ముద్రతో ఉండాలి. ఎడమచేతిలో ధనుస్సు ఉండాలి. పై చేతుల్లో గొడ్డలి లేదా జింక వుండాలి. శిరస్సు మీద జటామకుటం ఉండాలి. ఎల్లోరా, కంచి, చిదంబరం మొదలగు చోట్ల ఈ మూర్తి శిల్పాలు గలవు.

**19.1.4.2.3. అంధకాసుర సంహార మూర్తి :**

సప్తమాతృకలను తోడుగా చేసుకొని శివుడు అంధకాసురుణ్ణి సంహరించిన కథ ఇది. ఈ రూపంలో శివుడు ఎనిమిది చేతులు కలిగి రెండు చేతుల్లో ఒక త్రిశూలాన్ని పట్టుకొని ఉండాలి. త్రిశూలం చివర అంధకాసురుని శరీరం గుచ్చబడి ఉంటుంది. మిగిలిన చేతుల్లో రెంటిలో మూర్తి ఖడ్గాన్ని, ఢమరుకాన్ని పట్టుకొని, మరి రెండు చేతుల్లో ఏనుగు చర్మాన్ని ప్రభామండలంలా పట్టుకొని, మిగిలిన చేతిని తర్జన ముద్రలో ఉంచడం జరుగుతుంది.

**19.1.4.2.4. గజాసుర సంహార మూర్తి :**

శివలింగాన్ని పూజిస్తున్న బ్రాహ్మణులను హింసిస్తున్న గజాసురుడనే రాక్షసుడ్ని శివుడు సంహరించిన దృశ్యం ఇది. ఈ రూపంలో శివునికి నాలుగు లేక ఎనిమిది చేతులున్నట్లు చూపాలి. నాలుగు చేతులుంటే ఒకదానిలో పాశము, వేరొక చేతిలో గజ చర్మాన్నిచూపి, ఎడమ చేతులలో ఒకటి ఏనుగు కుంభస్థలాన్ని పట్టుకొన్నట్లు, వేరొకటి గజచర్మాన్ని పట్టుకొన్నట్లు చూపాలి. ఎడమ కాలిని ఏనుగు తలపై ఆన్చిచూపి, కుడికాలి ఎడమ తొడపైకెత్తినట్లుగా చూపాలి. శివునికి ఎడమవైపు బాలుడైన షణ్ముఖుని బెరిన ముఖంలో, దగ్గరకు తీసికొన్న దేవిమూర్తిని చూపాలి. ఈ మూర్తిశిల్పాలు హలేబీడు, దారాసురం, తిరుచ్చెంగట్టంకుడి మొదలైన చోట్ల చూడవచ్చు.

**19.1.4.2.5. కాలారి మూర్తి :**

తన భక్తుడైన మార్కండేయుని ప్రాణాన్ని హరించేందుకు వచ్చిన యముని శివుడు అణచిన మూర్తి కాలారి మూర్తి. ఈ ప్రతిమలో మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకొని ఉండగా, లింగం నుంచి ఉద్భవించిన శివుడు కుడికాలిని లింగంమీద ఉంచి, ఎడమకాలు పైకెత్తబడి యముని హృదయంపై ఉంటుంది. మూర్తి వెనుక చేతిలో ఉన్న త్రిశూలం యముని వైపు గురిపెట్టబడి వుంటుంది. మరో చేతిలో గొడ్డలి ఉంటుంది. మిగిలిన రెండు చేతులు విస్మయ, సూచీ ముద్రలలో ఉంటుంది. శ్రీశైలం, పెనుకొండ, ఎల్లోరా, పట్టేశ్వరం, తిరుచ్చెంగట్టుంగుడి మొదలగు చోట్ల ఈ మూర్తి శిల్పాలు చూడవచ్చు.

**19.1.4.2.6. బ్రహ్మశిరచ్ఛేదక మూర్తి :**

దక్షుడు నిర్వహించిన యజ్ఞానికి బ్రహ్మ పౌరహిత్యం వహించాడని కోపించి శివుడు బ్రహ్మ ఐదవ శిరస్సును ఖండించగా అది శివుని అరచేతిలో తగులుకొని ఉంటుంది. తరువాత తపస్సు ద్వారా రుద్రుడు బ్రహ్మ హత్యా విముక్తి పొందుతాడు. ఈ రూపంలో శివుడు స్థానక భంగిమలో వుంటాడు. పై చేతుల్లో వజ్రం, శూల లేదా పరశువు, కింది కుడిచేతిలో బ్రహ్మ శిరస్సు వుంటుంది.

**19.1.4.2.7. వీరభద్ర మూర్తి :**

దక్షయజ్ఞానికి సంబంధించిన కథ ఇది. ఈ రూపంలో శివునికి మూడు కళ్ళు, నాలుగు చేతులుండాలి. పాదుకలమీద నిలబడి, కపాలమాలను ధరించి ఉండాలి. నాలుగు చేతులలో ధనుస్సు, గద ఖడ్గం, బాణం ఉండాలి. దక్షుడు, భద్రకాళి ఉండాలి. శ్రీశైలం, లేపాక్షి, తాడిపత్రి, టెంకాశి, శ్రీకాళహస్తి ఆలయాలలో ఈ మూర్తి ఉంది.

**19.1.4.2.8. భైరవ మూర్తి :**

ఈ రూపంలో భైరవుడు పెద్దకడుపును, గుండ్రని కళ్ళను, పెద్ద నాసికారంధ్రాలను కలిగి పుర్రెలను మాలగా కలిగి ఉంటాడు. అనేక చేతులలో అనేక ఆయుధాలతో సర్పంతో పార్వతిని బెదిరిస్తున్నట్లు ఉంటుంది. ఖట్వాంగ, పాశ,శూల, డమరు, కపాల, సర్పం చేతుల్లో ఉంటాయి. ఒక చేతిలో మాంసం ముక్క ఉంటుంది. శివుని కాళ్ళవద్ద కుక్క ఉంటుంది. ప్రసిద్ధమైన భైరవమూర్తులను పట్టేశ్వరం, కలకత్తా, ఎల్లోరా, కాళహస్తి తాడిపత్రి, శ్రీశైలం మొదలైన చోట్ల చూడగలం.

**19.1.4.2.9. మహాకాల మూర్తి :**

బ్రహ్మణుల రక్షణ కోసం శివుడు ప్రత్యక్షమై మహాకాలుని భస్మం చేసిన కథ ఇది. ఈ రూపంలో శివుని దృష్టి మహాకాళిపై ఉంటుంది. మహాకాలునికి రెండువైపులా కాళుడు, మృత్యువు ఉండాలి.

**19.1.4.2.10. శరభేశ మూర్తి :**

హిరణ్యకశిపుని సంహరించిన పిమ్మట విష్ణువు ఆగ్రహం తగ్గకపోతే, శివుడు ఈ రూపం ధరించాడు. రెండు తలలు, రెండు రెక్కలు, ఎనిమిది సింహపు కళ్ళు, పొడుగైన తోక కలిగిన వింత ఆకారమిది. ఈ రూపంలో శివుడు నరసింహుని కోపాన్ని అణచడం జరిగింది. సింహముఖం, మనిషి ఆకారం , కిరీటమకుటం ఉంటుంది. రెండు కాళ్ళమీద నరసింహుని మోస్తున్నట్లు ఉంటుంది. శ్రీశైలం, కృష్ణపట్నం మొదలగు చోట్ల ఈ శిల్పం ఉంది.

**19.1.4.2.11. జలంధర మూర్తి :**

జలంధరుడనే రాక్షసుని సంహరించిన కథ ఇది. ఈ రూపంలో శివుడు నిలబడి రెండు చేతులు కలిగి ఉంటాడు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో కమండలం ఉంటుంది. జటామకుటంలో అర్ధచంద్రుడు, గంగ ఉంటారు. ఇలాంటి ప్రతిమలు చాలా అరుదు.

**19.1.4.2.12. అఘోర మూర్తి :**

బయటకు త్రోసికొని వచ్చిన పళ్ళు, పెద్ద కళ్ళు, సర్పాలు, పుర్రెల దండలు, ఎనిమిది లేదా పది చేతులు, జటామకుటంలో అగ్ని జ్వాల ఈ మూర్తి లక్షణాలు. అతి రౌద్రంగా వున్న ఈ ప్రతిమ అశుభమని భావించడం వల్ల ఈ మూర్తి ప్రతిమలు అరుదుగా కన్పిస్తాయి.

**19.1.4.3. అనుగ్రహ మూర్తులు :**

అనుగ్రహ మూర్తులు శివుని కరుణ స్వభావాన్ని, ముందు వెనక చూడని దయాళుత్వాన్ని నిరూపిస్తాయి.

**19.1.4.3.1 చండీ శానుగ్రహ మూర్తి :**

చండీశుని అనుగ్రహించిన రూపమిది. ఈ రూపంలో శివపార్వతులు ఉమాసహిత మూర్తి పద్ధతిలో గాని, సోమస్కంధ మూర్తిలో వలెగాని ఆసీనులై ఉంటారు. ఇందులో స్కందుడు కన్పించడు. శివుని కుడి చేయి వరద ముద్రలోను, ఎడమచేయి చండీశుని శిరస్సు పైన ఉంటాయి. ఈ శిల్పం గంగై కొండచోళపుర శివాలయంలో రమణీయంగా చెక్కబడింది.

**19.1.4.3.2 విష్ణు అనుగ్రహ మూర్తి :**

కొంత మంది రాక్షసులను సంహరించలేక విష్ణువు ప్రార్థించగా శివుడు అనుగ్రహించిన రూపం ఇది. ఈ రూపంలో శివునికి మూడు కన్నులు, నాల్గు చేతులు ఉంటాయి. కుడి చేతులలో శంఖం, చక్రం, ఎడమ చేతుల్లో ఒకటి వరదముద్రలో, రెండొదానిలో మృగం

ఉంటాయి. శివుని ఎడమవైపు ఆసీన పార్వతి, కుడివైపు బ్రహ్మ స్థానక పద్దతిలో ఉంటారు. విష్ణువు అంజలి పద్దతిలో నిలబడి ఉంటాడు. తిరువిర్ కుడి అలయం ఈ రకపు మూర్తి విగ్రహం కలదు.

### 19.1.4.3.3 రావణానుగ్రహ మూర్తి :

శివపార్వతులున్న కైలాస పర్వతాన్ని పెకిలిస్తూ రావణుడు దానిక్రిందపడి శివున్ని అర్థించగా శివుడు దయతలచిన గాథ ఇది. ఈ ప్రతిమలో శివపార్వతులు సోమస్కంధ రూపంలో ఉండాలి. వారి క్రింద పర్వతం ఉంటుంది. పర్వతం క్రింద రావణుడు, పదితలలు, ఇరవై చేతులు ఒక చేతిలో వీణ కలిగి ఉండాలి. శివ భూతగణాలన్నీ చూడబడాలి, ఈ ఉదంతాన్ని ఎల్లోరా, బేలూరు, హాళీబేడు మొదలైన ప్రాంతాల్లో శిల్ప రూపంలో చూపారు.

### 19.1.4.3.4 నందీశానుగ్రహ మూర్తి :

శివుని వాహనమైన నందీశ్వరునికి మరణం సంభవించగా, శివుని సేవ చేయడానికి జీవితాన్ని పొడిగించమని శివున్ని కోరి నందీశ్వరుడు శాశ్వత జీవితాన్ని పొందిన వృతాంతమిది. ఈ రూపంలో నంది శిరస్సు వృషభాకారంలో, మిగతా శరీరం మానవాకారంలో ఉండాలి. నందీశ్వరుడు శివ పార్వతులు మధ్య నిలబడి వారి ఆశీర్వాదం అందుకున్నట్లుగా చిత్రీకరించబడాలి.

### 19.1.4.3.5 విఘ్నేశానుగ్రహ మూర్తి :

తన కుమారుడైన వినాయకుడు శిరస్సుని కోల్పోగా ఏనుగు తలను అమర్చి అతనికి శివుడు శాస్వత జీవితాన్ని ప్రసాదించిన కథ ఇది. ఈ రూపంలో శివుడు నాల్గు చేతులు కలిగి ఉంటాడు . ఒక చేయి వరద ముద్రలో ఉండగా , మరోక చేయి వినాయకుని శిరస్సుపై ఉంటుంది. మిగిలిన రెండు చేతులలో పరశువు, మృగము ధరించి ఉంటాడు. జటామకుటం కలిగి ఉంటాడు. శివునికి సమీపంలో పార్వతిని చూపాలి. వినాయకుడు సమీపంలో నిలబడి రెండు చేతులలో పాశంకుశాలు ధరించి రెండు చేతులతో అంజలి ఘటిస్తున్నట్లు ఉంటాడు.

### 19.1.4.3.6 కిరాతానుగ్రహ మూర్తి :

అర్జునునికి కిరాతును రూపంలో శివుడు పాశుపతాస్త్రాన్ని ప్రసాదించే ఘట్టమిది. ఈ మూర్తిలో శివుడు నాలుగు చేతులతోను, మూడుకన్నులతోను, శిరస్సుపై జటామకుటంతోను చూపబడతాడు, సమభంగంలో ఉన్న శివుడు ధనుస్సు, బాణాలు, పరశువు, మృగం ధరించి ఉంటాడు. శివునికి ఎడమవైపు గౌరి, కుడివైపు అర్జునుని చూపాలి, ఈ రకమైన ఉదాహరణలను శ్రీశైలం, బెంగాత్తంగుడి మొదలగు చోట్ల చూడగలం.

### 19.1.4.4 నృత్యమూర్తులు ( శివనటరాజు ) :

శివుడు నూట ఎనిమిది రకాలైన నృత్యభంగములను అభివ్యక్తం చేశాడని శైవాగమాలలో అభివర్ణించగా, నాట్యం నూట ఎనిమిది భంగములుగా గలదని నాట్య శాస్త్రంలో భరతుడు పేర్కొన్నాడు. అంశుమద్భేదాగమం, ఉత్తర కామికాగమం వంటి శైవాగమాలు, పెరియ పురాణం వంటి శైవ పురాణాలు శివనటరాజమూర్తిలోని వైశిష్ట్యాన్ని, రూపవైవిధ్యాన్ని పేర్కొన్నాయి.

తమ తపోబలాన్ని చూచి గర్వపడ్డ ఋషులు, అహంతో ఉన్న ముని పత్నులు చివరకు భగవంతుని ఆధికారాన్ని కూడా ధిక్కరించే స్థితికి వచ్చారు. దాంతో శివుడు, విష్ణువు వీరి దర్పమణచడానికి బయలుదేరారు. విష్ణువు మోహిని రూపం ధరించి శివుని వెంట బయలు దేరాడు. శివుడు కూడా ఒక అందమైన నగ్నయువకుని రూపంలో మోహిని వెంట పడ్డాడు. మోహినిని చూసి ఋషులు తమ తపోధనాన్ని పోగొట్టుకోగా, మునిపత్నులు శివుని చూసి తమ హృదయ పవిత్రతను కోల్పోయారు. శివ, విష్ణువుల చర్యకు ఆగ్రహించిన ఋషులు యజ్ఞం చేసి, అందులో నుంచి సర్పాన్ని, పులిని, మృత్యుజ్వాలను, ఒక అసురుణ్ణి సృష్టించారు. అయితే వీటన్నిటిని శివుడు

నాశనం చేశాడు. సర్పాన్ని హారంగాను, పులిచర్మాన్ని వస్త్రంగాను, మృత్యజ్వాలను ఆయుధంగాను శివుడు ధరించి అసురుని మీద నృత్యంచేశాడు. అందువల్ల ఈ రూపంలో శివుని పేరు నటరాజు. తారకారణ్యంలో నివశించే రుషీశ్వరుల గర్వాన్ని అణచడానికి శివుడు, ధరించిన రూపం నటరాజరూపం.

అంశుమద్భేదాగమం ప్రకారం నటరాజ ప్రతిమను ఉత్తమదశాంశమానం ప్రకారం రూపొందించాలి. ముందుగల ఎడమ చేతిని దండహస్తంగా గాని, గజహస్తంగా గాని చూపాలి. వెనకగల ఎడమచేతిలో అగ్ని ఉండాలి. ముందుకుచూపిన కుడిచేయి అభయ ముద్రలో ఉండగా, ఈ చేతి ముంజేతికి సర్పవలయం ఉండాలి. వెనక గల చేతిలో ఢమరుకం ఉండాలి. కుడికాలు కొంచెం వంచి దానిని అపస్మార పురుషుని వీపుమీద ఉంచాలి. ఎడమ కాలు కొంచెం లేపి కుడికాలుని తాకేటట్లుండాలి. దుర్దుర, అర్క్ పుష్పాలు, పాము, నగలతో కూడిన ఆభరణాలు, మానవ కపాలం, ఎడమ వైపు అర్ధ చంద్రుడు ఉండాలి. శరీరం పై యజ్ఞోపవీతం, ఉపసూత్రం, మధ్య వేలికి మినహా అన్ని వేళ్ళకు ఉంగరాలు, అందెలు ఉండాలి. నటరాజుకు ఎడమవైపు పార్వతిని చూపాలి. కామికాగమం ప్రకారం జటామండలం, జటామకుటం చుట్టూ ఏర్పరచబడి ఉండాలి. ఆ జటలు ఐదు నుండి ముప్పై వరకు ఉండాలి. శివుని మెడచుట్టూ ముత్యాలు, వకుళపుష్పాలు, సర్ప, శంఖాలమాలలు, ఎడమ భుజంమీద వ్యాఘ్రాజినం కాని, కృష్ణాజినం కాని ఉండాలి. ఎడమ చెవికి పత్రకుండలం, కుడిచెవికు నక్రకుండలం ఉండాలి. అందెలు ఘటికలతో చేయబడాలి. ఈ రకమైన నృత్యాన్ని భుజంగ త్రాసం అని అంటారు. శిల్ప రత్నంలో భుజంగ త్రాసంలో ఉన్న మూర్తి సారమండలాన్ని పోలిన ప్రభామండలం కలిగి ఉండాలని పేర్కోనడం జరిగింది.

శివునికి పేర్కోన్న 108 భంగిమలలో తొమ్మిది భంగిమలు అతి ప్రధానమైనవని పేర్కోనడం జరిగింది. అవి -

**19.1.4.4.1 అనందతాండవ మూర్తి :**

ఈ రూపంలో శివుని స్థానక భంగిమలో చూపాలి. అపస్మారుడనే రాక్షసుని మీద ఎడమ కాలితో నిలబడి, కుడికాలు కొద్దిగా ఎత్తబడి ఉండాలి. నాలుగు చేతులు కలిగి ఢమరుకం, అగ్ని, అభయ, గజకర్ణముద్రల్లో ఉండాలి. జటామకుటంలో గంగ ఉంటుంది. అర్ధచంద్రుడు, సర్పం, అర్కపూలు శిరోలంకారాలు. వెనుక వైపు ప్రభావళి ఉంటుంది.

**19.1.4.4.2 సాధ్యతాండవ మూర్తి :**

సాధ్యతాండవ మూర్తి రూపంలో అపస్మార రాక్షసుడు ఉండడు. మిగతా లక్షణాలు పైమూర్తి వలె వుంటుంది.

**19.1.4.4.3 ఉమాతాండవ మూర్తి :**

ఈ రూపంలో శివుని ఎడమవైపు ఉమ ఉంటుంది. ఈ రూపంలో శివునికి రెండు చేతులుంటాయి.

**19.1.4.4.4 గౌరతాండవ మూర్తి :**

ఈ రూపంలో ఉమాతాండవ మూర్తి వలె ఉంటుంది. అయితే శివునికి కుడివైపు నందికేశ్వరుడు ఉంటాడు.

**19.1.4.4.5 కాళికాతాండవ మూర్తి :**

ఈ రూపంలో శివునికి రెండు కళ్ళు, ఎనిమిది చేతులుంటాయి. రెండు చేతులు అభయ, వరదముద్రలలో ఉండి మిగతా వాటిలో త్రిశూలం, పాశం, ఢమరుక, పుర్రె, అగ్ని, గంట ఉంటాయి.

**19.1.4.4.6 త్రిపురతాండవ మూర్తి :**

ఈ రూపంలో శివునికి రకరకాల ఆయుధాలు ధరించిన పదహారు చేతులుంటాయి. శివునికి రెండు వైపుల గౌరి, స్కందుడు ఉంటారు.

**19.1.4.4.7 సంహారతాండవ మూర్తి :**

ఈ రూపంలో శివునికి తీక్షణమైన చూపులు, ఎనిమిది చేతులు, పుర్రెల హారం ఉంటాయి.

**19.1.4.4.8 లలితతాండవ మూర్తి :**

ఈ రూపంలో శివునికి నాలుగు కాని ఎనిమిది కాని చేతులుంటాయి. రెండు కాళ్ళు కొద్దిగా వంచబడి పీఠంపై ఉంటాయి.

**19.1.4.4.9 ఊర్ధ్వతాండ మూర్తి :**

ఈ రూపంలో శివుని కుడికాలు శిరస్సు వరకు ఎత్తబడి ఉంటుంది. ఎడమకాలు అపస్మార పురుషుని మీద వుంటుంది.

సర్వలక్షణ సంయుతుడైన నటరాజుని చిదంబరంలో చూడవచ్చు. విష్ణుకుండిన, బాదామిచాళుక్య, పల్లవ నిర్మాణాలలో నటరాజ శిల్పాలు కన్పిస్తాయి. చోళుల కాలంలో నటరాజ ప్రతిమలనేకం తయారు చేయబడ్డాయి. విజయనగర దేవాలయాలలో కూడా నటరాజ శిల్పాలు కన్పిస్తాయి. పాండ్యుల నాటి ఆలయాల స్తంభాల మీద ఊర్ధ్వతాండవ మూర్తి శిల్పాలనేకం గలవు.

## 19.1.4.5. ఇతర రూపాలు :

**19.1.4.5.1. కేవల చంద్రశేఖర మూర్తి :**

ఈ రూపంలో శివుడు జటామకుటం కలిగి, అన్ని అలంకారాలతో నాలుగు చేతులు కలిగి ఉండాలి. వీనిలో కుడి చేతులలో ఒకటి టంకం ధరించగా మరొకటి అభయ ముద్రలో ఉండాలి. ఎడమ చేతులలో ఒకటి వరదముద్రలో ఉండగా, వేరొకటి కృష్ణమృగాన్ని ధరించి ఉండాలి. జటామకుటంలో అర్ధ చంద్రుడుండాలి.

**19.1.4.5.2 దక్షిణా మూర్తి :**

ఈ మూర్తికి జ్ఞాన, యోగ, వీణాధర అనే రూపాలు కలవు. జ్ఞానదక్షిణా మూర్తి రూపంలో శివుడు వీరాసనంలో ఉండి, ఎడమ కాలిని అపస్మార పురుషునిపై ఉంచి, మూడు కన్నులు, నాలుగు చేతులు కలిగి ఉండాలి. వెనక కుడి చేత అక్షమాల, వెనక ఎడమ చేతిలో ఉత్పలం, ముందు కుడిచేయి జ్ఞానముద్రలో, ముందుగల ఎడమచేయి అభయ ముద్రలో లేక దండ హస్తంగా ఉంటాయి. యోగ దక్షిణామూర్తి రూపంలో శివుడు యోగ ముద్రలో ఉంటాడు. వీణాధర దక్షిణామూర్తి రూపంలో శివుడు రెండు చేతులలో వీణను ధరించి ఉండాలి. ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న దక్షిణా మూర్తి రూపాన్ని వ్యాఖ్యాన దక్షిణామూర్తి అంటారు. దేవఘడ్, తిరువొర్తియూర్, కాంచీపురం, శుచీంద్ర మొదలగు చోట్ల దక్షిణామూర్తి ప్రతిమలు కలవు.

**19.1.4.5.3 కంకాళ మూర్తి :**

బ్రహ్మ శిరస్సును ఖండించిన తర్వాత శివుడు దేశద్రిమ్మరిగా మారిన రూపం ఇది. ఈ రూపంలో శివుడు. నాలుగు చేతులు, జటామకుటం, సర్పాభరణం, కంకాళదండ కలిగి ఉంటాడు. ఈ రూపం శిల్పాలు దారాసురం, టెంకాశి, శుచీంద్రం, కుంభకోణం మొదలగు చోట్ల గలవు.

**19.1.4.5.4 బిక్షాటన మూర్తి :**

తారకారణ్యంలో శివుడు నగ్నంగా, ద్రిమ్మరిగా సంచరించిన రూపం ఇది. ఈ మూర్తి ఇంచుమించు కంకాళ మూర్తివలె ఉంటుంది. కాని ముందుగల చేయి కపాలాన్ని, వెనుకగల కుడి చేయి ఢమరుకాన్ని కలిగి ఉంటాయి. పాదాలకు పాదరక్షలు ఉంటాయి. ఈ రూపాన్ని కంచి, కుంభకోణం, తిరువెంకాడు మొదలగు చోట్ల చూడవచ్చు.

**19.1.4.5.5 అర్ధనారీశ్వర మూర్తి :**

ఈ రూపంలో కుడిభాగం శివునిగా, ఎడమభాగం పార్వతిగా చూపడం జరుగుతుంది. ఈ మూర్తికి అర్ధ చంద్రుడు, జటామకుటం, నక్రకుండలం, కరండమకుటం, కుండలం ఉండాలి. ఈ మూర్తికి రెండు లేదా మూడు లేదా నాలుగు చేతులుండాలి. నాలుగు చేతులుంటే కుడి చేతిలో ఒకటి అభయ ముద్రలో, ఇంకొకటి పరశువు, ఒకటి అభయ ముద్రలో ఇంకొకటి నంది వాహనం మీద ఉండాలి. బాదామి, మహాబలిపురం, కుంభకోణం, మధుర, శ్రీశైలం మొదలగు చోట్ల ఈ రూపం చూడవచ్చు.

**19.1.4.5.6 హరిహర మూర్తి :**

ఈ రూపంలో కుడివైపు శివుని ఎడమవైపు విష్ణువును చూపడం జరుగుతుంది. శైవ, వైష్ణవ వైషమ్యాలు పెరిగినపుడు హరిహర ఆరాధన వ్యాప్తిలోకి వచ్చింది. తిక్కన తన ఆంధ్ర మహాభారతాన్ని ఈ మూర్తిని అంకితం చేశాడు. బాదామి, మహాబలిపురం, పూనా మొదలగు చోట్ల ఈ మూర్తికి గల ఉదాహరణలు చూడగలం.

**19.1.4.5.7 విషాపరణ మూర్తి :**

శివుడు దేవగణాలపట్ల అనుగ్రహంతో క్షీరసాగర మధనం సందర్భంగా వెలువడిన హాలాహలాన్ని మింగి విషాపహరణ మూర్తి అవుతాడు. ఈ రూపంలో శివుడు నాలుగు చేతులు, జటామకుటం, మూడుకన్నులు, నాలుగు చేతులు కలిగి ఉంటాడు. రెండు చేతులలో పరశువు, మృంగం ఉండగా, ఒక చేత విషపాత్రను ధరించి ఇంకొక చేత వరదుడౌతాడు. ఎడమవైపు పార్వతి త్రిభంగిమలో నిలబడి శివుని కౌగిలించుకొన్నట్లు ఉంటుంది.

ఈ రకంగా హైందవ దేవతలలో అతి ప్రసిద్ధులలో ఒకడైన శివుడు వివిధ అకృతులను కలిగి ఉన్నాడు.

## 19.2. గణపతి :

**19.2.1 పరిచయము :**

హిందువులలో గాణపత్యులు ఒక ప్రత్యేక మతశాఖ. గాణపత్యులకు ప్రధాన దైవము గణపతి. ఒక్క గాణపత్యులకే కాక గణపతి హిందువులందరికి సమానంగా పూజనీయుడే. బుద్ధి, సిద్ధి, ఇంకా ఇతర ప్రయోజనాలు ఆశించి గణపతిని పూజిస్తారు. హిందువులకేగాక గణపతి జైనులకు, బౌద్ధులకు కూడా పూజనీయుడే. గణపతికి వినాయక, విఘ్ననాయక, ఏకదంతుడు మొదలైన ప్రతినామాలెన్నో ఉన్నాయి.

ఒకనాడు పార్వతీదేవి అభ్యంజన స్నానం చేస్తూ నలుగు పిండితో ఒక బాలుని చేసి స్నానమందిర ముందుంచి ఎవరినీ రానివ్వద్దని ఆదేశిస్తుంది. యుద్ధం నుండి వచ్చిన శివుడిని ఆబాలుడు అడ్డగించడంతోనే ఆ బాలుని తలను శివుడు ఖండిస్తాడు. స్నాన మందిరం నుండి వెలికి వచ్చిన పార్వతి ఆబాలుని మృతికి విలపించగా శివుడు ఆ బాలుని శరీరానికి తాను చంపిన గజాసురుని తలనతికించి మరల జీవింప చేస్తాడు. అందువల్లనే అతడు గజముఖుడయ్యాడు.

గణపతి పూజలు ఎప్పుడారంభమయినాయో, కాలక్రమేణ గణపతి స్థితిగతులలో వచ్చిన మార్పులేవో స్పష్టంగా తెలియడంలేదు. ఇతడు మొదట యక్షనాగ సంబంధి అయి ఉంటాడని కొందరి భావన. దీనితో బాటు ఇతడు శైవదేవత. బృహస్పతికి కూడా గణపతి అనే నామాంతర ముండడం వల్ల ఇతనిని బుద్ధికి సంబంధించిన దేవతగా ఎంచి ఉండవచ్చు. ఇతడు కృష్ణుని ప్రతిరూపమని బ్రహ్మవైవర్త పురాణము చెబుతున్నది. క్రీ.శ. 6వ శతాబ్దికి పూర్వం గణపతి పూజలు అంత విరివిగా జరిగి ఉండలేదని భావిస్తున్నారు. వివిధ గణపతి మూర్తులు దేవాలయాలలో శిల్పాలుగాను, మూల మూర్తులుగాను నేడు మనకు కన్పిస్తున్నాయి. బాదామి, ఎల్లోరా, ఎలిఫెంటా గుహాలయాలలో అతిపురాతనమైన గణపతి ప్రతిమలు గలవు. భారతదేశంలోనేగాక విదేశాలలో కూడా గణపతి పూజలందుకుంటున్నాడు. అమెరికా, రష్యాలలో జరిగిన ఉత్ఖాతనాలలో గణపతి ప్రతిమలు లభించాయి.

### 19.2.2. గణపతి ప్రతిమా లక్షణాలు :

గణపతి సామాన్య లక్షణాలు ఏవనగా మరగుజ్జు స్వరూపము, తుందిలము, గజముఖము, ఏకదంతము. విష్ణు ధర్మోత్తరం ప్రకారం గణపతికి నాలుగు హస్తాలనీ, వాటిలో స్వదంతము, కపిత్థము, మోదకము, అంకుశము, పాశము, పాము, పద్మము లాంటి వస్తువులు నాలుగుంటాయనీ, వాహనము మూషికమనీ తెలుస్తున్నది. శ్రీ, భారతి, బుద్ధి, విఘ్నేశ్వరి ఇతని శక్తుల పేర్లు.

### 19.2.3. గణపతి రూపాలు :

గణపతి ప్రతిమలలో ఎన్నో రకాలున్నాయి. ముద్గల పురాణంలో 32 పేర్లు సూచితమై ఉన్నాయి. ఆగమ శాస్త్రాలలో 32 రకాలు సూచించడం జరిగింది. శారదా తిలక తంత్రంలో 50 గణపతి విభేదాలున్నాయి.

#### 19.2.3.1. బాల గణపతి :

ఈ మూర్తి పార్వతి తొడపై కూర్చున్నట్లుంటాడు. గజముఖము, నాలుగు చేతులు కలిగి వాటిలో మామిడి పండు, అరటిపండు, పనసపండు, చెరకుగడ ఉంటాయి. తొండంలో వెలగపండు ఉంటుంది.

#### 19.2.3.2. బీజ గణపతి :

పద్మాసీనంలో కూర్చున్న ఈ మూర్తికి పదిచేతులు, వీటిలో చక్రం, త్రిశూలం, ఇక్షుచాపం, గద, బీజపూర ఫలాలు, శంఖ, పాశ, ఉత్పల, కంకి, దంతం ఉంటాయి.

#### 19.2.3.3. హేరంబ గణపతి :

ఈమూర్తికి ఐదు తలలు, పది చేతులు, మూడు కన్నులు, సింహవాహనం ఉంటాయి. కుడివైపు చేతులలో పరశు, దండ, అంకుశం, అభయముద్ర, వరదముద్ర, ఎడమచేతుల్లో పద్మం, బాణం, అక్షమాల, పాశం, గద ఉంటాయి.

#### 19.2.3.4. వక్రతుండ గణపతి :

ఈ మూర్తికి నాలుగు చేతులు, పై వాటిలో అంకుశం, పాశం, క్రింది చేతులు అభయ, వరదముద్రలలో ఉంటాయి. పద్మాసీనుడై ఉంటాడు.

#### 19.2.3.5. తరుణ గణపతి :

ఈ మూర్తికి ఆరు చేతులు, ఎడమ వైపు అంకుశం, జామపండు, చెరుకుగడ, కుడివైపు పాశం, అంకుశం, మోదకం ఉంటాయి.

#### 19.2.3.6. భక్తి గణపతి :

ఈ రూపంలో నాలుగు చేతులు వాటిలో మామిడిపండు, కొబ్బరికాయ, అరటిపండు, పాయసపాత్ర ఉంటాయి.

#### 19.2.3.7 వీర గణపతి :

ఈ రూపంలో మూడురకాల గలవు. తొండంలో బంగారు పాత్ర, తొడపై శక్తి, మూడుచేతులలో అంకుశం, పాశం, అభయ హస్తాలు కలవాడు వీరవిఘ్నేశ్వరుడు. దశభుజ వీరగణపతికి కుడివైపున ఐదుచేతులలో టంకం, పాశం, బాణం, దంతం, రత్నం ఉంటాయి. ద్వాదశ భుజవీరగణపతికి కుడివైపు ఆరుచేతులలో ఖడ్గం, చక్రం, చాపం, బాణం, శక్తి, భేతాళము, ఎడమవైపు చేతులలో ఖట్వంగం,ముద్గలం, నాగపాశం, త్రిశూలం, కూట, పరశు ఉంటాయి.

**19.2.3.8. శక్తి గణపతి :**

శక్తిగణపతికి అనేక రూపాలున్నాయి. అవి - లక్ష్మీగణపతి, మహాగణపతి, ఉచ్ఛిష్ట గణపతి, ఊర్ధ్వ గణపతి మొదలైనవి. గణపతి నాలుగు చేతులలో పాశం, అంకుశం, దంతం, బీజపురాలు ఉంటాయి. పదిచేతుల శక్తి గణపతి సింహావాహనుడు.

**19.2.3.9. ధ్వజ గణపతి :**

ఈ మూర్తికి నాలుగు చేతులుంటాయి. కుడివైపు పుస్తకము, అక్షమాల, ఎడమవైపు దండం, కమండలం ఉంటాయి.

**19.2.3.10. పింగళ గణపతి :**

ఈ రూపంలో గణపతికి ఆరు చేతులుంటాయి. కుడిచేతులలో చెరుకుగడ, పుష్పమంజరి, పద్మం, ఎడమచేతులలో దండం, కుడుము, పరశు ఉంటాయి.

**19.2.3.11. విఘ్నరాజ గణపతి :**

ఈ రూపంలో గణపతికి నాలుగు చేతులుంటాయి. వాటిలో పాశం, అంకుశం, మామిడి పండు ఉండి ఒకచేయి అభయ హస్తం కలిగి ఉంటాడు.

**19.2.3.12. లక్ష్మీ గణపతి :**

ఈ మూర్తికి కుడిచేతులలో శంఖం, చక్రం, ఎడమచేతులలో గద, అభయహస్తంలో అష్ట సిద్ధులు కలిగి ఉంటాడు, లేదా కుడిచేతులలో శంఖం, చక్రం, ఉండి, ఒక ఎడమచేతితో దేవిని కౌగలించుకొని ఉంటాడు. మరొక చేతిలో దంతం ఉంటుంది.

**19.2.3.13. మహా గణపతి :**

ఈ రూపంలో గణపతి ఆసీనుడై ఉంటాడు. పదిచేతులు కలిగి, మూడు కన్నులతో ఉంటాడు. కుడిచేతులలో చక్రం, త్రిశూలం, ఇక్షు ధనుస్సు, గద, బీదపురాలు, ఎడమచేతులలో శంఖం, అంకుశం, అరుణ కమలం, కంకి, దంతం ఉంటాయి.

**19.2.3.14. భువనేశ గణపతి :**

ఈ మూర్తికి ఎనిమిది చేతులుంటాయి. కుడిచేతులలో పుష్పబాణం, చాప, దండ, శంఖం, ఎడమవైపు చేతులలో దంతం, పాశం, అంకుశం, కంకులు ఉంటాయి.

**19.2.3.15. ప్రసన్న గణపతి :**

ఈ మూర్తికి నాలుగు చేతులుంటాయి. పై రెండిటిలో పాశం, అంకుశం ఉంటాయి. క్రింది చేతులు అభయ, వరద ముద్రల్లో ఉంటాయి. అన్ని అలంకారాలలో ఉంటాడు.

**19.2.3.16. ఊర్ధ్వ గణపతి :**

శక్తిని ఆలింగనం చేసుకొన్న ఈ మూర్తికి ఎనిమిది చేతులుంటాయి. వీటిలో దండం, పద్మం, కంకి, ఉత్పలం, చాపం, బాణం, దంతాలుంటాయి.

**19.2.3.17. హరిద్రా గణపతి :**

ఈ మూర్తికి నాలుగుచేతులు, వాటిలో అంకుశం, పాశం, పరశు వుండి కుడివైపు కిందిచేయి తర్జన్యముద్రలో ఉంటుంది.

**19.2.3.18. ఉన్మత్త గణపతి :**

కమలంపై ఆసీనుడైన ఈ మూర్తికి నాలుగు చేతులు, వాటిలో పాశం, అంకుశం, మోదకం, దంతం ఉంటాయి.

**19.2.3.19. ఉచ్ఛిష్ఠ గణపతి :**

కోరిన కోర్కెలు తీర్చేవాడయిన ఈ మూర్తి రత్నమకుటాన్ని ధరించి, మూడుకళ్ళు, నాలుగుచేతులు కలిగి ఆసీనుడై ఉంటాడు. మూడుచేతులలో పాశం, అంకుశం, చెరకుగడ ఉండగా ఇంకొకచేయి తనతొడమీద గల నగ్న దేవీమూర్తి మర్మస్థానాన్ని చేరి ఉంటుంది. శ్రీశైలంలో పది చేతులుగల ఈ మూర్తి శిల్పం ఉంది.

**19.2.3.20. నృత్య గణపతి :**

అత్యంత ఆకర్షణీయమైన ఈ మూర్తికి ఆరు లేదా ఎనిమిది చేతులుంటాయి. కుడిచేతులలో దంతం, అభయహస్తం, పరశు, అక్షమాల, ఎడమచేతులలో దండహస్తం, పద్మం, మోదకం, సర్పం, ఉంటాయి. ఎడమకాలు మోకాలు వద్ద కొద్దిగా వొంగి నాట్యభంగిమలో ఉంటుంది. పెద్ద ఏనుగు తల, పైకెత్తిన తొండం, పెద్దబొజ్జ, చిన్నకళ్ళు, నాగబంధం, పాదాలకు గజ్జెలు, ఆభరణాలు, కిరీటం ఉంటాయి.

**19.2.3.21. వినాయకుడు :**

శివుని సంపర్కం లేక పార్వతికి గణపతి కుమారునిగా జన్మించినందున, వినాయకుడనే పేరు వచ్చింది. ఈ మూర్తికి నాలుగు చేతులు, వాటిలో అంకుశం, స్వదంతం, కపిత్థం లేదా పాశం ఉంటాయి.

## 19.3. కుమార(కార్తికేయ) :

కార్తికేయుని గురించి బాలకాడ, వనపర్వం, కుమారతంత్రం, కుమార సంభవంలో వివరము గలదు. కుమార ప్రతిమలు స్థావర, ఆసీన, యానక రూపాలలో గలవు. రెండు, నాలుగు,ఆరు, ఎనిమిది లేదా పన్నెండు చేతులుంటాయి. ఆరుచేతులున్నపుడు అభయ, ఖడ్గ, శక్తి, భేతక, అక్షమాల, కుక్కటం ఉంటాయి. ఎనిమిది చేతులున్నపుడు వజ్ర, శక్తి, అభయ, వరద, ఖడ్గ, భేతక, బాణ, ధనుస్సు ఉంటాయి. కుమార, సుబ్రహ్మణ్య, కార్తికేయ, షణ్ముఖ, శరవణ భవ, స్కంధ మొదలగు పేర్లతో పిలవడం జరుగుతుంది. అలంపురం మ్యూజియంలో ఆరుముఖాలు, 12 చేతులు కలిగి మాయూరమునెక్కి ఉన్నయానక మూర్తి శిల్పం ఉంది. కుమార ఆలయ ద్వారపాలకులకు సుదేహ, సుముఖ అని పేర్లు. సాధారణంగా కుమారస్వామి రెండు వైపులా దేవేరులతో, నెమలివాహనం దగ్గర ఉంటాడు.

## 19.4. సారాంశము :

హిందూ మత సాంప్రదాయాలలో త్రిమూర్తులలో ఒకరుయైన శివుని ప్రతిమా లక్షణాలు, గణాపాద్యులకు ప్రధాన దైవము అయిన గణపతి యొక్క ప్రతిమాలక్షణము మరియు కార్తికేయ ప్రతిమా లక్షణాలు విశదీకరించబడినాయి.

## 19.5. నమూనా ప్రశ్నలు :

1. శివుని రూపాలు, వాటి ప్రతిమా లక్షణాలను గూర్చి వ్రాయుము.
2. గణపతి ప్రతిమా లక్షణాలను వివరింపుము.
3. కుమార

**డా॥ కె. అజయకుమార్.**

పాఠం-20.1

# భారతీయ చిత్రలేఖనము

## 20.1.0 లక్ష్యం :

భారతీయ చిత్రలేఖనము గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


20.1.1. పరిచయము

20.1.2. చరిత్ర పూర్వయుగం

20.1.3. సింధూ నాగరికతాకాలం

20.1.4. వైదిక యుగం

20.1.5. శాతవాహనుల కాలం

20.1.6. కుషాణుల కాలం

20.1.7. గుప్త యుగం

20.1.8. వాకాటకులు

20.1.9. బాదామి చాళుక్యుల కాలం

20.1.10. పల్లవుల కాలం

20.1.11. చోళ యుగం

20.1.12. రాష్ట్రకూటుల కాలం

20.1.13. పాండ్యుల కాలం

20.1.14. హొయసాలుల కాలం

20.1.15. కాకతీయుల కాలం

20.1.16. విజయనగర యుగం

20.1.17. నాయక రాజులు

20.1.18. సారాంశము

20.1.19. నమూనా ప్రశ్నలు


## 20.1.1 పరిచయము :

ప్రాచీన హిందూ సాహిత్యంలో వర్ణచిత్రాలను గురించిన ప్రసక్తులనేకమున్నాయి. రామాయణ, మహాభారతాలలో చిత్రలేఖనా మందిరాలు చిత్రశాలలుగా సూచితాలైనాయి. జాతక కథలలో, రఘువంశము మొదలైన కావ్యాలలో వర్ణచిత్రాలు ప్రసక్తులు ఉన్నాయి.

కోసల ప్రభువు ప్రసేనజిత్తు ప్రాసాదంలో ఒక చిత్రాగారముండేది. భవభూతి ఈ చిత్రశాలలను విధి అని పేర్కొన్నాడు. వరుసలో ఉన్న చిత్రాలను విమాన పంక్తి అని బాణుడు పేర్కొన్నాడు. నారద శిల్పంలో చిత్రశాలల నిర్మాణ వివరాలున్నాయి. శృంగారానికి చెందిన చిత్రాల ప్రసక్తి నిషాద చరితంలో ఉంది. నాగ, దేవ, అసుర, యక్ష, కిన్నెర, గరుడ బొమ్మలు చిత్రలేఖనశాలలో ఉండాలని బాణుడి తెలియజేసాడు. నవసాహసాంక చరితం అనే గ్రంథంలో వేట దృశ్యాలు, బాలక్రీడ, గోష్ఠి, రాసలీల దృశ్యాల ప్రసక్తి ఉంది. మగధ పాలకుడైన బింబిసారుని ఆస్థాన చిత్రకారుడు తొలిసారిగా బుద్ధుని చిత్రాన్ని గీసినట్లు తొలిబౌద్ధగ్రంథమైన దివ్యవదానంలో ప్రస్తావించబడింది. సాహిత్యంలో ఉన్న ప్రస్తావనలను బట్టి ప్రాచీన కాలంలో భారతీయులు రాజప్రాసాదాలను, దేవాలయాలను, గృహాలను వర్ణచిత్రాలతో అలంకరించేవారని తెలుస్తున్నది.

కేవలం ప్రస్తకులే గాక చిత్రలేఖన విద్యను గూర్చి వివరించే గ్రంధాలు కూడా ఉన్నాయి. విష్ణు ధర్మోత్తరమనే గ్రంథంలో చిత్రలేఖనంలో గల షడంగాలైన నమూనా, రూపభేదము, ప్రమాణము, భావయోజనము, లావణ్యయోజనము, సదృశ్యము, వర్ణికాభంగ పద్ధతుల వివరణ ఉంది. విష్ణుధర్మోత్తర గ్రంథంలోని చిత్రసూత్రమనే అధ్యాయంలో చతుష్షష్టి కళలలో చిత్రలేఖనానికున్న ప్రాధాన్యతను గుర్తించడం జరిగింది. పరమార రాజైన భోజుడు రచించిన 'సమరాంగణ సూత్రధారము' అనే గ్రంథంలో చిత్రలేఖనా పద్ధతుల ప్రసక్తి ఉంది. పశ్చిమ చాళుక్యరాజైన సోమేశ్వరుడు రచించిన 'అభిలాషితార్థ చింతామణి' అను గ్రంథంలో నాట్యమండపాన్ని చిత్రలేఖనంలో అలంకరించే పద్ధతి వర్ణితమైంది. 'శిల్ప తత్వరత్నాకరము' అను గ్రంథములో కూడా చిత్రలేఖన ప్రసక్తి గలదు. 'శిల్పరత్న'లో చిత్రలేఖనానికి సంబంధించి చిత్రలక్షణమనే అధ్యాయం ఉంది. ఈ అద్యాయంలో చిత్ర, అర్ధచిత్ర, చిత్తభాస అనే భాగాలున్నాయి. ఈ గ్రంథంలో తెలుపు, పసుపు, ఎరుపు, నలుపు, నీలపు రంగులు సూచించడం జరిగింది. ఇందులో రసచిత్ర, ధూళిచిత్రాల ప్రసక్తి ఉంది. 'నారద శిల్పం' లో చిత్రలేఖనానికి సంబంధించి రెండు అధ్యాయాలున్నాయి. ఈ గ్రంథం చిత్రాలను భౌమిక, కుడ్యక, ఊర్ధ్వక అనే రకాలుగా విభజించింది. ఈ విభాగాలనే 'సరస్వతీ శిల్పం' అనే గ్రంథం సూచిస్తుంది.

ప్రాచీన హిందూ సాహిత్యంలోను, పురావస్తు ఆధారాలలో చిత్రలేఖకుల ప్రసక్తి, రంగుల వివరాలు గలవు. రాయఘర్ గుహాశాసనంలో రూపతక అనే చిత్రలేఖకుని ప్రసక్తి ఉంది. వాత్సాయనుని 'కామసూత్రం'లో కళలపట్ల ఆసక్తిగల నాగరకుడు చిత్రలేఖనాన్ని ఆదరించవలెనని పేర్కొనబడింది. అర్జునుడు అనే చిత్రకారుడు శ్రీరాముని జీవిత విశేషాలను చిత్రించినాడని 'ఉత్తర రామచరితం' లో గలదు. చిత్రలేఖకులకు 10 గ్రామాలను దానంగా ఇచ్చేవారని ' కథాసరిత్సాగరం' లో ప్రస్తావించబడింది. సంస్కృత గ్రంధాలలో చిత్రలేఖకుల ప్రసక్తి ఉంది. 'కామసూత్రం' లో సముద్గక అనే వస్తువుల పెట్టె ప్రసక్తి ఉంది. రంగులు పూసే సాధనాన్ని 'లేఖని' అని, పేద్దబ్రస్‌ను 'కుర్చక' అని అంటారు. ఎరుపును 'గైరిక' అని, నీలాన్ని నీలి అని, తెలుపును శుద్ధ అని, నలుపును కజ్జల అని, పసుపును హరితలం అని పిలిచేవారు. రంగులను భద్రపరచడానికి వజ్రలేపనం ఉపయోగించేవారు.

## 20.1.2. చరిత్ర పూర్వయుగం :

భారతదేశంలోని తొలిచిత్రలేఖనాలు శిలాయుగ మానవుడు నివసించిన గుహలలో లభించాయి. కర్నూలు జిల్లాలో గల బిల్లసర్గం గుహలు, మధ్యప్రదేశ్‌లోని బింభేట్కాగుహల్లో జంతువుల వర్ణచిత్రాలు ఉన్నాయి. క్రూరజంతువులను మానవులు వేటాడే చిత్రాలు ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్, బాండా ప్రాంతాలలో, బుందేల్‌ఖండ్‌లో మహదేవ, కైమాల్ కొండల్లో గలవు. మీర్జాపూర్ జిల్లాలోని బలదూరియా గుహల్లో జింకను వేటాడే దృశ్యం చిత్రించబడింది. గోర్‌మాంగల్ గుహలో ఖడ్గమృగవేటి దృశ్యముంది. వింధ్య ప్రాంతంలోని గుహలలో ఎరుపురంగు వాడబడింది. మలబార్ ప్రాంతంలో ఎడకత గుహలో మానవుల, జంతువుల బొమ్మలున్నాయి. బళ్ళారిజిల్లా కాపగళ్ళులో ఎనుబోతువేట దృశ్యంతో బాటు, ఏనుగులను, పక్షులను చిత్రీకరించారు.

## 20.1.3. సింధునాగరికతా కాలం :

మొహంజొదారో, హరప్పా, చన్హుదారో, నల్ మొదలగు సింధు నాగరికతా స్థావరాల్లో ఉత్ఖాతనాలలో బయల్పడ్డ మృణ్మయ పాత్రలపై కళాత్మకమైన రేఖాచిత్రాలు, చిత్రలేఖనాలున్నాయి. కుమ్మరి చక్రంపై తిప్పి తయారు చేసిన ఈ పాత్రలు ఎరుపు రంగులో ఉన్నాయి. ఈ ఎరుపుపై నలుపు రంగు ఉన్నది. పాత్రలపై లింకు వృత్తాలు, సూర్యబింబాలు, నక్షత్రాలు, బాతుతలలు, వృక్షాలు, నాలుగు పత్రాలుగల పుష్పాలు, ఆకాలు, జంతువులు, పక్షులు, వేట దృశ్యాలు చిత్రించబడి ఉన్నాయి.

## 20.1.4. వైదిక యుగం :

వైదికయుగానికి సంబంధించి సాహిత్య ఆధారాలే గాక ఇటీవల బయల్పడిన జపాన్ పురాతన వ్రాతప్రతులలో చిత్రలేఖన సాక్ష్యాలు లభ్యమయ్యాయి. భారతదేశ సాంప్రదాయంలో రూపొందిన వీటిలో వైదిక రుషులు, వారిపేర్లు గలవు. వశిష్టముని, తన భార్యతో అంగీరశ, తనభార్యతో కూర్చొని ఉన్న ఆత్రేయ ముని, చిత్రాలు గలవు. రెండు వశిష్టముని చిత్రాలలో ఒకటి ఆసీనరీతిలో, మరొకటి నడుస్తున్నట్లు గలవు. వైదికయుగంలో చిత్రలేఖకులు రుషులను భిన్నరీతులలో చిత్రించేవారని దీనిని బట్టి గ్రహించవచ్చు. వైదిక సాంప్రదాయంలో చిత్రించే వారనడానికి సాక్ష్యంగా జైన కల్ప సూత్రాలలోని రెండు చిత్రాలను పేర్కొనవచ్చు. అందులో ఒకటి శ్రీసూర్యోదయం కాగా మరొకటి అగ్నిపై పర్వతం. ఈ రెండు వైదిక రీతిలో రూపొందించినవేనని కుమారస్వామి అంటాడు.

## 20.1.5. శాతవాహనుల కాలం :

దక్కన్‌లో రాజ్యమేలిన శాతవాహనుల చిత్ర లేఖనాలే అజంతా గుహల్లోని తొలిచిత్రాలు. అజంతాలో 9వ సంఖ్య గల గుహలో రెండు వరుసల చిత్రలేఖనాలున్నాయి. అజంతాలో 10 వ సంఖ్యగుహలో బోధివృక్షపూజ, సామ, చార్ధంత జాతక కథలు అద్భుతంగా చిత్రించబడినాయి. బేడ్సాగుహల్లో గల చిత్రాలు మలి శాతవాహన కాలానికి చెందినవి.

## 20.1.6. కుషాణుల కాలం :

మౌర్యుల తరువాత పశ్చిమోత్తర భారతంలో రాజ్యమేలిన కుషాలనాటి చిత్రాలు మధ్య ఆసియాలో లభించినాయి. ఇవి వీరి చిత్రకళా నైపుణ్యానికి నిదర్శనాలు. పద్మాల కొలనులో స్నానం చేసే ఒక స్త్రీ చిత్రం దండక్ ఆయ్‌లిక్‌లో లభించింది. త్రిముఖాలు గల శివుని చిత్రంలో ఒకటి రౌద్రంగాను, మరొకటి ప్రసన్నంగాను, ఇంకొకటి స్త్రీ శిరస్సులే చిత్రించబడ్డాయి. న్యూఢిల్లీలోని జాతీయ వస్తుప్రదర్శన శాలలో ఒక అద్భుత బుద్ధుని చిత్రం ఉంది. బుద్ధుని హృదయం మీద శ్రీవత్స చిహ్నముంది. భుజాల మీద మండుతున్న స్తంభాల ముద్రికలున్నాయి.

## 20.1.7. గుప్త యుగం :

గుప్తుల కాలంలో లలిత కళలన్నీ సమాదరణ పొందినాయి. గుప్తులు నాణేల తయారీలోనే గాక చిత్రలేఖనంలో కూడా గొప్ప ప్రగతిని సాధించారు. గుప్తులనాటి చిత్రలేఖనాలు బాగ్, అజంతా గుహల్లో గలవు. అజంతా చిత్రాలలో కంటే బాగ్ చిత్రాలలో బౌద్ధమత ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. అందచందాలలో ఇక్కడ చిత్రీకరించబడ్డ స్త్రీలు అజంతా స్త్రీలను మించి ఉన్నారు. కల్నల్ లూవార్డ్ బాగ్ చిత్రాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాడు. వీటి ప్రతికృతులను నందలాల్ బోస్ వంటి చిత్రకారులు తయారు చేసినారు. గుప్తుల నాటి చిత్రలేఖనాలు బాగ్‌లోని 4,5 సంఖ్య గల గుహలలో ఉన్నాయి. ఈ చిత్ర లేఖనాలకు మూలం జాతక కథలు. మొదటి చిత్రంలో దుఃఖితురాలైన స్త్రీ, ఆమెను ఓదారుస్తున్న పరిచారిక, రెండో దానిలో ఇద్దరు దేవతలు, ఇద్దరు రాజులు చర్చ చేస్తున్నట్లు ఉంది. మూడవ చిత్రంలో కొంతమంది భిక్షువులు ఆకాశయానం చేస్తుండగా, మరికొందరు వీణ,వేణువులను వాయిస్తున్నట్లుంది. నాల్గవ చిత్రంలో కోలాట దృశ్యం ఉంది. ఈ చిత్రానికి దగ్గరలో గుర్రాల మీద, ఏనుగుల మీద ఊరేగింపు దృశ్యముంది. పక్షుల, లతల అలంకారాలున్నాయి.

అజంతాలో 16,17,19 సంఖ్యగల గుహలలో ఉన్న వర్ణ చిత్రాలు గుప్తయుగానికి చెందినవి. 16వ సంఖ్య గల గుహలోని మరణ శయ్యపై రాకుమార్తె చిత్రం విమర్శకుల ప్రశంసలనందుకొన్నది. 17వ సంఖ్య గల గుహలోని ఆకాశంలో విహరించే గంధర్వులు, వెస్సంతర జాతకం, బుద్ధుని ముందు తల్లి, బిడ్డ చిత్రాలు అద్భుతమైనవి. 19 వ సంఖ్య గల గుహలో కల్పలతలు, చిత్ర పుష్పాలు అందంగా చిత్రించబడ్డాయి.

## 20.1.8. వాకాటకులు :

శాతవాహనుల తరువాత దక్కన్ ప్రాంతంలో పాలించిన వాకాట కుల వర్ణ చిత్రాలు అజంతా గుహల గోడల మీద, వితానంలో గలవు. బుద్ధుని జీవిత విశేశాలు, జాతక కథలు ఈ చిత్రలేఖనాల ప్రధాన కథా వస్తువు. సమకాలీన జీవిత దృశ్యాలు, పశు పక్ష్యాదులు, చెట్లు చేమలు కూడా వీరి చిత్రాలలో చోటు చేసుకొన్నాయి. రాజప్రాసాద జీవితం, గ్రామీణ జీవితం రెండూ అద్భుతంగా చిత్రీకరించినారు. వాకాటక చిత్రలేఖకులు కొంతవరకు తొలి శాతవాహన సాంప్రదాయాలను అనుసరించినారు.

## 20.1.9 బాదామి చాళుక్యుల కాలం :

బాదామి చాళుక్యరాజైన మంగళేశుడు కళలపట్ల అభిమానం గలవాడు. ఇతడు అనేక గుహాలయాలు, దేవాలయాలు నిర్మించారు. బాదామి 4వ సంఖ్య గుహలో గల మంగళేశుని శాసన ఆధారంగా చిత్రలేఖకులు ఆలయాలను అలంకరించారని చెప్పవచ్చు. చిత్ర లేఖనంలో వీరు వాకాటకుల సాంప్రదాయాలను అనుసరించారని చెప్పవచ్చు. బాదామి చిత్రలేఖనాలు కనుగొన్న ఘనత స్టెల్లా క్రామరిష్‌కు దక్కుతుంది. బాదామి చిత్రాలలో ఒకటి రాజప్రాసాద దృశ్యము. ఈ చిత్రంలో రాజు మధ్యలో కూర్చొని సంగీత, నాట్యాలను తిలకిస్తున్నాడు. పై అంతస్తు నుండి పరివారం ఈ దృశ్యాన్ని చూస్తున్నారు. రాజు పాదాల వద్ద యువతులు గలరు. ఎడమవైపు వాయిద్యకారుల గుంపు ఉంది. ఒక స్త్రీ, పురుషుడు నాట్య భంగిమలో ఉన్నారు. పురుషుని ఎడమచేయి దండ హస్తంలోను, కుడిచేయి చతుర పద్ధతిలో ఉన్నాయి. మరొక చిత్రంలో రాజు మహారాజలీల పద్ధతిలో కూర్చొని ఉన్నాడు. ఇతనికి కుడివైపున నేలమీద కొందరు యువరాజులు కూర్చొని ఉన్నారు. ఎడమవైపు చివర స్త్రీ ఉంది. ఈ చిత్రానికి ప్రక్కన ఆసనంపై కూర్చొని ఉన్న రాణి బొమ్మ ఉంది. బాదామి గుహలోని వరాహ దృశ్యం కూడా రమణీయంగా ఉంది. ఈ గుహలో విద్యాధరుల చిత్రాలు రెండు గలవు.

## 20.1.10. పల్లవుల కాలం :

ద్రావిడ దేశంలో కంచి రాజధానిగా పల్లవులు పాలించారు. పల్లవ రాజులలో మొదటి మహేంద్రవర్మ తమిళకంలో కొండలను తొలచి గుహాలయాలను నిర్మించే పద్ధతికి శ్రీకారం చుట్టాడు. ఇతనికి విచిత్ర చిత్త, చిత్రకారపులి అనే బిరుదులున్నాయి. పల్లవుల వర్ణచిత్రాలు మహాబలిపురం, కంచి, పానమలై, సిత్తన్నవాసల్‌లలో గలవు. పానమలైలో ఛత్రం క్రింది కిరీటధారియైన దేవత చిత్రం గలదు. కంచిలోని కైలాసనాథాలయంలో సోమస్కంధ దృశ్యం గలదు. సోమస్కంధుడు పల్లవుల అభిమాన దైవం. ఈ చిత్రంలో శివుడు అసీనుడై ఉన్నాడు. జటామకుటం, యజ్ఞోపవీతం, కేయూరాలు, ఉదరబంధం ధరించి వున్నాడు. స్కందుడు తల్లిఒడిలో కూర్చొని తండ్రివైపు అమాయకంగా చూస్తున్నాడు. పాదాల దగ్గర పరిచారికలున్నారు. రంగుల మిశ్రమం అద్భుతంగా ఉంది. మహాబలిపురంలోని ఆదివరాహగుహలో, మామండూర్‌లోని గుహలలో కూడా పల్లవుల చిత్రలేఖనాలున్నాయి. పుదుక్కోట సమీపంలోని సిత్తన్న వాసల్ గుహలలో హంసలు, చేపలు, ఏనుగులు, అప్సరసలు మనోహరంగా చిత్రించబడింది.

## 20.1.11 చోళ యుగం :

పల్లవుల తరువాత తమిళికంలో అధికారానికి వచ్చిన చోళుల తొలి చిత్ర లేఖనాలు నర్తమలై, మలయాదిపట్టై ప్రాంతాలలో లభించాయి. కాని చోళుల అద్భుత వర్ణచిత్రాలు తంజాపూరు బృహదీశ్వరాలయంలో గలవు. ఈ ఆలయ గర్భగృహ ప్రదక్షిణా పథంలోని చిత్రలేఖనాలను గోవిందస్వామి కనుగొన్నాడు. ఈ చిత్ర లేఖనాలలో పైపొరకు సంబంధించినవి నాయకయుగానివి కాగా క్రింది పొరలో

ఉన్నవి చోళుల కాలం నాటివి. పశ్చిమదిశ గోడపై యోగ దక్షిణామూర్తి చిత్తరువు గలదు. పులిచర్మంపై ఆసీనుడైన ఈ మూర్తి యోగ ముద్రలో ఉన్నాడు. ముందు భాగంలో ఇద్దరు అప్సరల నృత్యం చిత్రించబడింది. మరుగుజ్జు గణదేవత, విష్ణువు మద్దెలను మ్రోగిస్తున్నట్లు,ఆకాశం నుండి గంధర్వులు ఈ గానాన్ని వింటున్నట్లు, గుర్రంమీద సుందర ప్రవక్త, ఏనుగుమీద చేరమానుడు వస్తున్నట్లు చిత్రించబడింది. దీనికి కొంత దూరంలో ఆలయ నమూనా, నజరాజమూర్తి, భక్తులు చిత్రించబడింది. ఈ చిత్రం కింద సుందరుని కథాదృశ్యం ఉంది. శివుడు ముదుసలి వేషంలో రావడం, అందమైన భార్యను సుందరుడు తన నివాసానికి పంపే ఏర్పాటు ఈ కథా వస్తువు. ఈ చిత్రం కింద వివాహ దృశ్యముంది. ఇంకొక వైపు గోడమీద నాట్యభంగిమలోగల నటరాజ మూర్తి చిత్రం ఉంది. శివునికి ఒకవైపు భక్తులు, అర్చకులు మరోవైపు రాజు, ముగ్గురు రాణులు నిలబడి ఉన్నారు. ఈ గోడకు ఎదురుగావున్న గోడపై సుందరీ మణుల చిత్రాలున్నాయి. ఉత్తరం వైపుగల గోడ నిండా త్రిపురాంతకుని యుద్ధ దృశ్యం ఉంది. బ్రహ్మనడుపుతున్న రథంమీద శివుడున్నాడు. ఎనిమిది చేతులలో వివిధ ఆయుధాలు కలిగిన శివుడు ఎదురుగా ఉన్న రాక్షసుల గుంపును సంహరిస్తున్నట్లు చిత్రంచబడినాడు. కార్తి కేయుడు నెమలి వాహనంపై, గణపతి మూషిక వాహనంపై, దుర్గ సింహవాహనం పై నిలబడి ఉన్నారు. నాయనార్లలో ముఖ్యుడైన సుందర మూర్తి జీవిత సంఘటనలు కూడా చిత్రించబడ్డాయి. ఈ చిత్రాల ద్వారా చోళుల కాలం నాటి వైభవం, రాజదర్బారు, మతపరిస్థితులు గ్రహించవచ్చు. నటరాజ, త్రిపురాంతక చిత్రాలు చోళుల శైవభక్తికి తార్కాణాలు.

## 20.1.12. రాష్ట్రకూటుల కాలం :

బాదామి చాళుక్యుల తరువాత దక్కన్‌లో అధికారంలోకి వచ్చిన రాష్ట్రకూటుల చిత్రలేఖనాలు ఎల్లోరాలోని గుహల వితానంపై, గోడల మీద కన్పిస్తాయి. నటరాజమూర్తి, గరుడ వాహనుడైన లక్ష్మీనారాయణ చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ఆకాశంలో విహరిస్తున్న విద్యాధరులు, కదులుతున్నట్లు గల మేఘాలు బాదామి గుహల చిత్రాలను పోలి ఉన్నాయి. పశుపక్ష్యాదులు కూడా ఇచట చిత్రించబడింది. జైనగుహలో కూడా జైన మతానికి సంబంధించిన చిత్రాలు, తీగలు, పశువులు, పక్షులు చిత్రించబడివుంది.

## 20.1.13. పాండ్యుల కాలం :

పాండ్యుల తొలిచిత్ర లేఖనాలు అరుమలైపురం గుహలలో గలవు. ఇక్కడ గల చిత్ర లేఖనాలు పాండ్యుల ప్రతిభకు గీటు రాళ్ళుగా ఉన్నాయి. వేటదృశ్యాలు ఇచట ప్రధానంగా కన్పిస్తాయి. రోమ్‌తో వ్యాపారం సంబంధాలున్నందువల్ల ఈ చిత్రలేఖనాలలో ఆ ప్రభావం వుంది. సిత్తన్న వాసల్ గుహలలో పై పొరలోని చిత్రాలు పాండ్యులవి. అందమైన కిరీటాన్ని ధరించిన యువరాజు, ప్రక్కన నిలబడి వున్నరాణి, పై భాగంలో ఛత్రం, దిగువ భాగంలో ఇద్దరు నర్తకీమణులు అద్భుతంగా చిత్రంచబడింది. కమాలాలు, చేపలు, బాతులు, యువతులలో కూడిన సరస్సు దృశ్యం కూడిన సరస్సు దృశ్యం కూడా ఇచట చిత్రించబడింది.

## 20.1.14 హొయసాలుల కాలం :

ద్వార సముద్రం రాజధానిగా మైసూర్ ప్రాంతాన్ని పాలించిన హొయసాలులు వాస్తు, శిల్పాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినారు. వీరి చిత్రలేఖనాలు మూడు బిద్రిలో లభించాయి. ఈ చిత్రాలు తాళపత్రాల మీద గలవు. ఇవి హొయసాల రాజు విష్ణువర్ధనుని కాలానికి చెందినవి. ఒక పత్రం మీద మధ్య భాగంలో స్థానక, అసీన పద్ధతులలో మహవీరుని చిత్రాలున్నాయి. రెండు వైపులా యక్ష, కాళి, దీనులు, నంది, దుర్గ రాజభక్తులు, రాజు, రాణి, యువరాజు, చిత్తరవులున్నాయి. మరాపత్రంలో సింహాసనం మీద కూర్చున్న పార్వనాధుని తలవెనుక భాగంలో సర్పం ఉంది. ఇరువైపులా చౌరీబేరులున్నారు. ధరవేంద్ర యక్షుడు ఒకవైపు, పద్మావతి, యక్షిణి మరోవైపు ఉన్నారు. మూడో పత్రంలో సూత్రాదేవి చిత్రీకరించబడింది. మామిడిచెట్టుక్రింద సింహంలోను, ఇద్దరు బాలురులోను యక్షి, అంబిక చిత్రాలు గలవు.

## 20.1.15. కాకతీయ యుగం :

ఓరుగల్లు రాజధానిగా ఆంధ్రదేశాన్ని ఏకంచేసి పాలించిన కాకతీయులు చిత్రలేఖనాలు త్రిపురాంతకం,పిల్లలమర్రి, మాచెర్ల

మొదలగు చోట్ల గలవు. పిల్లల మర్రి ఆలయంలో అమృతమథన దృశ్యం అందంగా చిత్రించబడింది. ఒకవైపు దేవతలు మరోవైపు రాక్షసులు, వాసుకి సర్పాధారంలో, మంధర పర్వతాన్ని చిలికే దృశ్యమిది. ఇదే దృశ్యం శిల్పం రూపంలో మాచెర్ల చెన్నకేశవాలయంలో మలచబడింది.

## 20.1.16. విజయనగర యుగం :

విజయనగర యుగం నాటి చిత్రలేఖనాలు హంపి, తాడిపత్రి, కంచి, కాళహస్తి, తిరుపతి, తిరువణ్ణామలై, చిదంబరం, తిరువాలూర్, శ్రీరంగం, కుంభకోణం, సోమపాళెంలలో గల దేవాలయాలలో చూడవచ్చు. హంపి విరూపాక్షాలయ మండపంలోని వితానంలో విద్యారణ్య స్వామిని పల్లకిలో ఊరేగించే దృశ్యం అందంగా చిత్రీకరించారు. విజయనగర చిత్రలేఖకుల పనితనానికి లేపాక్షి వీరభద్రాలయంలో గల చిత్రాలు తార్కాణాలు. ఈ చిత్రాలలో రామాయణ, భారత, పురాణగాధలు చోటు చేసుకొన్నాయి. వీరభద్రాలయ నిర్మాతలైన విరూపణ్ణ, వీరన్న చిత్రాలు గలవు. శివలీల దృశ్యాలు, శ్రీరామపట్టాభిషేకం, కిరాతార్జునీయం, వటపత్రసాయి, భిక్షాటనమూర్తి, కాలారిమూర్తి, గంగాధరమూర్తి, త్రిపురాంతకమూర్తి మొదలైన చిత్రాలు ఇచట గలవు. ఇచటి చిత్రాలను బట్టి నాటి స్త్రీ, పురుషుల వస్త్రధారణ, ఆభరణాల తీరుతెన్నులు గ్రహించవచ్చు. కంచిలోని వరదరాజస్వామి ఆలయంలో మన్మధ కధా దృశ్యం గలదు. చిత్తూరు జిల్లా సోమపాలెంలో గల చెన్నకేశవాలయ కళ్యాణమండపంలో రామాయణ దృశ్యాలు లేపాక్షిలో వలె చిత్రీకరించబడింది.

## 20.1.17. నాయక రాజులు :

తంజావూరు, మదురై మొదలగు ప్రాంతాలలో పాలించిన నాయక రాజులు కూడా చిత్రలేఖనాలను పోషించారు. తంజావూరు బృహదీశ్వరాలయ గర్భగుడి ప్రదక్షిణాపథంలోని పైపొరలో నాయక రాజుల చిత్రలేఖనాలు గలవు. తిరుపతిలోని కున్రంలోని జైనతీర్థంకరుల చిత్రాలు నాయకరాజులకు చెందినవే. తిరువాలూర్‌లో సోమస్కంధ, వానర మూతిరాజు, మంచుకొండ చిత్రం ఉన్నాయి. తిరువణ్ణామలైలో రామాయణ, మహభారత గాధల చిత్రాలు గలవు. చిదంబరంలో భిక్షాటన, మోహినిరూపాలు చిత్రించబడింది.

## 20.1.18. సారాంశము :

రాజపుత్ర స్థానము, కాంగ్రా ప్రాంతాలలో క్రీ.శ. 16 -19 శతాబ్దాల మధ్యకాలంనాటి వర్ణచిత్రాలు గలవు. ఈ వర్ణచిత్రాలలో అజంతారీతులు కొన్ని కనిపిస్తాయని నిపుణులు చెబుతారు. అయినా ఈ రెండింటిలోనూ చిత్రరచన కోసం ఎన్నుకొన్న విషయాలలో భేదాలున్నాయి. అప్పటి చిత్రాలు రెండురకాల విషయాలకు సంబంధించి ఉంటాయి. ఒక రకము గ్రామీణ జీవనానికి సంబంధించి ఉంటుంది. ఇంకొకరకము పౌరాణిక ఐతిహాసిక విషయాలకు సంబంధించింది. ఉదాహరణకు వీరు ఎన్నుకొన్న విషయాలు పార్వతీపరమేశ్వరులు, రాధామాధవులు, క్షీరసాగర మధనము మొదలైనవి. ఇవిగాక రాగరాగిణీ విన్యాసాలు కూడా వీరికి ప్రీతిపాత్రమైన విషయాలు. ఇదే కాలంలో మొగలులు కూడా ఇంకొక రకపు చిత్రకళను పోషించారు. మొఘలాయిలు వర్ణచిత్రాల కోసం ఎన్నుకొన్న విషయాలు సాధారణంగా దర్బారు, వేట, యుద్ధము, రాజులూ, రాణుల చిత్తరువులు మొగలాయి చిత్రకళలో కొన్ని పర్షియన్ రీతులు కనిపిస్తాయి.

## 20.1.19. నమూనా ప్రశ్నలు :

1. భారతీయ చిత్రలేఖనం గురించి క్లుప్తంగా వివరింపుము.
2. చిత్తన్న వాసల్ చిత్రలేఖనాలు.
3. లేపాక్షి వర్ణచిత్రాలు.

**డా॥ కె. అజయకుమార్.**

పాఠం - 20.2

# బౌద్ధచిత్రలేఖనాలు - అజంతా

## 20.2.0 లక్ష్యం :

అజంతా చిత్రలేఖనాల గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


**20.2.1.** **పరిచయము**

**20.2.2.** **కథావస్తువు**

**20.2.3.** **చిత్రలేఖనా పద్ధతి**

**20.2.4.** **రంగుల మిశ్రమము**

**20.2.5.** **కాలము**

**20.2.6.** **ఒకటి సంఖ్య గల గుహ**

**20.2.7.** **రెండో సంఖ్య గల గుహ**

**20.2.8.** **తొమ్మిదో సంఖ్య గల గుహ**

**20.2.9.** **పదో సంఖ్య గల గుహ**

**20.2.10.** **పదహారవ సంఖ్య గల గుహ**

**20.2.11.** **పదిహేడో సంఖ్య గల గుహ**

**20.2.12.** **పందొమ్మిదవ సంఖ్య గల గుహ**

**20.2.13.** **అజంతా చిత్రలేఖనాల ప్రభావం**

**20.2.14.** **సారాంశము**

**20.2.15.** **నమూనా ప్రశ్నలు**

**20.2.16.** **చదువదగిన గ్రంథాలు**


## 20.2.1. పరిచయము :

ప్రాచీన భారతీయ చిత్రకళను అవగతం చేసుకోవడానికి అజంతాకు సాటి వేరొకటి లేదు. అజంతాలో వర్ణ చిత్రాలు జగత్ప్రసిద్ధమైనవి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు 104 కి.మీ. దూరంలో అజంతా ఉంది. ఇచట మొత్తం 30 గుహలున్నాయి. వాటిలో 25 విహారాలు కాగా మిగిలినవి చైత్యాలయాలు. ఇవన్నీ ఒక వరుసలో తూర్పుపడమరలుగా విస్తరించి వున్నాయి. ఇవన్నీ ఒక్క కాలానికి చెందినవి కావు. ఇవి క్రీ.పూ. 2వ శతాబ్దం క్రీ.శ. 7వ శతాబ్దం మధ్యకాలము నాటివి. క్రీ.శ. 4వశతాబ్దం తరువాత బౌద్ధము ఇండియాలో శీఘ్రగతిని పతనం కావడం ప్రారంభమైంది. సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటల్లో హిందూ మతం సోదరభావంతో బౌద్ధాన్ని తనలో ఇముడ్చుకొంది. ఈ కారణం

వల్లనే అజంతాలోని గుహలు కాలక్రమంలో మరుగున పడిపోయి ఉండవచ్చు. ఆ తరువాత అనేక శతాబ్దాలకు అనుకోకుండా 1819లో బ్రిటిష్ సైనికులు ఈ గుహాలయాలను కనుగొన్నారు. ఈ గుహాలయాల వర్ణన తొలిసారిగా 1829లో 'రాయల్ ఏషియాటిక్ సొసైటీ' కార్యక్రమాలలో చోటుచేసుకొన్నది. ఆ తరువాత అనేకమంది యూరప్ పండితులను ఈ గుహలు ఆకర్షించాయి. వారిలో జేమ్స్ ఫెర్గూసన్, మేజర్‌గిల్, జార్జ్‌గ్రిఫిత్స్, లేడీహెరింగ్‌హోమ్ ప్రముఖులు. ప్రసిద్ధబౌద్ధ చైనాయాత్రికులైన పాహియాన్, హుయాన్‌సాంగ్ రచనల్లో కూడా ఈ గుహల ప్రస్తావన కలదు.

## 20.2.2. కథా వస్తువు :

అజంతా గుహలలో కుడ్యాలమీద, స్తంభాలమీద, వితానంలో సంపూర్ణంగా చిత్రలేఖన దృశ్యాలు లభించాయి. ఈ దృశ్యాలలో ప్రధాన కథావస్తువు బౌద్ధమతానికి చెందినవి. బుద్ధుని జీవిత విశేషాలు, జాతక కథలు ( బుద్ధుని పూర్వజన్మలను తెలిపే వృత్తాంతాలు ) ఈ చిత్రలేఖనాలలో చోటుచేసుకొన్నాయి. ఈ చిత్రకళను ఆనాటి రాజులు, మంత్రులు, సామంతులు, వర్తకులు పోషించారు. శాతవాహనుల కాలంలో అజంతాలో ప్రారంభమైన చిత్రకళ వకాటకుల కాలంలో పరాకాష్ఠనందుకొన్నది. బౌద్ధమతానికి సంబంధించిన సంఘటనలనే గాక అజంతా చిత్రలేఖకులు సమకాలిన జీవితాన్ని , ఆహ్లాదకరమైన ప్రకృతిని అందంగా చిత్రించారు. వీరి చిత్ర లేఖనాలలో పశు పక్ష్యాదులు, చెట్లు చేమలు చోటు చేసుకొన్నాయి. అజంతాలో 10వ సంఖ్య గల గుహలలోని ఏనుగులు, 17వ సంఖ్యగల గుహలోని హంస జాతక, మృగజాతకలోని జింకలు, సహజంగా చిత్రీకరించబడినాయి. రాజు ప్రాసాద జీవితాన్ని, గ్రామీణ జీవితాన్ని అజంతా చిత్రలేఖకులు అద్భుతంగా చిత్రించారు. వెస్సంతర జాతక కథలోని యువరాజు భోగజీవితం, సాధువు సామాన్య జీవితం ఒకే రీతిలో చిత్రించబడింది. 27వ సంఖ్యగల గుహలో వెస్సంతర రాజు రాణితో సహా పురవీధుల్లో ప్రయాణం చేస్తూ వ్యాపారస్తులలో సంభాషించే దృశ్యం ఆర్థిక విధానాన్ని తెలియజేస్తుంది. 17వ సంఖ్యగల గుహలో శ్రీలంకలో విడిది అనే దృశ్యం ఆద్భుతంగా చిత్రించబడింది. రాజప్రాసాదం, ఉద్యానవనం మొదలగు దృశ్యాలు చిత్రలేఖకుని పరిశీలనా దృష్టికి తార్కాణాలు. ఇదే గుహలో సంగీత విద్వాంసులు, దంపతి చిత్రాలు రమ్యంగా ఉన్నాయి. 1వ సంఖ్యగుహలో మార్గదర్శనం, 17వ సంఖ్యగుహలో గౌతముని రాక, సిద్ధార్థుడు అతని రాణి యశోధర మొదలైన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి.

అజంతా చిత్రలేఖకులు బుద్ధుని జీవిత విశేషాలను అతిరమణీయంగా చిత్రీకరించినారు. నలగిరి కథ, రాహులుని బుద్ధుడు స్వీకరించడం అనే దృశ్యాలు చిత్రణలో అమరావతి శిల్పాలను మించినాయి. అజంతా గుహలలో ఉన్న బుద్ధుని జీవిత విశేష దృశ్యాలలో దివినుండి బుద్ధుని రాక, మార్గదర్శనము పేర్కొనదగినవి. సిద్ధార్థుడు, యశోధర, బోధిసత్వ వజ్రపాణి, మారదర్శనం, శ్రావస్తిసంఘటన, నందకథ 1వ సంఖ్య గుహలో గలవు. బోధి వృక్షం కింద కూర్చున గౌతముని ధ్యానాన్ని భంగపరచడానికి మార అతని కుమార్తెలు ప్రయత్నించే దృశ్యం, ప్రసేనజిత్తు రాజు దగ్గర బుద్ధుడు అనేక అవతారాలను చూపించిన దృశ్యం, శిబి జాతకం, మహాజనక జాతకం, మనోహరంగా చిత్రీకరించబడింది. రెండో సంఖ్యగల గుహలో బోధిసత్త్వుని నిలువెత్తు చిత్రం ఉంది. మాయాదేవి స్వప్నం, బుద్ధుని జననం, అష్టాంగ మార్గము ఈ చిత్రంలో చూపారు. వాకాటకరాజు హరిసేనుని మంత్రి వరాహదేవునిచే నిర్మితమైన విహారంలో చిత్రమందిరం ఉన్నట్లు 16వ సంఖ్య గుహలోని శాసనం ద్వారా తెలుస్తుంది. 19వ సంఖ్య గల గుహలో రాహులుడు, యశోధర వద్ద భిక్షపాత్రలో నిలబడి వున్న బుద్ధుని చిత్రం ఉంది. అజంతాగుహల్లో అన్ని తరగతులు ప్రజాజీవిత దృశ్యాలు చోటు చేసుకొన్నాయి. ఇచటి చిత్రలేఖనాలలో కనిపించే దుస్తులు, ఆభరణాలు, జీవన విధానం ఆనాటి బౌద్ధసంస్కృతికి చక్కని నిదర్శనాలు.

## 20.2.3 చిత్రలేఖనా పద్ధతి :

అజంతాలో చిత్రరచన కోసం భూమీ బంధనము ఒక ప్రత్యేక పద్ధతిలో తయారు చేయడం జరిగింది. దీనినే ' ఫ్రెస్కో సెక్కో' పద్ధతి అని అంటారు. వర్ణ చిత్ర రచన కోసం ప్రత్యేకించిన స్థలం మీద మొదట రాతిపోడి లేదా ఇసుక, ఎర్రని బంకమట్టి, ఆవుపేడ, గడ్డి ఊక కలపగా వచ్చిన ముద్దతో చదునుగా లేపనం చేసేవారు. దాని మీద పలుచని ధవళలేపన మొదటి పూసి చిత్రరచన కోసం తయారు

చేసుకొనేవారు. దాని పైన సున్నపు పూతపూసి అది ఆరకముందే చిత్ర రచన ప్రారంభించేవారు. రచింపదలచిన చిత్రాల యొక్క రూపాన్ని మొదట రేఖా మాత్రంగా నల్లరంగు లేదా నశ్యపు రంగుతో గీసి తర్వాత బిందువులతో, గీతలతో క్రమక్రమంగా చిత్రాన్ని రంగులలో ఒకే సారి పూర్తి చేస్తారు. రేఖలలో సంపూర్ణ విన్యాసంతో బాటు అఖండత చక్కగా జత కుదిరింది. పెట్టిన కుంచెను ఎత్తకుండా ఒకేసారి గీచినట్లున్న ఈ రేఖలు పరిశీలకులను ఆశ్చర్యపరుస్తుంది. వీటిలో అతుకులు, ఆపుదల నిశితంగా పరిశీలించినా కనిపించదు. ఉద్దేశింపబడిన దృశ్యం ఈ రేఖలలో స్పష్టంగా కనిపిస్తుంది.

## 20.2.4 రంగుల మిశ్రమము :

అజంతా చిత్రలేఖన పద్దతిలో రంగుల మిశ్రమం సాధారణంగా ఉన్నప్పటికీ, నైపుణ్యం దర్శనమిస్తుంది. శిల్పశాస్త్ర గ్రంథాలలో సూచించబడిన ఎరుపు, పసుపు, తెలుపు, నలుపు, లజోలి అనే ఐదురంగులు, ఈ చిత్రాలలో వాడబడినాయి. చిత్రరచన కోసం భూమి బంధనము రూపొందించిన తరువాత నలుపురంగులో గాని, నశ్యపు రంగులో గాని రేఖాచిత్రాలు గీసినారు. సత్యవర్తన పద్దతిలో నీడలు చిత్రీకరించడం జరిగింది. విష్ణు ధర్మోత్తర గ్రంథంలో వివరించబడినరీతిలో అజంతా చిత్రలేఖకులు పరిపూర్ణతను సాధించారు. ఈ చిత్రాలలో కనిపించే వర్ణరచన రమ్యత ఏఇతర ప్రాచీన చిత్రాలలో అనగా ఈజిప్టులోగాని, పాంపేలో గాని, ఇటలీలోని చర్చీలలో గాని కానరాదని ఆక్సెల్ పండితుడు అంటాడు. వాకాటక చిత్రలేఖకులు కొంతవరకు తొలి శాతవాహన సాంప్రదాయాలను అనుసరించారు. అమరావతి శిల్పాలలో, అజంతా చిత్రాలలో సాదృశ్యం చూడవచ్చు. షడంగమనే ఆరు చిత్రలేఖన అంగాలు ఆజంతాలో ప్రస్ఫుటమైనవి. రూపభేద, ప్రమాణభవ, లావణ్యయోజన, సదృశ్య, వర్ణికా భంగాలు నిర్దుష్టంగా పాటించారు. అజంతా చిత్రకారులు మానవ, జంతు, పక్షి సంబంధమైనవే గాక అనేక అలంకారాలను తీర్చిదిద్దినారు. లావణ్య యోజనాపద్దతిలో ఈ చిత్రాలలో ఉద్వేగం, ఆవేశం సాధించబడింది. సదృశ్య పద్దతిలో వెస్సంతర జాతక కథలు చిత్రంచబడింది. రంగుల మిశ్రమం వర్ణికా భంగాన్ని సూచిస్తుంది. ఇది విదురపండిత జాతక కథలో కనబడుతుంది.

అజంతా చిత్రకారులు రేఖా, రూప, వర్ణ రచనలందేగాక సంవిధాన రచనలో కూడా నైపుణ్యం ప్రదర్శించారు. చిత్రంలోని ప్రతిరేఖ, రంగు, వెలుగునీడలు, రూపాలు, కూర్పు మొదలగునవన్నీ ఒక సువ్యవస్థితమైన రీతిలో రూపొందించ బడింది. ఈ లక్షణం చిత్రానికి ప్రాణం వంటిది. అంతేగాక చిత్రలేఖకులు చిత్రాలలో క్షయవృద్ధి న్యాయాన్ని కూడా చక్కగా పాటించారు. ఈ చిత్రాల ద్వారా ప్రాచీన భారతీయ చిత్రకళా నైపుణ్యం గ్రహించవచ్చు. భారత సాంప్రదాయ పరంపరలో పుష్పించి సువాసనల్ని గుప్పించే ఒక అందమైన పుష్పం అజంతా చిత్రలేఖనాలని ఆనంద కుమారస్వామి విమర్శించాడు.

## 20.2.5 కాలము :

అజంతాలోని గుహలు, అందలి చిత్రలేఖనాలు ఒక కాలానికి సంబంధించినవి కావు. ఈ గుహలను తొలపించడం, వాటిని వర్ణ చిత్రాలతో అలంకరించడం క్రీ. పూ. 2వ శతాబ్దంలో శాతవాహనుల కాలంలో ఆరంభమై క్రీ.శ. 7వ శతాబ్ధం చాళుక్యుల కాలం వరకు కొనసాగింది. గుప్తుల కాలంలో దక్కన్‌లో రాజ్యమేలిన వాకాటకుల కాలంలో ఈ చిత్ర కళ పరిపూర్ణతను సాధించింది. అజంతాలోని 30 గుహలలో నేడు తొమ్మిది గుహలలో మాత్రమే వర్ణచిత్రాల కనిపిస్తున్నాయి. వీటిలో 9,10 సంఖ్యగల గుహలలోని వర్ణ చిత్రాలు శాతవాహనుల కాలానికి చెందినవి. 16,17,19 సంఖ్యగల గుహలు గుప్త వాకాటక యుగానికి చెందినవి. 1,2 సంఖ్యగల గుహలు చాళుక్యుల కాలానికి చెందినవి. మిగిలిన రెండు గుహలలోని చిత్రాలు పూర్తిగా అదృశ్యమయ్యాయి.

## 20.2.6 ఒకటవ సంఖ్యగల గుహ :

మొదటి సంఖ్య గల గుహ గోడలనిండా, వితానంలో చిత్రలేఖనాలు గలవు. ఈ చిత్రలేఖనాలన్నీ నేడు చాలావరకు పాడైపోయినాయి. ఈ గుహగోడలపై శిబిజాతకం, శంఖపాల జాతకం, మహాజనక జాతకం మొదలగు జాతకా కథల దృశ్యాలు అద్భుతంగా చిత్రించబడ్డాయి. జాతక కథలేగాక బుద్ధుని చిత్రాలు, మార్గదర్శనం, ప్రణయ గాథలు ఈ గుహగోడలపై ఆద్భుతంగా చిత్రీకరించబడ్డాయి. ప్రసిద్ధి

గాంచిన బోధిసత్వపద్మపాణి, వజ్రపాణి చిత్రాలు కూడా ఈ గుహలోనే ఉన్నాయి. బోధిసత్వపద్మపాణి చిత్రంలో ఉపయుక్తమైన రజత, నీలి వర్ణాల మేళవింపు అత్యంత రమణీయము. ఈ గుహ వితానంలో పశు పక్ష్యాదులు, పుష్పాలతో కూడిన మొక్కలు అతిసహజంగా రూపొందించారు. ఈ గుహ వితానంలోనే పారశీక దౌత్య చిత్రాలున్నాయి. అందులో ఒకటి పారశీక చక్రవర్తి రెండో ఖుస్రూ, అతని పట్టపురాణి సిరిన్‌ల చిత్రంకాగా, మరొకటి బాదామి చాళుక్య చక్రవర్తి రెండో పులకేశిని పారశీకరాయబారి దర్శిస్తున్న దర్బారు దృశ్యమని పండితుల అభిప్రాయం.

## 20.2.7 రెండో సంఖ్యగల గుహ :

ఈ గుహలో హంస జాతకము, విధుర పండిత జాతకము మొదలగు జాతక కథలు చిత్రీకరించబడినాయి. బుద్ధుని జననాన్ని తెలిపే దృశ్యం ఈ గుహలోని ప్రత్యేక ఆకర్షణ. తల్లి ఒడిలోని ఒక పాపను కాలరుద్రుడు భయపెడుతుంటే బుద్ధుడు వచ్చి తల్లి బిడ్డను రక్షించే చిత్రం ఈ గుహలో గలదు.

## 20.2.8 తొమ్మిదో సంఖ్యగల గుహ :

ఈ గుహలో చిత్రరచన రెండుసార్లు జరిగినట్లు తెలుస్తుంది. ఈ గుహలో కుడ్యాలపై గల వర్ణ చిత్రాలలో బుద్ధుని చిత్రాలు ముఖ్యమైనవి. బుద్ధుని తలపై కనిపించే మూడు అంతస్థుల ఆతపత్రాలు జైన సాంప్రదాయము.

## 20.2.9 10వ సంఖ్యగల గుహ :

శాతవాహనుల కాలపు వర్ణ చిత్రాలకు ఈ గుహలోని సద్దంత జాతక చిత్రం ఒక చక్కని ఉదాహరణ. ఈ వర్ణ చిత్రం రూపకల్పనలో, విషయవివరణలో సాంచీస్తూప తోరణ ద్వారాల పైగల సద్దంత జాతకశిల్పాన్ని పోలి ఉంది. ఈ గుహలలోని ఒక చిత్రంలో ఆయుధాలు చేత పట్టుకొని అశ్వాలమీద, కాలినడక వెళ్తున్నవారు, స్త్రీలు, భోధివృక్షం ఉన్నాయి. ఒకచోట రెండు సౌధద్వార చిత్రాలున్నాయి. మరోచోట ఏనుగులతో నడిచివస్తున్న మానవ సమూహం చిత్రించబడింది.

## 20.2.10 పదహారవ సంఖ్యగల గుహ :

ఈ గుహలోగల వర్ణ చిత్రాలలో మరణ శయ్యపై రాకుమార్తె చిత్రం అద్భుతమైనది. నందుని భార్య సుందరి. జీవిత సుఖాలను విసర్జించి, సన్యాసం స్వీకరించి రాజమందిరం నుంచి నందుడు వెళ్ళిపోతున్నప్పుడు రాకుమార్తె సుందరి మనోవ్యధని చిత్రించిన వర్ణ చిత్రమిది. కరుణరస పూరితమైన ఈ చిత్రం యావత్ చిత్ర లేఖనా చరిత్రలో అద్వితీయమైందని, ఫ్లారెన్స్‌లోని కళాకారులు కూడా ఇంతకుమించి రూపురేఖలను సృష్టించలేరని, ఇందలి వర్ణ రచనను వెనిస్ చిత్రకారులు సైతం అధిగమించలేరని, వారందరి చిత్రాల కంటే ఈ చిత్రం రమణీయమైందని గ్రిఫిత్స్ అంటాడు.

## 20.2.11 పదిహేడో సంఖ్యగల గుహ :

ఈ గుహలో ఒక చోట ఒక విచిత్రమైన పద్మం చిత్రీకరించబడింది. పదహారు భాగాలు గల ఈ పద్మంలోని ఒక్కొక్క భాగం ఒక్కొక్క వర్ణంలో అలంకరించబడి ఉంది. ఇది జీవిత చక్రాన్ని సూచిస్తుందని కొందరి భావన. ఈ గుహలోగల అకాశంలో విహరించే గంధర్వులు అనే చిత్రం ప్రపంచ ప్రసిద్ధమైనది. ఈ గుహలోనే సింహళ విజయం, వెస్సంతర జాతకం చిత్రాలు గలవు. ఈ గుహలోగల బుద్ధుని ముందు తల్లి, బిడ్డ చిత్రం అద్భుతమైంది.

## 20.2.12 పందొమ్మిదవ సంఖ్యగల గుహ :

ఈ గుహ వితానంలో కల్పలతలు, చిత్రపుష్పాలు ఎంతో మనోహరంగా చిత్రించబడ్డాయి. అయితే ఇవి చాలావరకు మాసిపోయాయి.

## 20.2.13 అజంతా చిత్రలేఖనాల ప్రభావం :

మధ్యప్రదేశ్‌లో బాగ్ గుహల లోని చిత్రాలు, కర్ణాటకలో బాదామి గుహలలోని చిత్రాలు, తమిళనాడులో నిత్తన్నవాసల్ గుహలలోని చిత్రాలు, కంచి కైలాస నాథాలయంలోని చిత్రాలు అజంతా చిత్రాలకు అనుకరణగా తయారైనవే. రాజపుత్ర స్థానము, కాంగ్రా ప్రాంతం లోని వర్ణ చిత్రాలలో ఆజంతారీతులు కొన్ని కనిపిస్తాయని నిపుణుల అభిప్రాయం. సింహళంలోని శ్రీగిరియా చిత్రాలు, చైనా, జపాన్‌లలోని ప్రాచీన చిత్ర లేఖనాలు అజంతా చిత్రాలకు అనుకరణగా తయారైనవే.

## 20.2.14 సారాంశము :

అజంతా గుహల కుడ్యాల మీద, వితానంలో గల వర్ణ చిత్రాలు ప్రపంచ ప్రసిద్ధమైనవి. కొన్ని శతాబ్దాలు గడిచినప్పటికీ నేటికి చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నవి అజంతా చిత్తరువు లొక్కటే. శాతవాహన, గుప్త, వాకాటక కాలాలలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రాలలో ఆనాటి మెరుపుతనం నేటికి కన్పించడం ఆశ్చర్యం. బౌద్ధమతాన్ని గూర్చి సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యేరీతిలో బోధించడమే ఈ చిత్రకళ ప్రధాన లక్ష్యం. ఈ గుహలలోని వర్ణచిత్రాలలో కనిపించే దుస్తులు, ఆభరణాలు, జీవనవిధానం అనాటి సంస్కృతికి అద్దం పడుతుంది. ఇచటి అతిప్రాచీన వర్ణ చిత్రాలలో సద్దంత జాతకము ప్రధానంగా పేర్కొనవలసింది గుప్తయుగపు. గుప్తరాజ్యానంతర కాలపు వర్ణచిత్రాలలో నీలదేహ స్త్రీమూర్తి, బోధిసత్వ పద్మపాణి, పారశీతక దౌత్యము మొదలైనవి ప్రసిద్ధమైనవి. ఇవి గాక జాతక కథలు, ప్రాసాద దృశ్యాలు ఎంతో రమ్యంగా చిత్రించి, ఉన్నాయి. వీటిలో బోధిసత్వ పద్మపాణి చిత్రాన్ని గూర్చి లారోన్జో సిక్కోనీ అను విమర్శకుడు ఇలా అంటాడు. పెనుపర్వతము వలె నిలిచి ఉన్న ఈ మహాబుద్ధ చిత్రం సకల దివ్యలక్షణాలు కలిగి అద్భుతంగా ఉంది. అజంతా చిత్రాలలో ప్రపంచంలోని సమస్త జీవరాసుల జీవన సరళి చక్కగా ప్రదర్శితమైంది. ఈ గుహలలోని మానవాకారాలలో స్త్రీ రూపాలు అత్యంత ఆకర్షణీయంగా చిత్రీకరించబడ్డాయి. ఆనాడు స్త్రీలు కేశ సౌందర్యానికి, తలకట్టు పద్ధతులకు ఎంత ప్రాధాన్యతనిచ్చారో ఈ చిత్రాలను చూస్తే అర్థమవుతుంది. ఈ గుహలలో ఏనుగులు, తేళ్ళు, పక్షులు సుందరంగా తీర్చిదిద్దబడ్డాయి. ఆనాటి చిత్రలేఖకులు పర్వతాలకు, నదులను, ప్రాసాదాలను, ద్వారాలను ప్రత్యేకరీతిలో చిత్రించారు. ఇచటి చిత్రాలలోని రంగుల మిశ్రమం అద్భుతమని కూర్లే పండితుడంటాడు. ఈ చిత్రాలను గీసిన చిత్రలేఖకులు చిత్రాలను రూపొందించడంలో నిష్ణాతులని గ్రిఫిత్స్ పండితుడు అభిప్రాయపడినాడు.

## 20.2.15 నమూనా ప్రశ్నలు :

1) అజంతా చిత్ర లేఖనాన్ని గురించి వివరింపుము

2) అజంతా వర్ణ చిత్రాలలో కథా వస్తువు, చిత్రలేఖనా పద్ధతి, రంగుల మిశ్రమము గురించి ఒక వ్యాసము వ్రాయుము.

**డా॥ కె. అజయకుమార్.**

# పారిభాషిక పదకోశం - వాస్తు చిత్రకళలు

| పదం పేరు | - | వివరణ |
|---|---|---|
| అంతరాళము | - | గర్భగృహాన్ని చేరే మార్గం |
| అర్ధమండపము | - | మండపము వెలుపల గల వరండా |
| బలిపీఠం | - | నైవేద్యాన్ని సమర్పించే పీఠం |
| గర్భగృహము | - | మూల విరాట్టు నివాసం |
| గోపురము | - | ప్రాకార ప్రవేశ కట్టడము |
| కల్యాణమండపము | - | దైవ వివాహ మందిరము |
| మహామండపము | - | ముఖమండపానికి ఆనుకొని ఉన్న పెద్దమండపం |
| నంది మండపము | - | నంది గల మండపము |
| ప్రాకారము | - | ఆలయగోడ |
| విమానము | - | గర్భగృహం (లేక) గర్భగృహం పైగల కట్టడం |
| అధః పద్మము | - | అధిష్ఠానం క్రిందిగల పద్మ భాగం |
| అధిష్టానము | - | పునాది భాగం |
| దేవ కోష్ఠము | - | దైవప్రతిమను ఉంచు గూడు |
| ధృవబేర | - | స్థిర ప్రతిమ |
| ధ్వజస్తంభము | - | ధ్వజం కలిగిన స్తంభము |
| దీపస్తంభము | - | దీపాన్ని ఉంచే స్తంభము |
| ద్వారపాలకుడు | - | ద్వారం వద్ద గల కావలి దేవత |
| ఏకతల | - | ఒక అంతస్తు |
| ద్వితల | - | రెండంతస్తులు |
| గ్రీవము | - | విమానంలో తలశిఖరాల మధ్య భాగం |
| కపోతము | - | కుడ్య, శిఖరభాగాలను కలిపే భాగం |
| కోష్ఠము | - | గూడు |
| కుంభపంజర | - | పంజరం ఆకారంలో గల కుడ్య స్తంభం |
| మకరతోరణము | - | కోష్ఠం పై గల మొసలి ఆకారం |
| పాణవట్టం | - | అభిషేక జలం బయటకు వెళ్ళే మార్గం |
| సోమ సూత్రం | - | అంగాన్ని ప్రతిష్ఠించే వేదిక |
| శుకనాస | - | విమానం నుండి పొడుచుకొని వచ్చే కట్టడం |
| తల | - | అంతస్తు |

| | | |
|---|---|---|
| ఉపపీఠము | - | అధిష్ఠానపు క్రింది భాగం |
| యాలి | - | వింతజంతువు |
| యోని | - | సోమసూత్రం |
| సింహకర్ణముద్ర | - | చూపుడు వేలిని, చిటికెన వేలిన ఎత్తి మడిచి, మధ్య వేలిని ఉంగరపు వేలిని రెండువేపుల తాకుతూ ఉంచడం |
| మృణ్మయ మూర్తులు | - | మట్టితో చేయబడిన ప్రతిమలు |
| ఆభయ ముద్ర | - | చేతివేళ్ళు పైకుండునట్లుగా చూపి రక్షిస్తున్నట్లు చూపే ముద్ర |
| వరదముద్ర | - | చేతివేళ్ళు కింది వేపు ఉన్నట్లుగా చూసి ధారపోస్తున్నట్లుగా చూపే ముద్ర |
| కట్యవలంభిత ముద్ర | - | నడుముపై చేయి వేసుకొనినట్లుండడం |
| అక్షమాల | - | రుద్రాక్ష పూసలతో చేసిన మాల |
| కమండలువు | - | కొమ్ము కలిగిన చెంబు |
| కటకముద్ర | - | ఉంగరం పై వేలు కిందకు మడచి, మిగిలిన వేళ్ళను పైకి చూపడం |
| ఉత్కుతికాసనం | - | ఎడమకాలు కుడివైపుకు కుడికాలు ఎడమవైపుకి మడచి కూర్చున్నప్పుడు మోకాళ్ళవద్ద యోగపట్టము కలిగి ఉండడం |
| పద్మాసనం | - | కూర్చున్నపుడు కాళ్ళను కుడిఎడమలుగా మడచి, పాదాలను లోపలి వైపుకు ఉంచడం |
| యజ్ఞోపవీతం | - | జందెం |
| కుండలాలు | - | చెవికి ఆభరణాలు |
| కీయూరాలు | - | మోచేతికి పైన భుజానికి కిందగా ధరించే ఆభరణాలు |
| జటామకుటం | - | కిరీటం లాగ జడలను పైకి చుట్టినట్టుగా ఉండడం |
| వీరాసనం | - | కూర్చున్నప్పుడు కుడికాలిని ఎడమ కాలిమీదుగా ఎడమవైపుకు వేసి వేలాడు తున్నట్లుండడం |
| అంజలి ముద్ర | - | నమస్కరిస్తునట్లు చూపడం |
| సుఖాసనం | - | ఎడమకాలును పీఠం మీద ఉంచి కుడి కాలుని వేలాడదీయడం |
| భద్రాసనం | - | రెండుకాళ్ళు వేలాడవేసి కూర్చుండటం |
| అర్చామూర్తులు | - | పూజాయోగ్యమైన ప్రతిమలు |
| పార్శ్వమూర్తులు | - | మూలమూర్తుల పక్కన ఉండే ప్రతిమలు |
| పరివారమూర్తులు | - | ఆవరణ దేవతలు |
| ఆసీనమూర్తులు | - | కూర్చోన్నట్లు చూపబడిన ప్రతిమలు |
| శయనమూర్తులు | - | పడుకోన్నట్లు చూపబడిన ప్రతిమలు |
| ద్విభంగిమమూర్తి | - | మెడదగ్గర పాదం వద్ద వంపు చూసే స్థితి |
| త్రిభంగిమమూర్తి | - | మెడదగ్గర, కటివద్ద, పాదాల వద్ద వంపు చూపే స్థితి |

| | | |
|---|---|---|
| తాండవం | - | రౌద్రస్ఫూర్తితో ఉన్న నాట్యం |
| లాస్యం | - | శృంగార భరితమైన నాట్యం |
| ఆగమం | - | సాంప్రదాయిక శాస్త్ర జ్ఞానం |
| ప్రతికృతి | - | బదులుగా చేసిన రూపం |
| సంహారమూర్తులు | - | చంపుతున్న స్థితిలో గల రూపు |
| యోగమూర్తి | - | తపోదీక్షను వాంఛించిన మూర్తి |
| భోగమూర్తి | - | శారీరక సౌఖ్యాన్ని వాంఛించిన మూర్తి |
| వీరమూర్తి | - | తపోభావాన్ని సూచించిన మూర్తి |
| అభిచారిక మూర్తి | - | వినాశనాన్ని సూచించిన మూర్తి |

## 20.2.16 చదువదగిన గ్రంథాలు :


1. Percy Brown - Indian Architecture ( Buddhist and Hindu Periods )
2. Krishna Deva - Temples of North India
3. K.R. Srinivasan - Temples of South India
4. H. Zimmer - The Art of Indian Asia (2 Vols)
5. A.K. Coomaraswamy - The History of Indian and Indonesian Art
6. James Fergusson - The History of Indian and Eastern Architecture (2 vols )
7. K.V. Soundera Rajan - The Indian Temple Styles
8. S. Kramarisch - The Art of India
9. B. Rowland - The Art and Architecture of India - Buddhist, Hindu, Jain
10. Fergusson and Burgess - Cave Temples of India
11. E.B. Havell - Indian Architecture through the Ages
12. K.V. Soundara Rajan - The Art of South India, Tamilnadu, Kerala
13. Y. Gopala Reddy - The Kakatiya Temples
14. A. Rao - The Pallavas Architecture; The Chalukyan Architecture
15. T.A. Gopinatha Rao - Elements of Hindu Iconography
16. S.P. Tiwari - Hindu Iconography
17. D.C. Bhattacharya - Studies in Buddhist Iconography
18. M. Radha Krishna Sharma - Temples of Telangana
19. B. Rajendra Prasad - Temples of South India, Andhra Pradesh
20. V.K. Mohan - The Art and Architecture of Telugu Cola Temples
21. V.S. Agarwala - Indian Art

22. E.B. Havel - Indian Sculpture and Painting
23. C.J. Brown - Indian Paintings
24. S.K. Saraswati - A Survey of Indian Sculpture
25. B. Rowland - Religious Art, East and West
26. C. Sivaramamurti - Amaravati Sculpture
27. Sri John Marshall - The Buddhist Art of Gandhara
28. W. Michael Meister - Encyclopedia of Indian Temple Architecture
29. R. Champaka Lakshmi - Vaishnava Iconography in the Tamil country
30. K. Satya Murthy - Hand Book of Indian Architecture.

**డా ॥ వి.కె. మోహన్**